# SOCIAL AND ECONOMIC HISTORY OF MEDERN INDIA (1757 TO 1947)

## (DH22)

## (MA-HISTORY)


ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠం - 1.1

# 17వ శతాబ్దంలో భారతదేశంలో - అనిశ్చిత రాజకీయ పరిస్థితి - ప్రజల జీవితం, సంస్కృతిపై దాని ప్రభావాలు

### 1.1.0. లక్ష్యం :

17వ శతాబ్దంలో భారతదేశంలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి, ప్రజల జీవితం, సంస్కృతిపై దాని ప్రభావం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయసూచిక :


1.1.1. పరిచయం

1.1.2. మొగలులు

1.1.3. మరాఠులు

1.1.4. విజయనగర రాజులు

1.1.5. ఐరోపా వారు

1.1.6. ప్రభావం

1.1.7. సారాంశము

1.1.8. నమూనా ప్రశ్నలు

1.1.9. చదువదగిన గ్రంథాలు


## 1.1.1. పరిచయం

బ్రిటీష్ పాలనకు ముందు 17వ శతాబ్దంలో భారతదేశ రాజకీయ పరిస్థితి అనిశ్చితంగా ఉంది. 16వ శతాబ్దం మొదటి పాదంలో స్థాపితమైన మొగలు రాజ్యం దినదినాభివృద్ధి చెంది ఔరంగజేబు కాలం నాటికి దాదాపు భారతదేశం అంతటా విస్తరించింది. కాని ఇతడు అనుసరించిన మత విధానం వల్ల మొగలు సామ్రాజ్యం అతలాకుతలమై విపత్కర పరిస్థితులలో పడింది. సామ్రాజ్యంలో అనేక అలజడులు, ఆందోళనలు, తిరుగుబాట్లు జరిగాయి. రాజపుత్రులు, జాట్‌లు, బుందేలులు, సత్నామీలు, సిక్కులు తిరుగుబాట్లు లేవదీసారు. మరాఠులు శివాజీ నాయకత్వాన విజృంభించారు. ఔరంగజేబు తరువాత అధికారంలోకి వచ్చిన వారు అసమర్థులు. వారు కుట్రదారుల చేతులలో కీలుబొమ్మలు. ఈ కాలంలో మరాఠులు పీష్వాల నాయకత్వాన భారతదేశ ఆధిక్యతకు ప్రయత్నించారు. మొగలు రక్షకులుగా ఆఫ్ఘనులతో మరాఠులు పోరు సల్పారు. పానీపట్టు వద్ద జరిగిన ఈ పోరులో (1761) ఆఫ్ఘనులు తిరుగులేని విజయం సాధించారు. విజృంభిస్తున్న మహారాష్ట్ర సామ్రాజ్యం దీనితో అతలాకుతలమైపోయింది. మొగలు సామ్రాజ్యం ఇంకా నిర్వీర్యమైంది. అటు మహారాష్ట్రుల వైఫల్యం, ఇటు మొగలుల బలహీనత, ఇండియాలో తమ ఆధిక్యతను బ్రిటీష్ వారు స్థాపించుకోవడానికి వీలు కలిగించాయి. బ్రిటీష్ వారిని ఎదిరించి నిలువగలిగిన శక్తి ఇండియాలో ఎక్కడా లేకుండా పోయింది. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధ ఫలితంగా బెంగాల్ ఆంగ్లేయుల వశం కావడంతోబాటు క్రమంగా భారతదేశ ఆధిపత్యానికి దారి తీసింది. 1856 నాటికి ఇది పూర్తయింది.

ఆధునిక భారతదేశ చరిత్రలో సంభవించిన అత్యంత ప్రధాన పరిణామం దాదాపు 2 శతాబ్దాల పాటు బ్రిటిష్ పాలన కొనసాగటం. అయితే ఆర్యులు మొదలు మొగలాయిల వరకు భారతదేశానికి వచ్చి తమ పాలనను స్థాపించి, శతాబ్దాల తరబడి కొనసాగించిన ఇతర విదేశీ పాలకులు, బ్రిటీష్ వారి మధ్య కీలకమైన వ్యత్యాసాలు ఉన్నాయి. బ్రిటీష్ వారికి ముందు పాలించిన విదేశీ తెగలు, రాజ వంశాల వారు, భారతీయుల రాజ్యాధినేతల అధికారాలను తమ కైవసం చేసుకున్నారే కాని ప్రజల ఆర్థిక, సామాజిక జీవనం, వ్యవస్థలను మౌళికంగా మార్చడానికి ఎన్నడూ ప్రయత్నించలేదు. కర్షకులు, కళాకారులు, వర్తకులు తమ కార్యకలాపాలను యధాలాపంగా కొనసాగిస్తూ వచ్చారు. అనాటి ఆర్థిక జీవనానికి పట్టుకొమ్మ అయిన స్వయం సమృద్ధ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎటువంటి ఆటంకాలు లేకుండా నడిచింది. మరొక అంశం ఏమిటంటే ఈ ఆంగ్లేయేతర విదేశీ పాలకులు క్రమంగా భారతీయ ఆర్థిక, సామాజిక జీవన స్రవంతిలో భాగస్వాములయ్యారు. భారతదేశాన్ని తమ దేశంగా, ప్రజలను తమ ప్రజలుగా భావించారు. కాని బ్రిటీష్ పాలకులు వీరికి పూర్తిగా భిన్నమైన పంథాను అనుసరించారు. వీరు ఎన్నడూ ఇండియాను తమ దేశంగా భావించలేదు. భారతీయ ఆర్థిక, సామాజిక జీవన విధానం, వ్యవస్థలతో వీరు ఎన్నడూ ఏకం కాలేదు. ఫలితంగా సంభవించిన దురదృష్టకర, ప్రమాదకర పరిణామమేమంటే, తమ మాతృదేశ పరిశ్రమలు, వ్యాపారం ఆర్థికాభివృద్ధి కొరకు భారతదేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసేందుకై పూనుకున్నారు. అనాది నుండి నిరాటంకంగా సాగుతూ వచ్చిన స్వయం సమృద్ధ గ్రామీణార్థిక వ్యవస్థను కూకటి వేళ్ళతో పెకిలించి వేయడం జరిగింది. బ్రిటీష్ పాలకులు వలస ప్రజల సామాజిక, సంస్కృతిక వ్యవస్థల రూపకల్పనలో కూడా తమ స్వార్థ ప్రయోజనాలను మరువలేదు. ఆంగ్ల భాష, విద్యా విధానం, ఆచార వ్యవహారాలు పాలక సంస్కృతీ చిహ్నాలుగా ప్రచారం పొందాయి.

## 1.1.2. మొగలులు :

16వ శతాబ్ది తొలి దశ కాలంలో భారతదేశంలో నెలకొన్న రాజకీయ అస్తవ్యస్త పరిస్థితి కారణంగా 1526లో మొగల్ సామ్రాజ్యస్థాపన జరిగింది. ఈ సామ్రాజ్యం అక్బర్ పాలనా చివరి కాలం నాటికి (1605) ఉత్తర భారతదేశమంతా వ్యాపించింది. ఇంతటి విశాల సామ్రాజ్యం ఆనాటి ప్రపంచంలో మరెక్కడా నెలకొని ఉండలేదని పండితుల అభిప్రాయం. అక్బర్ తన సువిశాల సామ్రాజ్యంలో పటిష్టమైన పరిపాలనా విధానాన్ని కూడా ప్రవేశపెట్టాడు. అక్బర్ తరువాత అధికారంలోకి వచ్చిన జహంగీర్ కాలంలో బ్రిటీష్ వారు ఇండియాలో ప్రవేశించి సూరత్‌లో ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతి సంపాదించారు. ఈ విధంగా తరువాత కాలంలో చరిత్ర గతినే మార్చి వేసిన ఆంగ్లేయుల ప్రవేశానికి జహంగీర్ కాలంలో మార్గం ఏర్పడింది. షాజహాన్ కాలంలో (1628-1658) మొగల్ సామ్రాజ్యం సాహిత్య, లలిత కళారంగాల్లో అత్యంత ఉచ్ఛదశకు చేరుకొంది. ఈ కాలంలో సామ్రాజ్యం సుభిక్షంగా ఉంది. దేశంలో అనేక పరిశ్రమలు స్థాపించడం వల్ల ఉత్పత్తులు పెరిగాయి. ఆగ్రాలో చాలా కార్ఖానాలు ఏర్పాటు చేయడం జరిగింది. విదేశీ వాణిజ్యం వల్ల దేశానికి లాభం చేకూరింది. అయితే షాజహాన్ తరువాత మొగల్ సింహాసనమధిష్టించిన ఔరంగజేబ్ (1658-1707) అక్బర్ దూరదృష్టితో అనుసరించిన మత విధానానికి పూర్తిగా స్వస్తిపలికి, భారతదేశాన్ని ముస్లిం రాజ్యంగా మార్చడానికి తీవ్ర కృషి చేశాడు. అందువల్ల మొగల్ సామ్రాజ్యం అతలాకుతలమై విపత్కర పరిస్థితుల్లో పడింది. మొగల్ సామ్రాజ్యంలో అనేక అలజడులు, ఆందోళనలు, తిరుగుబాట్లు జరిగి అశాంతి నెలకొంది. మొగల్ సామ్రాజ్యానికి అక్బర్ కాలంలో వెన్నుదన్నుగా నిలిచిన రాజపుత్రులు తిరుగుబాట్లు చేశారు. రాజపుత్రులతోటి యుద్ధాల వల్ల మొగల్ సామ్రాజ్యనికి విపరీతమైన ధన, ప్రాణ నష్టాలు సంభవించాయి. ఔరంగజేబ్ విధానం వల్లనే మధురలోని జాట్‌లు, ఛత్రపాల్ నాయకత్వం కింద బుందేలులు, నర్నాల్‌లో సత్నామీలు తిరుగుబాటులు లేవదీశారు. ఔరంగజేబ్ అనుసరించిన విధానం వల్లనే సిక్కులకు, మొగలులకు మధ్య యుద్ధం ప్రారంభమైంది. సిక్కుల పదో గురువైన గోవింద్‌సింగ్, తరువాత బందా బహదూర్ మొగలులకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. మహారాష్ట్రులను అణచడానికి చేసిన ప్రయత్నాల వల్ల మొగల్ సామ్రాజ్యానికి అపారనష్టం సంభవించింది. ఈ యుద్ధాల వల్ల మహారాష్ట్రులు అణచివేయబడలేదు, సరికదా మొగలులను వారు ఎదిరించి నిలిచినందువల్ల వారికి విపరీతమైన జాతీయ ప్రతిష్ఠ లభించింది. దక్కన్ యుద్ధాల వల్ల అలసిసొలసిన ఔరంగజేబ్ మరణించాడు. ఇతని తరువాత పాలించిన మొగలాయిలకు ఎటువంటి సామర్థ్యము లేదు. ఇదేకాలంలో విదేశీ దండయాత్రలు మొగల్ సామ్రాజ్యం నడుము విరిచాయి. కోస్తా వెంబడి దిగి దేశంలోని లోతట్టు ప్రాంతాలలోకి చొచ్చుకొని వచ్చిన బ్రిటిష్ వారి సైనిక ధాటిని ఎదిరించి నిలబడగల శక్తి ఇండియాలో ఎవరికీ లేకుండా పోయింది. దీని పర్యవసానంగా మొగల్ సామ్రాజ్యం అంతరించి, ఇండియాలో ఇంగ్లీష్ తూర్పు ఇండియా వర్తక సంఘం వారి విజృంభణ మొదలైంది.

మొగల్ సామ్రాజ్య సౌష్టవానికి గల ఆధారాల్లో ఒకటయిన కులీనుల నడవడిలో నిర్వహణలో పతనం ఏర్పడింది. 18వ శతాబ్దంలో మొగల్ కులీనుల ప్రధాన బలహీనత సగటు కులీనుల సామర్థ్యం లోపించడంలో లేదు. కాని వారి స్వార్థపరత్వంలో, దేశ పట్ల అంకిత భావం లోపించడంలో ఉంది. ఫలితంగా పాలనలో అవినీతి చోటు చేసుకుంది. పరస్పర పోరాటాలు చెలరేగాయి. తమ అధికారాన్ని ప్రతిష్టనూ, ఆదాయాన్ని పెంచుకోవడానికి కులీనులు కొన్ని వర్గాలుగా, ముఠాలుగా విడిపోయారు. వీరు పరస్పరం పోట్లాడుకొనేవారు, రాజుతో సైతం వీరు పోట్లాడేవారు. వీరి పరస్పర పోట్లాటల వల్ల సామ్రాజ్యం వట్టిపోయింది. సామ్రాజ్య సంఘీభావం దెబ్బతింది. మొత్తం సామ్రాజ్యమే ఛిన్నాభిన్నమైంది. కులీనులు రైతాంగాన్ని పీడించి తమ జాగీరుల నుంచి గరిష్ట స్థాయిలో ఆదాయం పొందడానికి ప్రయత్నించారు. ఫలితంగా రైతుల పరిస్థితి క్రమంగా దిగజారిపోయింది. పన్నుల నుంచి తప్పించుకోవడానికి రైతులు తమ భూములనే వదిలేసిన సంఘటనలు ఉన్నాయి. రైతుల అసంతృప్తి తిరుగుబాట్ల పరంపరలో వ్యక్తమైంది. ఇందుకు జాట్‌లు, సత్నామీలు, సిక్కుల తిరుగుబాట్లే ఉదాహరణలు. ఈ తిరుగుబాట్లు సామ్రాజ్య సుస్థిరతను, శక్తినీ తుడిచి పెట్టాయి. దీంతో బాటు సామ్రాజ్యానికి అదనపు ఆర్థిక వనరులు సమకూర్చవలసిన వర్తక, పరిశ్రమల రంగాలు స్తంభించిపోయాయి.

ఔరంగజేబ్ మరణానంతరం దక్కన్, తూర్పు బెంగాల్, అవుధ్ స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడడంతో మొగల్ సామ్రాజ్యం అత్యంత సంపన్నమైన ప్రాంతాలను పోగొట్టుకొంది. ఫలితంగా మొగల్ సామ్రాజ్యం ఢిల్లీ, ఆగ్రా, పంజాబ్, ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతాలకే పరిమితమైంది. ఈ ప్రాంతాల్లో కూడా మొగల్ చక్రవర్తి అధికారం క్షీణించసాగింది. సామ్రాజ్య సుస్థిరతకు, ఆఫ్ఘనులు, మరాఠాలు నిరంతరం భంగకరంగా రూపొందారు. అయితే వీరు కూడా బ్రిటీష్ అధికారానికి, నౌకాశక్తికీ ఎదురొడ్డి నిలబడలేకపోయారు. మొగల్ సామ్రాజ్య పతనంలోని విషాదాంతం ఏమిటంటే దీని ఉత్తర దాయత్వం విదేశీ శక్తి చేతికి చిక్కడమే. ఇలా అధికారం చేజిక్కించుకున్న విదేశీ శక్తి, దేశంలో శతాబ్దాలుగా కొనసాగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ స్వరూపాన్ని రద్దుచేసి దాని స్థానంలో వలస స్వరూపం ప్రవేశపెట్టింది.

## 1.1.3. మరాఠులు :

మహారాష్ట్రుల కియాశీలమైన చరిత్ర 17వ శతాబ్దంలో ప్రారంభమవుతుంది. నాటి నుంచి మరి రెండు శతాబ్దాల పాటు వారు భారతదేశ చరిత్రలో, రాజకీయాలలో ప్రముఖ పాత్ర వహించారు. మహారాష్ట్రులను సామాన్యంగా మరాఠీలు అని పిలుస్తారు. అంతకు పూర్వం విజయనగర సామ్రాజ్యం నిర్వహించిన పాత్రనే ఇప్పుడు మరాఠాల సమ్మేళన రాజ్యం నిర్వహించింది.

దక్కన్‌లో 1538 నాటి బహమనీ సుల్తానుల రాజ్యం పూర్తిగా అంతరించి, దాని స్థానంలో దానికి వారసులుగా ఏర్పడిన 5 దక్కన్ సుల్తాన్ రాజ్యాలు 17వ శతాబ్దం వరకు దక్కన్‌లో అధికారం చెలాయించాయి. 5 దక్కన్ సుల్తాన్‌ల రాజ్యాలలో బీరార్‌కు చెందిన ఇమాద్ షాహీ రాజ్యం 1574 లో అహమ్మద్‌నగర్‌కు చెందిన నిజాంషాహీ రాజ్యంలో భాగమయింది. ఈ నిజాంషాహీ రాజ్యం షాజహాన్ పాలనా కాలంలో 1636 లో మొగల్ సామ్రాజ్యాంతర్గతమైపోయింది. బీదర్‌కు చెందిన బరీద్ షాహీ రాజ్యాన్ని బిజాపూర్‌కు చెందిన రెండో ఇబ్రహీం ఆదిల్‌షా 1619 లో గెలవటంతో అది బిజాపూర్ రాజ్యంలో ఒక రాష్ట్రమయిపోయింది. ఈ బిజాపూర్ రాజ్యాన్ని 1686 లో మొగల్ సామ్రాజ్యం కబళించింది. చివరగా గోల్కొండ హైదరాబాద్‌కు చెందిన కుతుబ్‌షాహీ రాజ్యం 1687 లో ఔరంగజేబ్ వశమయింది. దక్కన్‌సుల్తానుల మధ్య అంతఃకలహాలు దక్కన్‌లోనికి మొగలులు జొరబడ్డానికి, మహారాష్ట్రులు దక్కన్‌లో వారి అధికారాన్ని స్థాపించటానికి అవకాశమిచ్చాయి. మహారాష్ట్రులు మొగలులను మించిపోయి, మొగల్ అధికారం దక్కన్‌లో వేళ్ళూనకుండా చేశారు.

మొగల్ సామ్రాజ్యం, బీజాపూర్, పోర్చుగీస్, గోల్కొండ అనే నాలుగు గొప్ప ప్రతిపక్ష శక్తుల కోరల్లో మరాఠులు శివాజీ నాయకత్వాన ఒక శక్తివంతమైన జాతిగా రూపొందారు. శివాజీ బీజపూర్ సుల్తాన్‌తో, మొగలాయిలతో చేసిన యుద్ధాలతో దక్కన్‌లో రాజకీయంగా, ఆర్థికంగా అస్తవ్యస్త పరిస్థితులేర్పడ్డాయి. శివాజీ సూరత్ ఆక్రమణ సందర్భంలో వేల సంఖ్యలో గృహాలు దగ్ధమయ్యాయి. మూడు వంతుల నగరం ధ్వంసమైయింది. శివాజీ తరువాత శంభాజీ, రాజారాం, తారాబాయిలు మరాఠులకు నాయకత్వం వహించి మొగలులతో పోరాటం కొనసాగించారు. మరాఠులను అణచడానికి మొగలులు చేపట్టిన చర్యలు విఫలమైంది. మొగలులు పతనమవుతున్న కాలంలో మరాఠులు మొగలులతో ఘర్షణ పడటం నిస్సందేహంగా మరాఠాల అదృష్టమే అని చెప్పాలి. ఔరంగజేబ్ మరణానంతరం మహారాష్ట్రులలో వారసత్వం కోసం అంతుర్యుద్ధం ప్రారంభమైంది. సాము, తారాబాయిల మధ్య జరిగిన ఈ పోరులో సాహు విజయం సాధించాడు. సాహు విజయానికి

కారకుడు బాలాజీ విశ్వనాథ్. అందువల్ల సాహు అతనిని పీష్వాగా నియమించాడు. నాటి నుండి పీష్వాలే మహారాష్ట్రులకు నిజమయిన నాయకులయ్యారు. వీరి కాలంలో మొగలులు మహారాష్ట్ర సార్వభౌమత్వాన్ని గుర్తించారు. అయితే మొగలులకు రక్షకులుగా ఆఫ్ఘనులతో పోరు సల్పి చిత్తయ్యారు. ఇది మహారాష్ట్రులకు జాతీయ విపత్తు అయింది. మొగలుల బలహీనత, మహారాష్ట్రుల వైఫల్యం ఇండియాలో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనకు అనుకూలించింది.

## 1.1.4. విజయనగర రాజులు :

బ్రిటీష్ పాలనకు ముందు దక్షిణ భారతదేశంలో విజయనగర సామ్రాజ్య పాలకులు, మహారాష్ట్ర స్వరాజ్య పాలకులు ఒకరి తరువాత ఒకరు దాదాపు సమానంగా పంచుకొని ప్రధాన రాజకీయ శక్తులుగా చరిత్ర గతిని నడిపించారు. దానిని శాసించారు. ఈ రెండు రాజకీయ శక్తులు దక్షిణ భారతదేశంలో ముస్లిం రాజకీయ ప్రాబల్యానికి, ఇస్లాం మత ప్రాబల్యానికి ప్రతిఘటన శక్తులుగా రూపొందటం మరొక విశేషం. విజయనగర పాలకులు, మహారాష్ట్ర ఛత్రపతుల పాలన వల్ల దక్షిణ భారతదేశం ఉత్తర భారతదేశానికి విభిన్నమైన సాంస్కృతిక, సామాజిక వ్యక్తిత్వాన్ని, విలువలను సంతరించుకొంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో చిరకాలంగా ముస్లిం దండయాత్రల వల్ల, పరిపాలన వల్ల అక్కడి ప్రజల ఆచార వ్యవహారాల మీద, జీవన విధానం మీద ప్రసరించిన ఇస్లాం సంస్కృతీ ప్రభావం విజయనగర రాజుల, మహారాష్ట్ర ఛత్రపతుల పాలన వల్ల దక్షిణ భారతదేశ సమాజం మీద, జీవన విధానం మీద ప్రసరించక భారతదేశ చరిత్రలో, దక్షిణ భారతదేశ చరిత్ర, సంస్కృతి ఒక విశిష్టత ఒక ప్రత్యేకత సంతరించుకొన్నాయి. నేడు ద్రావిడ భాషలు మాట్లాడే ఆ రాష్ట్రాలన్నీ ఆనాడు విజయనగర సామ్రాజ్యాంతర్గతంగా, ఏకచ్ఛత్రాధిపత్యంలో ఉండేవి. దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర సామ్రాజ్య ఆశయాలకు వారసత్వం వహించిన వారు మహారాష్ట్ర ఛత్రపతులు, విజయనగర సామ్రాజ్య కాలానికి విభిన్నమయిన రాజకీయ పరిస్థితులలో శివాజీ, అతని తరువాత వచ్చిన మహారాష్ట్ర పాలకులు, విజయనగర సామ్రాజ్య ఆశయాలను కొనసాగించారు.

ముస్లిం పాలన నుంచి దక్షిణ భారతదేశ దాస్య విమోచనోద్యమంలో ఒక భాగంగా **1336** లో విజయనగర సామ్రాజ్యస్థాపన జరిగింది. ఈ సామ్రాజ్యం **1646** వరకు కృష్ణానదికి దక్షిణంగా ఉన్న దక్షిణ భారతదేశం మీద అధికారం నెరపింది. ఈ సామ్రాజ్యాన్ని నాల్గు రాజ వంశాలు పాలించాయి. అవి సంగమ వంశం, సాళువ వంశం, తుళువ వంశం, అరవీటి వంశం. విజయనగర సామ్రాజ్యం స్థాపించాక పది సంవత్సరాలకు **1347** లో దక్కన్‌లో బహమనీ రాజ్య స్థాపన జరిగింది. నాటి నుండి బహమనీ, విజయనగర రాజ్యాల మధ్య నిరంతర తీవ్ర సంఘర్షణ జరిగింది. తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణ దేవరాయల కాలంలో **(1509-1529)** విజయనగర ప్రతిష్ఠ ఉచ్ఛ స్థితికి చేరుకుంది. కాని ఆ తరువాత కృష్ణదేవరాయల అల్లుడు రామరాయలు బహమనీల పట్ల అనుసరించిన విభజించి పాలించు విధానం వల్ల **1565**లో రాక్షస తంగడి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో విజయం సాధించిన ముస్లింలు రాజధాని నగరం విజయనగరంలో ప్రవేశించి, దోచుకొని ధ్వంసం చేశారు. ఈ యుద్ధం తరువాత ఆరవీటి వంశానికి చెందిన తిరుమల రాయలు పెనుగొండను రాజధానిగా చేసుకొని రాజ్యం పాలించనారంభించాడు, ఈతని పాలన కాలం ప్రారంభంలో రాజ్యంలో అరాచకం విచ్చలవిడిగా విహారం చేసింది. రాష్ట్ర పాలకులు తిరుమల రాయలకు ఎదురుతిరిగి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుని, వారి అధికారాలను బలపరుచుకోవడానికి వారి రాజ్యాలు విస్తరింపజేయటానికి తమలో తాము కలహించుకోసాగారు. వీరిని జయించి అదుపులోకి తేవడం అప్పటి పరిస్థితులలో తనకు సాధ్యం కాదని గ్రహించిన తిరుమల రాయలు వారితో రాజీపడి వారిని స్వతంత్రులుగానే తమ ఆధిపత్యాన్ని గుర్తించేటట్లు చేశాడు. అతను మధుర, తంజావూరు, జింజినాయకులతో సఖ్యం కలిపాడు. తిరుమల రాయల తరువాత పాలించిన విజయనగర రాజులందరూ, నిరంతరం అమర నాయకులతో, పాలేగ్రాండతో పోరు సల్పారు. విజయనగర సామ్రాజ్యాధికారం అంతమయిన ప్రదేశాలలో మొదట మహారాష్ట్రులు, తరువాత తంజావూరు, జింజినాయక రాజులు పాలించసాగారు. విజయనగర సామ్రాజ్యానికి స్మృతి ప్రతీకగా ఒక్క మైసూర్ రాజ్యం మిగిలింది. చివరకు వీరినంతా తొలగదోసి మొగల్ పాదుషాలు దక్షిణ భారతదేశాన్నంతా ఆక్రమించారు.

## 1.1.5. ఐరోపావారు :

ప్రాచీన కాలం నుంచి భారతదేశం, పాశ్చాత్య దేశాల మధ్య వాణిజ్య సంబంధం ఉండేది. ఈ వాణిజ్యం కాన్‌స్టాంటినోపుల్ గుండా భూమార్గాల మీదిగా జరిగేవి. కాని, **1453** కాన్‌స్టాంట్‌నోపుల్ టర్కుల వశమయింది. ఈ కారణంగా భూమార్గాలు ప్రమాదకరంగా

మారాయి. అందువల్ల యూరోపియన్లు సముద్ర మార్గాలను అన్వేషించవలసి వచ్చింది. వీరిలో మొదట పోర్చుగీస్ వారు తరవాత డచ్‌వారు, ఆంగ్లేయులు, ఫ్రెంచ్‌వారు వచ్చారు.

భారతదేశంలో తమ స్థావరాలు స్థాపించిన పాశ్చాత్యులలో ప్రథములు పోర్చుగీస్ వారు. వీరు సరిఅయిన ముహూర్తంలో సరిఅయిన చోట భారతదేశంలో అడుగిడారు. ఆనాడు మలబారు తీరంలో అనేక మంది చిన్నరాజులు పాలిస్తున్నారు. వారందరూ బలహీనులు, నిరంతరం పరస్పర కలహాలతో సతమతవుతూ పోర్చుగీసులను ప్రతిఘటించలేని స్థితిలో ఉన్నారు. వర్తక వాణిజ్యాలతో పాటు క్రైస్తవ మత వ్యాప్తి కూడా పోర్చుగీసుల వలస స్థాపనా లక్ష్యాలలో ఒకటి. **1498**లో పోర్చుగల్ నావికుడైన వాస్కోడిగామా అట్లాంటిక్, హిందూ మహాసముద్రాల మీదుగా పయనించి ఇండియా పడమటి తీరంలో కాలికట్ చేరుకొన్నాడు. దీనితో ఇండియా, పశ్చిమ దేశాల మధ్య సముద్ర మార్గం ఏర్పడింది. కాలకట్ పాలకుడు జామెరిన్‌షా పోర్చుగీస్ వారికి తన రాజ్యంలో వ్యాపారం చేసుకోడానికి అనుమతి ఇచ్చాడు. అది క్రమంగా పోర్చుగీస్ వలసలను భారతదేశంలో స్థాపించడానికి దారితీసింది. మలబార్ తీరంలో కాలికట్, కొచ్చిన్, కన్ననూర్‌లలో పోర్చుగీస్ వారు ఫ్యాక్టరీలను, స్థావరాలను నిర్మించి వాటిని వ్యాపార కేంద్రాలుగా వినియోగించుకొనేవారు. తరువాత గోవా, డయ్యూ, డామన్, సాల్‌సెట్టి, బెస్సీన్, మద్రాస్ సమీపంలోని శాన్‌థోమ్‌ను, పర్షియా సింధుశాఖలోని ఆర్మోజ్‌ను, మలయాలోని మలక్కాను, సిలోన్‌ను పోర్చుగీసువారు జయించి ఆక్రమించినారు. **16**వ శతాబ్ది నాటికి తూర్పున వారి అధికారం స్థిరపడింది. కాని **17**వ శతాబ్ది ప్రారంభంలో వారి ప్రాచ్య సామ్రాజ్యం క్షీణించసాగింది. డచ్‌వారు, బ్రిటీష్‌వారు పోర్చుగీస్ వారి స్థావరాలను ఆక్రమించుకొన్నారు. చివరకు పోర్చుగీస్ వారికి ఇండియాలో కేవలం గోవా, డయ్యూ, డామన్‌లు మాత్రమే మిగిలాయి. పోర్చుగీసు వారి మత అసహన విధానాలు, దేవాలయాలు, మసీదులను ధ్వంసం చేయడం మొదలైనవి భారతీయులలో వారిపట్ల ద్వేషం కలిగించాయి.

డచ్ వారు **1602** లో 'యునైటెడ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆఫ్ నెదరలాండ్స్' అను వర్తక సంఘాన్ని ఏర్పరచి తూర్పు దేశాలలో వ్యాపారం సాగించారు. సుగంధ దీవులుగా ప్రసిద్ధి పొందిన తూర్పు ఇండియా దీవులపై డచ్ వారు దృష్టిని కేంద్రీకరించారు. **1619** లో జకర్తాను ఆక్రమించి, ఒటేవియా నగరాన్ని నిర్మించి మిరియాలు, లవంగపు మొగ్గలతో లాభసాటి వ్యాపారాన్ని సాగించారు. క్రమంగా వీరు సుమత్ర, జావా, మలక్కాలలో స్థావరాలను స్థాపించారు. **1605**లో మచిలీపట్నంలో డచ్ వారి తొలి వర్తక స్థావరం ఏర్పాటు చేయడం జరిగింది. తరవాత పులికట్ వద్ద ఒక స్థావరం నిర్మించుకొని ఒక కోట కట్టుకొన్నారు. దీని తరువాత బ్రోచ్, కాంబె, అహమ్మదాబాద్‌లలో తమ ఫ్యాక్టరీలు నెలకొల్పారు. బెంగాల్లోని చింసూరా, కాశింబజార్‌లోను, పాట్నాలోను, దక్షిణాన ట్యుటికోరిన్, పులికాట్, నాగపట్నం, క్విలన్, కొచ్చిన్, కన్ననూర్‌లలో వర్తక కేంద్రాలు స్థాపితమయ్యాయి.

ఇంగ్లాండ్ రాణి **1600**లో తూర్పు ఇండియా వర్తక సంఘానికి తూర్పు దేశాలలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతిస్తూ ఒక ఆజ్ఞాపత్రాన్ని జారిచేసింది. విలియం హాకిన్స్ **1608** లో మొగల్ రేవు పట్టణమైన సూరత్ చేరుకొన్నాడు. మొగల్ సామ్రాజ్యంలో వర్తకం చేసుకోవడానికి అధికారం ఇవ్వమని మొగల్ చక్రవర్తి జహంగీర్‌ను కోరాడు. కాని పోర్చుగీసువారు అడ్డుతగిలారు. సర్‌థామస్‌రో మొగల్ దర్బార్‌కు వచ్చి ఎంతో ప్రయత్నం చేసిన తరువాత జహంగీర్ నుంచి వర్తకానికి అనుమతి పొందడమేగాక సూరత్, అహమ్మద్ నగర్, బ్రోచ్, ఆగ్రాలలో ఇంగ్లీష్ ఫ్యాక్టరీలు స్థాపించడానికి అనుమతి పొందాడు. ఆ తరువాత ఇంగ్లీష్ కంపెనీవారు మచిలీపట్నం **(1611)**, మద్రాస్ **(1639)** కడలూర్, పోర్టునోవో, విశాఖపట్నం, బొంబాయి, బాలసోర్, హుగ్లీ, కాశింబజారు, పాట్నాలలో తమ ఫ్యాక్టరీలను నిర్మించుకొన్నారు. బొంబాయి, కలకత్తా మద్రాసులలో వీరు మూడు ప్రధాన రేవు పట్టణాలను ఏర్పాటు చేసుకొన్నారు.

ఇండియాలో వర్తకం చేసుకోవడానికి పోటీకి దిగిన ఐరోపావారిలో ఫ్రెంచివారు చివరివారు. **1644** లో ఫ్రెంచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపితమైంది. ఇది ఫ్రెంచి ప్రభుత్వానికి చెందింది. ఇండియాలో **1668** లో తొలి ఫ్రెంచి స్థావరం సూరత్‌లో వెలసింది. తూర్పు కోస్తాలోని మచిలీపట్నంలో ఫ్యాక్టరీ నిర్మించుకోవడానికి ఫ్రెంచి వారు గోల్కొండ నవాబు నుండి ఒక ఫర్మానా పొందారు. తరవాత పుదుచ్చేరి, చంద్రనగర్‌లలో స్థావరాలనేర్పాటు చేసుకొన్నారు. పుదుచ్చేరి వీరి ప్రధాన కేంద్రమైంది. సూరత్, మచిలీపట్నం, చంద్రనగర్, డక్కా, కాశింబజార్, బాలాసోర్, పాట్నా, కాలికట్, యానం, కరైకాల్‌లలో ఫ్రెంచి స్థావరాలున్నాయి.

దక్కన్‌లో బ్రిటీష్, ఫ్రెంచివారి మధ్య వ్యాపార ఆధిపత్యానికై పోరాటం ప్రారంభమయ్యే సమయానికి అక్కడ విపరీతమైన రాజకీయ గందరగోళం నెలకొని ఉంది. బ్రిటీష్, ఫ్రెంచివారు స్థానిక రాజకీయాలలో తలదూర్చి మూడు యుద్ధాలు చేశారు. వీటినే కర్ణాటక యుద్ధాలంటారు. ఈ యుద్ధాలలో అంతిమంగా విజయలక్ష్మి బ్రిటిష్ వారిని వరించింది. ఇండియాలో ఫ్రెంచి వారి శక్తి పూర్తిగా దిగజారిపోయింది. ఉత్తర సర్కారులు బ్రిటిష్ వారి స్వాధీనమైంది. కర్ణాటకలో జరిగిన పరిణామాలు చూసి భయపడిన బెంగాల్ నవాబు బ్రిటీష్ వారిని అదుపులో ఉంచడానికి ప్రయత్నించాడు. దాని ఫలితమే 1757 లో జరిగిన చారిత్రాత్మక ప్లాసీ యుద్ధం. ఈ యుద్ధ ఫలితంగా బెంగాల్ బ్రిటీష్ వశం కావటంతో బాటు క్రమంగా భారతదేశ ఆధిపత్యానికి దారి తీసింది. ఇది 1856 నాటికి పూర్తయింది. బ్రిటీష్ పాలన సుమారు రెండు శతాబ్దాల కాలం కొనసాగటం ఆధునిక భారతదేశ చరిత్రలో సంభవించిన అత్యంత ప్రధాన పరిణామం.

## 1.1.6. ప్రభావం :

17, 18 శతాబ్దాలలో నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితి ప్రభావ ఫలితంగా ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన జరిగింది. 1757 లో ఆంగ్లేయులు బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా పై విజయం సాధించి బెంగాల్‌ను ఆక్రమించడం ద్వారా బ్రిటిష్ వలస సామ్రాజ్య స్థాపనకు పునాది వేయబడింది. దీని సుదీర్ఘ, సువిశాల స్థాపన 1856 వరకు కొనసాగి చరిత్రను సృష్టించింది. 190 సంవత్సరాల కాలం నడిచిన బ్రిటిష్ పాలనలో ప్రధానంగా గమనించాల్సిన విషయమేమంటే గతంలో భారతదేశంలో పాలించిన పలు విదేశీ జాతుల వారి కంటే భిన్నమైన ధోరణి, పద్ధతి, మనస్తత్వాన్ని ఆంగ్లేయులు అవలంబించడం. ఆంగ్లేయులకు ముందు వారంతా ఇండియాలో తమ రాజకీయాధికారాన్ని నిల్పుకుంటూ, దేశంలో అనాదిగా వస్తున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థలను యధాలాపంగా కొనసాగనిచ్చారు. అంతేగాక వీరు క్రమంగా భారతీయ జీవన స్రవంతిలో కలసిపోయి ఇండియాను తమ దేశంగా, ఇచటి ప్రజలను తమ ప్రజలుగా భావించారు. దీనికి భిన్నంగా బ్రిటీష్ పాలకులు భారతదేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పాలనా వ్యవస్థల్లో జోక్యం చేసుకొని వాటి స్వరూప స్వభావాల్లో తీవ్రమార్పుల్ని తెచ్చారు. ముఖ్యంగా, భారతీయ స్వయం సమృద్ధి గ్రామీణార్థిక వ్యవస్థను ధ్వంసం చేశారు. వీరు ఇండియాను ఎన్నడూ తమ దేశంగా గాని, భారతీయులను తమ ప్రజలుగా గానీ భావించలేదు. వీరు భారతీయ జీవన స్రవంతిలో ఐక్యమయ్యేందుకు ఎన్నడూ ప్రయత్నించలేదు. తమ దేశ పరిశ్రమలు, వ్యాపారం, వ్యవసాయం అభివృద్ధికి ఇండియాను ఒక వలస రాజ్యాంగా వాడుకోవడం జరిగింది.

బ్రిటీష్ కంపెనీ 1765 లో బెంగాల్, బీహార్, ఒరిస్సాలపై 'దివానీ' అధికారాన్ని పొందడంతో ఎటువంటి ఆంక్షలు, అవరోధాలు లేకుండా కంపెనీ ప్రత్యక్ష ఆర్థిక దోపిడీ విచ్చలవిడిగా సాగించింది. ప్రతి ఏటా సాలుసరి 13 లక్షల పౌండ్లకు పైగా విలువచేసే బట్టలు, నూలు, సుగంధ ద్రవ్యాలు లాంటి సరుకులు ఇండియా నుండి వెళ్ళడమేగాక, వీటితాలుకు వాణిజ్య ప్రతిఫలం దేశానికేమీ చెందేది కాదు. ఈ పరిణామం దేశీయుల ఆర్థిక బీదరికానికి దారి తీసింది. నిరంతరం అధిక మిగులు నిధులను పొందే ప్రయత్నంలో కంపెనీ ప్రభుత్వం, అధికారులు మెలగడం చేత రైతులపైన భూమిశిస్తు భారం అదేపనిగా విపరీతంగా పెంచబడుతూ వచ్చింది. గత కాలాల్లో బెంగాల్ ప్రాంతం ధాన్యాగారంగా, తూర్పున వాణిజ్యం, సంపద, ఉత్పత్తులకు నిలయంగా ఉండేది. అయితే కంపెనీ దుష్పరిపాలన ఫలితంగా ఇరువది సంవత్సరాల వ్యవధిలో ఈ ప్రాంతంలోని అనేక భాగాలు ఎడారిగా మారాయి. వ్యవసాయ క్షేత్రాల సాగు నిల్చిపోయింది. వ్యవసాయదారుడు దోచుకోబడ్డాడు ఉత్పత్తిదారుడు అణచబడ్డాడు. క్షామం తరచు రావడమైంది. జనాభా క్షీణత సంభవించింది.

1813 ఛార్టర్ చట్టం ద్వారా భారతదేశ వ్యాపారంలో కంపెనీ గుత్తాధికారాన్ని అంతం చేయడం జరిగింది. దీంతో ఇండియా, బ్రిటిష్ పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలను ఉత్పత్తి చేసి, పంపించే దేశంగా, ఆ పరిశ్రమలు తయారుచేసే సరుకులను కొనే విశాల మార్కెట్‌గా ఇండియాను మార్చివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం పలు ఆర్థిక విధానాలను అనుసరించసాగింది. ఈ ప్రక్రియలో ఆంగ్ల పారిశ్రామికుల, వ్యాపారుల, పెట్టుబడిదార్ల ప్రయోజనాల పరిరక్షణే పరమావధిగా భావించి, భారత కళాకారుల, చేతి వృత్తుల వారల, వ్యవసాయదార్ల, కార్మికుల, వ్యాపారుల బాగోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఆహుతిగావించింది.

19వ శతాబ్ది ద్వితీయార్ధంలో వ్యసాయిక ఉత్పత్తులకు గిరాకీ పెరిగినా, భారతీయ రైతులు సంప్రదాయక పంటలకు బదులుగా, వాణిజ్య పంటలను పండించడం మొదలు పెట్టారు. దేశ విభిన్న భాగాల్లో ముడిపత్తి, జనుము, నల్లమందు, తేయాకు, గోధుమ పంటలను పండించడం ప్రారంభమైంది. వ్యవసాయ వ్యాపారీకరణ ఫలితంగా చిన్న రైతులు అంతగా లాభపడకపోగా, ఆహారధాన్యాల కొరత, ధరల

పెరుగుదల, పనివేతనాలలో హెచ్చింపు లేమితో భూమిలేని కార్మికుల జీవితాలు అస్తవ్యస్తం కాసాగాయి. అధికభూమి, పెట్టుబడి ధనంగల భూస్వాములు, ఉన్నత వర్గ రైతాంగం, వ్యాపారస్తులు మాత్రమే ఈ వ్యవసాయిక మార్పుల వల్ల లాభాన్ని పొందగలిగారు.

భారతదేశంలో 70 శాతం ప్రజలు తమ జీవనాధార వృత్తిగా వ్యవసాయం మీద ఆధారపడ్డారు. ఇతర గ్రామీణ వృత్తుల వారైన కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, సాలె, పురోహితులు మొదలైన వారు వ్యవసాయం, వ్యవసాయదారుల ప్రగతి కొనసాగింపుల మీద ప్రత్యక్షంగా ఆధారపడ్డవారే. ఇటువంటి పరస్పర ఆధార, సంఘీభావ వృత్తుల వారితో కూడిన భారతీయ గ్రామ ప్రాంతాలు స్వయం పోషకాలుగా అనాది నుంచి నిలిచాయి. బ్రిటిష్ వలస పాలనలో భారతీయ గ్రామీణ సాంప్రదాయక ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం చేయబడి, కర్షకులు, వీరితో ముడిపెట్టుకున్న ఇతర వృత్తుల వారు అత్యంత క్షీణతను, దుర్భర దారిద్ర్యాన్ని పొందారు. దీనికి తోడు భారతీయ రైతాంగ రుణగ్రస్తత శాపంగా పరిణమించి వ్యవసాయాభివృద్ధిని కుంటుపరచింది. రైతులు రుణభారం నుంచి విముక్తి పొందలేక, భూమిని వదులుకోవలసివచ్చేది. సామాన్య ప్రజానీకం తిండి, బట్ట లాంటి కనీస అవసరాలు తీరక పలు బాధలకు గురి అవటం జరిగింది.

బ్రిటీష్ పాలనా ఫలితంగా ఏర్పడ్డ నూతన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నుండి ఇండియాలో మధ్య తరగతి అనే నూతన సామాజిక వర్గం ఆవిర్భవించింది. భారతీయ చరిత్రలో భూ యాజమాన్యంలో జమిందారీ విధానం ప్రవేశపెట్టబడింది. దీని ఫలితంగా జమిందార్లు, కౌలుదార్లు అనే రెండు నూతన సామాజిక వర్గాలు ఆవిర్భవించాయి. కర్మాగారాలలో పారిశ్రామికులు, కార్మికుల్లాంటి నూతన సామాజిక వర్గాలు ఆవిర్భవించాయి. బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో నూతన విద్యా సంస్థలు స్థాపించబడినవి. ఫలితంగా డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదుల్లాంటి వృత్తి వర్గాల వారు ఏర్పడ్డారు. ఈ మేధావి వర్గం పాశ్చాత్య సంస్కృతిని అధ్యయనం చేసి దానిలోని తార్కిక, ప్రజాస్వామ్య సిద్ధాంతాలు, భావనలు, సారాంశాన్ని వంటపట్టించుకొన్నారు. వీరు చాలా వరకు ఇండియా ప్రజలను ఒక ఆధునిక జాతిగా ఐక్యపరచి, వివిధ ప్రగతిశీలక, సామాజిక, మత సంస్కరణోద్యమాలు దేశంలో నిర్వహించారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాశ్చాత్య విద్య వలన భారతీయులకు ఆధునిక, పాశ్చాత్య, హేతుబద్ద, ప్రజాస్వామిక భావాలు అలవడ్డాయి.

ఆంగ్ల విద్యా విధానం ద్వారా పాశ్చాత్య ఉదారవాద భావాలు భారతీయ మధ్యతరగతి మేధో వర్గంలో బాగా వ్యాపించింది. దాని ఫలితంగా సామాజిక, మత రంగాల్లో మధ్యయుగ వ్యవస్థలు, భావాలకు సమాధికట్టి, జాతీయత, వ్యక్తి స్వేచ్ఛ, సాంఘిక సమానత్వం ప్రాతిపదికలుగా పునర్వ్యవస్థీకరణ, సంస్కరణకై దేశ విభిన్న ప్రాంతాల్లో పలు ఉద్యమాలు ఆవిర్భవించి, క్రమంగా వ్యాపిస్తూ దేశ సంస్కృతి స్రవంతిలో భాగమయ్యాయి. సామాజిక రంగంలో సతీసహగమన నిర్మూలన, కుల నిర్మూలన, స్త్రీలకు సమాన హక్కులు, బాల్య వివాహాల రద్దు, వితంతు పునర్వివాహ నిషేధ రద్దు, అంటరానితన నిర్మూలన లాంటి సమస్యల సాధనకై పెక్కుమంది కృషి చేసి విజయాలు సాధించారు. మత రంగంలో విగ్రహారాధన, బహుదేవతారాధన, క్రతుకర్మ కాండలు, పురోహితుల నిరంకుశ పెత్తనం, మొదలగు వాటి సంస్కరణకై, నిర్మూలనకై కృషి జరిగింది.

బ్రిటీష్ పాలన ఫలితంగా కుల విధాన ఆర్థిక పునాదులు కూల్చి వేయడమైంది. గ్రామీణ స్వయం సమృద్ధి స్వయం పాలన విధానం నాశనం, భూమిని వ్యక్తిగత ఆస్తిగా చేయటం, దేశంలో పారిశ్రామికీకరణ ప్రవేశపెట్టడం, ఫలితంగా నూతన వృత్తులు, ఆధునిక నగరాలు అభివృద్ధి చెంది పలురకాల కట్టుబాట్లు, నిషేధాలకు స్వస్తి పలకడం జరిగింది. బ్రిటిష్ పాలనకు ముందు హైందవ సమాజంలో అంటరాని తనం ప్రబలంగా ఉండేది. వీరికి దేవాలయాల ప్రవేశం, బావులు, చెరువుల వాడకం నిషేధమయ్యాయి. ఈ సాంఘిక దురాచార నిర్మూలనకై సంస్కర్తలు ఉద్యమాలు నిర్వహించారు. ఫలితంగా అణగారిన వర్గాలలో చైతన్యం ఏర్పడింది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే దళిత జాతులకు సమాన హక్కులను పునరుద్ధరించడంలో బ్రిటిష్ ప్రభుత్వం తటస్థ, అనాసక్త విధానాన్ని అవలంభించింది. బ్రిటిష్ పాలన ఫలితంగా స్త్రీల స్థితిగతుల్లో కూడా గొప్ప మార్పు వచ్చింది.

## 1.1.7. సారాంశం :

బ్రిటిష్ పాలన ఫలితంగా శతాబ్దాల తరబడి దేశ ఆర్థిక సంపదకు వెన్నెముకగా నిలిచిన కుటీర పరిశ్రమలు, హస్తకళలు ధ్వంసం చేయబడ్డాయి. బ్రిటిష్ ప్రజలకు కావల్సిన ఆహార ధాన్యాలు, పారిశ్రామిక ముడిపదార్థాలను పండించేందుకు భారతీయ వ్యవసాయక

విధానం నిర్దేశించడమయింది. బ్రిటిష్ పాలనా యంత్రాంగ సిబ్బంది, అధికార సుస్థిరత, సంస్కృతీ వ్యాప్తికై ఆంగ్ల విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, జన సామాన్య విద్యను అశ్రద్ధ చేసిన కారణంగా జనాభాలో 90 శాతం నిరక్షరాస్యులుగా మిగిలిపోయారు. కుల, మత పరమైన విభేదాలను భారత ప్రజల్లో రెచ్చగొట్టారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో బ్రిటిష్ ప్రభుత్వం భారత సంపదను ఏళ్ళ తరబడి ఇంగ్లండ్‌కు తరలించి దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది.

## 1.1.8. నమూనా ప్రశ్నలు :

1. 17వ శతాబ్దంలో భారతదేశంలో నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితిని గురించి వివరింపుము.
2. 17వ శతాబ్దంలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి ప్రభావ ఫలితాలను పరిశీలింపుము.

## 1.1.9. చదువదగిన గ్రంథాలు :


1. H.H. Wilson : British Indian Hisoty
2. V.B. Singh : Economic History of India
3. Bipin Chandra : Modern India
4. T.N. Mukherjee : A Hand Book of Indian Products
5. R.C. Dutt : Economic History of British India
6. V.A. Narain : Social History of Modern India
7. O' Malley (Ed.) : Modern India and the West
8. K.K. Dutta : A Social History of Modern India
9. Sunil Sarkar : Modern India
10. R.C. Majumdar (Ed.) : The History and Culture of Indian People
11. S.C. Raychoudhari : Social, Cultural and Economic History of India
12. Satish Chandra : Medieval India
13. K.A. Nilakanta Sastri : A History of South India.


డా॥ వి.కె. మోహన్

పాఠం - 1.2

# బ్రిటీష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశంలో సామాజిక పరిస్థితులు

## 1.2.0. లక్ష్యం :

బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశంలో సామాజిక పరిస్థితులను గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


1.2.1. పరిచయం

1.2.2. హిందూ సమాజ స్థితిగతులు

1.2.2.1. కుల విధానం

1.2.2.2. బ్రహ్మణులు

1.2.2.3. క్షత్రియులు

1.2.2.4. వైశ్యులు

1.2.2.5. శూద్రులు

1.2.2.2. అంటరానితనం

1.2.2.3. మహిళల స్థితి

1.2.3. మహమ్మదీయులు

1.2.3.1. విదేశీ మహమ్మదీయులు

1.2.3.2. భారత మహమ్మదీయులు

1.2.3.3. ముస్లింలలోని వర్గాలు

1.2.3.3.1. ఉమారా

1.2.3.3.2. ఉలేమాలు

1.2.3.3.3. సూఫీలు

1.2.3.3.4. బానిసలు

1.2.4. సారాంశము

1.2.5. నమూనా ప్రశ్నలు

1.2.6. చదువదగిన గ్రంథాలు

## 1.2.1. పరిచయం

బ్రిటిష్ పాలన ప్రారంభానికి ముందు భారతదేశంలో ఎంతో మంది ఇతర దేశస్థులు, ఎన్నో మతాల వారు ఉన్నారు. ఆర్థిక స్థోమతను బట్టి నాటి ప్రజలను ఉన్నత, మధ్యమ, అధమ తరగతుల వారని విభజించవచ్చు. పాలక కుటుంబాలకు, ఉన్నతోద్యోగులకు సంఘంలో ప్రత్యేక గౌరవం ఉండేది. భాగ్యవంతులు తమ భవనాలను ఉద్యానవనాలతో, జలయంత్రాలతో, కల్పిత జలపాతాలతో అలంకరించినారు. ఇళ్ళను గోపురాలతో సున్నితమైన స్తంభాలతో, పాలరాతి ఫలకాలతో, ఇంటి లోపలిభాగాలను కంబళ్లతో, తెరలతో, ముత్యాల సరాలతో, అద్దాలతో, పింగాణి సామానుతో అలంకరించేవారు. చక్రవర్తి వంటశాలలో రోజుకు అనేక రకాల భోజన పదార్థాలను, పానీయాలను, మాంసాహారాలకు తయారుచేసేవారు. మొగల్ చక్రవర్తుల కాలంలో అంతఃపుర స్త్రీ సంఖ్య అత్యధికము. అక్బర్ జనానాలో ఐదు వేల మంది స్త్రీలు ఉండేవారట. ఉన్నతోద్యోగుల ఇళ్ళు సిరి సంపదలతో భోగభాగ్యాలతో తులతూగుతూ ఉండేవని, స్త్రీ, పురుషులు మధుపానం చేసే వారని ఫ్రాన్సిస్‌కో పాల్ సార్ట్ వ్రాసినాడు. వైద్యులు, గాయకులు, కళాకారులు, భూస్వాములు, పండితులు, న్యాయవాదులు మధ్య తరగతికి చెందిన వారు పట్టణాలలో వీరి జనాభా ఎక్కువగా ఉండేది. వీరు వెండి, బంగారు నగలు వాడే వారు. పురుషులు మాత్రమే మధ్యాన్ని సేవించే వారు. జనాభాలో నిమ్న తరగతి వారి సంఖ్య పెద్దది. మట్టి గోడలతో, ఆకు కప్పులతో వీరి నివాసాలుండేవి. శరీరం మీద ఒకటే గుడ్డ, ఒక్క పూట భోజనం వీరి జీవిత విధానము. వెండి, పూసల నగలు వీరు ధరించేవారు.

వివిధ జాతులు కలసి నివసించటం, సంఘ కట్టుబాట్లు విపరీతంగా పెరగడం, సంఘంలో కాలక్రమంలో మార్పులు రావడం నాటి భారత సమాజ ప్రధాన లక్షణాలు. మధ్యయుగారంభంలో టర్కులు, మంగోలులు, తురుష్కులు, పారశీకులు, భారతీయులు కలసి జీవించారు. ఆ తరువాత భారతీయులు ఐరోపా వాసులైన పోర్చుగీస్, డచ్చి, ఫ్రెంచి, బ్రిటీష్ వారితో సహజీవం చేశారు. ప్రాచీనమైన బ్రహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలలో అనేక శాఖలు, ఉప శాఖలు, నిబంధనలు, నిషేధాలు అధికమయ్యాయి. వర్ణాంతర వివాహాలకు, సామూహిక భోజనాలకు వ్యతిరేకత ఎక్కువగా ఉండేది. ప్రాంతీయ ఆచారాలు, కులమత బేధాలు, విపరీతంగా పెరిగిన సంఘు కట్టుబాట్లు ఈ యుగ లక్షణం. ఆల్ బెరూని కాలం నాటి పరస్పర అయిష్టత గల హిందూ-ముస్లిం సంఘం పరస్పర స్నేహ దృక్పథం అవలంభించింది. భక్తి ఉద్యమదారులు ప్రభోధించిన సాంఘిక సమానత్వం, పరస్పర గౌరవానికి సాంఘిక మర్యాదలను ఏర్పరచుకొనటానికి దారి తీసింది. అధికారం, ధనం గల విదేశీయులకు, ఆర్థికంగా అభివృద్ధి చెందిన బడుగు వర్గానికి, మిశ్రమ సంతానానికి సంఘంలో హోదా లభించింది.

మహమ్మదీయులు విదేశీయులని, స్వదేశీయులని రెండు తెగలయినారు. స్వదేశీయులను హిందూస్థానీలని అనటం కద్దు. విదేశీయులు జీవనోపాధి కోసం భారతదేశం వచ్చిన ఇరానీ, తురానీ, అరబ్బీ, ఆఫ్ఘన్, అబిసేనియన్ జాతుల వారు. వీరు స్వదేశీయులను హీనంగా చూసేవారు. జీవన విధానంలో కూడా కొన్ని మార్పులు వచ్చినాయి. మొగలాయిలు ఏర్పరచిన పెద్ద పెద్ద రహదార్లు వాటికి ఇరువైపులా వెలసిన పట్టణాలు సిరి సంపదలకు నెలవయినవి. ఢక్కా, జాన్‌పూర్, బీజాపూర్, గోల్కొండ, మధుర వంటి పట్టణాలలోను, రేవు పట్టణాలలోను నానాజాతుల నాగరికతల సమ్మేళనం జరిగింది. కొత్త రకాల కూరలు, పండ్లు, పూల జాతులు, పంటలు పెంచటం ఆరంభమైంది. పాలకులు ఉద్యానవనాలను పెంచటంలో శ్రద్ధ చూపినారు. ఆనాటి ఉద్యానవనాలలో లాహోర్‌లోని షాలిమార్ ఉద్యానవన మొదటి ప్రసిద్ధము. ప్రపంచంలోని అన్ని నగరాలలో లాహోర్ చాలా పెద్దదని మాన్‌సరాత్ వ్రాసినాడు. ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ నగరాలకు నడుమ దుకాణాలతో నిండి ఉందని ఫిషీ వ్రాసినాడు.

సమాజంలో సమాన స్థానాన్ని, ఇంటిలో అధికారాన్ని స్త్రీ కోల్పోయింది. విలాస వనితలుగా, నాట్య కత్తెలుగా, ప్రభువుల అంతః పురంలో, ధనికుల ఇండ్లలో ఉంపుడు కత్తెలుగా ఎంతో మంది స్త్రీలు ఉండేవారు. ముస్లింలలో బహు భార్యత్వము సర్వసామాన్యమయింది. కాని రాజపుత్రులలో, మొగల్ రాజ వంశంలో స్త్రీలు గౌరవ స్థానాన్ని పోగొట్టుకోలేదు. హిందూ, ముస్లిం స్త్రీలలో సాహిత్య, సంగీత, కళావేత్తలుగా, వీరనారీమణులుగా ప్రసిద్ధి పొందినవారు గలరు.

## 1.2.2. హిందూ సమాజ స్థితిగతులు :

బ్రిటిష్ పాలన ప్రారంభానికి ముందు భారతదేశం సామాజికంగా, సాంస్కృతికపరంగా మధ్యయుగ మూఢ నమ్మకాలు, సాంఘిక దురాచారాలైన సతీసహగమనము, బాల్య వివాహాలు, కన్యాశుల్కము, వరకట్నం, సంకుచిత దృక్పథం, స్త్రీల పట్ల వివక్షత, మత పరమైన, అశాస్త్రీయ విద్యా బోధన, పత్రికా సామాచార శూన్యత మొదలగు అరిష్టాలతో కూడుకొని, తీవ్ర వెనుకబాటుతనాన్ని, అనారోగ్యతను కనబరిచింది. విపరీతమైన, ఆడంబరమైన, ఖర్చుతో కూడుకున్న క్రతుకర్మకాండలు,సామాజిక ఆచారాలు, పురోహితుల దోపిడి, నిరకుశత్వం, బహుదేవతారాధన, విగ్రహారాధన, ఆలయాల్లో దేవదాసీలు, నాట్య కత్తెలు, విధవా పునర్వివాహ నిషేధం, పారశీక, అరబ్బీ, సంస్కృత భాషల్లో వ్యాకరణ, జ్యోతిష్య, ఖగోళ, తర్క శాస్త్రాల్లాంటి సంప్రదాయ, మతపరమైన విద్యల్లో బోధన నాటి సమాజాన్ని, సంస్కృతిని పట్టి పీడించిన కొన్ని రుగ్మతలు. ఇవన్నీ కూడా మధ్యయుగ భూస్వామ్య సామాజిక, ఆర్థిక వ్యవస్థా లక్షణాలు, బ్రిటిష్ ఆక్రమణ, దీని మార్పు, వీటి సంస్కరణకు సంకేతమైంది.

**1.2.2.1. కుల విధానం :** కుల విధానం 'హిందూ మత ఉక్కు కవచం'లా భావించబడుతూ వచ్చింది. ఇది వేదాలకంటే కూడా ప్రాచీనమైంది. హిందూ సమాజం మొదట మూడు లేదా నాలుగు కులాలుగా విభజింపబడింది. తదుపరి జాతుల మిశ్రమం, భౌగోళిక విస్తరణ, నూతన వృత్తుల ఏర్పాటు లాంటి కారణాల ఫలితంగా మొదట ఉన్న కులాలు అనేక చిన్న కులాలుగా, ఉపకులాలుగా విభజితమయ్యాయి. గతంలో హిందూమతం హిందువులనందరినీ సాంస్కృతికంగా ఐక్యపరచగా కుల విధానం వీరిని సామాజికంగా నిరంతరం పెరుగుతున్న పలు వర్గాలు, ఉప వర్గాలుగా చీల్చింది. వివాహం, వృత్తి, భోజనం లాంటి కీలక సామాజిక విషయాల్లో ప్రతి వర్గం లేదా ఉపవర్గం ఒక ప్రత్యేక విభాగంగా వ్యవహరించింది.

కులాలు క్రమానుగతంగా వర్గీకరింపబడి, ఒక కులానికి పైనున్నవి ఉన్నతమైనవిగాను, కిందనున్నవి తక్కువైనవి గాను పరిగణించడం జరిగింది. ఒక కులంలో జన్మించిన మానవుని హోదా కులాల క్రమానుగతంలో ఆ కులం స్థానాన్ని బట్టి నిర్ణయించడమైంది. ఒక కులంలో పుట్టడంతోటే ఒక మానవుని హోదా ముందుగానే నిర్ణయమై, మార్పు చేయడానికి వీలు లేనిదైంది. ఇదే విధంగా ఒక వ్యక్తి పుట్టిన కులం, అతడనుసరించే వృత్తిని కూడా ముందుగానే నిర్ణయించింది. దీని విషయంలో కూడా అతనికే మాత్రం స్వేచ్ఛలేదు. వివాహ విషయంలో కూడా కులాలు, ఉప కులాలు వారధుల్లా వ్యవహరించాయి. ఒక కులానికి చెందిన వ్యక్తి వేరే కులానికి చెందిన వ్యక్తిని వివాహమాడేందుకు వీల్లేదు. కుల విధానం క్రమానుగత వర్గీకరణ చెందడంతో ఇది సామాజిక, న్యాయ సంబంధమైన అసమానతలపైన ఆధారపడినట్లైంది. ఉదహరణకు, సామాజిక వ్యవస్థలో శిఖరాగ్రాన ఉన్న బ్రాహ్మణులు సారస్వత, విజ్ఞానాలను తమ గుప్పిట్లో ఉంచుకోగా, అడుగున ఉన్న శూద్రులు, అస్పృశ్యులు అన్ని కులాల వారికీ సేవ చేసే బాధ్యతను పొందినారు.

భారత ప్రజల ఆర్థిక పేదరికం కారణంగా కులవిధానం పలు శతాబ్దాలు వృద్ధి చెందుతూ కొనసాగింది. ఇది పూర్వ పెట్టుబడిదారీ దశకు చెంది, ప్రధానంగా గ్రామ పాలన, మార్పిడి సంబంధాలు గణనీయంగా అభివృద్ధి కాకపోవడం బలహీనమైన, స్వల్పమైన రవాణా సౌకర్యాల మీద ఆధారపడింది. విశేషమేమంటే బ్రిటిష్ ఆక్రమణతో భారతదేశంలో నూతన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులేర్పడ్డాయి. వీటి ప్రభావ ఫలితంగా కులవిధానం గతంలో దానికన్నా ప్రయోజనాన్ని కోల్పోయింది.

**1.2.2.1.1. బ్రాహ్మణులు :** ప్రాచీన కాలం నుంచి సమాజంలో ఆదరణ పొందిన బ్రహ్మణులు రాజుల వద్ద పురోహితులుగా ఉండి, మత విషయాలపై వారికి సలహాలనిచ్చేవారు. వీరు ఎక్కువగా న్యాయనిర్ణేతలుగా,జ్యోతిష్కులుగా, గణిత శాస్త్రజ్ఞులుగా, కవులుగా, వేదాంతులుగా ఉండేవారని అబూజైద్ పేర్కొన్నారు. సామాన్య విద్య నేర్చిన బ్రాహ్మణులు బ్రతుకు తెరువుకై పురాణపఠనం, పౌరోహిత్యం, దేవాలయ అర్చకత్వం చేసేవారు. బ్రాహ్మణులకు క్షత్రియులతో సన్నిహిత సంబంధం ఉండేది. మధ్యయుగ ఆరంభంలో బ్రాహ్మణ పోషణ క్షత్రియ ధర్మంగా ప్రతిపాదింపబడింది. ఇతర కులాల మాదిరిగా వీరు పన్నులు చెల్లించనవసరం లేదని ఆల్‌బెరూనీ రాశాడు.

యధ్యయుగంలో బ్రాహ్మణులు ఇతర కులాల వృత్తులను కూడా అనుసరించారు. వీరికి కేటాయించిన వృత్తులను నిర్వహించలేనపుడు క్షత్రియ ధర్మాన్ని పాటించవచ్చని 'భౌద్ధాయన ధర్మసూత్రం' అనుమతి ఇచ్చింది. అనేక మంది బ్రాహ్మణులు సైనిక వృత్తిని అనుసరించినట్లు,

యుద్ధాలలో పాల్గొన్నట్లు ఆధారాలున్నాయి. భట్ట లక్ష్మీధరుని 'కృత్యకల్పతరు' బ్రాహ్మణులు వైశ్యావృత్తిని అనుసరించవచ్చునని అంగీకరించింది. ఉప్పు, మాంసం, వండిన పదార్థాలు, విషం, ఆయుధాలు, తోళ్ళు, విద్యలలో వర్తక వ్యాపారాలు వీరికి నిషిద్ధం. బ్రాహ్మణులు సింధూనదిని దాటి వెళ్ళుట పాపమని భావింపబడేదని, అలా దాటిన వారిని వెలివేయటం వల్ల అక్కడి వారు వేరే కులంగా ఏర్పడ్డారని ఆల్బెరూనీ పేర్కొన్నాడు. నాటి ఆధారాలను పరిశీలిస్తే బ్రాహ్మణులు ఎక్కువగా మాళ్వా, ఒరిస్సా, దక్కన్,కాశ్మీరు, తూరు బెంగాల్ ప్రాంతాలకు వలస వెళ్ళేవారని తెలుస్తోంది. దక్షిణ భారతదేశంలో నిర్మించబడిన అనేక ఆలయాలు బ్రాహ్మణాధిక్యతకు సాక్ష్యంగా చెప్పవచ్చు.

బ్రాహ్మణులు నివసించే ప్రదేశాలను బట్టి ఇంటిపేర్లు, శాఖల విభేదం జరిగింది. ఆంధ్ర బ్రాహ్మణులలో వైదిక, నియోగి అని, ఆరువేల బ్రాహ్మణులు, వేగినాటి బ్రాహ్మణులు, మురికినాటి బ్రాహ్మణులు, కమ్మనాటి బ్రాహ్మణులు, ఆరామ ద్రావిడులను శాఖలు గలవు. ఉత్తర భారతంలో వారు నేర్చిన వేద విద్యను బట్టి ద్వివేది, త్రివేది, చతుర్వేది అనే పేర్లు, అర్చించే అగ్ని హోత్రం బట్టి ఇష్టిన్, అగ్ని హోత్రిన్, దీక్షిత్ అనే పేర్లు వచ్చాయి. నేరస్తులైన బ్రాహ్మణులను ఉరితీయరాదనే ఆచారం భారతదేశంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఎక్కువ ధర్మశాస్త్రాలు దేశ బహిష్కరణను బలపర్చాయి. కాశ్మీర్ చరిత్రలో రాజులచే ఉరి తీయబడిన బ్రాహ్మణులు కనిపిస్తారు.

భారతదేశంలో ముస్లిం రాజ్యం ఏర్పడినప్పటి నుంచి సమాజంలో హిందూ ముస్లిం విభేదాలు అధికమయ్యాయి. హిందూ మతంలోని కులాల మధ్య విభేదాలు సడలాయి. బ్రాహ్మణాధిక్యత తగ్గింది. దీనికి ముస్లింల ప్రభుత్వం, భక్తి ఉద్యమకారులు ప్రభోదించిన సమానత్వం కారణాలయి ఉండవచ్చు. గంగానదిలో స్నానం నిషేధింపబడినదని, పవిత్రమయిన తులసి వనాలను నాశనం చెయ్యటం జరిగిందని, సంకీర్తనలు చేయటం అపరాధమని ఆధారాలు తెలుపుతున్నాయి.

**1.2.2.1.2. క్షత్రియులు :** భారత సమాజంలో గౌరవం పొంది ఆధిక్యతగల కులాలలో క్షత్రియులు ఒకరు. రాజ్యరక్షణ, ప్రజానురంజకంగా పాలన, సాహిత్య కలల పోషణ వీరి ధర్మంగా ప్రతిపాదించబడినవి. హిందూ రాజులందరూ తాము క్షత్రియులమనే ప్రకటించుకొన్నప్పటికీ వీరు వివిధ జాతులకు, కులాలకు చెందినవారు. ముప్పది ఆరు క్షత్రియ తెగల గురించి కొన్ని గ్రంధాలు తెలియజేస్తున్నాయి. క్షత్రియులలో రాజులు, రాష్ట్ర పాలకులు ఉన్నత వర్గీయులు కాగా, సైన్యంలోని ఇతర ఉద్యోగులు సామాన్య వర్గానికి చెందినవారు, హూణులు వంటి విదేశీయులు భారతదేశంలో స్థిరపడి క్షత్రియ ధర్మాన్ని అనుసరించారు. రాజపుత్రులు తమ వంశ గౌరవాన్ని పెంపొందించుకోవడానికి ప్రయత్నం చేశారు. వీరు తమ ప్రతిభను వ్యక్తపరచటానికి తరచూ యుద్ధాలు చేసేవారు. యుద్ధ భూమిలో మరణాన్ని గౌరవంగా భావించేవారు. బ్రాహ్మణుల వలె వేదాలను నేర్చుకోవడానికి, పఠించడానికి క్షత్రియులకు అవకాశం ఉంది కాని వేదాలను నేర్పడానికి అధికారం లేదని ఆల్బెరూనీ తెలిపాడు. క్షత్రియులు వ్యవసాయం, వ్యాపారం చేసినట్లు సాక్ష్యాలున్నాయి. దక్షిణ భారతదేశంలో శూద్రకులానికి చెందిన రెడ్లు, కాకతీయులు రాజ్యపాలన చేశారు.

**1.2.2.1.3. వైశ్యులు :** వైశ్యుల వృత్తి వ్యవసాయం, పశుపోషణ, వర్తక వ్యాపారాలు. వీరికి భారతదేశంలోని అన్ని ప్రాంతాలతో వర్తక సంబంధాలుండటమేగాక, విదేశాలతో కూడా సన్నిహిత సంబంధాలు కొనసాగించి దేశ ఔన్నత్యానికి కృషి చేశారు. ధన సంపాదనే వీరి ధ్యేయమని, వీరి మాటను ఇతరులు ఎల్లవేళలా విశ్వసించేవారు కాదని, తక్కువ సుంకాలతో బయల్పడటానికి అసత్యమాడేవారని నాటి సాహిత్యం తెలుపుతున్నది. వేద విద్య నేర్చుకోవడానికి వీరికి అధికారం లేదని అతిక్రమించిన వారు శిక్షార్హులని ఆల్బెరూనీ తెలిపినా 'కృత్యకల్పతరు' గ్రంథంలో లక్ష్మీధరుడు వేద విద్య నేర్చుకోవచ్చునని తెలిపాడు. వైశ్యులు నగరాధికారులుగా, మంత్రులుగా, సైనికులుగా నియమితులైనట్లు ఆధారాలున్నాయి.

**1.2.2.1.4. శూద్రులు :** పై మూడు వర్గాలకు చెందని వారందరినీ శూద్రులని వ్యవహరించారు. వ్యసాయదారులు, వివిధ వృత్తుల వారు, కళాకారులు ఈ వర్గంలో ఉండేవారు. బౌద్ధ, జైన మతావలంబులయిన వైశ్యులు వదలివేసిన వ్యవసాయాన్ని వీరు ముఖ్య వృత్తిగా స్వీకరించారు. వీరు క్షత్రియ వైశ్య వృత్తులు అవలంబించవచ్చునని 'నారద స్మృతి'లో తెలుపగా, వీరు వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం, చిత్ర లేఖనం, నృత్యం, సంగీతం మొదలైన వృత్తులు స్వీకరించవచ్చునని మితాక్షరుడు తెలిపాడు. కొందరు తంత్ర విద్యలో ప్రవీణులు. వీరి సాంఘిక గౌరవం ఆర్థిక స్థితినసురించి ఉండేది. శైవ, వైష్ణవాల ప్రాబల్యంతో వర్ణ నిబంధనలు కొంతవరకు సడలాయి.

మధ్యయుగంలో ఖత్రి, కాయస్థ అనే నూతన కులాలు ఏర్పడ్డాయి. ఖత్రి అనే కులం బ్రాహ్మణ, క్షత్రియ సంతతి అని కొందరు, వర్తక వ్యాపార వృత్తినవలంబించిన క్షత్రియులని భిన్న అభిప్రాయాలున్నాయి. కాయస్థ కులం వారు పరిపాలనా వ్యవస్థలో ఉన్నతోద్యోగాలలో ఉండేవారు. అధికార పత్రాలను వ్రాయడం, భద్రపరచటం వీరు చేసేవారు. వీరు మిశ్రమ జాతి వారని, వృత్తిరీత్యా ఏర్పడిన కులమని రెండు అభిప్రాయాలున్నాయి.

దక్షిణ భారతదేశంలో శూద్రులలో అనేకులకు ముఖ్యవృత్తి వ్యవసాయం. వ్యవసాయమే ముఖ్యవృత్తిగా గల కమ్మనాడు, వెలనాడు రైతులు కమ్మ, వెలమ కులాలయ్యాయి. రెడ్డి మాత్రం ఉద్యోగనామమై క్రమంగా ఒక కులంగా పరిణమించింది. రాజ్యపాలన చేసిన ఈ వర్ణ వంశాలలో రెడ్డి, కాకతీయ, వెలమ వంశాలు ముఖ్యమైనవి. వ్యవసాయం తరువాత చేతి పనులను, ఇతర కళలను వీరు వృత్తులుగా స్వీకరించారు. విశ్వకర్మ కులస్థులు శాసన లేఖకులుగా, లోహకర్మకారులుగా, శిల్పకారులుగా ఏర్పడ్డారు. కాలక్రమాన వీరు కంసాలి, కమ్మరి, కంచరి, కాసె, వడ్రంగి అనే ఐదు శాఖలుగా ఏర్పడి 'పంచాణం' వారుగా ప్రసిద్ధికెక్కారు. కుడి, ఎడమ తెగల వారు కూడా మధ్యయుగ చరిత్రలో ప్రసిద్ధికెక్కారు. ఈ రెండు తెగలలోను ఒక్కొక్క దానిలో తొంభై ఎనిమిది ఉపశాఖలున్నాయి. ఈ రెండు తెగల మధ్య తరచు కలహమున్నట్లు ఆధారాలు తెలుపుతున్నాయి. ఈ రెండు శాఖలు గరుడ ధ్వజం, శ్వేతఛత్రం, శ్వేతాశ్వం కోసం పోరుసలిపాయి.

ఒకే వృత్తినవలంభించే వారందరూ ఒకే వీధిలో నివసించేవారని ఆధారాలు తెలుపుతున్నాయి. కుల సంఘాలు కుల కట్టుబాట్లను అమలు పరిచేవి ఈ సంఘాలని నేర విచారణ చేయడానికి, శిక్షలు విధించటానికి అధికారాలున్నాయి. వివిధ వర్గాల వారు భోజన, వివాహాలు తమ వర్ణం వారితోనే చేసేవారు. ఆంధ్రలో పలనాటి బ్రహ్మనాయుడు వర్ణాంతర వివాహాలను, చాపకూడును ప్రోత్సహించాడు. మాచర్ల ఆలయంలో పంచములకు ప్రవేశం కల్పించాడు. వర్ణ వ్యత్యాసాలను కాదని వీర వైష్ణవ ప్రచారం చేశాడు. కాని ఈ సంస్కరణ సత్ఫలితాలు ఎక్కువ కాలం నిలువలేదు. వర్ణరాహిత్య సంఘం ఏర్పడకపోగా పద్మనాయక, బలిజ, సాతాని, దాసరి లాంటి నూతన కులాలు ఏర్పడ్డాయి.

**1.2.2.2. అంటరానితనం :** బ్రిటిష్ పాలనకు ముందు గల కాలంలోని హైందవ సామాజిక వ్యవస్థ అనేక అణచివేత, అప్రజాస్వామిక లక్షణాలతో కూడి ఉంది. హైందవుల్లోని కొందరిని అంటరానివారిగా వెలివేయడమైంది. దేవాలయాల ప్రవేశం, బావులు, చెరువుల వాడకం వీరికి నిషేధమయ్యాయి. ఉన్నత కులాల వారు వీరిని తాకితేనే అపవిత్రమౌతారనే భావన, సామాజిక పీడనలో అత్యంత అమానుష ప్రక్రియగా ఏర్పడింది. చారిత్రకంగా అంటరానితనమనేది ఇండియా ఆర్య అక్రమణ సామాజిక ఫలితంగా ఏర్పడింది. సామాజిక పరిణామ ప్రక్రియగా, జయించబడ్డ స్థానిక జనాభాలోని కొంత భాగం ఆర్య సమాజంలో కలుపుకోవడం జరిగింది. ఇలా కలుపుకొన్న వారిలో బాగా వెనుకబడ్డ అసహ్యించుకొబడే విభాగం పారంపరిక అంటరాని కులంగా ఏర్పడినట్లుగా తెలుస్తుంది. ఆ విధంగా శతాబ్దాల తరబడి హైందవ సమాజంలో అంతరానితనం కొనసాగింది. బుద్ధుడు, రామానుజుడు, రామానందుడు, చైతన్యుడు, కబీర్, నానక్, తుకారం, మొదలగువారు ప్రారంభించిన ఉద్యమాలు కూడా ఈ అమానుష, ప్రాచీన అంటరానితన ఆచారాన్ని మార్చలేకపోయాయి. సంప్రదాయ, మత ముద్రలను వేసుకొని ఇది అనాగరిక ఉత్సాహంలో, శతాబ్దాల పర్యంతం కొనసాగుతూ వచ్చింది. హిందూ సమాజంలో వంశపారంపర్యంగా అస్పృశ్యులు పాకీపని, చర్మకార వృత్తి లాంటి అధమ వృత్తులను చేపట్టవలసి వచ్చింది. సామాజికంగా, చట్టపరంగా ఇతర వృత్తులు వీరికి నిషేధించడమైంది. విద్య నేర్చుకునేందుకు వీరు అనర్హులు. గ్రామం లేదా పట్టణంలో వీరు ప్రత్యేకించిన ప్రాంతాల్లోనే ఉండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ వ్యక్తిత్వం, విలువలపై అమానుస దాడి యధేచ్ఛగా జరిగేది. దళిత జాతుల్లో సామాజిక అంచెలున్నాయి. వీరిలో సామాజికంగా ఉన్నతులు, అధములనే వర్గాల వారు ఉన్నారు. ఇది సమస్యను జటిలం, క్లిష్టతరం చేసింది. ఇంకా అంటరానితన ప్రమాణం, ఇతర బలహీనతలు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వేరయ్యాయి. బ్రిటిష్ పాలనా కాలంలో ఇండియాలో అంటరానితనం తొలగింపుకు గొప్ప కృషి జరిగింది.

**1.2.2.3. మహిళల స్థితి :** బ్రిటిష్ పాలనకు ముందు గల భారతీయ సమాజంలో కొంత వరకు ఆర్యుల తొలియుగాన్ని మినహాయిస్తే స్త్రీ పురుషునికి లోబడి ఉండేది. చట్టం, మతం స్త్రీ, పురుషుల సమానత్వాన్ని గాని, సామన హక్కులను గాని గుర్తించలేదు. స్త్రీలకు లేని హక్కులు, స్వేచ్ఛలను నాటి సమాజం పురుషులకు అనుమతించింది. అయితే గతంలో బౌద్ధంలాంటి మత సంస్కరణోద్యమాలు, భారతీయ

స్త్రీల హోదాను పాక్షికంగా పెంచేందుకు కృషి చేయడం వాస్తవమే కాని బ్రిటిష్ యుగంలో మాత్రమే అనేక శతాబ్దాల తరబడి, స్త్రీలను బాధిస్తూ వచ్చిన సామాజిక, చట్టపరమైన అన్యాయాలను నిర్మూలించేందుకు పెద్ద పెద్ద ఉద్యమాలు నిర్వహించబడ్డాయి. భారత చరిత్రలో సారస్వత,కళా, తత్వ, పాలనా యుద్ధతంత్ర రంగాల్లో మహత్కార్యాలను సాధించిన గార్గి, చాంద్‌బీబీ, నూర్జహాన్, రజియా, ఝాన్సీ రాణి, మీరాబాయ్, అహల్యా బాయ్ లాంటి ప్రసిద్ధికెక్కిన స్త్రీలు లేకపోలేదు. కాని ఈ మహిళలు సమాజంలోని పాలక, స్వాధికార వర్గానికి చెందడం చేత సాధారణ సామాన్య స్త్రీలలాగా సామాజిక అణచివేతకు గురి కావటం కాని, వ్యక్తిగత అభివృద్ధికి అవసరమైన స్వేచ్ఛను గాని, అవకాశాన్ని గాని కోల్పోలేదు.

## 1.2.3. మహమ్మదీయులు :

ఎడారి ప్రాంతమైన అరేబియాలో మహమ్మద్ ప్రవక్త ఇస్లాం మతాన్ని స్థాపించాడు. ఈ మత అనుయాయులను మహమ్మదీయులంటారు. భారతదేశంలోని మహమ్మదీయులలో విదేశీ ముస్లింలు, భారతీయ ముస్లింలు అను రెండు ప్రధాన వర్గాలు కలవు.

**1.2.3.1. విదేశీ మహమ్మదీయులు :** భారతదేశంలో ఇస్లాంను అరబ్బులు ప్రవేశపెట్టారు. వీరి తరువాత తురుష్కులు, మంగోలులు, ఆఫ్ఘనులు, పర్షియన్లు, అబిసీనియన్లు, ఉజ్‌బేగ్‌లు, మొగలాయిలు భారతీయులతో కలసి నివసించారు. వీరికి జాత్యాధిక్యతలో నమ్మకముంది. కీలకపదవులన్నీ వీరే వశపరచుకొన్నారు. భారతదేశంపై దండెత్తి వచ్చిన మంగోలులు ఓటమి పొంది ఇస్లాం మతం స్వీకరించి భారతదేశంలో స్థిరపడ్డారు.

**1.2.3.2. భారతీయ మహమ్మదీయులు :** భారతీయ మహ్మదీయులలో అధికపన్నులను తప్పించుకొనే నిమిత్తం ఇస్లాం స్వీకరించిన వారు, యుద్ధంలో పరాజయం చెంది ఇస్లాంలోనికి మార్చబడిన శత్రువులు, సాంఘిక ఉచ్ఛ స్థితిని కోరిన హిందూమతంలోని అట్టడుగు వర్గాలవారు, అధికారుల అభిమానం కోరిన హిందువులుండేవారు. చాలా కాలం వరకు భారతీయ ముస్లింలు హిందూ, ముస్లిం వర్గాలు రెండింటికి చెందక ప్రత్యేక వర్గంగానే ఉండిరి. ధనం, అధికారం గల పాలక వర్గం వీరిని తమతో సమానంగా భావించడానికి ఇష్టపడలేదు. పదమూడో శతాబ్దం మధ్యలో విదేశీ, దేశీయ ముస్లింలు అధికారం కోసం కలహించేవారు.

**1.2.3.3. ముస్లింలలోని వర్గాలు :** ముస్లింలను ఆర్థిక స్థితిననుసరించి ఉమారా, ఉలేమాలు, సూఫీలు, బానిసలు అనే నాల్గు వర్గాలుగా విభజించవచ్చు.

**1.2.3.3.1. ఉమారా :** సమాజంలో ఉన్నత స్థితిని, పలుకుబడిని, పరిపాలనా వ్యవస్థలో ప్రముఖస్థానాన్ని కలిగిన ఉమారా వర్గం సుల్తాన్ ఆంతరంగిక వర్గం. వీరు స్వంత ఆస్తులను కలిగి ఉండి, బలహీనులయిన సుల్తానులపై అధికారం చేసేవారు. సుల్తాను ఎన్నిక నుంచి పరిపాలనలోని ప్రతి చిన్న అంశం వరకు వీరు ప్రముఖ పాత్ర వహించేవారు. ప్రతి సుల్తాన్ మారినపుడు, ప్రతి వంశం మారినప్పుడు ఉమారాలో మార్పులు వచ్చేవి. ఈ హోదాలోకి తరచు కొత్తవారు ప్రవేశించేవారు. వీరిని బదిలీ చేయడానికి, బర్తరఫ్ చేయడానికి సుల్తానుకు అధికారం ఉండేది. అమీర్, మాలిక్ ఖాన్, వజీరు హోదాలలో గల వీరు కొందరు రాజ కుటుంబానికి చెందగా, ఇతరులు సుల్తాన్ ఆంతరంగికులు మాత్రమే. ఈ ఉమారా వర్గాన్ని సుల్తానులే తమ రాజ్య పటిష్టత కోసం నిర్మించారు.

**1.2.3.3.2. ఉలేమాలు :** ఉలేమాలు మతాధిపతులు గాను, న్యాయాధికారులు గాను, ఉపాధ్యాయులుగాను ముస్లిం సంఘంపై అమితమైన అధికారం కలిగి ఉండేవారు. ఇస్లాం మత విషయాలపై పాండిత్యం గల వీరు వివాదాస్పద విషయాలలో 'ఫట్వా'లు జారీ చేసేవారు. వీరు కొన్ని మదరసాలను ప్రారంభించారు. ఉలేమాలను ఇమామ్‌లని, ముఫ్తీలని, కాజీలని వ్యవహరించేవారు. ఇంకా కొందరు మత ప్రచారానికే అంకితమైనవారు. ఇది వారసత్వాన్ని బట్టి గాక స్వశక్తిని బట్టి లభించేది. వీరి సలహాలను సుల్తాన్ పొందటం అతడి కర్తవ్యమని వీరు భావించసాగారు. పాలనా విషయాలలో వీరు నిష్ణాతులు కాకపోయినా ఒకరిద్దరు సుల్తానులు తప్ప మిగిలినవారు వీరిని కాదనలేకపోయారు.

**1.2.3.3.3. సూఫీలు :** సూఫీలు పూర్తిగా మతానికి, మత ప్రచారానికి అంకితమైన వర్గం, నగర జీవనానికి దూరంగా ఉండి పేదరికాన్ని స్వచ్ఛందంగా స్వీకరించి, తృప్తితో సమానత్వం బోధించిన ఛిష్టీ, సుహ్రావర్దీ, క్వాద్రీ, నక్షబంది శాఖలు సమాజంలో అందరి గౌరవం పొందారు.

**1.2.3.3.4.** బానిసలు : ఇస్లాం సమాజంలో అతి పేద వర్గానికి చెందిన వారు బానిసలు. వీరు సుల్తానుల కొలువులోనూ, ధనికుల ఇండ్లలోనూ ఉండేవారు, తమ శక్తిని బట్టి, అవకాశాలను బట్టి వారు ఉన్నత పదవులను అధిష్టించారు. తరుష్కులతో బాటు అధిక సంఖ్యలో అబిసీనియా బానిసలు భారతదేశంలో స్థిరపడ్డారు. ఈ బానిసలలో హిందూ ముస్లిం తేడాలుగాని, స్త్రీ పురుష విచక్షణగాని లేదు. ముస్లిం స్త్రీలను రాజపుత్రులు, హిందూ స్త్రీలను ముస్లింలు బానిసలుగా మార్చినట్లు తెలుస్తున్నది. ఫిరోజ్‌షా తుగ్లక్ బానిసల అభివృద్ధి కోసం కృషి చేశాడు.

## 1.2.4. సారాంశం :

బ్రిటిష్ పాలన ప్రారంభానికి ముందు భారత సమాజంలో ప్రధానంగా హిందువులు, ముస్లింలు అను రెండు వర్గాల వారుండేవారు. ఈ రెండు వర్గాలలోని ఉన్నత తరగతి ఆర్థిక స్తోమత గల వారు భోగభాగ్యాలతో తులతూగుతూ ఉండగా జనాభాలో అత్యధికులైన అధమతరగతి వారు అతి సామాన్యజీవితం గడిపేవారు. హిందువులలో సాంఘికమైన కొత్త తెగలు పుట్టినాయి. విదేశీ ముస్లింలు భారత ముస్లింలను హీనంగా చూసేవారు. హిందువులలో అంటరానితనం ప్రబలంగా వుంది. హిందూ సమాజంలో సతీసహగమనం, బాల్య వివాహాలు, వరకట్నం మొదలగు దురాచారాలు కొనసాగుతాయి. ముస్లింలననుసరించి హిందువులలో కూడా బహుభార్యత్వం ప్రబలిపోయింది. కాని మహారాష్ట్రులు, జాట్‌లు, శిక్కులు స్త్రీలకు పునర్వివాహానికి హక్కునిచ్చినారు. హిందువులు, ముస్లింలు పండుగలను కలిసి కట్టుగాను, వేరువేరుగాను చేసుకొనేవారు. ఏనుగులు, పులులు, చిరుతపులుల, పందేలు, పావురాలను ఎగరవేయటం మొదలైనవి ఆటల వినోదాలు. సమాజంలో స్త్రీకి గౌరవ స్థానం లేదు. కాని రాజపుత్రులలో, మొగల్ రాజవంశంలో స్త్రీలు గౌరవస్థానాన్ని పోగొట్టుకోలేదు.

## 1.2.5. నమూనా ప్రశ్నలు :

1. బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశంలో సామాజిక పరిస్థితులను వివరింపుము
2. క్రీ.శ. 17వ శతాబ్ది నాటికి భారతదేశంలోని కులాలు, ఉపకులాల గురించి చర్చింపుము

## 1.2.6. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Dutta | : | A Social History of Modern India |
| 2. | B.N. Chopra, B.N. Puri, M.N. Das | : | A Social, Cultural and Economic History of India |
| 3. | A.L. Srivastava | : | Medieval Indian Culture |
| 4. | Iswari Prasad | : | A Short History of Muslim Rule in India |
| 5. | K.M. Ashrat | : | Social and Economic Conditions in Medieval India |
| 6. | Lanepoole, Stanely | : | Medieval India under Muhammedan Rule |
| 7. | S.C. Raychoudhari | : | Social, Cultural and Economic History of India |
| 8. | Tarachand | : | Influence of Islam on Indian Culture |


డా॥ వి.కె. మోహన్

పాఠం - 1.3

# బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి హిందూ-ముస్లిం సంబంధాలు

## 1.3.0. లక్ష్యం :

బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి హిందూ-ముస్లిం సంబంధాలను గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం

## విషయసూచిక :


1.3.1. పరిచయం

1.3.2. వివాదాస్పద అంశాలు

1.3.3. సాన్నిహిత్యం నెలకొల్పే యత్నాలు

1.3.4. పరస్పర ప్రభావం

1.3.4.1. వర్గ విభేదాలు

1.3.4.2. దైనందిన జీవితం

1.3.4.3. ఆహార పానీయాలు

1.3.4.4. వస్త్ర ధారణ

1.3.4.5. అలంకరణ

1.3.4.6. గృహ నిర్మాణం

1.3.4.7. సభ్యతలు

1.3.4.8. విశ్వాసాలు

1.3.4.9. పండుగలు, వినోదాలు

1.3.4.10. స్త్రీలు

1.3.5. సారాంశము

1.3.6. నమూనా ప్రశ్నలు

1.3.7. చదువదగిన గ్రంథాలు

## 1.3.1. పరిచయం

తీవ్రమైన రాజకీయ వైరుధ్యాలున్నప్పటికీ హిందూ ముస్లిం సఖ్యత ఈ రెండు మతాల మధ్య అన్యోన్యమైన సంబంధం కొనసాగడం అనేది బ్రిటిష్ పలనా కాలం ముందునాటి ఒక ప్రముఖ లక్షణం. హిందూ ముస్లిం సఖ్యత ఫలితంగా ఏర్పడిన మేళన స్ఫూర్తి, పరస్పర సామరస్యాలు ఒక కొత్త మిశ్రమ, సమ్మిళిత సంస్కృతి ఆవిర్భావానికి దారి తీసాయి. ఈ సంస్కృతి పూర్తిగా పర్షియన్ లేదా భారతీయ సంస్కృతి కాదు. ఈ రెండు సంస్కృతుల ఉత్తమ గుణాల సమ్మేళనము. కళ, వాస్తు శాస్త్ర రంగాలలో భారతీయ, పర్షియన్ రీతులు సంతోషంగా కలగలిసి పోయాయి. షాజహాన్ నిర్మించిన కట్టడాల్లో దీని సర్వోత్కృష్టత వ్యక్తమైంది. అలాగే జహంగీర్ కాలంనాటి చిత్ర లేఖనం భారతీయ విదేశీ మెళకువలనూ, మేలుకలయికనూ ప్రదర్శిస్తుంది. నాటి సాహిత్యం కూడా ఈ రెండు సంస్కృతుల సమ్మేళనమే. పర్షియన్, అరబిక్ పదాల కలయికతో వివిధ భారతీయ భాషల పదజాలం సుసంపన్నమైంది. అక్బర్ అనుసరించిన మత సహన విధానంలో మత పరమైన సమ్మేళనం వ్యక్తమైంది. కుల పరమైన, జాతి పరమైన ఆంక్షలు లేని మతాన్ని అక్బర్ అందించాడు. హిందూ ముస్లింల మధ్య ఉన్న సామాజిక సాన్నిహిత్యం వల్ల వస్త్రధారణ, ఆహారం, మర్యాద, జీవన విధానం, పండుగలు, ఉత్సవాలు వంటి వాటి విషయంలో హిందూ ముస్లిం సమ్మేళనం చోటు చేసుకుంది. ఢిల్లీ సుల్తానుల పాలన మలిదశలో ప్రారంభమైన సామరస్య సమ్మేళనాలు మొగలుల కాలంలో కొనసాగి బ్రిటిష్ పాలన ప్రారంభం నాటికి అత్యున్నత దశకు చేరుకొన్నాయి.

## 1.3.2. వివాదాస్పద అంశాలు :

బ్రిటిష్ పాలనా కాలానికి ముందు భారతదేశంలో హిందూ ముస్లిం సంబంధాలను రెండు తరగతులుగా విభజించి పరిశీలించాలి. అవి: 1. హిందువులకు, ముస్లింలకు గల వివాదాస్పద అంశాలు, 2. వాటిని తగ్గించడానికి జరిగిన ప్రయత్నాలు.

హిందువులనుసరించే కుల విధానము, విగ్రహారాధన, బహుదేవతారాధన, సంగీత నృత్య కార్యక్రమాలను ఇస్లాం పవిత్ర గ్రంథమైన ఖురాన్ నిషేధించింది. అందువల్ల ముస్లింలు ఈ పద్ధతులకు వ్యతిరేకంగా పోరాడసాగారు. తమ దేశంలోనే తమను ద్వితీయ తరగతి పౌరులుగా చూడడం హిందువులు సహించలేకపోయారు. దేవాలయాలను ధ్వంసం చేయడం, జిజియా పన్ను విధించడం, గుర్రపుస్వారీ నిషేధం, ఆయుధాలు ధరించకుండా ఉండడం వంటి నిబంధనలను హిందువులు వ్యతిరేకించారు. ఉన్నత పదవులకు అనర్హులుగా చేయడాన్ని కూడా హిందువులు నిరసించారు. విశాల భావాలు గల కొద్ది మంది పాలకులు మాత్రం ఈ వివక్షత పాటించలేదు. హిందువులు ముస్లింలను మ్లేచ్ఛులని పిలిచారు. ముస్లింలు శుభ్రతను పాటించరని, గొడ్డు మాంసం భుజిస్తారని, విడాకులు తేలికగా పొందుతారని వారిని హిందువులు హీనంగా చేసేవారు.

## 1.3.3. సాన్నిహిత్యం నెలకొల్పే యత్నాలు :

తమలో తాము కలహించుకొన్న సందర్భాలలో ముస్లిం పాలకులు హిందువుల సహాయ సహకారాలు పొందారు. వీరి ప్రభావం ముస్లిం పాలకులపై ప్రసరించింది. హిందువులను ఆదరించడమేగాక పారశీకం నేర్చిన వారిని ఉద్యోగాలలో నియమించారు. హిందూ పండితులను, కవులను, కళాకారులను పోషించారు. ముస్లింలు హిందూ పాలకుల వద్ద, హిందువులు ముస్లిం పాలకుల వద్ద సైనికులుగా చేరడంతో, కలిసి పనిచేయడం వల్ల వైరుధ్యం సడలింది. కొత్తగా ఇస్లాంలోకి మారినవారు హిందూ ముస్లిం సాన్నిహిత్యానికి వారధులయ్యారు. వీరు ఉభయ మతాల మిత్రులతో కలసి పండుగలు జరుపుతూ జీవించసాగారు. రాజకీయ ప్రయోజనాలు ఆశించి హిందూ ముస్లిం వివాహాలు జరిగినా హిందూ స్త్రీలు ముస్లిం పాలకులలో మార్పుకు కారకులయ్యారు. భక్తి ఉద్యమకారులు హిందూ ముస్లిం సమానత్వాన్ని చాటారు. సంఘంపై వీరి ప్రభావం ఎక్కువగా ఉండేది.

## 1.3.4. పరస్పర ప్రభావం :

హిందూ ముస్లిం పరస్పర ప్రభావం వల్ల భారత సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. హిందువుల ఆడంబర జీవిత విధానానికి ముస్లింలు ఆకర్షితులయ్యారు. ధనికవర్గానికి చెందిన ముస్లింలు ఖురాన్ సూత్రాలను ఉల్లంఘించి విలువైన వస్తువులను, అనేక

రకాల నగలను ధరించడం ఆరంభించారు. సుగంధ ద్రవ్యాలను ఉపయోగించడం, తాంబూలం వాడటం ప్రారంభించారు. తాము ఉపయోగించే ఏనుగులను, గుర్రాలను కూడా పట్టు వస్త్రాలతో, నగలతో అలంకరిస్తూ ఉండేవారు. ఆయుధాల పిడులను బంగారపు నగిషీలతో, విలువయిన రాళ్ళతో తయారు చేయించేవారు. మంచాలు, కుర్చీలు, బల్లలు దంతాలతో తయారు చేయించేవారు. హిందువుల వలె ముస్లింలు కూడా మంచి రోజులను, పండుగరోజులను పాటించేవారు. హోలీ, దీపావళి వంటి పండుగలను ఇరువురు కలిసి జరుపుకొనేవారు. శివరాత్రిని అనుకరించి షబీ-బారాత్, జగన్నాథ రథయాత్ర నుంచి మొహరంలో తజియాలు వచ్చాయి. యుద్ధ విజయం తరువాత రాజధానిలో జరిగే ఉత్సవాలలో ఇరువురు పాల్గొనేవారు. సంగీతం, వాస్తు, చిత్రలేఖనాలపై ఒకరి ప్రభావం మరొకరిపై ప్రసరించింది. విద్యా సారస్వత విషయాలలో సమన్వయం కారణంగా నూతనంగా ఉర్దు భాష జనించింది. హిందువులలో భోజన అలవాట్లలో, దుస్తుల విషయంలో మార్పు వచ్చింది. కుల వ్యవస్థలోని పటిష్టత తగ్గింది. హిందువుల సాంఘిక దృక్పథం, కుల తత్వాన్ని పాటించడం వల్ల సంకుచితం కాగా, ఇస్లాం సాంఘిక సమానత్వాన్ని చాటి విశాలమైనది.

**1.3.4.1. వర్గ విభేదాలు :** హిందూ సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అను నాల్గు వర్ణాలు ఏర్పడినట్లే, ముస్లింలు నాల్గు వర్గాలుగా ఏర్పడి పరస్పరం కలహించుకోసాగారు. సయ్యదులు, షేక్‌లు, మొగలులు, పఠానులు అనేవి ముస్లింలోని నాల్గు శాఖలు, సయ్యదులు మహమ్మద్ ప్రవక్త కుమార్తె ఫాతిమా సంతతివారు. షేక్‌లు స్వచ్ఛమైన అరబ్బులు. ఈ జాతికి చెందినవారమని భారతీయ ముస్లింలు భావించేవారు. మొగలులు మంగోల్ జాతికి చెందిన వారు. పర్షియా నుంచి వచ్చిన షియాలే పఠానులు. పఠానులలో ఎక్కువగా పండితులు, కవులు, వైద్యులు, న్యాయవాదులుండేవారు.

**1.3.4.2. దైనందిన జీవితం :** భారత సమాజంలోని హిందూ ముస్లింలలో ఉన్నత వర్గం వారు అత్యంత ఆడంబరమైన సుఖజీవనం గడిపారు. అధమ వర్గానికి చెందిన సామాన్య ప్రజలు సామాన్య జీవన ప్రమాణాన్ని అనుసరించారు. వీరి మీద పన్నుల భారమధికం. ఈ రెండు వర్గాల జీవన ప్రమాణ భేదాన్ని చూసిన విదేశీ యాత్రికులు ఆశ్చర్యచకితులై తమ రచనల్లో పొందుపరచారు. సమకాలిక ఆధారాలన్నీ ఉన్నత వర్గాల వారి జీవన విధానాన్ని మాత్రమే వర్ణించాయి. ఈ కాలంలో మధ్యతరగతి వారు లేరని బెర్నియర్ పేర్కొన్నా ప్రభుత్వ సేవలో గల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాయసగాండ్లు ఈ వర్గానికి చెందినవారే.

**1.3.4.3. ఆహార పానీయాలు :** హిందువులు స్నానం చేసి శుచిగా వంట చేసుకొనేవారని, ఒకసారి వాడిన మట్టి పాత్రలను తిరిగి వాడేవారు కాదని, మౌనంగా, ఏకాంతంగా భోజన కార్యక్రమాన్ని ముగించేవారని ఆల్‌బెరూనీ పేర్కొన్నారు. ఆవు, ఎద్దు, గుర్రం మొదలైన వాటి మాసం హిందువులకు నిషిద్ధమైనవిగా కూడా ఆల్‌బెరూనీ పేర్కొన్నారు. హిందువులు అన్ని రకాల ధాన్యాలు, పప్పులు, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, పాలు, నూనెలు భోజనంలో వాడేవారు. హిందువులు ఎక్కువగా అన్నంతో బాటు కిచిడి, చపాతీలను వాడగా ముస్లింలు రొట్టె, పలావు, మాంసం ఇష్టపడేవారు. ముస్లింలు ఎక్కువగా స్థిరపడిన నగరాలలో భోజనశాలలు అధికమయ్యాయి. దీని ఫలితంగా ఏకాంతంగా భుజించే హిందూ అలవాట్లలో కూడా మార్పు వచ్చింది. 16, 17 శతాబ్దాలలో విందు సమావేశాలు సరస సంభాషణల మధ్య జరిగేవి. భోజన పదార్థాల సంఖ్య హెచ్చింది. మధ్య ఆసియా నుండి అనేక రకాల పండ్లను దిగుమతి చేసుకోసాగారు. పాలక వర్గీయులందరు హిందూ ముస్లిం తేడా లేక మత్తు పానీయాలు సేవించేవారు.

**1.3.4.4. వస్త్రధారణ :** ఆనాటి ప్రజల వస్త్రధారణ వర్గ భేదాన్ని బట్టి, ప్రాంతీయ భేదాలననుసరించి మారుతుండేవి. ఐశ్వర్య జీవనానికి, ఆడంబరతకు ప్రతిగా వాటి వర్ణన నాటి సాహిత్యంలో కన్పిస్తుంది. మేలైన నూలు, పట్టు, ఊలు వస్త్రాలను వాడేవారు. హిందూ పురుషులు ధోవతులను, పైన ఉత్తరీయాన్ని తలపై పాగా ధరించేవారు. ఉద్యోగులు, ఉన్నత వర్గీయులు ముస్లిం సర్దారులను అనుకరించారు. ముస్లిం పాలన ప్రారంభమయిన తరువాత హిందూ ఉన్నత వర్గం ధోవతులపై అంగీలను ధరించేవారని, ముస్లింలలాగా బిగుతు, వదులు ప్యాంటులు వీరు ధరించేవారని మెడోస్ టైలర్ పేర్కొన్నాడు. హిందువులు తెల్లటి బట్టలు ఇష్టపడేవారని బదౌనీ, ఇబన్ బతూతాలు తెలిపారు. ప్రభుత్వ ఖార్ఖానాలలో అన్ని రంగుల బట్టలు తయారయ్యేవని, వీటిని బజారులలో అమ్మేవారని అఫీఫ్ వ్రాసాడు. ముస్లిం సర్దారులు కుళ్లాలను, టోపీలను, సల్వారులను వాడేవారు. ఉన్నత వర్గం వారు పట్టు, వెల్వెట్, వదులైన వెచ్చని కోటును, మెత్తని 'ఫర్' కోటును వాడేవారు. ఉలేమాలు తలపాగా, గౌను వాడేవారు. సంప్రదాయాన్ని పాటించేవారు. కుట్లు లేని వస్త్రాలను వాడేవారు.

హిందూ ముస్లిం స్త్రీలు కాంతివంతమైన ముదురు రంగులను ఇష్టపడేవారు. స్త్రీలు చీరవంటి పొడవు ఛాదర్‌ను, పొట్టి చేతుల చోళీలను గాని, లహంగ అనే పొడవాటి వదులు పావడాను, చోళీలుగాని వాడేవారు. తలలకు పొడవైన తలగుడ్డను ధరించేవారు. దక్షిణ భారత తీర ప్రాంతంలో నూలుతో నేసిన సన్నని బట్టలు ప్రశస్తమైనవని, సాలె పురుగు దారం నేసినంత సన్నగా సున్నితంగా ఉన్నవని,రాజ కుటుంబం వారు తమ ఠీవికి అనుగుణంగా ధరించడానికి అవి తగినవని మార్కోపోలో పేర్కొన్నాడు. విజయనగర పాలకులు బంగారు డిజైన్లు కుట్టిన సున్నిత పట్టు వస్త్రాలను సభ తీర్చినపుడు ధరించే వారనీ, దసరా లాంటి ఉత్సవాల్లో తెల్లటి వస్త్రధారణ చేసే వారని న్యూనిజ్ వ్రాసాడు. సామాన్య ప్రజలు నూలు లేదా పట్టుతో చిన్న చొక్కాలను ధరించి, దానిపైన నడుమును మరో వస్త్రంతో బిగించుకునేవారని వార్థిమా తెలిపాడు. పట్టు లేక నూలుతో చేసిన తలపాగాలు రాజులు, సామాన్యులు ధరించేవారు.

**1.3.4.5. అలంకరణ :** స్త్రీ పురుషులిరువురూ అలంకరణపై మక్కువ చూపారు. వారు వాడిన నగలు, అలంకరణ రీతులు, కేశాలంకరణ ఆనాటి శిల్పాలలో కన్పిస్తుంది. సమకాలీన సాహిత్యంలో కూడా ఈ వివరాలు గలవు. దేశమంతటా పూలతోటలు విరివిగా పెంచబడ్డాయి. స్త్రీలు ఉపయోగించే వివధ ఆభరణాలను గురించి అబుల్ ఫజల్ పేర్కొన్నాడు. ఆ పట్టికలో 37 రకాల నగలున్నాయి. అందులో 16 రకాల నగలు గౌరవ కుటుంబాలకు చెందిన స్త్రీలు తప్పక వాడవలసి వుంటుందని అతడు తెలిపాడు.

**1.3.4.6. గృహ నిర్మాణం :** ఆనాటి గృహాలు రాజ ప్రసాదాలను పోలి ఉండేవని బార్బోసా తెలిపాడు. ముస్లింల రాకతో గృహ నిర్మాణంలో మార్పులొచ్చాయి. ముస్లిం వాస్తు లక్షణాలగు విశాలత్వం, అర్ధ చంద్రాకారం, పెద్ద వాకిలి గృహనిర్మాణంలో ప్రవేశించాయి. అంతేగాక కట్టడాలను రంగులతో, వివిధమైన గీతలతో డిజైన్లు ఏర్పడునట్లు అలంకరించుకొనే పద్ధతి దేశంలో ప్రవేశించింది. ఉన్నత వర్గాల వారి గృహాలలో అలంకరణ సామాగ్రి, విలువగల లోహాలు, కొయ్య సామాన్లు అధిక సంఖ్యలో ఉండేవి.

**1.3.4.7. సభ్యతలు :** ఆనాటి ప్రజలు ఒకరిని ఒకరు కలుసుకొన్నప్పుడు పాటించే సభ్యతలను సాహిత్యాధారాలు తెలుపుతున్నాయి. తెలిసిన వ్యక్తులు కలిసిన వెంటనే కౌగలించుకొనేవారు. కొత్త వారిని పరిచయం చేసుకొనేటప్పుడు వ్యక్తి తన తండ్రిపేరు మొదట తెలిపేవాడు. హిందువులు మాట్లాడేటపుడు అవతలివారి చేతులను పట్టుకొని మాట్లాడేవారని, ఒకరి ఇంట్లో ప్రవేశించేటప్పుడు అనుమతి తీసుకొనే వారు కాదని, అయితే అచట నుండి వచ్చేటపుడు అనుమతి పొందేవారని ఆల్‌బెరూని పేర్కొన్నాడు. పండుగలు, వినోదాలలో సాంఘిక మర్యాదలు పాటించేవారు. పాలకులను దర్శించేటప్పుడు ప్రజలు కానుకలతో వెళ్లేవారు. తలవంచి నమస్కరించి మాట్లాడేవారు. హిందూ ముస్లిం పాలకులు ఇరువురు కూడా తమ పాదాలను తాకటానికి అంగీకరించటం ప్రత్యేక ఆదరణగా భావించడం జరిగేది.

**1.3.4.8. విశ్వాసాలు :** హిందూ ప్రజలు వ్రతాలనాచరిస్తూ, పుణ్య దినాలలో ఉపవాసాలుండేవారు. కొందరు పాలకులు మృత్యు సమయం వరకు ఉపవాసం చేసినట్లు ఆధారాలు తెల్పుతున్నాయి. ప్రజలకు శకునాలు, దృష్టి, కలల పట్ల నమ్మకమున్నట్లు ఆల్‌బెరూనీ, ఆబూజైద్‌లు పేర్కొన్నారు. జ్యోతిష్కులకు ఎక్కువ ఆదరణ ఉండేది. శుచి, శుభ్రతలను అన్వయించటంలో ఇతరుల కష్టాలను గమనించలేదు. హిందువులు సముద్రయానం చేయుట నేరమని భావించేవారు. దీని వల్ల కులమును, జాతి స్వచ్ఛతను కోల్పోయినట్లు భావించేవారు. దీని వల్ల వర్తక వ్యాపారాలకు విదేశీ వర్తకులపై ఆధారపడవలసిన అవసరమేర్పడింది. తీర్ధ యాత్రలలో హిందువులకు నమ్మకం ఉండేది. యాత్రా స్థలాలలో మరణించవలెననే ఉద్దేశ్యంతో ప్రయాగ, వారణాసి, మధుర, ఉజ్జయిని వంటి ప్రదేశాలలో ఆత్మహత్యలు జరిగేవి. జంతుబలులపై ప్రజలకు నమ్మకం ఉండేది. దసరా రోజులలో ప్రత్యేక ప్రయోజనాలనాశించి ఇవి జరిగేవి. హిందువులు అస్పృశ్యత పాటిస్తున్నట్లు స్మృతులు పేర్కొంటున్నాయి. చండాలురను తాకినా, వారితో ఒక చోట నివసించినా, వారితో భుజించినా, మాట్లాడినా, నీరు తెచ్చుకొన్నా పాటించవలసిన వివిధ ప్రాయశ్చిత్తాలు 'పరాశర మాధవం'లో పేర్కొనబడింది. వివాహ వ్యవస్థలో బాల్య వివాహాలు, బహుభార్యత్వం అంగీకరించబడ్డాయి.

**1.3.4.9. పండుగలు, వినోదాలు :** హిందువులు, ముస్లింలు సాంఘిక పరమైన, మత సంబంధమైన పండుగలు అనేకం జరుపుతుండేవారు. ఇవి ఎల్లప్పుడూ పెద్ద ఎత్తున సంబరంగా జరగడం వల్ల సామాన్య ప్రజలకు ఆనందదాయకాలై వుండేవి. శాఖలు, కొత్త మతాలు విభిన్న పండగలకు దారితీసినవేగాని పండుగల వ్యతిరేక పోరాటానికి దారి తీయలేదు. హోలి, రామలీల, దసరా, దీపావళి

పండుగలలో ముస్లింలు సహితం పాల్గొనేవారు. రాఖీ పండుగను కుల మత భేదాలకతీతంగా అందరూ జరుపుకొనేవారు. కొండవీడులో ప్రతి సంవత్సరం వసంతోత్సవం జరిపేవారు. ఆ సందర్భంలో సంగీత విద్వాంసులను, కళాకారులను, కవులను, పండితులను సత్కరించేవారు. విజయనగరంలో దసరా వేడుకలు తొమ్మిది రోజులు జరిగేవి. రంజాన్, బక్రీద్, ఈద్ ప్రార్థనలు, మిలాడినాబి, నౌరోజ్ వంటి ముస్లిం పండుగలు భారతీయ పరిస్థితులలో పండుగ వైభవం పొందాయి. మొహరం ఉత్సవం వైభవంగా జరిగేది. ఈ సందర్భంగా ఊరేగింపులు సాగేవి. షాజహాన్ ఈద్ పండుగను ఉత్సాహంతో జరిపేవాడని, దానాలనేకం చేసేవాడని ఆధారాలున్నాయి. రంజాన్ ఉపవాసానంతరం జరిగే ఈద్ ఉత్సవాలలో ప్రార్థనలు చేయడం, బాణాసంచా కాల్చటం, శుభాకాంక్షలు తెలుపుకోవడం, ఈద్గ వద్ద సామూహిక ప్రార్థనలు చేయడం చేసేవారు. బక్రీద్ పండుగనాడు పాదుషాలు స్వయంగా ఈద్గ వద్దకు వెళ్ళి జంతువులను బలి ఇచ్చేవారు. నౌరోజ్ పండుగ సందర్భంలో నగరాలన్నీ అలంకరించబడేవి. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. ప్రభుత్వ టంకశాల నుంచి వచ్చే ప్రత్యేక నాణేలు పేదలకు పంచుతారు. రాజ ప్రాసాదంలో అలంకరించబడిన గుర్రాలు, ఏనుగులు ప్రదర్శింపబడేవి. ప్రవక్త స్వర్గానికి చేరిన నాటి రాత్రి ఉపవాసంతో బాటు ఖురాన్ పఠనం, ప్రార్థనలతో పాటు దీపాలంకరణ, బాణా సంచా పేల్చడం ఉండేవి. ఈ విధంగా ముస్లిం పండుగలపై శివరాత్రి, దీపావళిల ప్రభావం ప్రసరించింది.

బల ప్రదర్శనలు, ఇంటి ఆవరణకు పరిమితమైన ఆటలు, ప్రజలందరూ కలసి ఏర్పరచుకొనే సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నాటి ప్రజల వినోదాలు. బల ప్రదర్శనలో కుస్తీలు, గుర్రపు పందేలు, కత్తి సాము, ఈత పోటీ, వేట, ఆయుధాలు విసరుట మొదలగునవి ఉండేవి. వీటిలో గెలుపొందిన వారిని సత్కరించేవారు. ముస్లింల రాకతో భారతదేశంలో 'పోలో' ఆట ప్రవేశించింది. ఆఫ్ఘనులు మొగలులు దీనిని ఆదరించారు. ఇంటి ఆవరణకు పరిమితమయిన ఆటలలో పాచికలు, చదరంగం, కందుక క్రీడ, జంతువులను లేదా పక్షులను మచ్చిక చేయటం ముఖ్యమైనవి. నాలుగు రంగుల పావులతో నలుగురు ఆడే చౌపర్, రెండు జట్లుగా ఏర్పడి 24 చతురస్రాలు గీచిన కొయ్యపై ఆడే నార్డ్ అను ఆటల ప్రసక్తి గ్రంథాలలో కలవు. బాబర్ ప్రవేశపెట్టిన ప్రజాదరణ పొందిన ఆట పేక ముక్కల ఆట. ప్రజలందరూ కలసి వినోదించే విషయాలలో పేర్కొనవలసినవి సాహితీ వేదాంత చర్చలు, నృత్యసంగీతాలు. మాటలను మార్పు చేస్తూ ఆడే ఆట, గూఢార్థంగా ప్రశ్నించే సాహిత్య సంభాషణ, ఉన్నత వర్గీయులకు చెందినది. సామాన్య ప్రజల వినోదాలలో జానపద సంగీతం, జానపద నృత్యం, వీరగాథలు, గారడీ విద్యలు, తోలుబొమ్మలాటలు, నాటికలు పేర్కొనదగ్గవి. పండుగలు, వినోదాలు హిందూ, ముస్లిలిరువురికి ఆనంద సమయాలు. హోలి వంటి పండుగలలో ఇద్దరూ పాల్గొన్నప్పటికీ సాధారణంగా ఎవరి పండుగలను వారు తమ ఆర్థికస్థితిని బట్టి చేసుకొనేవారు. వినోద కార్యక్రమాలలో కుల భేదాలను బట్టి గాక ఆర్థిక తేడాలననుసరించి ఆనందించేవారు.

**1.3.4.10. స్త్రీలు :** బ్రిటిష్ పాలనకు ముందుగల భారత సంఘాన్ని పరిశీలిస్తే మూడు వర్గాల స్త్రీలు కన్పిస్తారు. వారు ఉన్నత వర్గ స్త్రీలు, సామాన్య స్త్రీలు, భోగ్య స్త్రీలు. వీరి సాంఘిక, ఆర్థిక స్థితిని బట్టి సమస్యల స్వరూపం మారుతూ ఉండేది.

రాజ కుటుంబాలకు చెందినవారు ఉన్నత వర్గ స్త్రీలు. వీరు కుటుంబ గౌరవానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చినారు. వీరి వివాహాలు ఎక్కువగా రాజకీయ ప్రయోజనాలు ఆశించి జరిగాయి. బహు భార్యత్వం ఎక్కువగా పాటించబడినా, భార్యలకు ప్రత్యేక హక్కులుండేవి. ఈ తరగతి స్త్రీలు సాహిత్య, లలిత కళలను అభ్యసించేవారు. ముస్లిం పాలనలో గుల్బదన్ బేగం, జహానారా, సలీమా సుల్తానా, జబున్నిసా, మీరాబాయి సాహిత్య ప్రక్రియలలో నేర్పు కలవారు. పరిపాలనలో పాల్గొన్న వారు, యుద్ధాలు చేసిన స్త్రీలూ ఉన్నారు. కాశ్మీరు రాణి దిడ్డ రాజ్య విషయాలలో జోక్యం చేసుకొంది. చాంద్ బీబీ, దుర్గావతి, తారాబాయి, నూర్జహాన్ చరిత్ర ప్రసిద్ధికెక్కినవారు.

సామన్య స్త్రీలు కులాచారాలను పాటిస్తూ, దైనందిన జీవితం గడిపేవారు. వీరి సమస్యలు కేవలం కుటుంబ సమస్యలే. బాల్య వివాహాలు జరిగేవి, విద్యావకాశాలు తక్కువ. కుటుంబ సాంప్రదాయాలను పాటిస్తూ, వ్రతాలూ ఉపవాసాలు చేస్తుండేవారు. పండుగలు జరిపేవారు. భర్త మరణానంతరం స్త్రీ తన సౌభాగ్య చిహ్నాలను కోల్పోవటమేగాక అశుభ సూచికంగా పరిగణింపబడేది. వీరు తండ్రులో, సోదరులో, లేక కొడుకుల వద్ద జీవితం గడిపేవారు. పునర్వివాహానికి నాటి శాస్త్రకారులందరూ వ్యతిరేకులే. స్త్రీ ఆస్తి హక్కును గురించిన వివరాలు గలవు. మొదట వారసులు లేక ఏ వ్యక్తి అయినా మరణిస్తే ఆ ఇంటిలో స్త్రీ ధనం తప్ప, ఇతర స్థిరాస్తులన్నీ ప్రభుత్వ పరమయ్యేవి.

కాల క్రమాన ఈ పద్ధతి మారింది. భర్తను కోల్పోయిన స్త్రీలకు వారి భర్తల ఆస్తి సంక్రమించ సాగింది. వారసత్వంగా, బహుమతిగా, వివాహశుల్కంగా విలువల గల ఆస్తిని స్త్రీకి పుట్టింటి వారుగాని, అత్తింటి వారు గాని ఇచ్చే పక్షంలో అది స్త్రీ ధనమవుతుంది. దీనిని బహుకరించడానికి, అమ్మడానికి స్త్రీకి సర్వహక్కులుంటాయి. ముస్లిం భర్తలు పొందినంత తేలికగా విడాకులను హిందువులు పొందలేరు. ఇస్లాం విధవా వివాహాలను ఆమోదించగా హిందూమతం దానిని గర్హించింది.

రాజ కుటుంబ స్త్రీల తరువాత భోగ్య స్త్రీల గురించిన సమగ్ర సమాచారం లభ్యమవుతున్నది. వీరిని వేశ్యలు, దేవదాసీలు, బానిసలు అని మూడు రకాలుగా విభజింపవచ్చు. ఐశ్వర్యం, సుఖలాలసత గల మధ్యయుగ భారతదేశంలో వేశ్యావృత్తి ఆమోదకరమైన వృత్తులలో ఒకటిగా భావించబడింది. అన్ని వృత్తుల వారి నుంచి వసూలు చేసినట్లే ఈ వృత్తి వారి నుంచి కూడా ప్రభుత్వం పన్ను వసూలు చేసేది. ఆనాటి సుఖ జీవనాసక్తిని, ఈ వృత్తి పోషణను సాహిత్య ఆధారాలు, శిల్పాలు తెలుపుతాయి. వేశ్యలు సంగీత, నృత్య, సాహిత్యాలలో, చతుర సంభాషణలో నిపుణులై ఉండటం వల్ల వీరిని మెచ్చి చాలా మంది బహుమతులతో వేచి ఉండేవారని తెలుస్తున్నది. రాజులు ఏర్పాటు చేసే సభలకు వీరికి ఆహ్వానం అందేది. శైవ, వైష్ణవ దేవాలయాల్లో దేవదాసీలుండేవారు. దేవుని ఎదుట సంగీత, నృత్య సాధన వీరి ముఖ్య విధి. సమాజంలో వీరి స్థితి దిగజారి వేశ్యల వలెనే చెలామణి అయ్యారు. దేవదాసీ పద్ధతి వల్ల దేవాలయాలల్లో భక్తి భావాలు తగ్గాయని, కొందరు దైవ భక్తితో గాక ఈ స్త్రీల నిమిత్తమే అక్కడికి వెళ్ళేవారని తెలిపాడు. ఆనందం కోసమై ఉండే వారు బానిస స్త్రీలు. యజమాని ఆస్తిలో వీరు భాగమేనని, వీరిపై అధికారం ఆ వంశీయులకు వంశపారంపర్యంగా సంక్రమిస్తుందని జీమూత వాహనుడు తెలిపాడు.

హిందూ, ముస్లిం స్త్రీలు పర్దాను పాటించారు. హిందూ సంఘంలో పర్దా పద్ధతి ముస్లిం రాకతోనే ప్రారంభమయిందని కొందరి భావన. స్త్రీలు అంతఃపుర వాసులని, వారు ఘోషాలో ఉండేవారని సాహిత్యం తెలుపుతున్నది. ఉత్తర భారతదేశంలో మధ్యతరగతి, కింది తరగతి స్త్రీలు సహితం దుప్పటిలో తల చుట్టుకొని తమ పనులను చేసుకొనేవారు. దక్షిణ భారతదేశంలో అంతఃపుర స్త్రీలు మాత్రమే పర్దాను పాటించేవారు. ఈ కాలంలో ఆచరించబడిన మరో ముఖ్య సంప్రదాయం సహగమనం. దీనిని అందరూ ఆచరించినప్పటికి రాజకుటుంబీకులు ఎక్కువ సంఖ్యలో పాటించారు. ఈ సంప్రదాయం వ్యక్తిగత ఇష్టానుసారం జరిగింది. దీనిని పాటించని స్త్రీలు కూడా ఉన్నారు. మొదట ఇచ్ఛననుసరించి జరిగిన సహగమనాలు, త్వరలోనే ఇతరుల బలవంతం ద్వారా జరగసాగాయి. ఈ ఆచారాన్ని అరికట్టుటకు బ్రిటిష్ పాలనా కాలానికి ముందు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గౌరవ రక్షణ కోసం రాజపుత్ర స్త్రీలు అవలంభించిన ఆచారం జోహారు. రాజులు దుర్గాలను రక్షించలేరన్న నిరాస కలిగిన వెంటనే అంతఃపుర స్త్రీలు చితి నేర్పరచుకొని అందులో ప్రవేశించేవారు.

బ్రిటిష్ పాలనా కాలానికి ముందు భారతదేశ స్త్రీ పరిస్థితి దిగజారింది. పర్దా, బాల్య వివాహాలు, సహగమన ప్రాముఖ్యం, వేశ్యాలాలత, సాంఘిక కట్టుబాట్లు, వితంతువుల దయనీయ స్థితి ఇవన్నీ నాటి స్త్రీల పరిస్థితిని తెలియజేస్తాయి. కర్మలు చేయడానికి హక్కు ఉండటం, యుద్ధం నాటి సామాన్యమయిన లక్షణం కావటం వల్ల పురుషులకే ప్రాముఖ్యముండేది.

## 1.3.5. సారాంశము :

బ్రిటిష్ పాలన భారతదేశంలో నెలకొనే నాటికి భారతీయ సంఘంలో విభిన్నత్వం ముఖ్య లక్షణం, హిందూ ముస్లింలు తమ విభిన్న వర్గాలతో, భిన్న పద్ధతులలోనే సహజీవనం చేసినారు. మొదట్లో ఉన్న కుల వ్యవస్థ పటిష్టత 17వ శతాబ్ది చివరి నాటికి సడలింది. నగరాల సంఖ్య అధికమై, సాంఘిక మర్యాదలు పాటించబడేవి. ఐశ్వర్యం, ఆడంబరత, సుఖలాలసత ఈ యుగమంతా దేశమంతటా కనిపిస్తుంది. ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసం కూడా ఎక్కువే. ఆహార పానీయాలు, ఆభరణాలు, దుస్తులు, పండుగలు, వినోదాలు, సాంఘిక మర్యాదలలో హిందూ ముస్లిం సాన్నిహిత్యం వల్ల మార్పులు వచ్చాయి.

## 1.3.6. నమూనా ప్రశ్నలు :

1. బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి హిందూ - ముస్లిం సంబంధాలను వివరింపుము
2. హిందూ-ముస్లిం పరస్పర ప్రభావం వల్ల భారత సమాజంలో సంభవించిన మార్పులేవి.

## 1.3.6. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Romila Thaper | : | Communalism and the Writing of Indian History |
| 2. | K.S. Lal | : | Studies in Medieval Indian History |
| 3. | Mohammad Habib | : | A Comprehensive History of India |
| 4. | K.A.N. Sastri | : | A History of South India |
| 5. | A.B. Pandey | : | Later Medieval India |
| 6. | U.N. Day | : | Some Aspects of Medieval Indian History |
| 7. | Ishwari Prasad | : | A Short History of Muslim Rule in India |


డా॥ వి.కె. మోహన్

పాఠం - 1.4

# బ్రిటిష్ పాలనకు ముందు ఇండియాలో విద్యా విధానం

## 1.4.0. లక్ష్యం :

బ్రిటిష్ పాలనకు ముందున్న ఇండియా విద్యా విధానం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం

## విషయ సూచిక :


1.4.1. పరిచయం

1.4.2. బ్రిటిష్ పాలనకు ముందున్న ఇండియా విద్యా విధానం

1.4.3. హిందూ విద్యా వ్యవస్థ

1.4.4. ముస్లిం విద్యా వ్యవస్థ

1.4.5. పరస్పర ప్రభావం

1.4.6. పత్రికలు

1.4.7. సాహిత్యం

1.4.8. గ్రంథాలు - గ్రంథాలయాలు

1.4.9. సారాంశం

1.4.10. నమూనా ప్రశ్నలు

1.4.11. చదువదగిన గ్రంథాలు


## 1.4.1. పరిచయం

ప్రజల నిత్య జీవితంలో ఆహారం, వస్త్రాలు, నివాసం మొదలగు అవసరాల కొరకు వస్తువుల ఉత్పత్తికై, తరువాత నాగలి, మగ్గం, చక్రం, యంత్రం మొదలగు ఉత్పత్తి సాధనాల తయారీకై భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, వ్యవసాయిక శాస్త్రం, యంత్రగతి శాస్త్రం లాంటి శాస్త్రాలు, వాటి విజ్ఞాన ప్రగతిపై ఆధారపడడమైంది. అందువల్ల ప్రతి మానవ సమాజం కూడా అది ఎంత వెనుకబడున్నా, కొంత శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానాన్ని తప్పకుండా కలిగి ఉంటుంది. దానికెప్పుడూ ఒక తత్త్వం, ప్రాపంచిక దృక్పథం ఉన్నాయి. కాబట్టి ఆ విధంగా శతాబ్దాల నండి వస్తున్న బ్రిటిష్ పాలనకు ముందున్న భారత సమాజంలో కూడా శాస్త్రీయ సంస్కృతి లేకపోలేదు. అది వ్యవసాయం, చేతి కళల ద్వారా, జీవనాన్ని సాగించింది. ఖగోళశాస్త్రం, వ్యవసాయిక శాస్త్రం, గణిత శాస్త్రం, యంత్రగతి శాస్త్రం కూడా తెలుసు. అయితే బ్రిటిష్ పాలనకు ముందుగల భారతీయ సమాజ ఆర్థికాభివృద్ధి తక్కువ స్థాయిలో ఉన్నందున, అది సంపాదించి,పోగు చేసిన శాస్త్రీయ విజ్ఞానం స్వల్పంగా ఉంది. గణిత శాస్త్రం, రసాయనిక శాస్త్రం, వైద్య శాస్త్రం లాంటి శాస్త్రాల్లో ప్రపంచంలోని పలు ఆధునిక దేశాల ప్రజలు నాగరికత జీవనానికి అలవాటు పడక ముందు, భారతీయ ప్రజలు మార్గదర్శక కృషిని సల్పారు. కాని ఆ తరువాత చాలా కాలం వరకు అదే

ఆర్థిక, సాంస్కృతిక స్థాయి వద్ద నిలిచిపోయి, ఇండియా ప్రజలు గొప్పగా అభివృద్ధిని సాధించలేకపోయారు. ఈ కాలంలో అది ఉపనిషత్తుల్లో రూపొందించబడ్డ కాల్పనిక వేదాంత తత్త్వం మీద, భిన్న విశ్లేషణలను తీసుకొని రావడం జరిగింది. కాని ప్రకృతి శాస్త్రాలు, సాంకేతిక శాస్త్ర రంగంలో అది ఎటువంటి గణనీయమైన కార్యాన్ని సాధించలేదు. ఇండియాలో ఆధునిక విద్యను ప్రవేశపెట్టి బ్రిటిష్ ప్రభుత్వం విజ్ఞాన శాస్త్ర, సామాజిక శాస్త్ర రంగంలో ఆధునిక పశ్చిమ దేశాలు సాధించిన విస్తృత అపార కార్యాలతో ఇండియా ప్రజలకు సంబంధ సాన్నిహిత్యాల నేర్పర్చింది.

## 1.4.2. బ్రిటిష్ పాలనకు ముందున్న ఇండియా విద్యా విధానం :

బ్రిటిష్ పాలకు ముందు భారతదేశంలో విద్యాభ్యాసం మత గ్రంధాల ద్వారానే జరిగేది. రాజధాని నగరాలు, పుణ్యక్షేత్రాలు, దేవాలయ ప్రాంగణాలు, మదరసాలు, ఖాన్క్వాలు విద్యాకేంద్రాలుగా ఉండేవి. ఆనాటి ప్రభుత్వాలు విద్యా వ్యాప్తిని బాధ్యతగా పరిగణించకపోవుటచే, ప్రభుత్వేతర సంస్థలే విద్యా వ్యాప్తికి దోహదం చేశాయి. శాస్త్రజ్ఞులకు, పండితులకు సంఘంలో, రాజాస్థానంలో ఆదరణ లభించేది. వివిధ మగు వృత్తి విద్యలను వానియందు సాంకేతిక నైపుణ్యం కలిగిన వారు గాని, ఆ వృత్తికి సంబంధించిన సంస్థలుగాని నేర్పేవి. కుటీర పరిశ్రమలు, చేతి పనులు కొన్ని కుటుంబాలలో వారసత్వంగా అవలంభించేవారు. తమ స్థితిని బట్టి, ఆ విద్యలో తమకు గల ఆసక్తిని బట్టి, ఆ విద్య వలన తమకు లభించే ఉపాధి అవకాశాలను బట్టి వారా విద్యలను నేర్చేవారు. ఈ కాలంలో ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందాయి. భక్తి ఉద్యమం ఈ అభివృద్ధికి దోహదం చేసింది. హిందూ ముస్లిం సాన్నిహిత్య ఫలితంగా నూతనంగా ఉర్దూ భాష ఆవిర్భవించింది.

భారతదేశంలో బ్రిటిష్ పాలనకంటే ముందు నెలకొన్న సంస్కృతిపై రెండు దురభిప్రాయాలున్నాయి. ఒక వైపు జాతీయతా దురభిమానంతో కూడిన ఆర్యసమాజ్ ఇండియా గతాన్ని అవకాశానికెత్తింది. శాస్త్రీయ, సామాజిక, ఆధ్యాత్మిక విజ్ఞానమంతా ఆర్యుల సొత్తుగా ఉండేదని, ఇది వారందించిన చారిత్రాత్మక వేదాల్లో పొందుపరచబడిందనీ ఈ సమాజీయుల చేత భావించడమైంది. ఇంకా ఆధునిక భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, జీవ శాస్త్రం, ఇంజనీరింగుల్లోని అన్ని సూత్రాలు, నిర్ణయాలు, అన్ని ఆధునిక అద్భుత పరిశోధనలు అన్నీ వేదాల్లో చెప్పబడినవే. అయితే వీటిని సరిగా విశ్లేషణ చెయ్యడమనేది అవగతమై ఉండాలని వీరు అభిప్రాయపడ్డారు. అయితే ఆర్య సమాజీయులు ఈ అభిప్రాయం సరైనది కాదు, విజ్ఞానమనేది చారిత్రకంగా, సమకాలీన ప్రజల సమాజాభివృద్ధి స్థాయి, హద్దులపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని వీరు గ్రహించలేదు. బ్రిటిష్ యుగానికి ముందున్న భారతీయ సమాజం దాని అన్ని దశల్లో కూడా తక్కువ స్థాయి సామాజికార్థికాభివృద్ధిని సాధించడం చేత, అది సాధించిన విజ్ఞానం కూడా, ఆధునిక సమాజం సాధించిన దాని కంటే తక్కువగానే ఉండేది. రెండోవైపున లార్డ్ మెకాలే మరో వ్యతిరేక దురభిప్రాయానికి గురయ్యాడు. ఇతడు తిరస్కార భావంతో, ఇండియా సంస్కృతి నంతటినీ ఒక పెద్ద మూఢ నమ్మకాల కుప్పగా తీసి పారేశాడు. ఇది ఇండియా సంస్కృతిపై ఒక వైపు అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. ప్రతి వెనుకబడ్డ సమాజంలో మూఢ నమ్మకాలు లేకపోలేదు. అయితే వీటిలో బాటు శాస్త్రీయ విజ్ఞానం కూడా చోటు చేసుకుంది. లోగడ పేర్కొన్నట్లుగా, తన ఉనికిని కాపాడుకునేందుకై ప్రతి సమాజం ఉత్పత్తిని చేయాలి. ఉత్పత్తిని చేయడమంటే సాంకేతిక, శాస్త్రీయ విజ్ఞానాన్ని కలిగి ఉన్నట్లు అవుతుంది. బ్రిటిష్ పాలనకు ముందు శతాబ్దాల తరబడి ఉండడం, అది శాస్త్రీయ విజ్ఞానాన్ని కలిగి ఉన్నట్లుగా తెలియజేస్తుంది. ప్రతి సమాజ కర్తవ్యం గత సంస్కృతిని నెమరు వేసుకుంటూ మునుగడ సాగించడమే. అంటే, ఇండియా ప్రాచీన సంస్కృతిని ఆర్య సమాజం ఆకాశానికెత్తినట్లు, మెకాలే ఇండియా సంస్కృతిని పూచిక పుల్లగా తృణీకరించడం, రెండూ కూడా చరిత్ర విరుద్ధం, అహేతుకమైనది.

## 1.4.3. హిందూ విద్యా వ్యవస్థ :

హిందూ సమాజం కుల ప్రాతిపదికపై ఏర్పడింది. ఇలాంటి కుల విధానంలో ప్రతి కులానికి ఒక ప్రత్యేక సామాజిక విధి కేటాయించబడింది. ఆ ప్రకారంగా బ్రాహ్మణుల కొక్కరికే మత సిద్ధాంతాలు బోధించడానికి, పూజారులుగా పని చేయడానికి, అధ్యాపకులుగా పని చేయడానికి వీలు కల్పించడమైంది. ఈ కారణం చేత వారి కొక్కరికే ఉన్నత మత, లౌకిక పరమైన విద్యను అధ్యయనం చేసే హక్కు ఇవ్వడమైంది. హిందువుల పవిత్ర భాష అయిన సంస్కృతంలో బోధన జరిగేది. దీనిలోనే ఉన్నత లౌకిక రచనలు చేయబడేవి. హిందూ రాజ్యాలు అమలు చేసిన మత చట్టాల కారణంగా మిగతా కులాల వారిని ఉన్నత విద్య నుండి దూరం చేయడం జరిగింది.

విద్యనార్జించేవారు గురువు ఇంటిలోనే నివసిస్తూ జీవితాన్ని గడిపేవారు. నేర్పే విద్య మత, మతేతర విషయాలకు సంబంధించింది. శిష్యుని అభిలాషను బట్టి, శక్తిని బట్టి అతనికి ఉపయోగపడే విద్యలో తర్ఫీదు ఇవ్వబడేది. బ్రహ్మణులకు, క్షత్రియులకు శాస్త్ర పాండిత్యాన్ని, వర్తకులకు గణితశాస్త్రం, కాయస్థులకు అధికార పత్రాలు రాయడంలో మెళకువలు నేర్పేవారు. వేద శాస్త్రాలతో బాటు జ్యోతిష్యం, సాహిత్యం, ఖగోళం, వ్యాకరణం, తర్కం, వైద్యం బోధనాంశాలుగా ఉండేవి. రాజాస్థానాలలోను, వెలుపల పండిత సభలు, గోష్టులు జరిగేవి. గెలిచిన వారికి జయపత్ర బహుకరణలు జరిగేవి. కుల వృత్తులను పెద్దల వద్ద నేర్చేవారు. స్త్రీలు, తక్కువ కులాల వారు, వ్యవసాయదారులకు విద్యార్జన శూన్యమైంది.

నలందా, వల్లభి, ధారా, కాశీ, విక్రమ శిల, కాంచీ నాటి ప్రముఖ ఉన్నత హిందూ విద్యాకేంద్రాలు. ముస్లిం దాడుల వల్ల కొంత కాలం ఒత్తిడికి లోనైనను కాశీ తిరిగి 16, 17 శతాబ్దాలలో తన ఔన్నత్యాన్ని పొందగలిగింది. ఉన్నత విద్యాభ్యాసానికి కాశీలో గల వసతులను చూసి బెర్నియర్ ఆశ్చర్యం పొంది, దానిని గ్రీస్‌లోని ఏథెన్స్ నగరంతో పోల్చాడు. ఈ కాలంలో బెంగాల్‌లోని నాడియా ఒక ప్రముఖ విద్యాసంస్థ. న్యాయం, తర్కం, ఖగోళం, వేదాంత విషయాల్లో ఉత్తమ సంస్థగా ఇది ప్రసిద్ది కెక్కింది. ఈ విద్యాసంస్థకు నవద్వీప, శాంతిపుర, గోపాల పురాలలో శాఖలు కూడా ఉన్నాయి. నాడియా విద్యా సంస్థలో 1618 లో నాలుగు వేల మంది విద్యార్థులు, ఆరు వందల మంది అధ్యాపకులు ఉండేవారు. నాడియా సంస్థకు ముందు మిథిల విద్యాలయం ఆకర్షణీయంగా ఉండేది. దక్షిణ భారతదేశంలో నాగై, ఎన్నాయిరం, త్రిభువని, తిరుముక్కూడల్, తిరువొర్రియూర్ ఖ్యాతి పొందిన విద్యాసంస్థలు. గ్రామాలలో ఉండే ఉపాధ్యాయునికి ఉమ్మడి భూమిలో వాటా ఉన్నట్లు సమకాలీన శాసనాలు తెలుపుతున్నాయి. కాంచీలోని ఆరుళాళ పెరుమాత ఆలయంలో ఒక వేదమఠం ఉండేదని, అందలి అధ్యాపకులకు దేవాలయ భూముల నుండి ఆదాయం లభించేదని వివరాలు తెలుపుతున్నాయి. ఈ దేవాలయంలోనే పుస్తక భాండాగారం కూడా ఉండేది. హనూర్‌లో పదమూడు బాలికల పాఠశాలలను, 23 బాలుర పాఠశాలలను చూసానని ఇబన్ బతూతా పేర్కొన్నాడు. మధురలో పదివేలమంది విద్యార్థులు వేదాంతం, మతం నేర్పే ఉపాధ్యాయుని వద్దకు వెళ్లారని రాబర్ట్ డి. నొబిలి ఒక లేఖలో పేర్కొన్నాడు. ఇటాలియన్ యాత్రికుడు పీట్రో డెల్లా వల్లె 1623 లో విద్యను గూర్చి అనేక వివరాలు ఇచ్చాడు. అందులో భారతీయ విద్యార్థులు కంఠత పట్టేవారని, నేలపై ఇసుకను పోసుకొని రాసేవారని తెలిపారు.

ఈ విధంగా బ్రిటిష్ పాలనకు ముందు గల ఇండియాలో హిందువుల్లో విద్యాభ్యాసం విపరీతంగా పరిమితమైంది. ఒక్క బ్రాహ్మణులకు తప్ప, మిగతా వారికందించే విద్యాప్రమాణం కడుహీనంగా ఉంది. ఉన్నత విద్య అంతటా బ్రాహ్మణులు గుత్తననుభవించారు. ఈ విద్యా విధానం హిందూ సమాజ సంస్కృతిలో ఒక భాగమైంది. ఈ సంస్కృతీ విధానం బ్రాహ్మణ నియంత్రిత ఫలితంగా ఉండేది. ఈ విద్యా విధానం హైందవ సమాజకుల విధానంలో నమ్మకముంచేందుకై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు, వేదాల ప్రామాణికత తిరుగులేనిదని నమ్మించటానికి, వేదాల విశ్లేషణలో బ్రాహ్మణుల అధికారం ఎదురులేనిదని నమ్మించడానికి, సాధనంగా వాడడమైంది. పెద్దలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, చక్రవర్తికి, పూర్తి విధేయతను పాటించవలసిందిగా నాటి విద్యార్థులకు ఈ విధానం సదా బోధిస్తుండేది. అంటే నాటి విద్య ఒక వ్యక్తిని లేదా పౌరుని సాంప్రదాయిక సామాజిక వ్యవస్థకు కట్టుబడి దానికి తన వ్యక్తిత్వాన్ని లోబర్చేందుకు సాధానంగా పని చేసింది.

## 1.4.4. ముస్లిం విద్యా వ్యవస్థ :

బ్రిటిష్ పాలనకు ముందున్న ముస్లింలలో ఉన్నత విద్య ఏ ఒక్క విభాగ గుత్త కాలేదు. దీనికి ఇస్లాం ప్రజాస్వామిక స్వభావం కారణమైంది. మదరసాలో ఏ ముస్లిమైనా చదువుకోవచ్చు. అయితే పవిత్ర గ్రంథమయిన ఖురాన్ అరబ్బీ భాషలో ఉండడం చేత ఉన్నత విద్య అంతా ఇండియాలో అరబ్బీలో బోధించబడేది. ముస్లిం విద్యార్థులు ఖురాన్ నేర్చిన పండితుల వద్దగాని, మదరసాల వద్దగాని సూఫీ తాత్త్వికుల ఖాన్‌క్వాల యందుగాని విద్యాభ్యాసం చేసేవారు. కఠినమైన క్రమశిక్షణకు లోబడి, సామాన్య జీవితాన్ని గడుపుతూ విద్యాభ్యాసం ముగిసిన తరువాత తమకు అనువైన వృత్తులను స్వీకరించేవారు. ముస్లింలు తమ పిల్లలకు నాలుగు సంవత్సరాల నాలుగు నెలల, నాలుగు రోజుల వయస్సు రాగానే అక్షరాభ్యాసం చేసేవారు, దీనిని బిస్మిల్లా అనే వారు. స్థానికంగా ఉన్న మసీదులోని ముల్లా లేదా మౌల్వీ అక్కడి పిల్లలకు ప్రాథమిక విద్య నేర్పేవాడు. అక్షరాలను నేర్చుకోవడం, ఖురాన్‌లోని ప్రార్థనలను వల్లె వేయడం విద్యార్థులకు మొదటగా నేర్పేవారు.

తెలివైన విద్యార్థులచే ఇతర విద్యార్థులకు పాఠాలు నేర్పించే పద్ధతిని హిందూ వ్యవస్థ నుండి అనుసరించారు. ఆధ్యాత్మిక విద్యను కోరిన కొందరు మార్మిక వాదులు స్థాపించిన ఖాన్ క్వాలలో విద్యనేర్చేవారు. ఢిల్లీ మదరసాలో నేర్పే విషయాలు తఫ్‌సిర్, హడీలు, ఫిక్, సాహిత్యం, తర్కం, వ్యాకరణం, మార్మిక సిద్ధాంతం అని బరౌనీ పేర్కొన్నాడు.

భారతదేశంలో మొదట మదరసాను షిహాబుద్దీన్ మహమ్మద్ ఘోరీ అజ్మీర్‌లో స్థాపించాడు. ఇల్‌టుట్‌మిష్, మహమ్మద్ బీన్ తుగ్లక్‌లు ఢిల్లీలో మదరసాలను స్థాపించారు. ఫిరోజ్‌షా తుగ్లక్ తన రాజ్యంలోని 30 వివిధ విద్యా సంస్థలకు ధన సహాయం చేసినాడు. పేద విద్యార్థులెందరికో వేతనాల నిచ్చి విద్యను ప్రోత్సహించాడు. కార్ఖానాలలో వృత్తి విద్యలను నేర్పించారు. మొగల్ పాదుషాలు విద్యా వ్యాప్తికి ఇతోధికంగా తోడ్పడినారు. చక్కని చేతి రాతకు ప్రోత్సాహమివ్వడం జరిగింది. అబుల్ ఫజిల్ ఎనిమిది రకాల అందమైన రాతలను పేర్కొన్నాడు. దారా, ఔరంగజేబు, స్వయంగా చక్కగా రాయగల్గిన వారు. ఆనాటి పుస్తకాలన్నియు చక్కని రాతతో, చుట్టూ అందమైన అంచును ప్రతీ పేజీలో బొమ్మలను కలిగి చక్కగా బైండ్ చేయటం జరిగింది.

## 1.4.5. పరస్పర ప్రభావం :

ముస్లిం దండయాత్రల ప్రారంభంలో హిందూ విద్యా కేంద్రాలు నష్టపోయాయి. ఇక్తియారుద్దీన్ మహమ్మద్ భక్తియార్ ఉద్దండపురం, నలందా, విక్రమశిల విశ్వవిద్యాలయాలను నాశనం చేశాడు. ఇల్‌టుట్‌మిష్ కాలంలో నలంద, గయ, వైశాలీల పై దాడి జరిగింది. ఈ దాడుల వల్ల పండితులు ఒక ప్రాంతం నుండి మరియొక ప్రాంతానికి వలస వెళ్ళుట తటస్థించింది. కాని ఈ పరస్పర వైరం ఎక్కువ కాలం కొనసాగలేదు. పర్షియన్ భాష భారతీయ భాషలలో చేరుటచే అనేక సంస్కృత గ్రంధాలు పర్షియన్‌లోనికి అనుదించబడ్డాయి. ఆగ్రహం తగ్గిన ముస్లిం పాలకులు ఈ అనువాదాలను తమ పోషణలోనే చేయించారు. పర్షియన్‌లో హిందువులు, హిందీలో ముస్లింలు కవితలు, గ్రంధాలు రాశారు.

'మోడర్న్ ఇండియా అండ్ ది వెస్ట్' అను గ్రంథంలో ఓమాలె నాటి హిందూ - ముస్లిం విద్యా విధానాల లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించాడు. "హిందూ ముస్లిం విధానాలు సంయుక్తంగా ఎంతో కలిగి వున్నాయి. ప్రజా బాహుళ్యానికి విదేశీ భాషలుగా ఉన్న వాటిలో బోధించాయి. మత బంధం నుంచి తమ బలాన్ని పొందాయి. మార్పు చెందని అధికారాన్ని ప్రాపుగా చేసుకొని, స్వేచ్ఛాయుత విమర్శనాత్మక దృష్టిని నిరుత్సాహపరచి, మార్పులను వ్యతిరేకించాయి. అయితే, ఒక విషయంలో మాత్రం ఇవి ప్రస్ఫుటంగా వేరయ్యాయి. హైందవ పాఠశాలలు సమాజంలో ప్రాబల్యాన్ని పొందిన ఒక్క వర్గానికి మాత్రమే ఉద్దేశించబడగా, ముస్లిం పాఠశాలలు మాత్రము ఒకే దేవుడు, మొహమ్మద్ ఆయన ప్రవక్త అనే విషయాలను ఆమోదించిన వారందరికి, వాటిలో ఎటువంటి ఆటంకం లేకుండా చేరే అవకాశాన్ని కల్పించాయి". ఫలితంగా, బ్రిటిష్ పాలనకు ముందున్న ఇండియాలోని ఈ పాఠశాలల్లో, వ్యక్తిత్వంగాని, హేతువాద దృష్టిగాని, విద్యార్థుల్లో పెంపొందే అవకాశాలు మృగ్యమయ్యాయి. నాటి విద్యా బోధన, విద్యార్థులను గాఢ హిందువులు, ముస్లింలుగా తయారుచేసి, వారి మతాలకు విశ్వాసపాత్రులుగా, ఈ మతాల ఆమోద ముద్రపడ్డ సామాజిక వ్యవస్థలకు విధేయులుగా ఉండేటట్లు చేసింది.

## 1.4.6. పత్రికలు :

బ్రిటిష్ యుగానికి ముందు ఇండియాలో ముద్రణాయంత్రం వాడుకలో లేదు. క్రైస్తవ సాహిత్యాన్ని ముద్రించేందుకై 1557 లోనే పోర్చుగీస్ జెస్యూట్ ప్రచారకులు దీన్ని మొదటగా ప్రవేశపెట్టినప్పటికీ ప్రజా జీవితాన్ని ప్రభావపరిచే ఒక అసలైన సామాజిక శక్తిగా ఇది 19వ శతాబ్ది ప్రథమపాదంలో మాత్రమే ఏర్పడింది. అయితే రాజ్య సమాచారాన్నిచ్చేందుకై, మొగలుల కాలంలో చేతి రాత వార్తా పత్రికలుండేవి. సాధారణంగా, ప్రతి రాష్ట్ర కేంద్రంలో చక్రవర్తి ఇద్దరు వార్తారచయితలను నియమించేవాడు. వీరిలో వకియానవిన్ అనే అతను ఆ ప్రాంతంలోని పౌర జీవితానికి సంబంధించిన అన్ని ముఖ్యచర్యలను, వార్తల గెజిట్‌గా తయారుచేయగా, సవాని నవిస్ అను అతను ఆ ప్రాంతంలో జరిగిన అన్ని ముఖ్య సంఘటనలకు సంబంధించిన వార్తల పత్రాన్ని తయారుచేసేవాడు. ధనవంతులైన వర్తకులు తమ స్వంత వార్తా రచయితలను నయమించేవారు. ఈ రచయితలు వాణిజ్య ఇతర వార్తల నందించే వార్తాలేఖలను తయారుచేసి, తమ యజమానులకు పంపించేవారు. అయితే ఈ అధికారిక, ప్రైవేటు వార్తా పత్రికలు, వార్తాలేఖలు ముద్రణా యంత్రాన్ని వాడనందున చేతితో రాయడమైంది. ఫలితంగా ఇవి జనాభాలో కొద్ది మందికి మాత్రమే చేరి సమాచార పరిధిలో పరిమితమై ఉండేవి.

## 1.4.7. సాహిత్యం :

బ్రిటిష్ పాలనకు ముందు భారతదేశంలో పర్షియన్ రాజ్యభాషగాను, నాగరిక భాషగాను గుర్తింపబడింది. పర్షియన్ మాతృభాష కాని టర్కులు, హిందువులు ఆ భాషపై ఆధిక్యత సంపాదించుటకు పోటీపడ్డారు. భారతీయ భాషలగు హిందీ, బెంగాలీ వంటి భాషలలో పర్షియన్ పదాలు ప్రవేశించాయి. సాహితీ ప్రక్రియలన్నింటియందు నైపుణ్యం చూపిన కవి అమీర్ ఖుస్రూ బద్రుద్దీన్ మహమ్మద్ అనేక సాహితీ ప్రక్రియలను మేళవించి రచనలు చేశాడు. బాబర్, హుమాయూన్‌లు స్వయంగా మన్నవి, రుబాయి, ఘజల్, దివాన్ మున్నగునవి రచించారు. అక్బర్ ఆస్థానంలో 59 మంది పర్షియన్ కవులుండేవారని అబుల్ ఫజల్ వ్రాసాడు. వీరిలో అబుల్‌ఫైజీ, ఉద్బీ ప్రముఖులు. నూర్జహాన్, జహంగీరులు కూడా పద్య రచనలు చేసేవారు. ఈ కాలంలో అనేక ఆత్మకథలు, చరిత్రలు వెలవడ్డాయి. షాజహాన్ కుమారుడు దారా హిందూ మత గ్రంథాలలో కొన్నిటిని అనువదించటమేగాక 'సముద్ర సంగమము' అను గ్రంథాన్ని రచించి హిందూ ఇస్లామి మతాలు ఒకే ఆదర్శాన్ని ప్రకటిస్తున్నాయని తెలిపాడు. ఈ కాలంలో అనువాద శాఖ ఏర్పడి రెండు మతాల యందలి ముఖ్య గ్రంథాలు ఇరుపక్షాల చేరువకు తీసుకొని రాబడ్డాయి. కాంగ్రా గ్రంథాలయంలోని సంస్కృత గ్రంథాలను పర్షియన్‌లోనికి అనువదింపజేయడం జరిగింది. పర్షియన్, హిందూస్థానీ భాషల కలయిక వల్ల ఉర్దూ భాష ఆవిర్భవించింది. అయితే సుల్తానులు, మొగలాయిలు ఉర్దూను ఆదరింపక పర్షియన్ భాష పట్ల మక్కువ చూపారు. ఈ భాషపై గుజరాతీ, మరాఠీల ప్రభావం ఉంది. విజయనగర, తంజావూరు, జింజిరాజ్యాలలో అనేక సాహిత్య గ్రంథాలు రచించబడ్డాయి. మొగల్ ఆస్థానంలో సంస్కృతం ఆదరించబడింది.

దక్షిణ ప్రాంతంలో 17వ శతాబ్దంలో మళయాళీ భాష ఒక స్వతంత్ర భాషగా రూపొందింది. మొగలులకు సమాకాలికమైన విజయనగర రాజుల కాలంలో తెలుగు సాహిత్యం బాగా అభివృద్ధి చెందింది. కృష్ణరాయల కాలంలో అష్టదిగ్గజాలనే కవులుండడం వల్ల ఆ కాలాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో స్వర్ణయుగంగా వర్ణిస్తారు. విజయనగర రాజుల తరువాత 16, 17 శతాబ్దాలలో తంజావూరు, మధుర రాజులు తెలుగు సాహిత్యాన్ని పోషించారు. 17వ శతాబ్దంలో తంజావూరు నుండి అనేక రచనలు వెలువడ్డాయి. సాహిత్య, సంగీత, నృత్య సమ్మిళితమగు యక్షగాన ప్రక్రియ ఆదరించబడింది. కన్నడ భాషలో మత సంబంధమైన గ్రంథాలనేకం వెలువడ్డాయి. తమిళ గ్రంథాలు ప్రధానంగా మతంపైనా, పురాణాలపైన, శాస్త్రాలపైన రచించడం జరిగింది.

బ్రిటిష్ యుగానికి ముందు భారతదేశంలో హిందీ అభివృద్ధి చెందింది. ఈ భాషలో ప్రసిద్ధ గ్రంథాలు వెలువడ్డాయి. భక్తి ఉద్యమం హిందీ భాషను మరింత పటిష్టం చేసింది. కబీరు ఇరవై వేల పద్యాలు రాశాడు. తులసీదాస్ రచించిన 'రామ చరిత మానస్' బహుళ ప్రచారాన్ని పొందింది. అబ్దుల్ రహీం హిందీలో అనేక పద్యాలను రాశాడు. షాజహాన్ ఆస్థానంలో సుందర్, రవిరాజ్, చింతామణి, మతిరాం, బీహారి, కవీంద్ర, ఆచార్య ఉన్నారు. ఈ కాలంలో హిందీ సాహిత్యం ప్రజల చేత, రాజుల చేత ఆదరించబడింది.

## 1.4.8. గ్రంథాలు - గ్రంథాలయాలు :

బ్రిటిష్ పాలనకు ముందు అన్ని దేశాలలో కంటే భారతదేశంలోనే పుస్తకాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రపంచంలో ఎక్కడా దొరకని పుస్తకం భారతదేశంలో దొరికేదని అబుల్ ఫజల్ వ్రాసినాడు. ఎన్నో దేవాలయాలలో, మఠాలలో, మదరసాలలో గ్రంథాలయాలు ఉండేవి. అన్ని ఉన్నత విద్యా కేంద్రాలలో, ప్రసిద్ధ రాజధాని నగరాలలో, ఢిల్లీ, ఆగ్రాలలో, ఉన్నత కుటుంబీకుల ఇండ్లలో, ప్రసిద్ధ పండితుల ఇండ్లలో కూడా గ్రంథాలయాలుండేవి, బెర్నియర్, ఫ్రెయర్ మొదలైనవారు భారతదేశంలోని గ్రంథాలయాలను గురించి ఎంతో ప్రశంసించినారు. ఆగ్రాలో పురాన్ ఖిల్లా, గుజరాత్‌లో షామ్-ఇ-బుర్‌హాని, వాలిమదరసా, తంజావూరులో సరస్వతీ మహల్, మైసూర్‌లో బడయర్‌ల గ్రంథాలయం, మొగల్ చక్రవర్తుల గ్రంథాలయం నాటి ప్రసిద్ధ గ్రంథాలయాలు. చక్రవర్తి గ్రంథాలయంలో అరబ్బీ, పారశీక, టర్కీ, సంస్కృత, హిందీ, కాశ్మీరీ భాషల్లో ఎన్నో శాస్త్రాలపై గ్రంథాలు ఉన్నాయి. దీని రక్షణ కోసం ప్రత్యేకంగా ఒకదరోగా ఉండేవారు. పుస్తకాలకు కాగితాన్ని, తాటిఆకులను, చెట్ల బెరడులను ఉపయోగించారు.

## 1.4.9. సారాంశం :

బ్రిటిష్ పాలనా కాలానికి ముందు భారతదేశంలో విద్యావిధానం మత రహితము, మత సహితము అని రెండు రకాలుగా ఉండేది. ఒక వైపు మసీదులు, మరొక వైపు మఠాలు, దేవాలయాలు మత వ్యాప్తి కోసం విద్యార్థులకు మత గ్రంధాలను మాత్రమే బోధించేవారు. ఇతర విద్యాకేంద్రాలలో భాషా, వ్యాకరణ, ఖగోళ, జ్యోతిష, భూగోళ, గణిత, వృక్ష, వైద్య, రసాయన శాస్త్రాలను, చరిత్రను బోధించేవారు. హిందువుల పాఠశాలలు దేవాలయాల్లో, ముస్లింలవి మసీదులలో ఏర్పాటయి ఉండేవి. ప్రాథమిక విద్య సాధారణంగా గ్రామస్థాయిలో, ఉన్నత విద్య కొన్ని ప్రాంతాలలో అందుబాటులో ఉండేవి. హిందువులు కాశి, నాడియా, మిథిల, మధుర, తిర్హుత్, పైఠాన్, థట్టా, మాల్వానులు, ముస్లింలకు ఢిల్లీ, ఆగ్రా, లాహోర్, జాన్‌పూర్, గుజరాత్, కాశ్మీరులు ఉన్నత విద్యా నిలయాలు. ఉన్నత విద్య అర్హత ఉన్న వారికే పరిమితమయి ఉండేది. నాటి విద్యా బోధన విద్యార్థులను గాఢ హిందువులు, ముస్లింలుగా తయారు చేయడమే. విద్యార్థులలో వ్యక్తిత్వం గాని, హేతువాద దృష్టిగాని పెంపొందించే పద్ధతులు లేవు.

## 1.4.10. నమూనా ప్రశ్నలు :

1. బ్రిటిష్ పాలనకు ముందు ఇండియాలో విద్యా విధానం గురించి వివరింపుము

## 1.4.11. చదువదగిన గ్రంథాలు :


1. O'Malley (Ed.) : Modern India and The West
2. Syed Nurullah and J.P. Naik : History of Education in India
3. Romila Thaper : A History of India
4. S.C. Raychoudhary : Social Cultural and Economic History of India
5. Sherwani : Cultural Trends in Medieval India
6. A.L. Basham : A Cultural History of India
7. Tarachand : Influence of Islam on Indian culture


**డా॥ వి.కె. మోహన్**

పాఠం - 1.5

# బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశంలో ఆర్థిక పరిస్థితులు

## 1.5.0. లక్ష్యం :

బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశంలో ఆర్థిక పరిస్థితులను గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం

## విషయసూచిక :


1.5.1. పరిచయం

1.5.2. వ్యవసాయము

1.5.3. పరిశ్రమలు

1.5.4. వర్తక వ్యాపారాలు

1.5.5. సారాంశము

1.5.6. నమూనా ప్రశ్నలు

1.5.7. చదువదగిన గ్రంథాలు


## 1.5.1. పరిచయం

క్రీ.పూ. 3000 నుండి ఈనాటి వరకు నిరంతరాయంగా ఉండగలిగిన ఏకైక ప్రాచీన నాకరికత తమదనే విషయాన్ని ఒక గర్వ కారణంగా భారతీయులు భావిస్తారు. ప్రాచీనమైన తక్కిన ఈజిప్టు, రోమ్, గ్రీసు లందలి నాగరికతలు ఏనాడో అంతరించిపోయినాయి. చైనా నాగరికత ప్రాచీనమే అయినా అది గత 50 ఏండ్లలో ఎంతో రూప వికృతిని పొందింది. భారతదేశం అనేక కాలాల్లో వివిధ విభిన్న రాజకీయ పరివర్తనలకు లోనయింది. గ్రీకుల దండయాత్ర, తుర్కో-ఆఫ్ఘన్ పరిపాలన, మొగలుల ఆధిపత్యం మొదలైనవి ఇట్లా పరివర్తనలకు కారణాలైనవి. అయినా జీవన విధానం ముఖ్యంగా దేశ ప్రజల సామాజిక ఆర్థిక రంగాలలోని జీవిత విధానం ఏతీరుగను ఈ కాలమంతటా నిలువగలుగుటకు స్వయం సమృద్ధమగు గ్రామీణ వ్యవస్థయే ముఖ్య కారణం.

రాజవంశాలు అనేకం వర్ధిల్లినవి, అంతరించినవిగాని భారతీయ నాగరికతకు ప్రాతిపదికయగు గ్రామం మాత్రం మార్పొందక తన స్వయం సమృద్ధ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కొనసాగిస్తూ నిలువగలిగింది. దేశం ఎన్నియో కల్లోలాలకు లోనైనను, గ్రామీణ సామాజిక జీవితం మాత్రం చెక్కు చెదరక ఉండగలిగింది. గ్రామాలు గణతంత్ర రాజ్యాలులాగా సువ్యవస్థితాలై ఉండుటయే ఇందుకు కారణంగా భావించవలసి ఉంటుంది. వర్ణ విభజనని ఆ గ్రామీణ ప్రజలు మనసారా విశ్వసించి అవలంభించారు. ఈ వివిధ కులాలకు నిర్ణీతాలైన వృత్తులు ఉండేవి. ఆ వృత్తులను ఏ కులానికా కులం చక్కగా నిర్వహిస్తూ ఉండేవి. ఆ విధంగా స్వయం సమృద్ధి యగు వ్యవసాయ, పరిశ్రమల్ని రూపొందించుకొని తక్కిన బాహ్య ప్రపంచంపై ఏ విధంగాను ఆధారపడక, వెలుపలినుండి వచ్చు ఎట్టి పోటీకి లోనుగాక ఏ గ్రామానికి ఆ గ్రామం మనగలిగింది. ఈ తీరుగా శతాబ్దాల కాలం నిరంతరాయంగా భారతదేశపు గ్రామాలు దేనికవి ఒక స్వయం సమృద్ధి, ఆర్థికపరంగా రూపొంది, వంశపారంపర్యపు సంప్రదాయానికి, తీర్చినట్లు ఉండే సాంఘిక వ్యవస్థకు పెట్టని కోటలుగా కొనసాగినవి.

ఈ స్వయం సమృద్ధ గ్రామాలకు తోడుగా అచ్చటచ్చట కొన్ని పట్టణాలు ఉండేవి. వీనిలో కొన్నింట రాజులు, సర్దారులు నివసించుట వలన వానికి రాజకీయంగా ప్రాముఖ్యం లభించింది. కొన్ని పట్టణాలకు మత విషయంగా పేరు ప్రఖ్యాతులు, మరికొన్నింటికి వ్యాపార రీత్యా ప్రాబల్యం ఉండేవి. ఈ ప్రాంతాల్లో నగర సంబంధాలైన కొన్ని పరిశ్రమలు, చేతి పనులు అభివృద్ధి చెందేవి. ఈ పట్టణాల్లో ఈ తీరుగా ఉత్పత్తి అయ్యే వస్తువులు, ఆ నగరాలను దర్శించే వారి అవసరాలకు సరిపడేవి. ఇట్టి పట్టణ పరిశ్రమలలో తయారయ్యే ఉత్పత్తులు సాధారణంగా సమాజంలోని సంపన్న వర్గాల వారి అభిరుచులకు తగియుండేవి. అంతేగాక అందమైన ఆలయాల నిర్మాణము, తాజ్ మహల్ వంటి విశిష్ట కళా నిలయాల కట్టుబడి మొదలగు వానికి ఆధారాలైన కళాకుశల వృత్తులను, సైన్యం కొరకు ఆయుధాలను పోతపోసి రూపొందించు పనితనమును పట్టణములందు రూపుగొని వర్ధిల్లేవి.

ఇక కొన్ని పరిశ్రమలు, నేత పరిశ్రమ వంటివి, నౌకాయాన సదుపాయమున్న నదుల తీరములందున్న మచిలీపట్నం, నాగపట్నం, హుబ్లి, బ్రోచ్ వంటి వ్యాపార నగరాలు వికాసం పొందినవి. అప్పటి భారతదేశపు నేత పరిశ్రమ, తన నాజూకు తనపు ఉత్పత్తుల వలన ప్రపంచ వ్యాప్తమగు విఖ్యాతిని ఆర్జించింది. భారతదేశపు లోహ పరిశ్రమ, రాతి పనితనపు ఉత్పత్తులు, కుమ్మరిపని, కాగితపు పరిశ్రమ, తోలు పరిశ్రమ ఆ కాలంలో ఎంతో పేరు పొందినని. అయితే పట్టణ ప్రాంతాల్లో వర్తక వర్గాల ప్రోత్సాహంతో అభివృద్ధి చెందిన పరిశ్రమల్లోని ఉత్పత్తులు మాత్రం ఏ కొద్ది మంది సంపన్నుల వాడుకకు పరిమితాలై ఉండేవి. సాధారణ ప్రజానీకపు దైనందిన జీవితంలో పనికి వచ్చే వస్తువుల్ని అంటే నిత్యవాడుక వస్తువులు అనబడే వానిని పట్టణపు పరిశ్రమలు తయారు చేసేవి కావు. ఇవి స్వయం సమృద్ధి గ్రామాలలో మాత్రమే ఉత్పత్తి అవుతుండేవి. ప్రజలకు కావలసిన వాడుక వస్తువులను గ్రామాలు, అందలి పరిశ్రమలను నిర్వహించే స్థానిక వృత్తి పనివారలే ఉత్పత్తి చేసేవారు. పట్టణ పారిశ్రామికులకు, పట్టణ వర్తకులకు ఆ ఉత్పత్తిలో ఎట్టి భాగస్వామ్యం ఉండేది కాదు.

ఈ విధంగా బ్రిటిష్ పాలనకు ముందు భారతీయ ఆర్థిక వ్యవస్థ అత్యంత్యాభివృద్ధిని సాధించిన పారిశ్రామిక దేశాల పోటీని ఎరుగక, చక్కగా మనుగడను సాగించింది. అయితే బ్రిటిష్ పాలన ఏర్పడిన తరువాత భారత దేశ ప్రాచీన ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై సంపూర్ణంగా అంతరించింది. భారతీయ పరిశ్రమలు సన్నగిల్లి నామావశిష్టములైనాయి. పరిశ్రమలు కూలిపోగా, వృత్తులు కోల్పోయిన వారు వ్యవసాయాన్ని ఆశ్రయించగా భూమిపై ఒత్తిడి ఎక్కువై వ్యవసాయదారునికి బ్రతుకుతెరువు సన్నగిల్లి అతడు దరిద్రుడైనాడు.

## 1.5.2. వ్యవసాయము :

ప్రాచీన కాలం నుంచి నేటి వరకు కూడా భారతదేశం 'గ్రామీణ భూభాగం'గా ప్రసిద్ధి గాంచింది. ఇది దేశ ఆర్థిక, సామాజిక జీవనానికి ఆయువు పట్టుగా నిలిచినాయి. వ్యవసాయము, గ్రామీణ పరిశ్రమలు చేదోడు వాదోడుగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. రైతులు భూమి సాగుతోబాటు, నూలు వడకడం, బట్టలు నేయడం లాంటి సహాయక వృత్తులను కూడా చేపట్టేవారు. రాజ్యంలోని భూమి అంతా పాలకులకు చెందేది. సారవంతమయిన భూమి, సమవర్షపాతం, స్వతసిద్ధ జలాశయాలు, రైతుల శ్రమ కారణంగా ఆదాయం అధికంగానే ఉండేది. అధిక పంటను బట్టీలలో భద్రపరిచేవారు. రైతులు పూర్వపు వ్యవసాయ పద్ధతులనే అనుసరించారు. ఇందులో శారీరక శ్రమ అధికం. ఎరువులు వేయటం, పద్ధతి ప్రకారం పంటలను మారుస్తుండటం, నీటి పారుదల వసతులను ఏర్పరచటం రైతులు చేసే వారు.

వరి, గోధుమ, బార్లీ, జొన్న, రాగి, సజ్జ, పప్పు, నూనె ధాన్యాలు, గసగసాలు, నీలిమందు, నల్లమందు, పొగాకు, పసుపు, పత్తి, చెరకు వంటి వాణిజ్య పదార్థాలను ఆనాటి వ్యవసాయదారుడు పండించేవాడు. గసగసాలు, నీలిమందు, నల్లమందు, పసుపు, పత్తి , చెరకులలో విదేశీ వ్యాపారం ఎక్కువగా సాగింది. ఉత్తర ప్రదేశ్, బెంగాల్, బీహార్‌లలో చెరకు, ఉత్తర దక్షిణాలలో అక్కడక్కడ, గంగా యమునా సంగమ ప్రాంతమంతటా నీలి మందు, బెంగాల్, దక్కన్, గుజరాత్ ఇతర ప్రాంతాలలో పత్తి విరివిగా పండేవి. రాజస్థాన్‌లోని సంభార్ సరస్సు ప్రాంతంలో, పంజాబ్‌లో ఉప్పు పండేది. పన్నుభారము కొంతవరకు ఎక్కువగా ఉన్నా మొగలులు చేసిన భూమిశిస్తు సంస్కరణల వల్ల నీటి పారుదల సౌకర్యాల వల్ల ఆర్థికంగా రైతుల జీవితం స్థిరత్వాన్ని పొందింది.

ప్రభుత్వ ఖజనాకు వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం భూమి పన్ను ద్వారానే వచ్చేది. సరియైన కొలతలు కొలిపించడం, రాబడిని బట్టి పన్ను నిర్ణయించటం ఖచ్చితంగా జరిగేది కాదు. పూర్వపు దస్తావేజుల ఆధారంతో, పంట అంచనాతో, రాజ్య అవసరాలను బట్టి పన్ను నిర్ణయించేవారు. చెల్లించే పన్ను శాతం సుల్తానుల యుగంలో, మొగలుల పాలనలో మారుతూ వచ్చింది. హిందువుల నుంచి వసూలు చేసే భూమి పన్నును 'ఖరాజ్' అని పిలిచేవారు. ఇది పంటలో 1/5 నుంచి 1/2 వ వంతు వరకు ఉండేది. ముస్లింల నుంచి వసూలు చేసే పన్ను పంటలో 1/10 వ వంతు ఉండేది. భూమి అంతా రాజ్యానికే చెందినప్పటికి, ప్రభుత్వ ఆధీనంలో గల భూమి కంటే వ్యక్తుల, సంస్థల ఆధీనంలో గల భూమే ఎక్కువ. ప్రభుత్వ భూములను 'ఖల్సా భూముల'ని పిలిచేవారు. పన్ను వసూలు దారుని ఆధీనంలో గల భూములున్న గ్రామాన్ని తాలూకా గ్రామమని పిలిచేవారు. సైనికులకు ఇచ్చిన భూమిని ఇక్తా అని, దానంగా ఇచ్చిన భూమిని ఈనాం అని, ప్రత్యేక లక్ష్యం కోసం ఇచ్చిన దానిని వక్ఫ్ అని, ఫించనుగా ఇచ్చినది ఇద్రరత్ అని, మత వ్యక్తులకు ఇచ్చిన దానిని మిల్క్ భూములని పేర్కొన్నారు.

మధ్యయుగంలో భారతదేశంలో విరివిగా భూదానాలు జరిగాయి. బ్రహ్మణులకు, ఉద్యోగులకు, సామంతులకు భూదానాలు జరిగాయి. వీటి వల్ల భూములపై సర్వ హక్కులు దాన గ్రహీతకు సంక్రమించేది. రాజుకు భూమిపై గల సార్వభౌమత్వం, గ్రామీణులకు తమ భూమి వనరులపై గల సామూహిక హక్కులు క్రమంగా తగ్గి వ్యక్తిగత హక్కు ఏర్పడింది. భూమిపై భూస్వామికి వ్యక్తిగత హక్కు ఏర్పడటం వల్ల గ్రామీణులు వీరి దయపై ఆధారపడవలసి వచ్చేది. ఉమ్మడి హక్కులు గల తటాకాలను, దేవాలయాలను, పచ్చిక బీడులను అడవులను ఉపయోగించవలసి వచ్చినపుడు ముందుగా భూస్వామి అనుమతి పొంది నిర్ణీత రుసుం చెల్లించవలసి ఉండేది. సహజంగా ఏర్పడిన జలాశయాలు, తవ్వించిన తటాకాల వల్ల పొలాలకు నీటి వసతి లభించేది.

అల్ బెరూనీ, ఇబన్ బతూతా, షిహా బుద్దీన్ అబ్బాస్ అహ్మద్, అమీర్ ఖుస్రూ, షామ్సీసిరాజ్ ఆఫీఫ్‌లు నాటి రైతుల ప్రజల ఐశ్వర్యాన్ని వర్ణించారు. ధాన్యం ఏడాదికి మూడు పంటలు వస్తాయని, నేల సారవంతమయినదని ఇబన్ బతూతా పేర్కొనగా, అసీఫ్ ఒరిస్సా ప్రాంతాన్ని అభినందిస్తూ, సైన్య అవసరాలన్నీ అక్కడ పండే ఫల ధాన్యాదులు తీరుస్తాయని తెలిపాడు. కాని తరువాత రైతు స్థితి దిగజారింది. 17వ శతాబ్ది మధ్యలో వచ్చిన డచ్చి దేశీయుడైన పేల్‌సర్ట్ సామాన్యులు పేదరికంలో నివసిస్తున్నారని, వారి నివాస స్థలాలు లేమికి, విషాదానికి ఆటపట్టులని, పూరిళ్ళలో నివసించే వారని, వాడుకునే మట్టి పాత్రలు తప్ప ఇతర వస్తువులేమీ ఇండ్లలో ఉండవని తెలిపాడు. 1656 నుంచి 1668 వరకు భారతదేశంలో పర్యటించిన బెర్నియర్ వ్యవసాయ స్థితిని పేర్కొంటూ ఇసుకతోను, ఖాళీగాను వదిలివేసిన విశాల స్థలాలు అనేకాలున్నాయని, దీనికి కారణం రైతులు, కూలీలు లేకపోవడమేనని తెలిపాడు. పంటలో అధికభాగం భూమి పన్నుగా చెల్లించడం వల్ల రైతులు పేదలయ్యారు. ఇది గాక వారు జిజియా, ఇంటిపన్ను, పుల్లరి వగైరాలు చెల్లించవలసి ఉండేది. ఈ భారం ధనిక హిందువులతో పాటు రైతులపై కూడా పడింది. మొగల్ పరిపాలనా లక్ష్యం క్రమబద్ధమయిన ఆదాయ పెరుగుదల అని ఇర్ఫాన్ హబీబ్ అన్నాడు. ఈ కాలంలో ధరలు చవకగానే ఉండేవి. అధిక ధరలు గల వేరొక ప్రాంతంలో అమ్ముకొనే అవకాశం రవాణా లేవీ ఆనాడు లేవు. కరువు వచ్చిన ప్రాంతాలలో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. 16వ శతాబ్దంలో గుజరాత్, లాహోర్, కాశ్మీర్, బెంగాల్‌ల 17వ శతాబ్దంలో గుజరాత్, దక్కన్, కొంకణ ప్రాంతాలలో కరువు ప్రజలను పీడించినప్పటికి నివారణ చర్యలను తీసుకొనడం జరగలేదు.

ఈ విధంగా బ్రిటిష్ పాలనకు ముందు ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇది ప్రజలకూ, ప్రభుత్వానికీ కూడా ప్రధానమైన ఆదాయ వనరుగా రూపొందింది. ఈ వ్యవసాయాన్ని ప్రాచీన కాలంలో నిర్వహించిన మాదిరిగానే నిర్వహించినప్పటికీ సాగు చేయడంలోనూ, వ్యవసాయ పరికరాల్లోను చిన్న చిన్న మార్పులు చోటు చేసుకొన్నాయి. సాగులో ఉన్న భూమి విస్తీర్ణంలో క్రమమైన పెరుగుదల ఏర్పడుతూ వచ్చింది. అయితే వ్యవసాయ ఉత్పత్తిలో పెరుగుదల మాత్రం మందకొడిగా ఉండేది.

## 1.5.3. పరిశ్రమలు :

బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశం ప్రపంచ పారిశ్రామిక వర్క్‌షాప్‌గా తన ఉనికిని పొందింది. ఇక్కడ నుండి వెలువడ్డ భిన్న రకాల వస్తూత్పత్తులు దీనిని ధృవపరుస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు సాంప్రదాయిక పరిశ్రమలకు కేంద్రాలుగా నిలిచాయి. గ్రామీణ పరిశ్రమలు రైతులు, తదితర గ్రామీణుల అవసరాలను తీర్చగా, పట్టణ పరిశ్రమలు ప్రభువుల, సంపన్నుల అవసరాలకు విదేశీ ఎగుమతులను సమకూర్చేవి.

గ్రామీణ ప్రాంతాలలో కమ్మరి, వడ్రంగి, సాలె, చర్మకారుడు, కుమ్మరి, మేదరి, రంగులద్దేవాడు, నూనెగాను గాడించేవాడు, బంగారు ఆభరణాలు తయారుచేయువాడు మొదలుగా గల వృత్తి పనివారు తమ తమ భూమికలను నిర్వహిస్తూ, గ్రామీణులు ప్రధాన అవసరాలను తీర్చే వారు. వ్యవసాయ కార్యకలాపాల్లో తప్పనిసరిగా సహాయాన్ని అందించే కమ్మరి, వడ్రంగి లాంటి పనివాళ్ళు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సుస్థిర స్థానాన్ని పొంది, తమ సేవలకుగాను గ్రామ రైతుల నుండి పంట మార్పిడి సమయంలో ధాన్య రూపేణా సాంప్రదాయక, నిర్ణీత నిష్పత్తుల ప్రకారం ఫలాన్ని గ్రహించేవారు. కుమ్మరి, వడ్రంగి లాంటి పనివాళ్ళు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సుస్థిర స్థానాన్ని పొంది, తమ సేవలకు గాను గ్రామరైతుల నుండి పంట మార్పిడి సమయంలో ధాన్య రూపేణా సాంప్రదాయక, నిర్ణీత నిష్పత్తుల ప్రకారం ఫలాన్ని గ్రహించేవారు. కుమ్మరి, చర్మకారుడు, సాలెలాంటి వృత్తుల వారు అప్పుడప్పుడు మాత్రమే సహాయాన్ని అందిస్తూ, వ్యవసాయదార్ల నుండి ఫలాన్ని పొందే వారు. సాధారణంగా ఈ రెండు రకాల వృత్తి కళాకారుల బాగోగులు వ్యవసాయం, వ్యవసాయదార్ల ప్రగతి క్షేమాలతో ప్రత్యక, ప్రగాఢ సంబంధాన్ని కలిగిఉన్నాయి. గ్రామ ప్రాంతాల్లో నూలు వడకి,బట్టలు నేసే పనులు జాతీయపరిశ్రమలలాగా ప్రాచుర్య వ్యాప్తుల నందుకున్నాయి. వడికే పనిని స్త్రీలు ప్రధానంగా తమ తీరిక సమయాల్లో చేపట్టేవారు. నూలును వడకడంతో బాటు బట్టగా నేయడం కూడా గ్రామీణ ప్రాంతాల్లో బహుళ ప్రాచుర్యంలో ఉంది. అయితే సిల్క్ వస్త్రాల కంటే నూలు వస్త్రాలను ఎక్కువగా నేయడం, నూలు వస్త్రాలలో కూడా నగర వాసులకు నాజూకు లేక మేలిరకం వస్త్రాలను నేయడం కంటే, స్థానికులైన గ్రామీణులు వాడే ముతక వస్త్రాలను ఎక్కువగా నేయడం జరిగింది.

ఆనాటి పట్టణాలు కూడా హస్తకళలకు పేరు గాంచాయి. మేలిరకపు నాజూకైన వస్త్రాలు, తివాసీలు, కంబళ్లు, లోహసామాగ్రి, దంతం, బంగారు, వెండి, లోహాలతో కూడిన నగిషీ పని, ఆభరణాల తయారీ, ఇటుకల తయారీ, విగ్రహాల నిర్మాణం, భవన నిర్మాణం మొదలగునవన్నీ వీటిలో భాగమై ఉన్నాయి. అయితే ఇవి ప్రధానంగా విలాసవంతమైనవి కనుక రాజకుటుంబీకులు, ప్రభు వర్గీయులు, వర్తకులు, సంపన్నుల అవసరాలను సమకూర్చేవి ఆపైన విదేశాలకు కూడా భారీగా ఎగుమతి అయ్యేవి. ఉదాహరణకు బెంగాల్‌లో తయారయ్యే కాలికోలు, కోరాలు, మద్రాసులో ఉత్పత్తి అయ్యే, లుంగీలు, చీరలు, ఢాకాలో తయారయ్యే జరీ బట్ట, పంజాబ్‌లో తయారయ్యే సిల్క్ వస్త్రాలు, ఛోటా నాగపూర్‌లో తెరగుడ్డలు, స్త్రీల దుస్తులు విదేశీ మార్కెట్ల నెంతగానో ఆకర్షించాయి. దేశంలోని భిన్న ప్రాంతాలలోని పట్టణాలు ఒక్కొక్క పరిశ్రమకు ఖ్యాతిని గాంచాయి. ఆ విధంగా ఢాకా ముస్లిమ్, లక్నో చింటెజ్‌లకు, అహమ్మదాబాద్ ధోతీలు, దుపట్టాలు, మద్రాస్‌కు చెందిన పాలంపూర్ పరిశ్రమ, కాశ్మీర్, అమృత సర్, లూధియానాలలో ఉత్పత్తి అయ్యే ఉన్ని కంబళ్లు, బెనారస్ ఇత్తడి, రాగి, పంచలోహ సామాగ్రి, కచ్, సింధ్, సియాల్‌కోట, లాహోర్‌ల రత్న ఖచిత ఖడ్గాలు, డాళ్లు, శ్రీనగర్, ఓరుగల్లు తివాసీలు, రాజస్థాన్ నగిషీ ఆభరణాలు, రాళ్ల పొదుగు ప్రసిద్ధిగాంచాయి. ఇంకా రంగులద్దడం, పాత్రల నిర్మాణం, తోళ్ల వస్తువులు, చెక్క పని, ఇటుకల తయారీ, పంచదార, నీలి మందుల తయారీ, బొమ్మల తయారీ బాగా వ్యాప్తిలో ఉన్నాయి.

భారతీయ వృత్తి పనివారు పనితనంలో, సాంకేతిక నైపుణ్యంలో ఏ మాత్రం తీసిపోలేదు. 20 గజాల పొడవు గజం వెడల్పు గల మేలిరకపు మస్లిన్ బట్ట, చేతి ఉంగరం ద్వారా వెళ్ళగల్గేది. కొండపల్లి, నిర్మల్ బొమ్మలు, బీద్రీ పని, కరీంనగర్ వెండి నగిషీ కళాత్మకతకు, పనితనానికి ప్రతీకలు. మోటుపల్లి రేవును దర్శించిన మార్కోపోలో అను వెనిస్ యాత్రికుడు, తానక్కడ చూసిన సన్నని, నాజూకైన బట్టను ప్రపంచంలో మరెక్కడా చూడలేదనే విస్మయాన్ని వెల్లడించాడు.

లక్షలాది ప్రజలకు జీవనాధారమైన భారతీయ పరిశ్రమ స్థితి, బ్రిటిష్ పాలనారంభంలో పూర్తిగా తారుమారైంది. భారతీయ పరిశ్రమలను అన్ని విధాలా అణచివేసే విధానం బ్రిటిష్ వారు చేపట్టారు. ఫలితంగా సిల్క్, నూలు వస్త్రాల తయారీ ఇండియాలో క్షీణించడం మొదలైంది. గతంలో వీటిని ఐరోపా, ఆసియా మార్కెట్లకు ఎగుమతి చేసిన ఇక్కడి ప్రజలు, ఇప్పుడు వీటిని పెరుగుతున్న ప్రమాణాల్లో దిగుమతి చేసుకోసాగారు.

## 1.5.4. వర్తక వ్యాపారాలు :

బ్రిటిష్ పాలనకు ముందు గల వర్తక, వాణిజ్యాలను జాతీయ వర్తకం, అంతర్జాతీయ వర్తకం అని రెండు రకాలుగా విభజింపవచ్చు. మొదటిది దేశం లోపల అంటే ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికీ మధ్య జరిగే వర్తక కార్యకలాపాలను సూచిస్తుంది. రెండోది ఇతర

దేశాలతో ముఖ్యంగా పశ్చిమ, ఆగ్నేయాసియా దేశాలతో జరిగే వర్తక కార్యకలాపాలను సూచిస్తుంది. మార్కెట్ చేయదగిన వస్తువుల్లో అధిక భాగాన్ని స్థానికంగా గిరాకీయే ఉపయోగించుకొనేది. ఆహారం, దుస్తులతో పాటు ఇతర అవసరాలను తీర్చుకోవడానికి పట్టణ ప్రాంతాలు తమ చుట్టూ ఉన్న గ్రామాలపై ఎక్కువగా ఆధారపడేవి. ఒక్కో ప్రాంతానికి ఒక సంతరోజును నిర్ణయించేవారు. ఆ రోజు అన్ని రకాల వస్తువులను అక్కడికి తెచ్చి అమ్మకం పెట్టేవారు. ఈ సరుకులు గ్రామాల్లో ఉత్పత్తయిన మిగులును ప్రతిబింబించేవి. జాతీయ వర్తకానికి సంబంధించి ఈ పట్టణ కేంద్రాలు ప్రధాన మార్కెట్ ప్రాంతాలుగా ఉండేవి.

జాతీయ వర్తకానికి అత్యంత ఆవశ్యకమైనది రవాణా సౌకర్యం. ఆనాడు రెండు రకాల రవాణా సౌకర్యాలుండేవి. అవి భూమార్గం, జల మార్గం. బ్రహ్మ పుత్ర, గంగ, గోదావరి, కావేరి నదులలో జల రవాణా వ్యవస్థ ఉండేది. ఈ రవాణా వ్యవస్థ వల్ల విభిన్న ప్రాంతాల మధ్య అనుసంధానం సులభతరమైంది. సరుకులను ఒక చోటి నుండి మరో చోటికి తీసుకుపోవడానికి పెద్ద పెద్ద బల్లకట్టులను ఉపయోగించారు. నదీ రవాణా కంటే రోడ్డు రవాణా కొంత వ్యయభరితమైంది. వివిధ ప్రాంతాలలోని వివిధ రకాల రవాణా సుంకాల వల్ల ఈ రకం రవాణా వ్యయంతో కూడు కొన్నది. బంజారాలు కూడా చిడారుల ద్వారా అధికమొత్తంలో సరుకులను ఒక చోటి నుంచి మరొక చోటికి తరలించేవారు. ముఖ్యంగా షేర్షాకాలంలో మంచిరోడ్లు వేయడం జరిగింది. ఈ రోడ్లు దేశంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానం చేశాయి. వీటిలో ముఖ్యమైనవి సోనర్గావ్ సింధు మార్గం, ఆగ్రా - జోధ్ పూర్ మార్గం, ఆగ్రా - బర్హాంపూర్, లాహోర్ - ముల్తాన్ మార్గాలు. వర్తకులకు షేర్షా రక్షణ సదుపాయం కల్పించాడు. అక్బర్ కాలం నాటి వర్తక మార్గాలలో ప్రముఖమైనవి సూరత్ నుంచి ఆగ్రా, ఢిల్లీ, లాహోర్, కాబూల్ మీదుగా చైనా వరకుగల మార్గం, సూరత్ నుండి అహమ్మదాబాద్, బరోడాల మీదుగా ఆగ్రా వరకు, ఆగ్రా నుంచి అలహాబాద్, పాట్నాల మీదుగా బెంగాల్ వరకు గల మార్గాలు, సూరత్ నుంచి ఆగ్రా మార్గం, ఆగ్రా నుంచి అయోధ్య మార్గం, ఆగ్రా నుంచి పర్షియా వరకు గల మార్గం, పాట్నా నుంచి ఖాట్మాండు వరకు గల మార్గం, ఆగ్రా నుంచి దౌలతాబాద్ మీదుగా గోల్కొండ మార్గం, గోల్కొండ నుంచి మచిలీపట్నం మార్గం. మలబార్ నుండి కొబ్బరి కాయలు, సుగంధ ద్రవ్యాలు, ఇనుము, తాటి చక్కెర, గంధం చెక్క మొదలైనవి దయ్యాకి ఎగుమతి అయ్యేవి. బెంగాల్‌లోని సన్న వస్త్రాలు, చక్కెర మలబార్, కాంబేలకు ఎగుమతి చేయబడింది. వ్యాపారాలలో దళారులు ఉండేవారు.

బ్రిటిష్ పాలనకు ముందు భారతదేశానికి ఇతర దేశాలతో పటిష్టమైన వర్తక సంబంధాలుండేవి. భూ మార్గం ద్వారా మధ్య ఆసియా, ఆరేబియాలతో, సముద్ర మార్గం ద్వారా సింహళం, బర్మా, ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాలుండేవి. ఐరోపా వర్తకులయిన పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు వారి రాకతో వర్తక సంబంధాలు అభివృద్ధి చెంది భారతదేశం లాభాలనార్జించేది. రేవు పట్టణాలైన గోవా, భట్కల్, మద్రాస్, బొంబాయి, కలకత్తా, మచిలీపట్నం ఆధిక్యతను పొందాయి. భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే ముఖ్య వస్తువులు ఆభరణాలు, విలాసవస్తువులు, సుగంధాలు, దంతపు వస్తువులు, పరిమళ ద్రవ్యాలు మొదలయినవి. దిగుమతులలో ముత్యాలు, కాయలు, బంగారం, సాంబ్రాణి, ఉన్ని వస్త్రాలు, గుగ్గిలం, గుర్రాలు, నీలి మందును టర్కీకి, ఇతర ఐరోపా దేశాలకు ఎగుమతి చేసేవారు. బెంగాల్‌లో పండే నీలి మందు డచ్చివారు మచిలీపట్నం రేవు నుంచి ఎగుమతి చేసేవారు. బెంగాల్ చక్కెర అరేబియా, మెసపటోమియా, పర్షియాలకు ఎగమతి అయ్యేవి. గసగసాలు పెగూకు పంపేవారు. సుగంధ ద్రవ్యాలు మలబారులో ఎక్కువగా పండేవి. బిజాపురం ఏలక్కాయలు ఖ్యాతి గాంచినవి. మిరియాలు అధికంగా బీజాపూర్, మలబార్ కొచ్చిన్, బీహార్, బెంగాల్‌లో పండేవి. ఐరోపా వర్తకులు భారతదేశానికి రావడానికి ఇవే ముఖ్య కారణం. సూరత్ లవంగాలకు, జాజి కాయలకు ప్రసిద్ధి చెందటం వల్ల వీటిని కూడా ఐరోపాకు ఎగుమతి చేశారు. కాంబే నుంచి కార్నిలియాన్ పూసలు ఐరోపా తూర్పు ఆఫ్రికాలకు పంపేవారు. గోవారేవును పోర్చుగీసు వారు గుర్రాల కేంద్రంగా మార్చారు. తూర్పు తీర ప్రాంత వర్తకులు మలబారు వర్తకులు సింహళంలో లాభసాటి వ్యాపారం చేసేవారు.

**16, 17** శతాబ్దాలలో ఐరోపా వర్తకులు భారతదేశంలో వర్తక స్థావరాలనేర్పాటు చేసుకొని వ్యాపారం సాగించారు. పోర్చుగీసువారు గోవా, మలక్కా, ఆర్మజ్ ప్రాంతాలలో వర్తక స్థావరాలనేర్పరచుకొన్నారు. కొచ్చిన్ ద్వారా మిరియాలు, కొలంబో నుంచి దాల్చిన చెక్క వ్యాపారాన్ని వీరు కొనసాగించారు. డచ్చి వారు సూరత్, మచిలీపట్నం, నిజాం పట్నం, పులికాట్‌ల వద్ద వర్తక స్థావరాల నేర్పరచి సుగంధ ద్వీపాల కోసం భారత వ్యాపారం చేశారు. ఆంగ్లేయులు మద్రాస్, బొంబాయి, మచిలీపట్నం, నిజాం పట్నం, బెంగాల్‌లలో స్థావరాలనేర్పాటు చేసి వ్యాపారం చేశారు. ఫ్రెంచి వారు పాండిచ్చేరి,నాగపట్నం, దక్కన్ కేంద్రాలుగా వర్తక ఆధిపత్యపు పోటీలో పాల్గొన్నారు. ఐరోపా

వాసులందరిపై ఆంగ్లేయులు ఆధిక్యత పొందగలిగారు. ఐరోపా వారు వర్తక వాణిజ్యాలలో పాలు పంచుకోవడంలో ఇండో-యూరోపియన్ వర్తక పరిమాణం బాగా పెరిగిపోయింది. ప్రపంచంలోని ఖండాంతర వర్తకంలో భారతదేశానికి సంబంధాలు ఏర్పాడ్డాయి. ఈ కొత్త వర్తకం నూలు వస్త్రాలు, నీలి మందు మొదలైన వాటి ఉత్పత్తిని ప్రేరేపించింది.

వర్తక, వాణిజ్యాలు వృద్ధి చెందడం, వ్యవసాయేతర ఉత్పత్తులు పెరగడం పట్టణ కేంద్రాలు వృద్ధి చెందడానికి దోహదపడింది. బ్రిటిష్ పాలనకు ముందు బారతదేశములోని పట్టణ కేంద్రాలను నాల్గు వర్గాలుగా విభజించవచ్చు. అవి 1) ఢిల్లీ, ఆగ్రా, హైదరాబాద్ వంటి పరిపాలనా కేంద్రాలు 2) మధుర, వారణాశి, తంజావూరు వంటి యాత్రా కేంద్రాలు 2) సూరత్, మచిలీపట్నం, సోనార్‌గావ్ వంటి వాణిజ్య కేంద్రాలు 4) బ్రోచ్, బయానా వంటి ఉత్పత్తి కేంద్రాలు. ఆగ్రా కేవలం పాలనాపరమైన కేంద్రంగానే కాకుండా వాణిజ్య కేంద్రంగా కూడా ఉండేది. 16, 17 శతాబ్దాలు పట్టణీకరణకు స్వర్ణయుగం. ఈ కాలంలో పట్టణ సంస్కృతి బాగా వికసించింది. వాణిజ్యానికి అనుకూలమైన రాజకీయ పరిస్థితులను ఏర్పాటు చేయడం వల్లనే ఇది సాధ్యమైంది. ఇలా అభివృద్ధి చెందిన పట్టణ కేంద్రాలు తిరిగి వాణిజ్యం విస్తరించడానికి దోహదం చేశాయి. ఈ పట్టణ కేంద్రాలకు సంపద చేకూర్చి పెట్టిన నూలు వస్త్రాల ఉత్పత్తిలో ఈ విషయం స్పష్టమవుతుంది. బెంగాల్‌లో ఢక్కా, ముషీరాబాద్, గుజరాత్‌లోని సూరత్, అహమదాబాద్, బ్రోచ్, మహారాష్ట్రంలో బర్హాంపూర్, ఉత్తర ప్రదేశ్‌లో లక్నో, ఆగ్రా, పంజాబ్‌లో ముల్తాన్, కోరమాండల్‌లో మచిలీపట్నం, శ్రీకాకుళం, మద్రాసు, కోయంబత్తూరు, మధురైలు ప్రముఖ జౌళి పరిశ్రమ కేంద్రాలుగా రూపొందాయి. ముస్లిం కులీనుల పట్టణ స్వభావం వర్తకంలో వారికున్న ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్యం వల్ల వారు నగరాల్లో నివసించేవారు. ఫలితంగా వారు ఎంతో మంది చేతి పనివాళ్ళను నగరానికి ఆకర్షించారు. ఉపాధి అన్వేషణలో ముకనంగా కార్ఖానాల్లో పని చేయడానికి చేతి పనివారు నగరాలకు రావడం సహజమైపోయింది. పట్టణీకరణ వృద్ధి చెందడానికి ఐరోపా వారు భారతదేశానికి రావటం కూడా మరొక ముఖ్య కారణమైంది. ఓడ రేవుల్లో వున్న ఐరోపా వారు ఓడరేవు పట్టణాలలో స్థిరపడటానికి ఎంతో మంది ప్రజలను ఆకర్షించారు. భారతదేశంలో యూరోపియన్‌ల జోక్యం వల్ల ఓడరేవుల సంఖ్య పెరిగింది. ఈ కొత్త ఓడరేవులే తరువాత కాలంలో ప్రధాన నగరాలుగా వృద్ధి చెందాయి. వాటిలో మద్రాసు, బొంబాయి, కలకత్తా ప్రధానమైనవి.

## 1.5.5. సారాంశము :

బ్రిటిష్ వారు భారతదేశానికి రాక ముందు నుంచీ భారతదేశం, అత్యంత గొప్ప పారిశ్రామిక దేశంగా ఉండేదనడం నిస్సంశయం. గ్రామీణ, పట్టణ పరిశ్రమలకూ, పట్టణ ఆర్థిక వ్యవస్థ మీద వాటి ప్రభావానికీ సంబంధించిన అధ్యయనం వల్ల పెట్టుబడి దారీ విధానాల్లో అభివృద్ధి చెందే సామర్థ్యం భారతదేశానికి ఉండేదన్న విషయం వెల్లడవుతుంది. ఐరోపా వారి రాకతో ఉత్పత్తి వృద్ధి చెందడానికి మరింత అవకాశం ఏర్పడింది. ఈ అధికోత్పత్తి విదేశీ డిమాండ్‌ను తీర్చడానికి సరిపోయింది. అయితే వలసల కోసం ఐరోపా వారి మధ్య జరిగిన పోరాటాలు, వారి మధ్య ఏర్పడిన పోటీ, మొగలాయిల తరువాత భారతీయ ప్రభుత్వాల మధ్య ఏర్పడిన బలహీనత మొదలైనవి బ్రిటిష్ వారు భారతదేశాన్ని జయించడానికీ, తద్వారా భారతదేశం కేవలం ఒక వలస స్థాయికి పడిపోవడానికి తగిన మార్గం ఏర్పరిచాయి.

## 1.5.6. నమూనా ప్రశ్నలు :

1. బ్రిటిష్ పాలన నెలకొన్నప్పటికి భారతదేశంలో ఆర్థిక పరిస్థితులను వివరింపుము

## 1.5.7. చదువదగిన గ్రంథాలు :


1. Mohammad Habib : A Comprehensive History of India
2. A.B. Pandey : Later Medieval India
3. K.S. Lal : Studies in Medieval Indian History
4. D. Pant : The Commercial Policy of the Mughals

5. K.A.N. Sastri : A History of South India
6. S. Arasaratnam : Merchants, Companies and Commerce on the Coramandal Coast
7. G. Hambly : Cities of Mughal India
8. Shireen Moosvi : The Economy of the Mughal Empire
9. Radhakamal Mukherjee : The Economic Hisotry of India
10. H.K. Naqvi : Urban Centres and Industries in Upper India
11. J.N. Sarkar : Studies in Economic Life in Mughal India


**- డా॥ వి.కె. మోహన్**

ఖండిక - 2

## పాఠం - 2.1

# ఆంగ్లేయులు భారతీయుల ఎడ ప్రదర్శించిన వైఖరి

### 2.1.0. లక్ష్యం :

ఆంగ్లేయులు భారతీయుల ఎడ ప్రదర్శించిన వైఖరి గూర్చి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయ సూచిక :

2.1.1. ఆంగ్ల పాలకుల సహజాహాంకారం

2.1.2. తొలిదశలో భారతీయులలో ఆంగ్లేయుల సత్ సంబంధాలు

2.1.3. ఆంగ్లేయుల ప్రవర్తనలో మార్పు

2.1.4. రామ్‌మోహనరాయ్‌కి అవమానం

2.1.5. భారతీయుల భయ సంకోచాలు

2.1.6. భారతీయుల ఎడ ఆంగ్లేయుల న్యూన భావం

2.1.7. క్రైస్తవ మిషనరీల ప్రభావం

2.1.8. సిపాయిల తిరుగుబాటు ప్రభావం

2.1.9. ఆంగ్ల స్త్రీలు

2.1.10. ఇతర కారణాలు

2.1.11. శారీరక హింస

2.1.12. న్యా పాలనలో వివక్ష

2.1.13. ఆంగ్లేయుల ప్రవర్తన ఫలితాలు

2.1.14. నమూనా ప్రశ్నలు

2.1.15. చదువవదగిన గ్రంథాలు

### 2.1.1. ఆంగ్ల పాలకుల సహజాహాంకారం :

ఒక జాతి మరొక జాతిపై అధిపత్యం సంపాదించినపుడు పాలక జాతి, పాలిత జాతిని చిన్న చూపు చూడటం, గర్వాహంకారంతో ప్రవర్తించటం సహజం. భారతదేశం పై సార్వభౌమత్వం సంపాదించిన ఆంగ్లేయులు కూడా భారతీయుల ఎడ అహంకారంతో ప్రవర్తించటం సహజమే. జాన్ స్టువర్ట్ మిట్ అన్నట్లు విజేతలు, విజితుల ఎడ దురహంకారంతో పొగరుమోతుతనంగా ప్రవర్తించకుండా చూడటం ఏ ప్రభుత్వానికి అయినా కష్టం అయిన పని. దీనికి తోడు ఆంగ్లేయులు తాము నాగరికులమని, హిందువులు అనాగరీకులని భావించటం పరిస్థితిని మరింత దిగజార్చింది.

ఆంగ్లేయులు, భారతీయుల సాంఘిక సంబంధాలు క్లిష్టంగా రూపొందాయి "హిందూవుల తెలివి తేటలు జంతువుల తెలివి తేటలను పోలినవి. వారి మర్యాద మన్ననలు వారి బలహీనతకు తార్కాణం మాత్రమే. వారిలో ధైర్యసాహసాలు పూజ్యం. కనుకనే మనం వారిని జయించ గలిగాము." అని మార్క్విస్ ఆఫ్ హేస్టింగ్స్ అభిప్రాయపడినాడు. మిల్ వంటి చరిత్ర కారులు, సర్ విలియం జోన్స్ ప్రతిపాదించిన సనాతన భారతీయ నాగరికతను గూర్చి అవహేళన చేశారు.

## 2.1.2. తొలిదశలో భారతీయులతో ఆంగ్లేయుల సత్ సంబంధాలు :

అయితే కొందరు ఆంగ్లేయులు ఈ జాత్యహంకార ధోరణిని తీవ్రంగా ఖండించి భారతీయులతో సాంఘిక సత్సంబంధాలు నెలకొల్పుకోవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. 1817లో సర్ థామస్ మన్రో ఇలా వ్రాశాడు. "ఇండియాపై దండెత్తిన విదేశీయులు భారతీయులను హింసకు, వేదనకు గురిచేయక పోలేదు. కాని మనవలె (ఆంగ్లేయుల వలె) భారతీయులను హీనంగా చూసిన వారు లేరు. వారినందరినీ నమ్మదగని వారందరి గానీ, అవినీతిపరులు గానూ చిత్రించిన వారూ లేరు. వారులేల క్షణమైనా గడవని మనం వారిని పనికిమాలిన వారిగా చూడటం న్యాయం కాదు. ఇంతకంటే క్రూరత్వం మరెక్కడా ఉండదు". F.J. షోర్ కూడా ఇట్టి అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

ఆంగ్లేయుల మనస్సులో ఎలాంటి భావాలున్నటికీ 19వ శతాబ్ది ప్రధమ పాదంలో వారు భారతీయులతో సాంఘికం అయిన సత్సంబంధాలు కలిగి ఉండేవారు. వారి మతాచారాలను, సాంఘిక ఆచారాలను గౌరవించారు. భారతీయ స్త్రీలను వివాహమాడారు. హిందూవులతో కలిసి మెలసి విందుల్లో పాల్గొనేవారు. హుక్కా త్రాగేవారు. తాంబూలం వేసుకునేవారు. దేవదాసీల నృత్యగానములతో సోలిపోయేవారు. తమ హిందూ భార్యలతో పాటు కొందరు విగ్రహారాధనలో పాల్గొనేవారు. ద్వారకానాధ ఠాగూర్ కలకత్తా సమీపంలోని తన భవనంలో ఆంగ్లేయ, భారతీయ ప్రముఖులకు తరచు విందులు చేశాడు. అతడు లార్డ్ ఆక్లండ్‌తో విందులకు ఆహ్వానించబడేవాడు. లార్డ్ ఆక్లండ్ 1837 క్రిష్టమస్ రోజున అయోధ్య నవాబు ఆతిధ్యం అంగీకరించి లక్నోలో ఫలావు భుజించి హుక్కా పీల్చాడు. ఈస్టిండియా కంపెనీ తొలి రోజుల్లో హిందూ, ముస్లీం మతాలను ఆదరించేవి, వారి ఆఫీసులు ఆదివారాల్లో పనిచేస్తూ హిందూ ముస్లీం పర్వదినాల్లో సెలవులు ప్రకటించేవి. హిందూ దేవతల గౌరవార్థం కంపెనీ సేనలు ఊరేగింపుల్లో పాల్గొనేవి. ఋతుపనముల తొలకరిలో కొబ్బరికాయలు కొట్టే వారు. హిందూ దేవాలయములు మనులు, మాన్యాలు మన్నించేవారు.

## 2.1.3. ఆంగ్లేయుల ప్రవర్తనలో మార్పు :

భారతీయుల ఎడ ఆంగ్లేయుల సృహృద్భావం ఎంతో కాలం నిలువలేదు. వారి ప్రవర్తనలో విపరీతమైన మార్పు వచ్చింది. వారి సామ్రాజ్యాధికారం స్థిరపడి వారిలో అంగీకారం పెరిగిపోవటం దీనికి ముఖ్య కారణం. వర్ణ వివక్షతో బాటు భారతీయులు అజ్ఞానులు, అనాగరికులు, బలహీనులు, పిరికి వారు అన్న భావం వారిలో పాతుకుపోయింది. వారిలో జాత్యహంకారం స్థిరపడింది. సిపాయిల తిరుగుబాటు వారిలో ద్వేషం పెంచింది. క్రైస్తవ మిషనరీల ఎడ వారి సానుభూతి భారతీయ మత, సంస్కృతుల ఎడ నిర్లక్ష్యం ఏర్పరచింది. ఈ కరాణాల ఫలితంగా ఆంగ్లేయులు భారతీయులతో సరయిన సాంఘిక సంబంధాలు ఏర్పరచుకోలేకపోయారు.

## 2.1.4. రామ్ మోహన్ రాయ్‌కి అవమానం :

మహా మేధావి, సంఘ సంస్కర్త, గవర్నర్ జనరల్‌తో పరిచయం ఉన్న రామ్ మోహన్‌రాయ్‌కే ఆంగ్ల ఉద్యోగుల చేతిలో అవమానం తప్పలేదు. ఇక సామాన్యుల విషయం చెప్పనక్కరలేదు. 1909 జనవరి 1 వ తేదీ సాయంత్రం 4 గంటలకు భాగల్పూర్‌లో ఒక వీధి వెంట పల్లకీలో వెళుతున్నాడు. ఆ సమయంలో జిల్లా కలెక్టర్ సర్ ఫ్రెడరిక్ హామిల్టన్ రోడ్డు ప్రక్క నిలుచొని యున్నాడు. పల్లకీ తలుపులు మూసి ఉండటం చేత రామ్మోహన్ రాయ్ అతనిని చూడలేదు. ఒక భారతీయుడు తనకు నమస్కరించకుండా పల్లకిలో వెళ్ళటం కలెక్టర్ భరించలేకపోయాడు. పల్లకీ నుండి దిగమని గర్జిస్తూ బండ బూతులు తిట్టసాగాడు. రామ మోహన్ రాయ్ సేవకుడు తమ యజమాని అతన్ని చూడలేదని చెప్పి శాంతింప చేయటానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. తిట్ల వర్షం అధికం చేశాడు. రామ మోహన్ రాయ్

పల్లకీ దిగి క్షమాపణ కోరినా అతని కోపం తగ్గక ఇంకా అవమానకరంగా మాట్లాడాడు. రామ మోహన రాయ్ నిరసనకు ప్రతిస్పందించిన గవర్నర్ జనరల్ కలెక్టర్‌ను మందలించటం వేరే సంగతి.

## 2.1.5. భారతీయుల భయ సంకోచాలు :

ఇండియాలో సాధారణంగా అపజయం ఎరుగని ఆంగ్లేయుల ఎడ, వారి శ్వేత వర్ణం ఎడ కొందరు భారతీయులకు ఆరాధన భావం ఉండేవి. వారు సర్వశక్తిమంతులని విశ్వసించేవారు. కాని ఎక్కువ మంది భారతీయులలో ఆంగ్లేయుల ఎడ్ భయ సంకోచాలే అధికంగా ఉండేవి. విపరీతం అయిన భయంతో వారు తమ సాధారణ హక్కులు పొందటానికి కూడా సంకోచించేవారు. ఆంగ్లేయులు కన్నెర్ర చేస్తే ఒక్క కలం పోటుతో తమను సర్వ నాశనం చేయగలరని వారు జంకేవారు. ఈ భయానికి కారణం లేకపోలేదు. పొరపాటున సలామ్ చెయ్యకపోతే ఆంగ్ల ఉద్యోగులు అమితంగా హింసించేవారు. ఆంగ్లేయుల అహంకారం భారతీయుల భయ సంకోచాల కారణంగా రెండు జాతుల నడమ రాజకీయ, వర్తక సంబంధాలు తప్ప సాంఘిక సంబంధాలు క్రమంగా క్షీణించాయి.

## 2.1.6. భారతీయుల ఎడ ఆంగ్లేయుల న్యూన భావం :

19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంగ్లేయులకు సాధారణ భారతీయుల ఎడ న్యూన భావమూ, విద్యావంతులైన భారతీయుల ఎడ ద్వేష భావమూ ప్రబలంగా ఉండేవి. మచ్చుకు 1855 'కలకత్తా రివ్యూ' అనే పత్రికలో బెంగాలీలను గూర్చి ఆంగ్లేయుల అభిప్రాయంలో వ్యాస రూపంలో ప్రచురింపబడింది. "బెంగాలీల పిరికితనం కల్తీలేనిది. వారు ద్రోహులు, కపటులు, కనుకనే విదేశీ జాతులు వరుసగా వారిని జయించి అణగద్రొక్కుతూ వచ్చిరి. పరాక్రమం, వీరత్వం అన్నది వారిలో అణుమాత్రమైనా లేదు. బెంగాలీల మిక్కిలి బలహీనులు, దేబెలు, ఆశబోతులు, స్వయం పాలనకు వారు ఎంత మాత్రం తగరు. వారు పౌరుషం అన్నది ఎరుగరు. వట్టి అబద్ధాల కోరులు, గనుక వారిని నమ్మరాదు". ఈ వ్యాఖ్యలు బెంగాలీలను గురించి వ్రాయబడినప్పటికీ భారతీయులందరినీ గురించి ఆంగ్లేయుల భావం ఇలాంటిదే.

## 2.1.7. క్రైస్తవ మిషనరీల ప్రభావం :

1813 తరువాత క్రైస్తవ మిషనరీలు ప్రభుత్వ సహకారంతో తమ మత ప్రచారాన్ని ఉధృతం చేశారు. వారు విద్యా, వైద్య రంగాలలో ఎనలేని సేవలు చేశారు. కాని వారి సేవలు ప్రధానంగా మతం మార్చుకోవటానికి వినియోగించుకొనటం గమనార్హం. తమ పాఠశాలలోను, ప్రచార గ్రంధాలలోను, హిందూ మతం పై దుమ్మెత్తి పోసేవారు. బలవంతంగానూ, మోసంతోనూ, ధనాశ ఎరచూపి, హిందువులను తమ మతంలోనికి మార్చటం జరిగింది. ఇది కూడా ఆంగ్లేయులకు, హిందూవులకు (భారతీయులకు) నడుమ వైమనస్యం ఏర్పడడానికి దారి తీసింది. ఆవిద్య నెపంతో మిషనరీలు తమ విద్యాలయాల్లో మత ప్రచారం చేయటం, హిందూ దేవతలను నిందించటం జరిగింది. ఈ పద్ధతులను హిందూ ప్రముఖులు, పత్రికలు తీవ్రంగా విమర్శించారు.

## 2.1.8. సిపాయిల తిరుగుబాటు ప్రభావం :

1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు లేక ప్రథమ స్వాతంత్ర్య సమరం ఫలితంగా ఆంగ్లేయులకు, భారతీయులకు గల సామాజిక సంబంధాలు మరింత దిగజారి పోయాయి. తిరుగుబాటు కాలంలో సిపాయిలు ఆంగ్లేయులను అనేకులను చంపివేశారు. ఈ తరువాత తిరుగుబాటు అణచి వేసిన ఆంగ్లేయులు అనుమానితులైన భారతీయులను అసంఖ్యాకంగా, నిర్దాక్షణ్యంగా హతమర్చారు. పిమ్మట చిరకాలం వరకు ఆంగ్లేయులు భారతీయుల ఎడ కక్ష వహించి వారిని చీటికి మాటికి హింసిస్తూ వారిలో ద్వేషాగ్నిని రగుల్కొల్పుతూనే వచ్చారు. విక్టోరియా రాణి ప్రకటన కూడా ఆంగ్లేయుల ప్రతీకార వాంఛను గాని, భారతీయుల స్వాతంత్ర్య పిపాసను గాని అణచలేకపోయింది. 1864 నాటి ది ఇండియన్ విప్పింగ్ ఆక్ట్ ననుసరించి తప్పు చేసిన సిపాయిలను కొరడా దెబ్బలు కొట్టే అధికారం సంక్రమించింది. 1878 సంవత్సరములో 75,223 సార్లు ఈ శిక్ష విధింపబడిందంటే ఆంగ్లేయుల ధోరణిని ఊహించుకోవచ్చు. ఇట్టి చర్యల ద్వారా భారతీయుల విద్వేషం పెచ్చు పెరిగింది. తిరుగుబాటు సమయంలో జనరల్ నీల్ చేసిన అమానుష కృత్యాలు ఆంగ్లేయులకు ఆనందాన్ని కలిగించాయి.

## 2.1.9. ఆంగ్ల స్త్రీలు :

ఆవిరి యంత్రంలో నడిచే ఓడలు అమలులోకి వచ్చి, సూయజ్ కాలువ తెరవబడిన పిమ్మట ఇండియా, ఇంగ్లాండ్‌ల మధ్య ప్రయాణ సౌకర్యం మెరుగైంది. ఆంగ్లేయులు తమ భార్యలను ఇండియాకు తీసుకురావటం తాము తరచు మాతృదేశాన్ని సందర్శించటం అధికం అయింది. ఆంగ్ల స్త్రీల ఆగమనంలో భారతదేశంలో ఆంగ్లేయుల ప్రవర్తనలో మరింత మార్పు గోచరించింది. వీరు భారతీయులతో కలిసి మెలసి సంచరించటం తగ్గిపోయింది. ఆంగ్లేయులొక్కరే అగ్రవర్ణానికి చెందిన వారిగా భావించి భారతీయులను అస్పృస్యులుగా చూడటం పరిపాటి అయింది. ఆంగ్ల స్త్రీలకు, వారి సంతానానికి భారతదేశం దరిద్ర దేశంగానూ, భారతీయులు నల్ల జంతువులు గానూ గోచరింపసాగిరి. ఆంగ్లేయుల నివాస గృహముల వైపు భారతీయుల సంచారం నిషేదింపబడింది. 'మేమ్ సాహిబ్' 'దొరసానుల' అహంకారం మరింత దుర్భరంగా మారింది.

## 2.1.10. ఇతర కారణాలు :

పోటీ పరీక్షలలో కృతార్ధులైన వారిని ఉద్యోగాలలో నియమించే కొత్త పద్ధతి వల్ల మేధావులైన వారికే ఉద్యోగాలు వచ్చాయి. అంతకు ముందు వలె మర్యాదస్తులు, సంస్కారులునైన ఉన్నత వంశీకుల నియామకం తగ్గిపోయింది. కొత్త రకం ఉద్యోగులలో విద్య ఉంది కానీ సంస్కారం లేదు. అందుకే భారతీయులలో సంస్కారవంతంగా ప్రవర్తించలేకపోయారు. ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం తొలిగి నేరుగా బ్రిటిష్ ప్రభుత్వంచే నియమింపబడిన వారికి బాధ్యతల కంటే అధికారాలే ఎక్కువగా సంక్రమించాయి. ఆంగ్ల విద్యలో నిష్ణాతులై తమతో సమానం అయిన మేధాశక్తి, సమర్ధత కలిగిన భారతీయులను ద్వేషించనారంభించిరి. భారతీయులు తమతో సమానులు అన్న భావమే వారికి కంటికి ఇంపుగా ఉండేది.

## 2.1.11. శారీరక హింస :

బ్రిటీష్ ఆఫీసర్స్ తమ ఇళ్ళలో పనిచేసే వారిని చీటికి మాటికి కొట్టి శారీరకంగా హింసించారు. ఎవరైనా ఉన్నతోద్యోగిని వీధిని వెళ్ళేటపుడు మహాజరు సమర్పిస్తూ పాదాల మీద పడిన వారిని చేతిలోని కర్రతో గొడ్డును కొట్టినట్లు ఎడాపెడా కొట్టేవారు. ఆంగ్లేయులతో పాటు రైలు ప్రయాణానికి సహసించిన భారతీయులకు తన్నులు తప్పేవి కాదు. సర్ హెన్రీ కాటన్ ఈ విషయమై ఇలా వ్రాసాడు. "ఒక సాధారణ ఆంగ్ల ఉద్యోగి నెక్కిన రైలు పెట్టెలో ఇద్దరు హిందూ పెద్ద మనుషులుండటం చూశాడు. రైలు కదలబోయే తరుణంలో వారిద్దరినీ ఒక్కఉదుటన బయటికి త్రోసేవాడు. ఒక చిన్న జమిందారు ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేస్తుండగా ఇద్దరు ఆంగ్లేయులు అతన్ని బాగా కొట్టటమే కాక మరొక స్టేషన్ వచ్చిందాకా అతని చేత అన్ని సేవలు చేయించుకున్నారు. తాము వీధి వెంట వెళుతున్నపుడు గుర్రం మీద నుండి దిగి సలామ్ చెయ్యని భారతీయులను చచ్చిందాకా కొట్టటం పరిపాటి''. ఒక ఆంగ్ల పోలీస్ అధికారి బ్రహ్మణుడైన కానిస్టేబుల్ తలపై తన పాదరక్షలుంచి అవమానించాడు. టీ తోటలలో దొరల దెబ్బలు తాళలేక ప్రాణాలు కోల్పోయిన కూలీల ఉదంతాలు బెంగాలీ పత్రికలు నిండిపోయేవి. 1883 లో ఇండియాలో పర్యటించిన W.S. బ్లంట్ ఇట్టి ఉదాహరణలను ఎన్నింటినో ఉటంకించాడు. జాన్ నికల్సన్ తనకు సలామ్ చెయ్యని ఒక ముల్లా గడ్డం గొరిగించాడు.

## 2.1.12. న్యాయ పాలనలో వివక్ష :

జాత్యహంకారంతో భారతదేశంలో ఆంగ్లేయులు చేసే నేరాలపై సరయిన న్యాయ విచారణ జరిగేది కాదు. న్యాయ పాలనలో వివక్ష చూపటం పరిపాటి. హత్యనేరాలలో భాగస్వామ్యం కల ఆంగ్లేయులకు కూడా స్వల్ప శిక్షలు విధింపబడేది. ఆంగ్లేయులను కఠినంగా శిక్షించిన పక్షంలో పాలితులైన భారతీయుల దృష్టిలో వారి ప్రతిష్ఠ దెబ్బతింటుందని అధికారులు విశ్వసించేవారు. 20వ శతాబ్దం ప్రారంభంలో ఒక భారతీయ బాలుణ్ణి మంటల్లోకి త్రోసి చంపినందుకు ఒక వెటర్ని సూపరింటెండ్‌కు కేవలం 100 రూ. జరిమాన మాత్రమే విధించటం జరిగింది. ఒక ఆంగ్ల సైనికుడు ఒక భారతీయ సైనికుని రాతితో కొట్టి చంపినందుకు గాను అతన్ని ఒక ఏడాది జైలు శిక్ష విధించటం జరిగింది. ఫిరంగి దళానికి చెందిన 3 ఆంగ్లేయులు డా॥ సురేష్ చంద్ర అనే భారతీయుణ్ణి దారుణంగా చంపినందుకు కేవలం 7 సంవత్సరాల శిక్ష మాత్రమే విధింపబడింది. పైగా ఇట్టి నేరాల్లో శిక్షింపబడిన ఆంగ్లేయులకు జైళ్లలో అన్ని సదుపాయాలుండేవి. 1876లో ఫుల్లర్ అనే

ఆంగ్ల న్యాయవాది తన గుర్రపు బగ్గీ తోలే ఒక భారతీయ వ్యక్తిని కొట్టి చంపినందుకు కేవలం 30 రూపాయల జరిమాన విధింపబడింది. 1899 లో కార్బెట్ అనే పోలీస్ అధికారి నరసింగ్ అనే కానిస్టేబుల్‌ను అమానుషంగా కొట్టటమేగాక అతనిపై కేసు బనాయించి 2 నెలల కఠిన జైలు శిక్ష విధింపచేశాడు. అప్పీల్‌లో డిస్ట్రిక్ట్ జడ్జి అయిన పన్నేల్ అనేక ఇరిష్ వ్యక్తి ఆంగ్లేయుల అమానుష ప్రవర్తినను ఖండించినందుకు అతనిని బదిలీ చేశారు. ఇట్టి ఉదాహరణలు అసంఖ్యాకంగా ఉన్నాయి. కరుడు గట్టిన సామ్రాజ్యవాదిగా పేరొందిన లార్డ్ కర్జన్ కూడా ఆంగ్లేయుల దురహంకారంతో కూడిన హత్యాకాండను గర్హించాడు. ఆంగ్ల న్యాయాధిపతులు, జూరీ, ఆంగ్ల పత్రికలు ఈ విషయంలో ప్రదర్శించిన వైఖరి మిక్కిలి శోచనీయమైనది. న్యాయపాలనలోనేగాక, ఉద్యోగాల నియామకంలో కూడా భారతీయులు వివక్షకు ఎరవైనారు.

## 2.1.13. ఆంగ్లేయుల ప్రవర్తన ఫలితాలు :

జాత్యహంకారంతో కూడిన ఆంగ్లేయుల దురుసు ప్రవర్తన ఫలితంగా భారతీయులతో వారి సత్సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వారిలో ఆత్మాభిమానం, జాతీయ భావం రగుల్కొన్నాయి. భారతీయులు ఆంగ్లేయుల సుహృద్భావం చూరగొనలేకపోయినా పాశ్చాత్య విద్యా ప్రభావం వల్ల వారిలో స్వాతంత్ర్య పిపాస రేకెత్తింది. ఏ విషయంలోనూ తాము ఆంగ్లేయులకు తీసిపోమని నిరూపించుకొనటానికి ప్రయత్నించారు.

## 2.1.14. నమూనా ప్రశ్నలు :

1. ఆంగ్లేయులు భారతీయుల యెడ ప్రదర్శించిన వైఖరి గూర్చి వివరించండి. ?

## 2.1.15. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


**ఆచార్య వై. కుమార స్వామి.**

**ఖండిక - 2**

**పాఠం - 2.2**

# భారతీయుల సమస్యల పట్ల ఆంగ్ల ఉదారవాదుల దృక్పథం

## 2.2.0. లక్ష్యం :

భారతీయుల సమస్యల పట్ల ఆంగ్ల ఉదారవాదుల దృక్పథం గురించి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :

2.2.1. 19వ శతాబ్దారంభంలో ఆంగ్లేయుల ఉదార వైఖరి

2.2.2. హేస్టింగ్స్ ప్రభృతుల సానుభూతి

2.2.3. చార్టరు చట్టం (1833) విక్టోరియా రాణి ప్రకటన (1858)

2.2.4. ఆంగ్ల పాలకుల ధోరణిలో మార్పు

2.2.5. లిబరల్ పార్టీ ఆవిర్భావం

2.2.6. నిజమైన ఉదారవాదులు

2.2.7. భారత ప్రముఖులకు ఆదరణ

2.2.8. కాంగ్రెస్ ఆవిర్భావానికి తోడ్పాడు

2.2.9. నమూనా ప్రశ్నలు

2.2.10. చదువదగిన గ్రంధాలు

## 2.2.1. 19 వ శతాబ్దారంభంలో ఆంగ్లేయుల ఉదార వైఖరి :

1818 నాటికి ఆంగ్లేయుల ధాటికి తుదకు మహారాష్ట్ర రాజ్యాలు కూడా లొంగిపోయి బ్రిటీష్ సార్వభౌమత్వాన్ని అంగీకరించాయి. ఇంత గొప్ప సామ్రాజ్యమూ ఆనాటికి కేవలము ఒక వర్తక కంపెనీ యాజమాన్యంలోనే ఉన్నప్పటికీ దానిని బ్రిటీష్ ప్రజలు తమ అందరిదిగానూ, ఇండియా ఆంగ్లేయుల అభ్యున్నతికి ఉపయోగపడవలసిన ప్రదేశంగా భావించారు. అయితే 19వ శతాబ్ది ప్రథమార్థంలో ఆంగ్ల పాలకులు పాలితులైన భారతీయుల సంక్షేమమే తమ లక్ష్యంగా ప్రకటించి తమ ఉదవైఖరిని చాటుకుంటూ వచ్చారు. ఆనాటి ఆంగ్ల ప్రముఖుల వ్రాతలు, ఉపన్యాసాలు, బ్రిటిష్ పార్లమెంట్ చట్టాలు భాతీయులకు న్యాయం కలిగించే వైఖరినే వెల్లడించాయి. ఒక వంక ఇండియా శాశ్వతంగా బ్రిటీష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండాలని కోరుకుంటూనే, భారతీయులను స్వయం పాలనకై శిక్షణ ఇవ్వాలని ప్రకటించడం కొంతవరకు పరస్పర విరుద్ధంగా గోచరించుచున్నది.

## 2.2.2. హేస్టింగ్స్ ప్రభృతుల సానుభూతి :

ఈస్ట్ ఇండియా కంపెనికి చెందిన ఉన్నత ఉద్యోగులలో ఈ ఉదార వైఖరి 19వ శతాబ్ది ప్రథమార్థంలో వెల్లడి కావటం విశేషం. ఇట్టి ఉన్నతోద్యోగులలో మార్క్విస్ అఫ్ హేస్టింగ్స్, ఎల్ఫిన్‌స్టన్, థామస్ మన్రో, సర్ ఛార్లెస్ ట్రావెల్యాన్, లార్డ్ మెకాలే ప్రభృతులు చెప్పదగినవారు.

1813 నుండి 1823 వరకు గవర్నర్ జనరల్‌గా వ్యవహరించిన హేస్టింగ్స్ 1818 మే 17న తన ప్రైవేటు జనరల్‌లో ఇలా వ్రాసాడు. "యాదృచికంగా, క్రమపద్ధతిలో ఇండియాపై ఆధిపత్యం సాధించిన ఇంగ్లాండ్ తన సార్వభౌమత్వం వినియోగించి భారతీయులను విజ్ఞానవంతులుగా చేసి, న్యాయమార్గంలో నడిపించి మరీ ఇండియా నుండి నిష్క్రమిస్తున్నందుకు గర్వింపగలదు.

1819 లో బొంబాయి రాజధాని గవర్నర్‌గా వ్యవహరించిన ఎల్ఫిన్‌స్టన్ ఇలా వ్రాశాడు. "భారతీయులను ప్రగతి పథంలోనికి తెచ్చే ప్రయత్నంలో మరణం కూడా వరణీయమే. విదేశీయులు ఇండియాను పరిపాలించటం సాధ్యంకాని పరిస్థితి వచ్చేవరకు మనం వారిని సేవించాలి. ఏనాటికైనా మనం నిష్క్రమించక తప్పదు. కానీ భారతీయులను అనాగరికులుగా వదిలి వెళ్ళటం కంటే నాగరిక జాతిగా తీర్చిదిద్ది వెళ్ళి పోవడం శ్రేయస్కరం."

1820 లో "ఇండియా గెజెట్" అనే పత్రికలో ఇలా వ్రాయబడింది. భారతీయులు రాజకీయ స్వేచ్ఛ సాధించే వరకూ వారి హక్కులు సాధించుకునే వరకూ దేశంలో పూర్తిగా శాంతి భద్రతలు స్థాపించబడే వరకు మన పరిపాలన కొనసాగుతుంది. ఏనాటికైనా ఇండియా స్వాతంత్ర్యం పొంది తీరుతుంది. అయితే స్వాతంత్ర్య సాధన క్రమబద్ధంగా, స్నేహ పూరితముగా, జరగవలసి ఉంది. బ్రిటీష్ పాలన వలన ఇండియా అన్ని విధాలా లాభం పొందవలసి ఉంటుంది.

"భారతీయులు తమ మూఢ విశ్వాసాలను, దురాచాలను తొలగించుకొని స్వయం పాలనలో అనుభవం సంపాదించే వరకు ఆంగ్ల పాలన చిరకాలం వరకూ సాగవలసి ఉంది. అట్టి సమయం ఆసన్నమైనపుడు ఇండియాపై ఇంగ్లాండ్ తన ఆధిపత్యం క్రమంగా ఉపసంహరించటం శ్రేయోదాయకం" అని సర్ థామస్ మన్రో అభిప్రాయం

మద్రాస్ గవర్నర్‌గా పనిచేసిన సర్ ఛార్లెస్ ట్రావెల్యాన్ భారత ప్రజలపై ప్రభుత్వం విధించిన అమానుష పన్నులు నిరసించి తత్ఫలితంగా పదవిని కోల్పోయిన వ్యక్తి. విద్యా వ్యాప్తి ఫలితంగా భారతీయులు ఎలాంటి సంఘర్షణ, ద్వేష భావం లేకుండానే స్వాతంత్ర్యం సంపాదించగలరని అతడు అభిప్రాయపడినాడు.

లార్డ్ మెకాలే 1833 లో చార్టర్ చట్టంపై కామన్స్ సభలో మాట్లాడుతూ "బ్రిటీష్ ప్రభుత్వ పాలన ఫలితంగా భారతీయుల దృష్టి విశాలం కాగలదు. సత్వర పాలనలో వారికి మనం చక్కని శిక్షణ ఇవ్వగలము. పాశ్చాత్య విజ్ఞానము వల్ల వారు భవిష్యత్తులో పాశ్చాత్యుల వల్లనే స్వేచ్ఛను కోరవచ్చును. ఆ రోజు ఎప్పుడు రానున్నదో తెలియదు. కాని అట్టి సమయం ఆసన్నమైతే వారి ప్రయత్నాన్ని ప్రతిఘటింపరాదు. ఆ రోజు ఆంగ్ల చరిత్రలో గర్వకారణం కాగలదు" అని వక్కాణించాడు.

## 2.2.3. చార్టరు చట్టం (1833) విక్టోరియా రాణి ప్రకటన (1858) :

భారతీయుల స్థితిగతులపై సానుభూతితో వారి జీవన విధానం మెరుగుపరచటానికి బ్రిటిష్ పార్లమెంట్ కొన్ని చట్టాలు చేసింది. వానిలో 1833 లో చేసిన చార్టరు చట్టం చెప్పదగినది. దాని ప్రకారం భారతదేశ పాలనా యంత్రాంగంలో భారతీయులకు ఆంగ్లేయులతో సమాన స్థాయి కల్పించబడింది. మతం, జన్మస్థానం, వంశం, రంగు, మొదలైన వాని కారణంగా భారతీయుని యెడల కంపెనీ ఉద్యోగ నియామకాలలో వివక్ష చూపరాదని శాసించబడింది.

సిపాయిల తిరుగుబాటు తరువాత 1858 లో వెలువడిన విక్టోరియా రాణి ప్రకటనలో కూడా ఉద్యోగ నియామకాలలో ఎటువంటి వివక్ష చూపబడదని వాగ్దానం చెయ్యబడింది. భారతీయుల మత, సాంఘిక, విషయాలలో కూడా జోక్యం చేసుకోబోమని, న్యాయ పాలనలో సమానత్వం పాటింపబడుతుందని కూడా ప్రకటింపబడింది. రాణి ప్రకటన భారతీయులలో ఆంగ్ల పాలన విషయంలో విశ్వాసం రేకెత్తించింది.

## 2.2.4. ఆంగ్ల పాలకుల ధోరణిలో మార్పు :

ఆంగ్ల పాలకులు ఎన్ని తియ్యని ప్రకటనలు చేసినప్పటికీ 1858 తరువాత వారి ధోరణిలో కఠినమైన మార్పు గోచరించింది. 19వ శతాబ్ది ప్రారంభంలోని ఉదార వైఖరి క్రమంగా మటుమాయమైంది. భారతీయుల యెడ వివక్ష అధికరించింది. ఖడ్గ ప్రయోగంతో సాధించిన సామ్రాజ్యాన్ని ఖడ్గ ప్రయోగం ద్వారానే నిలుపుకోగలమని లార్డ్ ఎలిజన్ బెదిరించాడు. భారతీయులు స్వయం పాలనకు తగిన అనాగరికులుగా

అభివర్ణించటం జరిగింది. భారతీయుడు ఎంత మేధావి అయినా, విద్యావంతుడైనా అతనికి ఉన్నతోద్యోగం గగన కుసుమంగా మారింది. లార్డ్ రిప్పన్ తప్ప తక్కిన గవర్నర్ జనరల్స్ అందరూ ఈ ధోరణి అవలంబించారు. లార్డ్ ఖర్జన్ మరీ నిరంకుశ ధోరణి అవలంభించాడు. విద్యావంతులు అయిన భారతీయులను, అఖిల జాతీయ కాంగ్రెస్‌ను అతడు తిరస్కార దృష్టితో చూశాడు. ఉద్యోగ నియామకాల విషయంలో వారు విక్టోరియా రాణి ప్రకటనను అమలుపరచలేదు.

## 2.2.5. లిబరల్ పార్టీ ఆవిర్భావం :

ఇట్టి స్థితిలో 1868 లో ఇంగ్లాండ్‌లో లిబరల్ పార్టీ ఆవిర్భవించింది. ఒకప్పుడు టోరీలుగా ఉన్న వారు కన్సర్వేటివ్ పార్టీగానూ, విగ్గులు అనబడిన వారు లిబరల్ పార్టీగానూ రూపొందారు. కొద్దిపాటి పాలనా సంస్కరణలు, బలమైన సైన్యం, సామ్రాజ్య సంరక్షణ కన్సర్వేటివ్ పార్టీ వారి లక్ష్యములు, తీవ్ర సంస్కరణలు, స్వేచ్ఛా వ్యాపారం, ఐర్లండ్ యెడ సానుభూతి ధోరణి లిబరల్ పార్టీ వారి ధ్యేయములు. లిబరల్ పార్టీ వారికి 19వ శతాబ్ది చివరి వరకూ గ్లాడ్ స్టన్ నాయకుడు. భారతీయులు సమస్యల యెడ లిబరల్ పార్టీవారు కొంత ఉదారం ప్రకటిస్తూ ఉండేవారు. అయినా వాస్తవానికి ఆంగ్ల సామ్రాజ్య పరిరక్షణ విషయంలో రెండు పార్టీలకు పెద్ద విభేదాలు ఏవీ లేకపోవటం గమనార్హం. ఉదారవాదులలో ప్రముఖుడు అయిన జాన్ మోర్లే భారతీయుల సమస్యలపై సానుభూతి ప్రకటిస్తూ ఉండేవారు. కానీ 1885 లో ఇండియా స్థితిగతులపై రాయల్ కమీషన్ నియమించాలనే ప్రతిపాదన వచ్చినప్పుడు ఈ జాన్ మోర్లేయే ఆ ప్రతిపాదనను తీవ్రంగా ఖండించటమే గాక భారతీయులను ఆటవికుల గుంపుగా పేర్కొన్నాడు. "జాన్ మోర్లే భారతీయుల ఆశలకూ, ఆశయాలకూ బద్ధ విరోధి" అని విలియమ్ డిగ్బీ అభివర్ణించాడు.

## 6) నిజమైన ఉదారవాదులు :

లిబరల్స్ (ఉదారవాదులు) లో అందరూ జాన్ మోర్లే వంటి వారే అని భావించరాదు. వారిలో కొందరు హృదయపూర్వకం అయిన ఉదారవాదం ప్రకటించి భారతీయుల స్థితిగతుల యెడ తీవ్రంగా ప్రతిస్పందించారు. వీరు తమ అభిప్రాయాలను వ్రాతలలోనూ, ఉపన్యాసాలలోనూ ధైర్యంగా నిష్కర్షగా వెల్లడిస్తూ వచ్చారు. వీరు భారతదేశ మిత్రులు అని వ్యవహరించబడినారు. వీరిలో జార్జ్ థాంసన్, జాన్ బ్రైట్, చార్లెస్ బ్రాడ్లా, శామ్యు యెల్ స్మిత్, H.M. హైండమన్, ఫాసెట్ పేర్కొదగినవారు.

**ఎ) జార్జి థాంసన్ :** ఇండియాలో ఆంగ్లేయుల పాలనను ఘాటుగా విమర్శించిన ఇంగ్లీషు వారిలో జార్జి థాంసన్ తొలిత చెప్పదగినవాడు. ఇతడు 1839లో మాంచెస్టర్‌లో ఇచ్చిన 6 ఉపన్యాసాలు తరువాత పుస్తక రూపంలో వెలువడ్డాయి. ఇతని ఉపన్యాసాలలోని ప్రతి అక్షరమూ రాజకీయ చైతన్యం కలిగిన భారతీయుని భావాలనే ప్రతిఫలిస్తాయి. భారతీయ రాజకీయ నాయకులలో కూడా ఆనాడు అంత ధైర్యంగా విమిర్శించిన వారు లేరు.

**బి) జాన్ బ్రైట్ :** థాంసన్ భావాలకు ఇతడు సరయిన వారసుడు, సర్ చార్లెస్‌వుడ్ 1853 లో ప్రవేశపెట్టిన ఇండియా బిల్లును ఇతడు తీవ్రంగా విమర్శించాడు. భారత ప్రభుత్వ యంత్రాంగంపై బ్రిటీష్ ప్రభుత్వపు అదుపు సరిగా లేదని అతడు పేర్కొన్నాడు. ఇండియాలో న్యాయపాలన, నీటి పారుదల, రవాణా సౌకర్యాలు, ఉద్యోగ నియామకం, పన్నుల విధింపు మున్నగు విషయాలలో ప్రభుత్వం అసమర్ధతను ఇతడు పార్లమెంట్ దృష్టికి తెచ్చాడు. జాన్ బ్రైట్ 1858 లో ప్రభుత్వాన్ని దుయ్యబడుతూ "భారతీయులు దుర్భర దారిద్ర్యంలో మ్రగ్గుతున్నారు. పన్నుల భారం అధికం, శాంతి భద్రతలు, విద్యా విధానం, ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా లేదు." అని వక్కాణించారు.

**సి) చార్లెస్ బ్రాడ్లా :** ఇతడు ఇండియా యెడ సానుభూతి ప్రదర్శించాడు. 1883 డిసెంబర్ 31 వ తేదీన పార్లమెంట్‌లో మాట్లాడుతూ "మనం భారతదేశాన్ని ఆక్రమించిన తీరు చాలా సిగ్గుచేటు అయినదిగా నేను భావిస్తున్నాను. గత కాలపు తప్పిదాలను సరిదిద్దుకోవాలంటే ఇప్పటికైనా మనం భారతీయులను మన తోటి పౌరులుగా తీర్చిదిద్దే ప్రయత్నంలో తీవ్రంగా నిమగ్నం కావాలి. మన పరిపాలనను వారు కోరుకునే విధంగా మనం ప్రవర్తించాలి." అని నుడివినాడు.

**డి) శామ్యుయెల్ స్మిత్ :** ఇతడు బ్రిటిష్ కామన్స్ సభలో సభ్యుడు. 1863 లో ఒక సారి, 1886 లో ఒకసారి ఇండియాను సందర్శించాడు. ఇండియాలో స్థితి గతుల యెడ చక్కని అవగాహన ఏర్పరచుకొని తన అభిప్రాయాలను నిష్పక్షపాత రీతిలో వెల్లడించి సంస్కరణల ఆవశ్యకత

గూర్చి నొక్కి వక్కాణించాడు. "ఆంగ్ల పాలనా యంత్రాంగం ఇండియాకు భారంగా ఉంది. ఆంగ్ల ఉద్యోగుల, సైనికుల వేతనాలు చాలా హెచ్చుగా ఉన్నాయి. అనవసర యుద్ధాల వ్యయం అంతా ఇండియా నెత్తిన పడుతూ ఉంది. స్వదేశీ పరిశ్రమలను అణగద్రొక్కి విదేశీ వాణిజ్యం వర్ధిల్లడం శోచనీయం. ఉన్నతోద్యోగాలలో భారతీయులు నియమింపబడటంలేదు. అయినా భారతీయులు ఆంగ్ల పాలనను వదిలించుకోవటంలేదు. భారతీయులను కూడా ఉన్నతోద్యోగాలలో నియమించుకోవాలనీ, శాసనసభలకు భారతీయ ప్రతినిధులు ఎన్నుకోబడాలనీ వారు కోరుతున్నారు. ఈ కోరికలు సమంజసమైనవే."

**ఈ) హైండ్ మన్ :** ఇతడు ఇండియా శ్రేయోభిలాషి. భారతదేశాన్ని గురించిన వాస్తవ స్థితిని ఇతడు అమెరికా ప్రజలకు ముఖ్యంగా అమెరికా సోషలిష్టులకు ఎరుకపరిచాడు. ఇండియా గురించి ఇతడు 1874 నుండి వ్యాసాలు వ్రాయసాగాడు. 1878 లో 'నైన్‌టీన్త్ సెంచరీ' అనే పత్రికలో అతడు వ్రాసిన వ్యాసాలు పలు భాషలలోనికి తర్జుమా చేయబడినాయి. "భారతదేశంలో ఆంగ్లేయుల పాత్ర అమానుషమైనది. మహోన్నతం అయిన వారి సనాతన సంస్కృతి మన పెట్టుబడిదారీ జాతి పాదఘట్టనల పాలుకావటం శోచనీయం. మనలో కరుడు గట్టిన వర్ణ విద్వేషం ఇండియా యొక్క వాస్తవ స్థితిని మెరుగుపరుస్తుంది, అని అతని అభిప్రాయం. ఒకసారి అతడు దాదాబాయి నౌరోజీకి లేఖ వ్రాస్తూ "ఇండియాకు విప్లవం తప్ప వేరే గత్యంతరం లేదు. ఈ పెట్టుబడిదారీ వర్గం మీ దేశాన్ని, మా దేశపు కార్మికులను కూడా సర్వనాశనం చేస్తూ వుంది" అన్నాడు.

**యఫ్) ఫాసెట్ :** ఇతడు భారతదేశ మిత్రులలో పేరెన్నిక గన్నవాడు. ఇండియా బడ్జెట్ "నిశ్శబ్దంగా" చర్చించే విధానాన్ని ఇతడు 1870 లో నిశితంగా విమర్శించాడు. ఇండియాలో పేద ప్రజలు పస్తులతో నకనక లాడుతున్నారని వేదన ప్రకటించాడు. ఇండియా ఆర్థిక పరిపాలన విచారించటానికి 1871 లో ఏర్పడిన పార్లమెంటరీ కమిటీకి అతడు అధ్యక్షుడు. అతని సేవలను అభినందిస్తూ 1872 లో కలకత్తా ప్రజలు సభ జరిపారు. అతడు పార్లమెంట్ ఎన్నికల్లో ఓడినపుడు భారత ప్రజలు నిధిని వసూలు చేసి పంపి, అతడు మరో స్థానం నుండి గెలుపొందటానికి తోడ్పడుతున్నారు.

## 2.2.7. భారత ప్రముఖులకు ఆదరణ :

ఆంగ్ల ఉదారవాదులు భారతదేశంపై సానుభూతి ప్రకటించటమే కాక ఇంగ్లాండ్‌కు వచ్చిన భారతీయ ప్రముఖులను అపూర్వ రీతిలో ఆదరించారు. కామన్స్ సభ కమిటీ యందు ఇండియా పాలనా యంత్రాంగం గురించి తన అభిప్రాయం వెల్లడించడానికి రాజా రామ్మోహన్ రాయ్‌కి ఆంగ్లేయులు అవకాశం ఇచ్చిరి. ద్వారకానాథ్ ఠాగూర్ ఇంగ్లాండ్‌కు వచ్చినప్పుడు అతడు విక్టోరియా రాణిచే విందుకు ఆహ్వానించబడ్డాడు. ఎడింబర్గ్ పౌరులు అతనికి సన్మానం జరిపి ఆంగ్ల పాలనలోని ధమన నీతి తొలగి పోగలదని ఆశాభావం ప్రకటించారు. కేశవ చంద్రసేన్ ఇంగ్లాండ్‌ను సందర్శించినపుడు కూడా అతని అపూర్వ స్వాగతం లభించింది. బ్రిటీష్ పార్లమెంట్‌కు దాదాభాయి నౌరోజీ ఎన్నుకోబడటం బ్రిటీష్ ఉదారవాదుల వైఖరికి ప్రజల తార్కాణం.

## 2.2.8. కాంగ్రెస్ ఆవిర్భావానికి తోడ్పాటు :

ఉదారవాదులైన కొందరు ఆంగ్ల ప్రముఖులు పరోక్షంగా తోడ్పడ్డారు. ఇట్టి వారిలో హ్యూమ్, వెడ్డర్ బర్న్, రాటన్ ప్రధానంగా పేర్కొనదగిన వారు. వీరు దేశం నలుమూలలా గల విద్యావంతులను ప్రోత్సహించి అఖిల భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ప్రోత్సహించారు. లార్డు రిప్పన్ ఎన్నో ఉపయోగకరం అయిన సంస్కరణలు ప్రవేశపెట్టి భారతీయుల కృతజ్ఞతకు పాత్రుడైనాడు. కాంగ్రెస్‌లోని మితవాదులు ఆంగ్ల ఉదారవాదుల యెడ అపరిమితమైన విశ్వాసం కలిగి ఉండేవారు.

## 2.2.9. నమూనా ప్రశ్నలు :

1. 19వ శతాబ్దారంభంలో ఆంగ్లేయుల ఉదార వైఖరి గూర్చి వివరించండి.

## 2.2.10. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


**ఆచార్య వై. కుమార స్వామి.**

ఖండిక - 2

## పాఠం - 2.3

# భారతదేశంలో బ్రిటీష్ వలసవాదంలో సంభవించిన మార్పులు

### 2.3.0. లక్ష్యం :

భారతదేశంలో బ్రిటీష్ వలస వాదంలో సంభవించిన మార్పుల గురించి వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయ సూచిక :


2.3.1. కంపెనీ పాలకుల వైఖరి, వారి లక్ష్యాలు

2.3.2. ఆంగ్లేయుల ప్రవేశపెట్టిన మార్పులు

2.3.3. సిపాయిల తిరుగుబాటు వల్ల ఆంగ్లేయులు నేర్చుకున్న పాఠాలు

2.3.4. ఆంగ్ల పాలకుల జాత్యహంకారము

2.3.5. విభజించు పాలించు

2.3.6. తప్పని సరి అయిన సంఘ సంస్కరణలు

2.3.7. నమూనా ప్రశ్నలు

2.3.8. చదువదగిన గ్రంథాలు


### 2.3.1. కంపెనీ పాలకుల వైఖరి, వారి లక్ష్యాలు :

మొఘలు సామ్రాజ్యం సమస్త వైభవాలతో తులతూగుతూ ఉచ్ఛస్థితిలో ఉండిన 17వ శతాబ్దంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు వర్తకానికై ఇండియా వచ్చినారు. పాదుషాల దర్బార్లులో అతి వినయంగా ప్రవర్తిస్తూ వారిని అనేక విధాలుగా ఆశ్రయించి వారి వద్ద నుండి అనేక వర్తక సదుపాయాలను సంపాదించారు. ఒక శతాబ్ది కాలం ఆశ్రితులుగా ఉండినవారు బెంగాల్ రాష్ట్రాని వశపరచుకొని పరిపాలకులు కావటంతో వారి వైఖరి పూర్తిగా మారిపోయింది. వారిలో జాత్యహంకారం పెరిగింది. తామేదో స్వర్గం నుండి భూలోకానికి దిగివచ్చిన వారివలె ప్రవర్తింపసాగిరి. తమ సంస్కృతి, నాగరికత, సామాజిక వ్యవస్థ, పరిపాలనా పద్ధతి ఉత్తమములైనవి గానూ, సమస్త జీవిత రంగాల్లో భారతీయులు అధములైన వారిగానూ భావింపసాగారు. వారి పట్ల చులకన భావంతో ప్రవర్తించటమేకాక, వారిని అవమానపరచుటకు కూడా సిద్ధపడినారు. తమ దేశంలోనే తాము తల ఎత్తుకొని తిరగలేని స్థితికి భారతీయులు వచ్చిరి.

1772 తరువాత బ్రిటీష్ వారికి రెండు లక్ష్యాలు మాత్రమే ప్రధానములైనాయి. ఒకటి వారి సామ్రాజ్యాన్ని విస్తరింపచేసుకొని దానికి సుస్థిరత్వం కల్పించుకోవటం, రెండు భారతదేశ ప్రజల నుండి ఎంతటి ధనమును తమ దేశానికి తీసుకుపోవుటకు సాధ్యమో అంత ధనాన్ని తీసుకోవటం. మొదటి ఉద్దేశాన్ని గూర్చి వారిలో కొన్ని అభిప్రాయ భేదాలు కనిపించినా రెండవ ఉద్దేశ్యం విషయంలో బ్రిటిష్ లోని ప్రభుత్వం వారు, కంపెనీ అధికారులు, పారిశ్రామికులు, శ్రామిక వర్గానికి చెందిన వారు అందరూ ఏకభావం కలవారైనారు.

### 2.3.2. ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన మార్పులు :

**ఎ) ఉన్నత ఉద్యోగాలలో ఆంగ్లేయులు :** పై రెండు లక్ష్యాలను సాధించటానికి ఆంగ్లేయులు భారతదేశంలో అనేక మార్పులు ప్రవేశపెట్టారు. బ్రిటీష్ పరిపాలన దేశంలో సుస్థిరంగా నిలబడాలంటే ఉన్నతాధికారం బ్రిటిష్ ఉద్యోగుల చేతిలోనే ఉండాలని అతని అభిప్రాయం. ఆంగ్లేయ

ఉద్యోగుల అవినీతిని అరికట్టుటకై అతడు వారి జీతాలను అనేక రెట్లు పెంచాడు. భారత ప్రజల నుండి వసూలు చేసిన పన్నులలో చాలా భాగం ఉద్యోగుల జీతాల క్రింది ఖర్చు కావటం బ్రిటీష్ పాలనకు ఒక లక్షణం అయింది. కంపెనీ సైన్యంలోనూ, న్యాయస్థానాలలోనూ, ఉన్నతోద్యోగాలన్నీ బ్రిటిష్ వారి వశంలోనికి వచ్చాయి. బ్రిటిష్‌లో నిరుద్యోగులుగా ఉండిన మధ్యతరగతి కుటుంబంలోని యువకులందరికీ ఇండియా శరణ్యం అయింది.

**బి) ధన సంపాదన మార్గాలు :** తమ పరిపాలనను సుస్థిరం చేసుకొనటానికి, దేశం నుండి ఎక్కువ ధనాన్ని సంపాదించటానికి బ్రిటిష్ వారు భూమి శిస్తు వసూలు విధానంలో గొప్ప మార్పులు చేశారు. ఈ మార్పుల మూలంగా ధనికులు కొంత బాగుపడి రైతులు ఎంతో నష్టాన్ని అనుభవించవలసి వచ్చింది. కారన్ వాలీస్ ఏటా భూమిశిస్తు వసూలు చేసే అధికారం వేలం వేసే పద్ధతిని రద్దుచేసి, ఏటేటా జమిందారు ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తాన్ని శాశ్వత పరచాడు. శాశ్వత శిస్తు విధానం వల్ల జమిందార్లకు జమిందారీలలోని భూములపై శాశ్వత హక్కు లభించింది. ఈ విధానం వల్ల వ్యయవసాయం నానాటికీ దిగజారిపోయింది. రైతులు దరిద్రులైనారు. కాలక్రమేణ జమిందార్లు రైతులను పీడించి శిస్తు వసూలు చేయసాగిరి. రైతులు దరిద్రులైనారు. కాలక్రమేణ ఆంగ్ల పాలకులు ఈ పరిణామాలను చక్కగా అర్థం చేసుకొని మద్రాసు, బొంబాయి మొదలైన రాష్ట్రాలలో జమిందారీ పద్ధతికి బదులు రైతువారీ పద్ధతి ప్రవేశపెట్టారు. బెంగాల్‌లో మాత్రం జమిందారీ పద్ధతి స్థిరపడింది. అయితే రైతువారీ పద్ధతి వల్ల కూడా కొన్ని దుష్ప్రభావాలు ఏర్పడ్డాయి. శిస్తులు సకాలంలో చెల్లించని పక్షంలో రైతుల భూములు వేలం వేసే పద్ధతి అమలులోనికి వచ్చింది. రైతులు ఋణగ్రస్తులు అయినారు. పన్నుల భారంతో కృంగిపోయారు. పన్నులు వసూలు చేయటంలో కంపెనీ ఉద్యోగులు అమానుష పద్ధతులు అవలంభించేవారు. కంపెనీ పరిపాలనా కాలంలో అనేక క్షామాలు సంభవించినప్పటికీ అధికారులు కరువు నివారణా పథకాలు సరిగా చేపట్టలేదు.

**సి) దేశీయ పరిశ్రమల నాశనం :** కంపెనీ పరిపాలన ఏర్పడిన తరువాత దేశీయ పరిశ్రమలకు గొప్ప దెబ్బతగిలింది. ప్రధానంగా నేత పరిశ్రమకు విపరీతం అయిన నష్టం సంభవించింది. వర్తకులు పరిపాలకులు కావటం, వర్తక దృష్టితో వారు పరిపాలన సాగించటం దీనికి ప్రధాన కారణం. విదేశాలకు ఎగుమతి చేసే బట్టలను నేతగాండ్ర నుండి చౌక ధరలకు కొని ఎక్కువ లాభాలు గడించటానికై అధికారులు వారి అధికారాన్ని దుర్వినియోగం చేయసాగారు. నేతగాండ్రకు గిట్టుబాటు ధరకాని ధరలకు బట్టలు అమ్మేటట్లు వారిని సర్వవిధాల బాధించటం పరిపాటి అయింది. దీనితో బాటు ఇంగ్లాండ్‌లో కూడా మన దేశపు బట్టలపై అనేక ఆంక్షలు విధించారు. అక్కడ తయారయే ఉన్ని బట్టల కంటే మన నూలు బట్టలు చాలా నాణ్యంగా ఉండేవి. అందువలన ఇంగ్లాండ్ ప్రభుత్వం మన సరుకులపై ఎక్కువ సుంకాలు ఇతరమైన ఆంక్షలను విధించటం జరుగుతూ వచ్చింది. పారిశ్రామిక విప్లవం తరువాత విదేశీ వస్త్రాల పోటీకి నిలబడలేక మన నేతగాండ్రలో అనేకులు వారి వృత్తులు వదులుకున్నారు. తక్కిన చేతి పనులకు కూడా ఇదే గతి పట్టింది. ఆంగ్ల పాలకులు దేశీయ పరిశ్రమలను రక్షించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ప్లాసీ యుద్ధం తరువాత కంపెనీ పాలనలో “ఆంగ్ల వర్తకులలో ఏకాధిపత్యం సాధించారు. రాజకీయాధికారం వారి హస్తగతం అయినందున ఆంతరంగిక వ్యాపారంలో కూడా దేశీయ వర్తకులు వారిని ఎదిరించి నిలువలేకపోయారు. క్రమంగా ఆంగ్ల వర్తకులు అన్ని వ్యాపారాలపై ఆధ్వర్యం వహించి దేశీయ వర్తకులను వాని నుండి పూర్తిగా తొలగించారు. ఫలితంగా వర్తకులు వర్తక స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు.

**డి) ఆంగ్ల విద్యా వ్యాప్తి - సాంఘిక చట్టాలు :** ఇండియాలో పాశ్చాత్య విజ్ఞానాన్ని తద్వారా హేతువాద మనవతా వాదులను ప్రవేశపెట్టేందుకు 1835 నుండి ఆంగ్ల విద్యను ప్రచారంలోనికి తెచ్చారు. ఆంగ్ల విద్య క్రమంగా భారతీయులలో మత, సాంఘిక సంస్కరణలకు స్ఫూర్తి నిచ్చింది, రాజకీయ స్వాతంత్ర్య కాంక్షను కూడా రగుల్కొల్పింది. కానీ ఎక్కువ భాగం ఆంగ్ల విద్య భారతీయులను గుమస్తాలుగా తయారుచేయటానికి ఉద్దేశించినదే. అలాగే సంస్కర్తల ఆందోళన ఫలితంగానూ, ఆంగ్ల ఉదారవాదుల సంకల్పం ఫలితంగానూ బెంటింగ్ మొదలైన వారు కొన్ని సాంఘిక చట్టాలు అమలులోనికి తెచ్చారు. వానిలో 1829 లో చేసిన సతీసహగమన నిషేధ చట్టం, 1856 లో చేసిన హిందూ స్త్రీ పునర్వివాహ చట్టం ముఖ్యమైనవి. కానీ ఆంగ్లేయుల సాంఘిక చట్టాలు సాంప్రదాయ వాదులలో అనుమానాలు రేకెత్తించాయి.

## 2.3.3. సిపాయిల తిరుగుబాటు వల్ల ఆంగ్లేయులు నేర్చుకున్న పాఠాలు :

1857లో చెలరేగిన సిపాయిల తిరుగుబాటును ఆంగ్ల పాలకులు అణచి వేశారు. కాని తిరుగుబాటు పూర్తిగా విఫలమైందని అనుకోవటం కూడా పొరబాటే. అది సంభవించటం మూలాన బ్రిటిష్ వారు కొన్ని గుణపాఠాలు నేర్చుకున్నారు. వారు నేర్చుకున్న మొదటి పాఠం ప్రజల మతంలో జోక్యం కలిగించుకొనటం చాలా ప్రమాదకరమైనది అనేది. 1858 తరువాత వారు ప్రజల మతంలో జోక్యం కలిగించుకోరాదనే నిర్ణయానికి వచ్చారు. విక్టోరియా మహారాణి 1858 నవంబరు 1 న విడుదల చేసిన ప్రకటనలో దీనికి ఒక ప్రధాన స్థానం లభించింది.

స్వదేశీ సంస్థానములను బ్రిటీష్ సామ్రాజ్యంలో విలీనం చేయరాదని, రెండవ పాఠం. భవిష్యత్‌లో తిరుగుబాటు జరిగిన పక్షంలో తమకు సహాయపడే ఒక ప్రముఖ వర్గం దేశంలో ఉండటం అవసరం అని ఆంగ్లేయులు గ్రహించారు. అందుచే విక్టోరియా ప్రకటనలో సంస్థానాధీశుల హక్కులు, మర్యాదల గౌరవమును రక్షించెదమని ఉటంకించబడినది. అలాగే జమిందార్లు, తాలుకాదార్లు మొదలైన భూస్వామిక వర్గాలు హక్కులకు భంగం కలిగించరాదని ఆంగ్లేయులు గ్రహించారు. ఉన్నతోద్యోగాలను ఆశించే విద్యాధికులను సంతృప్తి పరచిన గాని తమ అధికారం నిలబడదని అర్థం చేసుకున్నారు. తాము చేసే శాసనాల పట్ల, కార్యక్రమాల పట్ల ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలనే మరొక పాఠం కూడా నేర్చుకున్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వారి ఇష్టాలను తెలుసుకొనటానికై 1861 లో శాసనసభలు నెలకొల్పినారు. ఈ ఏర్పాటు కార్యక్రమం విప్లవాత్మకం అయిన మార్పులకు దారి తీసింది.

పైన పేర్కొన్న పాఠాలన్నీ బ్రిటీష్ వారి అధికారం ఇంత కాలం నిలవటానికి సాధనాలైనాయి. ఈ ఉద్దేశ్యంతోనే వారు తిరుగుబాటు ఫలితంగా సైనిక వ్యవస్థలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు. సైన్యంలో బ్రిటిష్ సైనికుల సంఖ్యను 45000 నుండి 65000 పెంచారు. సిపాయిల సంఖ్యను 1,40,000 కు తగ్గించారు. సిపాయిలలో బ్రాహ్మణులు మొదలైన అగ్ర కులాల వారి సంఖ్యను చాలా వరకు తగ్గించి క్రింది కులాల వారిని సిక్కులను, గూర్ఖాలను ఎక్కువ సంఖ్యలో చేర్చుకోసాగారు.

## 2.3.4. ఆంగ్ల పాలకుల జాత్యహంకారము :

ఆంగ్ల విద్య పొందిన భారతీయుల సంఖ్య ఎక్కువైన కొద్ది ఉన్నతోద్యోగాలకు, శాసనసభలలో సభ్యత్వములకు అర్రులు చాచటం ఎక్కువైంది. ప్రజాస్వామ్య దేశాలలో అగ్రగణ్యం అయిన ఇంగ్లాండ్ తమ ఆశయాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుందని వారు ఆశించారు. ఆంగ్లేయులలో కొందరు ఉదారవాదులు కూడా అందుకు అనుకూలంగా ప్రతిస్పదించారు. కాని 19వ శతాబ్దం చివరి భాగంలో బ్రిటిష్ అధికారులు ఇందుకు వ్యతిరేకత తెలిపారు. ఇందుకు వారిలో కరుడు కట్టిన జాత్యహంకరమే. ప్రధాన కారణం. 19వ శతాబ్దంలో వారు ప్రపంచంలో చాలా భాగానికి పరిపాలకులు కావటంతో ఇది మరింత ముదిరింది. జాత్యహంకారం, సామ్రాజ్య తత్వము పరస్పరాశ్రయాలైనాయి. తత్ఫలితంగా వారు ఇండియాలో ప్రజాపక్షం వారు కోరిన పరిమిత ప్రజాస్వామ్యాన్ని కూడా గర్జించారు. ప్రజాపరిపాలన ఎంత మాత్రం స్థాపించినా అది బ్రిటిష్ అధికారానికి గొడ్డలి పెట్టు అవుతుందని వారి వాదం. భారతీయులలో కుల, మత, భాషా భేదాలు అసంఖ్యాకంగా ఉన్నాయని, వారికి నిరంకుశ విధానమే శ్రేయోదాయకమని వారు భావించారు.

## 2.3.5. విభజించి పాలించు :

ఇండియాని పాలించటంలో ఆంగ్లేయులు "విభజించి పాలించు" అనే సూత్రాన్ని అనుసరించారు. 1858 తరువాత ఈ చాణక్య నీతి వారి పరిపాలనా విధానానికి ప్రధాన లక్షణంగా రూపొందింది. ముస్లీంలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించి హిందువుల నుండి వారిని విడదీసి వారు ప్రత్యేక జాతివారనే భావాన్ని బలపరిచారు. బెంగాల్ విభజనలోని మూలసూత్రం అదే. ముస్లీం లీగ్ ఆవిర్భావానికి వారు దోహదం చేశారు. ద్విజాతి సిద్ధాంతం ప్రోత్సహించారు. అదేవిధంగా జమిందారులు, భూస్వాములు మొదలైన ఫ్యూడల్ వర్గాలను విద్యాధికుల నుండి చీలదీశారు. ఇలాంటి వర్గం తమ పక్షంలో ఉన్నంత కాలం స్వల్ప సంఖ్యాకులు అయిన విద్యాధికుల మూలంగా తమకు ఎలాంటి ప్రమాదం సంభవించదని వారు భావించారు. అలాగే సైన్యంలో సిక్కులు, జాటులు, రాజపుత్రులు, గుర్కాలు, ముస్లీంలు మొదలగు వారిని ఎక్కువ సంఖ్యలో చేర్చుకొని వారందరిని బ్రిటీష్ పరిపాలన పట్ల భక్తిగల వారిగా చేసుకున్నారు. అనేక బేధాలతో కూడిన భారతీయులు ఎన్నటికీ ఒక జాతిగా రూపొందలేదని వారు నమ్మారు.

## 2.3.6. తప్పని సరి అయిన సంఘ సంస్కరణలు :

ఎంతటి జాత్యహంకారం ఉన్నప్పటికీ ఆంగ్ల పాలకులు ప్రజలలో పెచ్చు పెరుగుతున్న అసంతృప్తిని గమనించకపోలేదు. ముఖ్యంగా వందేమాతర ఉద్యమం. భారతీయులను సంతృప్తి పరచటానికి అప్పుడప్పుడు కొన్ని పరిపాలనా సంస్కరణలు, చట్ట సంస్కరణలు చేయటం తప్పని సరి అయింది. 1909 లో చేసిన మింటో మార్లే సంస్కరణలు, 1919 లో చేసిన మౌంట్ ఫర్డ్ సంస్కరణలు, 1935 లో చేసిన చట్టం మొదలైనవి బ్రిటీష్‌వారి వైఖరిలోను, విధానాలలోను వచ్చిన మార్పులకు తార్కాణం. భారతదేశ రాజకీయ రంగంలో మార్పులు జరిగినప్పుడల్లా బ్రిటీష్ ప్రభుత్వం యొక్కయు ప్రముఖుల యొక్కయు వైఖరి ఎలా ఉండేదో అది క్రమక్రమంగా ఏ విధంగా మారుతూ వచ్చిందో గ్రహించటానికి వారు అడపదడపా చేస్తూ వచ్చిన పాలనా సంస్కరణలే నిదర్శనాలు. దేశ పరిపాలనా భాగస్వామ్యాన్ని భారతీయులు వాంఛించటం న్యాయమైన వాంఛ అనీ, దానిని ఎప్పటికైనా చెల్లించటం అవసరం అనీ ఆంగ్ల వలసవాద ప్రభువులు గ్రహించారు.

## 2.3.7. నమూనా ప్రశ్నలు :

1. భారతదేశంలో బ్రిటీష్ వలసవాదంలో సంభవించిన మార్పులు గూర్చి వివరించండి.

## 2.3.8. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


**ఆచార్య వై. కుమార స్వామి.**

**ఖండిక - 2**

**పాఠం - 2.4**

# భారతదేశంలో ఆంగ్ల విద్య అధికారికంగా ప్రవేశించిన విధానం (లేదా) ఆంగ్ల విద్యా విధానంపై ఆధునిక యుగారంభంలో ప్రాచ్య పాశ్చాత్య విద్యా విధానవాదుల ప్రతి స్పందనలు

## 2.4.0. లక్ష్యం :

భారతదేశంలో ఆంగ్ల విద్య అధికారికంగా ప్రవేశించిన విధానాన్ని వివరించడం ఈ పాఠము యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :

**2.4.1.** సంప్రదాయ విద్యా విధానం

**2.4.2.** పాశ్చాత్య విద్యా విధాన వాదం

**2.4.3.** ఆంగ్ల ప్రభుత్వ విద్యా విధానం

**2.4.4.** ఆంగ్ల విద్య అధికారిక ప్రారంభం

**2.4.5.** ఆంగ్ల విద్య ఫలితాలు

**2.4.6.** నమూనా ప్రశ్నలు

**2.4.7.** చదువదగిన గ్రంథాలు

## 2.4.1. సంప్రదాయ విద్యా విధానం :

ఆధునిక యుగారంభంలో భారతదేశంలో స్థిరపడి యుండిన సాంప్రదాయ విద్యా విధానానికీ, భారతదేశంలో ప్రవేశిస్తున్న పాశ్చాత్య విజ్ఞానానికి స్వభావంలో విస్తారం అయిన అంతరముంది. విజ్ఞాన సంపాదనోద్దేశ్యమూ, విజ్ఞాన సముపార్జన గూర్చిన ఆశయమూ అనే ప్రధాన విషయాలు ఈ రెండు వ్యవస్థలలోనూ, విభిన్నంగా ఉండేవి. పాశ్చాత్య విజ్ఞానం సమాజం అంతటికీ బాహాటంగా సంబంధించినది. ప్రత్యేకంగా ఒక సమాజ విభాగానికి మాత్రమే వర్తించేది కాదు. భారతదేశంలోని సంప్రదాయ విజ్ఞానం కేవలం కొన్ని ప్రత్యేక సమాజ వర్గాలకు మాత్రమే పరిమితం అయినది.

**ఎ) హిందువుల సంప్రదాయ విద్య :** హిందువుల విజ్ఞానం దివ్య దృష్టి ఆధారంగా, వ్యక్తిగత అంతర దృష్టి సహాయంతో ధ్యాన, మనన, చింతన, మూలకం అయిన విశిష్ట ప్రయత్నంలో సిద్ధించినట్టిది. అది స్వయం ప్రకాశికమూ, సాత్వికమూ అయిన భారతీయ విజ్ఞాన జ్యోతి. దీనిని అనుసరించిన జ్ఞానం ఉత్తమం, సామన్యం అని రెండు విధాలు. సృష్టికంతకూ మూలకరణమైన తాత్విక సత్యాన్ని అన్వేషించటం ఉత్తమ విద్యకు సంబంధించినది. అస్థిరమూ, అశాస్వతమూ అయిన ప్రాపంచక విషయమునకు సంబంధించిన జ్ఞానం సామాన్య విద్య, గణితం, జ్యోతిష్యము, ఆయుర్వేదమూ ఇత్వాది ప్రకృతి శాస్త్రాలలో భారతదేశం అసాధారణం అయిన పాండిత్యాన్ని గడించినప్పటికీ తర్క, వ్యాకరణ, అలంకార,న్యాయ, వేదాంతాది శాస్త్రాలలో ఉద్గ్రంథాలు రచించినప్పటికీ, ప్రకృతి శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాత్మకం అయిన కృషికి ఎక్కువగా పూనుకొనలేదు. సాంప్రదాయ సిద్ధం అయిన ప్రాచీన విజ్ఞానము సంఘటితమూ, అఖండమూ, శాశ్వతము అని

సాంప్రదాయ విద్యావాదుల నిశ్చితాభిప్రాయం. సంస్కృత విద్యాభ్యాసం తప్పనిసరి అని వారి అభిప్రాయం. సాంప్రదాయ విద్యావేత్తలు ఆత్మ జ్ఞానులు కనుక వారి పోషణ బాధ్యత రాజులు, ప్రజలు వహించేవారు. ఈ విద్యావంతుల్లో ఎక్కువ భాగం బ్రాహ్మణులే అయినా ఇతర కులాలవారు కూడా లేకపోలేదు.

**బి) ముస్లింల సాంప్రదాయ విద్య :** హిందూ సాంప్రదాయ విద్యావేత్తల మానసిక ప్రవృత్తులే విద్వాంసులైన ముస్లింలకు కూడా ఉండేవి. వారికి కూడా దివ్య విద్య అనీ, ప్రాపంచక విద్య అని ద్వివిధములుగా ఉండేది. దైవ ప్రేరణ వల్ల సిద్ధించిన విద్య సహజ సిద్ధమైనది. ఆత్మ ప్రకటన సమర్థమైనది. నిరంతర ఆంతరంగిక శిక్షణ వల్ల మాత్రమే ఈ ఉత్తమ జ్ఞానం లభ్యమవుతుంది. ముస్లిం విద్యాంసులు ప్రాపంచక విద్యలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. వీరి లౌకిక విద్య హిందువుల లౌకిక విద్య కంటే శక్తివంతమైనది. 14, 15 శతాబ్దాల తరువాత ముస్లింలలోని విజ్ఞాన శాస్త్రాభివృద్ధి మూలపడింది.

**సి) క్షీణించిన సాంప్రదాయ విద్య యెడల అభిమానం :** ఆధునిక యుగారంభం నాటికి హిందూ, ముస్లిం సాంప్రదాయ విద్వాంసులు చాలా వరకు తమ తమ ప్రత్యేకములైన అవధులలో నిలిచిపోయారు. పరస్పరం కలుసుకొని అభిప్రాయాలను వినిమయం చేసికొన్నవారు కారు. కనుక వీరి భావాలలో విస్తృత వికాసాలు కలుగలేదు. పైగా 18వ శతాబ్దం అంతా కల్లోలంతో గడచి పోవటం వల్ల విజ్ఞాన వ్యాప్తి క్షీణించింది. ఆంగ్ల పాలనలో నెలకొన్న శాంతి భద్రతల వల్ల విజ్ఞాన వికాసానికి అవకాశం లభించింది. అయినప్పటికీ సాంప్రదాయవాదులు తమ ప్రాచీన విద్యా విధానం యెడల అమితమైన అభినివేశంతో పాశ్చాత్య విద్యను వ్యతిరేకించారు.

## 2.4.2. పాశ్చాత్య విద్యా విధాన వాదం :

ఆంగ్లేయుల అధికారానికి కారణమైన పాశ్చాత్య సమీప విజ్ఞానం యెడ కొందరు అభిమానం ప్రదర్శించారు. ఆంగ్ల విద్యను క్రైస్తవ మిషనరీలు తమ ప్రచారానికి సాధనంగా ఉపయోగించుకొన్నారు. సంఘ సంస్కర్తలు, అనధికారులైన ఆంగ్లేయులు కూడా భారతదేశంలో పాశ్చాత్య విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆందోళనలు కొనసాగించారు.

**ఎ) క్రైస్తవ మిషనరీల మత ప్రచార సాధనం :** 18వ శతాబ్దములో భారతదేశంలోని క్రైస్తవ మిషనరీలు ప్రాంతీయ భాషలలోనే తమ మత ప్రచారం కొనసాగించారు. కాని తద్వారా నిమ్న జాతుల వారిని మాత్రమే క్రైస్తవ మతంలోనికి మార్చగలిగినారు. హిందువులలోని అగ్ర వర్ణాల వారిని క్రైస్తవ మతంలోనికి ఆకర్షించటానికి ఇంగ్లీషు విద్యయే ఉత్తమ సాధనం అని అలగ్జాండర్ డవ్ అనే మత ప్రచారకుడు నిర్ణయించాడు. తదనుగుణంగా క్రైస్తవులు పాశ్చాత్య విద్యా వ్యామోహం కలిగించారు.

**బి) మధ్య తరగతి భారతీయుల ఆంగ్ల విద్యా వ్యామోహం :** 19వ శతాబ్ది ప్రారంభంలో నాటికి ఇండియాలో ముఖ్యంగా బెంగాల్‌లోని మధ్య తరగతికి చెందిన వారిలో ఇంగిష్ భాష పట్లను పాశ్చాత్య విద్య పట్లను ఒక విధం అయిన వ్యామోహం ఏర్పడింది. వీరిలో కొందరు ఇంగ్లీషు భాషను నేర్చుకొనసాగిరి. ఇంగ్లీష్ భాష నేర్చుకుంటే ఆంగ్ల వర్తకులతో సులభంగా వ్యవహారాలు జరపవచ్చునని వీరు భావించారు. బ్రిటీష్ వారు దేశ పాలకులైన పిమ్మట ఈ భావం మరింత బలపడింది. ఇంగ్లీష్ నేర్చిన వారికి ఉద్యోగాలు సులభంగా లభించు అవకాశాలుండేవి. దీనికి తోడు ఇంగ్లీష్ భాష నేర్చుకున్న బెంగాలీలు కొందరు ఇంగ్లీష్ సాహిత్యంతోను, శాస్త్ర గ్రంథాలతోను పరిచయం సంపాదించి సంస్కృత సాహిత్యంలో లేని విశిష్టత, ఆధునిక శాస్త్ర జ్ఞానం వాటిలో ఉండుట గ్రహించిరి. ఆధునిక విజ్ఞాన సంపాదనకు ఇంగ్లీష్ భాషయే ఉత్తమ సాధనం అనే భావం వారిలో నాటుకుంది. రాజారామ్మోహన్ రాయ్‌తో పాటు ప్రముఖులు అనేకులు ఇట్టి భావం కలిగి యుండేవారు. కనుకనే కంపెనీ ప్రభుత్వం వారు 1823లో కలకత్తాలో సంస్కృత కళాశాల స్థాపించదలచినప్పుడు రామమోహన్ రాయ్ దానికంటే ఆంగ్ల కళాశాల స్థాపించటమే మేలని అభిప్రాయం వెలిబుచ్చారు.

**సి) అనధికార ఆంగ్లేయుల ప్రోత్సాహం :** పైన పేర్కొన్నవారే గాక భారతదేశంలోని అనధికారులైన ఆంగ్లేయులు కూడా పాశ్చాత్య విద్యా విధానాన్ని ప్రోత్సహించారు. వీరిలో డేవిడ్ హేర్ ప్రముఖుడు. ఇతడు కలకత్తాలో గడియారాల వ్యాపారం చేసేవాడు. ఇతడు కలకత్తాలో ఒక ఆంగ్ల కళాశాల నెలకొల్పడానికి పుర ప్రముఖులతో ఒక సంఘాన్ని ఏర్పరచి నిధి ప్రోగు చేశాడు. దానితో 1817లో హిందూ కళాశాలను స్థాపించాడు. ఆ కళాశాలలో ఉపాధ్యాయుడైన డిరోజియో పాశ్చాత్య విజ్ఞానం ఎడ విపరీతమైన ఆసక్తిని రేకెత్తించాడు.

## 2.4.3. ఆంగ్ల ప్రభుత్వ విద్యా విధానం :

మిషనరీలు, పురోగాములైన భారతీయులు ఎంతో చొరవ తీసుకుంటున్నప్పటికీ పాశ్చాత్య విద్యా వ్యాప్తి విషయంలో ఇండియాలోని కంపెనీ అధికారులూ, ఇంగ్లాండ్‌లోని బ్రిటీష్ ప్రభుత్వం చివరి వరకు ఉదాసీనంగా ఉండిపోయింది.

**ఎ) ఈస్ట్ ఇండియా కంపెనీ నిర్లక్ష్యం :** ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి ఇండియాలో వ్యాపారమూ, ఆ వ్యాపార పరిరక్షణకై రాజకీయాధికారమూ మాత్రమే ప్రధాన లక్ష్యాలుగా ఉండేవి. భారతీయుల మతాచారాల విషయంలోగానీ, విద్యా విధాన విషయంలో గానీ జోక్యం కలిగించుకొని వారిని ఏవిధంగానూ వ్యతిరేకం చేసుకొనటం వారికి ఇష్టం లేదు. అందుకే వారు ఇండియాలో క్రైస్తవ మత ప్రచారాన్ని గాని, వారి విద్యా వ్యాప్తిని గాని ప్రోత్సహించలేదు. పైపెచ్చు కంపెనీ ప్రభుత్వ ప్రాచ్య భాషాధ్యయనాన్ని ప్రోత్సహించింది. న్యాయ శాస్త్ర వివరణ, న్యాయ నిర్ణయం ఇత్యాది పరిపాలనా నిర్వహణ కార్యాలలో వారికి హిందూ, ముస్లీం న్యాయ శాస్త్రాల పండితుల అవసరం ఏర్పడింది. ఈ అవసరాన్ని బట్టియే హేస్టింగ్స్ 1780లో ముస్లీంలు అరబ్బీ, పార్సీలు చదవటానికై కలకత్తా మద్యసాను స్థాపించాడు. జోనాథన్ డంకన్ 1791 లో వారణాసిలో సంస్కృత కళాశాలను స్థాపించాడు. కాని భారతీయ భాషల్లో పాఠ్య గ్రంథాలనూ, వ్యాకరణాలను, నిఘంటువులను రచించటానికి, ఇతర భాషల నుండి గ్రంథాలను అనువాదం చెయ్యటానికి ఆ కళాశాల అధ్యాపకులను ఉపయోగించుకున్నారు. భారతీయ వచన సారస్వతాన్ని అభివృద్ధి చెయ్యటం ఆ కళాశాల ప్రధాన ధ్యేయం. ప్రాచ్య భాషాభిమానం కలిగిన విలియం జోన్స్ ప్రభృతులు కూడా ఈ భావానికే దోహదం చేశారు.

**బి) చార్టర్ చట్టాలు :** 1813, 1833లో చెయ్యబడిన చార్టర్ చట్టాలు ఇండియాలో ఆంగ్ల విద్యకు తోడ్పడ్డాయి. ఇంగ్లాండ్‌లోని ప్రజాభిప్రాయ ప్రాబల్య కారణంగా 1813 చార్టర్ చట్టంలో ఇండియాలో విద్యాభివృద్ధికై ఏటేటా లక్ష రూపాయలు ఖర్చు చెయ్యాలని ప్రత్యేకించవలెనని శాసించబడింది. అయితే 1813 నుండి 1823 వరకూ ప్రాశ్చ పాశ్చాత్య విద్యా విధానాల వివాదం వల్ల ఆ లక్ష రూపాయలను పూర్తిగా ఖర్చుపెట్టలేదు. 1833 చార్టర్ చట్టంలోని అధికరణం వల్ల ఇండియాలోని విద్యా విధానాన్ని నిర్ణయించటానికి లార్డ్ మెకాలే నియమించబడినాడు. 1833 సంవత్సరములో ఇంగ్లాండ్‌లో ఉన్న రాజారామ్మోహన్ రాయ్ ఇండియాలో పాశ్చాత్య విద్య ప్రవేశ పెట్టవలసిన ఆవస్యకతను గూర్చి ప్రచారం చేశాడు. అతని ప్రచారం కూడా బెంటింక్, మెకాలేలను ప్రభావితం చేసింది.

**సి) విద్యాకమిటీలో పాశ్చాత్య విద్యా విధానం వివాదం :** 1823లో కంపెనీ ప్రభుత్వం విద్యా విషయాలను గురించి చర్య తీసుకొనుటకై ఒక విద్యా కమిటీని నియమించింది. ప్రాచీన శాస్త్రాభిమానులైన భారతీయులు ఇంగ్లీషు విద్యను ఇష్టపడక అసంతృప్తిని పెంచుకుంటారని కొందరు, భారతీయులు రాజకీయ స్వాతంత్ర్యం కొరకు ఆందోళన చేయుదురని మరికొందరు భయాన్ని వెలిబుచ్చారు. మరికొందరు అధికారులు వీరితో ఏకీభవించక ఇంగ్లీష్ విద్య వల్ల ఆంగ్ల సంస్కృతి పట్ల భారతీయులకు అభిమానం ఏర్పడుతుందని వాదించారు. ఈ వాదోపవాదాలు 1835 వరకూ కొనసాగుతూనే వచ్చాయి. మొత్తం మీద కమిటీ సంప్రదాయ విద్యనే సమర్థించింది.

**డి) కంపెనీ డైరెక్టర్ల వైఖరి - ఉపయుక్త తత్వం :** ఈస్ట్ ఇండియా డైరెక్టర్లు బెంథామ్, జేన్‌మిల్ మొదలైనవారు ఉపయుక్త తత్వాన్ని జీర్ణించుకొన్నవారు. ప్రతి వ్యవస్థ యొక్క గుణ దోషాలను దాని ఉపయోగమును బట్టి నిర్ణయించాలని ఈ తత్వం సారాంశం. 1830 నాటికి కంపెనీ పాలనా ఖర్చులు అమితంగా పెరిగిపోయాయి. భారతీయులను అధిక సంఖ్యలో ఉద్యోగాలలో నియమించినచో ఇంగ్లీష్ ఉద్యోగుల జీతాల కంటే వారి జీతాలు తక్కువగా ఉండటం వల్ల లాభదాయకం అవుతుందని వారు గ్రహించారు. ఉద్యోగాల్లో ప్రవేశించదలచిన ఇంగ్లీష్ భాష తెలిసి ఉండటం వల్ల క్రమంగా కంపెనీ ప్రభుత్వం పాశ్చాత్య విద్యకు అనుకూలంగా మరింది.

## 2.4.4. ఆంగ్ల విద్య అధికారిక ప్రారంభం :

**ఎ) బెంటింక్ నిర్ణయం :** ఇట్టి స్థితిలో 1829 లో గవర్నర్ జనరల్ పదవిలోనికి వచ్చిన లార్డ్ విలియం బెంటింక్ బెంథామ్‌కు సన్నిహితుడు. ఉపయుక్త తత్వముచే ప్రభావితుడైన వాడు. బెంటింక్ భారతీయులకు పాశ్చాత్య విద్య నేర్పటమే ప్రయోజనకరం అని విశ్వసించాడు. విద్యకై ప్రభుత్వం ప్రత్యేకించిన ధనం ప్రయోజనకరమైన విద్యాభివృద్ధిలోనికి వస్తున్న భారతీయులలో పాశ్చాత్య విజ్ఞానాన్ని వ్యాపింపజేయటమే ప్రభుత్వ ఆశయం అని అతడు అంగీకరించాడు. ఈ విషయంలో కంపెనీ డైరెక్టర్ల అండదండలు ఇతనికి ఉన్నాయి.

**బి) మెకాలే కమిటీ సిఫార్సు :** 1834 లో మెకాలే అను ప్రఖ్యాత వక్త, రచయిత, గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లో న్యాయశాఖా సభ్యుడై 1835 లో విద్యాకమిటీకి అధ్యక్షుడుగా నియమించబడ్డాడు. ఇతడు కూడా ఉపయుక్త తత్వాభిమాని. 1833 లో చార్టర్ చట్టంపై జరిగిన చర్చలో పాల్గొని భారతీయులకు పాశ్చాత్య విద్య నేర్పవలసిన అవసరాన్ని గూర్చి ఉపన్యసించాడు. ఆంగ్ల విద్య వల్ల బ్రిటీష్ సామ్రాజ్యమునకు ప్రమాదం ఏర్పడింది. అది హర్షించదగ్గదే కాని విచారించదగ్గది కాదు, అని ప్రకటించాడు. విద్యాకమిటీ అధ్యక్షుడు అయిన ఈతని సిఫారసు 1835 లో ఇండియాలో పాశ్చాత్య విద్యను అధికారికంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించబడింది. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ 1835 లో సిద్ధ పరచిన పత్రం భారతదేశ విద్యా విధాన చరిత్రలో అత్యంత ప్రాధాన్యం వహించింది. శాస్త్రీయ విజ్ఞాన బోధనకు సంస్కృత, అరబ్బీ భాషలు అనర్థములని అతడు అభిప్రాయపడినాడు. 'ఇండియా అరేబియాలలోని సారస్వతం అంతా ఒక యూరోపియన్ గ్రంథంలోని ఒక అల్మారా పుస్తకాల విలువకు సమానం' అని తూలనాడాడు. ఆంగ్ల విద్య భారతదేశానికి రాజకీయ, సాంస్కృతిక ఐక్యతలను సమకూర్చుతుందని చార్లెస్ ట్రెవిల్యాన్ అభిప్రాయపడ్డాడు.

**సి) వివాదగ్రస్తమైన 3 అంశాలు :** విద్యా వ్యాప్తిని గురించి తల ఎత్తిన వాదోపవాదాలలో 3 ప్రధాన విషయాలు చర్చకు వచ్చాయి. వాటిలో మొదటిది ప్రభుత్వ ఆధ్వర్యంలో బోధింపదగినవి ప్రాచ్య విద్యలా, పాశ్చాత్య విద్యలా అనేది. మెకాలే సిఫార్సుపై 1835లో చెయ్యబడిన ప్రభుత్వ నిర్ణయం పాశ్చాత్య విద్యకు అనుకూలమైనది. రెండవ విషయం పాశ్చాత్య విద్యను నేర్చుకొనటానికి పటిష్టసాధనమైనది ఏ భాష అనేది. ఆధునిక విజ్ఞానమును నెర్పగల పదజాలం అరబ్బీ, సంస్కృత భాషల్లో లేదు. కనుక ఇంగ్లీష్ భాష ఒక్కటే బోధనా భాషగా ఉండాలని నిర్ణయించబడింది. 3 వ విషయం విద్యను నేర్పవలసింది ప్రజలందరికా, లేక ఒక ప్రముఖ వర్గానికి మాత్రమేనా అనేది. ప్రజలందరికీ ఆంగ్ల విద్య నేర్పటం వ్యయ సాధ్యం. కనుక ప్రముఖ వర్గాలకు మాత్రమే నేర్పటం మించదని ఆంగ్ల అధికారులు నిర్ణయించారు. విద్యావంతులైన ప్రముఖ వర్గాల వారు విజ్ఞానాన్ని క్రింది వర్గాలకు అందచేస్తారని భావించారు. ఈ ప్రభావానికి వడపోత సిద్ధాంతం అని పేరు. కాని దీని వల్ల విద్యావంతులకు, విద్యా హీనులకు నడుమ పెద్ద అఘాతం ఏర్పడింది.

## 2.4.5. ఆంగ్ల విద్య ఫలితాలు :

**ఎ) ఆధునిక విజ్ఞాన ప్రగతి :** ఆంగ్ల విద్యా వ్యాప్తి, భారతీయులలో ఆధునిక విజ్ఞానం త్వరితగతిన విస్తరించింది. హేతువాదం, మానవతావాదం, స్థిరపడింది. సంఘ సంస్కరణయెడల అభిరుచి ఏర్పడింది. దేశమంతటా ఇంగ్లీష్ అనుసంధాన భాషగా రూపొందటంతో దేశ సమగ్రతా భావం వ్యాపించింది. భారతీయుల్లో అంతర్జాతీయ దృక్పథం ప్రవేశించింది.

**బి) దేశీయ భావ దాస్యం :** ఆంగ్ల విద్యావంతుల జీవనోపాధికి కారణమైన బ్రిటీష్ పాలన పాట్ల అభిమానం పెరిగింది. ఉద్యోగంలో చేరని విద్యావంతుల్లో కూడా ఇట్టి మనోభావమే వ్యాపించింది. దేశంలో భావదాస్యం పెరిగింది. వారి దృష్టిలో బ్రిటీష్ సంస్కృతి అత్యుత్తమ సంస్కృతి. ఆంగ్ల విద్యావంతులు 1857 తిరుగుబాటులో పాల్గొనక పోవటానికి కారణం ఇదే.

**సి) దేశ భాషల యెడ నిర్లక్ష్యం :** బ్రిటీష్ పరిపాలనకు పూర్వం మన గ్రామీణ వ్యవస్థలో ప్రతి గ్రామంలోనూ ఒక బడి ఉండేది. మాతృ భాషను చదువుట, వ్రాయుట, సులభగణితము, మొదలైన వానిని పిల్లలు నేర్చుకునే వారు. ఇట్టి బడులలో చేరి చదివిన వారి సంఖ్య స్వల్పంగా ఉన్నప్పటికీ ఇవి సామాన్య ప్రజల అవసరాన్ని తీర్చగలిగింది. వీనిని పునః ఉద్దరించి సామాన్యులకు కూడా ఏదో కొంత విద్య నేర్పటం అవసరం అని కొందరు అధికారులు భావించి దానికి కావలసిన చర్యలు కొన్నింటిని తీసుకున్నారు. కాని కలకత్తాలోని కంపెనీ ప్రభుత్వం ఇంగ్లీష్ విద్యా వ్యాప్తి పట్ల పక్షపాతం వహించిన కారణంగా ఈ చర్యలు ఫలించలేదు. అందుచేత గ్రామీణ ప్రాంతాల్లో బ్రిటీష్ పరిపాలన కాలంలో దేశ భాషలు, దేశీయ విద్యా వ్యాప్తి కుంటుబడింది.

## 2.4.6. నమూనా ప్రశ్నలు :

1. భారతదేశంలో ఆంగ్ల విద్య అధికారికంగా ప్రవేశించిన విధానాన్ని వివరించండి. ?

2. ఆంగ్ల ప్రభుత్వ విద్యా విధానాన్ని, ఆంగ్ల విద్య ఫలితాన్ని గురించి వ్రాయుము. ?

## 2.4.7. చదువదగిన గ్రంథాలు :



| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |



ఆచార్య వై. కుమార స్వామి.

**ఖండిక - 2**

**పాఠం - 2.5**

# భారతదేశంలో ఆంగ్ల విద్య క్రమానుగతంగా వ్యాప్తి నొందిన విధానం

## 2.5.0. లక్ష్యం :

ఆంగ్ల వ్యి క్రమానుగతంగా భారతదేశంలో వ్యాప్తి చెందిన విధానాన్ని వివరించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయ సూచిక :**


2.5.1. ఆంగ్ల విద్యా విధానం అమలు

2.5.2. 1835-1854 మధ్య కాలంలో ఆంగ్ల విద్యా వ్యాప్తి

2.5.3. దేశీయ భాషలకు నిరాదరణ

2.5.4. 1854లో ఉడ్ పంపిన పత్రం **(Wood's Despatch)**

2.5.5. 1854-1882 మధ్య కాలంలో విద్యా వ్యాప్తి

2.5.6. హంటర్ కమిషన్

2.5.7. కర్జన్ విద్యా సంస్కరణలు

2.5.8. 1905 - 1947 మధ్య కాలమున విద్యా వ్యాప్తి

2.5.9. నమూనా ప్రశ్నలు

2.5.10. చదువదగిన గ్రంథాలు


## 2.5.1. ఆంగ్ల విద్యా విధానం అమలు :

ఆధునిక యుగారంభం నుండి అనగా 19వ శతాబ్దం ప్రారంభం నుండి దాదాపు 3 దశాబ్దాల పాటు ఇండియాలో ప్రాచ్య, పాశ్చాత్య విద్యా వాదుల మధ్య తీవ్రవాదోపవాదాలు జరిగాయి. తుదకు చార్లెస్ గ్రాంట్, అలెగ్జాండర్ డఫ్ మొదలైన క్రైస్తవ మత ప్రచారకుల వల్ల, రాజారామ్మోహన్ రాయ్ ప్రభృతుల ప్రోద్బలం వల్లనూ, ఇంగ్లాండ్‌లో ప్రబలిన ఉపయుక్తతత్వం వల్లనూ, Company అధికారుల ప్రవర్తనలో వచ్చిన మార్పు వల్లనూ, పాశ్చాత్య విద్యా విధానమునకే బలం చేకూరింది. 1835 మెకాలె సిఫారస్ వల్ల ఇండియాలో ఆంగ్ల విద్యా విధానమే ప్రవేశపెట్టాలని నిర్ణయించబడింది. పాశ్చాత్య విద్యను ఇంగ్లీష్ ద్వారా బోధించాలనీ, విద్య ప్రజలందరికీ కాక ఒక ప్రముఖ వర్గమునకు మాత్రమే బోధించాలనీ నిర్ణయమైంది. ఈ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ జనరల్ లార్డ్ విలియమ్ బెంటింక్ 1835 మార్చి 7వ తేదీన ఇండియాలో పాశ్చాత్య విద్యా విధానాన్ని అమలు పరుస్తూ తీర్మానం చేశాడు.

## 2.5.2. 1835 - 1854 మధ్యకాలంలో ఆంగ్ల విద్యా వ్యాప్తి :

ప్రభుత్వం అవలంభించిన విధానాలకు అనుగుణంగా ఆంగ్ల విద్యా వ్యాప్తి 1835 అనంతరం వేగంగానూ సక్రమంగానూ, జరిగింది. 1835 - 1838 మధ్యకాలంలో విద్యా సమితి పర్యవేక్షణలోని విద్యాలయాల సంఖ్య శీఘ్రంగా వృద్ధి చెందింది. వానిలోని విద్యార్థుల సంఖ్య

రెండు రెట్లు పెరిగింది. ఆంగ్ల విద్య ప్రజామోదం పొందిందని ట్రెవిల్యాన్, సదర్‌లాండ్, సర్ జాన్ షోర్, మెకంజీ, ప్రభృతులు ప్రమాణీకరించారు. ఆంగ్ల భాషను సివిల్ సర్వీసు ఉద్యోగాలకు నిర్బంధం చెయ్యాలని కోరుతూ **4000** మంది భారతీయులు పార్లమెంట్‌కు మహజర్ పంపారు. **1837** శాసనం ప్రకారం ప్రభుత్వ వ్యవహారాల్లో పర్షియన్ భాషను ఉపయోగించటం రద్దయింది. ఆంగ్ల భాషా పరిజ్ఞానం ప్రభుత్వోద్యోగాలకు తప్పక అవసరం అయిన యోగ్యత అని దేశమంతటా ముఖ్యంగా మధ్యతరగతుల వారు ఆంగ్ల విద్యా విషయంలో ఎక్కువ అభ్యుదయాన్ని సాధించారు.

**ఎ) బెంగాల్ :** విస్తారంగా వృద్ధి పొందుతున్న విదేశీ వాణిజ్యానికి, కంపెనీ వారి రాజకీయాధికారానికి కలకత్తా కేంద్రం కావటం వల్ల బెంగాల్ రాజధానిలో ఆంగ్ల విద్య బాగా విస్తరించింది. ఇంగ్లీష్ పాఠశాలలో అన్ని కులాలవారు విద్యనభ్యసించారు. **1835** లోనే కలకత్తా మెడికల్ కాలేజీ స్థాపించబడింది. **1842** లో ఏర్పడిన విద్యా సమితి ఆధ్వర్యంలో విద్యార్థి వేతనాలు ఇవ్వబడ్డాయి. **1838** లో హుగ్లీ కాలేజీ స్థాపించబడింది. **1843**లో స్కాటిష్ ప్రీచర్స్ ఆధ్వర్యంలో మరొక కాలేజీ స్థాపించబడింది. ఇంకా ఢాకా, బరంపూర్, కృష్ణనరగ్,మున్నగు చోట్ల కూడా ఆంగ్ల విద్యాలయాలు స్థాపించబడ్డాయి. పాఠ్యప్రణాళికలో బేకన్, జాన్సన్, మిల్టన్, షేక్స్పియర్, వంటి కవుల రచనలూ, ప్రాచీన, ఆధునిక చరిత్రలూ, గణిత, భౌతిక, రసాయన శాస్త్రాలూ, అర్థశాస్త్రమూ చేర్చబడ్డాయి. అప్పటి బెంగాల్ రాజధానిలో అంతర్భాగం అయిన బీహార్‌లో ఆంగ్ల విద్యకు ప్రోత్సాహం లభించలేదు. ఆంగ్ల పాఠశాలలను మతాంతీకరణ సంస్థలుగా సంశయిస్తూ వచ్చారు. **1838** లో బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నర్ వ్రాసిన దాన్ని బట్టి పాట్నాలోని పాఠశాల పర్యవేక్షణాధికారి యొక్క కార్యాలయం 'సైతాన్ కా దఫ్తర్ ఖాన్' అని వ్యవహరించబడుతూ ఉండేది.

**బి) బొంబాయి రాజధాని :** **1835** పూర్వమే బెంగాల్ గవర్నర్ ఎల్ఫిన్‌స్టన్ బొంబాయి రాజధానిలో విద్యా వ్యాప్తికి కృషి చేశాడు. ఇతడు **1821** లో పూనాలో సంస్కృత కళాశాలను, **1822** లో బొంబాయి దేశీయ విద్యాలయాన్ని స్థాపించాడు. ఈ దేశీయ విద్యాలయమే **1827**లో "బొంబాయి దేశీయ విద్యా సంస్థ" అని పిలువబడింది. ఈ సంస్థ ఆధునిక దేశ భాషలలో పాఠ్య గ్రంథాలు సిద్ధపరచటం, ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వటం, ఆంగ్ల విద్యాభ్యాసానికి పాఠశాలలను నెలకొల్పటం అనే కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సంస్థ కృషి ఫలితంగా బొంబాయి ఠానా, పన్‌వాల్, పూనా నగరాలలో **4** జిల్లాలలో ఆంగ్ల పాఠశాలలు పాశ్చాత్య ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో స్థాపించబడ్డాయి. వివిధ ప్రదేశాలలో **115** ప్రాథమిక పాఠశాలలు ఏర్పడ్డాయి. దేశీయ విద్యా సంస్థకు తోడు ప్రభుత్వం కూడా రెండు కళాశాలలను నిర్వహించింది. **1834**లో నెలకొల్పిన ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలో ప్రభుత్వ వ్యవస్థలోని సివిల్ సర్వీస్ ఉద్యోగాలకు తగిన శిక్షణ ఇచ్చేవారు. **1840** లో సర్ ఎల్‌స్కెన్ పెర్రీ అధ్యక్షతన ఏర్పడిన 'విద్యా సమితి' పాఠ్య ప్రణాళికలో, దేశ భాష ఆంగ్ల భాష బోధించాలనీ, ఉన్నత విద్య మాత్రం ఆంగ్లంలో బోధించాలనీ తీర్మానించింది. బొంబాయి రాజధానిలో క్రైస్తవ మిషనరీలు పూనా, అహమ్మద్ నగర్, సూరత్, రాజకోటలలో ఆంగ్ల పాఠశాలలు నెలకొల్పారు. బొంబాయిలో విల్సన్ కళాశాలలో **1852** లో **400** మంది విద్యార్థులు చదువుతూ ఉండేవారు. ఆంగ్ల విద్యాభ్యాసానికి పూనుకున్న వారిలో పార్సీలు చెప్పదగ్గవారు.

**సి) మద్రాస్ రాజధాని :** క్రైస్తవ మిషనరీలు మదరాసు, కదలూరు, తంజావూరు, తిరుచునాపల్లి, ప్రాంతాలలో పాఠశాలలు నెలకొల్పినారు. వీరు **16**వ శతాబ్ది ప్రారంభంలో ఆంగ్ల పాఠశాలలను రాజధాని అంతటా స్థాపించటానికి పూనుకున్నారు. **1838** నాటికే వేలకొలది ప్రజలు ఆంగ్లం నేర్చియున్నారని ట్రెవిల్యాన్ వినుతించాడు. మిషనరీలు అన్ని స్థాయిలలో ఆంగ్ల సారస్వతమూ, పాశ్చాత్య విజ్ఞానశాస్త్రాలూ బోధించేవారు. అండర్ సన్ మదరాస్‌లో స్థాపించిన కళాశాల తరువాత క్రిష్టియన్ కళాశాల అని వ్యవహరించబడింది. ప్రభుత్వ ఉద్యోగాలకై పరీక్షలు నిర్వహించడానికి **1845** లో ప్రభుత్వం ఒక విద్యా సంస్థను స్థాపించింది. ఈ సంస్థ ప్రభుత్వ ఆదేశంపై 'మదరాసు విశ్వవిద్యాలయం' స్థాపించింది. జిల్లాలలో కూడా స్వంత పాఠశాలలు నెలకొల్పింది. తిరుచునాపల్లి, మచిలీపట్నం, భళ్ళారి, కాలికట్, కడలూర్, రాజమండ్రిలలో ఆంగ్ల విద్యాలయాలు ఏర్పడ్డాయి. **1842** లో పచ్చయప్ప అనే హిందీ ప్రముఖుడు "పచ్చయప్ప కళాశాల" ను మదరాసులో నెలకొల్పాడు. కంచి, చిదంబరంలో కూడా ఈ సంస్థ పాఠశాలలు స్థాపించింది.

**డి) ఉత్తర భారతం :** పశ్చిమోత్తర ప్రాంతాలలో ఆంగ్ల విద్యా వ్యాప్తి మందంగా సాగింది. ఆంగ్ల ప్రభుత్వం బెంగాల్‌లో వలెనే ఇక్కడ కూడా తన విద్యా విధానాన్ని అమలు జరిపింది. **1824** లో ఆగ్రాలోనూ, ఢిల్లీలోనూ, **1827**లో బరైలీ లోనూ అంతకు ముందే కళాశాలలు

స్థాపించారు. వారణాసి సంస్కృత కళాశాలలో ఆంగ్ల భాషను బోధించే తరగతులు కూడా ప్రవేశపెట్టారు. గోరఖ్‌పూర్ నుండి అజ్మీర్ వరకు 14 ఆంగ్ల పాఠశాలలు నెలకొల్పారు. 1843 నుండి లెఫ్టినెంట్ గవర్నర్ థాంప్సన్ ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తికి బాగా కృషి చేశాడు. మిషనరీలు లూధియానా, షహరాన్ పూర్, జలందర్, అంబాలా, లాహోర్, షరూకాబార్‌లలో ఆంగ్ల విద్యాలయాలు నెలకొల్పారు. ఆగ్రా, అలహాబాద్‌లలో కాలేజీలు స్థాపించారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ప్రభుత్వం ఒక ఆంగ్ల విద్యాలయం స్థాపించింది.

## 2.5.3. దేశీయ భాషలకు నిరాదరణ :

దేశ భాషల ద్వారా పాశ్చాత్య విజ్ఞానాన్ని బోధించాలని మాల్కమ్, మన్రో, ఎల్ఫిన్ స్టన్ మొదలైన వారు వాదించారు. బోధనా భాషా విషయమై బొంబాయిలో రెండు పక్షాల వారికీ వాద ప్రతివాదాలు జరిగాయి. తుదకు ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఉన్నత విద్యారంగంలో ఆంగ్లమే బోధనా భాషగా స్థిరపడింది. మన్రో, ఎల్ఫిన్‌స్టన్‌లు తయారుచేసిన సార్వజనిక విద్యాప్రణాళిక త్రోసివేయబడింది. దీనితో దేశభాషలు నిరాదరణకు గురయినాయి. ఆంగ్ల విద్యా విధానం విషయంలో బెంటింక్ నిర్ణయాన్ని మెట్కాఫ్, ఆక్లండ్‌లు బలపరచటంతో దేశ భాషలను గమనించే అవకాశం లేకపోయింది.

## 2.5.4. 1854 లో ఉడ్ పంపిన పత్రం (Wood's Despatch) :

1835 నుండి ఆంగ్ల విద్య ప్రవేశపెట్టినప్పటికీ 1854 నాటికి 20 కోట్ల జనాభా కలిగిన భారత దేశంలో 1474 విద్యాలయాలు మాత్రమే ఏర్పడి 67,569 మంది విద్యార్థులకు మాత్రమే విద్య లభిస్తూ ఉంది. ఈ విద్యాలయాల కన్నింటికీ ప్రభుత్వం ప్రత్యేకించిన ఖర్చు మొత్తం ఆదాయంలో ఒక శాతం మాత్రమే. క్రైస్తవ సంస్థలు నెలకొల్పిన విద్యాలయాల వల్ల ఈ పరిస్థితి మెరుగుపడింది. ఇట్టి స్థితిలో 1854లో అధికార సమితి అధ్యక్షుడైన సర్ చార్లెస్ ఉడ్ పంపిన సలహా పత్రం విద్యా విషయంలో నూతన యుగాన్ని ప్రవేశపెట్టింది. ఇండియాలో జరిగిన అభివృద్ధిని గురించి పార్లమెంట్ సెలెక్ట్ కమిటీ వారు గావించిన విచారణ ఆధారముగా ఈ పత్రం రచించబడింది. "నైతికమూ, లౌకికమూ అయిన అభ్యుదయాన్ని ప్రజలకు కలిగించుట, ప్రజల బుద్ధి వికాస సామర్ధ్యాలను అభివృద్ధి పరచుట, న్యాయ నిష్టలు కల వ్యక్తులను ప్రభుత్వ ఉద్యోగాలకు తయారుచేయుట, దేశ సంపదను విస్తరింపచేయుట మున్నగు ఆశయాలను దృష్టిలో ఉంచుకొని, భారతదేశ విద్యా విధానాన్ని రూపొందించాలి అని ఉడ్ ఉద్ఘాటించాడు. పాశ్చాత్య విజ్ఞాన సర్వస్వాన్ని భారతదేశంలో వ్యాప్తి గావించుటే విద్యా విధానం ఆశయంగా ఉండాలని, ఆంగ్ల భాష, దేశ భాషలు బోధనా భాషలుగా నుండి ఉద్దిష్ట ప్రయోజనాన్ని సాధింపగలవని అతడు అభిప్రాయం వెలిబుచ్చాడు. అనగా విద్యా వ్యాప్తికి ఆంగ్లము, సామాన్య విద్యకు దేశ భాషలూ ఉపయుక్తములు కావాలని అతని తాత్పర్యం.

విద్యా విస్తృతిని గూర్చి ఉడ్ పంపిన పత్రంలో ఈ క్రింది సిఫార్సులు పొందు పరచబడ్డాయి.

1) కలకత్తా, బొంబాయి, మద్రాసు నగరాల్లో లండన్ విశ్వ విద్యాలయాల మాదిరిగా మూడు విశ్వవిద్యాలయాలు నెలకొల్పాలి. వాటిని పరీక్షా సంస్థలుగా చేయాలి
2) దేశీయములు, ఆంగ్ల - దేశీయములూ అయిన ఉన్నత పాఠశాలలను అధిక సంఖ్యాకంగా పెంచాలి
3) థామ్సన్ ప్రణాళిక ననుసరించి పశ్చిమోత్తర ప్రాంతాలకు దేశీయ పాఠశాలల ద్వారా ప్రాథమిక విద్యను వ్యాప్తి చేయాలి. ప్రతి ప్రాంతం లోనూ డైరెక్టర్ పర్యవేక్షణలో విద్యాశాఖలను నెలకొల్పి, వాటి ద్వారా సక్రమ విద్యా విధాన పర్యవేక్షణను ఉడ్ ప్రతిపాదించారు. విద్యాలయాల నిర్వహణకు అవసరం అయిన ఆర్థిక బాధ్యతను ఉడ్ స్వీకరించలేదు. ఈ బాధ్యతలో కొంత భాగాన్ని ప్రజలపైన, పౌర సంస్థల పైన ఉంచాడు. ఈ విషయమై సహాయక గ్రాంట్ల విధానాన్ని సూచించాడు. ఈ విధానం వల్ల మిషన్ పాఠశాలలే ఎక్కువగా లాభం పొందాయి. స్త్రీ విద్యకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన ఆవశ్యకతను గూర్చి కూడా ఉడ్ నొక్కి వక్కాణించాడు.

## 2.5.5. 1854 - 1882 మధ్య కాలంలో విద్యా వ్యాప్తి :

ఈ కాలంలో విద్యారంగంలో గణనీయమైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఉన్నత పాఠశాలలు, కళాశాలలలోని విద్య ప్రగతిని సాధించింది. ప్రాథమిక విద్యా వ్యాప్తి మందగించి నిరుత్సాహాన్ని కలిగించింది. విద్యా విధానం ప్రాంతీయ శాఖలుగా ఏర్పడింది. విద్యా సంస్థల విస్తృతిలో భారతీయులు ఎక్కువగా పాల్గొన్నారు. మిషనరీల ఉద్యమానికి దెబ్బతగిలింది.

**ఎ) 1857 తిరుగుబాటు వల్ల కలిగిన కలత :** 1857 లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటమునకు ఆంగ్ల విద్యయే కారణమేమో అని ఎలెన్ బరో వంటి వారు శంకించి విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహ విషయమై కొంత పునరాలోచన సాగించారు. వారు ప్రవేశపెట్టిన సార్వజనీన విద్య, స్త్రీ విద్య, మిషనరీ విద్యకు గ్రాంట్లు ఇచ్చుటయే భారతీయుల అసంతృప్తికి కారణమని కొందరు వాదించారు. కాని లార్డ్ స్టాన్లీ ఈ అభ్యంతరాలను త్రోసి పుచ్చి ఉడ్ సలహా పత్రములోని అనేక అంశాలను కొనసాగించాడు.

**బి) విద్యాశాఖ నిర్మాణం :** విద్యా ప్రయోజనాలు సిద్ధించటానికి ప్రభుత్వం రెండు సాధనాలను ప్రయోగించింది. అందులో విద్యా శాఖ నిర్మాణం మొదటిది. విద్యా విషయాలను నిర్వహించుటకు, దానిని పర్యవేక్షించుటకు డైరెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఈ శాఖలో నియమించబడ్డారు. ప్రభుత్వం నెలకొల్పిన విద్యాలయాలను సక్రమంగా నిర్వహించటం మాత్రమే వీరి కర్తవ్యం. ఇతరులు నిర్వహించే విద్యాలయాలకు సహాయత అనుదానాలను మంజూరు చేసి, వాటిని విద్యాశాఖ పర్యవేక్షణకు లోబరచి, అవి సక్రమంగా నడుచునట్లు చేయుట రెండవ విధానం.

**సి) ప్రాథమిక విద్య :** ప్రభుత్వం ఇచ్చే గ్రాంటులు చాలనందు వల్లను, ప్రత్యేకించబడిన ధనం సక్రమంగా వినియోగం కానందునను, ప్రజల విరాళాలు తగినంత లేకపోవటం వల్లను ఈ కాలంలో ప్రాథమిక విద్య బాగా వ్యాపించలేదు. ప్రాచీన పద్ధతిలో నిర్వహించబడే దేశీయ పాఠశాలలూ, ప్రభుత్వం నెలకొల్పిన పాఠశాలలు ఈ రెండు సంస్థలూ ధన లాభం వల్ల దెబ్బతిన్నాయి. 1854 లో ఉడ్ సలహా పత్రంలోని అంశాలు మిషనరీలకు అనుకూలంగా ఉండేవి. కాని మిషన్ స్కూళ్ళలోని మత ప్రభావం కూడా సిపాయిల తిరుగుబాటుకు కారణమని ఆంగ్ల ప్రభుత్వం భావించడం వల్ల ఆ స్కూళ్ళకు గ్రాంట్లు నిలిపివేయాలనే సంకల్పం కలిగింది. ప్రాథమిక విద్యకు గ్రామాలపై విద్యాశుల్కం విధించుట, గ్రాంట్లు కంటే మేలని నిర్ణయించారు. 1882 లో ప్రభుత్వం వారు ఆధునిక ప్రాథమిక విద్యకై ఇచ్చిన ద్రవ్యం 17 లక్షల రూపాయలు మాత్రమే. ఇట్టి దుర్భర పరిస్థితిలో ఉండి కూడా ప్రభుత్వం వారి ఇన్‌స్పెక్షన్ భయంతో క్రమశిక్షణ నడుస్తూ ఉండేది. బ్రిటీష్ ఇండియాలో మొత్తం 20 కోట్ల జనాభాలో 21 లక్షలు విద్యార్థులు మాత్రమే ప్రాథమిక పాఠశాలల్లో చదువుతూ ఉండేవారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, భారతీయుల దారిద్ర్యం ఇందుకు ముఖ్య కారణాలు.

**డి) ఉన్నత పాఠశాల విద్య :** ఈ కాలంలో ఉన్నత పాఠశాలల్లో విద్యా విధానం ప్రోత్సాహజనకంగా ఉండేది. ఈ పాఠశాలలు ఆంగ్ల విద్యనే అవలంబించాయి. ఆంగ్ల విద్య వల్ల జీవనోపాధి సులభం కావటం వల్ల ప్రజలు ఆంగ్ల విద్యాభ్యాసానికి పూనుకొన్నారు. ప్రభుత్వం కూడా తమ అవసరం కొద్ది ఉన్నత విద్యాలయాల అభివృద్ధికి తోడ్పడింది. 1855 నాటికి 169 ఉన్నత పాఠశాలల్లో 18,335 మంది విద్యార్థులుండగా 1882 నాటికి 1363 ఉన్నత పాఠశాలల్లో 44,605 మంది విద్యార్థులున్నారు. ఈ విషయంలో దేశీయుల ప్రయత్నం కూడా చెప్పదగినదే.

**ఇ) కళాశాల విద్య :** ఈ కాలంలో కళాశాల విద్య వేగంగా అభివృద్ధి చెందింది. 1882 నాటికి బెంగాల్‌లో 27 కళాశాలలు, మద్రాస్‌లో 25, పశ్చిమోత్తర ప్రాంతంలో 11, బొంబాయిలో 6, పంజాబులో 2, మధ్య పరగణాలలో 1 చొప్పున దేశమంతటా 72 కళాశాలలుండేవి.

**యఫ్) విశ్వవిద్యాలయాలు :** ఉడ్ సలహా పత్రం ప్రకారం 1857 లో కలకత్తా, బొంబాయి, మద్రాసు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. దేశంలో కళాశాలలన్నీ ఈ 3 విశ్వవిద్యాలయాలు కళాశాలవిద్య పర్యవేక్షించి నిర్దేశించేవి. బోధనాశాఖలును ఏర్పరచలేదు. వీటి ఆధ్వర్యంలో సంయోజిత కళాశాలలుండేవి. ప్రారంభంలో కలకత్తా విశ్వవిద్యాలయానికి 14, పశ్చిమోత్తర పరగణాలలో 4, బొంబాయి, మద్రాసులలో 3 చొప్పున సంయోజిత కళాశాలలుండేవి. ఈ విశ్వ విద్యాలయాల వల్ల దేశమంతటా ఐక్య విద్యా విధానం ఏర్పడింది. వీని నిర్వహణకు సెనెట్, సిండికేట్‌లు ఏర్పడ్డాయి.

**జి) స్త్రీ విద్యకు ప్రోత్సాహం :** 1854కు పూర్వమే బెతూన్ అను అధికారి ప్రోద్బలం వల్ల, దక్షిణ రంజన్ ముఖర్జీ, రామ్ గోపాల్ ఘోష్ మున్నగు వారి సహకారంతో 1849 లో ఒక బాలికా విశ్వ విద్యాలయం స్థాపించబడింది. డల్హౌసీ ఈ విద్యాలయాల పోషణలో శ్రద్ధ వహించాడు. జ్యోతి బాపులే, ఈశ్వర చంద్ర సాగర్, వీరేశలింగం వంటి సంస్కర్తలు స్త్రీ విద్యకై కృషి చేశారు.

**హెచ్) ముస్లీములలో ఆంగ్ల విద్య యెడ అనాసక్తి :** ముస్లిముల మత దృక్పథం వల్లనూ, ప్రభుత్వం అశ్రద్ధ వల్లనూ వారిలో ఆంగ్ల విద్య వ్యాపించలేదు. ముస్లీములలో విద్యా వ్యాప్తికి కృషి చెయ్యాలని ప్రకటించింది. అయినప్పటికీ 1872 - 82 మధ్యకాలంలో ముస్లిము విద్యార్థుల సంఖ్య మొత్తం విద్యార్థుల సంఖ్యలో 3.65 శాతం మాత్రమే ఉన్నది.

## 2.5.6. హంటర్ కమిషన్ :

1880లో వైస్రాయిగా వచ్చిన రిప్పన్ విద్యావ్యాప్తి యెడ ఆసక్తి వహించి, ఆ విషయమై సలహాలివ్వడానికై 1882 లో హంటర్ కమిషన్‌ను నియమించాడు. ఈ కమిషన్ తన నివేదికలో విద్యా విధాన నిర్వహణ బాధ్యతకు వీలయినంత వరకు ప్రజలే పూనుకోవాలని విద్యా వ్యాప్తికై ప్రభుత్వం స్వయంగా పూనుకోరాదని, ఆసక్తిగల సంస్థలకు ఈ బాధ్యత అప్పగించి వారికి ఉదారంగా గ్రాంట్లు ఇవ్వాలని సూచించింది. ప్రాథమిక విద్యా వ్యాప్తికై ఇతోధిక ప్రోత్సాహం ఇవ్వాలని అందుకై స్థానిక నిధులను వినియోగించాలని కూడా సూచించింది. ఈ నివేదికకు పిమ్మట 20 సంవత్సరాలలో ఉన్నత పాఠశాలలకూ కళాశాలలకూ సంబంధించిన విద్యాభివృద్ధి అధికమైంది. కాని ప్రాథమిక విద్య మాత్రం శోచనీయ దశలోనే ఉండిపోయింది. ముస్లీంల విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని హంటర్ కమిషన్ సిఫార్సు చేసింది.

## 2.5.7. కర్జన్ విద్యా సంస్కరణలు :

వైస్రాయి లార్డ్ కర్జన్ భారతీయ విద్యా విధానం ప్రభుత్వాధీనానికి దూరమై దేశీయుల హస్తగతమై పోయిందని విద్యావంతులైన భారతీయులు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారనీ గ్రహించాడు. కనుక విద్యా ప్రమాణాలు తగ్గిపోయాయి. అనే నెపంతో విద్యా విధానంలో జోక్యం కలిగించుకున్నాడు. విద్యా విధానాన్ని విచారణ గావించటానికి కర్జన్ నియమించిన ర్యాలే విద్యా సమితి విశ్వవిద్యాలయ పరిపాలనను నూతనంగా ఏర్పరచాలని సూచించింది. విశ్వవిద్యాలయాలు బోధనా కార్యక్రమానికి కూడా పూనుకోవాలని, సంయోజిత కళాశాలల విషయం పర్యవేక్షణాధికారం అధికంగా వహించాలని, నూతన సంయోజిత కళాశాలల విషయంలో ఎక్కువ షరతుల్ని విధించాలనీ ఈ కమిషన్ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను అమలు పరచటం ద్వారా కర్జన్ దేశంలో పెల్లుబికే జాతీయ భావానికి విరుద్ధమైన విద్యావిధానం అవలంభించాడు. అయితే అతడు వృత్తి విద్యలను ప్రవేశపెట్టుట, పురాతత్వ శాఖను నెలకొల్పుట వంటి మంచి పనులు చేయకపోలేదు.

## 2.5.8. 1905 - 1947 మధ్య కాలమున విద్యావ్యాప్తి :

**ఎ) వివిధ స్థాయిలలో విద్యావ్యాప్తి :** ఈ కాలమున కూడా ప్రాథమిక విద్యకై తగిన కృషి జరగలేదు. నిర్బంధ ప్రాథమిక విద్యకై గోఖలే చేసిన ప్రయత్నం విఫలమైంది. భారతీయుల అసంతృప్తిని తొలగించటానికి 1911 లో 50 లక్షల రూపాయలు అదనపు గ్రాంటు ప్రభుత్వం ఇచ్చింది. 1920 తరువాత రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టాయి. సెకండరీ విద్య, కళాశాల విద్య మాత్రం సంతృప్తికరమైన అభివృద్ధి సాధించింది. అయితే విద్యా ప్రమాణాలు క్రమంగా పడిపోయాయి. ఈ కాలంలో విశ్వవిద్యాలయాలు విరివిగా స్థాపించబడ్డాయి. బెనారస్, మైసూర్, పాట్నా, ఉస్మానియా, అలీఘర్, లక్నో, ఢిల్లీ, ఆంధ్రా, నాగపూర్, ఆగ్రా, అన్నమలై, తిరువాస్కూర్, ఉత్కళ్, సింధు విశ్వవిద్యాలయాలు క్రమంగా స్థాపించబడ్డాయి.

**బి) జాతీయవిద్యా విధానం :** బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్య జ్ఞాన సమాజం, రామకృష్ణ మిషన్, మొదలైన హిందూ సంస్కరణ సమాజాలు పెక్కు విద్యాలయాలు నెలకొల్పాయి. జాతీయోద్యమం ప్రబలిన పిమ్మట దేశం అంతటా అనేక జాతీయ కళాశాలలు స్థాపించబడ్డాయి. గాంధీ మహాత్ముడు తన 'హరిజన్' పత్రిక ద్వారా విద్యావిధానాన్ని ప్రచారం సాగించాడు. జాకీర్ హుస్సేన్ అధ్యక్షతలో 1937 లో జరిగిన హర్దా సమావేశంలో ఈ విద్యా విధానం ప్రతిపాదించబడింది. దీని ప్రకారం బాలురకు 7 సంవత్సరాల పాటు మాతృ భాషలో విద్యా బోధన జరగాలనీ, వృత్తి విద్యలు నేర్పాలనీ తీర్మానించబడింది. కాంగ్రేసు మంత్రి వర్గాలు తమ రాష్ట్రాలలో బేసిక్ విద్యను ప్రవేశపెట్టాయి. 1939లో వయోజన విద్యా ప్రచార ఉద్యమం కూడా కొనసాగింది.

## 2.5.9. నమూనా ప్రశ్నలు :

1. భారతదేశంలో ఆంగ్ల విద్య వ్యాప్తి గూర్చి తెలుపుము

## 2.5.10. చదువవదదిన గ్రంథాలు


1. K.K. Datta : A Social History of Modern India
2. K.K. Datta : Renaissance, Nationalism and Social Charge in Modern India
3. Bipin Chandra : Nationalism and Colonialism in Modern Indian.
4. Tapan Raychaudhuri and : The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib
5. Sumit Sarkar : Modern Indian 1885-1947
6. R. Plame Dutt : Indian Today
7. R.C. Majumdar : History of Freedom Movement in Indian, 3 Vols.
8. R.C. Majumdar and others (Ed.) : The History and Culture of Indian People Vols. IX and X
9. B.N. Chopra, B.N. Puri and M.N. Das : A Social, Cultural and Economic History of India, 3 Vols
10. Tarachand : History of Freedom Movement in India, 4 Vols.
11. S.C. Roychaudhuri : Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India.


ఆచార్య వై. కుమార స్వామి.

**ఖండిక - 2**

**పాఠం - 2.6**

# ఆధునిక భారతదేశంలో సాంఘిక మార్పులో క్రైస్తవ మిషనరీల పాత్ర

## 2.6.0. లక్ష్యం :

భారతదేశంలో సాంఘిక మార్పులో క్రైస్తవ మిషనరీల పాత్రని వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయ సూచిక :**


**2.6.1.** భారతావనిలో క్రైస్తవ మత ప్రవేశం

**2.6.2.** బ్రిటీష్ వారి వైఖరి

**2.6.3.** క్రైస్తవులు ప్రోత్సహించిన సంస్కరణలు

**2.6.4.** విద్యా వ్యాప్తికి క్రైస్తవ మిషనరీల కృషి

**2.6.5.** మతం మార్పిడి

**2.6.6.** స్వాతంత్ర్యానంతరం

**2.6.7.** నియోగి సంఘ నివేదిక

**2.6.8.** రాజకీయాలలో మిషనరీలు

**2.6.9.** కాన్వెంట్ చదువులు

**2.6.10.** భారతీయ క్రైస్తవులపై హిందూ మత ప్రభావం

**2.6.11.** నమూనా ప్రశ్నలు

**2.6.12.** చదువదగిన గ్రంథాలు


## 2.6.1. భారతావనిలో క్రైస్తవ మత ప్రవేశం :

క్రీ॥శ॥ 1 వ శ॥లోనే క్రైస్తవ మతం భారతదేశంలో అడుగు పెట్టిందని ప్రతీతి. క్రీస్తు శిష్యుడు అయిన సెయింట్ థామస్ మద్రాస్ ప్రాంతానికి వచ్చాడని చెబుతారు. కాని క్రైస్తవ మతం యూరోప్ అంతటా అలముకొనక మునుపే సిరియన్ క్రైస్తవులు కేరళలో అడుగుపెట్టిన విషయం వాస్తవం. అయితే పోర్చుగీసు వారు భారతదేశానికి వచ్చే వరకూ ఈ మతం కేరళలో కొద్ది ప్రాంతానికి మాత్రమే పరిమితం అయి ఉండేది. 1846 నుండి పోర్చుగీసు వారు గోవా కేంద్రంగా చేసుకొని భారతదేశంలో కొన్ని తీర ప్రాంతాలలో కేథలిక్ శాఖను బలవంతంగా రుద్దారు. దేశీయ మతాచారాలపై ఆంక్షలు విధించారు. నేటికీ గోవాలో కేథలిక్ మాత్రమే ప్రధానంగా వ్యాపించి ఉండటానికి కారణం ఇదే. మొత్తం మీద క్రైస్తవ మతం దక్షిణ భారతదేశంలో వేళ్ళూన సాగింది. ఇటాలియన్, ఫ్రెంచి మత బోధకులు కూడా కేథలిక్ మత వ్యాప్తికి పాటు పడ్డారు.

## 2.6.2. బ్రిటీష్ వారి వైఖరి :

17వ శతాబ్దములో ఇండియాకు వర్తకులై వచ్చిన డచ్చి వారు, ఆంగ్లేయులు ప్రొటెస్టెంట్ శాఖకు చెందినవారు. వీరు క్రైస్తవ మత వ్యాప్తికి పెద్ద ఉత్సాహం ప్రదర్శించలేదు. నిజానికి ప్రొటెస్టెంట్‌లలో మిషనరీలు ఇండియాలో అడుగుపెట్టిన వారిలో డానిష్ జాతీయులు ప్రథములు. కాని వారి ప్రయత్నం అంతగా ఫలించలేదు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో తమ వ్యాపారం సాఫీగా కొనసాగాలంటే మతం జోలికి పోరాదన్న లౌకిక విధానం అవలంభించింది. అయినప్పటికీ కంపెనీ అధికారులు కొందరు తటస్థ వైఖరిని ప్రోత్సహించినప్పటికీ తక్కిన వారు క్రైస్తవ మత ప్రచారాన్ని కాదనలేదు. ఈ దేశంలో ప్రొటెస్టెంట్ మతాన్ని ప్రచారం చేసే ఉద్దేశ్యంతోనే 1698 లో దేశీయ భాషలు నేర్చుకోవాలని పార్లమెంట్ చట్టం చేసింది. కనుక మత ప్రచారకులు 1705 నుండి తమ కార్యకలాపాలు పరిమితంగా సాగించారు. మత ప్రచారకులలో అగ్రగణ్యుడు అయిన విలియమ్ కేరీ 1793 లో కలకత్తాకు వచ్చాడు. అతని కృషి ఫలితంగానే సెరమ్ పూర్ మిషన్ విఖ్యాతి పొందింది. భారతదేశంలో మత ప్రచారాన్ని ప్రభుత్వ పరం చెయ్యాలనే ప్రయత్నాన్ని 1793 లో బ్రిటీష్ పార్లమెంట్ నిరాకరించింది. 1813 నాటికి దేశంలో క్రైస్తవ మత ప్రచారకులకు అధికారిక స్థానం కల్పిస్తూ బ్రిటీష్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది.

## 2.6.3. క్రైస్తవులు ప్రోత్సహించిన సంస్కరణలు :

క్రైస్తవ మిషనరీలు కొన్ని హిందూ ఆచారాలను అమానుషమైనవిగా భావించి వానిని తొలగించాలని పట్టుబట్టారు. ఇట్టి వానిలో సతీసహగమనం, అస్పృశ్యత చెప్పదగినవి. లార్డ్ విలియమ్ బెంటింక్ గవర్నర్ జనరల్ సతీసహగమనాన్ని నిషేధించటానికి భారతీయుల సహాయం కోరాడు. రాజా రామమోహన్ రాయ్ వంటి వారు నిషేధానికి అనుకూలించారు. సనాతన హిందువులు వ్యతిరేకించారు.

## 2.6.4. విద్యావ్యాప్తికి క్రైస్తవ మిషనరీల కృషి :

తమ, మత ప్రచారానికి అనువుగా క్రైస్తవ మిషనరీలు దేశ మంతటా విద్యాసంస్థలను ప్రారంభించింది. పాశ్చాత్య విద్యపట్ల గల మోజుతో భారతీయులు ఆ విద్యా సంస్థలలో చేరి చదవసాగారు. ఆ విధంగా దేశంలో విద్యా వ్యాప్తికి మిషనరీలు చేసిన సేవ గణనీయమైందనే చెప్పాలి. విద్యా సంస్థలలో మత బోధ చెయ్యటం పరిపాటి అయ్యింది. ఈ ధోరణి పట్ల హిందువులలో నిరసన వ్యక్తం అవుతూ ఉండేది. మతం అని సూటిగా అనకుండా నీతి పేరిట బైబిల్‌లోని విషయాలు బోధించటం మిషనరీల ఎత్తుగడగా మారింది.

## 2.6.5. మతం మార్పిడి :

విద్యాబోధన, పేదరికం క్రైస్తవ మత వ్యాప్తికి బాగా తొడ్పడింది. వైద్యం, ఆహారం అస్త్రాలుగా ఉపయోగించి మిషనరీలు మారుమూల ప్రదేశాల్లోని పేదల్ని ఆకట్టుకున్నారు. చాలా చోట్ల హరిజనులను అధికంగా మత మార్పిడి చేయగలిగారు. హిందువులలో ఆస్థి సంక్రమణ మొదలైన హక్కులు మతం మార్చుకున్న వారికి పోవని 1832 బెంగాల్ నిబంధన క్రింద ప్రభుత్వం వారు శాసించారు. మతం మార్చుకున్నప్పటికీ పౌర హక్కులు, ఆస్థి హక్కులు కోల్పోరని 1850 లో బ్రిటీష్ వారు శాసనం చేశారు. తమ మత విషయంలో బ్రిటీష్ పాలకులు జోక్యం కలిగించుకుంటున్నారని అంటూ సనాతనులు ఆందోళన చేస్తూనే వచ్చారు. దేవేంద్రనాథ ఠాగూర్ వంటి బ్రహ్మ సమాజకులు కూడా మతం మార్పిడిని వ్యతిరేకించారు. 1857 సిపాయిల తిరుగుబాటు అనంతరం విక్టోరియా రాణి చేసిన ప్రకటనలో క్రైస్తవ మతాన్ని బలవంతంగా రుద్దబోమని, హిందూ మత విషయాలలో జోక్యం చేసుకోబోమని హామీ ఇచ్చారు.

కాని అనతి కాలంలోనే బ్రిటీష్ మత విషయాలలో తటస్థంగా ఉంటామన్న తమ హామీని ఉల్లంఘించారు. బ్రిటీష్ ప్రభుత్వం బిషప్పులను నియమించటం ప్రారంభించింది. క్రైస్తవ మతంలోనికి హిందువులను మార్చటం కొనసాగించింది. బిషప్పులు ఇందులో ప్రముఖ పాత్ర వహించారు. ప్రభుత్వ అజమాయిషీ తమపై ఉండరాదని బిషప్పులు, క్రైస్తవ మతాధిపతులు పట్టుబట్టారు. క్రమేణ ప్రభుత్వపు పట్టు సడలటంతో క్రైస్తవ మత సంస్థలు తమ మనుగడ సాగించాయి. 1927లో క్రైస్తవ మతంపై బ్రిటీష్ ప్రభుత్వ పెత్తనం వదిలి వేసి ఇండియాలో కార్యకలాపాలకు స్వేచ్ఛ నిచ్చింది. మతాధిపతులు చట్టరీత్యా స్వతంత్రులైనప్పటికీ బ్రిటీష్ ప్రభుత్వంతో సన్నిహితంగానే

ఉంటూ వచ్చారు. ఏదో ఒక రూపేణ ప్రభుత్వం నుండి వారికి నిధులు లభించేవి. ఇంగ్లాండ్ చర్చికి ప్రభుత్వ ఆదరణ పుష్కలంగా ఉండేది. రోమన్ కాథలిక్ ప్రెస్బిటోరియన్ శాఖలకు ప్రభుత్వ ఆదరణ లేకపోయినప్పటికీ, వారికి విదేశీ సహాయం అందేది. 1909 లో బ్రిటీష్ పాలకులు ఇండియాలో క్రైస్తవులకు కూడా ప్రత్యేక ఓటు హక్కు ఇచ్చారు. దీని ప్రకారం క్రైస్తవులకు తమ మత పరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకొనే హక్కు వచ్చింది. ఆ విధంగా శాసనసభలలో మత ప్రాతినిధ్యం ఉండేది. బ్రిటీష్ పాలకులు సెక్యులర్ వ్యతిరేక ధోరణిలో మతాన్ని ప్రోత్సహించగా, క్రైస్తవులు ఆ ఆసరాతో మత వ్యాప్తికి కృషి చేశారు.

## 2.6.6. స్వాతంత్ర్యానంతరం :

ఇండియాలో స్వతంత్ర్యం రాగానే బ్రిటీష్ వారి క్రైస్తవ మత విధానానికి 1948 మార్చి 31 న స్వస్తి పలికారు. అంత వరకూ ఉన్న భారత క్రైస్తవ మత చట్టాన్ని రద్దు గావించారు. మతం మారితే విద్యా సంస్థలలో హరిజనులకు ఇచ్చే ప్రభుత్వ సౌకర్యాలు ఉండబోవని బొంబాయి ప్రభుత్వం శాసనం చేసింది. దీనిని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాయి. మత మార్పిడి చేస్తే హిందూ మతాచారాలు, భాష, వేషం అన్నీ మారిపోతాయని, మత మార్పిడిని చట్టరీత్యా ఆపాలని గాంధీ మహాత్ముడు అభిప్రాయపడ్డాడు. అయినా క్రైస్తవ మిషనరీలు 1953 లో నాగపూర్‌లో సమావేశమై మతపరం అయిన విషయాలన్నీ వ్యక్తుల స్వేచ్ఛకు వదిలి వేయాలన్నారు. వారు తమ మతంలోనికి పేదవారిని మార్చే పద్దతులను కొనసాగించారు.

స్వాతంత్ర్యం అనంతరం దేశంలో క్రైస్తవ మిషనరీలు విపరీతంగా పెరిగిపోయాయి. 1952 నాటికే 4683 వరకూ వచ్చాయి. ఇందులో విదేశీయులు చాలా ఎక్కువగానే ఉండేవారు. క్రమంగా వారి సంఖ్య తగ్గిపోయి దేశీయులు ఆ స్థానాలలోనికి వచ్చారు. 1952 నుండి క్రైస్తవ విదేశీ మిషనరీలకు వీసాలు ఇవ్వటం అదుపులో పెట్టారు. తీవ్రవాదులైన హిందూ సనాతనులు క్రైస్తవ వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతం చేశారు. క్రైస్తవులు తమ మత కార్యకలాపాల ద్వారా అస్సాం, నాగాలను, బీహార్ జార్కండ్‌లను, మధ్య ప్రదేశ్‌లో ఆదివాసులను మార్చివేస్తున్నారని హిందూ సంఘాలు ఫిరియాదు చేశాయి.

## 2.6.7. నియోగి సంఘ నివేదిక :

హిందూ మహాసభ వారి ఆందోళన ఫలితంగా క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలను పరిశీలించడానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1954 లో నియోగి సంఘాన్ని నియమించింది. డా॥ నియోగి నాగపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రిటైర్ అయినవారు. జార్జి అనే సిరియన్ క్రైస్తవునితో సహా ఈ సంఘంలో 6గురు సభ్యులు ఉన్నారు. ఈ సంఘం నివేదిక 1956 లో వెల్లడింపబడింది. నివేదికను బట్టి మత మార్పిడి దేశ ఐక్యతను విచ్ఛిన్న పరిచే ఉద్దేశ్యంతో జరుగుతున్నది. ముస్లిం లీగువలె క్రైస్తవులు కూడా ప్రత్యేక దేశాన్ని కోరవచ్చు. మత మార్పిడి చేస్తున్న మిషనరీలను ఉపసంహరించి, విదేశీయులను అదుపులో ఉంచాలి. మత ప్రచారాన్ని, మత ప్రచార స్వేచ్ఛను భారతీయులకే పరిమితం చేసేటట్లు రాజ్యాంగ సవరణ చేయాలి. పూర్తిగా తొలిగించే శాసనం కూడా మున్ముందు చెయ్యాలని నియోగి సంఘం కోరింది. ప్రభుత్వ అనుమతి లేకుండా క్రైస్తవ మత ప్రచార గ్రంధాలు పంచనివ్వరాదనీ, విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే పూర్తిగా అట్టి పెట్టాలనీ, మత సంస్థల జోక్యం ఉండరాదనీ కోరింది. నియోగి సంఘ సిఫారసులను క్రైస్తవులు వ్యతిరేకించారు.

## 2.6.8. రాజకీయాలలో మిషనరీలు :

కేరళ కమ్యూనిస్టు మద్దతుదారులైన క్రైస్తవులను వెలివేస్తామని బిషప్పులు బెదిరించారు. 1960 లో కమ్యూనిష్టులను బలపరచిన కేరళ కాథలిక్కులను ఆర్చ్ బిషప్ వెలివేశాడు. కాథలిక్ చర్చిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకుండా ఆపాలని కమ్యూనిష్టులు లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టారు. తమ ఆధ్మాత్మిక ధోరణికి వ్యతిరేకంగా ఉన్న రాజకీయ పార్టీలకు ఓటు వేయవద్దని చెప్పే హక్కు కేథలిక్‌లకు ఉందని హోం మంత్రి వాదించారు. ప్రార్థనా ప్రదేశాలు, యాత్రా స్థలాలు రాజకీయ ప్రచారానికి వినియోగించరాదన్న మరొక తీర్మానం కూడా వీగిపోయింది.

## 2.6.9. కాన్వెంట్ చదువులు :

ఇప్పటికీ క్రైస్తవులు విద్యారంగంలో తీవ్ర కృషిచేస్తున్నారు. వారి క్రమశిక్షణలో అన్ని తరగతుల వారిలోనూ సదాభిప్రాయం ఉంది. ప్రాథమిక స్థాయి నుండి కాన్వెంటు విద్యకు పిల్లలను పంపటం విలాసంగా మారింది. కాన్వెంట్ చదువు ప్రతిష్టాత్మకంగా మారింది. కేరళలో అక్షరాశ్యతలో అగ్రస్థానంలో ఉన్న క్రైస్తవులు నాగాలాండ్ వంటి కొండ ప్రాంతాల్లో తమ విద్యా విధానంతో జనాన్ని ఆకర్షిస్తున్నారు. అవసరమైనప్పుడు వారు హిందువుల ఆచార వ్యవహారాలతో రాజీపడి కట్టు బొట్టు పాటిస్తూనే మత ప్రచారం సాగిస్తున్నారు.

## 2.6.10. భారతీయ క్రైస్తవులపై హిందూ మత ప్రభావం :

భారతదేశంలో పాశ్చాత్యీకరణ, మానవ విలువలు, వ్యక్తి స్వేచ్ఛ వ్యాపించటానికి క్రైస్తవుల విద్య చాలా వరకు ఉపకరించింది. కానీ హిందూ సమాజంలో అనేక ఆచార వ్యవహారాల ప్రభావం భారతీయ క్రైస్తవులపై పడింది. కుల వ్యవస్థ, అస్పృశ్యత వారిలో కూడా ఉన్నాయి. కులాంతర వివాహాలు అరుదుగా జరుగుతున్నాయి. ఎన్నికలలో తమ కులం అభ్యర్థికి ఓట్లేయటం క్రైస్తవులలో కూడా ఉంది. సిద్ధాంత రీత్యా మతం మారిన వారికి కులం ఉండరాదు. ఆ దృష్టితోనే మతం మారిన హరిజనులను, హిందూ హరిజనులతో సమానంగా చూడటం లేదు. ఆందోళనల ఫలితంగా వీరిని ఇతర వెనుకబడిన తరగతులుగా పరిగణిస్తున్నారు.

## 2.6.11. నమూనా ప్రశ్నలు

1. భారతదేశంలో సాంఘిక మార్పులో క్రైస్తవ మిషనరీల పాత్రను వివరించండి ?

## 2.6.12. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


**ఆచార్య వై. కుమార స్వామి.**

ఖండిక - 3

పాఠం - 3.1

# బ్రిటీష్ వారి భూమి మరియు రెవెన్యూ సంస్కరణలు

### 3.1.0. లక్ష్యం :

రైత్వారీ విధానాలను, భూమిశిస్తు విధానాలను, అస్థవ్యవస్థమైన భూస్వామ్య పద్ధతులు, శాశ్వత శిస్తు విధానం, భూమిశిస్తు పద్ధతులు గురించి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయసూచిక :


3.1.1. ఉపోద్ఘాతము

3.1.2. రైత్వారీ విధానం

3.1.3. భూమి శిస్తు పద్ధతులు

3.1.4. భూమిశిస్తు విధానం

3.1.5. అస్థవ్యస్థమైన భూస్వామ్య పద్ధతి

3.1.6. శాశ్వత శిస్తు విధానం

3.1.7. సారాంశము

3.1.8. నమూనా ప్రశ్నలు

3.1.9. చదువదగిన గ్రంథాలు


### 3.1.1. ఉపోద్ఘాతము

భారతీయులకు వారి ప్రత్యేకమైన పరిపాలనా విధానము ఉన్నది. వారి పాలకుడ్ని భోపాలుడు, క్ష్మాపతి, భోపాలకుడనే పేర్లతో పిలుచుట చేత అతనికి భూమిపై పన్ను లేక శిస్తు (Tax) వసూలు చేసే అధికారము కలిగి ఉండేవాడు. భూమి పరిపాలనకు ప్రజల శ్రేయస్సుకు పనికి వచ్చే పనులు చేయడానికి ధనము చేకూర్చవల్సి వచ్చేది. ఆ ధనాన్ని కానుకల ద్వారా, సామంతులిచ్చే కప్పముల ద్వారానే కాక అశ్వమేధ యాగమనే ప్రక్రియ ద్వారా పొరుగు రాజులను ఎదుర్కొని వారితో ఒప్పందాల వల్ల వివాహాల వల్ల వారి భూమిని తీసుకొని తమ రాజ్యాన్ని విస్తరింపచేసేవారు. అట్టి భూములపై పన్ను వసూలు చేసే అధికారం యుద్ధములో గెలిచిన పాలకునికే ఉండేది. పాలకుడు కొంత మందికి శిస్తులు లేని దానాలు మినహాయింపులు ఇస్తూ దేవాలయాలకు దేవాదాయాలు, బ్రాహ్మణులకు అగ్రహారాలు, కళాకారులకు తోటలు పేటలు మొదలగు వాటిని ఏ పన్నులు చెల్లించకుండానే శాశ్వతంగా దానం చేసేవారు. అయితే పాలకుని ఆదాయము తగ్గకుండగా ప్రజల నుంచి అనేక విధములైన పన్నులు, రుసుములు, సుంకము, దండు సైనికుల ఖర్చు, రక్షక భట ఖర్చు, వృత్తి పన్ను మొదలగునవి విధించి వసూలు చేసేవారు. విజయనగర సామ్రాజ్య కాలం నాటికి పన్నులు మిన్నుముట్టినవి. బట్టలు శుభ్రం చేసే (ఉతికే) చాకలికి సైతం బండపన్ను, కల్లుతీసే వారికి నిచ్చెన పన్ను, ఇల్లు కట్టుకొన్న వారికి గడప పన్ను, ప్రసవిస్తే పురిటి పన్ను కూడా వసూలు చేసేవారు. విజయనగర

సామ్రాజ్యంలో ఎక్కువగా పన్ను వేశ్యల నుంచి 'లంజ పన్ను' అనే పేరుతో వసూలు చేసేవారు. మార్కెట్‌లో అమ్మే ప్రతి వస్తువుపైనా పన్నులు, సుంకాలు, సరిహద్దు పన్నులు విధిగా వసూలు చేసేవారు. వృత్తులపైనే కాక వస్తువుల పైనే కాక భోపాలుడు భూమిపై పన్ను వసూలు చేయుట చాలా ముఖ్యమైనదిగా ఉండేది. భూమి పన్నులో ఒక విధంగా భూమిగల వారికి భూమిని పాలించే వారికి ఉపయోగపడేది. తన పాలనలో ఎంత భూమి ఉన్నదీ రాజుకు తెలిసేది. తనకు ఎంత భూమి ఉన్నదీ రైతుకు తెలిసేది. భూసారాన్ని బట్టి, పండే పంటలను బట్టి రెండు రకాలుగా విభజించారు. నీటి సాగుతో పండే భూమిని ఖండ్రికలుగానూ, మెట్ట భూమిని నివర్తనాలుగానూ, తోట భూముల్ని గానూ కొలిచేవారు. భూమిశిస్తు ధన రూపంలోగాని, ధాన్య రూపంలోగాని పండిన వెంటనే రాజులకు ఇవ్వవల్సి ఉండేది. ప్రకృతి వైపరీత్యాల వల్ల అనావృష్టి వల్ల కరువులేర్పడినప్పుడు పాలకులు పన్నును మన్నించేవారు. ఈ విధానము శాస్త్ర సమ్మతమని రాజులు నమ్మి అమలు చేసేవారు. ఆంగ్లేయుల ఆగమనంతో క్రీ॥శ॥ 16వ శతాబ్దం నుండి భారతదేశంలో స్వదేశీ పాలనా ప్రభావము క్రమ క్రమంగా క్షీణింపసాగింది. మొఘలుల పాలనా కాలంలోనే వ్యవసాయము పన్నుల వసూలు భూ సంస్కరణలు, భూ విభజన మొదలగునవి జరిగినవి. మంచి నేల మామూలు నేల పనికిరాని (బంజరు) నేల మొ॥ వాటిగా విభజించి వాటిపై వసూలు చేసే పన్నులు నిర్ణయించారు. మొఘలాయి పాలన తర్వాత ఆంగ్లేయులు భారతదేశంలోనికి వ్యాపార నిమిత్తం వచ్చిన తొలిదశలో కీలకమైన ప్రదేశాల్ని, పట్టణాల్ని, ఓడరేవుల్ని, వ్యాపార కేంద్రాల్ని, తమ ఆధీనంలోనికి తెచ్చుకోగలిగారు. వారు క్రమ క్రమంగా బ్రిటీషు పాలకుల సలహా సహకారములతో భూమి శిస్తు నిర్ణయం వసూలు చేసే అధికారం భారత పాలకుల నుండి తెచ్చుకున్నారు. వీటి ఫలితమే కారన్ వాలీస్ కాలంలో బెంగాల్‌లో శాశ్వత శిస్తు నిర్ణయాన్ని ప్రతిపాదించి ప్రభుత్వ స్థిర ఆదాయానికి నాంది పలికాడు. జమిందారులు, సామంతులు, తాబేదారులు, దళారులు ప్రజల నుండి ముక్కు పిండి అధిక ధనాన్ని, పన్నుల పేరుతో వసూలు చేసేవారు. అయితే వారు వసూలు చేసిన ప్రభుత్వ ధనమంతా మొఘలు పాదుషాకు చేరేదికాదు. సామంతులు ధనవంతులై, బలవంతులై, సర్వ సౌఖ్యాలు అనుభవించారు. బ్రిటీష్ వారి ఆగమనంతో సామంతుల మోసాలు బైట పడ్డాయి. ప్రజలకు న్యాయము చేకూరింది. బ్రిటీష్ వారి జోక్యంతో భారతదేశంలో అనేక ఆర్థిక, రెవెన్యూ, సామాజిక, మత పరమైన సంస్కరణలు చోటు చేసుకున్నాయి. విద్య, వైద్య, రోడ్లు, రవాణా సౌకర్యములు మెరుగైనాయి. ప్రజలకు ఇంగ్లండ్ దగ్గర అయ్యింది. అనేక మంది భారతీయులు ఇంగ్లండ్ వెళ్ళి విద్యనభ్యసించడానికి భారతదేశంలో పాఠశాలలు, కాలేజీలు, విద్యా సంస్థలు నెలకొల్పడానికి అవకాశం కలిగింది. సమానత్వము స్వాతంత్ర్యము, సౌభ్రాతృత్వమనే పదాలను స్వదేశీయులు అర్థం చేసుకున్నారు. భూములకు పన్నులు విధించే నిమిత్తం పట్టాలు, అధికార పత్రాలు నిర్ణయించబడ్డాయి. అందువల్ల దూరాక్రమణ, అన్యాక్రాంతానికి, ఇతరుల అధికారానికి లోబడి ఉండే రైతులు భూమికి అధిపతులు కాగలిగారు. నదులకు ఆనకట్టలు కట్టి వృధాగా పోయే నీటిని అదుపు చేసి సాగునీటిగానూ, త్రాగునీటిగానూ ప్రజలకందించేందుకు కాలువలు త్రవ్వించారు. సరుకుల (వస్తువులు)ను చౌకగా రవాణా చేయుటకు వీలుగా కాలువలు, నదులపై పడవలు, బోట్లు, తెప్పలు మొదలుగు వాటిని వాడడానికి అనుమతి లైసెన్స్ ఇవ్వసాగారు. వ్యవసాయ రంగంలో పన్ను వసూలు చేసే నిమిత్తం రెవెన్యూ సంస్కరణలు చేపట్టుటతో పాటు జల సేద్యము వలన అధిక భూమిని నాగలి క్రిందకి (సాగులోకి) తేగలిగారు. దీని వల్ల పంట పండించే భూ విస్తీర్ణం పెరగడం, ప్రభుత్వానికి ఆదాయం పెరగడం పంటలు బాగా పండడం వల్ల దేశం సస్యశ్యామలమై కరువులకు దూరమై ప్రజలకు పాలకులకు సంతృప్తి నిచ్చింది. మధ్యవర్తులను తొలగించి కౌలు విధానాన్ని, రబీ ఖరీఫ్ పంటలకు వేరు వేరుగా నీటి (తీరువా) నిస్తు, భూమి శిస్తులను, మగతా, పాలు విధానాలను ప్రవేశపెట్టారు. ఈ రెవెన్యూ సంస్కరణల వల్ల ఇంతవరకూ రైతులకు నష్టం (హాని) కల్గించే పద్ధతులెన్నో సంస్కరించబడ్డాయి.

## 3.1.2. రైత్వారీ విధానం

కంపెనీ అధికారం దక్షిణ నైరుతి భారతదేశ ప్రాంతాలకు విస్తరించటంతో, కొత్త తరహా రెవెన్యూ సమస్యలు ఎదురయ్యాయి. ఈ ప్రాంతాలలో జమిందారులు పెద్దగాలేరు. దీనికి తోడు శాశ్వత శిస్తు నిర్ణయ విధాన కారణంగా, వ్యవసాయాభివృద్ధి వల్ల జరిగే హెచ్చు పన్ను వసూలులో ప్రభుత్వం పాలు పంచుకోలేక పోవడం కూడా, అధికారుల దృష్టికి వచ్చింది. ఫలితంగా మద్రాస్ ప్రెసిడెన్సీ అధికారులైన థామస్ మన్రో, రీడ్‌లాంటి వారు 1807లో రైతులనే భూ యజమానులుగా పరిగణించి, వారితోనే భూమి శిస్తు నిర్ణయం చేసుకోవాలనే ప్రతిపాదనను చేసారు. లండన్ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ దీనిని అంగీకరించారు. మద్రాస్ గవర్నర్ అయిన మన్రో ఈ రెవెన్యూ విధానాన్ని 1820లో అమలులోకి

తెచ్చాడు. రైతులు, ప్రభుత్వం మధ్య, జమిందారులు మధ్యవర్తి భూ స్వాములు లేకుండా, ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయి దీనికి రైత్వారీ విధానమనే పేరు సార్థకమైంది.

ఈ పద్ధతికి మూల పురుషుడు సర్ థామస్ మన్రో. ఇతడు 19 ఏండ్ల ఏయస్సులోనే, 1780లో మద్రాస్ వచ్చి హైదరాలీ టిప్పులతో యుద్ధాలు చేసినాడు. అటు తరువాత మహారాష్ట్ర యుద్ధాలలో కూడా పాల్గొని పేరు ప్రతిష్టలు పొందినాడు. ఇంగ్లండ్‌లోని పార్లమెంటు అతని ధైర్యాన్ని, చాకచక్యాన్ని, విజయాన్ని ఎంతో మెచ్చుకొంది. మన్రో గొప్ప యోధుడేకాక పరిపాలనాదక్షుడు కూడా అని చెప్పవలెను. కారన్ వాలీస్ ప్రభువు పేరు ఎట్లైతే శాశ్వత శిస్తు విధానంతో ముడిపడి ఈనాటికి చరిత్రలో మరువరాని పేరుగా నిలిచిపోయిందో అట్లే మన్రో పేరుకూడా రైతువారీ సిద్ధాంతంతో ముడిపడి, చరిత్రలో ప్రసిద్ధి కెక్కింది. ముఖ్యంగా మద్రాస్ అతనికి ఎంతో రుణపడి ఉంది. ప్రజల సంక్షేమం కోసం పాటుపడి తన జీవితాన్నంతా ధారపోసిన కొద్దిమంది కంపెనీ ఉద్యోగస్థులతో మన్రో ఒకడు. మూడవ మైసూరు యుద్ధంలో టిప్పు ఓడిపోయి శ్రీరంగపట్నం వద్ద ఆంగ్లేయులతో చేరి సంధి చేసుకొన్నాడు. ఆ సందర్భంలో వారికి లభించిన ప్రాంతాలలో బారామహల్ జిల్లా ఒకటి. దీనిని కెప్టెన్ రీడ్ కాక ముగ్గురు సైనికోద్యోగులు పరిపాలించేటట్లు కారన్‌వాలీస్ ఏర్పాటు చేసినాడు. వారికి అక్కడి ప్రజల అలవాట్లు, భాషలు తెలుసు. థామస్ మన్రో కూడా రీడ్ అధ్వర్యంలో బారా మహల్‌లో పని చేయడానికి కారన్ వాలీస్ పంపినాడు. అక్కడే ప్రథమంగా అతను రైతువారీ పద్ధతి అమలులో పెట్టినాడు. ఈ పద్ధతి ప్రకారం రైతు తాను సాగుచేస్తున్న భూమికి ఆస్థిదారుడుగా ఉంటాడు. అతనికి ప్రభుత్వానికి మధ్య జమీందార్ల వంటి మధ్యవర్తులు ఉండరు. ప్రభుత్యోగులయిన కలెక్టరు, తాసీల్దారు మొదలైనవారు రైతుల వద్ద నుండి ప్రత్యక్షంగా పన్నులు వసూలు చేస్తారు. రైతులు దున్నే భూమిని కొలిచి అందులో ఎంత పంట పండుతుందో అంచనావేసి, దాని ఆధారంతో రైతు ప్రభుత్వానికి ఎంత శిస్తు కట్టవలెనో నిర్ణయించడం రైతు వారీ పద్ధతిలో మొదటిమెట్టు. ప్రతి 30 సంవత్సరాలకు ఒక పర్యాయం రైతు చెల్లించవలసిన శిస్తు మారుతూ ఉంటుంది. అతడు ఎక్కువ పండించి ఎక్కువ లాభాలు పొందినపుడు ప్రభుత్వానికి కూడా అందులో వాటా ఉండవలెననే అంశం చేర్చడం జరిగింది. ఆ మధ్య కాలంలో రైతును భూమి నుంచి తొలగించడం కాని అతని వద్ద నుంచి ఎక్కువ శిస్తు వసూలు చేయడం కానీ జరుగదు. పంటలో ఖర్చులు పోగా సగానికి మించకుండా అతడు శిస్తు రూపంలో ప్రభుత్వానికి చెల్లించవలె. కొన్ని సందర్భాలలో ఒక్కొక్క రైతు నుంచీ భూమిశిస్తు వసూలు చేయడానికి బదులుగా సమిష్టిగా గ్రామమంతటి నుంచి ఎంత శిస్తు వసూలు చేయవలసింది నిర్ణయించి గ్రామ పెద్ద నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేసే పద్ధతి కూడా అమలు చేసినాడు. ఇందులో కూడా రైతు తాను సాగుబడి చేసే భూమిపై హక్కుదారుగా ఉండేవాడు. సర్‌థామస్ మన్రో ఈ పద్ధతిని దత్త మండలంలో పూర్తిగా అమలు చేయడమే కాక, 1814-19లో మద్రాసు గవర్నరుగా ఉన్నప్పుడు అనేక ప్రాంతాలలో ఈ రైతువారీ పద్ధతిని కొన్ని మార్పులతో అమలులో పెట్టినాడు.

రైతువారీ విధానంలోని కొన్ని సుగుణాలు ఏమంటే, ఈ విధానంలో జమిందారుల వంటి మధ్యవర్తులు ఉండరు. రైతులు శిస్తులు చెల్లించేటపుడు ఆదాయంలో ఒక భాగం జమిందార్ల వంటి మధ్యవర్తులకు పోకుండా పూర్తిగా ప్రభుత్వానికే సంక్రమిస్తుంది. పంటలు ఎక్కువగా పండి, వాటి ధరలు ఎక్కువై, రైతులు అధిక లాభాలు పొందితే వారు ప్రభుత్వానికి చెల్లించవలసిన ఈ అదనపు శిస్తు ధనం అంతా / ప్రభుత్వానికే దక్కేది. కాబట్టి ఈ విధానం ప్రభుత్వానికి లాభదాయకం. ప్రజలకు, ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం ఏర్పడటం వల్ల ప్రజల స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ప్రభుత్వానికి వీలువుతుంది. పరిస్థితులు సరిగా లేనట్లయితే వాటిని సకాలంలో సరిదిద్దడానికి ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. కలెక్టర్లు, ఇతర ఉద్యోగులు తమ గ్రామాలలో పర్యటించడం వల్ల ప్రభుత్వం పట్ల ప్రజల వైఖరి ఎట్లుందో కూడా తెలుసుకోవడానికి ఈ విధానం ఎంతో అనుకూలమైన సాధనము. 10, 12 మంది జమీందార్ల వద్ద నుంచి శిస్తు వసూలు చేయడం కన్నా 60వేల మంది రైతుల వద్ద నుంచి శిస్తు వసూలు చేయడం సులభమే కాక, బకాయి పడకుండా శిస్తు అంతా వసూలు అయ్యే అవకాశం ఉందని మన్రో బారామహలులో తన అనుభవం విశదపరచినాడు. ఈ పద్ధతి అమలులోకి రాగానే ఆ సంవత్సరం ప్రభుత్వ ఆదాయం 1,65,000 రూపాయలు దాటింది. ప్రతి రైతు తాను కట్టవలసిన శిస్తు పూర్తిగా కట్టినాడని చెప్పినాడు. అందుకే ఈ విధానాన్ని ప్రశంసిస్తూ, దీనిని మిగతా ప్రాంతాలలో కూడా ప్రవేశపెట్టవలెనని సలహా ఇచ్చినాడు. శిస్తు కూడా 45 శాతం కాకుండా 25 శాతానికి తగ్గించమని చెప్పినాడు. ఆ విధానం బారామహల్‌లోనే కాక దత్త మండలం మొత్తంలో ఎట్లా అమలులో పెట్టవలెనో వివరంగా సూచించాడు.

1. రైతువారీ పద్ధతి ప్రవేశపెట్టవలెను.
2. ఏటేటా ఎంత భూమి సాగుబడిలోకి వచ్చిందో చూసి దానిపైన శిస్తు ఎక్కువ తక్కువలు చేయవలెను.
3. భూమిని కొలిచిన తరువాత దానిపై విధించవలసిన శిస్తులో 25 శాతం తగ్గించవలెను.
4. ప్రజలే బావులు, కాలువలు త్రవ్వుకొని, వాటిని మరమ్మత్తు చేసుకొంటూ వాటికి అయ్యే ఖర్చులు వారే భరించేటట్లైతే వారు కట్టవలసిన శిస్తులో 3 శాతం నుంచి 33 1/3 శాతం వరకు తగ్గించవచ్చు.
5. ప్రతి రైతు ప్రతి సంవత్సరం ఆఖరున తాను సాగుబడి చేసే భూమిని ఎక్కువ తక్కువలు చేయడానికి స్వతంత్ర్యం ఉన్నా, మంచి భూమి బీడు భూమి తనకు కావలసినట్లుగా ఎన్నుకోవడానికి వీలు లేదు.
6. సాధారణంగా ప్రమాదాలు జరిగినాయనీ, పంటలు పండలేదనీ శిస్తులు తగ్గించమని కోరితే తగ్గించకూడదు. ఒక వేళ అటువంటి పరిస్థితులలో ఏ రైతైనా శిస్తు కట్టలేకపోతే గ్రామంలోని ఇతర రైతులు 10 శాతానికి మించకుండా తాము కట్టవలసిన శిస్తు కంటే హెచ్చుగా చెల్లించి, ఆలోటును భర్తీ చేయవలెను.
7. ప్రతి రైతు శిస్తు ఏటేటా సక్రమంగా కట్టినంతకాలం తన భూమికి తానే హక్కుదారు. అంతేకాక ఆ భూమిని కౌలుకు ఇవ్వడానికి, అమ్మడానికి కూడా హక్కు ఉంటుంది.
8. రైతుల ఆధీనంలో లేని భూములన్నీ ప్రభుత్వ భూములుగా పరిగణించడం జరుగుతుంది. ఎప్పుడైనా ఆ భూములను ఎవరైనా ఉపయోగిస్తే, దానికి రుసుములు ప్రభుత్వానికి చెల్లించవలెను.
9. ఏట్‌లు, కరణం మిగతా గ్రామాధికారులు కలెక్టరు క్రింద పనిచేయవలెను.

ఈ విధంగా ఇంకా కొన్ని నిబంధనలతో రైతు వారీ పద్ధతి ఒక క్రమంలో ఎట్లు ప్రవేశపెట్టవలెనో మన్రో సూచించాడు. దానిని బట్టి ఈ పద్ధతి ప్రభుత్వానికి ఎంతో ఉపయోగమని తెలియగలదు.

రైతువారీ పద్ధతిలో అనేక లోపాలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ పద్ధతివల్ల మొదట రైతులు నష్టపడినారు. రైతులకు ఆస్థి హక్కు ఒక లాభం కాక ఒక బంధంగా ఏర్పడి దారిద్ర్యానికి దారి తీసింది. ఆ రోజులలో గ్రామాల్లో జనసంఖ్య చాలా తక్కువగా ఉండేది. బీడు పొలాలు చాలా ఎక్కువ. రైతు తనకు తన కుటుంబానికి ఎంత పొలం అవసరమో అంత పొలమే సాగు చేసేవాడు. పంటలు ఒక్క కుటుంబ పోషణ కోసం మాత్రమే పండించేవాడు. ఎక్కువగా పంటలు పండిచవలెననిగాని అధిక లాభాలు సంపాదించవలెనని గాని వారికి ఉండేది కాదు. వారు అంతటితో తృప్తి పొందేవారు. వారికేమి కావలెనో వారు సులభంగా తెలుసుకొనేవారు. వారు ఎప్పుడూ ఆ భూములకు స్వంతదారులే. అనాదిగా మన దేశంలో వస్తున్న సాంప్రదాయమే ఇది. మన్రో ప్రవేశపెట్టిన విధానం కనిపించినంత సులభమైంది కాదు. ప్రజలు ఎన్నో కట్టుబాట్లకు లోబడి ఉండవలసి వచ్చింది. మొదట్లో భూముల సర్వే సమంగా జరుగలేదు. అందువల్ల భూములపై విధించిన శిస్తు అనేక సందర్భాలలో ఎక్కువగా ఉండేది. అందుచేత చాలా మంది రైతులు శిస్తులు కట్టలేకపోయారు. ఒక్కొక్కసారి వానలు లేక, వరదలు వల్ల, పంటలు నష్ట పడినప్పుడు కూడా వారు శిస్తులు కట్టడానికి ఇబ్బంది పడేవారు. అటువంటి పరిస్థితులలో వారు శిస్తులు రద్దు కాకపోవడం వారిని చాలా బాధ పెట్టింది. మన దేశంలో ఇటువంటి పరిస్థితులలో రాజులు రైతులకు ఎంతో సహాయం చేసేవారు. పన్నులు రద్దు చేసేవారు, అప్పులిచ్చేవారు, విత్తనాలు సరఫరా చేసేవారు. కానీ ఆంగ్లేయుల కాలంలో శిస్తులు కట్టకపోతే వారి భూములను వేలం వేయడం జరిగేది. అంటే వారు తమ భూములను పోగొట్టుకొనేవారు. పరిస్థితులు మెరుగుపడి, తరువాత భూములను సాగుచేసుకోవడానికి కొత్త భూములన్నీ ప్రభుత్వ స్వాధీనంలో ఉండేవి. కనుక బీడు భూములను సాగుచేసుకోవడానికి కూడా వారికి వీలులేకపోయినది. చివరకు వారు తమ వ్యవసాయ వృత్తినే కోల్పోవలసి వచ్చింది. కొంత మంది రైతులు ఈ పరిణామాలకు భయపడి, సాహుకార్లకు తమ భూములను తాకట్టుపెట్టి, అప్పులు తెచ్చి శిస్తుకట్టేవారు. కాని సాహుకార్లకు వారు చెల్లించవలసిన వడ్డీ, ఎక్కువగా ఉండేది. షరతు ప్రకారం వడ్డీ, అసలూ చెల్లించలేక భూములు పోగొట్టుకొనే వారు. వారి పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిగా తయారయింది. సాహుకార్లు

కోర్టులకు వెళ్ళి రైతుల మీద డిక్రీలు తెచ్చుకొనేవారు. న్యాయస్థానాలు కూడా ఎంత సేపూ చట్టాలననుసరించి తీర్పు చెబుతాయి. మన దేశంలో గ్రామ ప్రజలు నోటిమాట పైన నమ్మకం ఉంచే వ్యవహారాలు జరుపుకొనేవారు. ఆంగ్ల ప్రభుత్వంలో ఇటువంటి నమ్మకాలకు తావులేదు. ఈ విధంగా రైతు వారీ పద్ధతి వల్ల రైతులు నష్టపోయారు.

రైతువారీ పద్ధతిలోనే గాక ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన అన్ని రకాల భూమి శిస్తు విధానాలలోను మరో గొప్ప లోపం ఉండేది. పూర్వపు రోజులలో పన్నులు పంటల రూపంలో చెల్లించేవారు. వారికి పంటల ధరలతో సంబంధం ఉండేదికాదు. పంటలో మూడో వంతు, నాలుగో వంతు ప్రభుత్వం విధించిన రేటు ప్రకారం శిస్తు కట్టేవారు. ఇంగ్లండులో ఇటువంటి పద్ధతిలేదు. పంటలు అమ్మి ధన రూపంలో శిస్తు చెల్లించడం ఆ దేశంలో అలవాటు. అదే పద్ధతి ఈ దేశంలో ప్రవేశపెట్టడం జరిగింది. పంటల ధరలు ఒక సంవత్సరం బాగా పడిపోతే వారు శిస్తు కోసం చాలా పంటలు అమ్ముకోవాలసివచ్చేది. అటువంటప్పుడు కుటుంబ పోషణ దుర్భరమై రుణ బాధ ఎక్కువయ్యేది. రైతువారీ పద్ధతి మంచి పద్ధతి అయినా, అమలు పరచడంలో పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవడానికి వీలు కలగడం లేదు.

రైతులు శిస్తు చెల్లించని పక్షంలో వాటిని వసూలు చేసేటప్పుడు ప్రభుత్వోద్యోగులు ఎటువంటి అమానుష చర్యలకు ఒడిగట్టేవారో అనేక మంది కలెక్టర్లు తమ నివేదికలో తెలిపినారు. మన్రో అధికారంలో ఉన్నంతవరకు స్వయంగా అతడు అన్ని విషయాలు తెలుసుకోవడం వల్ల పరిస్థితులు అంత అన్యాయంగా లేకపోయినా, అతడు వెళ్ళిపోయిన తరువాత 30 సంవత్సరాల పర్యంతం ప్రజలు పడిన దురవస్థలు ఇంతంత కాదు. ఒక నివేదికలో ఇట్లా ఉంది.

ఎవడైనా రైతు శిస్తు బకాయి ఉంటే, అతనికి గనుక పెళ్ళి కావలసిన కూతురు ఉన్న పక్షంలో, ఎక్కువ కన్యాశుల్కం ఇవ్వడానికి తయారుగా ఉన్న ఒక తక్కువ కులంవాడికి ఆమెను ఇచ్చి వివాహం చేయమంటూ అధికారులు అతనిని బలవంతం చేసి, ఆ శుల్కం ద్వారా తమ శిస్తు వసూలు చేసుకొనేవారు. ఒక్కొక్కప్పుడు వారు రైతుల ఇళ్ళల్లో చొరబడి వంట పాత్రలను రాట్నాలను తీసుకొని పోయేవారు. బకాయిదారును గంటల కొద్ది ఎండలో నిలబెట్టేవారు. అన్నం తిననివ్వక మల మూత్రాదుల విసర్జనకయినా బయటికి పోకుండా నిర్బంధించేవారు. పశువులకు మేత వేసుకోనిచ్చేవారు కాదు. మనిషిని నడుము వంచి తాళ్ళతో వేలాడదీసేవారు. కొరడాలతో కొట్టేవారు. చేతి వేళ్ళు నుంచి మెలివేసేవారు. అతని జుత్తుకు గాడిద తోకకో ఎద్దు తోకకో కట్టి ఊరేగించేవారు. ఇటువంటి క్రూరమైన చర్యలు ఎన్ని తీసుకొనేవారో చెప్పడానికి వీలులేదు. ప్రజా సంక్షేమం కోసం మన్రో రైతువారీ పద్ధతి అమలులోకి తెచ్చినా, అందులో లోపాలు ఉన్నందున ఈ పద్ధతి కూడా ప్రజలకు ఉపయోగపడలేదు. 1857- 58 సంవత్సరాలలో జరిగిన గొప్ప తిరుగుబాటుకు ఇది కూడా ఒక కారణము.

### 3.1.3. భూమిశిస్తు పద్ధతులు :

భూస్వామ్య పద్ధతులు సక్రమంగా ఉంటేనే అధికోత్పత్తి అధిక సామర్థ్యం పెంపొందుతుంది. ఆర్థిక సాంఘిక న్యాయం చేకూర్చగల వ్యవసాయ వ్యవస్థ ఏర్పడుతుంది. భూస్వామ్య పద్ధతులు భూమి యజమానులకు లేదా సేద్యం చేసే వారికి మధ్య శిస్తు చెల్లించే విషయంలో ఉండే సంబంధాన్ని తెలియచేస్తాయి. వారి హక్కులను బాధ్యతలను వ్యక్త పరుస్తాయి. ప్రభుత్వమే సర్వాధికారాలున్న భూస్వామి అనీ, వ్యవసాయపు భూములన్నీ ప్రభుత్వానికి చెందినవే అనేది సర్వత్రా ఆమోదించిన సిద్ధాంతం. అయితే సేద్యం చేసేటందుకుగాను వ్యక్తులు ఆ భూములను ప్రభుత్వం నుండి పొందుతారు. భూమి పొందిన వ్యక్తులు చెల్లించవలసిన శిస్తును ప్రభుత్వం నిర్ణయిస్తుంది. అట్లాగే వారి హక్కులను బాధ్యతలను వివరిస్తుంది. భారతదేశం స్వాతంత్ర్యం పొందేనాటికి అమలులో ఉన్న భూస్వామ్య పద్ధతులు అధికోత్పత్తి, అధిక సామర్ధ్యాలను పెంపొందించేవిగా లేకపోవడమే గాక, వ్యవసాయరంగంలోని బలహీన వర్గాలకు సాంఘిక, ఆర్థిక న్యాయం చేకూర్చేవిగా కూడా లేవు. ఆ విషయం అవగాహన చేసుకోనడానికి దేశంలోని భూస్వామ్య పద్ధతులను వాటి లోపాలను గురించి తెలుసుకోవడం అవసరం.

బ్రిటీషు పాలనకు పూర్వం గ్రామంలోని భూములన్నింటిపైనా గ్రామస్తులందరికీ సాముదాయకంగా ఆస్తిహక్కు ఉండేది. సాధారణంగా ప్రతి గ్రామంలో బీడు పొలాలు ఎక్కువగా ఉండేవి. జన సంఖ్య కూడా స్వల్పంగా ఉండేది. ఆస్థి హక్కులతో ప్రమేయం లేకుండా ప్రతి

రైతుకూ ఎంత పొలం అవసరమో అంత పొలం లభించేది. పంటలను వ్యాపార సరళిలో అమ్మిలాభాలు గడించే అవకాశం ఉండేది కాదు. అందువల్ల ఎక్కువ భూములపై ఆస్థి హక్కును సంపాదించడాన్ని ఎవరూ కోరేవారు కారు. గ్రామ పెద్దలు భూములను వ్యవసాయార్థమై రైతుల మధ్య పంపకం చేయడం, జలాధారాలను వ్యవసాయానికి కావలసిన వనరులను నిర్మాణం చేసి వాటిని తగిన స్థితిలో ఉంచడం సంప్రదాయంగా ఉండేది. చేతివృత్తులవారు తాము తయారు చేసిన వస్తు సామ్రాగిని రైతులకు అందజేసి వాటికి బదులుగా రైతుల నుండి ధాన్యాదులను గ్రహించి తమ జీవితాన్ని సాగించేవారు. ఈ విధంగా గ్రామం స్వయం సమృద్ధమై స్వయం పోషకమై ఉండేది.

ఆంగ్ల పాలనలో వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టిన మార్పుల్లో భూమిపై వ్యక్తులకు ఆస్థి హక్కు కల్పించడం అనేది ప్రధానమైనది. బ్రిటిషువారు తమ దేశంలో భూమిపై వ్యక్తులకు ఆస్థి హక్కు ఉండవలెననే విధానానికి అలవాటుపడిన వారు కావడం చేత వానిని భారతదేశంలో కూడా ప్రవేశపెట్టారు. శాశ్వత శిస్తు విధానం ద్వారా బెంగాల్, బీహార్, ఒరిస్సా, ఉత్తర సర్కారుల్లో వందలాది గ్రామాలలో భూములపై జమీందార్లకు ఆస్థి హక్కును కల్పించారు. ఉత్తర ప్రదేశ్‌లో, పంజాబ్‌లో మహల్వారీ విధానాన్ని, తాలూక్‌దారీ విధానాన్ని, మధ్య పరగణాలో మాల్ గుజారీ విధనాన్ని మద్రాస్, బొంబాయి రాష్ట్రాలలో రైత్వారీ శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టి వారు సాగుచేసే భూములపై ఆస్థి హక్కు వ్యక్తులదేనని గ్రామ సముదాయానిది కాదని నిశ్చయింపబడింది. దీని ఫలితంగా వ్యక్తి జీవితానికి ప్రాధాన్యం, సమిష్టి జీవితానికి గొప్ప నష్టమూ సంభవించాయి. గ్రామీణ వ్యవస్థకు పెద్ద దెబ్బ తగిలింది.

## 3.1.4. భూమిశిస్తు విధానాలు :

అనాదిగా భారతదేశంలో అధిక సంఖ్యాకులకు వ్యవసాయమే ముఖ్యవృత్తిగా ఉండేది. అందువల్ల రాజులు, నవాబులు కూడా భూమిశిస్తు ద్వారానే ఎక్కువ ఆదాయం సంపాదిస్తూ ఉండేవారు. కాని భూమిశిస్తు వసూలు చేసే విషయంలో అన్ని ప్రాంతాల్లో ఒకే పద్ధతి ఉండేదికాదు. బ్రిటీష్ వారు భారతదేశంలో తమ పరిపాలనను సుస్థిరం చేసుకొనడానికి దేశం నుండి ఎక్కువ ధనాన్ని సంపాదించడానికి భూమిశిస్తు వసూలు విధానంలో గొప్ప మార్పులు చేసారు. ఈ మార్పుల మూలంగా ధనికులు కొందరు బాగుపడినప్పటికి రైతులు ఎన్నో కష్ట నష్టాలను అనుభవించవలసి వచ్చింది. ఆంగ్లేయులు వివిధ ప్రాంతాలలో వివిధ భూమిశిస్తు విధానాలు అవలంభించారు. వానిలో శాశ్వత శిస్తు విధానాము, మహల్వారీ విధానము, రైతువారీ విధానము ముఖ్యంగా పేర్కొనదగినది.

**ఎ) శాశ్వత శిస్తు విధానము (జమిందారీ పద్ధతి) :** ఈ విధానం బెంగాల్, బీహార్, ఒరిస్సా, ఉత్తర సర్కార్లలో 1793లో కారన్ వాలీస్ చేత ప్రవేశపెట్టబడింది. జమీందార్లకు ఆస్థి హక్కు లభించింది. ఈ ప్రాంతాల్లో ఇంగ్లీషు పాలనకు పూర్వం కూడా జమీందార్లు ఉండేవారు. కాని వీరు శిస్తును వసూలు చేసే అధికారులు మాత్రమే. వారి జమీందారీలోని భూములపై వారికెలాంటి హక్కులేదు. 1765 లో మొగల్ పాదుషా నుండి కంపెనీ వారు దివానీ హక్కును అనగా పన్ను వసూలు చేసే హక్కును సంపాదించారు. 1772లో వారన్ హేస్టింగ్స్ భూమిశిస్తు వసూలు చేసే అధికారాన్ని ఏటేట వేలం వేయడం ప్రారంభించాడు. ఎక్కువ మొత్తాలను పాడిన వారు కొందరు క్రొత్తగా జమీందార్లు అయ్యారు. దీని వల్ల పాత జమిందార్లు తమ పదువులు కోల్పోవడమేకాక అధిక శిస్తు వల్ల రైతుల స్థితి కూడా దిగజారిపోయింది. ప్రభుత్వానికి కూడా అనుకొన్నంత లాభం రాలేదు.

వేలం పాట పద్ధతి లాభించకపోవడం గమనించిన కారన్‌వాలీస్ ఆదాయంలో ఏటేటా మార్పులు జరగడం కంటే కొంచెం తక్కువైనా ఏదో ఒక నిర్ణీతమైన మొత్తం లభించడం పరిపాలనా సౌష్టవానికి అవసరమని భావించాడు. అందుచేత అతడు వేలం పద్ధతిని రద్దు చేసి ఏటేటా జమిందారు ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తాన్ని శాశ్వత పరిచాడు. అందుచేతనే అతడు ప్రవేశపెట్టిన జమిందారీ పద్ధతికి శాశ్వత శిస్తు విధానం అని పేరు వచ్చింది. అంతకు పూర్వం వేలంపాటలో పాల్గొని 1793 నాటికి ఎవరు జమిందార్లుగా గుర్తించబడ్డారో వారు శాశ్వత శిస్తు విధానం ప్రకారం ప్రభుత్వంతో ఖరారు చేసుకొన్నారు. వీరిలో చాలా కాలం నుండి జమిందార్లుగా ఉన్నవారు, కొత్తగా జమిందార్లు అయినా వారు కూడా ఉన్నారు. ఈ ఖరారు ప్రకారం ఇది వరకు జమిందారులకు లేని క్రొత్త హక్కు వీరికి లభించింది. వీరి జమీందారీలలోని భూములపై వీరికి శాశ్వతమైన ఆస్తి హక్కు ఈ క్రొత్త హక్కు.

ఈ విధానం వల్ల జమీందార్లు రైతులను పీడించి ఎక్కువ శిస్తులను వసూలు చేశారే తప్ప వ్యవసాయాభివృద్ధికి పాటు పడలేదు. అందువల్ల వ్యవసాయం నానాటికి దిగజారిపోయింది. రైతు జమిందారు విధించిన మక్తాను చెల్లించే పాలికాపుగా మారాడు. చెల్లించని పక్షంలో అతన్ని భూమి నుండి తొలగించే హక్కు జమిందారునకు క్రొత్తగా లభించింది. జమిందారు కూడా రైతులకు శాశ్వతమైన పట్టాలను ఇవ్వవలసిందిగా కారన్‌వాలీస్ అభిప్రాయ పడ్డాడేగాని అందుకు కావలసిన చట్టాన్ని చేయలేదు. పట్టాలు ఇవ్వలేదని న్యాయస్థానములో జమిందారుపై కేసు పెట్టే హక్కు రైతుకు ఉన్నప్పటికి అట్టి హక్కును వినియోగించుకొనే స్థోమత రైతుకు లేకపోయింది. 1850 తరువాత గాని రైతులకు రక్షణ కలిగించే చట్ట నిర్మాణం కాలేదు. తొలిదశలో జమిందార్లు కూడా బాగు పడలేదు. ఆంగ్లేయులు నిర్ణయించిన శాశ్వత శిస్తును జమిందార్లలో అనేకులు చెల్లించలేక పోయారు. సకాలంలో శిస్తు చెల్లించని జమిందారు భూములను వేలం వేసి బ్రిటిష్ అధికారులు శిస్తులు వసూలు చేసేవారు. కొన్ని ప్రాంతాలలో ఈ పద్ధతి జామిందార్ల తిరుగుబాటుకు కూడా దారి తీసింది. జమిందారీ పద్ధతి రైతుకు ప్రభుత్వానికి మధ్య అడ్డుగోడగా నిలిచింది. జమిందార్లు ప్రభుత్వానికి చెల్లించవలసిన శిస్తు పరిమాణం మాత్రం ఏటేటా పెరుగుతూ ఉండేది. ప్రభుత్వాదాయంలో ఎదుగూ, బొదుగూ లేకపోయినా రైతుల మీద భారం ఎన్నో రెట్లు పెరిగింది. రాజస్థాన్, మధ్య భారత్, సౌరాష్ట్ర, హైదరాబాద్ మున్నగు ప్రాంతాలలో జమిందారీ పద్ధతిని పోలిన భూస్వామ్య పద్ధతులు ఉండేవి. వీటిని జాగీర్దారీ పద్ధతి అనేవారు. హైదరాబాదు, రాజస్థాన్ ప్రాంతాలలో జాగార్థార్లకు రైతుల నుండి శిస్తును వసూలు చేసే హక్కు మాత్రమే ఉండేది. వారికి భూమి మీద యాజమాన్యపు హక్కుగాని, వారి క్రింద ఉన్న భూములను సేద్యం చేసే హక్కుగానీ లేదు. మధ్య ప్రదేశ్, అయోధ్య, ఆగ్రా ప్రాంతాలలో ప్రభుత్వం మాల్ గుబార్లు అనే వారిని భూస్వాములుగా అంగీకరించినా వారు చెల్లించవలసిన శిస్తు పరిమాణాన్ని శాశ్వతంగా నిర్ణయించలేదు.

**బి) రైతువారీ పద్ధతి :** భారతదేశంలో అత్యంత ప్రాముఖ్యం వహించిన ఈ పద్ధతి మద్రాస్, బొంబాయి, బీహారు, అస్సాము మొదలైన బ్రిటిష్ రాష్ట్రాలలో అమలు జరుపబడింది. దేశంలోని భూమి ప్రభుత్వానికి చెందినదే అయినా ప్రభుత్వము నుండి భూమిపై ఆస్తి హక్కును పొందిన ప్రతి రైతు దానిని అనుభవించవచ్చు, అమ్మవచ్చు, తమ వారికి సంక్రమింపజేయవచ్చు. అతడు భూమి శిస్తును సూటిగా ప్రభుత్వానికే చెల్లిస్తాడు. శిస్తు చెల్లించినంత కాలం భూమి అతనిదై ఉంటుంది. వాస్తవానికి అతడే భూమికి యజమాని అనవచ్చు. అతనికి ప్రభుత్వానికి నడుమ మధ్యవర్తులెవరూ ఉండరు. రైతు వారీ పద్ధతిలో భూమిశిస్తు 30 సంవత్సరాలకొకసారి నిర్ణయించడం జరుగుతుంది. శిస్తు నిర్ణయించే సందర్భంలో భూసారం, ఎకరా ఉత్పత్తి, ఉత్పత్తి సగటు విలువ, ఉత్పత్తి వ్యయము మున్నగు అంశాలను ప్రభుత్వం లెక్కలోకి తీసుకుంటుంది. ఆలస్యంగానైనా శిస్తు పరిమాణాన్ని మార్చడానికి ఈ పద్ధతికి అవకాశం ఉంది. శిస్తు పరిమాణం సాధారణంగా భూమి నుండి లభించే నికరాదాయంలో సగం లోపల ఉంటుంది. ప్రభుత్వానికి రైతులకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉండడం రైత్వారీ పద్ధతిలోని సుగుణం. దీని వల్ల వ్యవసాయాభివృద్ధి కోసం చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుంది. అతివృష్టి, అనావృష్టి ఫలితంగా పంటలు పండనప్పుడు ప్రభుత్వం శిస్తును తగ్గిస్తుంది. తొలిదశలో ప్రభుత్వం విధించిన అమిత శిస్తులను చెల్లించలేక రైతులు మాతనలను చాలించారు. రైతులు అప్పుజేసి ప్రభుత్వానికి శిస్తులు చెల్లించవలసి వచ్చింది. ఈ విధంగా వారు ఋణ గ్రస్తులుగా మారి దరిద్రులైనారు. పన్నులు వసూలు చేయడంలో ప్రభుత్యోద్యోగులు అమానుష చర్యలకు పాల్పడేవారు. ఈ పద్ధతిలో కూడా రైతులు తమ భూములను కౌలుకు ఇవ్వడం మూలంగా భూస్వాములకు, కౌలుదార్లకు సంఘర్షణ ఏర్పడసాగింది.

**సి) మహల్వారీ పద్ధతి :** ఈ పద్ధతిలో ఒక గ్రామంలోని భూమి అంతా గ్రామస్థులందరికీ చెందిన ఆస్థిగా పరిగణించి మొత్తం భూమిమీద ప్రభుత్వం శిస్తు విధించేది. శిస్తు చెల్లించే బాధ్యతను గ్రామస్థులు ఉమ్మడిగాను, వ్యక్తిగతంగాను వహించేవారు. గ్రామ పెద్ద వ్యక్తుల నుండి శిస్తు వసూలు చేసి ప్రభుత్వానికి అందచేస్తాడు. ఈ సేవకు ప్రతిఫలంగా అతడు కొంత కమిషన్ పొందుతాడు. ఈ పద్ధతి ఆగ్రా, ఆయోధ్యలలో అమలులోనికి వచ్చింది. ఆ తరువాత పంజాబ్‌కు వ్యాపించింది. ఒక విధంగా మహల్వారీ పద్ధతి రైతువారీ పద్ధతిని పోలినదే. ఉమ్మడి యాజమాన్యం పేరుకు మాత్రమే ఉండేది. క్రమంగా శిస్తును వ్యక్తుల కమతాల మీద వేరువేరుగా విభజించడం జరిగింది. వ్యవసాయదార్లు వారి వారి భూముల మేరకు మాత్రమే శిస్తు చెల్లించడానికి బాధ్యత వహించేవారు. మహల్వారీ పద్ధతి క్రింద ఉండే రైతులకు, రైతువారీ పద్ధతిలోని రైతులకు ఆచరణలో తేడా కనిపించలేదు.

## 3.1.5. అస్థవ్యస్థమైన భూస్వామ్య పద్ధతులు :

ఆంగ్లేయులు విధించిన భూస్వామ్య పద్ధతులు, భూమిశిస్తు విధానాలు కాలంలో పాటు ఎంతో మార్పు చెందాయి. రాను రాను ఒక పద్ధతి లక్షణాలు మరొక దానికి సంక్రమించాయి. ఎక్కువగా జమీందారీ పద్ధతి ఇతర పద్ధతుల మీద ప్రసరించిందని చెప్పవచ్చు. కమతాలను కౌలుకివ్వడం, కౌలును విపరీతంగా పెంచడం వంటి లక్షణాలు రైతు వారీ విధానంలో కూడా గోచరించాయి. మహల్వారీ పద్ధతిలో కూడా కొన్ని ప్రాంతాలలో జమిందారీ లక్షణాలు, మరికొన్ని ప్రాంతాలలో రైత్వారీ పద్ధతి లక్షణాలు కన్పిస్తాయి. రైతులు భూములను కౌలుకిస్తూ గైర్ హాజరీ భూస్వాములుగా రూపొందారు. జమిందార్లు, జాగీర్దార్లు కూడా స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతదేశంలోని భూస్వామ్య పద్ధతులు ఎంతో అస్థవ్యస్థంగా ఉన్నాయి. ఒక వైపున అసంఖ్యాకులైన భూమిలేని వ్యవసాయకూలీలు, ఏ హక్కులేని కౌలుదార్లు ఉండగా మరొక వైపు కొద్దిమంది భూస్వాములు పెద్ద పెద్ద ఎస్టేట్లకు యజమానులుగా ఉండి సిరిసంపదలతో తుల తూగుతూ ఉండేవారు. ఆ కాలంలో సరియైన భూమి లెక్కలు కూడా ఉండేవికావు. మధ్యవర్తులను తొలగించటం కష్టమయింది. మొత్తం వ్యవసాయ భూములలో ఇంచుమించు సగం వరకూ మధ్యవర్తుల ఆధీనంలో ఉండేవి.

## 3.1.6. శాశ్వత శిస్తు విధానం

భూ సంస్కరణల రంగంలో కంపెనీ ప్రభుత్వం చేసిన తొలి ముఖ్య ప్రయోగం, శాశ్వత శిస్తు నిర్ణయ విధానం. సుదీర్ఘ చర్చలు, తర్జన భర్జన అనంతరం 1793లో గవర్నర్ జనరల్ లార్డ్ కారన్ వాలీస్ దీన్ని ప్రవేశపెట్టాడు. ఇది బెంగాల్, బీహార్, ఒరిస్సాలు, తదుపరి ఉత్తర మద్రాస్‌కు చెందిన కొన్ని భూభాగాలకు అన్వయించబడింది. ప్రభుత్వం రైతుల మధ్యన జమీందారులనే భూస్వామ్య వర్గం నెలకొల్పబడింది. దీనికే జమీందారీ విధానమని కూడా పేరు. మహల్వారీ విధానం కూడా ఈ కోవకు చెందినదే. అయితే రెండు తేడాలున్నాయి. ఒకటి, శాశ్వత శిస్తు నిర్ణయ విధానం, ఇతర జమీందారీ విధానాలలో భూ యాజమాన్య పన్ను వసూలు అధికారాలు ఒక జమిందారుకు ఇస్తే మహల్వారీ విధానంలో ఇవి కొంత మంది భూస్వాములు, లేదా గ్రామ కుటుంబ పెద్దలకు 'సంయుక్తంగా ఇవ్వడం జరిగింది. రెండు శాశ్వత శిస్తు నిర్ణయ విధానంలో జమిందారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సాలీనా భూమి శిస్తు శాశ్వతంగా నిర్ణయం కాగా, మహల్వారీ ఇతర జమీందారీ విధానాల్లో ఇది, పరిమిత కాలానికి 20 నుంచి 30 సంవత్సరాలు మాత్రమే నిర్ణయించబడేది. అంటే, భూమి శిస్తు మొత్తాలను పెంచడానికి మొదటిదానిలో అవకాశం లేకపోయినా, మిగతా వాటిలో వీలుండేది. మహల్వారీ విధానం గంగాలోయ, వాయువ్య రాష్ట్రాలు, మధ్య భారత్‌లో కొన్ని భాగాలు, పంజాబ్‌లో అమలు చేయబడింది. ఇతర పరిమిత జమీందారీ విధానాలు మధ్య భారత్‌లో కొన్ని భాగాలు జౌధ్, గుజరాత్ లాంటి ప్రాంతాలలో ప్రవేశపెట్టబడ్డాయి.

కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన సంస్కరణలన్నింటిలో ఎక్కువ ప్రాముఖ్యం వహించినది శాశ్వత పన్ను విధానము. 17వ శతాబ్దం నుంచి బెంగాల్ రాష్ట్రంలో జమీందారులు అనే ప్రముఖులు ఉండేవారు. వారు భూమి స్వంతదారులు కారు. రైతుల వద్ద నుంచి భూమిశిస్తులు వసూలు చేసి కొంత భాగం తాము ఉంచుకొని తతిమాది ప్రభుత్వానికి జమకట్టేవారు. ఈ జమిందారీ హక్కు వంశపారంపర్యంగా వచ్చేది. జమీందారులు స్వార్థపరులై రైతుల వద్ద నుంచి ఎక్కువ మొత్తం వసూలు చేసి, ప్రభుత్వానికి మాత్రం తక్కువ మొత్తం చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రైతులకు కూడా ఈ పద్ధతి నష్టదాయకంగా పరిణమించింది. ఈ పద్ధతికి బదులుగా హేస్టింగ్స్, వేలం పద్ధతిని ప్రవేశపెట్టినట్లుగా మనం తెలుసుకొనినాము. కాని ఇది కూడా లోప భూయిష్టమయినది. వేలం పాడిన వారు పాట మేరకు పైకం చెల్లించక కంపెనీవారికి బకాయి పెట్టడమే కాక, రైతులను అమితంగా పీడించసాగారు. కలెక్టర్లు వేలంపాటదార్లతో చేరి, లంచాలు పుచ్చుకొని కంపెనీని మోసం చేయసాగినారు. కంపెనీ డైరెక్టర్లకు భూమిశిస్తు వసూలు ఒక సమస్య అయినది. తిరిగి పాత పద్ధతి ప్రకారం భూమిశిస్తు వసూలు చేసే అధికారం జమీందార్లకే ఇచ్చివేసి, వారు ప్రభుత్వానికి ఎంత శిస్తు చెల్లించవలసిందీ శాశ్వతంగా నిర్ణయిస్తే, కంపెనీకి నిలకడైన రాబడి ఉంటుందని తలచి, డైరెక్టర్లు తమ అభిప్రాయాన్ని కారన్ వాలీస్‌కు వెలిబుచ్చినారు. కారన్ వాలీస్ వారి ఆజ్ఞ మేరకు రైతులు ఎంత భూమిని సాగుచేస్తున్నారో ఎంత పంట పండుతున్నదో, ఇంత వరకు వారు ఎంత శిస్తు కడుతున్నారో ఆ విషయాలన్నీ కనుక్కోమని కలెక్టర్లను లెక్కలు తయారు చేయమని చెప్పినాడు. కాని కలెక్టర్లు ఎంత శ్రమ పడినా, పూర్తి వివరాలు తెలుసుకోలేకపోయినారు. కాలమంతా ఈ విషయ సేకరణకై కలెక్టర్లు ఉపయోగిస్తే వారి మిగతా పనులకు ఇబ్బంది అని తలచి, అతడు అప్పటి వరకు లభించిన వివరాల ఆధారంగా

రైతులు ఎంతకట్టవలెనో జమీందార్ల నుంచి ఎంత పన్ను వసూలు చేయవలెనో నిర్ణయించి, శాశ్వతంగా భూములకు హక్కుదార్లయినారు. వారికి స్థిరాస్థి ఏర్పడింది. వారు ఇంగ్లాండ్‌లోని భూస్వాముల వలె ప్రవరిస్తారని కారన్ వాలీస్ అభిప్రాయపడినాడు. ఈ విధానానికే శాశ్వత భూమి శిస్తు విధానం అని పేరు. ఈ శాశ్వత విధానంలోని కొన్ని ముఖ్యాంశాలు ఏమంటే 1, జమిందార్లకు భూమి స్వంతదార్లుగా పరిగణన ఉంటుంది. కానీ ఏ సందర్భంలోనైనా వారు తమ విధానాలను సక్రమంగా నిర్వర్తించలేకపోతే వారికి భూమిపై హక్కులు రద్దు అవుతాయి. 2. జమిందార్ల కంటే భూమిశిస్తు తప్పించి, భూమిపై ఇతర పన్నుల ద్వారా వసూలు అయిన ధనం (ఉదాహరణకు వారసత్వపు పన్ను మొదలైనవి) ప్రభుత్వానికి దక్కదు. 3. కొత్తగా నిర్ణయమైన శాశ్వత పన్ను 1765 నాటికి అమలులో ఉన్న పన్నుకు రెండింతలు. ఈ మొత్తాన్ని జమిందారులు ప్రభుత్వానికి జమకట్టవలె 4. జమీందార్లకు న్యాయ విచారణ హక్కులుండవు 5. జమీందార్లు రైతులతో తమకు ఇష్టం వచ్చిన నిబంధనలు ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ, ఆ నిబంధనలన్నీ పట్టాల రూపంలో ఉండవలె. ఒక వేళ జమీందారు ఆ నిబంధనలను అతిక్రమిస్తే, రైతు అతనిపై కోర్టులో ఫిర్యాదు చేయవచ్చు.

శాశ్వత శిస్తు విధానాన్ని గురించి పలువురు తమ అభిప్రాయాలు వెలిబుచ్చినారు. ఇందులో లాభ, నష్టాలు కూడా ఉన్నాయి.

శాశ్వత శిస్తు విధానం వల్ల ప్రభుత్వానికి సకాలానికి తమకు రావలసిన మొత్తం అందుతుండేది. అందువల్ల వారు తలపెట్టిన కార్యాలు నిర్విఘ్నంగా జరగడానికి వీలయ్యేది. పూర్వం కన్నా కంపెనీ రాబడి రెట్టింపైంది. జమీందార్లకు పూర్తిగా పన్ను వసూలు చేసే పని అప్పగించినందువల్ల కంపెనీవారు వేరే ఉద్యోగులను నియమించడం, వారి ఖర్చులను భరించడం అవసరం లేనందువల్ల కంపెనీ ఖర్చు కూడా చాలా తగ్గిపోయింది. జమీందార్లకు మొదటి నుంచి ఈ పని బాగా అలవాటు కాబట్టి తర్ఫీదు పొందినా ఆంగ్ల ఉద్యోగులను ఈ పనికి నియమించవలసిన సమస్య కూడా తీరిపోయింది. జమిందార్లను ఈ పనికి నియమించడం కంపెనీకి మరో విధంగా లాభదాయకమైంది. రైతులు, సామాన్య ప్రజలు సాధారణంగా జమీందార్ల మాటకు కట్టుబడి ఉండేవారు. జమీందారులు గనుక అసంతృప్తిగా ఉండి ప్రభుత్వంపై తిరగబడితే వారి ప్రజలు కూడా వారితో బాటే. ఈ విధానంలో సంస్కృతి, విజ్ఞానం గల జమిందారులు భూస్వాములుగా నియామకం అవడం. వారికి ఆ భూములపై శాశ్వత హక్కులు కలగడంతో వారు కంపెనీపై తిరుగుబాటు చేసే అవకాశం చాలా తక్కువ. కంపెనీకి విధేయులుగా ఉండే ఒక మధ్య తరగతి వారు ఏర్పడటం కంపెనీకి చాలా లాభదాయకమైంది. శాశ్వత శిస్తు విధానం కంపెనీకే కాక, జమిందార్లకు, రైతులకు కూడా లాభదాయకం అని చెప్పవచ్చు. జమీందారులు, రైతులు ఎక్కువ శ్రద్ధ తీసుకొని, పంటలు రెట్టింపుకాని, ఇంకా ఎక్కువ కాని, పండించినా, ఆ లాభమంతా వారిదే. ఇందులో కంపెనీకి ఏమీ వాటా ఇవ్వనక్కరలేదు. అందుచేత ఎక్కువ భూమిని సాగుచేయడానికి ఉత్సాహం వారికి లభించింది. జమిందార్లకు మరే బాధ్యతా లేనందున పూర్తిగా వ్యవసాయం మీదనే వారు తమ దృష్టిని కేంద్రీకరించడానికి వీలయింది. రైతులకు పట్టాలు ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టినందువల్ల రైతులకు అన్యాయం జరగకపోవచ్చు కూడా. కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన శాశ్వత శిస్తు విధానంలోని ముఖ్యమయిన సుగుణాలను పేర్కొనడమయింది. విలియం బెంటింక్ ఈ విధానాన్ని ప్రశంసిస్తూ, ఇందులో లోపాల అనేకం ఉండవచ్చు. కాని, దాని వల్ల ఆంగ్లేయుల రాజ్యాధికారం చిరస్థాయిగా ఉండిపోవలెనని కోరుకొనే ఒక భూస్వామ్య వర్గం ఏర్పడటం, ఆ భూస్వాములకు ప్రజలపై అధికారం కలగడం ఆంగ్లేయులకు ఎంతో లాభకరమైందని చెప్పినాడు. కాని ఈ విధానంలో లోపాలు కూడా అనేకం ఉన్నాయి. జమీందార్లను భూస్వాములుగా చేసి, వారు చెల్లించవలసిన శిస్తు ప్రభుత్వం నిర్ణయించినా, మొదట్లో జమీందార్లకు అంత ధనం కట్టడానికి వీలులేకపోయింది. భూమి మీద పెట్టుబడి పెట్టి పంటలను వృద్ధి చేయడానికి వ్యవధి కావలె. అటువంటి వ్యవధి వారికి లభించలేదు. అనేక సందర్భాలలో వారు నిర్ణయించిన శిస్తు మేరకు కట్టవలసినంత రొక్కం కట్టనందుకు తమ పదవులు కోల్పోవలసి వచ్చింది. అంతేకాక అంతకు పూర్వం వారు అనుభవిస్తున్న స్థానం కూడా పోగొట్టుకొనిన వారైనారు. కొన్ని సందర్భాలలో జమిందార్లు అధిక లాభాలు పొంది, ధనం ఎక్కువచేరగానే పట్టణాలలో నివసిస్తూ తమ స్వంత భూములను కౌలుకు ఇచ్చే వారు. భూముల మీద ఎక్కువ శ్రద్ధ చూపడానికి బదులుగా విలాసాలతో కాలం గడిపేవారు. వారికి ఇంకా ఇంకా లాభాలు పొందవలెననే ఇచ్ఛ లేకుండా పోయింది. పైగా పన్నులు వసూలు చేయడానికి మధ్యవర్తులను నియమించేవారు. ఈ మధ్యవర్తులు ఎటువంటి బాధ్యత వహించక రైతులను పీడించి, ఎక్కువ పన్నులు వసూలు చేసేవారు. రైతులు ఈ అన్యాయాన్ని అరికట్టడానికి కోర్టులకు వెళ్ళవలసి వస్తే అది ఖర్చుతో కూడుకొన్నదని పైగా ఈ న్యాయస్థానాలు తీర్పు చెప్పడానికి చాలా కాలం తీసుకొనేవి. కోర్టులకు వెళ్ళినందువల్ల జమిందార్లు ఆ రైతులను పనిలోనుంచి తొలగించేవారు. వారిని మరే జమిందారు కూడా పనిలోకి తీసుకోవడానికి సమ్మతించడు. కాబట్టి ఎటువంటి కష్టాలు వచ్చినా

జమిందార్లకు లోబడి ఉండేవారు. ఒకప్పుడు ఈ రైతులు స్వంత భూములు కలిగి, స్వంత సేద్యం చేసుకొంటూ బ్రతికేవారు. ఈ కొత్త విధానం వల్ల వారు జమీందార్లకు బానిసలై పోయినారు. ఏకు మేకై కూర్చొందన్న సామెత నిజమైంది. ముఖ్యంగా ఈ శాశ్వత శిస్తు విధానంలోని లోపానికి కారణం భారతదేశంలోని పరిస్థితులను తెలుసుకొనక, జమీందారులు ఇంగ్లండ్‌లోని భూస్వాములు వంటి వారిని కారన్ వాలీస్ భ్రమపడి ఈ పద్ధతిని అవలంభించడమే.

కారన్ వాలీస్ తన సంస్కరణలు విదేశాంగ నీతి ప్రదర్శించి, బహుముఖ ప్రజ్ఞావంతుడని పేరు పొందడమే కాక, భారతదేశంలో బ్రిటిష్ పరిపాలన పటిష్టంగా ఉండటానికి బలమైన పునాదులు వేసినాడు. రమేశ్ చంద్ర దత్తు అనే భారతీయ చరిత్రకారుడు కారన్ వాలీస్‌ను ప్రశంసిస్తూ "మిగతా రాష్ట్రాల కన్నా 19వ శతాబ్ది అంత్య కాలంలో వంగ దేశపు రైతులు అభివృద్ధి చెంది ఉన్నారు. స్వయం శక్తిపై ఆధారపడివున్నారు. ధనాఢ్యుల చేతుల నుంచి తప్పించుకొనగలిగి ఉన్నారు. మిగతా ప్రాంతాల వారి కన్నా వారు కరువులను బాగా ఎదుర్కొన గల స్థితిలో ఉన్నారు. దీని కంతకు 5 కోట్ల మంది ప్రజలకు అధిక సౌఖ్యం సమకూర్చినందుకు కారన్ వాలీస్ ప్రభువుకు విశాల రాజనీతి, సహృదయత, ప్రజోపయోగం కోసం వినియోగించిన వివేకం, ముఖ్యంగా ఆయన శాశ్వత భూమిశిస్తు విధానమే కారణాలు" అని పేర్కొన్నాడు.

దేశభక్తితో, దేశ సంక్షేమం కోసం కారన్ వాలీస్ పాటు పడినాడని చెప్పడానికి చెప్పిన విషయాలే మంచి తార్కాణము. అందుకే అతనిని గురించి మంచిగాను చెడ్డగాను ఎవరు ఎన్ని చెప్పినా, అతని పేరు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

## 3.1.7. సారాంశము :

భూమి పరిపాలనకు ప్రజల శ్రేయస్సుకు పనికి వచ్చే పనులు చేయడానికి ధనము చేకూర్చవల్సి వచ్చేది. భూమిశిస్తు ధన రూపంలోగాని, ధాన్య రూపంలోగాని పండిన వెంటనే రాజులకు ఇవ్వాల్సి ఉండేది. వీటి ఫలితమే కారన్ వాలీస్ కాలంలో బెంగాల్‌లో శాశ్వత శిస్తు నిర్ణయాన్ని ప్రతిపాదించి ప్రభుత్వ స్థిర ఆదాయానికి నాంది పలికాడు. మద్రాస్ గవర్నర్ అయిన మన్రో ఈ రెవెన్యూ విధానాన్ని 1820 లో అమలులోకి తెచ్చాడు. రైతులు, ప్రభుత్వం మధ్య, జమిందారులు మధ్యవర్తి భూస్వాములు లేకుండా, ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయి. దీనికి రైత్వారీ విధానమనే పేరు సార్థకమైంది. భూస్వామ్య పద్ధతుల సక్రమంగా ఉంటేనే అధికోత్పత్తి అధిక సామర్థ్యం పెంపొందుతుంది. బ్రిటీష్ వారు భారతదేశంలో తమ పరిపాలనను సుస్థిరం చేసుకోనడానికి దేశం నుంచి ఎక్కువ ధనాన్ని సంపాదించడానికి భూమిశిస్తు వసూలు విధానంలో గొప్ప మార్పులు చేసారు. అందువల్ల వ్యవసాయం నానాటికి దిగజారిపోయింది. కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన సంస్కరణలన్నింటిలో ఎక్కువ ప్రాముఖ్యం వహించినది, శాశ్వత పన్ను విధానము. ఇందులో లాభ నష్టాలు కూడా ఉన్నాయి. రమేశ్ చంద్ర దత్తు అనే భారతీయ చరిత్రకారుడు కారన్ వాలీస్‌ను ప్రశంశిస్తూ మిగతా రాష్ట్రాల కన్నా 19వ శతాబ్ది అంత్య కాలంలో వంగ దేశపు రైతులు అభివృద్ధి చెంది ఉన్నారు. దీనికి ముఖ్యంగా ఆయన శాశ్వత భూమిశిస్తు విధానమే కారణాలు అని పేర్కొన్నాడు.

## 3.1.8. నమూనా ప్రశ్నలు :

1. రైత్వారీ విధానాన్ని వివరించండి ?
2. భూమిశిస్తు పద్ధతులను, విధానాలను వివరించండి ?
3. శాశ్వత శిస్తు విధానం గూర్చి తెలుపుము ?

## 3.1.9. చదువవదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Nationalism and Colonialism in Modern India, New Delhi, 1979 |
| 2. | Bipin Chandra, | : | Modern India, New Delhi, 1971 |
| 3. | Percival Spear, | : | A History of India, Vol. 2, Harmondsworth, 1978 |

4. Sumit Sarkar, : Modern India, 1885 - 1947, Delhi, 1983

5. Alladi Vaidehi, : History of Freedom Movement in India, Hyderabad 1991

6. Heimsath, : Indian Nationalism and Hindu Social Reform, Princeton, 1964

7. Vma Kaura, : Muslims and Indian Nationalism, New Delhi, 1977

8. Mc lane, Indian : Nationalism and the Early Congress, Prination, 1977

9. Anil Seal, The : Emergence of Indian Nationalism, Cambridge, 1967.

10. K.K. Datta : A Social History of Modern India

11. K.K. Datta : Renaissance, Nationalism and Social Charge in Modern India

12. Bipin Chandra : Nationalism and Colonialism in Modern India.

13. Tapan Raychaudhuri and : The Cambridge Economic History of India, Vols. 2 Irfan Habib

14. Sumit Sarkar : Modern India 1885-1947

15. R. Plame Dutt : Indian Today

16. R.C. Majumdar : History of Freedom Movement in India, 3 Vols.

17. R.C. Majumdar and others (Ed.) : The History and Culture of Indian People Vols. IX and X

19. B.N. Chopra, B.N. Puri and M.N. Das : A Social, Cultural and Economic History of India, 3 Vols

19. Tarachand : History of Freedom Movement in India, 4 Vols.

20. S.C. Roychaudhuri : Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India.

పాఠం - 3.2

# వడ్డీ వ్యాపారులు - మధ్యవర్తుల ఆవిర్భావము

## 3.2.0. లక్ష్యం :

పెట్టుబడిదారుల ఆవిర్భావము, మధ్యవర్తుల ఆవిర్భావం, జెట్టి విధానం, భారతీయ సామాజిక సాంప్రదాయ జీవనంపై బ్రిటీష్ ఆర్థిక పరిస్థితుల ప్రభావం గురించి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


**3.2.1.** ఉపోద్ఘాతము

**3.2.2.** పెట్టుబడిదారులు, పెట్టుబడిదారుల ఆవిర్భావం

- **3.2.2.1.** మధ్యవర్తుల ఆవిర్భావము
- **3.2.2.2.** జెట్టీ విధానం
- **3.2.2.3.** సావాసగాళ్ళు
- **3.2.2.4.** ముగింపు

**3.2.3.** భారతీయ సామాజిక సాంప్రదాయ జీవనంపై బ్రిటీష్ పరిస్థితుల ప్రభావం

- **3.2.3.1.** పరిచయం : ఆంగ్లేయుల ఆగమనం
- **3.2.3.2.** క్రీ॥శ॥ **16**వ శతాబ్దం
- **3.2.3.3.** ఆనాటి పరిస్థితుల అనుకూలత
- **3.2.3.4.** వృత్తులు - వ్యాపారము
- **3.2.3.5.** ముగింపు

**3.2.4.** నమూనా ప్రశ్నలు

**3.2.5.** చదువదగిన గ్రంథాలు


## 3.2.1. ఉపోద్ఘాతము

భారతీయ సమాజము వ్యవసాయము, నేత మొదలగు వృత్తులపై ఆధారపడి జీవనం సాగించేది. వృత్తులు, కులాలు ఒకదానినొకటి పెనవేసుకొని ఎన్నిటికీ విడదీయని బంధంతో ఉండేవి. వర్ణ సంకరము, వృత్తిసంకరము జరగకుండా అనేక ఆంక్షలు విధింపబడి ఉండుట చేత ఏ వృత్తి చేసే వారు ఆ వృత్తినే అవలంబిస్తూ వాటి యందు అమితమైన నైపుణ్యత, ప్రత్యేకత, నాణ్యత గల వస్తువులను తయారు చేసి జీవనం సాగించేవారు. అందువల్ల స్వదేశీ వస్తువుల నాణ్యత, వృత్తి వారలపై నమ్మకము విదేశాల్లో సైతం ఏర్పడింది. పర్యవసానంగా స్వదేశీ వస్తువులకు విదేశాల్లో ఎక్కువ గిరాకీ కూడా ఉండేది. ఎగుమతులు పెరిగి వాటిపై విధించే అమ్మకపు, రవాణా, తూకాల, అడ్డవట్టు (Tole Tax) మొదలగు సుంకాల వలన పాలకులకు ఆదాయము, తయారు చేసే వారికి పని దొరికి భుక్తి బాగానే సాగేది. అయితే వస్తు ఉత్పత్తికి

తగిన పెట్టుబడి ధనము తగినంతగా లభించనందున పాలకులు స్థానిక సుంకాధికారులు వస్తువు ఉత్పత్తి అమ్మకాలపైనా మార్కెట్ విక్రయాల వల్ల పన్ను వసూలు చేసే వారే గాని వాటిని ఉత్పత్తి చేసే చేతి పరిశ్రమల వారికి ఏ విధమైన ఆర్థిక చేయూతను ఇవ్వలేదు. అందువలన చేతి పనివారు, గ్రామీణ చిన్న తరహా పారిశ్రామికులు పెట్టుబడులకు ఇతరులపై తప్పక ఆధారపడవల్సి వచ్చెను.

## 3.2.2. పెట్టుబడిదారులు : వడ్డీ వ్యాపారుల ఆవిర్భావం

ఇటువంటి ఆర్థిక సంక్షోభము ఉత్పత్తిదారులపైన గ్రామాల్లో నివశించే, చేతి పనుల ఉత్పత్తులపై జీవించే వారికి తీరని ఆర్థిక సంక్షోభము ఏర్పడింది. పాలకులు స్వదేశీ వృత్తుల వలన ఉత్పత్తి అయిన వస్తు విక్రయాలు, ఎగుమతులపై సుంకాలను వసూలు చేసుకున్నారే కాని వారికి ఆర్థికపరమైన సహాయము సహకారము చేసిన దాఖలాలు లేవు. ఇది మంచి అదునుగా భావించిన ధనికులు వడ్డీ వ్యాపారస్తులుగా మారి పారిశ్రామికులకు, గ్రామీణ వృత్తుల వారికి అధిక వడ్డీకి రుణాల్ని ఇచ్చి కఠినంగా వసూళ్ళు చేసేవారు. అధిక వడ్డీలు ఒక వైపు, పన్నులు సుంకాలు మరొకవైపు విదేశీయులకు భారతీయ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే అవసరం క్రమంగా తగ్గటం చేత మగ్గాలపై నేచిన పట్టు వస్త్రాల కంటే యంత్రాలపై తయారైన సిల్కు వస్త్రాలే చైనా నుండి, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో తక్కువ ధరలకు లభ్యం కావడం వల్ల భారతీయ వస్తువులకు గిరాకీ తగ్గి వాటిని ఉత్పత్తి చేసే వృత్తుల వారికి జీవించడమే కష్టమైంది. ఎక్కువ వడ్డీలకు తెచ్చిన అప్పుల వల్ల వారు తయారు చేసిన వస్తువులను తక్కువ ధరలకు అమ్మలేక వృత్తులు విడిచి ఏ విధమైన నేర్పు, అనుభవము అవసరం లేని కూలి, వ్యవసాయ కూలి పనుల్లోకి తరలిపోయారు గ్రామీణ వృత్తులు అడుగంటాయి. తరతరాల నుండి వచ్చిన నేర్పు, నాణ్యతలు అంతరించాయి.

**3.2.2.1. మధ్యవర్తుల ఆవిర్భావం :** వడ్డీ వ్యాపారులు ఒకవైపు, పట్టించుకోని ప్రభుత్వాధికారులు ఒక వైపు ఏ విధమైన సహాయ సహకారాలు ఇచ్చి ఆదుకొనకుండగనే పన్నులు, శిస్తులు, సుంకాలను మొదలైన ఇంటి పన్ను, వృత్తి పన్ను, అడ్డుపట్ట సుంకాలు, మామూళ్ళు, దండు మొదలైన వాటిని యధావిధిగా వసూలు చేసే వారు. వృత్తులు పడిపోయి, ఆదరణ కోల్పోయి అప్పుల పాలై ఆర్థిక భారంతో అణగారిన చేతి వృత్తుల వారు తమ వృత్తులను నివాసాల్ని ఆస్తులను వదిలిపెట్టి వేరే ప్రాంతాలకు తరలిపోయారు. అయితే ఈ అవకాశాన్ని ధనంగా మార్చుకొనే ఒక వర్గం ఆవిర్భవించింది. వీరినే (మిడిల్ మేన్) మధ్య వర్తులు, దళారులు అనే పేర్లతో పిలచే వారు. వీరు ఎక్కువ విలువ కలిగిన పొలాల్ని ఇళ్ళను ఆస్తులను పంటలను అమూల్యమైన వస్తు సామాగ్రిని తక్కువ ధర చెల్లించి ఎక్కువ ధరకు అమ్ముకొని లాభం పొందేవారు. వీరు కొన్నప్పుడు అమ్మినప్పుడు కూడా కొంత శాతం మామూలుగా తీసుకొని లాభం పొందేవారు. మధ్యవర్తులు సహాయం చేయుట ఆర్థిక లాభం పొందుట వల్ల ఎంతో పలుకుబడి సంపాదించారు. వీరు ధనిక వర్గానికి చెందిన వారుగా పెద్ద మనుషులుగా చలామణి అయ్యేవారు. వివాదాలు తీర్చడంలోనూ, వాద్యాలు వేయించడంలో కూడా వీరు కడునేర్పరులయ్యారు. ఆ విధంగా మధ్య వర్తుల, వడ్డీ వ్యాపారుల ఆవిర్భావంతో సామాన్యులకు, పాలకులకు మధ్య అంతరం ఏర్పడింది. ఇది తరువాత కాలంలో మధ్య వర్తులకు ఆర్థిక, రాజకీయ, సామాజిక హోదాను పెంచి స్థానిక పాలకులు అవడానికి దోహదపడింది. వీరే పెద్ద మనుషులై పెద్ద తీర్పులు, నిర్ణయాల్లో ఎక్కువ పాత్ర పోషించేవారు. వీరి మాటకే ఎక్కువ విలువనిచ్చి వారు విధించిన నియమాల్లోనే స్థానికులు జీవించేవారు. స్థానికులకు రాజధానిలో ఉన్న రాజు సంగతి కాని ఇంకా ఇతర ఉద్యోగుల గురించి కాని సంబంధం ఉండేది కాదు.

**3.2.2.2. జెట్టీ విధానం :** భారతీయ గ్రామీణ జీవనంలో నెలకొని ఉన్న ఆర్థిక పురోభివృద్ధికి అడ్డుగా నిలిచిన వాటిలో వడ్డీ వ్యాపారం తరువాత జెట్టీ విధానం ప్రధానమైనది. ఇది ముఖ్యంగా గ్రామాల్లో ఉండే రైతులకు సంబంధించినది. నాట్లు వేసిన తరువాత పంట కోతకు వచ్చే వరకు కొంత కాలం రైతులకు పనిలేక ఆదాయం లేక దైన్యాన్ని, కరువుని, కాటకాన్ని అనుభవిస్తారు. ఇవి కాక వివాహాలు వివిధ సంస్కారాలు కుటుంబాల్లో జరిగే విందులు, వినోదాలు, పండుగలు పబ్బాలు సంఘంలో జీవించి ఉన్నంత వరకు జరపాలి కనుక వారికి ధన సేకరణ నిమిత్తం ఖర్చుల నిమిత్తం కొంత అప్పు చేయవల్సిన అవసరం తప్పని సరి అగును. పొలాలున్న వారు పొలాలను కౌలుకు చేసే వారు కొన్ని రోజుల్లో పంట చేతికి వస్తుందనే ధైర్యంతో అప్పుచేస్తే తీర్చగలమనే భావనతో అప్ప చేయడానికి ప్రయత్నిస్తారు. దాని కొరకు వారు అప్పును చేసి కాగితంపై సంతకం చేసి చేసిన అప్పును తిరిగి ధాన్య రూపంలో (ఎన్ని బస్తాలు) ఇవ్వగలమని అదీ కూడా పంట కాలంలోనే అవి రాసిస్తారు. దానిని ఆధారంగా చేసుకొని రైతు లేక వ్యవసాయదారులు అప్పు తీసుకుంటారు. దీనినే జెట్టీ విధానము అంటారు. ఇది కేవలం పంట పండించే వారికి, భూములున్న వారికి మాత్రమే ఇస్తారు. అప్పు తీసుకున్న కాలంలో 100 రోజులు ఇన్ని

బస్తాలని ఒక నియమం ఉంటుంది. పంట పండిన నాటికి అతడు బస్తాలిస్తాడు గాని డబ్బు మాత్రం ఇవ్వడు. ఆ రోజు అతడు తీసుకొన్న అప్పుకి ఒక బస్తా అమ్మితే తీరిపోవచ్చును కాని అతడు వ్రాసిచ్చిన ప్రకారం బస్తాలనే ఇవ్వవల్సి వచ్చును. దాని వల్ల పండించిన పంటంతా జెట్టీ దారునికి అతి తక్కువ డబ్బుకే సమర్పించవల్సి వచ్చుచుండును. రైతులు జెట్టీలో చాలా నష్టపోయారు. బ్రిటీష్ వారు స్వదేశీ ఆచార వ్యవహారాలపైన, నమ్మకాలపైన, లావాదేవీలపైన ఏ విధమైన జోక్యం చేసుకొనలేదు. ఇవి వారి స్వంత విషయాలుగా భావించి చట్ట పరిధిలోనికి తీసుకొని రాలేదు. గ్రామమే దానికి న్యాయ స్థానము. ఇచ్చిన వాడు పుచ్చుకున్న వాడు మాత్రమే దానికి బాధ్యులు.

**3.2.2.3. సావాసగాళ్ళు :** నేత పరిశ్రమను నాశనం చేసిన వారిలో ప్రత్యక్షంగా ఇంగ్లండ్‌లోని యాంత్రిక విధానమైతే పరోక్షంగా చేసిన వాళ్ళు సావాసగాళ్ళు. వీరు నేత కులాలకు సంబంధించిన వాళ్ళే అయినప్పటికీ నేత చేయరు, నూలు వడకరు, మగ్గం తొక్కరు, పడుగు వేయరు, అద్దకం చేయరు, రంగులు వేయరు కాని వీరు మధ్య వర్తులుగా వుండి వస్త్రాల నేత సంఘాలకు, నేత పని వార్లకు వివిధ ప్రాంతాల నుండి ఆర్డర్లు సంపాదించి వారికిని నేత వారికి మధ్య ధరలను నిర్ణయించి వాటి మధ్య వచ్చు తేడాను (కమీషను) స్వయంగా అనుభవించెదరు. వీరు కూడా నేత పని వారికి పరోక్షంగా విరోధులనే చెప్పాలి. వీరివల్ల నేత పనివారు దోపిడీకి గురయ్యారు. వీరు తీసుకునే కమీషన్ వల్ల వస్త్ర విక్రయ ధరల్లో పెరుగుదల కనిపించుటచే వస్త్ర విక్రేతలు కూడా కొంత ధనాన్ని సావాసగాళ్ళకు ఇవ్వవల్సి వచ్చే విధంగా ఏ పని చేయకుండా సావాసగాళ్ళు అధిక ధనార్జన గావించేవారు. మగ్గాలను తొక్కి నూలు ఎక్కించి, పడుగు వేసిన నేతగాండ్రు మాత్రము బడుగు వర్గానికేమీ తీసిపోరు. సావాసగాళ్ళను కాదని నేతగాండ్రు స్వయంగా పని సంపాదించుకోలేరు. అందువల్ల నేత ముందుకు సాగేది కాదు. సావాసగాండ్రు నేతవారికి పడుగుపేకల్లో ఒక ధారమై అలా ఉండిపోయారు.

**3.2.2.4. ముగింపు :** వడ్డీ వ్యాపారులు, మధ్యవర్తులు సాంప్రదాయ పద్దతులపై చక్కగా సహజీవనం సాగిస్తున్న చేతి వృత్తులవారిని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపకారం చేస్తున్నట్లు సమస్యలను పరిష్కరిస్తున్నట్లుగా ప్రవర్తించి వారిని, వారి వస్తు సంపదను కళా నైపుణ్యాన్ని సాంస్కృతిక విలువలను మంట కలిపారు. వారికొచ్చే స్వల్ప ప్రయోజనాలకు చేతి వృత్తుల వారి యొక్క జీవనాన్ని ప్రావీణ్యతను దుర్దశకు గురి చేసారు.

## 3.2.3. భారతీయ సామాజిక సాంప్రదాయ జీవనంపై బ్రిటీష్ ఆర్థిక పరిస్థితుల ప్రభావం :

**3.2.3.1. పరిచయం : ఆంగ్లేయుల ఆగమనం :** భారతదేశానికి రత్న గర్భ అనే సార్థక నామము అతి ప్రాచీన కాలం నుంచి కలిగి ఉంది. భారతదేశంలోని ధనము ప్రత్యేక సంస్కృతి విదేశీయుల నోరూరించాయి. ఎప్పటికప్పుడు నేల మీద భారత వాయువ్య సరిహద్దు ప్రాంతం మీదుగా విదేశీయులు ప్రవేశించారు. అంతే కాకుండా మార్కోపోలో సముద్రంపై ప్రయాణం చేసి భారతదేశానికి మార్గాన్ని కనుక్కొన్నాడు. దీని వల్ల నేల మార్గము, నీటి మార్గము భారతదేశంలో ప్రవేశించడానికి తోడ్పడ్డాయి. ప్రాచీన భారతీయ పురావస్తు ఆధారాలు అవశేషాల వల్ల ఆంధ్ర శాతవాహనులకు ముందే సముద్ర యానం నౌకాయానం అమల్లో ఉన్నట్లు వారి నాణేలపై లభ్యమైన గుర్తుల వల్ల ఋజువగుచున్నది. ఒక వైపు చైనీయులు టిబెట్ గుండా బౌద్ధ మతాన్ని, ధర్మాన్ని అధ్యయనం చేయడం కోసం 'పాహియాన్' ఇత్సింగ్, హుయాన్‌త్సాంగ్ మొదలైన బౌద్ధ భిక్షువులు భారతదేశాన్ని దర్శించి అచ్చటి విశ్వ విద్యాలయాల్లో ప్రముఖ గ్రంధాలయాల్లోనూ లభ్యమైన ప్రముఖ బౌద్ధ గ్రంధాలను తమ దేశానికి తరలించుకొని వెళ్ళారు. దీని వల్ల చైనా భారత సంబంధాలు బౌద్ధ మతపరంగా అభివృద్ధి చెందాయి.

**3.2.3.2. క్రీ॥శ॥ 16వ శతాబ్దం :** పశ్చిమ దేశీయులైన డచ్చి, ఫ్రెంచ్, ఆంగ్ల దేశాలవారు సముద్ర మార్గాన వ్యాపారులు ప్రవేశించి నాటి పాలకులైన మొఘలాయి చక్రవర్తులతో సత్సంబంధాలు ఏర్పర్చుకొని అనేక కానుకలు, వింత వస్తువులు, నజరానాలగా ఇచ్చి మొఘల్ చక్రవర్తుల ప్రేమకు నమ్మకానికి పాత్రులైయ్యారు. ఆంగ్ల స్త్రీల సౌందర్యానికి ఆకర్షితులైన మొఘలాయి చక్రవర్తులు ఆంగ్లేయులకు వ్యాపారము చేసుకొనేందుకు అనేక రాయితీలతో కూడిన జాగీర్లు, ఫర్మానాలు జారీ చేసారు. సముద్రానికి చేరువలో ఉన్న ఓడరేవు నగరాల్ని వారికి ఉపయోగించుకొనేందుకు, సరుకుల రవాణాలు ఎగుమతులు, దిగుమతులు చేసుకొనేందుకు, వ్యాపారాన్ని చేసుకొనేందుకు అనుమతి కూడా ఇచ్చారు. ఆంగ్లేయుల దుస్తుల ధారణ, దొరసానుల సౌందర్యాలు, ఆహార పానీయాలు, ఆచార వ్యవహారాలు మొఘల్ చక్రవర్తులను

ముగ్ధులను చేసాయి. దీని వల్ల విదేశీయులు స్వదేశీ పాలకులకు సన్నిహితులై, హితులై నమ్మకస్తులై భారతదేశంలోని కీలకమైన ఓడరేవుల నగరాల్ని నజరానాలుగా పొందారు. విదేశీయుల రాకతో భారతదేశంలోని ప్రశాంత, పవిత్ర వాతావరణాలు ఆచార వ్యవహారాలు కలుషితమై అంతరించనారంభమైనాయి. మధ్యపానము, హుక్కా, నల్లమందు, మొదలగునవి విదేశీ ఆచారాలు భారతదేశంలో మెల్లమెల్లగా జన జీవనంలో అంతర్భాగమైనాయి. ఒకప్పుడు సముద్రయానము, మ్లేచ్ఛ సంపర్కము పాపంగా భావించబడే సంస్కృతి పూర్తిగా నాశనం కాసాగింది. విదేశాలకు వెళ్ళుట, విదేశీయులతో కలసి భోజనం చేయుట, మద్యం సేవించుట మొదలగునవి అతి సామాన్యమైనవిగానూ, గౌరవమైనవిగానూ, సామాజిక అంతస్తు పెంచేవిగానూ భావించబడ్డాయి. భారతీయులకు విదేశీ వస్తువులపైన విదేశీ సందర్శనం పైన మక్కువ ఎక్కువ కాసాగింది. తత్ఫలితంగా తమ దేశము, మతము, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలపై చిన్న చూపు చూడ సాగారు. సభ్యత సంస్కృతులపై, ఆహార విహారాలపై, వస్తుధారణపై అటు విదేశీయుల పైన ఇటు భారతీయులపైన చెరగని ముద్రను మనం గమనించవచ్చును. విందులు, విహారయాత్రలు సముద్ర తీరాల్లో ప్రేమ కలాపాలు, విశ్రాంతి గృహాల (గెస్ట్ హౌస్) నిర్మాణాలు భారతదేశంలో రాసాగాయి. వ్యాపారం ఒకవైపు విద్య వైద్యసౌకర్యాలను కలిగించడంలో మరొక వైపు శుచిగానూ ఆరోగ్యవంతంగానూ, విజ్ఞాన వంతంగానూ నమ్మకాలు ప్రాచీన ఆచారాల్లో ఇరుక్కుపోయిన భారతీయులకు వైద్య విద్య సౌకర్యాలు కలిగించారు. వేగంగా ప్రయాణం సాగించేందుకు రహదార్లు వంతెనలు నిర్మించబడ్డాయి. దీనికి క్రైస్తవ మతము ఎంతో దోహదం చేసింది. క్రైస్తవ ప్రచారకులైన ఫాదర్‌లు, కేటకీస్టులు మత ప్రచారానికి ఎంతో తోడ్పడ్డారు. వీరి కార్యక్రమాల్లో విద్య, ఆరోగ్యసేవలతో పాటు స్వదేశీయులను, క్రైస్తవ మతంలోనికి మార్చడానికి నిరంతరం కృషి చేసారు.

**3.2.3.3. ఆనాటి పరిస్థితుల అనుకూలత :** ఆనాడు భారతదేశంలో నెలకొని ఉన్న మత మూఢ సంప్రదాయాలు కుల మత శాఖ తత్వాలు స్వదేశీయుల్ని అనేక విధములుగా విభజించాయి. అంటరానితనం, అవిద్య, ఆశుభ్రత, ఆచారం, సంప్రదాయం, పూర్వ జన్మ మొదలయిన వాటిపై బాగా పోషింపబడ్డాయి. అందువల్ల ప్రజలలో అనైక్యత బలపడింది. భారతీయులమనే భావన మరచి పోయేలా చేసింది. ఇదే అదునుగా విదేశీయులు స్వదేశీయులకు అనేక రాయితీలు సదుపాయాలు, ఉద్యోగాలు, ఉచిత వస్త్రాలు, గోధుములు మొదలగు వాటిని ఉచితంగా ఇచ్చి విద్యార్థులకు ఉచిత భోజన విద్యా సౌకర్యాలను ఏర్పాటు చేసి వారికి బైబిల్ యొక్క పవిత్రతను దాని పఠనం యొక్క ఆవస్యకతను గురించి పదే పదే చెప్పారు. గ్రామాల్లో సమావేశాల కొరకు క్రైస్తవులు ప్రార్థనా మందిరాలను నిర్మించారు. జంతు బలి, విగ్రహారాధన మొదలగు వాటిని నిషేధించారు. ఇవి అనాగరికమైన ఆచారాలని వారికి చెప్పారు. స్వదేశీయులు వీరి ప్రసంగాల వల్ల, కల్పించిన తాత్కాలిక ఉపాధి సదుపాయాల వల్ల క్రైస్తవ మతాన్ని కోకొల్లలుగా స్వీకరించారు. క్రైస్తవులమని సగర్వంగా చెప్పుకోసారు. దీనితో మత మార్పిడి ప్రక్రియలో ఎక్కువగా అస్పృశ్య లేక అంటరానివారే ఎక్కువగా చేరారు అయితే విదేశీయులు బ్రాహ్మణులను సైతం క్రైస్తవ మతంలోనికి చేర్చుకున్నారు. వారికి బైబిల్‌ను అనువదించే కార్యక్రమాల్ని, సన్నుతి గీతాల్ని రాసే కార్యక్రమాన్ని అప్పజెప్పారు. క్రైస్తవ మతంలో కూడా జాతుల గుర్తింపును నిర్మూలించలేకపోయారు. రోమన్ కేతలిక్కులు రెడ్లు, చౌదరీలు అనబడే వారికి ఎక్కువగా మత మార్పిడి చేసారు. మిగిలిన క్రైస్తవ మిషనరీలు అస్పృస్యులలో ఉన్న మాల మాదిగలను ప్రత్యేకంగా విడదీసి మత మార్పిడి చేసారు. మాలలు ఒక క్రైస్తవ తెగలోను మాదిగలు మరొక క్రైస్తవ తెగలోనూ చేరారు. దీని వల్ల విదేశీయులు సైతం సంఘంలో నెలకొని ఉన్న కుల వ్యవస్థను నిర్మూలించలేకపోయారు. మత మార్పిడి జరిగినా కులం మాత్రం అలాగే మిగిలిపోయింది. అయితే క్రైస్తవులు మతంలోనికి మారని వారిని "అన్యులు" అని చులకనగా చూచేవారు. మతంలోనికి మారినవారు దొరలవలె ప్రవర్తిస్తూ మారని వారిని తక్కువగా చూసేవారు. భోజనాలు, వివాహాలు మిగిలిన ఆచార వ్యవహారాలు ఆయా క్రైస్తవ ఆచారాలకు పరిమితమైనాయి. సమాజంలో ఆంగ్లేయుల సంపర్కంవల్ల చెప్పుకోదగ్గ మార్పు రాలేదు.

**3.2.3.4. వృత్తులు - వ్యాపారం :** భారతీయులు వృత్తులపై ఆధారపడిన కుల వ్యవస్థ కలిగి ఉండేవారు. నాటి భారతీయ సమాజము వృత్తిపరమైన కులాల్ని కలిగి ఉండేది. ఏ కులం వారు ఆ వృత్తిని చేస్తూ జీవనం సాగించేవారు. చేనేత పరిశ్రమ భారతదేశంలో పేరు ప్రఖ్యాతులు కలిగి ఉండేది. భారతీయ వస్త్రాలకు ప్రపంచమంతా గిరాకీ ఉండేది. చేతితో వడికిన నూలుతో మగ్గాలపై నేచిన ఏడుగజాల చీరను మడిచి ఒక అగ్గిపెట్టెలో పెట్టే వారని చెబుతారు. దీన్ని బట్టి భారతీయులు నేతలో ఎంత ప్రావీణ్యులో నైపుణ్యం కలిగిన వారో తెలియగలదు. కాలికో, రవసల్లాలు మొదలగు ఇతర దేశాలకు బాగా ఎగుమతి అయినట్లు పెక్కు ప్రాచీన గ్రంథాల్లో ఉటంకించబడింది. భారతదేశం నుండి చైనాకు పట్టు వస్త్రాలు బాగా ఎగుమతి అయ్యేవట. పశ్చిమదేశాల్లో భారతీయ చేనేత వస్త్రాలకు చాలా గిరాకీ ఉన్నందున

వాటిని సరఫరా చేయుటకు పనివారు సరిపోనందున, అనేక మందిని వివాహం చేసుకొని వారిచే పనిచేయించుకునేవారు. అయితే ఇంగ్లండ్‌లో మరమగ్గాలు, యంత్రాలపై వస్త్రాలను నేయడం వలన భారతీయ వస్త్రాల ఎగుమతి తగ్గిపోయింది. అందువల్ల చేనేత. వారి ఆర్థిక పరిస్థితి దయనీయమన స్థితికి దిగజారిపోయింది. పని లేనందున ఎక్కువ మంది భార్యలను పోషించడం కష్టం అయ్యింది. అయితే ఆర్థిక పరమైన అవసరాల కోసం బహుభార్యత్వాన్ని ఆమోదించిన నేతవారి సమాజము పని లేక పోయినా బహుభార్యత్వ వ్యవస్థను వదలక అది వారి జన్మహక్కని సంప్రదాయమని భావింప సాగారు. నేత పనిలేని స్త్రీలు నేతేతర వృత్తులు చేయవల్సిన దుస్థితి ఏర్పడింది. వస్త్రాలను ఉత్పత్తి చెయవల్సిన అవసరం, ఎగుమతి చేయవల్సిన సౌకర్యం లేనందున నేత పరిశ్రమ మెల్ల మెల్లగా కనుమరుగైంది. భారతీయుల నేత నైపుణ్య కళా ఖండాలు వాడిన రంగులు, పట్టు ఈనాడు వస్తు ప్రదర్శన శాలల యందు మాత్రమే చూపరులకు కనిపించుచున్నవి. ఆంగ్లేయుల యంత్ర ఆవిష్కరణలతో చేనేత మగ్గాలు మూల పడినవి. మిక్కిలి నైపుణ్యం కలిగిన చేనేత గాళ్ళు ఆర్థికంగానూ సామాజికంగానూ అవస్థల పాలయ్యారు. వారిని ఆదుకొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. నేతపై ఆధారపడిన ఇతర అనుబంధ కళలు, అద్దకములు, కలాంకారీలు మొదలగు అరుదైన కళలు అంతరించినవి. డచ్, ఫ్రెంచి మొదలగు వారి వల్ల లేస్ (Lace) కుట్టుపని తీరాంధ్రదేశంలో (నర్సాపురం) మాత్రము ఇప్పటికీ మంచిగిరాకీలో ఉన్నది. ఇవి కూడా క్రైస్తవ సంస్థల ఆధీనంలోనే నేటినీ పనిజేయుచున్నవి. ఒకనాటి బలమైన కుటీర పరిశ్రమగా వెలసిల్లిన చేనేత, యంత్రాల లేక నూలు మిల్లుల ఆవిర్భావంతో రాట్నాలు మూలపడినవి. భారత స్వాతంత్ర్య యోధుడైన మహాత్మాగాంధీ చేనేతకు కుటీర పరిశ్రమలకు తిరిగి జీవం రప్పించేందుకు ఖాదీ గ్రామోద్యమాన్ని నిర్విఘ్నంగా సాగించారు. తకిలీపై దారం వడుకుట రాట్నం పై నూలును సేకరించుట, మగ్గంపై వస్త్రములు నేయుట, అద్దకములు కళంకారీ మొదలగు ప్రాచీన విద్యలకు ప్రోత్సాహం లభించింది. నూలుకు రంగు వేసే పద్ధతి నేసిన వస్త్రాలకు చలువ చేసే పద్ధతి మొదలగు వాటి గురించి ప్రముఖ చరిత్రకారుడైన శ్రీలంక నివాసియగు డా॥హర్షరత్నంగారు త్రీరాంధ్ర దేశంలోని "Weavers and Washermen" గురించి తన ప్రముఖ పరిశోధనా గ్రంథమైన Coramendal Commerce అనే గ్రంథంలో సవిస్తరంగా వివరించారు.

చేనేతతో అనుబంధం కలిగిన ఇతర చిన్న పరిశ్రమలు నూలును చలువ చేయుట, రంగులు వేయుట, పడుగు వేయుట, పనలో దారం ఎక్కించుట మొదలగు ప్రత్యేక కళలు నేతకు గిరాకీ తగ్గినందువల్ల పని లేకపోవుట వల్ల వారి ఆర్థిక స్థితి దిగజారినది. నేత వారు తమ స్వంతపని క్షీణించుటచే ఇతర వృత్తులకు మెల్లగా మారిపోయిరి. వ్యవసాయము, కూలి పని, భవన నిర్మాణ కట్టడాల్లో పని మొ॥ వాటి యందు పని చేయుటకు తరలిపోయిరి. వ్యవసాయంపై కూడా దీని ప్రభావము తక్కువగా లేకుండెను. నేతకు కావల్సిన ముడి ప్రత్తికి స్వదేశంలో గిరాకీ తగ్గినందున మేలైన "Deccan Cotton" ఇంగ్లండ్‌లోని మాంచెష్టరుకు తరలిపోయెను. ప్రముఖ వస్త్ర తయారీలకి పేరుగాంచిన మాంచెష్టరు నుంచి ప్రపంచంలోని వివిధ దేశాలకు మిల్లుపై నేయబడిన వస్త్రములు విరివిగా ఎగుమతి అయ్యేను. ఒకనాడు భారతీయ చేనేత గాళ్ళు తమ నైపుణ్యంతో అంతర్జాతీయ వస్త్ర వ్యాపారంలో మకుటం లేని మహారాజులుగా వెలిగిన వారు మాంచెష్టర్ యంత్రాల నేత వస్త్రాల పోటీకి తట్టుకోలేక కుటుంబంను సైతం పోషింపలేక వేరే వృత్తులలోనికి వెళ్ళుటగాని సూరత్ మొదలగు ప్రదేశాలకు వలస పోవుట జరిగినది.

**3.2.3.5. ముగింపు :** పాశ్చాత్యుల ప్రభావం ప్రాబల్యం వల్ల భారతీయ కళలపై వారికున్న మక్కువ వలన భారతీయ కళా సంపదకు కళాకారులచే చేయబడిన వస్తు సామాగ్రికి ఒకప్పుడు గిరాకీ మెండుగా ఉండేది. అయితే యాంత్రికీకరణ వలన నేతలో యంత్రాల వినియోగం వల్ల భారతీయ చేనేత వస్త్రములు మాంచెష్టరు వస్త్ర సరఫరాతో పోటీపడలేక నష్టములను ఎదుర్కొనవల్సి వచ్చింది. కుటీర పరిశ్రమ, కుల వృత్తిగానూ వెలసిల్లిన చేనేత చేజారిపోయెను. మాంచెష్టరు పరిశ్రమల ఉత్పత్తుల తాకిడికి భారతీయ హస్తకళలు అస్తమించెను.

## 3.2.4. నమూనా ప్రశ్నలు :

1. పెట్టుబడిదారుల, వడ్డీ వ్యాపారుల ఆవిర్భావాన్ని వివరించండి ?
2. భారతీయ, సామాజిక సాంప్రదాయ జీవనంపై బ్రిటీష్ ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని వివరించండి.

### 3.2.5. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Nationalism and Colonialism in Modern India, New Delhi, 1979 |
| 2. | Bipin Chandra, | : | Modern India, New Delhi, 1971 |
| 3. | Percival Spear, | : | A History of India, Vol. 2, Harmondsworth, 1978 |
| 4. | Sumit Sarkar, | : | Modern India, 1885 - 1947, Delhi, 1983 |
| 5. | Alladi Vaidehi, | : | History of Freedom Movement in India, Hyderabad 1991 |
| 6. | Heimsath, | : | Indian Nationalism and Hindu Social Reform, Princeton, 1964 |
| 7. | Vma Kaura, | : | Muslims and Indian Nationalism, New Delhi, 1977 |
| 8. | Mc lane, Indian | : | Nationalism and the Early Congress, Prination, 1977 |
| 9. | Anil Seal, The | : | Emergence of Indian Nationalism, Cambridge, 1967. |
| 10. | K.K. Datta | : | A Social History of Modern India |
| 11. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 12. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern India. |
| 13. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of India, Vols. 2 Irfan Habib |
| 14. | Sumit Sarkar | : | Modern India 1885-1947 |
| 15. | R. Plame Dutt | : | Indian Today |
| 16. | R.C. Majumdar | : | History of Freedom Movement in India, 3 Vols. |
| 17. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 19. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 19. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 20. | S.C. Raychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |

పాఠం - 3.3

# పారిశ్రామిక విప్లవం - దాని ఫలితాలు

## 3.3.0. లక్ష్యం :

పారిశ్రామిక విప్లవం, దాని కారణాలు, ఫలితాలను తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం

## విషయసూచిక :


3.3.1. పారిశ్రామిక విప్లవం

3.3.1.1. పారిశ్రామిక విప్లవం - ఇంగ్లండ్

3.3.1.2. పారిశ్రామిక విప్లవం - దాని ఫలితాలు

3.3.2. పరిశ్రమలు

3.3.3. పారిశ్రామిక విప్లవ ఫలితాలు

3.3.3.1. ఆర్థిక ఫలితాలు

3.3.3.2. సాంఘిక ఫలితాలు

3.3.3.3. రాజకీయ లేక కమ్యూనిస్ట్ మానిఫెస్ట్

3.3.4. ప్రాచీన గ్రామీణ వ్యవస్థ - వ్యవసాయం కారణాలు

3.3.4.1. వ్యవసాయ వాణిజ్యీకరణ

3.3.5. కారణాలు

3.3.6. వాణిజ్యీకరణ ఫలితాలు

3.3.7. నమూనా ప్రశ్నలు

3.3.8. చదువదగిన గ్రంథాలు


## 3.3.1.2. పారిశ్రామిక విప్లవం - దాని ఫలితాలు

విప్లవమనే పదం సామాన్యంగా రాజకీయ వ్యవస్థలోని బృహత్తరమైన మార్పులకు వాడడం పరిపాటి. ఫ్రెంచి విప్లవము, రష్యా విప్లవము, దీనికి ఉదాహరణలు. అయితే ఈనాడు 'విప్లవం' ఒక రాజకీయ రంగానికే పరిమితం కాక, ఇతర రంగాలలో కూడా చోటు చేసుకొంది. రాజకీయేతర రంగాల్లో వచ్చే విప్లవాల వల్ల రక్తపాతం, భయభ్రాంతులు, ప్రాణహాని మొదలైన వాటిని రాజకీయేతర రంగాల్లో వచ్చిన విప్లవాలకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. అంటే ఆయా రంగాల్లో అనతికాలంలో అధికంగా వచ్చే మార్పుకే "విప్లవం" అని అర్థం.

## 3.3.1. పారిశ్రామిక విప్లవం :

18వ శతాబ్దంలో ఐరోపా రాజకీయ విప్లవమునే గాక మహత్తరమైన ఆర్థిక విప్లవమును కూడా చవిచూసెను. కాని ఐరోపాలో కాలనుగుణంగా సంభవించిన శాస్త్రీయ పరిశోధన ప్రభావ ఫలితముగా 18వ శతాబ్ది నాటికి నూతన యంత్రములు కనిపెట్టబడి పరిశ్రమలు

విరివిగా అభివృద్ధి చెందెను. ఇట్లు చేతి పరిశ్రమల స్థానములో యాంత్రిక పరిశ్రమలు నెలకొల్పుట వలన ఐరోపా ఆర్థిక వ్యవస్థలో కనీవినీ ఎరుగని ప్రగతి, మార్పు సంభవించెను. ఆర్థిక వ్యవస్థలో వచ్చిన ఇట్టి విప్లవాత్మకమైన మార్పులనే పారిశ్రామిక విప్లవం అందురు. ఈ పారిశ్రామిక విప్లవము అనుపదమును మొట్టమొదట ఉపయోగించిన వాడు ఫ్రెంచి సోషలిస్టు నాయకుడైన లూయీ బ్లాంక్. ఈ విప్లవాన్ని పారిశ్రామిక విప్లవం అని నామకరణం చేసినవారు కూడా ఫ్రెంచివారే. **1884**లో ఆర్నాల్డ్ టాయన్‌బీ అనునతడు పారిశ్రామిక విప్లవమను పేరుతో ఒక గ్రంథాన్ని వ్రాసినాడు. ఈ గ్రంథ రచనతో ఈ విప్లవానికి విశేష ప్రాచుర్యము వచ్చింది. ఈ విప్లవం ఇంగ్లాండ్‌లో వచ్చినప్పటికీ ఇంగ్లాండుకే పరిమితం కాలేదు. ప్రపంచమంతటా వ్యాపించి ఆర్థిక రంగంలోని మానవ జీవితంలో అద్భుతమైన మార్పులు తెచ్చింది. ఈ విప్లవం నాటితో ఆగలేదు. ఇంకా నేటికిని ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతూనే ఉన్నది.

**3.3.1.1. పారిశ్రామిక విప్లవము - ఇంగ్లాండు :** ఐరోపాలో రాజకీయ విప్లవమునకు ఫ్రాన్స్ జన్మస్థలమైనా, పారిశ్రామిక విప్లవమునకు ఇంగ్లాండ్ జన్మభూమి అయ్యెను. ఫ్రాన్స్ నుండి రాజకీయ విప్లవ జీవములు మిగిలిన ఇంగ్లాండ్ దేశములకు వ్యాపించెను. పారిశ్రామిక విప్లవము ఇంగ్లాండ్ నందే ఆవిర్భవించుటకు కొన్ని ప్రత్యేక కరాణాలు కలవు. అవి ఏమనగా

1. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణము ఇంగ్లాండ్‌లో కలదు. పరిశ్రమల ప్రగతికి అవసరమైన జలశక్తి, ముడి పదార్థములైన ఇనుము, బొగ్గు పుష్కలముగా లభించును. దేశములోని బొగ్గు గనులు ప్రధాన రేవులకు సమీపముగా ఉండుటచే రవాణా సౌకర్యములు సులభతరమయ్యెను.
2. పరిశ్రమల స్థాపనకు, ప్రగతికి అవసరమైన పెట్టుబడి పెట్టు సంస్థలు ఇంగ్లాండు నందుండుట పారిశ్రామిక ప్రగతికి మరో కారణము. నాటి విదేశీ వ్యాపారమంతా ఇంగ్లాండు పైననే ఆధారపడి యుండుటచే ఇంగ్లాండు అత్యధిక లాభముల నార్జించెను. నాటి ఇంగ్లాండు ప్రభుత్వము పారిశ్రామిక వాణిజ్య రంగములను ప్రోత్సహించి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన ధనమును అందించుటకు Bank of England ను స్థాపించెను.
3. 18వ శతాబ్దిలో ఐరోపాలోని సాంఘిక, ఆర్థిక, ఒత్తిడులకు తట్టుకోలేక పరిశ్రమలోని పనివారు, తమ దేశములను వదిలి ఇంగ్లాండుకు వలస వచ్చి అచ్చటనే పట్టు, గాజు, కాగితము, ఉక్కు పరిశ్రమల ప్రగతికి కృషి చేసిరి.
4. సముద్రాంతర వ్యాపారమునకు కావలసిన సాధన సామాగ్రి ఇంగ్లండునకు సమృద్ధిగా నుండుట, తమ ఉత్పత్తులను విదేశీ మార్కెట్లకు సులభతరముగా చేరవేసి అత్యధిక లాభములు పొందుట, రోడ్లు, కాలువల నిర్మాణములు చేపట్టి రవాణా సౌకర్యములందు ఆధునీకరణను చేపట్టుటతో ఇంగ్లాండ్‌లో పరిశ్రమలు అభివృద్ధి చెందెను.
5. పారిశ్రామిక ఉత్పత్తి పక్రియలో నూతన యంత్రములు కనుగొని దేశ ఆర్థిక విధానమును మార్చివేసిన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలను బ్రిటన్ కలిగియుండుట, అనగా సాంకేతిక పరిజ్ఞానము కలిగిన నిపుణులు ఇంగ్లాండ్ నందుండుట వారి పారిశ్రామిక ప్రగతికి మరో కారణము.
6. ఇంగ్లాండునకు తమ వలసల నుండి పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థములు సరఫరా అయినది.
7. బ్రిటీషు ఉత్పత్తులకు ఇంగ్లాండు వలసల యందు గిరాకీ కలిగియుండుట
8. విదేశీయుల నుండి ఇంగ్లాండునకు వచ్చి స్థిరపడిన ధనవంతులు నూతన పరిశ్రమలను స్థాపించుటకు ఉద్యుక్తులగుట, నాటి విదేశీ వ్యాపారము పూర్తిగా ఇంగ్లాండు యాజమాన్యము క్రింద ఉండుట, ఇంగ్లాండునందు కష్టించి పనిచేయగల కార్మికులుండుట మొదలగునవి.

ఈ కారణములు అన్ని ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవము ఆవిర్భవించుటకు దోహదము చేసెను.

## 3.3.2. పరిశ్రమలు :

పై కారణాల వల్లనూ ఇంగ్లాండులో అనేక నూతన యంత్రాలు కనిపెట్టబడి నూతన పరిశ్రమలు నెలకొల్పబడినవి. వానిలో ముఖ్యమైనవి.

**1. నేత పరిశ్రమ :** పారిశ్రామిక విప్లవమున మొదటి యంత్రము నేత పరిశ్రమనందు చోటు చేసికొనెను. నేత పరిశ్రమలలో రెండు ప్రక్రియలు కలవు. అవి నూలు వడుకుట, నేయుట. క్రీ॥శ॥ 1738లో జాన్‌కే 'తురి' అను సాధనమును కనిపెట్టి నేత పని చురుకుగా, అత్యంత వేగముగా సాగునట్లు చేసెను. దీని వలన నూలు ఉత్పత్తి ద్విగుణీకృతమయ్యెను. లాంక్‌షైర్ వాస్తవ్యుడైన జేమ్స్ హార్ గ్రీవ్స్ 'స్పిన్నింగ్ జెన్ని' అనే యంత్రమును కనిపెట్టుటతో నూలు వడుకుట సులభతరమయ్యెను. క్రీ॥శ॥ 1769లో ఆర్క్‌రైట్ గట్టి దారమునేయుట, నీటి శక్తితో నడుచూ 'వాటర్ ఫ్రేమ్' అనే యంత్రమును కనిపెట్టి నూలు వడుకు పద్ధతిలో నూతన ప్రక్రియను కనిపెట్టెను. ఈ రెండు యంత్రములు కనుగొనబడుటతో నూలు పరిశ్రమలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చెను. ఈ రెండు యంత్ర లోపములను తొలగించి, వాటని సమన్వయము చేసి "శామ్యుల్ క్రాంప్టన్" 1779లో "సిన్నింగ్ మ్యూల్" అనే యంత్రమును కనుగొనెను. తదుపరి 'కార్ట్‌రైట్' మరమగ్గమును కనుగొనుటతో నేత పరిశ్రమలో వినూత్నమైన మార్పులు సంభవించి, ఉత్పత్తి అధికమయ్యెను. అంతేగాక విలివిట్నీ అనే అమెరికా శాస్త్రజ్ఞుడు ప్రత్తి నుండి గింజలను వేరు చేయు యంత్రము కనిపెట్టుటతో నేత పరిశ్రమలో ఆధునీకరణ సాధింపబడెను.

**2. ఆవిరి యంత్రము :** జాన్ న్యూకోయన్ అనే సాంకేతికుడు ఆవిరి యంత్రమును కనుగొనెను. దీనిలో అనేక లోపములుండుటచే అది నిరుపయోగమయ్యెను. తదుపరి జేమ్స్ వాట్ 1769లో ప్రత్యేక కండెన్సర్‌ను తయారు చేసి ఆవిరి యంత్రయులోని లోపములను తొలగించుటతో 'ఆవిరి యుగము' అనే నూతన యుగము ప్రారంభమయ్యెను. ఈ ఆవిరి యంత్రమును ఉపయోగించి 'రిచర్డ్ ట్రెవిధిక్' మొదటి సారిగా ఆవిరి రైలు ఇంజనును కనిపెట్టెను. తదుపరి 'జార్జి స్టీవెన్ సన్' నీటి యావిరితో నడుచు రైలు ఇంజనును రూపొందించెను. అచిర కాలముననే ఇంగ్లాండ్ దేశమంతయూ రైలు మార్గములతో నిండెను. ఆవిరి శక్తి సహాయములతోనే రాబర్ట్ ఫుల్‌టన్, నికోలస్, రూజ్‌వెల్ట్ అనువారలు ఆవిరి ఓడలు నిర్మించిరి ఇట్టి ఆవిరి ఓడ ప్రథమముగా సవన్ని నుండి బయలు దేరి అట్లాంటిక్‌ను 13 రోజులలో దాటి లివర్ పూల్‌కు చేరెను.

**3. ఇనుము, ఉక్కు, బొగ్గు పరిశ్రమలు :** ప్రతి దేశములో పరిశ్రమల అభివృద్ధికి ఇనుము, ఉక్కు బొగ్గు ప్రధానమైనవి. ప్రారంభములో కర్ర బొగ్గుతో ఇనుమును కరిగించి, ఇనుప వస్తువులు తయారు చేసెడివారు. నేల బొగ్గుతో ఇనుమును కరిగించు విధానమును 'హెన్రీ కార్ట్' కనుగొనెను. తదుపరి ఉక్కును తయారు చేయు కొలిమి కూడా కనిపెట్టబడెను. నాడు గనుల నుండి నేల బొగ్గును త్రవ్వి తీయుట చాలా ప్రమాదకరముగా నుండెను. బొగ్గును త్రవ్వి తీయు విధానములోని లోపములను నివారించుటకు 'హంఫ్రిడేవి', Safety Lamp ను కనుగొనుటతో ఆ ప్రమాదము నివారింపబడెను. తదుపరి హెన్రీ బెస్సియర్ ఉక్కు పోతపోయు విధానమును కనుగొనుటతో ఉక్కు పరిశ్రమ ఎనలేని విధంగా అభివృద్ధి చెందెను. కనుకనే పారిశ్రామిక యుగానంతరమును ఇనుము, ఉక్కు యుగమని పరిగణించిరి.

**4. వ్యవసాయక విప్లవము :** 18వ శతాబ్ది నాటికి ఐరోపా భూస్వామ్య వ్యవస్థ దాదాపు క్షీణించి భూములు రైతుల పరమయ్యెను. రైతులు వ్యవసాయ రంగమున యంత్రములు ప్రవేశపెట్టి, పంట మార్పిడి విధానమును ప్రవేశపెట్టి అధికోత్పత్తిని సాధించిరి. కనుకనే ఈ యుగమును వ్యవసాయక విప్లవమని కూడా అందురు.

**5. రహదారులు :** పారిశ్రామిక వ్యవసాయక విప్లవములతో పాటు రవాణా సౌకర్యములు కూడా అభివృద్ధి చెందెను. మట్టి రోడ్లకు బదులు కంకర రోడ్లను నిర్మించు పద్ధతిని స్కాటిష్ ఇంజనీరైన జాన్ మెక్‌డమ్ కనుగొనుటతో రహదారి నిర్మాణము విరివిగా సాగెను. కాలములు కూడా రవాణా మార్గములుగా ఉపయోగింపబడినవి.

**6. వార్తా సౌకర్యములు :** పారిశ్రామిక విప్లవము నాటి నుండి సాంకేతిక భౌతిక శాస్త్ర విజ్ఞానము పెరిగి యంత్ర నిర్మాణ ప్రగతి అనూహ్యమైన రంగములకు వ్యాపించెను. 1844లో శ్యాముల్ మోర్స్ టెలిగ్రాఫ్, 1876లో అలెగ్జాండర్ గ్రాహంబెల్ టెలిఫోను కనిపెట్టుట

వార్తా విప్లవముగా పరిగణించవచ్చు. ఇవి కాక అణుశక్తి, తంతి, టెలివిజన్, విద్యుచ్ఛక్తి మున్నగు వానిలో సంభవించిన మహత్తర పరిశోధనలు మానవుని జీవిత స్వరూపమునే మార్చి వేసెను.

ఇట్లు ఇంగ్లాండు నందు ప్రారంభమైన పారిశ్రామిక విప్లవము అనతి కాలముననే జర్మనీ, అమెరికా, ఫ్రాన్స్, రష్యా, జపాన్ దేశములకు వ్యాపించెను, నేడు ప్రతిదేశము పారిశ్రామిక దేశముగా మారుటకు ఉవ్విళ్ళూరుట గమనార్హము.

## 3.3.3. పారిశ్రామిక విప్లవ ఫలితములు :

పారిశ్రామిక విప్లవము ఐరోపా చరిత్రయందేగాక విశ్వమానవ చరిత్ర మందు సైతము గణనీయమైనది. ఈ విప్లవము ప్రపంచ ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగములలో అనూహ్యమైన మార్పులు చేసెను. ఈ విప్లవము వలన మానవాళికి అనంత సౌఖ్యములు లభించుటయే గాక అనంత క్లిష్ట సమస్యలను కూడా సృష్టించెను. పారిశ్రామిక విప్లవ ఫలితములను మూడు భాగాలుగా విభజించవచ్చును. 1) ఆర్థిక ఫలితములు 2) సాంఘిక ఫలితములు. 3) రాజకీయ ఫలితములు.

### 3.3.3.1. ఆర్థిక ఫలితములు :

1) యాంత్రిక శక్తితో వస్తువుల ఉత్పత్తి ఎన్నో రెట్లు పెరిగెను. తత్ఫలితముగా వస్తువుల ధరలు తగ్గి ఐరోపాలో వినియమము పెరిగెను. ఉత్పత్తికి తగిన వినిమయము ఐరోపాలో లేనందున ఐరోపా దేశములు ముఖ్యముగా ఇంగ్లాండ్ ముడి సరుకులను, మిగులు సరుకులను విక్రయించుటకు ఖండాంతర వ్యాపారము చేయవలిసివచ్చెను. ఈ ఖండాంతర వ్యాపారమే వలస రాజ్య స్థాపనకు తద్వారా సామ్రాజ్య వాదమునకు దోహదము చేసి అనేక యుద్ధములకు దారి తీసెను. ఇట్టి సామ్రాజ్య వాదమునకు ఆసియా, ఆఫ్రికా ఖండములు బలియైనవి.

2. పారిశ్రామిక రంగమునకు ముడిసరుకులు అవసరమగుట వలన వ్యవసాయము, గొర్రెల పెంపకము మొదలగునవి బాగుగా అభివృద్ధి చెందెను.

3. పరిశ్రమల స్థాపనకు అపార ధనము అవసరమగుట వలన ఐరోపాలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఈ విప్లవము దోహదము చేసెను.

4. పెట్టుబడిదారులు అధిక లాభముల నాశించి జాతీయ స్వయం సంవృద్ధి విధానమునకు స్వస్తి చెప్పి దేశీయ, అంతర్జాతీయ స్వేచ్ఛా వ్యాపారమును కొనసాగించిరి.

### 3.3.3.2. సాంఘిక ఫలితములు :

1) రహదారులు, తంతి, తపాలా మున్నగు వార్తా సౌకర్యములు, అనేక పారిశ్రామిక వస్తువులు సామన్య మానవునికి సైతము అందుబాటులో ఉండుట వలన మానవ జీవితము సుఖప్రదమయ్యెను.

2. పారిశ్రామికాభివృద్ధిలో పెద్ద పెద్ద పట్టణములు, నగరములు వెలసెను. తత్ఫలితముగా వ్యవసాయ రంగము దెబ్బ తినుటయే గాక ప్రజలు గ్రామిణ ప్రాంతములు వదలి పట్టణ ప్రాంతములకు వలసపోయిరి. పట్టణములలో దుర్భరమైన జీవితము గడుపవలసి వచ్చెను.

3. పెద్ద పెద్ద పరిశ్రమల స్థాపన వలన చేతి, చిన్న తరహా పరిశ్రమలు నాశనమై అసంఖ్యాక ప్రజలు నిరుద్యోగులైరి. ఇట్లు పారిశ్రామిక దేశయులందు ఈ విప్లవము "నిరుద్యోగ సమస్య" అనేది క్లిష్ట సమస్యకు మూల కారణమయ్యెను.

4. ఈ విప్లవము వలన ఐరోపా సాంఘిక వ్యవస్థలో పెట్టుబడిదారీ వర్గము కార్మిక వర్గము అను రెండు వర్గములేర్పడెను. పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, వడ్డీ వ్యాపారస్తులు, పెట్టుబడిదారీ వర్గము కాగా అనేక పరిశ్రమలలో, వ్యవసాయ క్షేత్రములలో పనిచేయువారు కార్మిక వర్గమైరి. పెట్టుబడిదారీ వర్గమునే కమ్యూనిష్టులు "బూర్జువా వర్గమని" పిలుతురు. మొదట ఈ రెండు వర్గముల మధ్య సఖ్యత యున్నను, కాలక్రమమున ఈ రెండు వర్గముల మధ్య తీవ్ర భేదములు చెలరేగి వర్గ సంఘర్షణకు దారి తీసెను.

5. పారిశ్రామిక వేత్తలు అధిక లాభములను గడించుటకై కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించసాగిరి. తత్ఫలితమే సాంఘిక సమస్యలైన ఎ) స్త్రీలను, బాలురను ఫ్యాక్టరీలందు నియమించుట బి) దీర్ఘ కాలపు పని గంటలు సి) అతి స్వల్ప వేతనములు, డి) మురికి వాడల అభివృద్ధి, అనారోగ్య పరస్థితులు మొదలగునవి.

6. ఇట్టి సాంఘిక దురాచారములను నివృత్తి చేయుటకే అనేక మంది మానవతావాదులు, కాల్పానిక వాదులు, సామ్యవాదులు అనేక ఉద్యమములు సాగించిరి ఉదా :

ఎ) జాన్‌వెస్లీ మెథడిస్టు ఉద్యమమును సాగించెను

బి) లార్డ్‌షాఫ్ట్స్‌బరీ బాలురు ఫ్యాక్టరీ యందు పని చేయుటకు తీవ్రముగా ప్రతిఘటించెను.

సి) రాబర్ట్ ఓవెన్ కార్మికులలో మానసిక చైతన్యమును కలిగించి, కార్మిక సంఘాలను ఏర్పరచి వారు తమ సమస్యలు పరిష్కరించుటలో సమైక్యముగా పోరాడుటకు దోహదము చేసెను.

### 3.3.3.3. రాజకీయ ఫలితములు (లేక) కమ్యూనిస్టు మానిఫెస్టో :

సంఘమున కార్మిక వర్గము ఏర్పడుటతో వారు తమ సమస్యలను పరిష్కరించుకొనుటకు రాజకీయ అధికారము కైవసము చేసుకొన నెంచిరి. ఇట్టి కార్మిక వర్గ రాజకీయాధికార కాంక్షకు ముఖ్య కారకుడు, సామ్యవాద పితామహుడు అయిన కారల్ మార్క్స్ జర్మనీయందు యూదు కుటుంబమున జన్మించెను. మితి మీరిన పెట్టుబడిదారీ విధానమే సామ్రాజ్య వాదము అని మార్క్స్ అభిప్రాయము. ఇతడు గొప్ప పత్రికా రచయితగా పేరు మోసిన తన మిత్రుడు ఏంజెల్స్ సాయముతో 1848లో "కమ్యూనిస్టు మానిఫెస్టో" అను గ్రంథమును రచించెను. ఈ గ్రంథమందు మార్క్స్ 'వర్గ సంఘర్షణ అని వార్యమని, ఈ సంఘర్షణలో అంతిమ విజయము కార్మికులదేనని పెట్టుబడిదారుల పతనము తప్పదని అందుకు విప్లవ విధానమును అనగా బల ప్రయోగమును అనుసరింపవలెనని" ప్రవచించెను. ఇంకనూ విప్లవము వలన కార్మికులు పోగొట్టుకొనునది దాస్య శృంఖలము తప్ప మరేమి లేదని, వారు విశ్వమంతటిని జయింపవలసి ఉన్నది గనుక "ప్రపంచ కార్మికులారా ఏకం కండు" అని ప్రభోధించెను. మార్క్స్ ప్రవచించిన సామ్యవాద సిద్ధాంతము కార్మిక విప్లవములకు, కమ్యూనిష్టులకు వేద వాక్కులు. ఇంకనూ సెయింట్ సైమన్, రాబర్ట్ ఓవెన్, ఛార్లస్ ఫూరియర్, సామ్యవాదులు ఐరోపాలో కలరు. వీరి సామ్యవాద సిద్ధాంత ప్రభావ ఫలితంగా 1848 సంవత్సరములో ఫ్రాన్సు నందు ప్రజ్వరిల్లిన విప్లవమందు పాల్గొని కార్మికులు విజేతలైరి. తదుపరి 1917 లో రష్యా కమ్యూనిష్టు విప్లవము కూడా వీరి సిద్ధాంత ఫలితమే.

ఇట్లు పారిశ్రామిక విప్లవము వలన కమ్యూనిజం జనించెను. కాని కమ్యూనిజం 'కాల్పనిక సిద్ధాంతమని, శాస్త్రీయ వినాశనకారియని, దుఃఖితుల మతమని, సర్వత్రా గోప్యమని, జోసఫ్ ప్రూధాన్ దుయ్యబట్టెను. ఏమైనను నేడు కమ్యూనిజం అంతర్జాతీయ రంగమున బలీయమైన శక్తిగా మారెననుట నిర్వివాదాంశం.

## 3.3.4. ప్రాచీన గ్రామీణ వ్యవస్థ - వ్యవసాయం :

దాదాపు 19వ శతాబ్ది ప్రథమార్థం వరకూ భారతీయ గ్రామీణ వ్యవస్థ స్వయం పోషకమై స్వయం సమృద్ధమై ఉండేది. గ్రామంలోని భూములన్నింటిపైన గ్రామస్థులందరికి సాముదాయకంగా ఆస్థి హక్కు ఉండేది. గ్రామ పెద్దలు భూములను వ్యవసాయార్థం రైతుల మధ్య పంపకం చేయడం, జలాధారాలను వ్యవసాయానికి కావలసిన ఇతర వనరులను నిర్మాణం చేసి వాటిని తగిన స్థితిలో ఉంచడం, వ్యవసాయాన్ని అన్ని విధాలా నియమబద్ధం చేయడం సంప్రదాయంగా ఉండేది. గ్రామానికి వివిధములైన పంటలను కావలసినంతవరకు రైతులు పండించేవారు. ఉన్నప్పటికి దాని ప్రభావం తక్కువ గ్రామంలోని కమ్మర్లు, కుమ్మర్లు మున్నగు చేతి వృత్తులు వారు తాము తయారుచేసిన వస్తు సామాగ్రిని రైతులకు అందచేసి వాటికి బదులుగా రైతుల నుండి ధాన్యాదులను గ్రహించి తమ జీవితం సాగించుకొనేవారు. ఆ విధంగా ఏ గ్రామానికి ఆ గ్రామం స్వయం సమృద్ధంగాను, స్వయం పోషకంగాను ఉండేది. వ్యవసాయమంతా గ్రామీణ వ్యవస్థతో ముడిపడి ఉండటం గుర్తించవలసిన విషయం వ్యవసాయానికి సంబంధించినంత వరకూ చెప్పుకోదగిన వాణిజ్యం జరిగేదికాదు. అడపాదడపా ధాన్యవర్తకుడో, వస్త్ర వర్తకుడో

ఒక గ్రామము యొక్క మిగులు ఉత్పత్తిని మరొక గ్రామానికి అందచేయడం తప్ప గ్రామానికి బయట ప్రపంచంతో పెద్ద సంబంధం ఉండేదికాదు. ప్రతి గ్రామమూ తనకు కావలసిన ప్రత్తిని, నూనె గింజలనూ తాను పండించుకొనేది. అయితే ప్రత్తి చెరకు అన్ని ప్రాంతాలల్లోనూ పండేవి కావు. కనుక ఆ రెండు ఉత్పత్తులపై వాణిజ్యం కొన్ని ప్రాంతాలకు పరిమితమై ఉండేది. అంటే స్వయం సమృద్ధమైన వ్యవస్థలో డబ్బు అవసరం పెద్దగా ఉండేది కాదు. సాధారణంగా ద్రవ్య వినిమయానికి బదులు ధాన్య వినిమయం జరుగుతూ ఉండేది.

**3.3.4.1. వ్యవసాయ వాణిజ్యీకరణ :** దేశంలో ఆంగ్ల పాలన ఏర్పడిన పిమ్మట వారు తమ స్వార్థసిద్ధి కొరకు దేశ ఆర్థిక వ్యవస్థనే తలక్రిందులు చేసారు. తమ భూమి శిస్తు విధానాల ద్వారా జమిందార్లకు కొన్ని ప్రాంతాల్లోను, రైతులకు, కొన్ని ప్రాంతాల్లోను ఆస్థి హక్కు కల్పించి గ్రామ సాముదాయక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం తాండవించేటట్లు చేసారు. 1813లో కంపెనీవారి ఏకస్వామ్యం రద్దయిన పిమ్మట బ్రిటిష్ వ్యక్తిగత ఉద్యమదారుల ద్వారా బ్రిటిష్ మూలధనం ఇండియాలోనికి ప్రవేశించింది. ఇంగ్లండ్ నుండి దిగుమతి అగుచున్న వస్తువులకు పోటీగా పరిశ్రమలను ఇండియాలో స్థాపించడమూ, అట్టివానిలో ధనాన్ని పెట్టుబడి పెట్టడమూ నిషేధించబడింది. కనుక ఇంగ్లండు నుండి వచ్చే మూలధన మంతా నీలి మందు, తేయాకు, కాఫీ తోటలు పెంపకం పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడం జరిగింది. భారతీయ వ్యవసాయ వాణిజ్యీకరణ ఈ తోటల పెంపకంతో ప్రారంభమైందని చెప్పవచ్చు. అయితే 1860 తరువాత అనేక కారణాల వల్ల భారతీయ గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు ఏర్పడ్డాయి. వ్యవసాయం యొక్క లక్ష్యం స్వయం పోషకత నుండి వాణిజ్యం వైపు మళ్ళింది. రైతు కేవలం తన గృహావసరాల కోసం పంటలు పండించే పద్ధతికి స్వస్థి చెప్పి ఎగుమతుల నిమిత్తమై పండించడం ప్రారంభించాడు. నీలి మందు, తేయాకు, కాఫీ, జనుముకు తోడు పొగాకు, వేరుశనగ, బంగాళాదుంప వంటి క్రొత్త రకం పంటలు వాణిజ్య ప్రయోజనం నిమిత్తమై దేశంలో ప్రవేశించాయి. రవాణా సౌకర్యాల అభివృద్ధి పట్ల పెంపొందిన విదేశీ వాణిజ్యం వ్యాపార పంటలకు మరింత దోహదం కలిగించాయి. వాణిజ్య పంటలు ఎక్కువ లాభదాయకమని రైతు గుర్తించాడు. ఈ విధంగా భారతీయ వ్యవసాయపు వాణిజ్యీకరణ స్థిరపడింది. ప్రత్తి, జనుము, నీలిమందు మున్నగు వాణిజ్య పంటలు అంతకుముందు కూడా లేకపోలేదు. ప్రతి గ్రామంలోనూ అవి గ్రామ అవసరాలకు తగినట్లుగా పరిమితంగా పండింపబడేవి. గ్రామ ప్రజలకు సరిపడ ఆహారధాన్యం పండించవలసి ఉండటం వల్ల అప్పుడు వాణిజ్య పంటలకు అవకాశం ఉండేది కాదు. 1860 తరువాత పంటల స్థానికీకరణ వాణిజ్యీకరణతో బాటు పెంపొందింది. సాగునీటి సౌకర్యం కల్పించబడిన దక్కన్‌లో చెరుకు, బీహార్‌లో ప్రత్తి, బెంగాల్ జనుము, పంజాబ్ కాలువ కాలనీలలో గోధుమ వాణిజ్య ప్రయోజనాల నిమిత్తమై స్థానికీకరణ పొందాయి.

## 3.3.5. కారణాలు :

**ఎ) రవాణా సౌకర్యాలలో విప్లవాత్మకమైన మార్పు :** రవాణా సౌకర్యాలలో సంచార మార్గాలలో వచ్చిన విప్లవాత్మకమైన పరిణామం భారతీయార్థిక అభివృద్దికి ప్రోద్బలం కలిగించింది. తత్ఫలితంగా అంతర్దేశీయ వ్యాపార వాణిజ్యాలకు ప్రోత్సాహమేర్పడింది. వ్యవసాయ వాణిజ్యీకరణకు కూడా ఈ సౌకర్యాలే ఎక్కువగా తోడ్పడ్డాయి. రైల్వేల నిర్మాణం త్వరితగతిన పెరిగిపోయింది. 1859లో 432 మైళ్ళు వ్యాపించిన రైలు మార్గాలు 1881 నాటికి 1990 మైళ్ళకు, 1901 నాటికి 25,363 మైళ్ళకు విస్తరించింది. పనిలో పనిగా రోడ్ల నిర్మాణం కూడా చురుకుగా చేపట్టారు. బొంబాయి నుండి ఆగ్రా వరకు, బెనారస్ నుండి ఢిల్లీ వరకు జాతీయ రహదారుల నిర్మాణం 1853 నాటికి పూర్తయింది. రైల్వే, రోడ్డు రవాణా సౌకర్యాల వల్ల వ్యవసాయ ఉత్పత్తులు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి సురక్షితంగా, వేగంగా సరఫరా అయ్యాయి. ఇవి వివిధ రేవు పట్టణాల నుండి ప్రపంచ దేశాలన్నింటికీ రవాణా అయ్యాయి. ప్రతి రైల్వేస్టేషనూ ఒక మండీగా రూపొందింది.

**బి) సూయజ్ కాలువ నిర్మాణం :** 1869లో సూయజ్ కాలువను రవాణాకు ప్రయాణాలకు అందుబాటులోనికి తెచ్చారు. ఈ సంఘటన ప్రపంచ వ్యాప్తమైన ప్రాముఖ్యతను సంతరించుకొంది. ఈ కాలువ నిర్మాణం ఇండియా, ఇంగ్లాండుల మధ్య సముద్ర మార్గాన్ని మూడువేల మైళ్ళకు పైగా తగ్గించింది. లండన్ నుండి కలకత్తాకు ప్రయాణ కాలంలో 36 రోజులు తగ్గించింది. ఇది ఇండియా విదేశీ వాణిజ్యానికి బాగా ఉపకరించింది.

**సి) నౌకా పరిశ్రమలో మార్పులు - మాంద్యం :** 1869 నుండి నౌకాయానమునకు స్టీమర్ల ఉపయోగం హెచ్చి దూర ప్రయాణాలకు వెనుకటి ఓడలను ఉపయోగించడం మానివేసారు. సూయజ్ కాలువ నిర్మాణం తరువాత ఇండియా, ఇంగ్లండ్‌ల నడుమ దూరం తగ్గి అనేక నౌకలు నిరుపయోగమైనాయి. ఈ పరిస్థితి నౌకా సంస్థల మధ్య పోటీకి దారి తీసి రవాణా రేట్లు పడిపోయాయి. సూయజ్ కాలువ ప్రారంభించిన తరువాత 12 సంవత్సరాలలో కలకత్తా నుండి లండన్‌కు రవాణా చార్జీలు టన్నుకు 55 షిల్లింగుల నుండి 27 షిల్లింగులకు పడిపోయింది.

**డి) అమెరికా సంయుక్త రాష్ట్రాల అంతర్యుద్ధం :** భారతీయ వ్యవసాయ వాణిజ్యీకరణకు ఎక్కువగా కారణభూతమైనది 1860 నుండి 1865 వరకూ సాగిన అమెరికా సంయుక్త రాష్ట్రాల అంతర్యుద్ధం. ఆ యుద్ధం ఫలితంగా అమెరికా ప్రత్తి సరఫరా ఆగిపోయినందువల్ల ఇండియా ప్రత్తికి ఇంగ్లాండులో గిరాకీ అధికమై ఈ ప్రత్తి ఎగుమతి ఒక్కసారిగా పెరిగిపోయింది. 1859లో అయిదు లక్షల బేళ్ళ ప్రత్తి ఎగుమతి కాగా 1865లో 12.6 లక్షల బేళ్ళు ఎగుమతి అయ్యింది. దానితో బాటు బియ్యం, గోధుమ మున్నగు ఆహార ధాన్యాల ఎగుమతి అయ్యింది. అమెరికాలో యుద్ధం ముగిసి శాంతి కుదుర్చుకున్న తరువాత వ్యవసాయ ఉత్పత్తులకు గల ఈ గిరాకీ దేశంలో వ్యవసాయ వాణిజ్యీకరణకు తోడ్పడింది. దేశంలోని భిన్న ప్రాంతాలలో వివిధములైన పంటలు వాణిజ్య దృష్టితో పండింపబడుతూ స్థానికీకరణ చెందాయి.

## 2) నగదు అవసరం :

పూర్వ రైతులు తమ పంటను గ్రామం వెలుపల అమ్మి లాభాలను గడించే అవకాశం గాని, అవసరంగాని ఉండేది కాదు. కాని బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన భూమిశిస్తు విధానాల ఫలితంగా ఇట్టి అవసరమూ, అవకాశమూ ఉండేది. ప్రభుత్వానికి చెల్లించవలసిన భూమి శిస్తు నగదు రూపంలో చెల్లించడానికి రైతులు తప్పని సరిగా తమ పంటలలో కొంత భాగాన్ని విక్రయింపవలసి వచ్చింది. షావుకార్లకు చెల్లించవలసిన వడ్డీ కూడా నగదు రూపంలో ఉండేవి. అందుచేత రైతులు తమ పంటలో కొంత భాగాన్ని విధిగా సమీపంలోని వర్తక కేంద్రాలకు పంపి అమ్మే అలవాటుకు లోబడ్డారు. దీని ఫలితంగా వారికి బాహ్య ప్రపంచంతో సంబంధం ఏర్పడి వ్యవసాయ వాణిజ్యీకరణ అధికరించింది. రైతులు ఇంగ్లండుకు ఆహార ధాన్యాలు ఎగుమతి చెయ్యడం ద్వారా మార్కెట్ సమస్యను ఎదుర్కొనే వారు.

## 3) సాగునీటి సౌకర్యాల పెంపు :

బ్రిటీష్ వారు ఏర్పరచిన నీటి పారుదల సౌకర్యాల కారణంగా కూడా రైతులు వ్యవసాయ వాణిజ్యీకరణ అవలంభించారు. పెరిగిన నీటి తీరు వాలను చెల్లించి డబ్బు మిగుల్చు కోవడానికి చెరకు వంటి వాణిజ్యపంటలే లాభదాయకమని గుర్తించిన రైతులు వెలుపలి మార్కెట్ కోసం ప్రత్యేకింపబడిన పంటలు వృద్ధి చేసారు. తుదకు అన్ని పంటలూ స్థానికావసరాలకూ కూడా వెలపలి మార్కెట్ కోసమే పండింపసాగారు.

**1) ఆంగ్లేయుల ప్రోత్సాహం :** నగదు పంటల సత్వరాభివృద్ధి ఆంగ్ల పాలకులకు, పారిశ్రామికులకు సంతోషదాయకమైంది. కంపెనీవారి వాణిజ్య ప్రయోజనాలకు నీలి మందు, తేయాకు, కాఫీ, నల్లమందు మున్నగు వాని పెంపకం ఎగుమతులు అత్యావశ్యకమైనాయి. బ్రిటన్‌లోని భారీ పరిశ్రమలకు కావలసిన ముడి సరుకులకై వారు తహతహలాడుతూ అందుకవసరమైన వాణిజ్య పంటలను ప్రోత్సహించారు. ముఖ్యంగా భారీ పరిశ్రమలకు కావలసిన ప్రత్తి, జనుము మొదలైన ముడి సరుకుల ఉత్పత్తిని ఇండియాలో వృద్ధి చేయడం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించి దానికి కావలసిన సదుపాయాలను కల్పించారు.

**2) వాణిజ్య మధ్యవర్తుల కార్యకలాపాలు :** వాణిజ్య మధ్యవర్తుల వర్గం ఒకటి తయారై వివిధ వ్యవసాయక ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ రైతులకు హెచ్చు లాభదాయకమైన వాణిజ్య పంటలను పండించవలసిందిగా ప్రోత్సహించసాగారు. రాబోయే సంవత్సరపు వాణిజ్య పంటకై వారు రైతులకు అడ్వాన్సు నిచ్చేవారు. వాణిజ్య పంటలను అమ్మగా వచ్చిన నగదులో కుటుంబావసరాలకు తగిన ధాన్యాదులను కొనడం శ్రేయస్కరమని రైతులు విశ్వసించారు.

**3) వాణిజ్య పంటల వ్యాప్తి :** నిజానికి నగదు పంటల ఉత్పత్తి 18వ శతాబ్దాంతంలోనే ప్రారంభమైంది. ఇది తొలుత నీలి మందు తోటలలో మొదలైంది. ఈస్టిండియా కంపెనీ వర్తకులు బలవంతంగా రైతుల భూములను ఆక్రమించి వారి చేత నీలిమందు తోట సాగుచేయించేవారు. నీలిమందు ధరలను కూడా వారే చిత్తం వచ్చినట్లు నిర్ణయించేవారు. ఈ దమన కాండకు వ్యతిరేకంగా 1859లో బెంగాల్ రైతులు తిరుగుబాటు చేసారు. చౌకరకపు సింథెటిక్ నీలి మందు కనుగొన్న తరువాత నీలి మందు సాగు తగ్గిపోయింది.

ఆది నుండి భారీ ఎత్తున ఉత్పత్తి చేయబడుతూ వచ్చిన నగదు పంట తేయాకు. తేయాకు తోటల పెంపకంలోనే వ్యవసాయక మూలధనం, పెట్టుబడి రూపు దాల్చింది. తేయాకు తోటల్లో పనిచేసే కూలీలు బానిసలు కంటే హీనంగా జీవించారు. తేయాకు పెంపకం, వ్యాపారం అతి వేగంగా అభివృద్ధి చెందింది. 1859 నాటికి సాలుకు 12,05,689 పౌనుల తేయాకు ఉత్పత్తి అయింది. ఈ అభివృద్ధి వల్ల అస్సాములోని పొలాలకై ఉత్పత్తిదారులలో పై పోటీ కలిగి, భూమి విలువ అధికరించింది. క్రమేణా ఇతర నగదు పంటలు కూడా వృద్ధి పొందాయి. వానిలో జనుము, పొగాకు, ప్రత్తి, చెరకు, నూనె గింజలు చెప్పదగినవి. బ్రిటన్‌లోని వస్త్ర పరిశ్రమ ముడి ప్రత్తిపై ఆధారపడింది. గనుక ఉత్తమ రకం ప్రత్తిని ఇండియాలో పండించాలని ఆంగ్లేయులు సంకల్పించారు. ప్రత్తి పంటకు ప్రోత్సాహమిచ్చే ప్రభుత్వ విధానం కంపెనీవారి పరిపాలనా కాలంలోను, అటుపిమ్మట కూడా అనుసరింపబడింది. ఈ విధంగా ప్రత్తి, నీలిమందు, నల్ల మందు, తేయాకు, కాఫీ మున్నగు పంటలను విస్తరించడం జమీందార్లకూ, సామాన్య వర్తకులకు కూడా లాభదాయకమైనదని రాజరామమోహన్ రాయ్ వంటి ప్రముఖులు ప్రశంసించారు.

## 3.3.6. వాణిజ్యీకరణ ఫలితాలు :

**ఎ) భారతీయ గ్రామీణ సామాజిక ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం :** వ్యవసాయ వాణిజ్యీకరణ ఫలితంగా భారతీయ గ్రామీణ సామాజిక ఆర్థిక వ్యవస్థ తారుమారైంది. గ్రామం తనకు కావలసిన ఆహార ధాన్యాలు ఇతర జీవితావసరాలకై స్వయం సమృద్ధంగా ఉండవలసిన అవసరం లేకపోయింది. రైతులు తమ వ్యవసాయోత్పత్తులను తీసుకొని పోయి అమ్మి ఆ నగదుతో తమకు అవసరమై వస్తువులను కొని తెచ్చుకొనే జాతీయ మార్కెట్ ఏర్పడింది. రైళ్ళు, రహదార్లు మూలంగా రైతులలో వ్యాపారదృష్టి, బాహ్య ప్రపంచం తోటి సంబంధం మరింత బలపడింది. తమ బాగోగులకు తమ గ్రామం ఒక్కటే అధికారం అనే భావం సన్నగిల్లింది. గ్రామీణ సాముదాయక వ్యవస్థ నిర్జీవం కావడానికి వాణిజ్యీకరణ ముఖ్య కారకమైంది.

**బి) ఇండియా వ్యవసాయక ఉత్పత్తులకు విదేశాలలో గిరాకీ :** ఇండియా వ్యవసాయక ఉత్పత్తులకు విదేశాలలో గిరాకీ ఉండటం వల్ల వస్తువుల ధరలు క్రమంగా పెరగసాగాయి. 1860లో ఇండియా ఎగుమతులు రెండు కోట్ల రూపాయలుండగా, అది 1880లో 69 కోట్లకు 1907లో 166 కోట్లకు పెరిగింది. మార్కెట్ గిరాకీ, ధరలను బట్టి రైతు వ్యవసాయం చెయ్యసాగాడు. విదేశీ మార్కెట్టును బట్టి ఇండియా రైతుల అదృష్టం మారుతూ వచ్చింది.

**సి) చేతి పని వాండ్ర నిరుద్యోగం :** బ్రిటన్ తయారీ వస్తువులు స్వదేశీ వస్తువుల కంటే చౌకగా ఉండడం వల్ల గ్రామ ప్రజలు కూడా వాటినే కొనసాగారు. చేతి పనివాండ్రు చేసే వస్తువులకు గిరాకీ తగ్గింది. చేతి పనివారికి రైతులకూ మధ్య యుగయుగాలుగా ఏర్పడిన సంబంధం దీనితో అడుగంటింది.

**డి) ఆహార ధాన్యాల అమ్మకం :** పూర్వం ఆహార ధాన్యంలో తినగా మిగిలిన వానిని పాతర్లలో గరిసెలలోను దాచి ఉంచేవారు. వాణిజ్యీకరణ వల్ల ఆహారధాన్యము కూడా కళ్లాలలోనే అమ్మసాగారు. ఫలితంగా కరువు సమయాల్లో ఆహారపు కొరత ఏర్పడి ప్రజలు బాధలు పడ్డారు.

**ఇ) నగదు పంటల వ్యాప్తి :** నగదు పంటల వల్ల లాభాలు హెచ్చుగా రావడం వల్ల రైతులు ఆ పంటలనే విరివిగా పండించసాగారు. 1896 నుండి 1946లోపల నగదు పంటలు 85% వృద్ధి పొందాయి. వాణిజ్య పంటల యెడ వహించిన శ్రద్ధ కారణంగా క్రొత్త వంగడాలు, రసాయనిక ఎరువులు, మేలు రకం విత్తనాలు ప్రవేశించాయి.

**యఫ్) రైతుల ఋణభారం :** నగదు పంటలు లాభదాయకమైనా వాటి సాగుకు కొంత పెట్టుబడి అవసరమై రైతులు ఋణదాతలను ఆశ్రయింపక తప్పలేదు. రైతుల అవసరాలను బట్టి ఋణదాతలు వడ్డీరేట్లను కూడా పెంచి వ్యవసాయక ఆదాయాన్ని దోచుకున్నారు.

## 3.3.7. నమూనా ప్రశ్నలు

1. పారిశ్రామిక విప్లవము - దాని ఫలితాలను వివరించండి ?
2. ప్రాచీన గ్రామీణ వ్యవస్థ - వ్యవసాయాన్ని వివరించండి ?
3. పారిశ్రామిక విప్లవ ఫలితములు

## 3.3.8. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Nationalism and Colonialism in Modern India, New Delhi, 1979 |
| 2. | Bipin Chandra, | : | Modern India, New Delhi, 1971 |
| 3. | Percival Spear, | : | A History of India, Vol. 2, Harmondsworth, 1978 |
| 4. | Sumit Sarkar, | : | Modern India, 1885 - 1947, Delhi, 1983 |
| 5. | Alladi Vaidehi, | : | History of Freedom Movement in India, Hyderabad 1991 |
| 6. | Heimsath, | : | Indian Nationalism and Hindu Social Reform, Princeton, 1964 |
| 7. | Vma Kaura, | : | Muslims and Indian Nationalism, New Delhi, 1977 |
| 8. | Mc lane, Indian | : | Nationalism and the Early Congress, Prination, 1977 |
| 9. | Anil Seal, The | : | Emergence of Indian Nationalism, Cambridge, 1967. |
| 10. | K.K. Datta | : | A Social History of Modern India |
| 11. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 12. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern India. |
| 13. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of India, Vols. 2 Irfan Habib |
| 14. | Sumit Sarkar | : | Modern India 1885-1947 |
| 15. | R. Plame Dutt | : | Indian Today |
| 16. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 17. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 19. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 19. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 20. | S.C. Raychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |

## పాఠం - 3.4

# ఆంగ్లేయుల పాలనలో భారతీయ వ్యాపారం క్షీణించిన విధము

### 3.4.0. లక్ష్యం :

ఆంగ్ల పాలనలకు పూర్వం భారతీయ వ్యాపారం, ఆంగ్ల పాలనలో దేశీయ, విదేశీయ వ్యాపార క్షీణతను గురించి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయసూచిక :


3.4.1. ఆంగ్ల పాలనకు పూర్వం భారతీయ వ్యాపారం

3.4.1.1. దేశీయ వ్యాపారం

3.4.1.2. విదేశీ వ్యాపారం

3.4.1.3. వర్తక వర్గాలు - విత్త విధానం

3.4.2. ఆంగ్ల పాలనలో దేశీయ క్షీణత

3.4.1.1. కంపెనీ వారి ఏకస్వామ్యం

3.4.1.2. సుంక విధానం

3.4.3. ఆంగ్ల పాలనలో విదేశీ వ్యాపార క్షీణత

3.4.3.1. స్వేచ్ఛా వాణిజ్య విధానం వల్ల కలిగిన మార్పు

3.4.3.2. విదేశీ వ్యాపార ఋణ శేషం

3.4.3.3. విదేశీ వ్యాపార ఋణ శేష వ్యతిరేకతకు నివారణలు

3.4.3.4. డ్రెయిన్

3.4.4. నమూనా ప్రశ్నలు

3.4.5. చదువదగిన గ్రంథాలు


### 3.4.1. ఆంగ్ల పాలనకు పూర్వం భారతీయ వ్యాపారం :

**3.4.1.1. దేశీయ వ్యాపారం :** ఆ కాలంలో గ్రామాల లోపల, వెలుపల కూడా కొంత వ్యాపారం జరిగేది. ధాన్య వర్తకుని అంగడి ఉండేది. ఆ వర్తకుడే ఒక విధమైన బ్యాంకరుగా కూడా వర్తించేవాడు. వారంలో నిర్దిష్టమైన ఒక రోజు పెద్ద గ్రామాలలో సంత ఏర్పాటుచేసేవారు గ్రామాల్లో లభ్యంకాని వస్తువులను కొనుక్కోవడానికి ఇది ఉపకరించేది. దగ్గరలోను, దూర ప్రదేశాలలోను ఉన్న వర్తకులు ఈ సంతకు వచ్చి ప్రధానమైన వీధికి రెండు వైపులా తమ వస్తువులను ఏర్పరచి ప్రదర్శించేవారు. సంవత్సరానికి ఒక సారి ఏర్పడే పశువుల సంత ఎద్దులను, ఆవులను, కోడెలను కొనడానికి, అమ్మడానికి అవకాశం కల్పించేది. భూమి శిస్తును ద్రవ్యరూపంలో చెల్లించవలసిన రైతులు తమ మిగులు పంటను ధాన్య వర్తకుని వద్దకుగాని లేక పరిసరాలలోని బజారుకుగాని కొనిపోవలసి వచ్చేది. ఈ వ్యవహారం రైతుకు అత్యగత్యమైన

అవసరం కావడం వల్ల వర్తకునికి లాభదాయకంగా నడిచేది. ఈవిధంగా గ్రామంలో ఉత్పత్తి అయిన దానిలోని కొంత భాగం పదార్థాలు అవశ్యకమై ఉన్న పట్టణ ప్రదేశాలకు చేరేవి. కాని ఇది చాలా వరకు ఏక పక్షమైన వ్యాపారం శిస్తు రూపంలో బయటికి ప్రవహించి పోయిన ద్రవ్యానికి బదులుగా గ్రామానికి లభించింది. ఏమీలేదు. కనుక ప్రతిఫల శూన్యమైన ఎగుమతి అన్న ప్రతికూల పరిస్థితి గ్రామసేవలు లోనైనాయి. గ్రామాల స్వయం పోషక సమర్థత ఒకవైపూ, పట్టణాల పారిశ్రామిక మాంద్యం మరొకవైపు దేశీయ వ్యాపారాభివృద్ధిని నిరోధించాయి.

బాహ్య ప్రదేశాల నుండి గ్రామాలు దిగుమతి చేసుకోవలసింది ఏమీలేదు. గ్రామాలు ఎగుమతి చేసేవి స్వల్ప ధరలు వచ్చే పదర్థాలు. ఈ కారణము వల్ల దూర ప్రదేశాల అంతర వ్యాపారం ఎప్పుడూ విస్తృతి చెందలేదు. అయినా ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతానికి సరుకులు రవాణా కావడం కొంత వరకు జరిగేది. బెంగాల్ నూలు, గోధుమలు, చక్కెర, ఉప్పు మున్నగు సరుకులను దిగుమతి చేసుకొని తన ప్రాంతంలోని బియ్యాన్ని, పట్టునూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకొనేది. తూర్పు, పడమర తీర ప్రాంతాలు బియ్యం, చక్కెర దిగుమతి చేసుకొని ఉప్పును, మిరియాలను ఎగుమతి చేసేవి. ఆ కాలంలో పక్కా రోడ్లు లేవు. కనుక సరుకుల రవాణా భార పశువుల ద్వారా జరిగేవి.

**3.4.1.2. విదేశీ వాణిజ్యం :** స్వయం పోషక సమర్థమైన భారతదేశం వినూత్నమైన అంశంతో కూడిన భోగలాలస వస్తువులను మాత్రమే విదేశాలనుండి దిగుమతి చేసుకొనేది. బంగారు, వెండి, సీసం, తగరం, రాగి, తత్తు నాగం, వెలిగారం, గంధకం, ముడిపట్టు, దంతం పగడాలు, తాబేటి చిప్పలు ఈ దిగుమతి వస్తువులలో ముఖ్యమైనవి. 18వ శతాబ్దం వరకూ ఇండియా పరిశ్రమలు విదేశీ మార్కెట్ల అవసరాలకు తగిన వస్తువులను ఎగుమతి చేసేవి. ఆనాడు ప్రతి దేశమూ తనకు అవసరమైన మేలు రకపు ప్రత్తిని, పట్టు వస్త్రాలను,మసాలా సామాగ్రిని, నీలి మందును, చక్కెరను, మందు దినుసులను, అమూల్య రత్నాలను, అద్భుత శిలాఖండాలను భారతదేశం నుండి గ్రహించి వాటికి బదులుగా వెండి, బంగారాలను ఇస్తూ ఉండేవి. తూర్పు దేశాల వస్తువులను సరఫరా చేస్తున్న ఇండియా వర్తకులు పర్షియా సముద్ర తీరంలోను, ఎర్ర సముద్ర తీరంలోను ఉన్న రేవు పట్టణాలన్నింటిలోను ప్రసిద్ధులై అక్కడ తమ వర్తక స్థానాలను స్థాపించుకొని యుండిరి. ఆఫ్ఘనిస్థాన్, మధ్య ప్రాంతాలలోని కాంధహార్, కాబూల్, బాల్స్, కాష్గర్ మున్నగు పట్టణాలలోను, ఇరాన్ దేశంలోని షిరాజ్, ఇష్పహాన్, మెషిద్ పట్టణాలలోను, రష్యాలోని బాకూ, ఆస్ట్రఖన్ మున్నగు పట్టణాలలోను ఈ వర్తకులు అధిక సంఖ్యలో ఉండేవారు. “భారతదేశ వాణిజ్యమే ప్రపంచ వాణిజ్యం. దానిని ప్రత్యేకంగా తన ఆధీనంలో నిలుపుకోగలిగిన వాడు యూరప్ ఖండానికి నియంతకాగలడు.'' అని రష్యా చక్రవర్తి పీడర్ వక్కాణించాడు. బర్మా, మలయా, ఇండోనేషియా, చైనా వంటి తూర్పు ఆసియా దేశాలలోనికి కూడా భారతీయ వస్తువులు ప్రవేశించాయి. భారతదేశం నుండి ఎగుమతి అవుతున్న వస్తువుల్లో మిక్కిలి ప్రధానమైనవి నూలు వస్త్రాలు. నాణ్యమైన వస్త్రాలకు ఇండియా ప్రపంచమంతటా శతాబ్దాలుగా ప్రసిద్ధి చెందింది. ఇండియా నుండి ఇంగ్లండుకు దిగుమతి అయిన నూలు వస్త్రాలతో ఆ దేశపు పరిమిత అవసరాలు తీరడమే గాక మిగిలిన వాటిని వారు విదేశాల్లో అమ్మడం వల్ల వచ్చిన అధిక లాభాలతో ఇంగ్లాండు ధనవంతమైనది. ఇండియా నుండి ఎగుమతి అయిన ఇతర వస్తువుల్లో నీలిమందు ఎక్కువ ముఖ్యమైనది. పరిమిత పరిమాణాల్లో ఇనుము, ఉక్కు, మచిలీపట్టణం నుండి ఎగుమతి అయ్యేది.

**3.4.1.3. వర్తక వర్గాలు - విత్త విధానం :** భారతదేశంలో వర్తక వర్గానికి ఆది నుండి ప్రముఖ స్థానం ఉండేది. వీరు దేశంలోని అన్ని ప్రాంతాలలోనేగాక సముద్ర మార్గాన అనేక దేశాలకు వెళ్ళి అక్కడ కూడా వర్తక వ్యాపారాలు సాగించి లాభాలు గణిస్తూ ఉండేవారు. భారతీయ సంస్కృతిని వ్యాపింప చేయడంలో వీరు ఘనమైన పాత్ర వహించారు. 17, 18 శతాబ్దాలలో ఉత్తర భారతంలో బనియాలు, మర్వాడీలు, దక్షిణ భారతంలో కోమట్లు, నాటుకోటి చెట్టియార్లు అగ్రస్థానం వహించారు. వీరు మామూలు వ్యాపారం చేయడమే కాకుండా ఈనాడు బ్యాంకులు చేసే పనులలో కొన్నింటిని నిర్వహిస్తూ ఉండేవారు. వడ్డీ వ్యాపారమంతా వీరి చేతుల్లో ఉండేది. న్యాసధనాన్ని స్వీకరించడం, అప్పులు ఇవ్వడం, హుండీలను విడుదల చెయ్యడం మొదలైన ఆధునాతన బ్యాంకు కార్యక్రమాలను ఆనాటి పెద్ద బ్యాంకర్లు నిర్వహించేవారు. వ్యాపారానికి, పరిశ్రమలకు విత్తాన్ని సమకూర్చుట, వృత్తి కార్మికులకు, ఇతర వస్తు ఉత్పాదకతలకు అప్పులిచ్చుట చిన్న బ్యాంకర్లు చేసే వారు. అందుచేత పరిశ్రమలపై వీరికి కొంత యాజమాన్యం ఉండేది. కోటీశ్వరుడైన బడా వర్తకులు, రాజులకు, నవాబులకు

లక్షల కోట్లు ఋణంగా ఇచ్చేవారు. అధికారానికై పోటీపడిన వారిలో వీరు ఎవరి పక్షం చేరితే వారు సాధారణంగా గెలుపొందే వారు. బ్రిటీష్ పాలన ప్రారంభ దశలో బెంగాల్ రాష్ట్రంలో జగత్ సేర్ కుటుంబంవారు పదికోట్లు పెట్టుబడితో వ్యాపారం చేస్తూ ఉండేవారు. మహారాష్ట్రులు బెంగాల్‌పై దాడిచేసినపుడు ఈ కుటుంబం వారి నుండి రెండు కోట్లు దోచుకున్నారు. బెంగాల్ నవాబులకూ, బ్రిటీష్ వారికీ మధ్య యుద్ధం సంభవించినపుడు వీరు బ్రిటీష్ వారి పక్షం వహించారు. ఆంగ్లేయుల విజయానికి ఇది ఒక ప్రధాన కారణం.

## 3.4.2. ఆంగ్ల పాలనలో దేశీయ వ్యాపార క్షీణత :

ఆంగ్ల పాలనలో వ్యవసాయానికి, పరిశ్రమలకు కలిగిన దుస్థితి భారతీయుల వ్యాపారానికి కూడా సిద్ధించింది. కంపెనీ వారు ఏకస్వామ్యాల పద్ధతిని స్థాపించడమే వ్యాపార వినాశానికి కారణమయింది. ఈ ఏకస్వామ్యాలు కూడా అన్నీ న్యాయబద్ధమైనవి కావు కృత్రిమమైనవే కానీ ఎక్కువ. వీటిని సంపాదించుకొన్న ఉద్యోగులు వాటిని దుర్వినియోగం చేసి దేశీయ వ్యాపారాన్ని చేజిక్కించుకొన్నారు.

**3.4.2.1. కంపెనీ వారి ఏకస్వామ్యం :** బ్రిటీషు వారు వర్తకులుగా ఉండిన కాలం ప్రధానంగా విదేశీ వ్యాపారం లోనే పాల్గొనేవారు. అంతరంగిక వ్యాపారములో భారతీయులదే ప్రధాన పాత్ర. మొగల్ పాదూషాలు సుంకముల విషయములో కంపెనీవారికి కొన్ని సదుపాయాలు కల్పించారు. కాని అవి అన్నీ ఎగుమతులకు, దిగుమతులకు సంబంధించినట్టివి. కాని ప్లాసీ యుద్ధ ఫలితంగా బెంగాల్ ప్రాంతంలో కంపెనీ పాలన స్థాపింపబడిన తరువాత ఆంగ్లేయులు మొగల్‌పాదుషాల ఫర్మానాలకు విరుద్ధంగా అంతరంగిక వ్యాపారంలో కూడా దిగ సాగారు. రాజకీయాధికారం వారి హస్తగతమైనందున వారి మాటకే చెల్లుబడి కలిగింది. దేశంలోని వ్యాపార వ్యవహారాలను తన ఆధీనంలో నిలుపుకొనడానికి పూనుకొన్నది. పక్షపాతంతో కూడిన సుంక విధానాన్ని ప్రయోగించి దేశీయ వర్తకులను ఇతర విదేశీ వర్తకులను వారి వ్యాపార కార్యక్రమాల నుండి క్రమంగా తొలగించి వేసింది. ఎక్కువ ప్రాధాన్యం ఉన్న సరుకుల విషయంలో ఏకస్వామ్య పద్ధతిని స్థాపించి వాటిని తామే గ్రహించడంతో దేశీయ వర్తకులకు, ఇతర వర్తకులకు వ్యాపారం నిష్ప్రయోజనమైపోయింది. కంపెనీ ఉద్యోగులు తమ అధికారాన్ని పురస్కరించుకొని ఉప్పు, తమలపాకులు, పొగాకు, పంచదార మున్నగు వాటికి సంబంధించిన వ్యాపారంపై ఏకస్వామ్యం స్థాపించి దేశీయ వర్తకులను దాని నుండి పూర్తిగా తొలగించారు. క్రమ క్రమంగా వారు ఇతర సామాగ్రిపై కూడా ఇట్టి ఏకస్వామ్యాన్ని స్థాపించారు. దీని ఫలితంగా దేశీయ వర్తకులు వారి వర్తక స్వాతంత్ర్యాన్ని, అవకాశాలను కోల్పోయి బ్రిటీషు వర్తకుల క్రింద వ్యాపారం చేయవలసిన వర్గంగా మారిపోయారు. 1813 తరువాత కంపెనీ నౌకర్లే కాక ఇతరులు కూడా ఇంగ్లాండు నుండి ఇండియాకు వచ్చి స్వేచ్ఛగా వ్యాపారం చేసే హక్కును పార్లమెంటు శాసనం వల్ల సంపాదించారు. అప్పటి నుండి వర్తక వ్యాపారాల్లో ఆంగ్లేయుల ప్రమేయం అధికరించింది. ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాల్లో కంట్రాక్టర్లుగాను, బ్యాంకుల ద్వారా వడ్డీ వ్యాపారం చేసేవారు గాను ప్రాధాన్యాన్ని సంపాదించారు. దీనితో దేశీయ వర్తకుల ప్రాబల్యం తగ్గింది.

**3.4.2.2. సుంక విధానం :** ఆంగ్లేయులు దేశీయ వ్యాపారుల సరుకులపై పార వహన సుంకాలు, భీమాసుంకాలు అమితంగా విధించారు. అంతకు ముందు సుంకములు లేని వస్తువులపై కూడా సుంకాలు విధించారు. దీని వల్ల కంపెనీ వారికి ప్రతిస్పర్ధులుగా ఉన్న డచ్చి వారిని, ఫ్రెంచి వర్తకులను దేశీయ వ్యాపారం నుండి తొలగించారు. 1838లో పార్లమెంటు ఈ సుంకాలను రద్దు గావించింది.

## 3.4.3. ఆంగ్ల పాలనలో విదేశీ వ్యాపార క్షీణత :

ఇంగ్లండుకు ఎగుమతి అయ్యే భారతీయ వస్తువులపై అంక్షలు విధించడం ద్వారాను, తమ యాంత్రిక వస్తువులను ఇండియాలో చౌకగా అమ్మడం ద్వారాను ఇంగ్లాండు భారతీయ పరిశ్రమలను, విదేశీ వాణిజ్యాన్ని, పూర్తిగా దెబ్బతీసింది. ఇండియా, చైనా దేశాల విదేశీ వ్యాపారాన్ని ఇంగ్లండు యొక్క ఏకస్వామ్యాధికారంగా ఈస్టిండియా కంపెనీ సంపాదించుకొన్నది. ఇండియాను జయించిన పిమ్మట, భారతీయ వాణిజ్యం నుండి ఇతర యూరప్ దేశస్థులను బహిష్కరించింది. బ్రిటిష్ కంపెనీలకు తప్ప ఇతరులకు వస్తువులను అమ్మరాదని వృత్తి కార్మికులను ఆజ్ఞాపించింది. తమకు అనుకూలించే వ్యాపార సంతులనాన్ని ఇండియాలో సిద్ధింపచేసుకొని, మిగిలిన ధనాన్ని ప్రతి సంవత్సరం ఇంగ్లండుకు పంపడం అనేది కంపెనీ వారి వాణిజ్య విధానంగా రూపొందింది. కాల క్రమేణ బ్రిటిష్ పరిశ్రమల ప్రయోజనానికై

ఇండియా మార్కెట్‌ను ఉపయోగించుకొని, వాణిజ్య పరిమాణాన్ని వృద్ధి గావించే విధానం అమలులోనికి వచ్చింది. 1813 బ్రిటీషు ప్రభుత్వం కంపెనీ వారి ఏకస్వామ్య వాణిజ్య విధానాన్ని రద్దు పరచడంతో ఆంగ్లేయులందరికి ఇండియా వాణిజ్యమునకు అవకాశం లభించింది.

**3.4.3.1. స్వేచ్ఛా వాణిజ్య విధానం వల్ల కలిగిన మార్పు :** కంపెనీ వారి ఏకస్వామ్యాధికారం తొలగిపోగానే ఇంగ్లాండు నుండి ఇండియాకు చేసిన ఎగుమతులు అద్భుతావహంగా పెరిగిపోయాయి. ఇండియా పరిశ్రమలు క్షీణిస్తున్న సమయంలో ఆంగ్లేయులు స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని భారతదేశంపై రుద్ది తమ తయారీ వస్తువులకు ఇండియా మార్కెట్‌ను విస్తరింపచేసుకొన్నారు. బ్రిటిషు వారు దిగుమతులపై సుంకాలు విధించకుండా, లేక నామ మాత్రపు సుంకాలు విధించి ఇండియాపై బలవంతంగా త్రోసారు. అయితే ఇండియా నుండి ఇంగ్లండుకు ఎగుమతి చేసిన వస్తువులపై మాత్రం అత్యధిక స్థాయిలో సుంకాలు విధించారు. ఈ విధానం వల్ల ఇండియా విదేశీ వాణిజ్యం వేగంగా వృద్ధి చెందింది. ఈ వరకాభివృద్ధి భారతదేశ వినాశానికి హేతువుగా పరిణమించింది. భారతీయ పరిశ్రమలు నశించడం, ప్రజలు దరిద్రులు కావడం ఈ వర్తాకాభివృద్ధికి ఫలితాలు. కొందరు బ్రిటిష్ పెట్టుబడిదారులు ఇండియాలోని వ్యవసాయ కార్యక్రమాలలో తమ డబ్బును పెట్టుబడిపెట్టి, తోటల పరిశ్రమలను నెలకొల్పి దేశాన్ని దోచుకున్నారు.

**3.4.3.2. విదేశీ వ్యాపార ఋణ శేషం :** బ్రిటిష్ వస్తువులను భారతదేశానికి ఎగుమతిచేసే విషయంలో ఒక ఆటంకం నిలిచిపోయింది. రోజు రోజుకూ ప్రమాణంలో ఎక్కువగుచున్న బ్రిటిష్ వస్తువుల దిగుమతులను ఇండియా వినియోగింపవలసి వస్తే ఇండియా ఏ వస్తువులనైనా ఉత్పాదనచేసి, ఆ దిగుమతులకు ప్రతిఫలంగా బ్రిటిష్ వారికి ఇవ్వవలసి ఉంటుంది. దానికి అవకాశం కూడా ఆంగ్లేయులే కల్పించవలసి ఉంది. కనుక ఈ విదేశీ వ్యాపారం ఋణ శేష సమస్య సులభంగా పరిష్కారం అయ్యేదికాదు. ఇండియాలోని దిగుమతి అవుతున్న వస్తువులతో సమానంగా ఇండియాలో ఉత్పాదన జరుగలేదు. దానితో ఇండియా యొక్క విక్రయ శక్తి తగ్గిపోయింది. కనుక బ్రిటిష్ వస్తువుల విక్రయాన్ని ఇండియాలో విస్తరింపచేయడానికి ఇండియా శక్తిహీనత ప్రతిబంధకమైనది. విదేశీ ద్రవ్య మారకానికి ముఖ్య ఆధారమై ఉండిన నూలు వస్త్ర పరిశ్రమను ఆంగ్లేయులే నాశనం చేసి తమ దేశపు మిల్లు వస్త్రాలతో ఇండియాను ముంచెత్తారు. ఇంగ్లాండుకు ఇండియా అమ్మదలచిన ముడి సరుకు ముడి ప్రత్తికానీ ఇండియా ప్రత్తి ధర ఎక్కువగా ఉండటమే కాక అమెరికా ప్రత్తి వలె నాణ్యమైనది కాదు. సుగంధ ద్రవ్యాల గిరాకీ కూడా బాగా పడిపోయింది. దీనికి తోడు ప్రపంచ మార్కెట్‌లో ఇండియా సరుకుల ధరల విషయంలో ఎక్కువ ఆర్థిక మాంద్యత ఏర్పడింది. అందువల్ల వ్యాపార సంబంధమైన షరుతులు ఇండియాకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఇండియాలోనికి దిగుమతి చేసే ఇంగ్లండ్ వస్తువులకు వినిమయంగా ఇండియా, వెండి, బంగారం తప్ప మరేది ఇవ్వజాలదు. కాని, వెండి బంగారాలను ఇండియా తయారుచేయడం లేదు.

**3.4.3.3. విదేశీ వ్యాపార ఋణశేష వ్యతిరేకతకు నివారణలు :** ఇండియా యొక్క విదేశీ ఋణ శేషాలు సమస్యను పరిష్కరించడానికి బ్రిటిష్ వస్తువులను కొనడానికి తగిన క్రయశక్తిని కలిగించడానికి ఇండియా వ్యవసాయక మూలధారాలను అభివృద్ధి పరచడం ఒక మార్గంగా నిశ్చయింపబడింది. వ్యవసాయ భూములపై గల శిస్తులను తగ్గించడం, సాగునీటి సౌకర్యాలను వృద్ధి చేయడము. వాణిజ్య పంటలను ప్రోత్సహించడం వంటి చర్యలు తీసుకోవాలని సంకల్పించారు. కాని వీటి వల్ల చెప్పుకోదగిన వ్యవసాయాభివృద్ధి కలుగలేదు. బ్రిటిష్ పెట్టుబడిదారులు ఇండియా అంతర్భాగాలలో నెలకొని వున్న ధనాన్ని పెట్టుబడి పెట్టి ఉత్పాదనలను అభివృద్ధి పరచడం మార్గాంతరంగా తాత్పర్యం తదనుగుణంగా బ్రిటిష్ మూలధనాన్ని తోటల పెంపకంలో పెట్టుబడిగా ఉపయోగించి దేశంలోని సమస్త వ్యాపారాన్ని, పరిశ్రమలనూ పరదేశీయుల ఉద్యమ ప్రయత్నాలకు వదిలి వేయడం జరిగింది. కాని ఆంగ్లేయుల ఈ వలస విధానం కూడా విఫలమైంది.

**3.4.3.4. డ్రైయిన్ (ఐశ్వర్య పరీవాహం) :** అనాటి విదేశీ వ్యాపారం మరొక విధంగా భారతదేశానికి నష్టం కలిగించింది. బ్రిటిష్ నుండి భారతదేశానికి దిగుమతి అయిన సరుకుల విలువల కంటే ఎక్కువ ఇండియా నుండి పంపిన మిగులు ఎగుమతులకు ప్రతిఫలం లభించకపోవడం వల్ల ఇండియా, ఇంగ్లాండు దేశాల ఆర్థిక వ్యవస్థలలో విస్తారమైన పరిణామాలు కలిగాయి. ఈ రెండు విలువల మధ్య 1890 వరకు సుమారు 18 కోట్ల రూపాయల భేదం ఉండేది. అంటే మనం ఏటేటా 18 కోట్ల రూపాయల విలువల గల సరుకులను ఎలాంటి ప్రతిఫలమూ పొందక బ్రిటన్‌కు ఉచితంగా పంపవలసి వచ్చింది. 1904 నాటికి ఈ మొత్తం 37 కోట్లకు పెరిగింది. దీనిని దాదాభాయినౌరోజి, రమేశ్ చంద్ర దత్ మున్నగు భారతీయ శాస్త్రవేత్తలు డ్రైయిన్ (ఐశ్వర్య పరీవాహము) అని వ్యవహరించారు. ఇది ఒక విధంగా భారతదేశం

బ్రిటన్‌కు చెల్లించే కప్పం అని చెప్పవచ్చు. ఈ విధంగా 19వ శతాబ్దంలో ప్రతిఫల రహితంగా భారతదేశం నుండి బ్రిటన్‌కు చేరిన ధనం దాదాపు 600 కోట్ల రూపాయలు అని అంచనా వెయ్యబడింది. యంత్రాల సహాయంతో ఫ్యాక్టరీ పరిశ్రమలను నడపటానికి కావలసిన పెట్టుబడి ధనంలో చాలా భాగం బ్రిటిష్ వారు ఈ విధంగా సంపాదించారు. ఆధునిక యుగంలో పారిశ్రామికంగా మారిన ఇతర దేశాల వారు విదేశాల నుండి పెట్టుబడి ధనాన్ని ఋణంగా సంపాదించారు. బ్రిటిష్ వారు ఏ ఋణమూ చేయకుండా తమ పరిశ్రమలను అభివృద్ధి చేసుకొని పారిశ్రామిక రంగంలో అగ్రస్థానం వహించడానికి భారతదేశం నుండి వారు తరలించుకొని పోయిన ధనం ప్రధాన కారణం. ఇదియే వారి సిరిసంపదలకు, భారతీయుల దారిద్ర్యానికి కారణం అయింది.

## 3.4.4. నమూనా ప్రశ్నలు

1. ఆంగ్ల పాలనకు పూర్వం భారతీయ వ్యాపారం గూర్చి వివరించుము
2. ఆంగ్ల పాలనలో దేశీయ వ్యాపార క్షీణత గూర్చి తెలుపుము
3. ఆంగ్ల పాలనలో విదేశీ వ్యాపార క్షీణతను గూర్చి వివరింపుము

## 3.4.5. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Nationalism and Colonialism in Modern India, New Delhi, 1979 |
| 2. | Bipin Chandra, | : | Modern India, New Delhi, 1971 |
| 3. | Percival Spear, | : | A History of India, Vol. 2, Harmondsworth, 1978 |
| 4. | Sumit Sarkar, | : | Modern India, 1885 - 1947, Delhi, 1983 |
| 5. | Alladi Vaidehi, | : | History of Freedom Movement in India, Hyderabad 1991 |
| 6. | Heimsath, | : | Indian Nationalism and Hindu Social Reform, Princeton, 1964 |
| 7. | Vma Kaura, | : | Muslims and Indian Nationalism, New Delhi, 1977 |
| 8. | Mc lane, Indian | : | Nationalism and the Early Congress, Prination, 1977 |
| 9. | Anil Seal, The | : | Emergence of Indian Nationalism, Cambridge, 1967. |
| 10. | K.K. Datta | : | A Social History of Modern India |
| 11. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 12. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern India. |
| 13. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of India Vols. 2 Irfan Habib |
| 14. | Sumit Sarkar | : | Modern India 1885-1947 |
| 15. | R. Plame Dutt | : | Indian Today |
| 16. | R.C. Majumdar | : | History of Freedom Movement in India, 3 Vols. |
| 17. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 19. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 19. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 20. | S.C. Raychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |

పాఠం - 3.5

# బ్రిటీష్ వాణిజ్య విధానం

## 3.5.0. లక్ష్యం :

బ్రిటీష్ వాణిజ్య విధానం, డ్రెయిన్ సిద్ధాంతం, డ్రెయిన్ సిద్ధాంతంపై విమర్శలు, అభిప్రాయ భేదాలు, డ్రెయిన్‌పై అర్థశాస్త్రవేత్తల అభిప్రాయాలు, డ్రెయిన్ వలన కలిగిన పరిణామాలను తెలుసుకోవడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయ సూచిక :


3.5.1. బ్రిటీష్ వాణిజ్య విధానం

3.5.1.1. ద్రావ్యాభిర్భావము

3.5.1.2. వివిధ వ్యాపారాలు

3.5.1.3. నౌకలపై సరుకు రవాణా

3.5.1.4. తేయాకు

3.5.1.5. పొగాకు

3.5.1.6. నౌకా నిర్మాణం

3.5.1.7. ముగింపు

3.5.2. డ్రెయిన్ సిద్ధాంతం

3.5.2.1. డ్రెయిన్ సిద్ధాంతం

3.5.2.2. డ్రెయిన్ పరిమాణం

3.5.2.3. హోమ్ చార్జీలు

3.5.2.4. ప్రభుత్వ ఋణం

3.5.2.5. డ్రెయిన్ సిద్ధాంతంపై విమర్శలు - అభిప్రాయ బేధాలు

3.5.2.5.1. ఋణాలు - వడ్డీలపై భిన్నాభిప్రాయాలు

3.5.2.5.2. మిలటరీ సివిల్ ఖర్చుపై భిన్నాభిప్రాయాలు

3.5.2.6. డ్రెయిన్ పై అర్థశాస్త్రవేత్తల అభిప్రాయాలు

3.5.2.6.1. 1878 నాటి ద్రవ్య వివరణ పత్రం

3.5.2.6.2. రాంసీ మేక్ డొనాల్డ్

3.5.2.6.3. లేలాండ్ జెంక్స్

3.5.2.6.4. జె.సి. కుమారప్ప

3.5.2.6.5. దాదాబాయి నౌరోజి

3.5.2.7. డ్రెయిన్ వలన కలిగిన పరిణామాలు

3.5.2.7.1. ఇంగ్లండ్ సిరిసంపదలు

3.5.2.7.2. ఇండియా దారిద్ర్యం

3.5.3. నమూనా ప్రశ్నలు

3.5.4. చదువదగిన ప్రశ్నలు

## 3.5.1. బ్రిటీష్ వాణిజ్య విధానం :

వస్తు మార్పిడితో ప్రారంభమైన (బార్టర్) ఆర్థిక వ్యవస్థ అనేక అవసరాలను తీర్చే నిమిత్తం. విరివిగా విస్తృతంగా అభివృద్ధి చెందవల్సి వచ్చింది.

వస్తు మార్పిడిలోని అంతర్గత లోపాలు ఆర్థిక వ్యవస్థకు అంతరాయంగా నిలిచాయి.

**3.5.1. ద్రవ్యాభిర్భావము** (Introduction of Coins and Currency) **:** వస్తు మార్పిడిలో అన్ని మార్పిడిలు జరగడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన వల్సి వచ్చేది. ఆవుని ఒక కొలమానంగా భావించేవారు. ఇన్ని వస్తువులకు ఇన్ని ఆవులని మార్పిడి జరుగుతూ ఉండేది. ఆవులు కొన్న వారికి వాటి పోషణకు అయ్యే ఖర్చు వలన వాటి విలువ ఏ మాత్రం పెరిగేది కాదు. అతడు తిరిగి వాటిని అమ్ముకొనేందుకు లేక మార్చుకొనేందుకు అటువంటి అవసరమే ఉన్న మరొక వ్యక్తిని వెతుక్కొనవల్సిన అవసరం ఏర్పడేది. అంతవరకూ ఆవుల్ని పోషించవల్సి వచ్చేది. అలాగే ప్రతీ వస్తువుకి మార్పిడి సమస్య ఎదురయ్యేది వీటన్నిటిని తీర్చగల ఒకే ఒక పరిష్కారము డబ్బుని సృష్టించడమే. డబ్బులో ఉన్న ముఖ్య గుణాలు 4 అవి ఏమనగా 1) నాణ్యత 2) నిల్వ చేసుకోడానికి వీలయ్యేది, 3) మాధ్యమికం (Medium), 4) కొలమానము (asurement) ఈ నాలుగు గుణాలు కల్గిన "మనీ వ్యవస్థ" వ్యాపారానికి ఎంతగానో తోడ్పడిందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. డబ్బును ఎవరైనా ఇష్టపడి తీసుకొంటారు దీన్ని వద్దు అనేవారు లేరు. దాని విలువ మారదు, నిలువ చేయుట సులభము తీసుకొని పోవుట కూడా సులభము అందువల్ల విత్తము ఆర్థిక వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేసింది. పాలకులు పన్నులను "క్యాష్-కైండ్" విత్త రూపంగా, వస్తు రూపంగాగాని కూడా తీసుకునేవారు.

**3.5.1.2. వివిధ వ్యాపారాలు :** వ్యాపారాలు పలు రకాలు వాటిలో నిలువ చేయుటకు వీలు లేని వస్తువులను స్థానికంగా విక్రయ స్థలాల్లో అమ్ముకొనేవారు పండ్లు పూలు, కూరగాయలు, చేపలు మొదలైన వాటిపై పాలకులు పన్నులు తక్కువగా విధించినట్లు ఆధారాలున్నాయి. ప్రఖ్యాత విజయనగర సామ్రాజ్యం నుంచి ఎగుమతి అయ్యే వస్తువుల్లో ఎండు చేపలు కూడ ఉన్నట్లు విదేశీ సందర్శకులు ప్రస్తావించారు. పచ్చి చేపలపైన పన్ను తక్కువగానూ, ఎండు చేపలపై పన్ను ఎక్కువగా విధించినట్లు దాఖలాలున్నాయి.

**3.5.1.3. నౌకలపై సరకు రవాణా :** భారతదేశం నుంచి ఎగుమతి చేయబడే వస్తువులు కేవలము ఆంగ్లేయుల ఓడలపైనే చెయ్యాలనే ఆంక్ష అమలులో ఉండేది. స్వదేశీ ఓడల్లో ఎగుమతులను ఆంగ్లేయులు నిషేదించారు. అయితే ఇంగ్లాండ్ నుంచి సరుకును దిగుమతి చేసిన ఓడలు తిరుగు ప్రయాణంలో ఖాళీగా రావల్సి వచ్చేది. ఆంగ్ల ఆర్థిక, రాజకీయ, శాస్త్రవేత్తలు ఖాళీ నౌకలను పంపుట వలన నష్టము వాటిల్లునని దీనిని భర్తీ చేయుటకు ఇంగ్లండ్ నుండి ఉప్పును భారతదేశానికి ఈ ఖాళీ ఓడల్లో దిగుమతి చేయవలెనని ఆదేశించారు. అంతే కాకుండా సుదీర్ఘమైన సముద్రతీరమున్న భారతీయ ద్వీపకల్పంలో ఉప్పును పండించరాదని ఆంక్షలు విధించారు. ఇంగ్లండ్ నుంచి వచ్చిన ఉప్పును మాత్రమే భారతీయులు కొనాలని వాడాలని నిర్భందించారు. అయితే ఎందుకో ఊరుకొని ఉండగా కొందరు మాత్రం మాకే తగినంత ఉప్పు ఉండగా ఈ విదేశీ ఉప్పు మాకెందుకని సత్యాగ్రహాల్ని ప్రారంభించారు. ఆ విధంగా ఆంగ్లేయ పాలకులను ఎదురించే

ఒక కారణం భారతీయులు గ్రహించారు. ఇది తరువాత గాంధీ తదితర నాయకుల నేతృత్వంలో దండి సత్యాగ్రహంగా ప్రఖ్యాతి గాంచింది. ఈ ప్రయత్నంలో ఆంగ్ల పాలకులు భారతీయుల్ని శిక్షించి, దండించి నేరస్తులుగా తీర్పు చెప్పారు. దండి పాదయాత్ర భారతీయ చరిత్రలో ఆంగ్ల పాలనకు నిరసనగా నిలిచిపోయింది.

**3.5.1.4. తేయాకు :** భారతదేశంలో ఎంతో విలువైన తేయాకు (Tea) ఉత్పత్తి అయ్యేది. ఇచ్చట ఉత్పత్తి అయిన తేయాకు లండన్‌కు దిగుమతి చేసుకొనేవారు. అచ్చట దానిని శుభ్రపర్చి, (ప్యాకింగ్) పెట్టెల్లో పెట్టి వివిధ శ్రేణులుగా విభజించి భారతదేశానికి తిరిగి అమ్మేవారు. ఎక్కువ నాణ్యత ఉన్న తేయాకును అమెరికా, ఫ్రాన్స్, చైనా ఇంగ్లాండ్ మొదలగు దేశాల్లో వాడేవారు. పనికిరాని తక్కువ శ్రేణికి చెందిన తేయాకును L.R. అనే ముద్ర వేసి భారతదేశంలో అమ్మేవారు. అయితే భారతదేశంలోని ధనిక వర్గము మాత్రమే L.R. తేయాకు వాడేవారు. అది ఒక ఉన్నత స్థాయికి చిహ్నంగా భావించేవారు. పెద్ద వారి సంభాషణలో తరుచుగా మీరు ఏ. 'టీ'ని త్రాగుచున్నారు అనేది వచ్చేది. అప్పుడు మేము L.R. Tea వాడుతున్నామని ఎంతో గర్వంగా చెప్పుకునేవారు. అప్పుడు అవతలి వారు మేము అదేగా వాడుతున్నామని వారు కూడా చెప్పేవారు. అయితే L.R. Tea అనగా London Regected Tea లండన్‌లో తిరస్కరించిన తేయాకు అని అర్థము ఈ విధంగా విదేశీయుల ఆచారాలు అలవాట్లు యాంత్రికీకరణ భారతీయ చేతి వృత్తులపైన ఆచార వ్యవహారాల, ఆహారపు అలవాట్లపైన చెరగని ముద్ర వేసాయి.

**3.5.1.5. పొగాకు :** భారతదేశం నాణ్యమైన పొగాకును ప్రత్తిని ఉత్పత్తి చేసేది ముడి సరుకుగా ఉన్న పొగాకును ఇంగ్లండ్‌కు పంపించి అచ్చటి నుండి సిరాక్స్, సిగరేట్లను, హుక్కా పొగాకు, పైపు పొగాకును ఉత్పత్తి చేసి భారతదేశంలో వాడేలా చేసారు. తేయాకు, పొగాకు వాడకం ఒక నాణేనికి రెండు ప్రక్కలగా మారింది. స్వదేశీయుల్లో టీ, సిగరేట్లు త్రాగడం ఒక ప్రతిష్టగా భావించేవారు. చార్టులు, బీడీలు, హుక్కాలు, పైపులు వాడకం కూడా చలామణిలో ఉండేవి. సామాన్యులు పొగాకు (వాడేవారు) త్రాగేవారు ధనికులు హుక్కా, నల్లమందు, సిగరేట్లు, తే నీరు, పంచదారతో కలిపి త్రాగేవారు. బెల్లం సామాన్యుల అవసరాలను తీర్చేది. సంతలు, వస్తు విక్రయ స్థలాలు రెండు రకాలుగా ఉండేవి మాంసం, చేపలు, గుడ్లు, కోళ్ళు మొదలైనవి అమ్మే ప్రదేశాన్ని 'మైల' సంతలనే వారు. శాఖాహారులకు వేరే సంతలుండేవి. ఇవి గాక ప్రత్యేకమైన ప్రదేశాల్లో వెండి, బంగారము, వజ్రాలు విలువైన వస్తు సామాగ్రి ధనికుల కొరకు ఉండేవి. నగలను తయారు చేసే విశ్వ బ్రాహ్మణులు, ఇనుప సామానులు చేసే కమ్మరులు, దారువుపై పనిచేసే వడ్రంగులు, గెడలు, చాపలు, నిచ్చెనలు తయారు చేసే మేదరులు వేరే చోట ఉండేవారు. నిత్యావసర వస్తువులను అమ్మే వ్యాపారులు వేరే స్థలంలో ఉండేవారు. వేశ్యలు వేరే చోట ఈ విక్రయ స్థలాలకు చేరువలోనే ఉండేవారు. వీరికి దగ్గరల్లోనే మాంసాహారుల మధ్య విక్రయశాలలు ఉండేవి. విశ్రాంతి గృహాలు, పూటకూళ్ళ భోజన శాలలు విరివిగా ఉండేవని కాకతీయుల కాలంలో మోటుపల్లిని దర్శించిన మార్కోపోలో వివరించాడు. దేవాలయ నిర్మాణాలు, శిల్పాలు దేవుళ్ళ విగ్రహాలు అనేక రాజ సౌదాలు కోటలు ధనికుల గృహాలను రాతి పనివారు, తాపీ పనివారు, వడ్రంగులు కడు రమ్యంగా నిర్మించునట్లు వరంగల్లు, రామప్ప, పానగల్లు మొదలగు ప్రదేశాల్లో లభ్యమైన అవశేషములను బట్టి తెలియుచున్నది.

**3.5.1.6. నౌకా నిర్మాణం :** భారతీయులు సంపర్కము అతి ప్రాచీనమైనది సముద్ర యానము నిషేదమని భారతీయులు శాస్త్రాలు ఘోషించినప్పటికీ రామాయణ మహాభారతాల్లో సముద్రాలను దాటి వివిధ ద్వీపాలను, పాండవులు, హనుమతులు సముద్రాన్ని దాటినట్లు దాఖలాలున్నాయి. సముద్ర యానం, విదేశీ సంపర్కం పాపమని అట్లు చేసినచో శిక్షార్హులని సంఘం నుండి దేశం నుండి బహిష్కరణలు చేయుటయే వారికి తగిన శిక్ష అని భావించారు. అయితే విదేశీయులు ప్రాచీన కాలం నుంచి సముద్రం మీద నేల మీద పయనించి భారతదేశాన్ని దర్శించారు. యుద్ధాలు చేసారు ఆక్రమించారు. అధినేతలయ్యారు. అనేక నిర్మాణాలను చేసారు. వారి మతాలలోకి భారతీయులను బలవంతంగా మార్చారు. బౌద్ధ మతం భారతీయుల నమ్మకాలకు వ్యతిరేకంగా సముద్రయానం తప్పుకాదని చెప్పడంతో విదేశాల్లో వ్యాపారం చేసేందుకు వీలుంటుందని చాలా మంది తమంతట తామే బౌద్ధ మతాన్ని స్వీకరించారు. సముద్రయానం తప్పనిసరి అయ్యింది. సముద్రంపై నౌకలు ఓడలు పడవలు తెప్పలు అవసరము. అందువల్ల ప్రాచీన కాలం నుండి పెద్ద పెద్ద నౌకలను వస్తువులను ఎగుమతి చెయ్యడానికి సామాన్యులు ప్రమాణం చెయ్యడానికి అనుగుణంగా తయారు చేసిన నౌకల ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. నౌకా నిర్మాణం ఒక శాస్త్రము ప్రత్యేకమైన పనివారే నౌకలను తయారుచేసేవారు. సముద్రంపై ప్రయాణానికి అనుకూలమైన కొలతలను

నిర్ణయించేవారు నదిలో నుండి బయలుదేరన నౌక సముద్రంలో ప్రవేవించగానే పైకి తేలుతుంది. నీటి సాంద్రతను బట్టి నౌక యొక్క ఉనికి ఆధారపడి ఉంటుంది. ఏయే ప్రాంతాల్లో ఏయే సముద్రాల్లో ఎంత సాంద్రత ఉందో తెలుసుకొన్న శాస్త్రజ్ఞులు (హైడ్రాలజిష్టి) నౌకా నిర్మాణానికి సలహా సభ్యులుగా ఉండేవారు. సముద్రం పై వీచే గాలుల వాలు ఋతు పవనాల ప్రభావము, తుఫానులు త్సునామీలు, టొరంటోలు, వీటని గూర్చిన విశేష విజ్ఞానం కలిగినవారు కూడా నౌకా యానంతోనూ నిర్మాణంలోనూ నాణ్యతను నిర్ణయించేవారు. నౌకలు తెడ్ల సహాయంతోను (Oars) సరంగులతోనూ, గజ ఈతగాళ్ళతోనూ ఇంకా ఇతర సాంకేతిక నిపుణులతోనూ నడపబడేవి. తెర చాపలు నౌకా యానాన్ని సుగమం చేసాయి. నౌక మధ్య భాగాన్న నిలువెత్తు బలమైన స్తంభం ఉంటుంది. దీనికి తెరచాపలు పగ్గాలతో కడతారు నౌకకు దిశను నిర్ణయించేది గమనాన్ని నిర్దేశించేది దిశను మార్చేది చుక్కాని నౌకాధిపతి సూచనల మేరకు చుక్కానిని త్రిప్పేవారు సముద్రంలో రాళ్ళు, గుట్టలు, పర్వతాలు, సుడి గుండాలు, వింత జంతువులు, అపరిచిత ద్వీపాలు, నరమాంస భక్షకులతో నిండిన ప్రాంతాలున్నాయని నావికులకు కథల రూపంలో తెలుసు అయితే వారు కొన్ని సమయాల్లో ప్రత్యక్షంగా చూడగల్గుతారు. దూరాన్నుంచి వచ్చే పోయే స్థలాలను నౌకలను సుదూరం నుంచే చూడగలిగే బైనాక్యులర్స్ వీరి వద్ద ఉంటాయి. ప్రమాదాన్ని సూచించే సంకేతాలను, దుండుగులు ద్వారానొ బూరల ద్వారానొ, సైరన్ ద్వారానొ ముందే తెలియజేస్తారు వీటన్నింటినీ సక్రమముగా జరపడానికి సాంకేతిక నిపుణులు సముద్ర యానంలో అనుభవం ఉన్నవారు నౌకలో ఉంటారు. నౌకలో సరుకులకు కొంత భాగము, ప్రయాణికులకు కొంత భాగము, సిబ్బందికి కొంత భాగము, ఆహార సామాగ్రిని, త్రాగే నీటిని, మత్తు పదార్థాల్ని నిలువచేసే ప్రత్యేక గదులుంటాయి. తెరచాప తరువాత నౌకాయానంలో ప్రముఖమైనది దిక్సూచి ఇది మహానావికుని యొద్ద ఉంటుంది. అతడు ఓడ ఏ దిశలో పయనిస్తుందో లేక పయనించవల్సి ఉన్నదో తన క్రింది ఉద్యోగులకు తెలియజేస్తాడు. ఒక గొట్టం ద్వారా నావికులతో సంభాషణ జరుపుతాడు. దిక్సూచి తరువాత చెప్పుకోదగినది లంగరు ఓడను నిలుపుటకు లంగరు అవసరము లంగరు ఒక పొడవైన బలమైన ఇనుపగొలుసు దాని చివర బరువైన ఇనుపగుండు ఉండును నౌకను నిలుపవల్సి వచ్చినప్పుడు లంగరు వేసే ఉద్యోగులు నావికుని సలహామేరకు దానిని మెల్లగా సముద్రంలోనికి వదులుతారు. లంగరు వేసే సమయంలో హుషారు కొరకు పాటలు కూడా పడతారు. అలాగే నౌకను తిరిగి ప్రయాణానికి సిద్ధం చేసినపుడు లంగరును ఎత్తవల్సి ఉంటుంది. అప్పుడు నావికులతో పాటు సరంగులు కూడా లంగరును ఎత్తుతారు. అప్పుడు కూడా హుషారుగా ఉండడానికి సముద్ర దేవతలను ప్రతీపర్చడానికి పాటలు పాడతారు. ఉదా : "జంబాలే జోర్సే లంగర్" అనే పదం ఊత పదంగా ఉన్నది. ఇది బౌద్ధ సంప్రదాయానికి చెందినదని 'జంబాల' సముద్ర దేవతని జంబాలను స్తుతించడం వల్ల సముద్రయానం సుఖవంతం అవుతుందని బౌద్ధుల నమ్మకం దాని భ్రష్టరూపమే నేడు 'జంబలకిడి పంబ' అని సామన్యుల నాలుకపై ఉన్నది. బౌద్ధ మతం ప్రకారం జంబాల సముద్రాన్ని అదుపు చేసే దేవతని చెబుతారు. బౌద్ధ మతం దేశీయ ఆంక్షలకు వ్యతిరేకంగా ప్రచారము చేయడమే కాకుండా అంతర్జాతీయ సంబంధాలకు బీజాన్ని నాటి సముద్రం యానం తప్పుకాదని నేరం కాదని వర్తక, వాణిజ్య రాజకీయ సంబంధాలకు దోహదం చేసింది. నేటి అంతర్జాతీయ సంబంధాలన్నీ సముద్రంపై జరిగే కార్యాలన్నీ జంజాలుని ప్రార్థనతోనే ఆరంభమైనదని చెప్పవచ్చును.

**3.1.5.7. ముగింపు :** భారతదేశం సంప్రదాయాల పైన, ఆచార వ్యవహారాలపైన నమ్మకాలపైన ఆధారపడిన సమాజాలతో నిండి ఉన్నది. అయితే కీ॥శే॥ 16వ శతాబ్దం విదేశీయుల రాకతో వినూత్నమైన సాంస్కృతిక పరిణామాలు విస్తృతంగా చోటు చేసుకున్నాయి. విదేశీయులు భారతదేశానికి రావడం 16వ శతాబ్దానికి ముందు లేదని అనుకోరాదు. శాతవాహనులకు పూర్వమే చైనీయులతోను రామాయణ, మహాభారత కాలాల్లో, సుమిత్ర, సింహళ, బోలి, మలయ, చైనా, ఆఫ్రికా మొదలగు ప్రదేశాలతో సంబంధ బాంధవ్యాలు వర్తక, వాణిజ్యాలు, దౌత్య, వ్యవహారాలు కలిగి ఉన్నట్లు తెలియుచున్నది. అయితే క్రీ॥శే॥ 16వ శతాబ్దం నూతన శకానికి అంకురార్పణ చేసిందనే చెప్పాలి. విదేశీయులు అనేక రంగాల్లో తమ ఉనికిని భారతదేశంలో చాటుకున్నారు. ప్రాచీన భారతీయ సాహిత్యం అంతా బ్రాహ్మణులకు మాత్రమే తెలియుట వలన మిగిలిన వారికి వాటి గురించి సమాచారం తెలియకుండును. బ్రాహ్మణులు చెప్పినదే వేదం అనే సామెత ప్రచారంలోనికి దీని వలనే వచ్చింది. కోట్లాది మంది నిరక్షర కుక్షులై బ్రాహ్మణులకు దొరంగా దేవాలయ ప్రవేశానికి నోచుకొనక దుర్భరమైన అవిద్యతో అలమటించుచుండిరి విదేశీయుల రాకతో దేశ భాషగా ఇంతవరకూ నమ్ముచున్న సంస్కృతం, పాకృతం మొదలగు భాషలను లిపులను జేమ్స్ ప్రిన్సిస్ అనే ప్రాజ్ఞుడు తొలిసారి బ్రాహ్మలిపిని చదివి దాని మర్మాన్ని విపులీకరించాడు. ఇది శ్రీకృష్ణుడు పాండవులకు రాసిచ్చిన నియమావళి కాదని నొక్కి వక్కానించాడు. బ్రాహ్మిలిపి బాడాయి బైట పడింది. దేవ భాషగా అపౌరుషేయములుగా భావింపబడిన వేదములు,

పురాణాలు, ఉపనిషత్తులు, ఇతిహాసము మొదలగు వాటిని ఫర్గీటర్ అనే ప్రకాండ పండితుడు మహజ్ఞాని ఆంగ్లమునకు అనువదించి అంతవరకూ ఆవరించి ఉన్న అజ్ఞాన అంధకారాన్ని తొలగించినాడు. ఎందరో పాశ్చాత్య పండితులు భారతదేశ సాంస్కృతిక ఔన్నత్యానికి తమవంతు జ్ఞాన సంపదను అనుగ్రహించారు.

ఈ పైకార్యములన్నియూ బౌద్ధమతం వల్ల భారతీయులు విదేశాలకు వెళ్ళడానికి, విదేశీయులు భారతదేశానికి రావడానికి నౌకాయానమెంతో తోడ్పడింది. ఋతుపవనాలు, సముద్రపు అధ్యయనం, నౌకా నిర్మాణంలోని రహస్యాలు, మర్మాలు సాంకేతిక విలువలు సంరక్షణ సూత్రాలు అటు ఆంగ్లేయులకు ఇటు భారతీయులకు ఎంతగానో తోడ్పడ్డాయి.

## 3.5.2. డ్రెయిన్ సిద్ధాంతం :

దిగుమతులు విస్తారంగా పెరుగుతూ వచ్చినప్పటికి, 1862 నుండి ఇండియా తన వ్యాపార సమతూక అనుకూలతను, తదేకంగా నిలుపుకుంటూ వచ్చింది. ఏప్రిల్ 1862 నుంచి మార్చి, 1905 వరకు గడిచిన 43 సంవత్సరాల్లో, వస్తువుల దిగుమతుల కంటే ఇండియా ఎగుమతుల విలువ రూ. 1,288,23 కోట్లు ఉంది. ఇది, సరాసరి సంవత్సరానికి రూ. 29.3 కోట్లుగా ఏర్పడింది. దీనికి ప్రతిగా, ఇండియా ఈ నాల్గు దశాబ్దాలకు పైబడిన కాలంలో రూ. 508.81 కోట్ల విలువైన బంగారం, వెండిని దిగుమతి చేసుకొంది. ఇకపోతే, మిగిలిన రూ. 780.42 కోట్లను, గ్రేట్ బ్రిటన్‌తో తనకున్న రాజకీయ, ఆర్థిక సంబంధాల నుండి ఉత్పన్నమయ్యే చెల్లింపులకు గాను వాడడమైంది. ఇలాంటి ఎగుమతుల సొమ్ము, ఇండియాకు గాని, దేశ ప్రజలకు గాని చెందకుండా, బ్రిటన్‌కు, ఆదేశ వ్యాపారులు, పారిశ్రామికులు, పెట్టుబడిదార్లు, పౌరులకు ముట్టడం చేత, ఈ ఎగుమతులకు "ప్రతిఫలం లేని ఎగుమతులు"గా భావించడమైంది.

ఎగుమతులు దిగుమతులనధిగమించడం, 1939 వరకు కూడా నిరంతరంగా (1920-21, 1921-22 సంవత్సరాలు మినహాయించితే, కొనసాగుతూ వచ్చింది. సాధారణ వస్తు మారకంలోనైతే, కొన్ని సంవత్సరాల్లో ఎగుమతులు, దిగుమతులు సమతూకాన్ని తప్పక సాధిస్తాయి. కాని, ఇండియా విషయంలో మాత్రం, ఇది ఎప్పటికీ అనుభవానికి రాలేదు. ఫలితంగా "నిధుల తరలింపు" ఏక పక్షంగా, సదా ఇండియా నుండి బ్రిటన్‌కు జరిగింది.

**3.5.2.1. డ్రెయిన్ సిద్ధాంతం :** భారతదేశం యెడ బ్రిటిష్ ప్రభుత్వం అవలంభించిన ఆర్థిక విధానం భారతదేశానికి అన్ని విధాలా హానికరంగా పరిణమించింది. వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం మున్నగు అన్ని రంగాల్లోను ఇండియా బాగా దెబ్బతిన్నది. ఇంగ్లండులోని పరిశ్రమలకోసం ఇండియాలో ముడిపదార్థాల ఉత్పత్తిని అధికం చేయడం, ఇంగ్లండులోని పరిశ్రమలు తయారు చేసిన వస్తువులను ఇండియా మార్కెట్‌గా రూపొందడం అనేవి బ్రిటిష్ ఆర్థిక విధాన ప్రధాన లక్ష్యాలు. ఈ విధానం వలస వాద దోపిడి వ్యవస్థకు ప్రతిబింబం. తత్ఫలితంగా ఇంగ్లాండు నుండి ఇండియాకు దిగుమతి అయిన సరుకుల విలువల కంటే ఇండియా నుండి ఇంగ్లండుకు ఎగుమతి అవుతూ వచ్చిన సరుకుల విలువ ఎక్కువ కాజొచ్చింది. ఈ రెండు విలువల మధ్య 1890 వరకు సుమారు 18 కోట్ల రూపాయల భేదం ఉండేది. అంటే ఇండియా ఏటేటా 18 కోట్ల రూపాయలు విలువగల సరుకులను ఎలాంటి ప్రతిఫలం పొందక ఇంగ్లండుకు ఉచితంగా పంపవలసి వచ్చింది. 1903 నాటికి ఈ మొత్తం 37 కోట్లకు పెరిగింది. దీనికి తోడు ఇండియాను పాలించడంలో ఆంగ్లేయులు వారి దేశంలో ఇండియా తరపున చేసే ఖర్చులను హోంచార్జ్‌స్ అనే పేరుతో భారతీయులపై రుద్ద సాగారు. ఇది ఒక విధంగా భారతదేశ ఇంగ్లండుకు చెల్లించే కప్పం అని చెప్పవచ్చు. దీనినే దాదాబాయి నౌరోజి, రమేష్ చంద్ర దత్తు మున్నగు అర్థశాస్త్రవేత్తలు డ్రెయిన్ అని వ్యవహరించారు. డ్రెయిన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారు వీరే. ఎకనామిక్ డ్రెయిన్‌ను తెలుగులో 'ఆర్తిక నిస్స్రావం, ఐశ్వర్య నిర్గమనం, ఐశ్వర్య పరీవాహం, తరలింపు వంటి ప్రయోగాల ద్వారా వ్యహరించుచూ ఉన్నారు. ఎట్టి ప్రతిఫలమూ లేకుండా భారతదేశ సంపద ఇంగ్లండుకు తరలిపోవడమే ఈ పదాల తాత్పర్యం. దాదాభాయి డ్రెయిన్ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ ఆంగ్ల ప్రభుత్వం ఇండియా ఆదాయంలో నాలుగోవంతును తన పాలనకు ప్రతిఫలంగా ఏటేటా ఇంగ్లండుకు తరలిస్తుందని ఆరోపించారు. ఈస్టిండియా కంపెనీ బెంగాల్‌లో వసూలు చేసిన భూమి శిస్తు ద్రవ్యంతో ఇండియా సరుకుల్నికొని ఇంగ్లాండుకు పంపే విధానం అవలంభించడంతో డ్రెయిన్ ప్రారంభమైంది. ఆంగ్ల పాలన విస్తరించే కొద్దీ భారతీయ సంపద తరలింపు వెయ్యి మార్గాల గుండా కొనసాగి ఇండియాను దారిద్ర్యంలో ముంచి వేసింది.

**3.5.2.2. డ్రెయిన్ పరిమాణం :** కంపెనీ బెంగాల్‌ను పరిపాలించిన మొదటి ఆరు సంవత్సరాల కాలంలో సిద్ధించిన నికరాదాయం 1,30,66,761 పౌనులు, మొత్తం ఖర్చులు 90,27,609 పౌనులు పోగా 40,39,152 పౌన్లు మిగిలింది. దీనిని ఇండియా సరుకుల రూపంలో కంపెనీ ఇంగ్లాండుకు పంపింది. ఇది దేశంలోని నికరాదాయంలో మూడవ భాగం. ఇది ఆర్థిక మూలాధారాల నుండి ఇంగ్లండుకు చేరిన మొత్తం, కంపెనీ ఉద్యోగులు జమ చేసుకొని స్వదేశానికి పంపిన మొత్తం ఇందులో జతపరచలేదు. 1766-69 మధ్య కాలంలో జరిగిన ఎగుమతి దిగుమతి లెక్కలను బట్టి ప్రతియేటా 15 లక్షల పౌనులు విలువలుగల సరుకులు బెంగాల్ నుండి ఇంగ్లండుకు ఎక్కువగా చేరాయి. దీనికి ఇంగ్లండు నుండి ఏ ప్రతిఫలమూ లభించలేదు. కాబట్టి ఇండియా సంపద నుండి 15 లక్షల పౌనుల ద్రవ్యం వృధాగా బయటికి ప్రవహించిపోయింది. తరువాత సంవత్సరాలలో ఈ డ్రెయిన్ ఇంకా పెద్దదవుతూ వచ్చింది. "1757 నుండి 1815 లోపల ఇండియాలోని మూల భండారాలలో నుండి ఇంగ్లాండుకు 100 కోట్ల పౌనులు ప్రవహించిపోయి ఉంటుంది.'' అని వివియం డిగ్బే వెల్లడించారు. అనగా ప్రతియేడు సరాసరి 1.72 కోట్లు పౌనులు పరీవాహ రూపంలో ఇండియా ధనం ఇంగ్లాండులో కలసి పోయింది. 19వ శతాబ్ది మొత్తంలో 600 కోట్ల రూపాయల సంపద ఇంగ్లాండుకు తరలింపబడిందని మరొక అంచనా. యధార్థమైన లెక్కల విషయం వివాదస్పదమైనప్పటికీ ఆంగ్లేయులు విదేశీ వ్యాపారాన్ని సాధానంగా చేసుకొని భారతదేశ సంపదను తమ ప్రయోజనం కొరకు ఇంగ్లండుకు తరలించడం మాత్రం వాస్తవం.

**3.5.2.3. హోమ్ చార్జీలు :** డ్రెయిన్‌లో చాలా భాగానికి హోంచార్జీలు (మాతృభూమి వ్యయం) అనిపేరు. ప్రభుత్వం ఋణంపై ఇండియా ఏటేటా ఇంగ్లండుకు చెల్లించే వడ్డీ, ప్రభుత్వం రైల్వే కంపెనీల కిచ్చే హామీధనం, సబ్సిడీలపై చెల్లించవలసిన వడ్డీలు, వార్షిక ద్రవ్యాలు పునర్ నిర్మాణాలకై ప్రభుత్వం చేసిన ఋణాలపై వడ్డీలు, సెలవు లేదా విశ్రాంతి తీసుకున్న ఇండియా సివిల్ ఉద్యోగుల విదేశీ వేతనాలు, పెన్షన్‌లు ఇంగ్లండులోని ఇండియా సెక్రటరీ కార్యాలయ ఖర్చులు, ఇండియా ప్రభుత్వ శాఖలకు సరఫరా చేసిన వస్తువుల వెలలు మున్నగునవన్నీ హోంచార్జీలలో చేరాయి. ఈస్టిండియా కంపెనీ యాజమానులకు ఏటా చెల్లించే డివిడెంట్, రూపాయి విలువ పడిపోవడం వల్ల వచ్చిన నష్టం కూడా హోంచార్జీలలో అంతర్భాగమే. విదేశీయ బాంకుల సేవలు, భీమా కంపెనీలు, పరివాహక కంపెనీలు, తేయాకు తోటలు, జనుము వస్తువుల తయారు, ఖనిజ పరిశోధన బ్రిటిష్ అధికార్లు వర్తకులు ఇండియా నుండి ఇంగ్లండు పంపే ద్రవ్యము మున్నగునవన్నీ అదృశ్య దిగుమతులుగా పరిగణింపబడి మాతృభూమి వ్యయంలోనే చేర్చబడ్డవి. ఆంగ్లేయుల విదేశాల్లో చేసిన యుద్ధాలకైన వ్యయం హోంచార్జీలలోనే చేర్చబడింది.

**3.5.2.4. ప్రభుత్వ ఋణం :** భారతదేశం చెల్లించే హోంచార్జీలతో ప్రభుత్వ ఋణం ప్రారంభమైనదని రమేష్ చంద్రదత్ అభిప్రాయం. ఈ చార్జీలకు భారతదేశం ప్రతి ఏడూ పూర్తిగా చెల్లించలేక పోవడంతో ఋణం పెరుగుతూ వచ్చింది. ఈ చార్జీల రూపంలో ఏటా ఇండియా కొంత సొమ్మును కోల్పోతూ ఉండేది. వాటి మేరకు ఇండియా వనరులను పోగొట్టుకుంటున్నది. కంపెనీ పరిపాలన అంతమై బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలన మొదలైన సంవత్సరం (1858) లో భారత ప్రభుత్వ ఋణం 69.4 మిలియన్ స్టర్లింగ్ పౌనులు. ఈ మొత్తం 1876 నాటికి 138.9 మిలియన్లకు, 1900 నాటికి 228.8 మిలియన్లకూ పెరిగింది. దేశ పరిపాలన కోసం, దేశంలోని వనరులను పెంపొందించడం కోసం వెచ్చించిన మూలధనం వల్ల ఈ ఋణం ఏర్పడిందని ఆంగ్ల పాలకుల వాదం. కాని నిజానికి భారతదేశంలోనూ, ఇతర దేశాలలోనూ బ్రిటిష్ వారు కొనసాగించిన యుద్ధాలకయిన వ్యయమంతా వారు భారత ప్రభుత్వానికి అంటగట్టారు. 1841 నుండి 1857 లోపల జరిగిన ఆఫ్ఘన్ యుద్ధం, సింధు ఆక్రమణ, సిక్కు యుద్ధాలు, సిపాయిల తిరుగుబాటు మూలంగా ఋణం బాగా పెరిగిపోయింది. ఇంగ్లండు తరలివెళ్లి సైన్యాన్ని ఇండియాకు తిరిగి పంపితే ఆ సైన్యం ఇండియాను చేరుకోవడానికి ఆరు నెలల పూర్వం నుండి అయ్యే ఖర్చును కూడా ఇండియా ప్రభుత్వమే భరించవలసి ఉండేది. దీనికి తోడు బ్రిటీష్ ప్రభుత్వం కంపెనీ నుండి ఇండియా పరిపాలనను పొందినపుడు కంపెనీ వాటాదార్లకు చెల్లించిన మొత్తాన్ని ఇండియా ఋణానికి చేర్చారు. ఇండియాలోని బ్రిటిష్ పరిపాలనా యంత్రాంగం కూడా అధిక వ్యయానికి దారి తీసి ప్రభుత్వానికి ఋణాన్ని పెంచింది. ఒక వేళ ఆదాయంలో మిగులు ఏర్పడితే ప్రభుత్వం సాగించే యుద్ధాల వల్ల ఆ మిగులు హరించుకుపోయేది.

**3.5.2.5. డ్రెయిన్ సిద్ధాంతంపై విమర్శలు - అభిప్రాయ భేదాలు :** డ్రెయిన్ సిద్ధాంతంపై పెక్కు ఖండన మండనలు చెలరేగాయి. ఈ సిద్ధాంతం తప్పుల తడక అనీ, హోంచార్జీలు భారతదేశానికి నష్టం కలిగించేవి కావనీ షిండ్లే షిరాస్, మోరిసన్ వంటి శాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. ఇంగ్లండు పెట్టుబడి పెట్టిన ద్రవ్యంపై వడ్డీకి, లాభం శాలకు బదులుగా ఈ ఖర్చులు ఇండియా ఇస్తున్నదని వాదించారు. కాంగ్రెస్ నాయకుడైన రెనడే కూడా ఒకప్పుడు బ్రిటిష్ వాదాన్ని సమర్థించారు. పారిశ్రామిక మహాసభలో ఉపన్యసిస్తూ అతడు "మన ఎగుమతి మిగులులోని 20 కోట్లను కప్పం రూపంలో ఇంగ్లండు తీసుకొంటున్నంత కాలం మనకు మోక్షంలేదని, మనకు మనం సహాయం చేసుకొన్నా అభివృద్ధికి రాలేమని కొందరు భావిస్తున్నారు. ఈ దృష్టి న్యాయమైనది కాదు. పురుష లక్షణమూ కాదు అని పలికాడు. పైన పేర్కొన్న వారి వివాదాలకు విరుద్ధంగా పలువురు ఆంగ్లేయులు భిన్నాభిప్రాయాన్ని వెలవరించారు.

**3.5.2.5.1. ఋణాలు - వడ్డీలపై భిన్నాభిప్రాయాలు :** ఇంగ్లండు నుండి తీసుకొన్న ఋణాల మీద చెల్లించవలసిన వడ్డీని నష్టముగా భావించరాదని షిరాస్ అభిప్రాయము. మూలధనం కొరత అధికంగా ఉన్న ఇండియా రైల్వే నిర్మాణము, నీటి పారుదల అభివృద్ధి మరియు ఇతర ప్రయోజనాల కోసం లండన్ మార్కెట్‌లో చౌకగా మూలధనం పొందగల్గింది. దాని పెట్టుబడి వల్ల లభించే ఆదాయంలో వడ్డీగా చెల్లించవలసిన మొత్తం చాలా తక్కువ. ఈ మూలధనం జాతీయాదాన్ని వృద్ధి చేస్తుంది. ఈ మూలధనం సమకూరకపోతే జాతీయాదాయము చాలా తక్కువగా ఉండేది. ఇట్టి భావాన్నే మారిసన్ కూడా వెలిబుచ్చాడు. ఈ విదేశీ చెల్లింపులకు ప్రతిఫలంగా భారతదేశానికి ఆధునిక పరిశ్రమకు కావలసిన యంత్ర సామాగ్రి లభిస్తున్నది. ఆర్థిక పరిణామానికి అనుకూలంగా ఉండే పరిపాలనా యంత్రాంగము సమకూరుతున్నదని అతడు అభిప్రాయపడ్డాడు.

పై వాదము ఖండనార్హమైనది. విదేశాల నుండి ఋణాలు తీసుకోవడము అవసరమే, వాటి మీద వడ్డీ చెల్లించడము ధర్మమే. కాని ఆ విధముగా లభించిన మూలధనము సక్రమంగా వినియోగమై తగినంత ప్రతిఫలాన్ని ఇచ్చిందా అనేది ప్రశ్న. మొదటి 50 సంవత్సరాలలో రైల్వేలు లాభదాయకముగా లేకపోయినా వాటిని విస్తరించడము జరిగింది. రైళ్ళు నడవడానికయ్యే వ్యయము, మూలధనము మీద వడ్డీ ప్రభుత్వము పూచీ వచ్చిన కంపెనీల లాభాలు ఇవన్నీ రైల్వేల ఆర్జన కన్నా 50 మిలియన్ స్టెర్లింగ్ పౌనులు ఎక్కువగా ఉన్నాయి. ఇండియాలో 1905 నాటికి రైల్వే నిర్మాణము ఎంత అవసరమో, నీటి పారుదల వసతుల అభివృద్ధి అంతకన్నా ముఖ్యము. అయినప్పటికీ లాభదాయకంగా ఉండే నీటి పారుదలపై 24 మిలియన్ స్టర్లింగ్ పౌనులు, రైల్వేలపై 226 మిలియన్ స్టెర్లింగ్ పౌనుల వ్యయము జరిగింది. ఋణంగా పొందిన మూలధనము సక్రమముగా వినియోగము కాలేదని దీన్ని బట్టి తెలుసుకోవచ్చు.

**3.5.2.5.2. మిలిటరీ సివిల్ ఖర్చుపై భిన్నాభిప్రాయాలు :** షిరాస్, మోరిసన్‌ల అభిప్రాయం ప్రకారం ఒక వేళ మిలిటరీ ఖర్చు ఎక్కువ అయినా బ్రిటిష్ నౌకాదళానికి సంబంధించిన ఖర్చుతో ఇండియాకు ఏ విధమైన ప్రమేయం లేదు గనుక మొత్తం మీద ఇండియాకు ఎక్కువ ప్రయోజనం లభిస్తున్నది. ఇదే విధముగా బ్రిటిష్ సివిల్ అధికారుల జీతాలను పెన్షలను కూడా పరిశీలించవలసి ఉంటుంది. ఈ చెల్లింపులకు ప్రతి ఫలము లేకపోలేదు. దేశములో సుస్థిరము, సమర్థవంతమూ అయిన ప్రభుత్వము ఏర్పడింది. అందువల్ల అరాచకము తొలగిపోయింది.

పై అభిప్రాయాలు అసమంజసమని అనేకులు ఖండిచారు. భారతదేశ అంతరంగిక విధానముతో ఏ విధమైన సంబంధములేని యుద్ధ కార్యకలాపాలలో పాల్గొనేటందుకు అనుగుణముగా భారత సైన్యాన్ని రూపొందించడము జరిగిందని లాన్స్ డౌన్ ప్రభువు విమర్శించాడు. ఇతర దేశాలలో కొనసాగించిన యుద్ధాల ఖర్చును ఇంగ్లండు భారతదేశాల మధ్య విభజించడంలో భారతదేశానికి అన్యాయము జరిగిందని నార్త్‌బ్రూక్ ప్రభువు పేర్కొన్నాడు. భారత సైన్యము ప్రత్యేకముగా భారతీయుల ప్రయోజనము కోసం మాత్రమే లేదని, బ్రిటీష్ ప్రభుత్వము భరించవలసిన వ్యయములో అధిక భాగము భారతదేశానికి అంట్టగట్టడము జరుగుతున్నదనీ సర్ రాబర్ట్ గిఫిన్ అభిప్రాయం వెలిబుచ్చాడు. సివిల్ పరిపాలనకు సంబంధించిన వ్యయము కూడా హెచ్చుస్థాయిలో ఉన్నది. దీనికి కారణం ఉన్నత పదవులో అత్యధిక వేతనాలు పొందుతున్న ఆంగ్లేయుల సంఖ్య ఎక్కువగా ఉండటమే గాక వారికి ఉదారముగా పెన్షన్‌లు, సెలవు భత్యాలు ఇవ్వడమే. ఇంగ్లండులో ఉన్న సెక్రటరీ ఆఫ్ స్టేట్ కార్యాలయము మీద అయ్యే ఖర్చును భారతదేశము భరించడం మరొక అన్యాయము.

### 3.5.2.6. డ్రెయిన్ పై అర్థశాస్త్రవేత్తల అభిప్రాయాలు :

**3.5.2.6.1. 1878 నాటి ద్రవ్య వివరణ పత్రం :** "డ్రెయిన్ కారణముగా ఇండియా వాణిజ్యానికి అస్వాభావిక స్థితి ఏర్పడింది. ఈ స్థితి వల్ల తాను సరఫరా చేసిన సరుకుల విలువకు సమానమైన వస్తువులను దిగుమతి చేసుకొనే శక్తి ఇండయాకు లేకపోయింది. దేశములో విస్తారమై ఉన్న మూలద్రవ్యాన్ని ఉపయోగించుకొని అభివృద్ధి చెందే అవకాశములోపించింది.

**3.5.2.6.2. రాంసే మాక్డొనాల్డ్ :** "ఇండియాలో ఉత్పత్తి అయిన సరుకుల నుండి ఈ ద్రవ్యాన్ని గ్రహించడము, అట్లా గ్రహించిన ద్రవ్యాన్ని ఇండియా ప్రయోజనార్థం ఉపయోగించకపోవడము - ఇట్లు డ్రెయిన్ వల్ల రెండు విధాలా ఇండియాకు నష్టము కలుగుతున్నది. హోంచార్జీల పేరిట కష్టము అధికమైనపుడు అభ్యుదయము విస్తరించే అవకాశము లేదు.

**3.5.2.6.3. లేలాండ్ జెంక్స్ :** "ఇంగ్లండు ప్రభుత్వము తన సౌకర్యాన్ని ఉద్దేశించి తనఖర్చుల భారాన్ని ఇండియాపై మోపడం అసంబద్ధమైంది. ఇండియా పేరుతో ఏ మాత్రం సంబంధం కలిగిన అంశానికైనా జరిగిన ఖర్చును ఇండియాపై అనగా ప్రాతినిధ్యం ఏ మాత్రమూ లేని ఇండియా రైతుపై మోపింది ఇంగ్లాండు ప్రభుత్వం."

**3.5.2.6.4. జె.సి. కూమారప్ప :** "అనుత్పాదకములైన ఈ ఋణాలు బ్రిటిష్‌వారి ఇండియా ఆక్రమణ ప్రయత్నంలోనే పుట్టాయి. అంతేకాక తమ సామ్రాజ్య ప్రయోజనాన్ని ఉద్దేశించి ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వారు జరిపిన యుద్ధాలకై ఈ ఋణాలు పెరిగాయి. అటువంటి ఋణాన్ని ఇండియా చెల్లించవలసిందిగా వారే నిర్ణయించారు. ఈ యుద్ధాలు జరిగిన ప్రయోజనాలు కూడా భారతదేశ ప్రయోజనాలు కావు. కనుక ఈ ఖర్చుల భారాన్ని భారతదేశంపై మోపడం అన్యాయం."

**3.5.2.6.5. దాదాభాయి నౌరోజి :** "ఇంగ్లండుకు ఏటేటా చెల్లించే కప్పానికి మాటిమాటికీ దేశంలో చెలరేగుతున్న క్షామ పరిస్థితులకు ప్రత్యక్ష సంబంధం ఉంది. మూలధనం అభివృద్ధి యొక్క మందగతి, పారిశ్రామిక అభివృద్ధికి సంభవించిన విరోధం దేశం యొక్క ద్రవ్య నిస్రావానికి హేతువులు".

**3.5.2.6.6. రమేష్ చంద్రదత్ :** "ఆహార ధాన్యాల ఎగుమతి, తత్ఫలితంగా ఏర్పడిన ఆహారపు కొరత, ధాన్యాల అధిక ధరలు - ఇవన్నీ డ్రెయిన్ ఫలితాలు. ఈ డ్రెయిన్ దేశ వినాశనానికై ఏర్పడింది.

### 3.5.2.7. డ్రెయిన్ వలన కలిగిన పరిణామాలు :

**3.5.2.7.1. ఇంగ్లండు సిరిసంపదలు :** ఇంగ్లండు పారిశ్రామికాభివృద్ధికి ఇండియా నుండి ద్రవ్య నిస్రావం వల్ల వచ్చిన ధనమే ముఖ్య సాధనమైంది. ప్లాసీ యుద్ధానంతరం ఇంగ్లాండులో జరిగిన అద్భుతావహమైన పారిశ్రామికాభివృద్ధి భారతీయుల పరిశ్రమల వినాసన్నాన్ని ఆధారం చేసుకొని జరిగిందని నిరూపించడానికి తగిన సాక్ష్యం ఉంది. ఈస్టిండియా కంపెనీ, దాని ఉద్యోగులు బెంగాల్ నుండి దోచుకున్న సంపద పారిశ్రామిక విప్లవపు తొలి రోజుల్లో పరిశ్రమకు ఉత్తేజనం కలిగించిన మూలధనం. యంత్రాల సహాయంతో ఫ్యాక్టరీ పరిశ్రమలను నడుపుటకు కావలసిన పెట్టుబడి ధనంతో చాలా భాగం బ్రిటిష్ వారు ఈ విధంగా సంపాదించారు. ఆధునిక యుగంలో పారిశ్రామికంగా మారిన ఇతర దేశాల వారు విదేశాల నుండి పెట్టుబడి ధనాన్ని ఋణంగా సంపాదించారు. బ్రిటిష్ వారు ఎలాంటి ఋణమూ చేయకుండా తమ పరిశ్రమల్ని అభివృద్ధి చేసుకొని పారిశ్రామిక రంగంలో అగ్రస్థానం వహించడానికి ఇండియా నుండి వారు తరలించుకొని పోయిన ధనమే ప్రధాన కారణం.

**3.5.2.7.2. ఇండియా దారిద్ర్యం :** ఇండియా విదేశీ ప్రభుత్వానికి లోబడి ద్రవ్య నిస్రావం అనే శిక్షననుభవించింది. ద్రవ్య నిస్రావం వల్ల మిగల్చగల సామర్థ్యం నశించింది. దానితో మూలధనం లేక పారిశ్రామికాభివృద్ధి ఆగిపోయింది. ఇంగ్లాండుకు చెల్లించవలసిన కప్పంలో భాగంగా ఆహార ధాన్యాల ఎగుమతి నిర్భంధముంది. తత్ఫలితంగా దేశంలో తిండి కొరత ఏర్పడింది. కొరత ఏర్పడటంతో ధరలు పెరిగాయి. అధిక సంఖ్యాకులై ఉన్న దరిద్రులకు తిండి కరువై దేశమంతటా మాటిమాటికి క్షామ పరిస్థితులు ఏర్పడసాగాయి.

## 3.5.3. నమూనా ప్రశ్నలు :

1. డ్రెయిన్ సిద్ధాంతాన్ని విస్తృతంగా వివరించండి ?

2. బ్రిటిష్ వాణిజ్య విధానాన్ని తెలుపుము ?

## 3.4.5. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Nationalism and Colonialism in Modern India, New Delhi, 1979 |
| 2. | Bipin Chandra, | : | Modern India, New Delhi, 1971 |
| 3. | Percival Spear, | : | A History of India, Vol. 2, Harmondsworth, 1978 |
| 4. | Sumit Sarkar, | : | Modern India, 1885 - 1947, Delhi, 1983 |
| 5. | Alladi Vaidehi, | : | History of Freedom Movement in India, Hyderabad 1991 |
| 6. | Heimsath, | : | Indian Nationalism and Hindu Social Reform, Princeton, 1964 |
| 7. | Vma Kaura, | : | Muslims and Indian Nationalism, New Delhi, 1977 |
| 8. | Mc lane, Indian | : | Nationalism and the Early Congress, Prination, 1977 |
| 9. | Anil Seal, The | : | Emergence of Indian Nationalism, Cambridge, 1967. |
| 10. | K.K. Datta | : | A Social History of Modern India |
| 11. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 12. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern India. |
| 13. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of India Vols. 2 Irfan Habib |
| 14. | Sumit Sarkar | : | Modern India 1885-1947 |
| 15. | R. Plame Dutt | : | Indian Today |
| 16. | R.C. Majumdar | : | History of Freedom Movement in India, 3 Vols. |
| 17. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 19. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 19. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 20. | S.C. Raychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |

# పాఠం - 3.6
# పరిశ్రమల స్థాపన - ఆవిర్భావం

## 3.6.0. లక్ష్యం :

ఆధునిక పరిశ్రమల ఆవిర్భావం, భారతీయ మూలధనం ఉద్యమిత్వం - అనుకూల పరిస్థితులు, కొన్ని ప్రధాన భారతీయ పరిశ్రమలు, భారత పరిశ్రమల ప్రగతి లక్షణాలు, భారతదేశంలో సాంఘిక మార్పులో మధ్యతరగతి పాత్ర తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


3.6.1. ఆధునిక పరిశ్రమల ఆవిర్భావం

3.6.1.1. పారిశ్రామికీకరణ ఆవశ్యకత

3.6.1.2. భారత పారిశ్రామిక వ్యవస్థ

3.6.1.3. వినియోగ వస్తువులు తయారు చేసే పరిశ్రమల ప్రాముఖ్యం

3.6.2. భారతీయ మూలధనం ఉద్యమిత్వం - అనుకూల పరిస్థితులు

3.6.2.1. భారతీయ మూలధన చొరవ

3.6.2.2. రాజకీయ సుస్థిరత

3.6.2.3. వర్తకుల సంపద పెంపు

3.6.2.4. ప్రపంచ యుద్ధాలతో పెరిగిన గిరాకీ

3.6.2.5. స్వదేశీ ఉద్యమం

3.6.3. కొన్ని ప్రధాన భారతీయ పరిశ్రమలు

3.6.3.1. వస్త్ర పరిశ్రమ

3.6.3.2. జనపనార మిల్లు పరిశ్రమ

3.6.3.3. ఇనుము, ఉక్కు పరిశ్రమ

3.6.3.4. పంచదార పరిశ్రమ

3.6.3.5. ఇతర పరిశ్రమలు

3.6.4. భారత పరిశ్రమల ప్రగతి లక్షణాలు

3.6.4.1. కొద్ది మంది చేతిలో పరిశ్రమలు

3.6.4.2. బ్యాంకింగ్ పెట్టుబడి ఆధిపత్యం

3.6.4.3. మేనేజింగ్ ఏజెన్సీ పద్ధతి

3.6.5. ప్రభుత్వ పారిశ్రామిక విధానం

3.6.5.1. స్వేచ్ఛా వ్యాపార విధానం

3.6.5.2. విచక్షణా విధానం

3.6.6. పరిశ్రమల మంద ప్రగతికి కారణాలు

3.6.6.1. చాలని మూలధనం

3.6.6.2. విదేశీ పరిశ్రమల పోటీ

3.6.6.3. ప్రభుత్వ విముఖత

3.6.6.4. ప్రభుత్వ ద్రవ్య విధానం

3.6.6.5. రైతుల దారిద్ర్యం

3.6.6.6. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవుట

3.6.7. మధ్యతరగతి వారు - భారతదేశంలో సాంఘిక మార్పులో మధ్యతరగతి పాత్ర

3.6.7.1. మధ్యతరగతి

3.6.7.2. బ్రిటీష్ వారికి పూర్వం భారత సమాజం

3.6.7.3. బ్రిటన్‌లో మధ్య తరగతి ఆవిర్భావం ప్రగతి

3.6.7.4. ఇండియాలో మధ్య తరగతి

3.6.7.5. వాణిజ్య రంగంలో మధ్య తరగతి

3.6.7.6. ఏజెంట్లు, బ్రోకర్లు, మధ్యవర్తులు

3.6.7.7. వాణిజ్య వర్గం శక్తి యుక్తులు

3.6.7.8. పారిశ్రామిక మధ్య తరగతి

3.6.7.9. పారిశ్రామికీకరణలో కంపెనీ ఉద్యోగుల పాత్ర

3.6.7.10. భారతీయుల పెట్టుబడులు

3.6.7.11. యాజమాన్యపు ఏజెన్సీ - మధ్య తరగతి

3.6.7.12. పరిపాలన - మధ్య తరగతి అభివృద్ధి

3.6.7.13. సాంఘిక మార్పులో మధ్యతరగతి వారి పాత్ర

3.6.8. నమూనా ప్రశ్నలు

3.6.9. చదువదగిన గ్రంథాలు

## 3.6.1. ఆధునిక పరిశ్రమల ఆవిర్భావం :

**3.6.1.1. పారిశ్రామికీకరణ ఆవశ్యకత :** దేశ పారిశ్రామికీకరణ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ముఖ్యంగా పరాయి పాలనలో వెనుకబడిన ఇండియా వంటి దేశాలు చేసే కృషిలో పారిశ్రామికీకరణకు విశిష్టమైన స్థానం ఉంది. అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికంగా ప్రగతిని సాధించాయి. వెనుకబడిన దేశాలు వ్యవసాయ ప్రాధాన్యం కలవి. ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలలో కన్నా పారిశ్రామికరంగంలో అంతర్గత, బహిర్గత ఆదాయాలను పొందడానికి ఎక్కువ అవకాశాలున్నాయి. అల్ప ఉద్యోగిత ప్రబలంగా ఉన్న వ్యవసాయ రంగంలో నుండి అదనపు శ్రామిక జనాన్ని విస్తరించుచున్న పారిశ్రామిక రంగంలోనికి తరలించవచ్చు. పారిశ్రామికీకరణవల్ల వెనుక బడిన దేశాల్లో చొరవ, గమనశీలత, ఉద్యమిత్వము, వైజ్ఞానిక దృష్టి, పెట్టుబడి ఉద్భవిస్తాయి. పారిశ్రామికీకరణ ఫలితంగా అనేక సమస్యలు ఒత్తిడులు ఏర్పడతాయి. వాటిని అవగాహన చేసుకొని పరిశ్రమల అభివృద్ధి సరియైన మార్గంలో జరిగేటట్లు చూడాలి.

**3.6.1.2. భారత పారిశ్రామిక వ్యవస్థ :** భారతదేశంలో ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ 19వ శతాబ్దం రెండో భాగంలో ఫ్యాక్టరీ పరిశ్రమలను నెలకొల్పడంతో ఏర్పడింది. పారిశ్రామికీకరణ ప్రక్రియ వంద సంవత్సరాల నుండి కొనసాగుతూ ఉన్న పటిష్టమైన పారిశ్రామిక వ్యవస్థ రూపొందలేదు. కాని ఎంతో కాలంగా పేరు ప్రఖ్యాతులు పొందిన చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలు మాత్రం క్షీణించాయి. పాత వ్యవస్థ అంతరించగా దాని స్థానంలో సరైన నూతన వ్యవస్థ ఏర్పడలేకపోయింది. పారిశ్రామిక విప్లవానికి అనుగుణంగా వలస వాద దోపిడి విధానమే ప్రధానంగా భావించిన కంపెనీ ప్రభుత్వం కాని, బ్రిటీష్ ఇండియా ప్రభుత్వంగాని దేశంలో పరిశ్రమల స్థాపనను, ప్రగతిని ప్రోత్సహింపలేదు. కంపెనీ వారి ఏకస్వామ్యం రద్దు అయిన పిమ్మట కొందరు బ్రిటీష్ ఉద్యమదారులు తమకు లాభదాయకమైన పరిరశమలను ఇండియాలో నెలకొల్పడానికి ముందుకు వచ్చారు. కాని బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం భారతీయుల మూలధనం పెట్టుబడినిగాని దేశీయ పరిశ్రమల స్థాపననుగాని ప్రోత్సహించలేదు. క్రమేణ 19 వ శతాబ్దం ఉత్తరార్థంలో బ్రిటీష్ మూలధనంతో బాటు భారత పెట్టుబడిదారులు కూడా పరిశ్రమల స్థాపనకు పూనుకున్నారు.

**3.6.1.3. వినియోగ వస్తువులు తయారు చేసే పరిశ్రమల ప్రాముఖ్యం :** వంద సంవత్సరాలకు పూర్వం ఇండియాలో బట్టలు, జనపనార వంటి పరిశ్రమలు నెలకొల్పడం జరిగింది. అయినా పారిశ్రామికీకరణ ప్రక్రియలో పటుత్వం కనిపించదు. పటిష్టమైన కృషి మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రారంభమైంది. అప్పుడే ఉక్కు కర్మాగారం, సిమెంటు కర్మాగారం స్థాపించడం జరిగినా వాటి అభివృద్ధి నామమాత్రంగానే ఉంది. 1930 తరువాత ప్రత్తి వస్త్రాలు, సిమెంటు, పంచదార, కాగితం, తేలిక ఇంజనీరింగ్ మొదలైన పరిశ్రమలు విస్తరిస్తాయి. వినియోగ వస్తువులు తయారు చేసే పరిశ్రమలు చెప్పుకోదగిన ప్రగతిని సాధించినప్పటికీ ఆర్థికాభివృద్ధిని తక్కువ కాలంలో సాధించడానికి అవసరమైన మౌళిక భారీ పరిశ్రమలు, రసాయనాలు, యంత్ర నిర్మాణం మొదలగునవి అసలు లేవనే చెప్పవచ్చు. వాటిని నెలకొల్పే విషయంలో ప్రయత్నం కూడా జరగలేదు. ఈ కారణంగా పారిశ్రామికోత్పత్తిలో వినియోగం వస్తువుల భాగం అధికంగా ఉంటూ వచ్చింది.

## 3.6.2. భారతీయ మూలధన ఉద్యమిత్వం - అనుకూల పరిస్థితులు :

**3.6.2.1. భారతీయ మూలధన చొరవ :** 19వ శతాబ్ది ప్రారంభం నాటికి దేశంలో అధిక భాగం కంపెనీవారి ఆధిపత్యంలోనికి వచ్చింది. రాజకీయ సుస్థిరత్వం నెలకొన్న పరిస్థితిలో భారతీయ పెట్టుబడిదారులు ఇండియా విముక్తిలో పాల్గొనడానికి తమ మూలధనం వినియోగించడానికి ప్రయత్నించారు. ఈ వ్యక్తిగత ఉద్యమదారులలో వడ్డీ వ్యాపారస్తులు, వర్తక ప్రముఖులు, దేశీయ బ్యాంకర్లు చెప్పదగిన వారు. వీరు అనుకూలంగా రూపొందిన వాణిజ్య పరిస్థితులను ఆధారం చేసుకొని పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడానికి తమ దగ్గర ఉన్న అపార సంపదను వినియోగింప సంకల్పించారు. వీరి చొరవకు కారణమైన అనుకూల పరిస్థితులను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

**3.6.2.2. రాజకీయ సుస్థిరత :** 1854 నాటి తిరుగుబాటును విజయవంతంగా అణచివేయగల్గిన పిమ్మట ఆంగ్లేయులలో ఆత్మ విశ్వాసం అధికరించింది. మారిన పరిస్థితులకు అనుగుణంగా భారతీయులు కూడా రాజీ పడ్డారు. దాంతో రాజకీయమైన అలజడులు అదృశ్యమైనాయి. అట్టి ప్రశాంత పరిస్థితుల్లో, రాజకీయ సుస్థిరతతో మూలధన ఉద్యమిత్వం, పరిశ్రమలూ వర్థిల్లాయి.

**3.6.2.3. వర్తకుల సంపద పెంపు :** అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 1861-65 సంవత్సరములో సంఘటిల్లిన అంతర్యుద్ధం పరోక్షంగా ఇండియాలోని ప్రత్తిమిల్లు పరిశ్రమకు దోహదమిచ్చింది. 1868లో అబిసీనియాకేగిన బ్రిటీష్ సైన్యానికి కావల్సిన నూలు వస్త్రాలను సరఫరా చేసి భారతీయ వర్తకులు లాభాలు గడించారు. వారు చైనా తోటి నల్ల మందు వ్యాపారంలో కూడ అమితధనం సంపాదించారు. ఇలా పోగైన మూలధనాన్ని భారతీయ వర్తకులు పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడానికి ముందంజ వేశారు.

**3.6.2.4. ప్రపంచ యుద్ధాలలో పెరిగిన గిరాకీ :** ఇంగ్లండ్ రెండు ప్రపంచ యుద్ధాల్లోను పాల్గొన్నది. యుద్ధావసరాలకు కావలసిన వస్తువులను దిగుమతి చేసికొనడానికి, నిలవచేసుకొనడానికి ఇంగ్లండు దాని మిత్ర దేశాల్లో ఇండియా ఉత్పత్తులకు గిరాకీ ఏర్పడింది. యుద్ధ సంబంధమైన పరిశ్రమల్లో తమ మూలధనం పెట్టుబడి పెట్టడానికి భారతీయ పారిశ్రామికులకు అవకాశం లభించింది. ప్రపంచ దేశాలన్నిటిలో పెరిగిన గిరాకీ మూలంగా ఇండియా వర్తకులకు, పారిశ్రామికులకు పోటీ అన్నది లేకుండా పోయింది. ఇండియాలోని వాణిజ్య బ్యాంకులలోని డిపాజిట్లు పెరిగిపోయాయి. వాణిజ్య విజయం మరికొన్ని శాఖలు నెలకొనడానికి ప్రోత్సాహమిచ్చింది. యుద్ధకాలంలో విపరీత లాభాలు గడించిన ఇన్సూరెన్స్ కంపెనీలు తమ లాభాలతో పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడ్డాయి. దేశీయుల ఉద్యమిత్వము, మూలధనము పలుకుబడితో నమ్మకం కుదిరిన బ్రిటీష్ పారిశ్రామికులు వారితో కలిసి క్రొత్త పరిశ్రమలు ఇండియాలో స్థాపించారు.

**3.6.2.5. స్వదేశీ ఉద్యమం :** 1905లో వంగ విభజన కారణంగా చెలరేగిన వందేమాతరం ఉద్యమంలో స్వదేశీ ఉద్యమం అంతర్భాగం. ఈ ఉద్యమం భారతీయుల పరిశ్రమలకు కొంత భరోసా కల్పించింది. పరాయి పాలన తొలగితేనే గాని భారతీయ పరిశ్రమలు వర్ధిల్ల జాలవన్న నమ్మకం దేశీయులకు కలిగింది. భారతీయ పారిశ్రామిక ప్రగతి వల్ల దేశంలో స్వాతంత్ర్యోద్యమం బలపడసాగింది.

## 3.6.3. కొన్ని ప్రధాన భారతీయ పరిశ్రమలు :

ఇండియాలో పరిశ్రమల అభివృద్ధిలో భారతీయ మూలధన ఉద్యమిత్వం పాత్రను, ఇండియాలో పారిశ్రామికీకరణ జరగడానికి తోడ్పడిన పరిస్థితులను తెలిసికొనడానికి కొన్ని ప్రధాన భారతీయ పరిశ్రమ చరిత్రను పరిశీలించవల్సి ఉన్నది.

**3.6.3.1. వస్త్ర పరిశ్రమ :** వస్త్ర పరిశ్రమ ఇండియాలోని పెద్ద ఫ్యాక్టరీ పరిశ్రమ. భారతీయుల మూలధన ఉద్యమిత్వం వల్లనే ఇది స్థాపించబడి పెంపొందింది. ఇండియాలో తొలి దూది మిల్లు 1818లో హౌరా సమీపంలో స్థాపించబడినప్పటికీ ఈ పరిశ్రమ ప్రారంభం 1851 నుండి జరిగిందని చెప్పాలి. ఆ ఏడు ఒక బొంబాయి వర్తకుడు బొంబాయిలో దూదిమిల్లు స్థాపించాడు. 1860 తరువాత వస్త్ర పరిశ్రమ శరవేగంతో వృద్ధి పొందింది. 1880-95 మధ్య కాలంలో పరిశ్రమ ప్రగతి గణనీయంగా ఉంది. ఆ తరువాత పదేళ్ళలో వ్యవసాయ క్షీణత వల్ల, బొంబాయిలో అంటు వ్యాధి కారణంగా, కార్మికుల కొరత వల్ల అమెరికన్ స్పెక్యులేషన్ కారణంగా ధరలలో ఒడిదుడుకుల వల్ల, చైనాలోని అరాచకం కారణంగా మార్కెట్ పడిపోవడం వల్ల భారతీయ వస్త్ర పరిశ్రమ మాంద్యానికి గురి అయింది. 1905 తరువాత మాద్యం తొలగి స్వదేశీ ఉద్యమం వల్ల లాంక్‌షైర్ మిల్లుల పోటీని తట్టుకొని నిలిచి ప్రగతి సాధించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సైనికుల వస్త్రాలకై ఆర్డర్లు రావడం వల్ల, దిగుమతులు తగ్గడం వల్ల, ధరలు పెరుగుదల వల్ల వస్త్ర పరిశ్రమ పుంజుకుంది. యుద్ధానంతరపు ఆర్థిక మాంధ్య కాలంలో జపాన్ వస్త్రాల పోటీ వల్ల, ముడి ప్రత్తి ధరల పెరుగుదల వల్ల, రైతుల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల, పరిశ్రమ తీవ్ర సంక్షోభానికి గురి అయింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో లాంక్ షైర్ వస్త్రాల దిగుమతి, జపాన్ వస్త్రాల దిగుమతి ఆగిపోవడం వల్ల ఇండియా వస్త్ర పరిశ్రమ అభివృద్ధి పొందింది. దేశ విదేశాలలోని గిరాకీకి తగిన వస్త్రాలను ఉత్పత్తి చేయలేకపోయింది. 1992 నాటికి ఇండియాలో 1300 కోట్ల రూపాయల పెట్టుబడితో 1133 దూదిమిల్లులు నడుస్తున్నాయి. వస్త్ర పరిశ్రమ పూర్తిగా భారతీయ యాజమాన్యం లోనిది. లాంక్‌షైర్, జపాన్ వస్త్రాల పోటీకి తట్టుకొని నిలిచింది. ప్రభుత్వం ఈ పరిశ్రమలకు ఎలాంటి రక్షణ కల్పించలేదు.

**3.6.3.2. జనపనార మిల్లు పరిశ్రమ :** ఇది బ్రిటీష్ వారి మూలధనంతో స్థాపింపబడింది. ఈ పరిశ్రమ 1854లోనే స్థాపించబడినప్పటికి 1884 దాకా పుంజుకోలేదు. 1880 తరువాత ఆవిరి యంత్ర పరికరాల వాడకంతో ఉత్పత్తి బాగా పెరిగిపోయి స్వదేశం లోనేగాక, ఆసియా, ఆస్ట్రేలియా మార్కెట్లను కూడా కైవశం చేసుకుంది. 1884లో జనపనార పరిశ్రమల యజమానులు తమ ప్రయోజనాల సంరక్షణకై ఒక

సంఘాన్ని స్థాపించుకున్నారు. 1894 నాటికి దండీలోని జనపనార పరిశ్రమతో ఇండియా పరిశ్రమ పోటీపడడం ప్రారంభించి 1908 నాటికి డండీ మిల్లులను అధిగమించింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో పరిశ్రమ బాగా విస్తరించింది గాని తరువాత ఆర్థిక మాంద్య కాలంలో దెబ్బతిన్నది. రెండవ ప్రపంచ యుద్ధంతో తేరుకున్నది. జనపనార పరిశ్రమ ముఖ్యంగా బ్రిటీష్ మూలధనంతో నెలకొల్పబడినప్పటికీ భారతీయుల మూలధనం కూడా క్రమంగా దానిలో ప్రవేశించింది. దేశీయుల పోటీ వల్ల, బ్రిటీష్ ప్రభుత్వ వైమనస్యం వల్ల దెబ్బతింటున్న ఈ పరిశ్రమను స్కాటిష్ ఉద్యమదార్లు, స్వప్రయోజనాల కొరకు సంరక్షించారు.

**3.6.3.3. ఇనుము, ఉక్కు పరిశ్రమ :** దేశంలోని అన్ని పరిశ్రమలు ఈ పరిశ్రమపై ఆధారపడి ఉన్నాయి. జెంషెడ్జ్ తాతా కుమారులు 1907 లో కలకత్తా సమీపంలో ఇనుము పరిశ్రమ నెలకొల్పారు. 1913 నాటికి ఉక్కు ఉత్పత్తి ప్రారంభమైంది. 1916లో యుద్ధ గిరాకీ కారణంగా ఈ పరిశ్రమ ఉత్పత్తి అధికరించింది. తాతా వారి సాఫల్యం చూసి 1919లో ఇండియన్ ఐరన్ ఉక్కు కంపెనీ నెలకొల్పబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత పెక్కు కంపెనీలు స్థాపించబడ్డాయి. యుద్ధానంతరం యూరోపియన్ పరిశ్రమల వల్ల ఇండియా పరిశ్రమ గట్టి పోటీని ఎదుర్కొన్నది. ప్రభుత్వ దిగుమతి సుంకాల విధింపు ద్వారా ఈ పరిశ్రమలకు రక్షణ కల్పించింది. కాని వారి రక్షణ విధానం బ్రిటీష్ పరిశ్రమకు అనుకూలంగా రూపొందించబడింది. అయినప్పటికీ ముడి ఇనుము అధికంగానూ, చౌకగాను లభించడం వల్ల ఈ పరిశ్రమ బాగా వృద్ధి పొందింది. ఈ పరిశ్రమ భాతీయులచే స్థాపించబడడం విశేషం. ఇది బ్రిటీష్ వారి పోటీని తట్టుకొని నిలిచింది.

**3.6.3.4. పంచదార పరిశ్రమ :** ప్రాచీనకాలం నుండి ఇండియాలో పంచదార పరిశ్రమ అమలులో ఉండేది. ఈస్టిండియా కంపెనీ మన పంచదారను విదేశాలకు ఎగుమతి చేసేది. భారతీయ కూలీల శ్రమ వల్ల వర్థిల్లిన మారిషస్ నుండి బ్రిటీష్ ప్రభుత్వం చక్కెరను దిగుమతి చేసుకోనారంభించింది. 1932 నుండి ఇండియా పంచదార పరిశ్రమకు ప్రభుత్వం రక్షణ కల్పించింది. అప్పటి నుండి ఈ పరిశ్రమ ఇండియా స్వయం సమృద్ధమగుటే గాక ఎగుమతులు కూడా ప్రారంభించింది.

**3.6.3.5. ఇతర పరిశ్రమలు :** యంత్రాలపై తయారైన కాగితం 1870లో ఇండియాలో ప్రవేశపెట్టింది. 1925 నుండి ప్రభుత్వము అవలంబించిన రక్షణ విధానము వల్ల ఇండియాలో కాగిత పరిశ్రమ వర్థిల్లింది. 1860లో ప్రారంభమైన తోట పరిశ్రమ రెండు ప్రపంచ యుద్ధాల ఫలితముగా వృద్ధి పొందింది. 19వ శతాబ్దంతంలో ప్రారంభించబడిన గాజు పరిశ్రమ కూడా యుద్ధానంతరమే ఊపిరి పోసుకుంది. 1912 డాల్మియాలిచే స్థాపించబడిన సిమెంటు పరిశ్రమ ముడి పదార్థాల కొరత వల్లనూ, ప్రభుత్వ ఉదాసీనత వల్లనూ త్వరగా వ్యాపించలేదు.

## 3.6.4. భారత పరిశ్రమల ప్రగతి లక్షణాలు :

**3.6.4.1. కొద్ది మంది చేతిలో పరిశ్రమలు :** బ్రిటీష్ పాలనలోని ఇండియాలో పరిశ్రమలు, వర్తకం, బ్యాంకింగ్ మున్నగు రంగాల్లో జరిగిన అభివృద్ధిలో అధిక భాగం కొద్ది మంది పెట్టుబడిదారుల చేతుల్లో ఉండిపోయింది.

**3.6.4.2. బ్యాంకింగ్ పెట్టుబడి ఆధిపత్యం :** భారీ పరిశ్రమల స్థాపనకు పెట్టుబడి కూడా భారీగానే అవసరమైంది. ఇది చిన్న పెట్టుబడిదార్ల తలకు మించిన పని కావడంతో బ్యాంకింగ్ పెట్టుబడులను ఆశ్రయింపక తప్పలేదు. దాంతో భారతీయ పరిశ్రమలపై ఆదుపు బ్యాంకింగ్ పెట్టుబడుల క్రిందకొచ్చింది.

**3.6.4.3. మేనేజింగ్ ఎజెన్సీ పద్ధతి :** భారతదేశంలో పరిశ్రమల నిర్వహణ మేనేజింగ్ ఏజెన్సీ పద్ధతిలో జరిగింది. తొలుత పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకములుగా నున్న పెద్ద పెద్ద వ్యాపార సంస్థలే మేనేజింగ్ ఏజెంట్లుగా రూపొందాయి. మేనేజింగ్ ఏజెంట్ల మద్దతు ఉండబట్టే పారిశ్రామిక సంస్థలు వాటా మూలధనం పొందగలిగేవి. మేనేజింగ్ ఏజెంట్లు కొత్త పారిశ్రామిక సంస్థల స్థాపనను ప్రోత్సహించడం, వాటికి ద్రవ్యాన్ని సమకూర్చడం, వాటిని నిర్వహించడం అనే మూడు కార్యకలాపాలను నెరవేర్చేవి. మేనేజింగ్ ఏజెంట్లు వ్యక్తులుగా గానీ భాగస్వామ్య సంస్థలుగా గానీ లేదా ఉమ్మడి వాటా కంపెనీలుగా గానీ వ్యవహరించవచ్చు. పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడంలో మేనేజింగ్ ఏజెంట్లు చేసిన కృషి కొనియాడదగినవి. కాని మేనేజింగ్ ఏజెంట్లు తమ స్వార్థం కోసం పరిశ్రమలకు హానికరమైన పద్ధతులను కూడా అవలంభించేవారు. జనపనార, సిమెంటు, బట్టలు, ఇనుము ఉక్కు, బొగ్గు, కాగితం పరిశ్రమలలో మేనేజింగ్ ఏజెంట్ల ప్రాబల్యం అత్యధికంగా ఉండేది.

## 3.6.5. ప్రభుత్వ పారిశ్రామిక విధానం :

**3.6.5.1. స్వేచ్ఛా వ్యాపార విధానం :** ఆంగ్ల పాలనలో ప్రభుత్వం వారు ఇండియా పారిశ్రామికాభివృద్ధి పట్ల ఏ విధమైన శ్రద్ధ చూపలేదు. ఆర్థిక విషయాలలో ప్రభుత్వం జోక్యం కలిగించుకోరాదనే 19వ శతాబ్దపు సిద్ధాంతాన్ని అనుసరించింది. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశాన్ని ఒక వలస ఆర్థిక వ్యవస్థగా పరిగణించడమే దీనికి కారణము. మాంచెస్టర్ పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వము వ్యవహరించింది. అందుకే భారత పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి పూనుకోలేదు. ప్రభుత్వం అవలంభించిన స్వేచ్ఛా వ్యాపార విధానము భారత పరిశ్రమల పురోభివృద్ధికి ప్రతిబంధకమైనది.

**3.6.5.2. విచక్షణా విధానం :** అభివృద్ధి చెందిన దేశీయ పరిశ్రమల పోటీని తొలగించడానికి దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించడమూ ప్రభుత్వ కర్తవ్యము. కాని 1920 వరకు ప్రభుత్వ కోశ విధానం స్వేచ్ఛా వ్యాపార విధానాన్ని అంటి పెట్టుకొని ఉంది. 1921 లో నియమింపబడిన ఫిస్కల్ కమీషన్ దేశీయ పరిశ్రమలకు రక్షణ కల్పించడానికి ఒక పథకాన్ని రూపొందించారు. దాని ప్రకారం కొన్ని అర్హతలున్న పరిశ్రమలను ఎన్నిక చేసి వాటికి మాత్రమే రక్షణ ఇవ్వవలెనని సూచించింది. దీనినే విచక్షణా రక్షణ విధానం అంటారు. ఈ విధానములో అనేక లోపాలున్నాయి. ఈ విధంగా రక్షణ పొంది పెంపొందిన వాటిలో ఇనుము ఉక్కు, నూలువస్త్రాలు, పంచదార, కాగితం మొదలగు పరిశ్రమలు చెప్పదగినవి.

## 3.6.6. పరిశ్రమల మంద ప్రగతికి కారణాలు :

**3.6.6.1. చాలని మూలధనం :** మూలధనం పారిశ్రామిక వ్యవస్థకు జీవనాడి. మూలధనం సేవింగ్స్ ద్వారా ప్రోగవుతుంది. స్వయం సమృద్ధి సాధించని వ్యవసాయక దేశంలో ఇట్టి మూలధనం కొరవ అవడం వల్లనే పరిశ్రమలు సత్వర ప్రగతి సాధించలేదు.

**3.6.6.2. విదేశీ పరిశ్రమల పోటీ :** శైశవ స్థితిలో ఉన్న భారతీయ పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందిన బ్రిటన్, జర్మనీ, అమెరికా, జపాన్ పరిశ్రమల పోటీని ఎదుర్కొనవల్సి వచ్చింది.

**3.6.6.3. ప్రభుత్వ విముఖత :** పారిశ్రామిక దేశాలన్నింటిలోనూ పరిశ్రమలకు జాతీయ ప్రభుత్వాల ప్రోత్సాహము, రక్షణ ఉంటుంది. కాని ఆంగ్లేయుల ప్రయోజనాలు మాత్రమే ముఖ్యంగా భావించే ప్రభుత్వం స్వేచ్ఛా వ్యాపార విధానం అవలంభించి భారతీయ పరిశ్రమలను దెబ్బతీసింది.

**3.6.6.4. ప్రభుత్వ ద్రవ్య విధానం :** భారతీయ పరిశ్రమల ప్రయోజనాలకు విరుద్ధమైన మారకపు నిష్పత్తితో కూడిన ద్రవ్య విధానాన్ని ప్రభుత్వం అవలంభించింది.

**3.6.6.5. రైతుల దారిద్ర్యం :** దేశంలో అధిక సంఖ్యాకులైన రైతులు దరిద్రులు కావడం వల్ల భారతీయ పారిశ్రామిక ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించగల శక్తి వారికి లేకపోయింది.

**3.6.6.6. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవుట :** సాంకేతిక పరిజ్ఞానం కలిగిన భారతీయ కొరత దేశీయ పరిశ్రమల ప్రగతి మందగించడానికి కారణమైంది.

## 3.6.7. మధ్య తరగతివారు - భారతదేశంలో సాంఘిక మార్పులో మధ్య తరగతి వారి పాత్ర :

**3.6.7.1. మధ్య తరగతి :** మధ్య తరగతి అనే పదం సమాజం నందలి భౌతిక వాద దృష్టిని బట్టి రూపొందినది. పారిశ్రామిక విప్లవం తరువాత పాశ్చాత్య సమాజంలో ఆర్థిక స్థితిననుసరించి ఉన్నత వర్గం, మధ్య తరగతి, నిమ్న వర్గం అని మూడు వర్గాలు ఏర్పడి స్థిరపడ్డాయి. ఈ భౌతిక ప్రపంచంలో ఆర్థిక అసమానతలే సాంఘిక సంబంధాలకు మూలకందాలైనాయి. ఆస్తి పాస్తులు లేదా ఉత్పత్తి పంపిణీ సాధనాలు కలిగియుండుట అన్న అంశం మాత్రమే ఒక వర్గం స్థాయిని నిర్ణయిస్తూ ఉంది. అటువంటి ఆధునిక సమాజంలో

అగ్రవర్ణం లేదా ఉన్నత వంశం అనే విషయాలను బట్టి గాక సంపన్నత మాత్రమే ఒక వ్యక్తి యొక్క సాంఘిక హోదాను తెలుపుతూ ఉంది. ఒక ధనవంతుని యాజమాన్యంలో పని చేసే ఒక వ్యక్తి స్థాయి ఆ ధనవంతుని స్థాయికంటే సహజంగా తక్కువగానే ఉంటుంది. కనుక ఆధునిక సమాజంలో సమాన ఆర్థిక ప్రయోజనాలు కలిగిన వారంతా ఒక వర్గంగా ఏర్పడడం జరుగుతూ ఉంది. ఆయా వర్గాల జీవన ప్రమాణము, వృత్తి, స్వభావం సంపదలను బట్టి ఆ వర్గ ప్రజల సాంఘిక ప్రతిష్ఠ, అధికారము ఆధారపడి ఉంటుంది.

నేడు సమాజ విధానం, ప్రాచీన మధ్య యుగాల నాటి సమాజ స్వరూప స్వభావాలకు భిన్నమైనది. ఆనాడు రాజకీయాధికారము, లేదా మాతాధికారమే ఉన్నత సాంఘిక స్థాయిని కలిగించేది. 16, 17 శతాబ్దాలలో ప్రాబల్యము వహించిన వ్యాపార వర్గమూ, వలస దారులూ ఫ్యూడల్ వ్యవస్థ ఆధిపత్యమును, మతాధికారుల పెత్తనాన్ని ప్రశ్నింపనారంభించినారు. రూసో వంటి తత్వవేత్తలు సమానత్వము, స్వాతంత్ర్యం, సౌభాతృత్వం మున్నగు ఆశయాలను ప్రచారం చేసారు. ఈ ఆశయాల వల్ల ప్రభావితులైన వణిజులు మున్నగు వారు సామర్థ్యం మీద ఆధారపడిన సమానావకాశాల కోసం అర్రులు చాచారు. స్వయం శక్తి చేత సంపద, విద్య, అధికారము సాధించిన వీరు ఫ్యూడల్ వ్యవస్థను విచ్ఛిన్నం చేసారు. పాత సాంఘిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఈ వర్గాన్నే మధ్య తరగతి లేక బూర్జువాలు అని వ్యవహరించేవారు.

**3.6.7.2. బ్రిటీష్ వారికి పూర్వం భారత సమాజం :** మధ్యయుగం వరకూ హిందూ వర్ణ వ్యవస్థలో సాధారణంగా క్షత్రియులకు రాజ్యాధికారము యుద్ధ ప్రక్రియ, బ్రాహ్మణులకు పౌరోహిత్యం, వేద శాస్త్రాభ్యాసనం, వైశ్యులకు వ్యాపారం, శూద్రులకు తక్కిన వృత్తులు నిర్ణయింపబడ్డాయి. శూద్రులలో చతుర్థులు, పంచములు అనే రెండు తెగలున్నాయి. వీరిలో కూడా కాలక్రమేణ అనేక కులాలు ఏర్పడ్డాయి. ఆయా కులాలకు ప్రత్యేక వృత్తులు కేటాయించబడ్డాయి. ఎవరి కుల వృత్తులు వారు తప్పక చేయవలసి వచ్చేది. పారిశ్రామిక ప్రగతి వలన మార్పు చెందుతున్న పరిస్థితుల్లో కూడా ఈ పారిశ్రామిక రంగంలోనూ దానికి అనుబంధమైన ఇతర రంగాలలోనూ పెద్ద ఎత్తున ఉన్నత పదవులను, ఉద్యోగాలను అగ్ర వర్ణాల వారే చేజిక్కించుకున్నారు. శూద్రులు కార్మికులుగా, బంట్రోతులుగా మిగిలిపోయారు.

**3.6.7.3. బ్రిటన్‌లో మధ్యతరగతి ఆవిర్భావం ప్రగతి :** ఆంగ్లేయుల ప్రభావం వల్లే ఇండియాలో మధ్యతరగతి ఆవిర్భవించింది. బ్రిటన్‌లో కూడా ఆధునిక యుగారంభం నుండియే మధ్య తరగతి రూపొందింది. 15వ శతాబ్ది అంతంలో క్రొత్త సముద్ర మార్గాలు కనుగొనడంతో యూరప్ ఖండా దేశాల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇండియా మున్నగు తూర్పు దేశాల్లో వాణిజ్యం లాభసాటి అయ్యింది. ఫలితంగా పోర్చుగల్, హాలెండ్, ఫ్రాన్స్, ఇంగ్లండులలో శక్తివంతమైన వాణిజ్య వర్గం బయలుదేరింది. ఇంగ్లండుకు చెందిన సాధారణ వర్తకుల చిన్న సంఘం క్రమేపి బ్రహ్మాండమైన ఈస్టిండియా కంపెనీగా రూపొంది పరిస్థితుల ప్రభావం వలన ఇండియాపై సార్వభౌమత్వం సంపాదించింది. ఈ రాజకీయాధికారంతో పాటు ఇండియా నుండి ఎడతెగక వచ్చిపడే ధనరాసులు కంపెనీ వర్తకులు, ఉద్యోగుల బొక్కసాలు నింపాయి. వీరు ప్రత్యేక వర్గంగా తయారై భూస్వామ్య కులీన వర్గాల గుత్తాధిపత్యాన్ని తొలగించారు. వాణిజ్య ప్రగతి వల్ల కలిగిన సంపద పారిశ్రామిక ప్రగతికి దోహదం చేసి ఇంగ్లండ్ సర్వతోముఖాభివృద్ధి చెందింది. వర్తకులు, కంపెనీ ఉద్యోగులు ప్రభుత్వోద్యోగులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు మున్నగు వారంతా మధ్య తరగతి వారుగా పరిగణింపబడినారు. క్రమంగా బ్రిటన్, దానితోపాటు బ్రిటీష్ సామ్రాజ్యంపై రాజకీయాధికారం ఈ 'బూర్జువా'ల చేతిలోనికి వెళ్ళిపోయింది.

**3.6.7.4. ఇండియాలో మధ్య తరగతి :** ఇండియాలో పరిస్థితి బ్రిటన్ పరిస్థితికి కొంత భిన్నమైనది. ఇండియాలో మధ్యయుగంలో అనగా మొగలుల పాలనలో పరిశ్రమలు తద్వారా ఆర్థిక పరిస్థితి ఉచ్ఛస్థాయిలో ఉండేవి. ఈ వైభవమే పాశ్చాత్య వర్తకులను, ఆకర్షించింది. ఆనాడు వర్తకులు, జాగీర్ధార్లు, సర్దార్లతో సమానమైన ప్రతిష్ట కలిగి ఉండేవారు. కళా జీవులు, బుద్ధి జీవులు గౌరవాస్పదంగా జీవించేవారు. ఈ విధంగా చూస్తే ఇండియాలో మధ్య యుగంలోనే మధ్య తరగతి మనుగడ సాగించిందని చెప్పవచ్చును. కానీ మొగల్ ప్రభుత్వ విధానంలో జాగీద్దార్ల జాగీర్లు వంశపారంపర్యంగా వచ్చేవికావు. ఈ విధానం బ్రిటీష్ తరహా మధ్య తరగతి ఏర్పడడానికి అవరోధమైంది. అందువల్ల ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం నెలకొన్న తరువాతనే బ్రిటీష్ తరహా మధ్య తరగతి ఇండియాలో కూడా ఏర్పడడానికి అవకాశం కలిగింది. తొలుత వాణిజ్య రంగంలో ఆవిర్భవించిన మధ్య తరగతి తరువాత ప్రభుత్వ యంత్రాంగంలోనూ, పరిశ్రమల్లోను విస్తరిల్లింది.

**3.6.7.5. వాణిజ్య రంగంలో మధ్య తరగతి :** 1713లో మొగల్ పాదుషా అయిన షా ఆలమ్ ఆంగ్ల వాణిజ్య వస్తువులన్నిటిపై సుంకాలను రద్దు చేసాడు. ఈ చర్య వాణిజ్య వర్గాన్ని దెబ్బతీసింది. 1757 తరువాత ఈస్టిండియా కంపెనీ రాజ్యాధికారమును కూడా కైవశం చేసుకోవడం ప్రారంభించిన వెనుక భారతీయ వాణిజ్య వర్గం క్రమేపి ఏజంట్ల స్థాయికి దిగజారిపోయింది. వీరు కంపెనీ తరుపున ఉత్పత్తిదారుల నుండి ముడి సరుకులను కొనుగోలు చేయసాగారు. ఇంగ్లీషువారు వీరినే బనియాలని పిలవసాగారు. వీరే గుమాస్తాలుగానూ, మునీంలుగానూ, దూబాసీలుగానూ వ్యవహరించేవారు. 1833లో బ్రిటీష్ ప్రభుత్వం ఈస్టిండియా కంపెనీకి భారత వాణిజ్యంపైగల గుత్తాధిపత్యాన్ని తొలగించిన తరువాత వీరికి సొంతంగా వాణిజ్యం చేయగల వేసులుబాటు లభించింది. ఆనాటికి దేశంలో చట్టస్వామ్య పద్ధతి నెలకొని, అన్ని వర్గాల వారి ఆస్థి, పాస్తులకు రక్షణ ఏర్పడింది. శాంతి భద్రతలు నెలకొన్నాయి. విద్యావకాశాలు మెరుగై సంఘసంస్కరణ ప్రారంభమైంది. భారతీయ వణిజులు మధ్యతరగతివారుగా స్థిరపడ్డారు.

**3.6.7.6. ఏజెంట్లు, బ్రోకర్లు, మధ్యవర్తులు :** కంపెనీ గుత్తాధిపత్యకాలంలో ఏర్పడిన భారతీయ ఏజెంట్లు, బ్రోకర్లు, మధ్య వర్తులు వాణిజ్య కార్యకలాపాలలో దోపిడీకి, అవినీతికి బాగా దోహదం చేసారు. అవినీతి పరులు, లంచగొండులు అయిన కంపెనీ ఉద్యోగులు తమ అవినీతికి ఈ ఏజెంట్లను, మధ్య వర్తులను సాధనాలుగా చేసుకున్నారు. ఏజెంట్లు తమ తెలివి తేటల ద్వారా కంపెనీ ఉద్యోగుల జేబులు నింపుతూ పనిలో పనిగా తాము కూడా కొంత ధనార్జన చేస్తూ ఉండేవారు. స్వయంగా అవినీతిపరులైన ఆంగ్ల ఉద్యోగులు భారతీయ మధ్యవర్తుల అవినీతిని గూర్చి తెలిసినప్పటికీ వారిని ఖండించగల నైతిక బలం కోల్పోయారు. ఈ విధంగా ఇండియాలో వాణిజ్య మధ్య తరగతి బలపడింది. వీరు తమ సంపాదనలతో భూములు కొని వెనుకటి కులీన వర్గాన్ని త్రోసి రాజన్నారు. మొగలాయిల కాలంలో సుబేదార్లు మున్సబ్‌దార్లు వర్తకాధిపత్యం కూడా తమ గుప్పిట్లో ఉంచుకొనేవారు. ఉదాహరణకు బెంగాల్ సుబేదార్‌గా వ్యవహరించిన షయిస్థఖాన్ ఆ రాష్ట్రంలోని ప్రముఖ వర్తకుడిగా కూడా చలామణీ అయ్యాడు. కంపెనీ పాలనలో ఈ పరిస్థితి తలక్రిందులైంది.

**3.6.7.7. వాణిజ్య వర్గం శక్తియుక్తులు :** వాణిజ్య వర్గం సంపద పెరగడంతో బాటు వారి పలుకుబడి కూడా హెచ్చి, నిమ్నస్థాయి ప్రభుత్వోద్యోగాలను గూడా వారే కైవసం చేసుకున్నారు. ఉదాహరణకు 1835లో కలకతా సుప్రీం కోర్టు జ్యూరీలో 99 మంది భారతీయులు ఉండగా వారిలో 96 మంది బెంగాలీ హిందువులు. ఈ 96 మందిలో 54 మంది వణిక్ప్రముఖులు (బనియాలు) 28 మంది రైటర్లు, 10 మంది జమిందార్లు, 4 గుమస్తాలు, 3 బాంకర్లు. ఇదే స్థాయిలో బొంబాయి రాజధానిలో పార్సీలు, మద్రాస్ రాజధానిలో బ్రాహ్మణులు ప్రాబల్యం వహించారు. ఒకప్పుడు మున్సబ్‌దార్లు చలాయించిన రాజకీయ పలుకుబడి ఆధునిక యుగారంభంలో వాణిజ్యవర్గమూ, బుద్ధి దేవులు వహించారు. వీరు తమ శక్తియుక్తులను, కూడా పలుకుబడిని తమ వాణిజ్య హక్కులను పరిరక్షించుకోవడానికి, స్వేచ్ఛా వ్యాపారం అమలును వినియోగించారు. ఈ ఉద్దేశాలతోడనే ఇండియాలో ఇంగ్లండులో వలెనే వర్తక సంఘాల స్థాపన ప్రారంభమైంది. ఇందుకు బ్రిటీష్ వారే ముందుండి మార్గదర్శకులైనారు. కొన్ని రంగాలు పూర్తిగా ఆంగ్లేయుల చేతిలోనే ఉండేవి. ఉదాహరణకు నీలి మందు తోటలు పూర్తిగా వారి ఆధిపత్యంలోనే ఉండేవి. ఇట్టి వారంతా తమ ఆర్థిక ప్రగతి భారతీయ వర్తక సముదాయం ప్రగతితో ముడిపడి ఉందని గ్రహించి వారి హక్కులను కూడా పరిరక్షిస్తూ ఉండేవారు. వర్తక సంఘాల ఒత్తిడిపైన దేశంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. బ్రిటీష్ పెట్టుబడిదార్లే ఇండియాలో ఆధునిక పారిశ్రామికీకరణకు పునాది వేసారు. భారతీయ వర్తక వర్గమే రాజకీయోద్యమాలయందు కూడా అగ్రశ్రేణిలో నిలిచింది. ఇండియాలో మధ్య తరగతి విదేశీ వాణిజ్యంతో బాటే అభివృద్ధి చెందింది.

**3.6.7.8. పారిశ్రామిక మధ్య తరగతి :** ఇండియాలో ఆంగ్ల ఫలితంగా దేశీయ పరిశ్రమలన్నీ మూల (మూత) పడ్డాయి. చేతి వృత్తులవారు గత్యంతరం లేక వ్యవసాయాన్నే ఆశ్రయించవల్సి వచ్చింది. ఆ అవకాశం కూడా లేనివారు దొరల ఇళ్ళలోనూ, ధనికుల ఇళ్లల్లోనూ పనివాండ్రుగా కుదిరారు. తత్ఫలితంగా పాశ్చాత్య పద్ధతిలో ఇండియాలో పారిశ్రామిక మధ్య తరగతి ఏర్పడడం చిరకాలం సాధ్యం కాలేదు. ఈ విషయంలో కూడా ఆంగ్లేయులు ముందంజ వేసి పారిశ్రామిక వృత్తిని గౌరవప్రదం గావించి, పారిశ్రామిక మధ్య తరగతి రూపొందించడానికి కారణభూతులైనారు.

**3.6.7.9. పారిశ్రామికీకరణలో కంపెనీ ఉద్యోగుల పాత్ర :** బ్రిటీష్ ప్రజలకుపయోగపడే పరిశ్రమలలో తమ డబ్బును పెట్టుబడి పెట్టడానికి కంపెనీ యాజమాన్యం తన ఉద్యోగులకు అనుమతినిచ్చింది. కంపెనీ ఉద్యోగులు నీలి మందు తోటలు మున్నగు పరిశ్రమలలో తమ ధనాన్ని పెట్టుబడి పెట్టారు. ఈ విధంగా ఆధునిక యుగంలో పరిశ్రమలు ఇండియాలో ప్రారంభమైనాయి. 1833లో ఈస్టిండియా కంపెనీవారి గుత్తాధిపత్యం తొలగింపబడిన పిమ్మట బ్రిటీష్ పెట్టుబడిదారులు నీలిమందు, జనుము, పంచదార, తేయాకు, కాఫీ పరిశ్రమలను నెలకొల్పడానికి ముందుకొచ్చారు. క్రిమియా యుద్ధం తర్వాత రష్యా నుండి జనుము దిగుమతి తగ్గిన ఫలితంగా ఇండియా జనప నార పరిశ్రమ అభివృద్ధి పొందింది. ప్రభుత్వం ప్రైవేటు కంపెనీ పెట్టుబడుల ద్వారా రైల్వే నిర్మాణాన్ని ప్రోత్సహించింది. రవాణా సౌకర్యాల పెంపుదల వల్ల పారిశ్రామికీకరణ అభివృద్ధి పొందింది. దీని వల్ల దేశంలో దోపిడీ విధానం అధికరించినప్పటికీ, భారతీయులకు ఉద్యోగావకాశాలు హెచ్చాయి. సాంఘిక సంచలనం ప్రారంభమైంది.

**3.6.7.10. భారతీయుల పెట్టుబడులు :** ఆంగ్ల ప్రభుత్వం వారి వ్యతిరేక ధోరణిని కూడా తట్టుకొని కొంత మంది బెంగాలీలు, పార్సీలు తమ ధనాన్ని వివిధ పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టడానికి సాహసించారు. వీరు వస్త్ర పరిశ్రమను చేపట్టారు. వీరి పెట్టుబడులే ఇండియాలో పారిశ్రామిక మధ్య తరగతి రూపొందడానికి నాంది అయింది. క్రమంగా భారతీయ పారిశ్రామికులు తయారైనారు. వీరే శక్తి వంతమైన మధ్య తరగతిగా మారారు. ఆంగ్ల మధ్య తరగతి, వాణిజ్య మధ్య తరగతి వారితో కలసి వీరు ఇండియా అంతరంగిక, విదేశ విధానాలపై తమ ప్రభావాన్ని ప్రదర్శించసాగారు.

**3.6.7.11. యాజమాన్యపు ఏజెన్సీ - మధ్య తరగతి :** వాణిజ్యం, పరిశ్రమలు పెరిగిన కొద్దీ ఇండియాలో ఆంగ్లేయుల పెట్టుబడులు కూడా అధికరించాయి. ఆ పెట్టుబడిదారులు ఇండియాలోని వ్యతిరేక పరిస్థితులను తట్టుకొని విజయవంతంగా తమ వాణిజ్యాన్ని, పరిశ్రమలను నిర్వహింప గల యాజమాన్యపు ఏజెన్సీల అవసరం ఏర్పడింది. ఫలితంగా ఇండియాలో కూడా జాయింట్ స్టాక్ కంపెనీలు స్థాపించబడ్డాయి. ఈ కంపెనీలకు సంబంధించి షేర్ హోల్డర్లు, డైరెక్టర్లు మున్నగు వారు ప్రాబల్యం పొందారు. ఇలా ఇండియాలో క్రొత్తరకం వృత్తులు ఉద్యోగాలు, వ్యాపారాలకు అవకాశం లభించింది. కంపెనీ పాలనలో వాణిజ్య మధ్య తరగతిగా విదేశీ పెట్టుబడులకు ఏజెంట్లుగా వ్యవహరించారు. ఈ విధానం ద్వారా సంపన్నులైనవారు తాము స్వంత కంపెనీలు పెట్టుకొని మరింత ప్రాబల్యం సంపాదించారు. వీరు ఇండియాలో మధ్య తరగతికి వెన్నెముక అని చెప్పవచ్చును. బ్రిటీష్ మధ్య తరగతి వలెనే వీరు కూడా రాజకీయమైన పలుకుబడి, ప్రతిష్ట సంపాదించారు. వీరు కాక మధ్య తరగతి భూస్వాములున్నారు. న్యాయవాదులు, వైద్యులు, ఉపాధ్యాయులు మొదలగు మేధావులు మరొక విధమైన మధ్యతగరతికి చెందినవారు. ఈ విధంగా భారతదేశంలో ఆధునిక యుగంలో మధ్య తరగతివారు (బూర్జువాలు) బలపడ్డారు.

**3.6.7.12. పరిపాలన - మధ్య తరగతి అభివృద్ధి :** మధ్య తరగతి ఏర్పడడానికి వాణిజ్యాభివృద్ధి ఒక్కటే కారణం కాదు. బ్రిటీష్ వారి న్యాయపాలన వ్యవస్థ, దేశ పరిపాలన వ్యవస్థ, ఆంగ్ల విద్యా విధానము కూడా, వాణిజ్యాభివృద్ధికి సమానంగా కారణములై మధ్య తరగతి వారి సంఖ్యను అభివృద్ధి పరిచాయి. మధ్య తరగతిలో వివిధ వర్గాల మధ్య అన్యోన్య సంబంధాన్ని సమకూర్చాయి. 1833 తరువాత క్రింది పదవులలో భారతీయోద్యోగుల సంఖ్యను అధికం చేసారు. ఆంగ్ల విద్య నేర్చిన వారందరూ వకీళ్ళుగా వ్యవహరించడానికి అర్హులైనారు. క్రమంగా దేశంలోని రాజకీయోద్యమానికి న్యాయవాదులే అగ్రగాములుగా ఉన్నారు.

**3.6.7.13. సాంఘిక మార్పులో మధ్య తరగతి వారి పాత్ర :** నూతన వర్గం వారైన మధ్య తరగతి వారు సామాజిక వ్యవస్థ దృష్ట్యా కులమతముల విషయంలో అధునాతన దృక్పథాన్ని అలవరచుకున్నారు. కేవలం సాంఘిక వ్యవస్థకు చెందిన కుల ధర్మాలనూ, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన వ్యవహారాలనూ వేరుపరచి ప్రవర్తించడమే వీరు తెచ్చిన గొప్ప సాంఘిక మార్పు. అన్ని కులాల వారూ వర్తక సంస్థలోనూ, పరిపాలనోద్యోగాల్లోనూ చేరసాగారు. దీని వల్ల కులతత్వాల ప్రాబల్యానికి లోనైన సమాజ వ్యవస్థ గొప్ప సంచలనం బయలుదేరింది. సహపంక్తి భోజనాలు కులాంతర వివాహాలు చాలా కాలం వరకూ జరగకపోయినా, ఇతర విషయాల పట్ల పట్టణ ప్రాంతాల్లో కులభేదాలు క్రమంగా సమసిపోయాయి. మధ్య తరగతి వారి ప్రాబల్యం వల్ల ప్రాచీన కులీన వర్గమూ, భూస్వాములూ తమ అధికారాలను, రాజకీయ హక్కులను పోగొట్టుకున్నారు.

మధ్య తరగతి ఆవిర్భావం వల్ల జీవన సౌకర్యాలలోనూ, జీవన విధానాలలోనూ గమనింపదగ్గ మార్పులు కలిగాయి. ఆంగ్లేయుల సహచర్యం కలిగిన వారు గృహ నిర్మాణంలోనూ, ఆసనశయ్యాదుల నిర్మాణంలోనూ, పరికరాల విషయంలోనూ, అభిరుచులను, పద్ధతులనూ అనుసరించసాగారు. కళ్ళజోళ్ళు, బల్లలు కుర్చీలు, టీపాయ్‌లు, పింగాణీ సామాగ్రి మున్నగునవన్నీ భారతీయులలో ప్రవేశించాయి. పల్లకీలలో తిరగడం, కోచిబళ్ళను, గుర్రపు బళ్ళను పోషించడం, పలువురు పనివారిచే సేవ చేయించుకోవడం సాగించారు. వాణిజ్య వర్గానికి చెందిన మధ్య తరగతి వారు ధన సంపాదనమే తన లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యాపారాన్ని, వృత్తిని ఎన్నుకొనడంలో వారు ఏ విధమైన సంప్రదాయాలనూ పాటించలేదు. త్వరగా అధిక లాభాన్ని తెచ్చే ఏ వ్యాపారంలోనైనా చురుగ్గా ప్రవేశించారు.

## 3.6.8. నమూనా ప్రశ్నలు :

1. ప్రధాన భారతీయ పరిశ్రమల గూర్చి వివరింపుము ?

2. భారత పరిశ్రమల ప్రగతి లక్షణాలు, మంద ప్రగతి లక్షణాలను తెలుపుము ?

3. భారతదేశంలో సాంగిక మార్పులో మధ్యతరగతి వారి పాత్రను తెలుపుము ?

## 3.6.9. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Nationalism and Colonialism in Modern India, New Delhi, 1979 |
| 2. | Bipin Chandra, | : | Modern India, New Delhi, 1971 |
| 3. | Percival Spear, | : | A History of India, Vol. 2, Harmondsworth, 1978 |
| 4. | Sumit Sarkar, | : | Modern India, 1885 - 1947, Delhi, 1983 |
| 5. | Alladi Vaidehi, | : | History of Freedom Movement in India, Hyderabad 1991 |
| 6. | Heimsath, | : | Indian Nationalism and Hindu Social Reform, Princeton, 1964 |
| 7. | Vma Kaura, | : | Muslims and Indian Nationalism, New Delhi, 1977 |
| 8. | Mc lane, Indian | : | Nationalism and the Early Congress, Prination, 1977 |
| 9. | Anil Seal, The | : | Emergence of Indian Nationalism, Cambridge, 1967. |
| 10. | K.K. Datta | : | A Social History of Modern India |
| 11. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 12. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern India. |
| 13. | Tapan Raychaudhuri and and Irfan Habib | : | The Cambridge Economic History of India Vols. 2 |
| 14. | Sumit Sarkar | : | Modern India 1885-1947 |

| | | | |
|---|---|---|---|
| 15. | R. Plame Dutt | : | Indian Today |
| 16. | R.C. Majumdar | : | History of Freedom Movement in India, 3 Vols. |
| 17. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 19. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 19. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 20. | S.C. Raychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |

ఖండిక - 4

పాఠం - 4.1

# పునరుజ్జీవనంలో మధ్యతరగతి పాత్ర సామాజిక, మత సంస్కరణోద్యమాలు, దాని వ్యాప్తి

## 4.1.0 లక్ష్యం :

భారతీయ పునరుజ్జీవనంలో మధ్యతరగతి పాత్ర, సామాజిక మత సంస్కరణోద్యమాల వ్యాప్తి గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


**4.1.1.** పునరుజ్జీవనంలో మధ్యతరగతి పాత్ర

**4.1.1.1** పరిచయం

**4.1.1.2** పునరుజ్జీవనంలో మధ్యతరగతి పాత్ర

**4.1.1.3** ముగింపు

**4.1.2.** సామాజిక, మత సంస్కరణోద్యమాలు - దాని వ్యాప్తి

**4.1.2.1** పరిచయం

**4.1.2.2** ఉద్యమాల వ్యాప్తి

**4.1.2.3** ముగింపు

**4.1.3.** నమూనా ప్రశ్నలు

**4.1.4.** చదువదగిన గ్రంథాలు


## 4.1.1. పునరుజ్జీవనంలో మధ్యతరగతి పాత్ర

### 1.1 పరిచయము :

బ్రిటీష్ వారు వ్యాపారసంస్థగా భారతదేశానికి వచ్చి అనేక ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకొని అక్కడి ప్రజలతో దగ్గర సంబంధాలు కల్పించుకున్నారు. తరువాత ఒకరికొకరికి మధ్య జరిగే ఘర్షణలలో ప్రముఖ పాత్ర వహించి చివరికి రెండు పక్షాల వారిని అణచి వేసి ముఖ్యంగా రాజకీయ రంగంలో బ్రిటిష్ వారు ప్రముఖ పాత్ర వహించారు. రాజకీయాల్లో వలెనే సాంఘిక, మత విషయాల్లో కూడా బ్రిటీష్‌వారు తమ ఔన్నత్యాన్ని అధికారాన్ని, నెలకొల్పడానికి 19వ శతాబ్దంలో ప్రయత్నించారు. హిందూ మతం అంటే రాళ్ళను, రప్పలను పూజించడం అని, హిందూ సంఘం అనేక పురాతన అనాధరక మూఢాచారాలతో నిండినది అని భారతీయులకు సుఖ శాంతులు లభించాలి అంటే వారు తమ విధానాన్ని విడిచి పెట్టి ఏ విధంగా నైతే బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఆంగీకరించినారో అదే విధముగా వారి మతాన్ని, సంస్కృతిని అవలంబించడం తమకు శ్రేయస్కరమని ఆంగ్లేయులు భావించి 19వ శతాబ్దము ప్రారంభం నుండి దానికి తగిన ఏర్పాట్లు, సంస్కరణలు చేయసాగినారు. అనగా అప్పటి వరకు రాజకీయ విషయాల్లో తటస్థంగా ఉంటూ ఉన్న ఆంగ్లేయులు తమ విధానాన్ని మార్చుకొన్నారు. 1813 తరువాత భారతదేశానికి వచ్చి క్రైస్తవ మత భోధకులకు మత బోధ చేయడానికి, పార్లమెంట్ అనుమతి ఇచ్చింది. భారతదేశంలోని మతాలను ఖండించి, క్రైస్తవ మతాన్ని వ్యాపింపజేయటమే వారి ముఖ్య ఉద్దేశం అయిన దానిని నేరవేర్చడానికి ఇక్కడి సాంఘిక దురాచారాలు అడ్డు వస్తున్నాయి అని వాటిని మాన్పడం కంపెనీ కర్తవ్యం అని ఇంగ్లాండ్‌లో వారు ప్రచారం చేయసాగినారు.

అంతేగాక ఇంగ్లాండ్‌లో 19వ శతాబ్దంలో తత్వవేత్తలలోనూ, అధికార వర్గంలోనూ, ప్రముఖులలోనూ, సంస్కరణా శక్తి అత్యధికంగా వ్యాపించి ఉంది. భారతదేశంలోని సంస్థలన్నింటినీ మార్చవలెనని వారికి అపరిమితమైన ఉత్సాహం ఉండేది. ఈ రెండు కారణాలతో కూడా వారు సాంఘిక మత విషయాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టవలెనని నిశ్చయించుకున్నారు. దీనిని కార్యరూపంలో పెట్టినది బెంటింగ్ ప్రభువు. ఇతడు సతీసహగమనం, బాల్య వివాహాలు, శిశుహత్య మొదలైన సాంఘిక దురాచారాలను అంతమొందించడానికి శాసనాలు జారీచేసినాడు. క్రైస్తవ మత ప్రచారాలకు వర్గ, వర్ణ భేదము లేని మతం క్రైస్తవ మతం అని దేవుని ఎదుట, దేవుని దృష్టిలో అందరూ సమానులేనని ప్రచారం చేయసాగినారు. ఈ విషయం వెనుకబడిన వర్గాల వారిని ఆకర్షించింది. ఫలితంగా వారు అధిక సంఖ్యలో క్రైస్తవ మతంలో చేరిపోయినారు.

క్రైస్తవ మత ప్రచారకులు భోదన చేస్తూపోతే ఆంగ్ల ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపెడుతూ ఉంటే అనాదిగా వస్తున్న సంస్కృతికి దెబ్బ అని భారతీయులలో ముఖ్యంగా మధ్యతరగతికి చెందిన విద్యావంతులు భయపడినారు. అందుచేత వీరు భారత సంస్కృతి గొప్పతనాన్ని ప్రచారం చేయడానికి మతానికి, సంస్కృతికీ సంబంధం లేని మూఢ ఆచారాలను, అంతమొందించడానికి పూనుకొన్నారు. వీరంతా విద్యావంతులేగాక, పాశ్చాత్య విద్యా సంస్కృతులు బాగా తెలిసిన వారు. వీరు సంఘాలు, సంస్థలు స్థాపించి హిందూ మతం గొప్పతనాన్ని తెలియజేసి, తద్వారా ప్రజలలో చైతన్యము కలిగించారు. ఫలితంగా ప్రజలలో జాతీయ భావం ఏర్పడి జాతీయ ఉద్యమంలో కూడా పాల్గొన గలిగినారు.

మత సంస్కరణ అనే విషయం హిందువులకు కొత్త కాదు. భారతదేశ చరిత్రను పరిశీలించినట్లు అయితే వేదకాలం నుంచి, హిందూ మతం సంస్కరణలకు లోనైనట్లు తెలుస్తుంది. వేద మతం నుంచి ఉపనిషత్తుల మతానికి, బౌద్ధ, జైన మతాలకు మార్పులు గమనించడమైయింది. తరువాత కాలలో ఇస్లాం మత ప్రభావం వల్ల హిందూ మతంలో జ్ఞాన, కర్మ, మార్గాల స్థానంలో అందరికి అందుబాటు అయిన సులభ మార్గమైన భక్తి మార్గం ద్వారా మోక్షాన్ని పొందవచ్చుననే భావన కలిగి మధ్యయుగ శతాబ్దాల్లో చైతన్యుడు, వల్లభాచార్యుడు, కబీర్, తుకారామ్, గురునానక్, రామదాసు వంటి భక్తులు ప్రచారం చేసారు. ఆ రోజుల్లో ఇస్లాం మతం దాడి నుంచి రక్షించుకోవడం కోసం సరళమై, సంస్కరించిన హిందూ మత పద్ధతులు, 19వ శతాబ్దంలో క్రైస్తవ మత వ్యాప్తి అరికట్టడం కోసం తమ మతస్థులకు మతంలో విశ్వాసం సన్నగిల్లకుండా ఉండటం కోసం హిందూ మతసంస్కరణ ఉద్యమానికి పూనుకున్నారు. వీరు మత పద్ధతుల్లోని ఛాందస పురాతన పద్ధతులను తొలగించి మతం మానవుడికి అందుబాటులో ఉండి, అతని ఆధ్యాత్మిక ఔన్నత్యానికి దోహదం చేసే విధంగా ప్రచారం చేశారు. ఎవరి మతంపై వారికి విశ్వాసం సడలకుండా ఉండాలి అని, మతం మానవత్వాన్ని కలిగి మానవ సేవ ద్వారా మాధవ సేవ చేయించాలి అని, మతం ద్వారా మానవుడు రాజకీయ ప్రయోజనాలను కూడా పొందాలి అని నాటి మత కర్తలు బోధించారు. భారత ఉద్యమాలను గురించి అనిబీసెంట్, ప్రస్తావిస్తూ భారతదేశంలో ఏ ఉద్యమమైన చెకచెకా జరగాలి అంటే మతంతో ముడి పెట్టాలి అని పేర్కొన్నది. జాతీయతా భావన ధ్యేయం స్వరాజ్యం కాబట్టి తమలో లోపాలను, విభేదాలను తొలగించుకొని సంఘటితంగా కృషి చేయడానికి భారతీయులు మత, సాంఘిక సంస్కరణలు అమలు జరిపారు.

సూక్ష్మముగా పరిశీలిస్తే పునరుజ్జీవన ఉద్యమానికి ప్రాచీన భారతీయ సాహిత్య ఆధ్యయనము, ఆంగ్ల విద్య, సాహిత్య ప్రభావం, జాతీయతా భావాలు విదేశీయులు భారతీయ సంస్కృతిని అణచివేయడానికి పాటించిన విధానాలకు వ్యతిరేకత, ముఖ్య కారణాలుగా కనిపిస్తాయి.

## 4.1.1.2 పునరుజ్జీవనములో మధ్యతరగతి పాత్ర :

ఆంగ్లేయుల పాలనా కాలంలో ఏర్పాటు చేయబడిన నూతన సామాజిక, ఆర్థిక వ్యవస్థ, రాజ్య పాలనా యంత్రాంగం వ్యాప్తి చేయబడిన పాశ్చాత్య విద్యా ఫలితంగా భారతదేశంలో నూతన సామాజిక వర్గాల ఆవిర్భావం జరిగింది. ఏ ప్రాంతాలలో నైతే బ్రిటీష్ అధికార స్థాపన మొదట జరిగిందో అక్కడ నూతన సామాజిక వర్గాల ఆవిర్భావం ముందు ఏర్పడింది. బ్రిటిష్ వారు బెంగాల్, బొంబాయి, మద్రాసు రాష్ట్రాల్లో సుస్థిర పాలనా విధానాన్ని ఏర్పాటు చేసి, ఆధునిక వైద్యం, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రం లాంటి ఆధునిక విజ్ఞాన శాస్త్రాల్లో జ్ఞానాన్ని సమకూర్చే నూతన విద్యా సంస్థలను స్థాపించారు. ఫలితంగా విద్యావంతులు చదువుకున్న మధ్యతరగతిలో భాగంగా ఉన్న సాంకేతికులు, వైద్యులు, న్యాయవాదులు ఆచార్యులు, పాత్రికేయులు, మేనేజర్లు, గుమస్తాలు వంటివారు ఈ రాష్ట్రాల్లో ఏర్పడ్డారు. అయితే క్రమముగా

దేశం మొత్తానికి కూడా ఆంగ్ల అధికారం వ్యాపించింది గాన నూతన సామాజిక ఆర్థిక వ్యవస్థ పరిపాలనా విధానం ఆధునిక విద్య భారతదేశం అంతటా విస్తరించడంతో నూతన సామాజిక వర్గాలు జాతీయ స్థాయిలో ఆవిర్భవించాయి. నూతన సామాజిక వాతావరణంలో ప్రథమముగా బన్యాలు, పార్సీలు, ఆధునిక పెట్టుబడిదారీ వాణిజ్యము బ్యాంకింగ్ వృత్తులను చెప్పట్టి మధ్యతరగతి అనే నూతన సామాజిక వర్గంగా పరిణతి చెందారు. అలాగే ఆంగ్ల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధునిక విద్యను మొదట బ్రాహ్మణులు ఆధ్యయనం చేసి, ఆధునిక విద్యావంతులు చదువుకున్న మధ్యతరగతిగా రూపొందారు. ముస్లిమ్‌లలో ఆధునిక విద్యాయుత మధ్యతరగతి ఆలస్యంగా ఉత్పన్నమైయింది.

భారతదేశంలో ఆధునిక పరిశ్రమల స్థాపన, పారిశ్రామిక మధ్యతరగతి ఆవిర్భావం కంటే ముందే ఆధునిక మేధావి వర్గం అభివృద్ధి చెందింది. రాజారామ్‌మోహన్ రాయ్ ఆయన సహచరులు తొలి మేధావి వర్గంగా పాశ్చాత్య సంస్కృతిని,అధ్యయనం చేసి దానిలోని తార్కిక ప్రజాస్వామ్య సిద్ధాంతాలు భావనలు సారాంశాన్ని ఒంటి పట్టించుకున్నారు. 19వ శతాబ్దం మొదట్లో చదువుకున్న భారతీయుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఆంగ్ల ప్రభుత్వం పాఠశాలలను కళాశాలను స్థాపించడం క్రైస్తవ మిషనరీలు విద్యా సంస్థలు నెలకొల్పడం, ఈ యత్నాలకు కొందరి భారతీయుల చేయూత ఫలితంగా 19వ శతాబ్ది ద్వితీయార్థంలో విద్యావంతులైన భారతీయ వర్గం ఏర్పడింది. ఆధునిక భారతదేశ జాతీయతావాద చరిత్రలో మేధావి వర్గ పాత్ర కీలకమైనదిగా ఉంది. వీరు చాలా వరకు ఇండియా ప్రజలను ఒక ఆధునిక జాతిగా ఐక్యపరచి వివిధ ప్రగతి శీలత సామాజిక మత సంస్కరణ ఉద్యమాలను నిర్వహించారు. అన్ని రాజకీయ జాతీయ ఉద్యమాలకు తొలి బాటలను వేసి,నిర్వహించి నాయకులుగా వీరు పనిచేశారు. వీరు విద్యా విషయక ప్రచార కార్యక్రమం ద్వారా జాతీయతా స్వేచ్ఛ భావాలను భారతీయుల్లో వ్యాప్తి చేసారు. దీనికై వీరు ఏంతో ఆత్మత్యాగం బాధను అనుభవించవలసి వచ్చింది. జాతీయతా ప్రజాస్వామ్య భావాలతో కూడిన పౌరస్వతాన్ని వీరు సృష్టించారు. వీరు గొప్ప శాస్త్రజ్ఞులను, కవులను, చరిత్రకారులను, ఆర్థిక శాస్త్రవేత్తలను తయారుచేసారు. వాస్తవానికి ఆధునిక పాశ్చాత్య ప్రజాస్వామ్యయుత సంస్కృతిని జీర్ణించుకొన్న తొలి దశలో ఉన్న భారత జాతి కీలక సమస్యలను అర్థం చేసుకొన్న ప్రగతి శీలక మేధావి వర్గం ఆధునిక ఇండియా నిర్మాతలు, హిందువులు, మహ్మదీయులు ఇతర మతస్తుల్లో ఆవిర్భవించిన సాంఘిక, మత సంస్కరణ ఉద్యమాలు కూడా, ఆయా మతాల వారికి చెందిన మేధావి వర్గ సభ్యుల చేత నిర్వహించడమైయింది. ఉదాహరణకు దళిత జాతికి చెందిన మేధావి అంబేద్కర్ దళిత జాతుల్లో సాంఘిక సంస్కరణ రాజకీయ శిక్షణకై ఉద్యమం నడిపాడు. ఆ మాట కొస్తే బ్రిటీష్ పాలనా కాలంలో సంభవించిన దాదాపు అన్ని ప్రగతి శీలక సామాజిక, రాజకీయ సాంస్కృతిక ఉద్యమాలు నూతన పాశ్చాత్య విద్యా సంస్కృతులను ఉనికి పుచ్చుకొన్న మేధావి వర్గ సృష్టి. జాతీయ ఉద్యమానికి సారథ్యం వహించిన గోపాలకృష్ణ గోఖలే, దాదాబాయ్ నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, రానడే, ఫెరోజ్ షా మెహతా, గాంధీ, చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూ, రాజగోపాలాచారి, రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రు, సుభాష్ చంద్రబోస్ మొదలైన వారు మధ్య తరగతి మేధావి వర్గానికి చెందినవారు.

## 4.1.1.3 ముగింపు

భారతదేశ ప్రజల సామాజిక రాజకీయ సాంస్కృతికాభి వృద్ధిలో మేధావి వర్గం నాయకత్వ పాత్రను నిర్వహించింది. భారతదేశంలో ఆంగ్ల ప్రభుత్వం ప్రారంభించిన నూతన విద్యా విధాన ఫలితంగా చదువుకొన్న మధ్యతరగతి ఏర్పడింది. దీనిలో న్యాయవాదులు, వైద్యులు, సాంకేతికులు, ఆచార్యులు, పత్రికా రచయితలు, ప్రభుత్వ ఉద్యోగులు, గుమస్తాలు, మొదలైనవారు ఉన్నారు. వీరు వివిధ జీవ, రసాయన, భౌతిక, వైద్య, ఇంజనీరింగ్ శాస్త్రాలకు తోడుగా ప్రజాస్వామ్యం, సామ్యవాదం, హేతువాదం, వ్యక్తి స్వేచ్ఛకు ప్రాముఖ్యం ఇచ్చిన సామాజిక శాస్త్రజ్ఞుల రచనలను చదివి ఆ భావాలను జీర్ణించుకొన్నారు. బేకన్, డార్విన్, లాక్, జాన్ స్టువర్ట్ మిల్, న్యూటన్, అడమ్‌స్మిత్, గిబ్బన్ రసెల్, ప్లేటో, అరిస్టాటిల్, హెగెల్, కార్లమార్క్స్, వోల్టైర్, ఐన్‌స్టీన్, మాక్సిమ్ గోర్కి, విక్టర్ హ్యూగో, గోథేలాంటి వారి రచనలను పఠించారు. వీరు దాని ఫలితంగా లౌకిక, ఉదార వాద, హేతువాద దృక్పథాన్ని అలవరుచుకున్నారు. వీరే సామాజిక, రాజకీయ, మత, సాంస్కృతిక పురోగామిత్వ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఈ కోవకు చెందిన వారే రాజారామ్‌మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, స్వామి వివేకానందా, సురేంద్రనాథ్ బేనర్జీ, తిలక్, అంబేద్కర్ మొదలైన వారు.

ఆధునిక భారతదేశ జాతీయవాద చరిత్రలో మేధావి వర్గ పాత్ర కీలకమైనది. వీరు చాలా వరకు భారతీయులను ఒక్క ఆధునిక జాతిగా ఐక్యపరచి వివిధ ప్రగతి శీలక సామాజిక మత సంస్కరణ ఉద్యమాలను దేశంలో నిర్వహించారు. భారత జాతీయ కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయ జాతీయ ఉద్యమాలకు, తొలిబాట వేసింది వీరే. జాతీయతా, స్వేచ్ఛ భావాలను వీరు విద్య ద్వారా ప్రచార కార్యక్రమాల

ద్వారా భారతీయుల్లో వ్యాప్తి చేసారు. ఆ మాట కొస్తే, ఆధునిక ప్రపంచంలోని అన్ని దేశాల్లో కూడా అన్ని ప్రగతి శీలక ఉద్యమాలకు మేధావి వర్గమే, నిర్వహణ నాయకత్వాన్ని అందించింది.

## 4.1.2. సామాజిక, మత సంస్కరణోద్యమాలు - దాని వ్యాప్తి

### 4.1.2.1. పరిచయం

శాస్త్ర, విజ్ఞాన ప్రజాస్వామ్యం జాతీయవాదం ప్రాబల్యం వహించిన ఆధునిక ప్రపంచపు ఆపేక్షలకు అనుగుణంగా తమ సమాజాన్ని మలచుకోవాలి అనే కాంక్షతో తమ మార్గంలో అడ్డంకులేవి తలెత్తనివ్వకూడదు అని, దృఢ సంకల్పంతో ఆలోచనా పరులైన భారతీయులు కొందరు, తమ సాంప్రదాయక మతాలను సంస్కరించడానికి సన్నద్ధులైయ్యారు. తమ మత ప్రాతిపదికలకు బద్ధులై ఉంటూనే వారు వాటికి భారత ప్రజల నూతన అవసరాలకు తగినట్లుగా, కొత్తరూపుదిద్దారు.

### 4.1.2.2. ఉద్యమాల వ్యాప్తి

ఆంగ్ల విద్యా విధానం పత్రికల ద్వారా పాశ్చాత్య ఉదారవాద భావాలు, భారతీయ మధ్య తరగతి మేధోవర్గంలో బాగా వ్యాపించిన ఫలితంగా సామాజిక మత రంగాల్లో మధ్యయుగ వ్యవస్థలు, భావాలకు సమాధి కట్టి జాతీయత వ్యక్తి స్వేచ్ఛ సాంఘిక సమానత్వం, ప్రాతిపదికగా పునర్ వ్యవస్థీకరణ సంస్కరణకై దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక ఉద్యమాలు ఆవిర్భవించి, క్రమక్రమముగా వ్యాప్తి చెందాయి.

సామాజిక రంగంలో కుల నిర్మూలన, స్త్రీలకు సమాన హక్కులు, సతీసహగమన నిర్మూలన, బాల్య వివాహాల రద్దు, వితంతు పునార్ వివాహ నిషేధం రద్దు, అంటరానితనం నిర్మూలన, వంటి సమస్యల సాధనకై పెక్కు మంది సంస్కర్తలు కృషిచేసి, గొప్ప ప్రగతిని విజయాలను సాధించారు. సంస్కర్తలలో రాజారామ్‌మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం, అంబేద్కర్, గాంధీ లాంటి వారు పేర్కొనదగినవారు.

మత రంగంలో విగ్రహారాధన, బహు దేవతారాధన నిర్మూలనకు, ఖర్చుతో కూడుకొన్న కర్మకాండల రద్దుకు, పురోహితుల పెత్తనాన్ని అంతం చేయడానికి మూఢ విశ్వాసాల ఆచారాల నిర్మూలనకు బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, రామకృష్ణ మఠం, దివ్యజ్ఞాన సమాజం లాంటి సంస్థలు గొప్ప కృషి చేశాయి. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకనంద ద్వారా 'మానవ సేవయే మాధవసేవ' అను అంశం గొప్పగా ప్రచారం పొందింది.

భారతదేశంలోని సామాజిక, మత సంస్థలను, ప్రజాస్వామ్య హితము గావించి కుల, వర్ణ వ్యవస్థలు అంటరానితనం లాంటి విచ్ఛిన్న కర శక్తులను నిర్మూలనము చేసి, దేశ ఐక్యతను సాధించడానికీ, ఈ సామాజిక మత సంస్కరణ ఉద్యమాలు కృషి చేసాయి. దేశ ప్రజల ఐక్యత జాతీయ స్వాతంత్రీయ సాధనకు సామాజిక, ఆర్థిక సాంస్కృతిక ప్రగతికి, ఆవశ్యకం అనే విషయాన్ని సంస్కర్తలు గట్టిగా నమ్మారు.

భారతీయుల సమస్యల పరిష్కారానికి జాతీయతా భావనా, ఉపరిలాంటిది అయింది. ఆంగ్ల పాలనలో రాజకీయ ఆర్థిక ఏకీకరణ ఏర్పడడంతో, భారత ప్రజల సమస్యలు ఒకటైనాయి. వీరి ఆర్థిక, సాంస్కృతిక ప్రగతి సాధనను లక్ష్యంగా పెట్టుకొన్న జాతీయవాదులు, ఈ రంగాల్లో బ్రిటిష్ ప్రభుత్వం విధించిన, ఆంక్షల తొలగింపుపై కృషి చేయవలసి వచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వ పాలనా ప్రారంభంలో దాని ప్రగతి శీలక స్వాభావంలో భారతీయ సామాజిక మత సంస్కర్తలకు కొంత విశ్వాసం ఏర్పడినా, భారత జాతీయ అభివృద్ధిని కుంటు పరుస్తుంది అనే విషయాన్ని వీరు గుర్తించారు.

భారతదేశంలో బ్రిటీష్ వారి చేత స్థాపితమైన నూతన సమాజం పెట్టుబడిదారీ వ్యవస్థతో కూడుకొన్నది. ఇది వ్యక్తి స్వేచ్ఛ, స్వేచ్ఛాయిత పోటీ, ఆస్తిని సంపాదించడం, నిర్వహించడంలో, వ్యక్తికి స్వేచ్ఛ లాంటి సూత్రాలపై ఆధారపడి ఉంది. దీని ప్రధాన లక్షణం వ్యక్తి స్వాతంత్ర్యము. రాజరామ్‌మోహన్‌రాయ్, దేవేంద్రనాథ్ ఠాగూర్, కేసవ చంద్రసేన్, తెలంగ్, రానడే, లాంటి సంస్కర్తలు ప్రజాస్వామ్య సూత్రాన్ని మత రంగానికీ, వివిధ ప్రమాణాల్లో విస్తరింపజేశారు. వాస్తవంగా చూస్తే, మత సంస్కరణ ఉద్యమాలు నూతన సామాజిక అవసరాలకు అనుగుణంగా,

ప్రాచీన మత సూత్రాలు, పద్ధతులను సవరించేందుకు వివిధ ప్రమాణాల్లో ప్రయత్నించాయి అని చెప్పవచ్చు. ఆర్య సమాజం వారు సమకాలీన భారత జాతి సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అవసరాల కొరకు హైందవ మతాన్ని రూపుదిద్దడానికి ప్రయత్నించారు. ఇంకా జాతీయ ఐక్యతకు మత సంస్కరణ ఉద్యమాలు ప్రయత్నించాయి.

మత సంస్కరణ ఉద్యమాల కార్యక్రమం మత రంగానికి కాక, సామాజిక రంగానికి కూడా విస్తరించింది. దీనికి కారణం భారతదేశంలో మతం సామాజిక వ్యవస్థ ఒకదానితో మరొకటి మడిపడి ఉండటమే. కుల వ్యవస్థ, అంటరానితనం, స్త్రీ, పురుషుల మధ్య అసమానత, సాంఘిక కట్టుబాట్లు మత పరముగా ఆమోదము పొందడము వల్లనే కొనసాగాయి. అందువల్ల మత సంస్కరణ, ఉద్యమాల కార్యక్రమంలో సాంఘిక సంస్కరణ భాగమైయింది. బహుదేవతారాధన, విగ్రహారాధనను ఉద్యమకారులు ఏ రకంగా తిరస్కరించారో అదే విధంగా వీరు కుల విధానాన్ని విదేశీయాన నిషేధాన్ని ఎదిరించారు. కుల హక్కులను గర్హించారు. మొదట భారత ప్రజల జాతీయ చైతన్యం మత స్వరూపాన్ని తీసుకున్న తరువాత ఇది బాగా బలపడి విస్తృతి చెంది క్రమముగా లౌకిక స్వరూపాలను కూడా తీసుకొన్నది.

హిందూ సంఘాన్ని సంస్కరించుటకై బ్రహ్మ సమాజ ఉద్యమాన్ని రాజారామ్‌మోహన్‌రాయ్ బయలుదేర దీయడాన్ని దీని ప్రారంభ దశగా చెప్పవచ్చు. అజేయమగు గత కాలం నుండి అనూహ్యమగు భవిష్యత్‌లోకి పయనించు భారతదేశానికి ఒక సజీవపు వంతెన అని భారతదేశ చరిత్రలో రామ్‌మోహన్‌రాయ్ వర్ణించబడినాడు. ఈ కృషిని తరువాత దేశంలో తక్కిన ప్రాంతాల వారు అందులో ముఖ్యంగా మహారాష్ట్ర ప్రాంతం వారు కొనసాగించారు. మహాదేవ గోవింద రనడే ప్రార్థనా సమాజాన్ని స్థాపించాడు. ఇతడే దళిత వర్గాల సమ్మేళనమును, ఒక వితంతు శరణాలయాన్ని, అనాధ శిశు వ్యయాన్ని ఏర్పరిచారు.

ప్రాశ్చాత్య హేతువాదం వల్ల భారత ప్రజల్లో కలిగిన భావ సంచలనపు ప్రతిఫలాలే బ్రహ్మ సమాజం, ప్రార్థన సమాజం అయితే ఈ కోవకు చెందక కొంతవరకు భారత గత చరిత్ర నుంచి, భావ స్ఫూర్తిని గ్రహించిన రెండు సంస్కరణ ఉద్యమాలు కూడా 19వ శతాబ్దంలో వ్యాప్తిలోకి వచ్చాయి. దేశీయ ప్రాచీన మత గ్రంధాల నుండి ఆ ఉద్యమాలు తమ ప్రాతిపదిక సూత్రాలను గ్రహించాయి. ఈ ఉద్యమాల్లో మొదటిది దయానంద సరస్వతి ప్రారంభించిన ఆర్య సమాజం. రెండోవది స్వామి వివేకానందుడు స్థాపించిన రామకృష్ణ మఠం. ఇందులో రెండవది ప్రాచ్య, పాశ్చాత్య మత భావనల మేలికలయికగా, లెక్కింపదగి వివేకానందుని గొప్పతనము వల్ల అతని బోధనల వల్ల ప్రపంచ ఖ్యాతిని ఆర్జింపగలిగింది.

వీనితో పాటుగా భారతీయులకు నైతిక బలాన్ని చేకూర్చిన మరో మత సంస్కరణ ఉద్యమం దివ్యజ్ఞాన సమాజం. వర్ణ వ్యవస్థకు సర్వమానవ సౌభ్రాతృత్వముతో సామరస్యాన్ని సాధించు మార్గాన్ని హిందువులకు ఇది తెలియజేసింది. హిందువులు ఆరాధించు అసంఖ్యాక దేవతల యందు ఇమిడి ఉన్న ఏకైక పరతత్వ భావనను అది స్పష్టం చేసింది. ఈ సంస్కరణ ఉద్యమాలు అన్నీ హిందూమత పునరుజ్జీవనానికీ దోహదం కల్పించి భారత జాతీయ ఉద్యమం రూపొందుటకు తోడ్పడినాయి.

ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం, సంస్కరణ ఉద్యమం కంటే పునరుజ్జీవన ఉద్యమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల, అటు సమాజం పైన, ఇటు సంస్కరణ ఉద్యమం పైన ప్రతికూల ప్రభావం పడింది. ముస్లీం మతంలో సయ్యద్ ఆహమద్ ఖాన్ సంస్కరణ ఉద్యమానికి నాంది పలికాడు. ముస్లీంలకు ఆధునిక విద్య అందించడానికి, అతడు ఎంతగానో కృషి చేశాడు. బ్రిటిష్ వారికి మద్ధతుదారులుగా ఉన్న వారిని కూడా తమ వైపుకు తిప్పకోగలిగాడు. తిలక్ మినహా మిగిలిన సంస్కరణ వాదులందరూ, సాంఘిక మత రంగాల్లో తీసుకురావాల్సిన సంస్కరణల కోసం వలస వాద ప్రభుత్వం పైన ఆధారపడ్డారు. అయితే సంస్కరణలు చేపట్టవలసిన విధానం గురించి, పద్ధతుల గురించి సంస్కరణ వాదుల్లో ఏకాభిప్రాయం లేదు. 19 వ శతాబ్దంలో తలెత్తిన సంస్కరణ ఉద్యమాలు సాధించింది గొప్పగా ఏమిలేకపోయినా మార్పులకు అవి నాంది పలకడంతో పాటు భవిష్యత్ సంస్కరణ ఉద్యమాలకు బాట వేశాయి. సాంస్కృతిక విప్లవం ఫలితంగా ఆవిర్భవించిన జాతీయవాదం సంస్కరణల కోసం పోరాడవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాయి.

యూరోపియన్ క్రైస్తవులు పెద్ద ఎత్తున భారత ప్రజలను క్రైస్తవ మతంలోకి మార్చడానికి, పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చెపట్టారు. దీనిని అడ్డుకోవడానికి హిందూ సమాజంలో ప్రవేశించిన దురాచారాలను నిర్మూలించడానికి, రాజారామ్మోహన్‌రాయ్, స్వామి దయానంద సరస్వతీ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద వంటి సాంఘిక, మత సంస్కర్తలు ఆవిర్భవించి, భారత సమాజాన్ని దిగజారిపోకుండా కాపాడారు.

సహనం ఓర్పు అంకిత భావంతో వీరు తమ కృషిని ప్రారంభించారు. వీరు ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళడానికి ఆస్థులను కుటుంబాలను విడనాడినారు. వీరికి అనేక సందర్భాల్లో వారి భార్యలుగాని, తల్లిదండ్రులుగాని, మద్దతు ఇవ్వలేదు. అయినప్పటికీ ఈ సంస్కర్తలు ధైర్యసాహసాలతో తమ పోరాటాన్ని ముందుకు కొనసాగించారు.

## 4.1.2.3. ముగింపు

భారతదేశమంతటా ఒకే విధమైన పరిపాలనా పద్ధతిని ఆంగ్ల భాష ద్వారా ఆధునిక విద్యా విధానాన్ని ప్రవేశపెట్టుట వల్లన ఒక నూతన మధ్యతరగతి మేధావి వర్గం ఆవిర్భవించింది. ఈ వర్గం బర్క్, స్పెన్సర్, స్టువర్ట్ మిల్ వాల్టైర్ వంటి భావకుల దార్శనిక రచనలను, మాజినీ వంటి విప్లవ కారుల వ్రాతను, అమెరికా స్వాతంత్ర్య యుద్ధం ఫ్రెంచి విప్లవం వంటి సంఘటనలను అవగతం చేసుకుంది. బ్రిటిష్ వారి పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలన్నా వీరికో ఆదరణ కలిగింది. విద్య ద్వారా తామ తెలుసుకొన్న భావనల సారాన్ని ఆచరణలోకి తెచ్చుటకు వీరు కృషి చేశారు.

ఆధునిక యుగానికి ముందు భారతదేశంలో వ్యక్తి జీవితం అంతా కులాచార సాంప్రదాయాల భావనల పరిధిలో ఇమిడి ఉండేది. భారతీయ సంస్కృతి చాలా వరకు మతాన్ని ఆశ్రయించింది. కాని బ్రిటిష్ యుగంలో పరిస్థితి మారింది. ఈ కాలంలో క్రొత్తగా ఒక మేధావి వర్గం రూపొందినది. వీరు సంఘ మర్యాదను మన్నించె పాత భావనను నిరాకరించారు. భారతదేశంలో ఇటువంటి మేధావి వర్గం అభివృద్ధి చెందడాన్ని పునరుజ్జీవన ఉద్యమం అని వ్యవహరిస్తున్నారు.

జె.యన్. సర్కార్ మాటల్లో నాటి భారతీయ పునరుజ్జీవన ఉద్యమం నిజమైనది, కాన్‌స్టాంట్ నోబిల్ నగర పతనం తరువాత ఐరోపాలో జరిగిన విప్లవాత్మకమైన ఉద్యమం కంటే తీవ్రమైనదీ విస్తృతమైనది.

భారతదేశంలో ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన విద్యా విధానం లౌకిక స్వభావం గలది. అది ఉదారభావాలను ప్రోత్సహించింది. దీని వల్ల దేశంలో మొదటిసారిగా మత, కుల విచక్షణ లేకుండా అందరికీ విద్యను అభ్యసించే అవకాశం లభించింది. ఈ విధముగా బ్రిటిష్‌వారి ప్రజాస్వామ్య కుల సిద్ధాంతాలలో పరిచయం సంపాదించుకొన్న విద్యావంతులగు భారతీయులు తిరుగుబాటు చేశారు. వీరు సమాజాన్ని సంస్కరించడానికి పూనుకొన్నారు. ఇటువంటి నూతన వర్గం మొదట బెంగాల్‌లో వెలసింది. "బెంగాల్ ఈనాడు ఏమి ఆలోచించి ఆచరిస్తుందో దేశములోని మిగతా ప్రాంతాలు రేపటి రోజున అవలంభిస్తారు.'' అని గోపాలకృష్ణ గోఖలే అన్నట్లు సాంఘిక, మత సంస్కరణ రంగాల్లో అనాడు బెంగాల్ దేశం ముందంజ వేసింది.

సంఘ సంస్కర్తలలో ఒక వర్గం వారు పూర్తిగా పాశ్చాత్య ప్రభావానికి లోబడి దానికి అనుగుణంగా, భారతీయ సంస్కృతిని దిద్ది ప్రచారం చేసారు. వారిలో ముఖ్యులు రాజారామ్మోహన్ రాయ్, రనడే, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రాజనారాయణ బోస్‌లు. వీరు స్థాపించిన సంస్థలో ముఖ్యమైనది బ్రహ్మ సమాజము ఇక రెండో వర్గం వారు పూర్తిగా సనాతన ధర్మాన్నే పాటించారు. వారిలో ముఖ్యులు స్వామి దయానంద సరస్వతీ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద మొదలైన వారు. దయానందుడు ఆర్య సమాజాన్ని, వివేకానందుడు రామకృష్ణ మఠాన్ని స్థాపించారు. వీరేగాక భారతదేశ సంస్కృతిని పునరుద్ధరించి, భారతీయుల్లో జాతీయ చైతన్యం కలిగించడానికి అనిబిసెంట్ గొప్పగా కృషి చేసింది. ఈమె భారత మహిళాభివృద్ధికి కూడా పాటుపడి భారతీయుల్లో జాతీయ చైతన్యం కలిగించింది.

ఏది ఏమైనప్పటికీ పైన వివరించిన సిద్ధాంతాలు కూడా కొన్ని అవకతవకల వలన ఏర్పడిన పరిస్థితులను మాత్రమే సూచిస్తాయి. కేవలం విధాన వైపరీత్యముల పరిస్థితులలో కలుగు ప్రతికూల పరిణామాలను మాత్రమే తెలియజేస్తున్నాయని విమర్శలకు లోనయినవి.

## 4.1.3. నమూనా ప్రశ్నలు :

1. పునరుజ్జీవనంలో మధ్య తరగతి మార్పును వివరింపుము ?

2. సామాజిక, మత సంస్కరణోద్యమాలు - దాని వ్యాప్తి గూర్చి తెలుపుము ?

### 4.1.4. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


ఆచార్య వై. కుమార స్వామి.

ఖండిక - 4

## పాఠం - 4.2

# సాంఘిక, మత సంస్కరణోద్యమాలు

### 4.2.0. లక్ష్యం :

19వ శతాబ్దంలో భారతదేశంలో కొనసాగిన సాంఘిక, మత సంస్కరణోద్యమాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయ సూచిక :


4.2.1 పరిచయం

4.2.2 బ్రహ్మసమాజం - రాజారామ్ మోహన్‌రాయ్

4.2.3 ద్వారకానాథ్ ఠాగూర్

4.2.4 దేవేంద్రనాథ్ ఠాగూర్

4.2.5 ఈశ్వర చంద్ర విద్యాసాగర్

4.2.6 కేశవ చంద్రసేన్

4.2.7 బంకిం చంద్ర చటర్జీ

4.2.8 శివనాథ శాస్త్రి

4.2.9 ఆనంద మోహన బోస్

4.2.10 ద్వారాకానాధ్ గంగోలి

4.2.11 ఆర్య సమాజం - దయానంద సరస్వతి

4.2.12 దివ్యజ్ఞాన సమాజం - అనీబిసెంట్

4.2.13 రామకృష్ణ పరమహంస

4.2.14 స్వామి వివేకానందుడు

4.2.15 రామకృష్ణ మఠం

4.2.16 బొంబాయి రాష్ట్రంలో సాంఘిక, మత సంస్కరణోద్యమాలు

- 4.2.16.1 ప్రార్థనా సమాజం
- 4.2.16.2 మహాదేవ్ గోవింద్ రానడే
- 4.2.16.3. జ్యోతి బాపులే
- 4.2.16.4 పండిత రమాబాయి సరస్వతి
- 4.2.16.5 కార్వే

4.2.17 మద్రాస్ ప్రెసిడెన్సీలో సాంఘిక, మత సంస్కరణోద్యమాలు

- 4.2.17.1 కందుకూరి వీరేశలింగం
- 4.2.17.2. రఘుపతి వెంకటరత్నం నాయుడు

**4.2.17.3** దేశిరాజు పెదబాపయ్య

**4.2.17.4** నారాయణ గురు

**2.17.5** ఆత్మగౌరవ ఉద్యమం - రామస్వామి నాయకర్

**4.2.18.** నమూనా ప్రశ్నలు

**4.2.19.** చదువదగిన గ్రంథాలు

## 4.2.1 పరిచయము :

సంస్కరణ ఉద్యమం సాంఘిక, మత పరమైన రెండు ధోరణలను కలిగి ఉండెను. ఇవి ఒకదానితో మరొకటి ఎడతెగని సంబంధం కలిగి ఉండెను. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, ప్రార్థనా సమాజం, రామకృష్ణ మఠం, దివ్యజ్ఞాన సమాజం వంటి సంస్థల పుట్టుక వాటి కార్యకలాపాల మూలంగా మత ధోరణులు ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. పాశ్చాత్య భావాలను అలవరచుకొనడం వితంతు పునర్ వివాహం, కులాంతర వివాహాలు, స్త్రీ విద్య మొదలగు కోరికల మూలంగా, సాంఘిక ధోరణులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సంస్కర్తలు బహు భార్యత్వాన్ని, బాల్య వివాహాలను, కుల వ్యత్యాసాలను, పరదా పద్ధతిని నిర్మూలించాలి అని వాదించారు. వీరు హరిజనుల ఉద్ధరణకు, స్త్రీ జనోద్ధరణకు కృషి చేశారు.

## 2.2. బ్రహ్మ సమాజం - రాజారామమోహన్‌రాయ్

హిందూ మత పునరుద్ధరణకై స్థాపించిన సమాజాల్లో బ్రహ్మసమాజం ఒకటి, రాజారామ్‌మోహన్‌రాయ్ అతని అనుచరులు కొందరు, ఈ బ్రహ్మ సమాజాన్ని కలకత్తాలో 1828లో స్థాపించారు. ఉపనిషత్తుల్లో ఈశ్వరుని బ్రహ్మ అని పేర్కొన్నారు. అందుకే ఈశ్వరుని ఆ పేరుతో పూజిస్తే, సమంజసంగా ఉంటుంది అని రామ్మోహన్‌రాయ్ భావించి తన సమాజానికి బ్రహ్మ సమాజం అని పేరు పెట్టాడు.

రాజారామ్మోహన్ రాయ్ 1772లో బెంగాల్ రాష్ట్రంలో ఒక సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. సంస్కృతం, పారశీకం, ఆంగ్లము, బెంగాలీ, అరబ్బీ, ఫ్రెంచి, లాటిన్ గ్రీక్, హిబ్రూలలో కూడిన 12 భాషలను నేర్చుకొని వీటిలో ఉన్న ప్రసస్తమైన మత, లౌకిక గ్రంథాలను క్షుణ్ణంగా ఆధ్యయనం చేశాడు. ముస్లీమ్‌ల పవిత్ర గ్రంథం అయిన ఖురాన్ క్షుణ్ణంగా చదివి ఆర్థం చేసుకున్నాడు.

అందులో ప్రతిపాదించిన ఏకేశ్వర తత్వం విగ్రహారాధన నిషేధం చేత, అతడు ప్రభావితుడయ్యాడు. తరువాత కాశీ శాస్త్రవేత్తల సహాయంతో హిందూమత గ్రంథాలను ఆధ్యయనం చేశాడు. బౌద్ధ రహస్యాలను తెలుసుకోడానికి టిబెట్ వెళ్ళాడు. క్రైస్తవ మత ప్రచారకులలో సన్నిహిత సంబంధాన్ని సంపాదించి, బైబుల్ గ్రంధాన్ని కూడా చదివి అందులోని రహస్యాలను తెలుసుకున్నాడు. ఈ రకంగా అన్ని మత గ్రంథాలలోని విషయాలను అర్థం చేసుకొని గొప్ప మేధావి అని పేరు పొందాడు.

రాజారామ్మోహన్‌రాయ్ ప్రజా సంక్షేమాన్ని కొలబద్ధగా తీసుకొని మత, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సంస్కరణ మార్పులకై పాటుపడినాడు. హిందూ మతంలో శతాబ్ధాలుగా గల బహు దేవతారాధన, విగ్రహారాధకుల విధానం, అంటరానితనం సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతు పునర్ వివాహ నిషేధం, స్త్రీలకు ఆస్థిహక్కు, విద్యా వసతులలేమి మొదలగు వాటిని ఖండించాడు. బహు దేవతారాధన, విగ్రహారాధన, కుల విధానం, హిందూ గ్రంధాల్లో ఎక్కడా ప్రస్తావించబడలేదు అని అవి తరువాత కాలంలో ప్రవేశించాయి అని కాబట్టి హిందువులు ప్రామానిక గ్రంధాలను అనుసరించి ఏకేశ్వర మతానికి మరళాలి అని ప్రభోదించాడు. ఏనాడు అయితే హిందువులు విగ్రహారాధనను మాని వర్ణ విభేదాలను విస్మరించి, ఏకేశ్వర ఉపాసనకు పూనుకుంటారో ఆరోజు వారు అసలు హైందవ మతాన్ని అనుసరించిన వారవుతారు అని పేర్కొన్నారు.

తన విజ్ఞానంలో తను ప్రతిపాదించిన మౌళిక సూత్రాలను, ఏఏ గ్రంథాల్లో ఉన్నాయో చూపించి రుజువు చేశారు. తను నమ్మిన ఈ విషయాలను తెలియపరచడానికి అతను అనేక మార్గాలను అవలంభించాడు. వీటిలో మొదటి మార్గంగా ప్రజలకు అర్థం అయ్యేలా కొన్ని

ఉపనిషత్తులను, వేదాంత సూత్రాలను, బెంగాల్ భాషలోకి అనువదించాడు. పారశీక భాషలో తువాసత్ - ఉల్ ముహిద్దీన్ అను గ్రంధాన్ని రచించి ఆస్థిత్వము గల సర్వ పదార్థానికీ మూల భూతుడు, పరిరక్షకుడు అయిన ఏకేశ్వరుని ఆరాధించుటయే సత్యం. అనే విషయాన్ని నొక్కి వక్కాణించాడు. వేదాంత ఉపనిషత్య సంగ్రహం అనే గ్రంధాన్ని ఆంగ్ల భాషలోకి అనువదించాడు. క్రైస్తవ మతంలో హేతుబద్ధంకాని క్రీస్తు దైవత్వం, అద్భుతాలు, ఇస్లాంలోని పుణ్యులు, పాపుల వర్గీకరణ లాంటి వాటిని రామ్మోహన్ రాయ్ విమర్శించాడు.

రాజారామ్మోహన్‌రాయ్ తన మతాన్ని ప్రచారం చేయడానికి, అవలంభించిన రెండో విధానం బ్రహ్మ సమాజ స్థాపన. మొదట 1816లో రామ్మోహన్ రాయ్ 'ఆత్మీయ సభ' అను సంస్థను స్థాపించాడు. అన్ని మతాల వారికీ దీనిలో సభ్యత్వ అవకాశం ఇవ్వబడింది. దీని సమావేశాల్లో వేదాల నుండి శ్లోక పటనం మత పరమైన పాటల గానం చేయబడేవి. 1928లో బ్రహ్మ సభ అను సంస్థను స్థాపించాడు. సంవత్సరం తరువాత దీనిని బ్రహ్మ సమాజంగా పేరు మార్చటం జరిగింది. ఈ సమాజం ముఖ్య ఉద్దేశాలు.

1. ఈశ్వరుడు ఒక్కడే, అదే ఏకేశ్వరోపాసన
2. భగవంతుని దృష్టిలో మానవులంతా సమానులే
3. అన్ని మతాల సారం ఒక్కటే
4. భగవంతుని నిర్మలమైన మనస్సుతో ధ్యానించాలి
5. మోక్షానికి మార్గం మానవుని సత్ ప్రవర్తన భగవత్ ధ్యానము.
6. కర్మకాండ, మూఢ విశ్వాశాలు ఖండించాలి
7. విగ్రహారాధన అవసరం లేదు.

1930 లో బ్రహ్మ సమాజ ప్రార్థనా మందిరం ఒకటి స్థాపించబడింది. ఈ మందిరం ట్రస్ట్ పత్రంలో పొందుపరచబడిన ముఖ్య అంశాలు

1. బ్రహ్మ ఆరాధనకు కులం, మతంతో ప్రసక్తి లేకుండా అందరూ సమావేశ స్థలానికి రావచ్చు
2. సమాజ భవనంలోనికి ఎటువంటి విగ్రహం ప్రతిమ, చిత్రపటం అనుమతించరాదు
3. సమాజంలో కాని సమాజభవనంలో గాని ఎటువంటి యజ్ఞాలు గాని మత పరమైన క్రతువులు గాని అనుమతించరాదు
4. ప్రార్థనలు, ధ్యానం ఉపనిషత్తుల నుంచి పటనము ద్వారా ఆరాధన నిర్వహించడమైనది

రామచంద్ర విద్యావగీష్ ఈ ప్రార్థనా మందిర మొదటి ఆచార్యుడిగా ఏంపిక అయ్యాడు. ఇతడు ప్రతి బుధవారం జరిగే ప్రజా సమావేశాల్లో ప్రార్థనలు నిర్వహించేవాడు. విష్ణు చంద్ర, చక్రవర్తి భక్తి పరమైన పాటలను గానం చేసిన తరువాత సమావేశాలు ముగిసేవి. రామ్మోహన్ రాయ్ తయారుచేసిన అనుస్థాన్ అనే కరపత్రంలో కూడా బ్రహ్మ సమాజంలో అనుసరించాల్సిన పూజా విధానం నిర్ణయించడమైంది. బ్రహ్మ సమాజ మందిర ట్రస్ట్ పత్రంలో దాతలుగా రామ్మోహన్‌రాయ్, ద్వారాకానాధ్ ఠాగూర్, ప్రసన్నకుమార్ ఠాగూర్, కాశీనాధ్ రాయ్, రామచంద్రవిద్యా వగీష్‌లు పేర్కొనబడ్డారు. శాస్వితమైన కనిపించని, రూపంలేని ప్రపంచాన్ని సృష్టించి నడిపించే శక్తి ఆరాధన ఈ సమాజలక్ష్యమైయింది. ఎటువంటి జీవహింసగాని, ఇతర మతాలను దూషించుటగానీ, ఈ సమాజ పూజా విధానంలో నిషేధింపబడ్డాయి.

రామ్మోహన్ రాయ్ ఉపనిషత్తులకు అనుగుణంగా హిందూమతాన్ని పరిష్కరించి, ప్రజల ముందు ఉంచాడు. ఆయన కృషి ఫలితంగా పెక్కు మంది హిందువులకు, హిందూ మతంపై గట్టి నమ్మకం కలిగింది. బ్రహ్మ సమాజ మతం ఒక ప్రత్యేకమైన మతం కాదు అని అది హిందూ మతంలో ఒక భాగం అని రామ్మోహన్ ప్రచారం చేశాడు. హిందువులంతా దీనిని అనుసరించాలి అని అతడు కోరుకున్నాడు. ఈ విధముగా హిందూ మత సంస్కారానికి సంబంధించిన మత ఉద్యమం బయలుదేరింది. అందుకే రామ్మోహన్ రాయ్ ఆధునిక సంస్కర్తలకు పితామహుడని పేర్కొంటారు.

రామ్మోహన్ రాయ్ ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడానికి, సతీసహగమనాన్ని నిషేధించడానికి ప్రయత్నించాడు. రామ్మోహన్ జరిపిన విస్తృత ప్రచారం వలన బెంటింగ్ సతిని నిషేధిస్తూ ఒక చట్టం రూపొందించాడు. బాల్య వివాహాలు నిరసించడం, పునర్వివాహాలు జరిపించడం, బహు భార్యత్వాన్ని వ్యతిరేకించడం మొదలైన సంస్కరణలు చేపట్టాడు. హిందూ కళాశాలను స్థాపించడంలో ఇతడు డేవిడ్ హేర్‌కు పూర్తిగా సహకరించాడు. పత్రికా స్వేచ్ఛను పూర్తిగా సమర్థించాడు. వలస ప్రభుత్వం అనుసరిస్తున్న స్వేచ్ఛ వ్యాపార విధానాలను ఖండించాడు. కుల వ్యవస్థను వ్యతిరేకించడం, ఉన్నత పదవుల్లో భారతీయులకు స్థానం కల్పించాలి అని కోరడం, చట్టం ముందు భారతీయులకు, యూరోపియన్‌లకు సమానత్వాన్ని కల్పించాలి అని కోరడం ద్వారా రామ్మోహన్‌రాయ్ జాతి చైతన్యానికి నాంది పలికాడు.

ఢిల్లీ చక్రవర్తి రెండవ అక్బర్ 1835లో రామ్మోహన్ రాయ్‌ని ఢిల్లీకి ఆహ్వానించి 'రాజా' అనే బిరుదుతో సత్కరించాడు. అప్పటి నుంచి అతను రాజారామ్మోహన్ రాయ్ అని పిలువబడుతున్నాడు. రామ్మోహన్ రాయ్ ఆంగ్లేయులకు హిందూ మతాన్ని గురించి తెలుపడానికి వేదాంత, ఉపనిషత్ సంగ్రహం అనే గ్రంధాన్ని ఆంగ్లములోకి అనువదించి, పరిచయంలో పరమ బ్రహ్మయే ఆరాధ్యం, పూజ్యము అని నిర్వచించాడు. హిందూ మతాన్ని సమర్థించిన పరమత సహనం అవసరం అని ఆ మతాల్లో కూడా, గొప్ప సత్యము ఉన్నది అని నమ్మినాడు. 1833లో రామ్మోహన్ మొగలు చక్రవర్తి రాయబారిగా ఇంగ్లాండ్ వెళ్ళినాడు. అదే సంవత్సరము సెప్టెంబర్ ఇంగ్లాండ్‌లోని బ్రిస్టల్ నగరంలో 'రాయ్' మరణించాడు. అతనిని అచ్చటనే సమాధి చేశారు.

బ్రహ్మసమాజ స్థాపన సంప్రదాయ హిందువులకు ఆగ్రహాన్ని తెచ్చి పెట్టింది. వీరు రాజా రాధాకాంతదేవ్ నాయకత్వంలో ధర్మసభ అనే సంస్థను స్థాపించారు. విగ్రహారాధన లేని, ఏక దేవతారాధనతో కూడిన మత ప్రమాదం నుండి హిందూ మతాన్ని కాపాడడానికి ఈ నూతన శాఖ ఉద్దేశింపబడింది. ఈ శాఖ సభ్యులచే రామ్మోహన్ అతని అనుచరులు, సామాజిక అణచివేతలకు అపహాస్యానికి గురి అయ్యారు. బ్రహ్మ సమాజ సూత్రాలు పూజా విధానం దైవ సేవ స్వభావ రిత్యా బెంగాల్, మేధావి వర్గానికి మాత్రమే నచ్చాయి. ఇది ప్రజా ఉద్యమం కాకపోయినప్పటికీ దీని ప్రభావం విస్తృతమైయింది. అన్ని ఆధునిక విద్యా, సామాజిక రాజకీయ సంస్కరణ ఉద్యమాలు రామ్మోహన్ నుండే ప్రారంభమైయినాయి.

## 4.2.3 ద్వారకానాధ్ ఠాగూర్

రామ్మోహన్‌రాయ్ సంస్కరణలు అన్నింటికి అతని మిత్రుడైన ద్వారకానాధ్ ఠాగూర్ మద్దతు పలికాడు. ఆంగ్లేయుల కాలంలో తలెత్తిన ఆర్థిక విప్లవం కారణంగా, ఎంతో ప్రయోజనాన్ని పొందిన పారిశ్రామిక వేత్తగా ద్వారకానాధ్ భారతీయ పరిశ్రమలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి అని ఆధునిక సాంకేతిక పద్ధతులు అనుసరించాలి అని భావించేవాడు. ఆ రకంగా చేస్తేనే భారతీయ పరిశ్రమలు ఆంగ్లేయుల పరిశ్రమలతో పోటీపడగలవని భావించేవాడు. అయితే కుల వ్యత్యాసాలు మూఢ నమ్మకాలతో నిండిపోయిన సమాజాన్ని సంస్కరించనిదే ఆధునిక సంస్కరణలు ప్రవేశపెట్టనిదే ఇది అసాధ్యమని ఇతడు భావించాడు. ఈ రకంగా ద్వారకానాధ్ పారిశ్రామిక రంగానికి చెందిన వారైనప్పటికీ సంఘ సంస్కరణలు విద్యా ప్రగతి గురించి ఇతడు ఎనలేని కృషి చేశాడు. ఇతడు ఆర్థిక సహాయం చేయకుండా ఉంటే ఇతని సహకారం లేకుండా ఉంటే రామ్మోహన్‌రాయ్ సంస్కరణలను చేపట్టగలిగి ఉండేవాడు కాదు.

## 4.2.4. దేవేంద్రనాధ్ ఠాగూర్

రాజారామ్మోహన్ రాయ్ నుండి నాయకత్వ బాధ్యత స్వీకరించి, బ్రహ్మ సమాజాన్ని అభివృద్ధి పరచి పటిష్టం చేసిన వాడు దేవేంద్రనాధ్ ఠాగూర్. ఇతడు ద్వారాకానాధ్ ఠాగూర్ కుమారుడు 1817 లో సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఇతడు చిన్న నాటి నుండి పవిత్ర ఆధ్యాత్మిక పాండిత్య జీవితానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఆచరించసాగాడు. ఇతడు గడిపిన పవిత్ర జీవితం ఇతనికి మహర్షి అను బిరుదాన్ని సంపాదించి పెట్టింది. ఇతడు 1839 లో మత గ్రంధాల గురించి తెలుసుకోవడానికి, తత్వ బోధిని సభను స్థాపించాడు. ఈ సభ కార్యక్రమాలను తెలియజేయడానికి తత్వ బోధిని పత్రిక కూడా నిర్వహించాడు. భగవంతుడు ప్రతి దానియందు వ్యాపించి ఉన్నాడు. అనే సిద్ధాంతం ఈ సభ స్థాపనకు స్ఫూర్తినిచ్చింది. సమాజం మత అంతర్భాగము అని దేవేంద్రనాధ్ గుర్తించాడు. అందువల్లనే తన సంస్థకు తత్వబోధిని సభ అను పేరు పెట్టాడు. మూఢ నమ్మకాలు, విగ్రహారాధనను సంఘటితంగా ఎదిరించడంతో బాటు ఈ సభ దేశ ప్రగతికై

కృషి చేసే సంస్థగా, యువతకు వేదిక అయింది. బ్రహ్మసమాజంతో దగ్గరి సంబంధాన్ని కలిగి 1959 తరువాత దానితో కలిసి పోయింది. దీని కార్యక్రమాలు :

1. బ్రహ్మ సమాజ పునర్ నిర్మాణం
2. ప్రాచ్యపవిత్ర గ్రంధాలలోని భావాల చర్చ వ్యాప్తి
3. స్థానిక బెంగాలి భాష ద్వారా విజ్ఞాన వ్యాప్తి
4. విదేశీ మత ప్రచారకుల దాడుల నుండి భారతీయ మత, సంస్కృతుల రక్షణ, భారతీయ మత సంస్కృతులపై విదేశీ ప్రభావ దుష్ ఫలితాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సంఘటిత పరచడం.

దేవేంద్రనాథ్ తత్వ బోధిని సభతో పాటు 1840 లో తత్వ బోధిని పాఠశాలను స్థాపించాడు. హిందూ బాలురు క్రైస్తవ మత ప్రచారకుల చేత మత మార్పిడి పొందకుండా రక్షించేందుకై ఇతడు హిందూ హితార్థి విద్యాలయాన్ని కూడా నెలకొల్పాడు. బ్రహ్మసమాజం వారు పాటించవలసిన ధర్మ సూత్రాలన్నిటినీ ఇతడు ఒక గ్రంథ రూపంలో ప్రచురించాడు. బ్రహ్మ ధర్మము అనే ఈ గ్రంథమే బ్రహ్మసమాజం వారికి ప్రమాణ గ్రంథమైయింది.

దేవేంద్రనాథ్ ఠాగూర్ 1842 లో బ్రహ్మసమాజ బాధ్యతలు స్వీకరించాడు. ధర్మ సభ క్రైస్తవ మిషనరీలు బ్రహ్మ సమాజంపై దాడిచేసి బలహీన పరుస్తున్న సందర్భంలో దీని పటిష్టతకు దేవేంద్రనాథ్ అన్ని చర్యలు చేపట్టాడు. సమాజ భవనంలో జరిగే సమావేశాల్లో శూద్రులు పాల్గొనేందుకు దేవేంద్రనాథ్ అనుమతించాడు. రామ అవతారం లాంటి భగవంతుని అవతారాల గూర్చి సమాజ వేదిక నుండి తెలయజేయడం నిషేధించాడు. విగ్రహారాధన విసర్జన, నిరాకార ఏక దేవతారాధన విషయంలో ఏవరైతే శబదం తీసుకుంటారో అటువంటి వారినే సమాజ సభ్యులుగా తీసుకోవాలి అని ఇతడు నిర్దేసించాడు. దేవేంద్రనాథ్ తీసుకున్న ఈ చర్యల వల్ల బ్రహ్మ సమాజం పటిష్టమై, దీని సభ్యుల్లో నూతన ఉత్తేజం ఏర్పడింది. దేవేంద్రనాథ్ నాయకత్వంలో సమాజ సభ్యులు దేశ దూర ప్రాంతాల్లో పర్యటించి, సమాజ ఆదర్శాలను సంస్కరణ ప్రయత్నాలను గురించి ప్రజలకు తెలియజేశారు.

దేవేంద్రనాథ్ ఠాగూర్ విద్య, స్త్రీ జనోద్ధరణ లాంటి సామాజిక, సంస్కరణ రంగాల్లో కూడా గొప్ప కృషి చేశాడు. మహర్షి లాగా పవిత్ర వ్యక్తిగత జీవితాన్ని గడుపుతూ బ్రహ్మ సమాజ సంస్కరణ పటిష్టత, ప్రగతికి కృషిచేసిన వ్యక్తి దేవేంద్రనాథ్. అక్షయ కుమార్ దత్తా నాయకత్వంలో బ్రహ్మ సమాజంలోని యువ వర్గం వేదాల ఆధిక్యత పట్ల విమర్శనాత్మక దృక్పధాన్ని అలవరుచుకొన్నది. అక్షయ కుమార్ అభిప్రాయాల పట్ల దేవేంద్రనాథ్ సానుభూతిని చూపించాడు.

## 4.2.5. ఈశ్వర చంద్ర విద్యాసాగర్

సాంఘిక సంస్కరణల రంగంలో బెంగాలీ విద్యావేత్త మహిళా హక్కులు పోరాటవాది అయిన ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గొప్ప కృషి చేశాడు. బెతూన్ నెలకొల్పిన మహిళా పాఠశాలలో లభించిన ప్రధాన కార్యదర్శి పదవి, సంఘ సంస్కరణకు ఈశ్వర చంద్రకు అవకాసం కల్పించింది. సమాజంలో మహిళలు తమ ప్రతిపత్తిని, సమాన హోదాను నిలబెట్టుకోడానికి విద్య ప్రధాన సాధనంగా ఉండేది. ఈ విషయాన్ని గ్రహించిన ఈశ్వర చంద్ర, స్త్రీ విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశాడు. సతీసహగమనం నిషేధం కారణంగా మహిళలు నిర్బందంగా మరణించాల్సిన అవసరం తప్పింది. ఇలాంటి మహిళలకు జీవితంపై ఆశక్తి కలిగించి వారి జీవితాన్ని ఫలప్రదం చేయాల్సిన అవసరం ఉందని ఈశ్వర చంద్ర గ్రహించాడు. మహిళలకు విద్యా బోధనతో పాటు విధవలకు, వారసత్వ హక్కులు, ఇతర హక్కులు కూడా కల్పించాలి అని ఈశ్వర చంద్ర పోరాటం సాగించాడు. విధవా పునర్వివాహాలను హిందూ శాస్త్రాలు అనుమతిస్తున్నాయి అని అతడు ప్రజలకు వివరించి చెప్పినాడు. 1856లో లెజిస్లేటివ్ కౌన్సిల్ హిందూ విధవా పునర్వివాహ చట్టాన్ని రూపొందించడంతో ఇతని కృషికి తగిన ఫలితం లభించింది. ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌కు, ఇతర సంస్కర్తలకు మధ్య ఒక ప్రధానమైన భేదముంది. అనేక మంది సంస్కర్తలు సాంఘిక సంస్కరణలతో పాటు మత సంస్కరణ వైపు కూడా మొగ్గుచూపించేవారు. అయితే ఈశ్వర చంద్రకు మాత్రం మతపరమైన సంస్కరణలపై ఆసక్తి ఉండేది కాదు.

## 4.2.6. కేశవ చంద్రసేన్

బ్రహ్మ సమాజాన్ని ప్రపంచ వ్యాప్తి చేయాలి అని ఆశించిన వారిలో కేశవ చంద్రసేన్ ముఖ్యుడు. బ్రహ్మ సమాజ సిద్ధాంతాలతో పాటు క్రైస్తవ మత సిద్ధాంతాలు కూడా మిళితం చేసి ప్రపంచమతాన్ని స్థాపించాలి అన్నది ఇతని కోరిక. ఈ మతంలో అన్ని మతాల సారం ఉంటుంది కాబట్టి అన్ని మతాల వారు దానిని స్వీకరించగలరు అని అతని నమ్మకం కేశవ చంద్రసేన్ ప్రవేశంతో బ్రహ్మసమాజ చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైయింది.

రాజారామ్మోహన్ రాయ్ లాగా కేశవ చంద్రసేన్‌కూడా సంఘ, సంస్కరణలకు ముఖ్యముగా స్త్రీ విద్య, వర్ణాంతర వివాహాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. ఇతని సలహామేరకే ప్రభుత్వం 1872 లో సివిల్ మ్యారేజ్ చట్టం ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం వధు, వరులు తమ మతాన్ని తెలియజేయవలసిన అవసరం లేదు. వధువుకు 14 సంవత్సరాలు వరునకు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. సనాతన వివాహ పద్ధతులేమి, అనుసరించనక్కరలేదు. దీని మూలంగా వివాహాలు సులభంగా, జరగడమే కాకుండా బాల్య వివాహాలు అంతరించిపోడానికీ, వర్ణాంతర వివాహాలు జరగడానికీ వీలైయింది. కులాంతర వివాహాల విషయంలో దేవేంద్రనాథ్ ఠాగూర్‌తో సేన్‌కి ఏర్పడ్డ బేధాభిప్రాయాలు చివరికి బ్రహ్మ సమాజంలో చీలికకు దారితీస్తాయి. కేశవ చంద్రసేన్ వర్గాన్ని ఇండియా బ్రహ్మ సమాజం అని దేవేంద్రనాధ్ ఠాగూర్ వర్గాన్ని ఆది బ్రహ్మ సమాజం అని వ్యవహరించసాగారు.

కేశవ చంద్రసేన్ తన 24 వ ఏటనే బ్రహ్మ సమాజానికి నాయకుడై, దానిని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి కృషి చేశాడు. ఇతని ఆదేశానుసారమే రానడే, పూనాలో ప్రార్థనా సమాజాన్ని స్థాపించాడు. ఫలితంగా, దక్షిణ దేశంలో కూడా బ్రహ్మసమాజం వ్యాప్తి పొందడానికి వీలైయింది. ఇతడు 1879లో ఇంగ్లాండ్ వెళ్లి అక్కడ అన్ని ప్రాంతాల్లో తిరిగి, ఆధ్యాత్మిక రంగంలో భారతదేశం సాధించిన గొప్పతనాన్ని అక్కడి వారికి తెలియజేశాడు. ఈ అభిప్రాయాన్ని ఇంగ్లాండ్‌లో అనర్గల వాగ్ధాటితో తన ఉపన్యాసాలలో తెలియజేశాడు. ఇటువంటి అభిప్రాయాన్ని వెల్లడించిన వారిలో ప్రధముడు ఇతడే. వివేకానందుడు, అరవింద ఘోష్ మొదలగు సంస్కర్తలు సేన్ ఆశయానికి మరింత దోహదం ఇచ్చారు.

కేశవ చంద్రసేన్ బ్రహ్మ సమాజ సిద్ధాంతాల వ్యాప్తికి, చాలా కృషి చేశాడు. కాని అతడు తన స్వవిషయంలో సమాజ సిద్ధాంతానికి వ్యతిరేకంగా తన కుమార్తెకు 13 సంవత్సరాల ప్రాయం మించకుండా ఆమెను 16 సంవత్సరాల కూచ్ బీహార్ మహారాజుకు ఇచ్చి వివాహం చేయడంతో అతని అనుచరులకు, అతనిపై ఆగ్రహం వచ్చి, అతని నుండి వేరుపడి మరో బ్రహ్మ సమాజాన్ని స్థాపించారు. దానికి సాధారణ బ్రహ్మ సమాజం అని పేరు. దీని నాయకుడు పండిత శివనాథ శాస్త్రి ఈ విధముగా బ్రహ్మ సమాజం ఆదిసమాజం అని, ఇండియా బ్రహ్మ సమాజం అని సాధారణ బ్రహ్మ సమాజం అని మూడు భాగాలుగా చీలిపోయింది. ఈ చీలికలే బ్రహ్మ సమాజం క్షీణించడానికి కారణభూతమైయింది.

## 4.2.7. బంకిం చంద్ర ఛటర్జీ :

కేశవ చంద్రసేన్ సమకాలికుడైన బంకించంద్ర చటర్జీ కృష్ణ చరిత్ర ప్రచురణ ద్వారా ప్రజలకు చేరువకావడానికి ప్రయత్నించాడు. కృష్ణ భగవానునిపై క్రైస్తవ మిషనరీలు చేస్తున్న వ్యతిరేక ప్రచారాన్ని చాలా వరకు ఖండించగలిగాడు. మత పునరుద్ధరణ కూడా జాతీయవాదంలో భాగమేనని ఇతడు విశ్వశించాడు. అందుకే వివిధ దేవతల పట్ల ఇతడు ఆరాధన, భక్తి భావం ప్రదర్శించాడు. ఆనంతమటము లాంటి ఇతని రచనలు ఇతని భావాన్ని ప్రతిబింబించాయి. ఇతడు రచించిన ఉత్తేజ పూర్వకమైన వందేమాతర గేయం భారత జాతీయ గీతం అయింది. ఇతడు కుల వ్యవస్థను ముఖ్యంగా, కులీన బ్రాహ్మణులను కూడా తీవ్రంగా విమర్శించాడు.

## 4.2.8. శివనాథ శాస్త్రి :

బ్రహ్మ సమాజ సూత్రాలకు విరుద్ధంగా కేశవ చంద్రసేన్ తన కుమార్తెను వివాహం జరపడం వల్ల ఆయన యువ అనుచరులు సాధారణ బ్రహ్మ సమాజంగా విడిపోయారు. ఈ నూతన శాఖకు శివనాధ శాస్త్రి నాయకుడైయాడు. మానవ ప్రగతికై సమాజంలో ఎటువంటి ఆంక్షలు ఉండకూడదు అని ఇతడు భావించాడు. ప్రేమ, సహనం, సానుభూతి ద్వారా అట్టడుగున ఉన్నవారిని ఆదుకోని

సంస్కరించాలి అని భావించాడు. ఇతని రచనల్లో ప్రసంగాల్లో హేతువాదం దేశాభిమాన సూత్రాలు ప్రధమంగా పూర్తిగా వ్యక్తమైయాయి. ఇతని బ్రహ్మ మతంలో రాజకీయ స్వేచ్ఛ, సామాజిక న్యాయం, వ్యక్తి స్వేచ్ఛ యువతకు కనిపించింది. విగ్రహారాధన కుల వ్యవస్థ అనవసరం అని స్త్రీలు **16** సంవత్సరాల ముందు పురుషులు **21** సంవత్సరాల ముందు వివాహం చేసుకోబోము అని, స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేస్తాము అని స్వపరిపాలన దైవము కోరేది అని ఈ మత సభ్యులు ప్రమాణం చేయాలి. తన లక్ష్య సాధనకై శాస్త్రి దేశంలోని వివిధ ప్రాంతాలను పర్యటించి మత సూత్రాలు వ్యాప్తి చేశాడు. **1879** లో కలకత్తాలో నగర పాఠశాలను **1886**లో బాలికల నైతిక పాఠశాలను స్థాపించాడు. యువతుల ప్రయోజనానికి 'ముకుల్' అనే సంచికను, బ్రహ్మమత అనుచరులకు భారతీయ దూత అను సంచికను నిర్వహించాడు.

### 4.2.9. ఆనంద్ మోహన్ బోస్ :

బ్రహ్మ సమాజానికి ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసే పోరాటంలో ఆనంద్ మోహన్‌బోస్ శాస్త్రికి అండగా నిలిచాడు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుండి గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేసిన తొలి భారతీయుడు ఇతడే. ఇతడు కేశవ చంద్రసేన్ ఆచార్యులచే ఆకర్షితుడైయాడు. ఇతడు తన ఉపన్యాసాలలో దేశ భక్తికి, జాతీయతా భావనకు, ఆత్మ విశ్వాసానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. బెంగాల్ విద్యార్థుల్లో నూతన ఉత్సాహం కలిగించడానికి ప్రెసిడెన్సీ కళాశాలలో విద్యార్థి సంఘాన్ని స్థాపించి దానికి అధ్యక్షుడైనాడు. ప్రజాస్వామ్య సూత్రాలను రాజకీయ రంగంలోనే గాక సామాజిక మత రంగాల్లో కూడా ప్రవేశపట్టాలి అని ఇతడు భావించాడు. స్త్రీ విద్యకై కృషి చేశాడు. బాలికల విద్యకై ఏర్పాటు అయిన బెంగాల్ మహిళా విద్యాలయం, కలకత్తాలోని బ్రహ్మ సమాజ బాలికా పాఠశాల ఈయనకు ఏంతో రుణపడి ఉన్నాయి. సామాజిక సంస్కరణ కార్యక్రమాలు నాగరికత అభివృద్ధికి దోహదము చేస్తుంది అని భావించాడు. సామాన్య ప్రజల ప్రయత్నాల వల్లనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అని భావించాడు.

### 4.2.10 ద్వారకానాధ్ గంగోలి :

ద్వారకానాధ్ గంగోలి అతని భార్య కాదంబిని గంగోలి సాధారణ బ్రహ్మ సమాజ అభివృద్ధికై కృషి చేశారు. ద్వారాకానాధ్ స్త్రీల విముక్తి కొరకు కృషి చేశాడు. మహిళల కొరకు ఇతడు **1869** లో అబల బాంధవ్ అనే పత్రికను ప్రారంభించాడు. దీనిలో స్త్రీల సామాజిక రాజకీయ స్థితి మెరుగుపరచడానికి మార్గాలను సూచించారు. భారత వర్షీయ బ్రహ్మ సమావేశాల్లో స్త్రీలు పరదా తొలగించి కూర్చోడానికి ఉద్యమం చేశారు. స్త్రీలలో విద్యా వ్యాప్తిని కలిగించేందుకు బంగ మహిళ విద్యాలయ, బ్రహ్మ బాలికల పాఠశాలను స్థాపించాడు. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీ విద్యా వ్యాప్తికి యువకులను ప్రోత్సహించడానికి విక్రంపూర్ సమ్మిలన్ సభను స్థాపించాడు. ప్రత్యేకముగా స్త్రీ ప్రయోజనాల రక్షణకై బంగ మహిళా సమాజ్ అను సంస్థను స్థాపించాడు. పేద స్త్రీల భృతికై శిక్షణా సంస్థలను స్థాపించాడు. ఇండియా ప్రగతి భారతీయ స్త్రీల అభివృద్ధితో ముడిపడి ఉన్నది అని ఇతను విశ్వసించాడు. ఇతని మరణానంతరం ఇతని సామాజిక సంస్కరణ ధార్మిక కార్యక్రమాలను భార్య కాదంబిని కొనసాగించింది. ఇండియాలో తొలి వైద్య పట్టభద్రురాలు ఈమె. **1889** లో నిర్వహించబడిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల్లో ఈమె మహిళా ప్రతినిధిగా పాల్గొన్నది.

బ్రహ్మ సమాజం ప్రజల జీవితం పై గొప్ప ప్రభావాన్ని కలిగించింది. మత రంగంలో నూతన కార్యక్రమాన్ని రూపొందించింది. పెక్కు మంది మహిళలు ఆంగ్ల విద్యను నేర్చుకొని ఘోషాకు స్వస్తి చెప్పి ప్రజా జీవితంలో పాల్గొన్నారు. సర్వమానవ సోదరత్వం స్వాతంత్రియం మొదలైన అశయాలను, బ్రహ్మ సమాజం ప్రవచించింది. స్వరాజ్యమే భారతీయుల తుది లక్ష్యంగా ఉండాలి అని శివనాధ శాస్త్రి పెర్కొన్నాడు. దానిని సాధించాలి అంటే ముందుగా హిందూ మతంలోనూ, హిందూమత వ్యవస్థలోనూ గల లోపాలను తొలగించాలి అని అన్నాడు. కేశవ చంద్రసేన్ విదేశాల్లో పర్యటించి భారత సంస్కృతి ఔన్నత్యాన్ని చాటి చెప్పినప్పుడు భారతీయులకు ఆత్మ అభిమానం అత్మ విశ్వాసం పెరిగింది. ఇదే భారతీయులలో జాతీయ భావం పెరగడానికి, సహాయపడింది.

### 4.2.11. ఆర్య సమాజము - దయానంద సరస్వతి :

ఆర్య సమాజాన్ని దయానంద సరస్వతి స్థాపించాడు. క్రైస్తవ, ఇస్లాం ప్రచారాల వల్ల అనేక మంది హిందువులు తమ మతాన్ని విడిచి ఆయా మతాల్లో చేరుతుండేవారు. వారిని తిరిగి హిందూమతంలో చేర్చుకోడానికి ఆర్యసమాజం ప్రధానంగా స్థాపితమైయింది. పూర్వ

హిందూ సాంప్రదాయాలకు ఆధునిక, వైజ్ఞానిక విషయాలకు సమన్వయం కల్పించి నూతన సంస్కరణ ఉద్యమం మూలంగా హిందువులలో ఏక దైవము అనే జ్ఞానం ఏకేశ్వరోపాసనము సంఘీభావం నెలకొల్పే సంస్థయే ఈ ఆర్య సమాజం. హిందువుల అన్యమత ప్రవేశం ఎక్కువగా ఏ ప్రదేశాల్లో ఉన్నదో అక్కడ ఆర్య సమాజ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది.

ఆర్యసమాజ స్థాపకుడైన దయానంద సరస్వతి **1824** లో గుజరాత్‌లో జన్మించాడు. ఇతని వంశస్థులు తరతరాలుగా సంపన్నులు. ఇతని తండ్రి కర్షన్‌జి తహసీల్‌దారుగా పనిచేసేవాడు. ఇతనిని జన్మ నక్షత్ర నామంతో మూల్జీ అని శివభక్తుడు కావడం చేత మూల శంకర్ అని పిలిచేవారు. దయానంద సరస్వతి తన **22**వ ఏట ముక్తి మార్గాన్ని కనుగొనడానికి గృహాన్ని విడిచి వెళ్ళాడు. యోగ విద్యను అభ్యసించి, ముక్తి మార్గాన్ని కనుగొనడానికి పూర్ణానంద సరస్వతీ స్వామి వద్ద చతురాశ్రమాన్ని స్వీకరించి స్వామి దయానంద సరస్వతి అనే పేరు గడించాడు. యోగ అభ్యాసము వల్ల సునిశిత బుద్ధిని పొందాడు. తరువాత జ్ఞాన సముపార్జన కోసం విరజానంద స్వామిని సమీపించాడు. ఇతడు దయానందునకు జ్ఞాన బోధన చేశాడు. అతని దగ్గర చదువు పూర్తి చేసి, గురుదక్షిణ ఏమి కావలెనో అడిగితే అతడు తనకు ఏమి వస్తు రూపంలో వద్దు అని ప్రజా క్షేమం కోసం నడుము కట్టడమే గురుదక్షిణ అని, ఆర్య గ్రంధాలను నైతిక ధర్మాన్ని వ్యాపింప చేయాలి అని చెప్పాడు. నాటి నుండి దయానందుడు తన జీవితం అంతా గురువాజ్ఞను అమలులో పెట్టాడు. దేశంలో సంచరించి దేశ దుస్థితిని ప్రజల మూఢ విశ్వాసాలను అవైదిక ఆచారాలను ఆజ్ఞానాన్ని చూసి వేద ప్రచారం ద్వారా పోగొట్టి మానవ శ్రేయస్సుకు పాటుపడినాడు.

దయానంద సరస్వతీ తన ప్రచార కార్యసిద్ధి కొరకు మొదట బొంబాయిలో **1875** లో ఆర్య సమాజం అనే పేరుతో ఒక వైదిక మత ప్రచార సంఘాన్ని స్థాపించాడు. ఈ ఆర్య సమాజంలోని నియమాలు :

1. భగవంతుడు ఒక్కడే
2. విగ్రహారాధన, బహుదేవతారాధన కూడదు.
3. వేదాలు ప్రపంచ విజ్ఞానానికి మూలం
4. సంస్కారం, సత్ ప్రవర్తన వల్ల మోక్ష సాధన కలుగుతుంది.
5. వర్ణ ధర్మం వేద సమ్మతం కాదు. జాతి బేధాలు ఉండకూడదు
6. విగ్రహారాధన అవసరం లేదు.
7. వితంతు వివాహాలు, స్త్రీ విద్య నిషిద్ధాలు కావు
8. అస్పృస్యత, బాల్య వివాహాల వంటి దురాచారాలు శాస్త్ర సమ్మతం కావు.

దయానంద సరస్వతి ఆర్య సామాజికులు పాటించవలసిన ధర్మాలు అన్ని చేకూర్చి వారికి ప్రమాణ గ్రంధాలను కూడా సమర్పించాడు. అందులో ముఖ్యమైన గ్రంథం సత్యార్థ ప్రకాశిక. ఇది ధర్మ సంబంధమైన విజ్ఞాన సరస్వతిశ్వం. ఇందులో దేశ దేశాంతరాలలోని మతాల అన్నిటిని విమర్శించడం జరిగింది. వైదిక ధర్మ గొప్పతనం నిరూపించడమైయింది. ఈ గ్రంథం అనేక విదేశీ భాషలలోకి అనువదించబడింది. ఈ గ్రంధము వల్ల ఆర్య సమాజం వేదమూలక ధర్మాలను, ప్రభోదించడానికి ఏర్పడిన సంస్థ అని చెప్పవచ్చు.

ఆర్య సమాజ మత భావాల్లో ప్రగతి శీలక తిరోగామి లక్షణాలు మిళితమై ఉన్నాయి. బ్రాహ్మణుల అధికారాన్ని వ్యతిరేకించడం క్రతువుల ఖండన, విగ్రహారాధన తిరస్కృతి, మూఢ నమ్మకాలపై దాడి, ప్రగతి శీలక లక్షణాలను సూచిస్తున్నాయి. భూత, భవిష్యత్ వర్తమాన కాలాలకు సంబంధించిన విజ్ఞానం అంతటికి వేదాలు మూలమని ప్రకటించడం సంకుచతత్వాన్ని తెలియజేస్తున్నాయి. మారుతున్న సామాజిక, ఆర్థిక ప్రపంచంలో విజ్ఞాన స్థిరత్వం సాధ్యము కానిది. దీనికి తోడు వ్యక్తులు, తమ స్వతంత్ర ఆలోచనలకు తిలోదకాలు ఇచ్చి వైజ్ఞానికంగా, వేదాలకు బద్ధులైయే స్థితి ఏర్పడింది. ఇది ఉదారవాద సూత్రాలకు భిన్నమైయినది.

ఆర్య సమాజం నుండి హైందవ సమాజానికి చేకూరిన గొప్ప మేలు అది నిర్వహించిన శుద్ధి కార్యక్రమం. చాలా కాలముగా హిందూ మతస్థులు ఇతర మతాల వారిని తమ మతంలో కలుపుకోవడానికి పూనుకోలేదు. అది అవసరం అని కూడా వారు భావించలేదు. మతం

ఏదైనా చివరకు అది భగవంతుని చేరడానికి మార్గం కాబట్టి మతాల్లో తరతమ బేధాలు లేవు అని అందువల్ల ఇతర మతాలవారిని తమ మతంలో చేర్చుకోవలసిన అవసరం లేదని తలచారు. కాని దయానందుడు అందుకు విరుద్ధంగా ప్రవర్తించాడు. ఏప్పటికప్పుడు విదేశీయులు హిందూమతంపై దాడిచేయడం హిందూ మతస్థులను బాధ పెట్టడం వారిని తమ మతంలో కలుపుకోడానికి ప్రయత్నం చేయడం జరుగుతూనే ఉంది. అందుకు బదులుగా హిందువులు ఇతర మతాల వారిపై దండెత్తి, వారిని తమ మతంలోకి చేర్చుకోవాలి. ఈ విధముగా ప్రవర్తించినట్లు అయితే హిందూ మతానికి స్థిరత్వం లభిస్తుంది అని ఇతడు పేర్కొన్నాడు. ఏప్పుడూ ఎవరు ఇటువంటి అభిప్రాయాన్ని వెళ్లిబుచ్చలేదు. ప్రజలలో ఆత్మ విశ్వాసం కలగడమే కాకుండా నూతన ఉత్తేజం కలిగి భారతదేశ సౌభాగ్యానికి, ఉన్నతికి ఐకమత్యానికి ఇది సహాయపడగలదు అని అతను నమ్మాడు. అంతే కాకుండా హిందూ మతాన్ని ప్రపంచ వ్యాప్తం చేయమన్నాడు. ఈ మార్గం అనుసరించకపోతే హిందూ మతం అంతరిస్తుంది అని చెప్పాడు. దేశంలో చాలా మంది బలవంతాన ఇతర మతాలలోకి చేరిపోవలసి వచ్చింది. కాని వారికి హిందూమతంపై అభిమానం ఉన్నప్పటికీ, అవకాసం లభించినపుడు తిరిగి తమ మతాన్ని స్వీకరించడానికి వీలులేకపోయింది. అటువంటి వారు హిందూమతంలో చేరడానికి దయానంద సరస్వతి ఒక విధానం కల్పించాడు. ఆ విధానానికి శుద్ధి అని పేరు.

ఆర్య సమాజం చేపట్టిన సంస్కరణలలో గోరక్షణ కూడా ఉంది. **1882** లో గో రక్షణ సంఘం ఏర్పాటు అయింది. ప్రచారం నిమిత్తం బోధకులను నియమించారు. గోవు హిందూవులకు పవిత్రమైనదేగాక, ఆర్థికంగా అందరికి ఎంతో ఉపయోగకారి. ఆర్య సమాజం చేపట్టిన ధర్మ సహాయక విద్యా కార్యక్రమాలు ఉత్తర భారతదేశంలో గొప్పగా విజయవంతం అయ్యాయి. నేటికి కూడా ఎక్కువ అనాధ శరణాలయాలు, వితంతు గృహాలు, ఈ సమాజం నిర్వహిస్తున్నది. ఆర్య సమాజం విద్యా రంగంలో కూడా గొప్పసేవలందించింది. వీరు లాహోర్‌లో దయానంద్ ఆంగ్ల వైదిక కళాశాలను స్థాపించారు.

దయానంద సరస్వతి **1875** నుండి **1883** లో మరణించే వరకు తన సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ దేశం అంతటా పర్యటించాడు. పంజాబ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లలో ఆర్య సమాజం గొప్ప విజయాన్ని సాధించింది. బ్రహ్మ సమాజికుల లాగ దయానందుడు వర్గ భేదాలను అనుష్యతను ఖండించాడు. స్త్రీలకు సంఘంలో గౌరవ స్థానం కల్పించాలి అని అన్నాడు. మహిళలకై పాఠశాలలు నెలకొల్పాడు. ఇతడు మొదటి సారిగా స్వరాజ్య పదాన్ని వాడాడు. ఆధునిక భారతదేశ నిర్మాతగా భారతదేశ ప్రజల ఆధ్యాత్మిక ఉన్నతికి కృషి చేసిన వాడిగా ప్రజలలో దేశం పట్ల అకుంటిత దీక్షను దేశ భక్తిని రగిల్చిన వారిలో దయానందుడు ప్రధానమైన వ్యక్తిగా సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రశంసించాడు. భారతీయ పునరుజ్జీవన ఉద్యమ నాయకుల్లో ఒక ప్రత్యేకత కలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తిగా దయానందుని ఆరవిందయోగి ప్రస్తుతించాడు.

దయానంద సరస్వతి స్థాపించిన ఆర్య సమాజానికి సర్వస్వం ఆర్పించిన, మహనీయుల్లో స్వామి శ్రర్థానంద, లాలా లజపతిరాయ్ ముఖ్యులు. ఆర్య సమాజం నా తల్లీ, వైదిక ధర్మం నా తండ్రి అని లజపతిరాయ్ చెప్పినాడు. బ్రహ్మ సమాజంలో వలె ఆర్య సమాజంలో కూడా రెండు చీలికలు ఏర్పడ్డాయి. వారిలో మొదటి వర్గం వారు కేవలం గురుకులము వారు వారి ఆధ్వర్యం వైదిక ఉద్ధరణ బ్రహ్మచర్య విలసితమైన విద్యా ప్రచారం శాఖాహారం. ఈ వర్గానికి సంబంధించిన వారిలో ప్రముఖులు పండిత గుర్‌దత్, శ్రర్ధానంద స్వామి, దేవరాజ్. రెండవ వర్గం వారు సంఘ సంస్కర్తలు కూడా. ఈ వర్గంలో లారాశయనదాస్, లజపతిరాయ్ ముఖ్యులు. ఈ రెండు వర్గాల వారిలో లాలా లజపతిరాయ్ ఆర్య సమాజానికి గొప్ప సేవ చేశాడు.

ఆర్య సమాజం వ్యాప్తి చేసిన సంస్కరణలు ప్రజలను ఏకం చేయగా దాని మతపరమైన కార్యకలాపాలు మాత్రం హిందువులు, ముస్లీమ్‌లు, సిక్కులు, క్రైస్తవుల మధ్య పెరుగుతున్న జాతీయ సమైఖ్యతను దెబ్బతీసింది అని చరిత్రకారుల అభిప్రాయం.

## 4.2.12. దివ్య జ్ఞాన సమాజము - అనీబెసెంట్ :

ఆర్య సమాజము కంటే ఎక్కువ సాంప్రదాయకమైన మార్మకమైన మరో మత ఉద్యమం దివ్య జ్ఞాన సమాజం, ఇది విద్యావంతుల్లో మంచి ఆదరణ పొందింది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో **1875** లో మేడమ్ బ్లవాట్స్కి, కల్నల్ ఆల్కాట్‌ల కృషి ఫలితంగా స్థాపించబడింది. ఈ సమాజ నిర్మాతలు **1879**లో ఇండియా వచ్చి సమాజ కేంద్రాన్ని మద్రాస్‌లోని అడయార్ వద్ద **1882**లో ప్రారంభించారు.

కొద్ది కాలంలో దీని శాఖలు ఇండియా అంతటా వ్యాపించాయి. శ్రీమతి అనీబెసెంట్ 1888లో ఈ సమాజంలో చెరింది. ఈ సంఘటన గొప్ప విలువను సంతరించుకుంది.

దివ్యజ్ఞాన సమాజానికి ఆంగ్లములో ధియాసఫీ అని పేరు. ధిమోస్ అంటే దేవుడు, సోఫియా అంటే జ్ఞానం. ధీయాసఫీ అంటే భగవద్విషయక జ్ఞానం అని అర్థం. ఈ సమాజ లక్ష్యాలు :

1. జాతి, మత, కుల, వర్ణ, లింగ భేదాల విచక్షణ లేకుండా విశ్వ మానవ సౌభ్రాత్రం నెలకొల్పడం.

2. సర్వమత సామరస్యాన్ని, తత్వ విజ్ఞానాల అధ్యయనాన్ని ప్రోత్సహించడం.

3. అవ్యక్తముగా ఉన్న ప్రకృతి ధర్మాలను, మానవునిలో అంతర్గతముగా గూఢముగా ఉన్న శక్తులను పరిశోధించడం.

భారతదేశంలో దివ్యజ్ఞాన సమాజం పేరు ప్రఖ్యాతి గాంచింది. అందుకు రెండు ప్రత్యేక కారణాలు ఉన్నాయి. ఈ దివ్యజ్ఞానం 19వ శతాబ్దినాటిది కాదు. అనాది నుంచి భారతీయులలో దివ్యజ్ఞానంలో నమ్మకం ఉంది. అందుకే దాని పుట్టుక భారతదేశం అందువల్ల మత తత్వ శాస్త్ర పరమార్థాలను భారతదేశం నుంచి నేర్చుకోవాలి అని ఈ సమాజం వారు పేర్కొన్నారు. కర్మ సిద్ధాంతం, పునర్జన్మసిద్ధాంతం రెండూ హిందూ బౌద్ధమత లక్షణాలు. ఈ సిద్ధాంతాలని దివ్య సమాజంవారు చెప్పారు. మరో విషయం ఏమిటి అంటే ఈ సమాజాన్ని స్థాపించిన విదేశీయులు ఆధ్యాత్మిక జ్ఞానానికి భారతదేశం పుట్టినిల్లు అని మానవ జాతి అంతా ఆ జ్ఞానాన్ని భారతదేశం నుంచి గ్రహించి ఆచరణలో పెట్టడం మంచిది అని చెప్పారు. దీనితో భారతీయుల్లో జాతీయత బలపడింది.

దివ్యజ్ఞాన సమాజ ఉద్యమంలో భారతదేశంలో ఎక్కువ ప్రచారం చేసిన వ్యక్తి అనీబెసెంట్ ఆమె బ్రిటన్ దేశానికి చెందిన స్త్రీ, అక్కడ అనేక ఉద్యమాల్లో పాల్గొని ప్రసిద్ధి గాంచింది. ఈమె చాలా కాలం వైజ్ఞానిక శాస్త్రంలో, హేతువాదంలో పూర్తి విశ్వాసం కలిగి నాస్తికురాలై, నాస్తికత్వాన్ని ప్రచారం చేసింది. కాని ఆమె 42వ ఎట బ్లావెట్స్కీ రచించిన గుప్త విద్యను చదవడం తటస్థించింది. దాని వాద విమర్శకై పత్రికాధిపతులు ఆమెకు ఆ పుస్తకాన్ని పంపారు. ఈ గ్రంథము అమెను పూర్తిగా మార్చి వేసింది. ఆమె దివ్యజ్ఞాన ప్రభావితురాలై ఆస్తికురాలిగా మారి నాటి నుంచి తన జీవితాన్ని దివ్యజ్ఞాన ప్రచారానికి ఉపయోగించింది. అమె 1873లో భారతదేశానికి వచ్చింది. తాను పూర్వజన్మలో భారతదేశంలో పుట్టాను అని ఆ కారణం వల్ల ఆమె భారతదేశానికి రుణపడి ఉన్నాను అని అందుకే ఈ జన్మలో భారతదేశంలో తన జీవిత శేషాన్ని గడిపి ఆ రుణాన్ని తీర్చుకోదలచినాను అని చెప్పింది. ఆమె భారతదేశానికి వచ్చినపుడు ఆమె వయస్సు 42 సంవత్సరాలు, ఆమె గొప్ప మేధావేగాక ప్రపంచ విఖ్యాతి పొందిన వక్త. ఈమె నాస్తికత్వాన్ని నమ్మిన వారిని పూర్తిగా ఆస్తీకత్వానికి మార్చివేసింది. ఈమె గొప్ప మేధావి కాబట్టి స్వానుభవము చేత నాస్తికత్వంలోని లోపాలను గ్రహించి భగవంతుని ఆస్తికత్వాన్ని ప్రచారం చేసి విద్యాధికుల్లో హిందూ మతం పట్ల శ్రద్ధ, భక్తులు కలిగేటట్లు చేసింది.

మత సంస్కరణ ఉద్యమంతో పాటు సంఘ సంస్కరణ ఉద్యమంలో రాజకీయ ఉద్యమంలో అనిబెసెంట్ ప్రముఖ పాత్ర నిర్వహించి, దేశ అభ్యుదయానికి ఎంతో పాటుపడింది. ఆధ్యాత్మిక విషయాలు తెలియాలి అంటే ప్రజలు విద్యాలయాల్లో చదవాలి అని ఆ రోజుల్లో పాఠ్య ప్రణాళికలు అందుకు తగ్గట్లుగా లేవు కాబట్టి అటువంటి విద్యాలయం తానే స్థాపించి, మార్గదర్శకురాలిగా ఉండాలి అని కాశీలో ఒక కేంద్ర విశ్వ విద్యాలయాన్ని స్థాపించింది. ఇదే తరువాతి కాలంలో హిందూ విశ్వ విద్యాలయంగా ప్రసిద్ధి కెక్కింది. అడయార్, మదనపల్లి, మొదలైన ప్రాంతాల్లో కూడా ఈమె విద్యాలయాలు స్థాపించింది.

బాల్య వివాహాల నిషేధానికి స్త్రీ విద్యకు ఈమె పాటుపడింది. ఈమె స్వపరిపాలన ఉద్యమానికి నాయకత్వం వహించడమే గాక భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలిగా కూడా ఎన్నికైయింది. ఈ స్థానాన్ని ఒక స్త్రీ అందులోనూ విదేశీ వనిత ఆక్రమించడం చాలా గొప్ప విషయం అందుకే ఆమె సర్వతోముఖ ప్రజ్ఞురాలు అని చెప్పవచ్చు. 1933లో అనీబెసెంట్ మరణానంతరం జిడ్డు క్రిష్ణమూర్తి, భగవాన్ దాస్ మొదలైనవారు దివ్యజ్ఞాన సమాజ ఆశయాలను ప్రచారం చేశారు.

దివ్యజ్ఞాన సమాజం భారతదేశానికి గొప్ప సేవ చేసింది. ఈ సమాజం ద్వారా భారత సంస్కృతి ప్రపంచమంతటా వ్యాపించింది. అంతర్జాతీయ రంగంలో భారతదేశానికి గౌరవ స్థానం లభించింది. దీని వల్ల ప్రజల్లో ఆత్మ విశ్వాసం, నూతన చైతన్యం, జాతీయ అభిమానం వృద్ధి చెందింది.

## 4.2.13. రామకృష్ణ పరమహంస :

సత్యం అన్ని మతాల్లో ఉంది. ప్రాజ్ఞుడైనవాడు దానిని గ్రహించి అన్ని మతాల పట్ల సహనం కలిగి ఉండాలి అని, హిందూమతంలో లేనిసత్యాలు ఇతర మతాల్లో ఉన్నాయి అని భావించి వాటిని స్వీకరించనవసరంలేదు అని, హిందూ మతానికి వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భగవత్ గీతా, భక్తి ఉద్యమ సంస్కర్తల బోధనలు ఆధారాలు అని వాటిలో దేనిని విడవకుండా అన్నిటిని సమన్వయం చేయడం అవసరం అని రామకృష్ణ పరమహంస బోధించాడు.

రామకృష్ణ పరమహంస బెంగాల్ రాష్ట్రంలోని కామార్పు కూరు గ్రామంలో **1836**లో జన్మించాడు. తల్లిదండ్రులు ఇతనికి గధాధర ఛటోపాధ్యాయ అని పేరు పెట్టారు. **5** సంవత్సరాలు రాగానే ఇతనిని బడికి పంపారు. కాని ఇతనికి విద్యపై అభిలాష లేదు. బాల్యము నుంచి ఇతనికి శిల్పకళ పై అభిలాష ఎక్కువ. ఇతనికి వేద ప్రకారం ఉపనయనం జరుగగా ప్రథమ బిక్ష ధనిక కమ్మర వనిత దగ్గర నుంచి తీసుకొన్నాడు. ఇతనికి జాతి, మత వ్యత్యాశాలు లేదు. ఇతడు **1855**లో కలకత్తాలోని కాళికాలయానికి పూజారిగా నియమితుడైయాడు. తాను పూజించే కాళికాదేవి లోకమాత అని నమ్మి అనేక సాధనాలు చేసి అమెను ప్రత్యక్షముగా చూడగలిగాడు. అంతేగాక ఇతర మతాలలోని భగవంతుని చూడాలి అని నిష్ఠతో ఆ మతాలు అన్ని క్షుణంగా తెలుసుకొని, ఆయా మతాలకు చెందిన ప్రముఖుల సాంగత్యం చేసి, వైష్ణవ, శాక్తాయ, ఇస్లాం, క్రైస్తవ మొదలైన మతాల రహస్యాలను గ్రహించడమే గాక మహాశక్తిని, శ్రీకృష్ణుని, యేసుక్రీస్తును, సందర్శించ గలిగాడు. అన్ని మతాలు ఒక్కటే భగవత్ సాక్ష్యాత్కారమే అన్ని మతాల లక్ష్యం దేవుని చేరడానికి వివిధ మతాలు వివిధ మార్గాలు అని నమ్మాడు. ఎవ్వరూ తమ మతాన్ని విడనాడనవసరం లేదు అని చెప్పాడు. భిన్న మతాలకు నిలయమైన భారతదేశానికి ఇటువంటి సందేశం అవసరం. ఇతని బోధనల వల్ల అనేక మంది హిందువులు తమ మతాన్ని విడవక భక్తితో తమ భగవంతుని ధ్యానించడానికి నిశ్చయించుకున్నారు. రామకృష్ణుని జీవితాన్ని పరిపూర్ణం చేయడంలో ఇద్దరు గొప్ప వ్యక్తుల ప్రభావం ఏంతైనా ఉంది. వారు భైరవ బ్రాహ్మణి అనే యోగిని, తోతాపూరి అనే యతివరేన్యుడు.

రామకృష్ణుడు గొప్ప తత్వవేత్త అని భగవత్ సాక్ష్యాత్కారాన్ని పొందాడు అని ప్రఖ్యాతి గాంచాడు. అతని బోధనలను అవగాహన చేసుకొన్న కేశవ చంద్రసేన్ తన సందేహాలను ఇతర ఆధ్యాత్మిక విషయాలను తెలుసుకోడానికి రామకృష్ణుని దర్శించాడు. ఎటువంటి క్లిష్ట విషయాలు అయిన సులభంగా అర్థం అయ్యేలాగ చెప్పడం రామకృష్ణుని ప్రత్యేకత. అంతేగాక ప్రతి విషయం సోదాహరణంగా, వివరించి చెప్పినాడు. హిందూ మతోద్ధరణకై ఇంతటి కృషి చేసిన వాడు ఆధునిక యుగంలో మరొకడు లేడు.

రామకృష్ణుని ఉపదేశాల్లో ముఖ్యమైనవి సర్వమత సామరస్య సమానత్వం, ఆధ్యాత్మికత, మానవ సేవ మొదలగునవి. అన్ని మతాలు సమానం అని భగవత్ సాక్షాత్కారం అన్ని మతాల లక్ష్యం అని రామకృష్ణుడు చెప్పాడు. ఇది ఇతని విశాల భావానికి తార్కాణం ఇది దేశ ప్రజలను ఏకంచేయడానికి ఒక సాధన అయింది. మానవుడు కోరేది మనశ్శాంతి. ఈ మనశ్శాంతిని పొందడానికి ఆధ్యాత్మికం ఒక్కటే మార్గం. ప్రజలు ఆధ్యాత్మిక మర్యాదలను పాటించాల్సిన అవసరం వుంది అని మానవ జీవితానికి మతానికి గల గొప్ప విలువను రామకృష్ణుడు నొక్కి చెప్పాడు. మానవసేవయే మాధవ సేవ అనే ధర్మాన్ని రామకృష్ణుడు ప్రజలకు వివరించాడు. ప్రతి వ్యక్తిలో దైవాంశం ఉంది. మానవులంతా భగవంతుని ప్రతిబింబాలు, ప్రజలకు సేవ చేయడం ప్రతి ఒక్కరి విద్యుత్ ధర్మం. విద్యావంతులు, విద్యలేనివారికి విద్య నేర్పాలి. సంపన్నులు పేదలను, ఆదరించాలి. విగ్రహారాధన ఖండన సబబుకాదు అని ఇతడు పేర్కొన్నాడు. ప్రారంభ దశలో సాధకులకు విగ్రహారాధన ఒక మెట్టుగా అవసరం అని పరమాత్మ సాక్ష్యాత్కారం అయిన తరువాత విగ్రహారాధన కొనసాగించనవసరం లేదు అని తెలియజేశాడు. ఇతని శిష్యుల్లో క్రైస్తవులు, ముస్లింలు కూడా ఉన్నారు. ఈ విధముగా రామకృష్ణుడు సనాతన హిందూమతంలో ఆధునాతన జనాదరణ కలిగించి జాతి గౌరవాన్ని నిలబెట్టాడు.

రామకృష్ణ భారత జాతికి చేసిన సేవ గొప్పది. ఇతని బోధనల వల్ల ప్రజల్లో జాతీయభావం కలగడానికి వీలైయింది. భారతీయులు తమ మతాన్ని సంస్కృతిని విడనాడవద్దు అని చెప్పి, ప్రజల్లో నూతన చైతన్యం కలిగించాడు.

## 4.2.14 స్వామి వివేకానందుడు :

ఆధునిక యుగంలో మతోద్యమాలను సాగించిన వారందరిలో వివేకానందుడు అగ్రగణ్యుడు. ఇతడు దేశ భక్తుడు. విశ్వమానవ ప్రేమ పూరితుడు. జ్ఞాన, కర్మ, భక్తి యోగాల సంపూర్ణ సమన్వయ స్వరూపుడు. ప్రాచ్య, పాశ్చాత్య విజ్ఞాన వాహినులకు సముద్రుడు. అతని వ్యక్తిత్వం అనన్య సమానం.

వివేకానందుడు **1863** లో కలకత్తా నగరంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. ఇతని అసలు పేరు నరేంద్రనాధ దత్తు. ఇతని విద్యాభ్యాసం ఆరో ఏట ప్రారంభమైయింది. ఒక్క సంవత్సరంలోనే చదవడం, వ్రాయడం నేర్చుకొని రామాయణ, భారత ఘట్టాలు అన్ని కంఠస్తం చేశాడు. కళాశాలలో పాశ్చాత్యదేశ చరిత్రలను, పాశ్చాత్య తర్క శాస్త్రం, తత్వ శాస్త్రాలను అధ్యయనం చేశాడు. ఇతడు మహా వక్త. పట్టభద్రుడు అయిన తరువాత బ్రహ్మ సమాజంలో చేరాడు. తరువాత రామకృష్ణ వద్దకు పోయాడు. రామకృష్ణుని వద్ద మతతత్వం ఇతర యోగ సాధనాలను నేర్చుకొన్నాడు. రామకృష్ణుడు తన చివరి రోజుల్లో వివేకానందున్ని పిలిచి నీవు సామాన్య మానవుడివి కావు నారాయణుని అవతారం. వేదాంత విలువను, భారత ప్రజలకే గాక, ప్రపంచ ప్రజలందరికీ బోధించి, నీ జీవితాన్ని దానికి అర్పించమని అది నీ విధి అని చెప్పాడు. గురువాజ్ఞను పాటిస్తాను అని సన్యాసం స్వీకరించి గురువాజ్ఞను అమలు చేయడానికి పూనుకొన్నాడు. సన్యాసం స్వీరించిన తరువాత తన పేరును వివేకానందునిగా మార్చుకున్నాడు.

వివేకానందుడు రామకృష్ణుని ఉపదేశాన్ని భారతదేశములోనే గాకుండా ఇతర దేశాల్లో కూడా ప్రచారం చేశాడు. వేదాంతం గురించి ఇతడు చేసిన గంభీర ఉపన్యాసాలు పాశ్చాత్యులను ప్రభావితము చేశాయి. అతని ఉపన్యాసాల్లో కొన్ని ముఖ్యమైన విషయాలు :

1. సర్వధర్మ సమన్వయ స్వరూపమే వేదాంతం, వివిధ మతాచారాలు భగవత్ తత్వాన్ని తెలిపే వివిధ మార్గాలు
2. ఆత్మ, నిత్య శుద్ధం, జనన మరణాతీతం, అద్వితీయం, బేధాలు అన్నీ అజ్ఞానంతో గోచరిస్తున్నాయి.
3. భగవత్ దర్శనం లభించడానికి ముందు అహంకారం నశించాలి.
4. భౌతిక శాస్త్ర దృష్టితో చూసిన ఏకత్వమే అద్వతమే సిద్ధాంతం అని నిశ్చయించడం అవుతుంది.
5. వేదాలు, సర్వేశ్వరుని చేరే మార్గాలను తెలియజేస్తుంది.
6. ప్రార్థనలు, కర్మ కలాపాలు చిత్త శుద్ధికి, విగ్రహారాధన ధ్యానానికి తోడ్పడతాయి. కాబట్టి ఇవి సామాన్య విధులైనప్పటికి అవసరమయ్యాయి. మానవుడు అభివృద్ధి చెందుతూ ఉంటే వీటిని విడనాడవచ్చు.
7. ధర్మం అనేది పూర్వ పక్ష సిద్ధాంతాలతోనూ గ్రంధాలతోనూ కూడిన విషయం కాదు. సాక్ష్యాత్కారమే ధర్మతత్వం, సనాతన ధర్మతత్వం

**1893** సెప్టెంబర్ **11** న చికాగోలో ప్రపంచ మత మహాసభలో హిందూ మతం గురించి ఆయన చేసిన గంభీర ఉపన్యాసం పాశ్చాత్య విజ్ఞానులలో సంచలనాన్ని రేకెత్తించింది. ఈ మహా సభలో **10**వేలకు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఆనాడు వివేకానందుని వయస్సు **30** సంవత్సరాలు మాత్రమే. వివేకానందుడు తరచూ అమెరికా, ఇంగ్లాండ్ మొదలగు దేశాల్లో పర్యటించి ఉపన్యశించాడు. నిస్వార్థముగా దేశ సేవకు అంకితులైన యువకులకు శిక్షణ ఇవ్వడానికి బెలూరు వద్ద, రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు.

వివేకానందుడు సాంఘిక న్యాయం, సంస్కరణల ఆవశ్యకతను గురించి నచ్చ జెప్పాడు. స్వశక్తిపైనే ఆధారపడాలి అని, ప్రభోదించాడు. పేదవారికి అండగా నిలిచాడు. పేదరికాన్ని, మూఢ విశ్వాసాలను ఖండించాడు. సామూహిక విద్యను ప్రోత్సహించాడు.

## 4.2.15. రామకృష్ణ మఠం :

మానవ బాధా, నివారణకు సహాయం చేయడం కోసం సామాజ సేవ చేయడం కోసం వివేకానందుడు 1896లో రామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. పాశ్చాత్య నాగరికత నాస్తిక భావాల ప్రభావం నుండి భారతదేశాన్ని కాపాడడమే ఈ సంస్థ ముఖ్య ఆశయం. ఈ సంస్థ హిందూమతంలోని విగ్రహారాధనను, బహు దేవతారాధను ఆదర్శంగా తీసుకొన్నది. దేశంలో అనేక ప్రాంతాల్లో ఈ సంస్థ శాఖలు నెలకొల్పబడింది. ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, గ్రంధాలయాలు అనాధ శరణాలయాలు, తెరచి సమాజ సంక్షేమ సేవను కొనసాగిస్తుంది. ముక్తిని సాధించుకోడానికి సాధనం చేసుకోవడం కంటే సమాజంలో మంచిని పెంచడానికి ఈ సంస్థ ప్రాధాన్యత ఇచ్చింది. అమెరికా, ఐరోపా ఖండాల్లో చాలా నగరాల్లో రామకృష్ణ మఠం శాఖలను స్థాపించారు. కరువుల వల్ల వరదల వల్ల ప్రజలు బాధపడుతున్నపుడు రామకృష్ణ మఠం చాలా సేవ చేసింది.

## 4.2.16. బొంబాయి రాష్ట్రంలో సాంఘిక, మత సంస్కరణోద్యమాలు

బొంబాయిలో ప్రధముగా 1840 లో పరమహంస మండలి, మత సంస్కరణకు శ్రీకారం చుట్టింది. విగ్రహారాధనకు వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడటం. ఆ సంస్థ లక్ష్యాలు. పశ్చిమ భారతంలో మొట్టమొదటి సంఘ సంస్కర్త గోపాల్ హరి దేశ్‌ముఖ్. ఇతడు లోకహితవాది అని ప్రజలచే పిలువబడినాడు. ఇతడు మరాఠి భాషలోరచనలు చేశాడు. తన రచనల్లో ఇతడు హిందూ, సనాతనత్వం మీద హేతువాద పూరితమైన దాడి చేశాడు. మత, సామాజిక సమానతను ప్రబోధించాడు.

**4.2.16.1. ప్రార్థనా సమాజము :** బ్రహ్మ సమాజం వల్ల ప్రార్థనా సమాజం ఉత్తేజితమైయింది. ఆత్మారాం, పాండురంగ నాయకత్వంలో 1867 లో బొంబాయిలో ఈ సమాజం ప్రారంభమైయింది. ఈ సంస్థ కేశవ చంద్రసేన్ ప్రోత్సాహం వల్ల ఉద్భవించింది. ప్రార్థనా సమాజ సభ్యులు ఆస్తికవాదులు వారు నామదేవుడు, తుకారామ్, రామదాసు మొదలైన మతాచార్యులు అనుసరించిన గొప్ప మత సాంప్రదాయాలకు వారసులు. కేశవ చంద్రసేన్, నవీన్ చంద్రరామ్, మజుందార్ బాబు, మహేంద్రనాధ్ బోస్ మొదలైన గొప్ప బ్రహ్మ సమాజికులు బొంబాయిని దర్శించారు. వారి బొంబాయి పర్యటన ప్రార్థనా కార్యక్రమాలను ప్రోత్సహించింది. హేతుబద్ధమైన ఆరాధనను ప్రోత్సహించడం, వర్ణాధిక్యతను నిరశించడం, వితంతు పునర్ వివాహాలను ప్రవేశపెట్టుట, స్త్రీ విద్యను ప్రోత్సహించి, బాల్య వివాహాలను రద్దు చేయడం మొదలైనవి బ్రహ్మసమాజ కార్యక్రమాలు. ఇంకా ఈ సమాజం ఆనాధ శరణాలయాలు, వితంతువులకు గృహాలు, శరణాలయాలు, రాత్రిబడులు నిర్వహణ మొదలైన సాంఘిక సేవలను కూడా చేపట్టింది. ఈ సమాజం 'సుబోధ' అను పత్రికను ప్రారంభించింది. దేశ పశ్చిమ ప్రాంతంలో ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలకు ప్రార్థనా సమాజం కేంద్రం. ఇది బొంబాయి, మద్రాస్ రాష్ట్రాల్లో తన శాఖలను తెరచింది. ప్రార్థనా సమాజంలో ఆర్.జి. బండార్క్, నారాయణ గణేష్, చంద్ర వార్కర్, పండిత రామాబాయి సరస్వతి, ప్రముఖ సభ్యులు. సనాతన వర్గాల ప్రతిఘటనను లక్ష్య పెట్టక ధైర్య సాహసాలతో, సంస్కర్తలు బొంబాయి రాష్ట్రంలో సంస్కరణ ఉద్యమాన్ని నిర్వహించారు.

**4.2.16.2 మహదేవ్ గోవింద రానడే :** మహారాష్ట్రలో సాంఘిక ఉద్యమానికి మూల పురుషుడు రానడే. ఇతడు గొప్ప సంఘ సంస్కర్త, విజ్ఞాని, విద్యావేత్త, న్యాయమూర్తి. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపకుల్లో ముఖ్యుడు.

రానడే మహారాష్ట్రలోని నాసిక్ వద్ద 1842లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. కొల్హాపూర్‌లోని ఆంగ్ల పాఠశాల. బొంబాయిలోని ఎల్ఫిన్‌స్టన్ ఉన్నత పాఠశాల, బొంబాయి విశ్వ విద్యాలయం నుండి విద్యాభ్యాసాన్ని పూర్తి చేశాడు. ఉపాధ్యాయుడు పత్రికా రచయితగా, తన జీవితాన్ని ప్రారంభించి, సమర్థతతో ముందుకు వెళ్తూ పూనాలో సభార్డినేట్ న్యాయాధీసుడుగా తరువాత బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశాడు. ఇతడు 'సార్వజనిక సభ' పత్రికలో సామాజిక ఆర్థిక సమస్యల గురించి వ్యాసాలు రాశాడు. వితంతు పునర్ వివాహాన్ని సమర్థించాడు. బాలికల వివాహ వయస్సు పెంచడాన్ని సమర్థించాడు. బహు భార్యాత్వాన్ని, వరకట్నాలను ఇతడు తీవ్రంగా ఖండించాడు. స్త్రీ విద్యను సమర్ధించాడు. ముఖ్యమైన సాంఘిక సమస్యలను, గురించి చర్చించడానికి 1887లో మద్రాస్‌లో భారత జాతీయ సామాజిక సమావేశాన్ని ప్రారంభించాడు.

రానడే విద్యారంగంలో అనేక సంస్కరణలను ప్రోత్సహించాడు. దేశం ప్రగతి పథం వైపు పురోగమించడానికి, పాశ్చాత్య విద్య తోడ్పడుతుంది అని ఇతడు నమ్మాడు. ఇతని మార్గదర్శకత్వంలో ప్రార్థనా సమాజము బొంబాయిలోని నిమ్నజాతి కార్మికులకై రాత్రి

పాఠశాలను ప్రారంభించింది. క్రమముగా ఉచిత పఠనాలయాలు బాలికల విద్యకై ఒక సంఘం, పండర్‌పూర్‌లో ఒక అనాధ ఆశ్రమం బొంబాయిలో పలు ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పడం జరిగింది. ఈ సమాజం శతాబ్ద అంతం నాటికి దళిత జాతుల సంస్థను బొంబాయి ప్రెసిడెన్సీ సామాజిక సంస్కరణ సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమాల నిర్వహణలో అగార్కర్, భండార్కర్, గోఖలే, తెలంగ్, చంద్ర వార్కర్‌లు రానడేకు అండగా నిలిచారు. భారతీయ చరిత్ర సంస్కృతి రీత్యా ఎంతో ప్రాముఖ్యతతో కూడుకొన్న దక్కన్ విద్యా సమితి, ఫెర్గ్యూసన్ కళాశాలల స్థాపనలో వీరికి తిలక్ సహాయపడ్డాడు. సామాజిక సమస్యలను చర్చించేందుకు, వేదికగా ఉపయోగించుకొనే నిమిత్తం రానడే భారతీయ జాతీయ కాంగ్రెస్ స్థాపనలో పాలుపంచుకున్నాడు. అయితే దీనిలోని పెక్కు మంది సభ్యులు సామాజిక విషయాల చర్చ సంస్థను బలహీన పరస్తుంది అని భావించి వ్యతిరేకించారు. దీనితో రానడే, రఘునాధరావులు ఏకీభవించగా, సాంఘిక సంస్కరణలకు సంబంధించిన విషయాలను చర్చించడానికి, 1887లో మద్రాస్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ తృతీయ వార్షిక సమావేశంలో జాతీయసమాజిక సభ అను పేరుతో కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఒక దానిని ప్రారంభించారు. మొదట్లో ఈ సభ వార్షిక సమావేశం కాంగ్రెస్ వార్షిక సమావేశానంతరం అదే నగరంలో నిర్వహించడం జరిగింది. ఫలితంగా పెద్ద సంఖ్యలో సాంఘిక సంస్కర్తలు కాంగ్రెస్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొనేవారు. ముఖ్య సామాజిక సమస్యలపై సభ చర్చించి తీర్మానాలను ఆమోదించేది.

**4.2.16.3. జ్యోతి బాపులే :** మహిళా విమోచనానికి, అస్పృశ్యతను నివారించడానికి, హరిజనులకు ఉద్ధరించడానికి, పూలే చాలా కృషి చేశాడు. పీష్వాలు బ్రిటీష్ పాలన తొలి రోజుల్లో కూడా మహారాష్ట్రలో బ్రాహ్మణుల సామాజిక ఆధిక్యత, కర్షకుల చేతి వృత్తుల వారి పట్ల వీరు ప్రదర్శించిన న్యూనతా దృక్పధానికి వ్యతిరేకత విస్తృతమైయింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పూలే శక్తివంతమైన బ్రాహ్మణేతర ఉద్యమాన్ని నిర్వహించాడు. 1828లో తక్కువ కులంలో జన్మించిన పూలే విస్తృత గ్రంధ పఠనం, వ్యక్తిగత అనుభవం, క్రైస్తవ ప్రచారకులతో గల సఖ్యత వల్ల అప్పుడున్న హిందూమతం ఆచారాలను విమర్శించసాగాడు తన ఉద్యమ వ్యాప్తిలో భాగంగా, ఒక బాలికల పాఠశాలను, అస్పృశ్యులకు ఒక పాఠశాలను ప్రారంభించాడు. ఇంకా సార్వజనిక్ సత్య ధర్మపుస్తక్, గులామ్ గిరి, అనే విమర్శనాత్మక గ్రంధాలను వ్రాశాడు. బ్రాహ్మణ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తూ, సామాన్య ప్రజలను వీరి అధికారం నుంచి విముక్తి చేయడానికి పూలే 1873లో సత్య సోధిక్ సమాజ్ అనే పేరుగల సంస్థను స్థాపించాడు. వివిధ కులాలుగా చీలి ఉన్న హైందవ సామాజిక వ్యవస్థ ఐక్యతను సాధించేందుకు, పూలే ఈ విధముగా తొలి ప్రయత్నం చేశాడు. బ్రహ్మణేతరులు అస్పృశ్యుల మధ్య ఎటువంటి తేడాను చూపలేదు.

**4.2.16.4. పండిత రమాబాయ్ సరస్వతి :** రమాబాయ్ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఎంతో పట్టుదలతో పర్యటించి మహిళలకు వారి సమస్యల గురించి తెలియజేసింది. ఆమె ముఖ్య ఉద్దేశం సాంఘిక అసమానతల నుండి, క్రౌర్యము నుండి మహిళలకు విముక్తి కలిగించడం. హిందూ సమాజంలో మత వ్యవస్థలో ఉండే లోపాలను ఆమె తీవ్రంగా ఖండించింది. ఈమె ఒక శూద్రుని వివాహం చేసుకుంది అయితే దురదృష్టవశాత్తు వివాహం జరిగిన 2 సంవత్సరాలలో భర్తను కోల్పోయింది. స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి, బాల్య వివాహాలను వ్యతిరేకించడానికి ఈమె పూనాలో మహిళా ఆర్య సమాజ్‌ను స్థాపించింది. ఇంగ్లాండ్, అమెరికాలో పర్యటించి భారతీయ మహిళల గమనీయ స్థితి గురించి ఉపన్యాసాలు ఇచ్చింది. ఈమె ప్రసంగాల వల్ల భారత సమాజంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈమె బొంబాయిలో శారదాసదన్ అనే వితంతు వసతి గృహాన్ని, పాఠశాలను ప్రారంభించింది. కరువు బాధితులను ఆదుకోడానికి ముక్తిసదన్‌ను ప్రారంభించింది. భారతీయ మహిళల విమోచనకు రమాబాయ్ గొప్ప కృషి చేసింది.

**4.2.16.5. కార్వే :** కార్వే గొప్ప విద్యావేత్త, పూనాలోని ఫెర్గ్యూసన్ కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేశాడు. ఇతడు వితంతు వివాహం చేసుకోవడమే గాక, వితంతు వివాహ సమాజాన్ని స్థాపించాడు. తరువాత ఒక హిందూ వితంతు భవనాన్ని ప్రారంభించాడు. పునర్ వివాహం చేసుకొన్న స్త్రీలకు కలిగే సంతానం కోసం ఒక వసతి గృహాన్ని ప్రారంభించాడు. 1916లో భారతీయ మహిళా విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించి 1932 లో ఆ విశ్వ విద్యాలయానికి ఉపాధ్యక్షుడు అయ్యాడు. విరాళాలను వసూలు చేసి, 50 గ్రామాల్లో ప్రాథమిక విద్యను భోదించడానికి స్వచ్ఛందంగా, పాఠశాలలు ప్రారంభించాడు. సాంఘిక సంస్కరణ ఉద్యమానికి కార్వే చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం భారతరత్న బిరుదు ఇచ్చి సత్కరించింది.

## 4.2.17. మద్రాస్ ప్రెసిడెన్సీలో సాంఘిక, మత సంస్కరణోద్యమాలు :

మాద్రాస్ ప్రెసిడెన్సీలో చాలా మంది సంస్కరణ వాదులు పాశ్చాత్య విద్య వల్ల ప్రభావితులైయారు. రాజగోపాలాచారి, సుబ్బరాయలు సెట్టి నాయకత్వంలో వేద సమాజం స్థాపితమైయింది. ఈ సమాజం మత రంగంలో సంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించింది. కలకత్తాలో శిక్షణ పొందిన బ్రహ్మ సమాజీకుడైన శ్రీధరులు నాయుడు వేద సమాజాన్ని పునరుత్తేజితం చేయడానికి ప్రయత్నించాడు. 1869లో ఇతడు వేద సమాజ్‌కు కార్యదర్శి అయ్యి పాత ఒప్పందాల స్థానే కొత్త ఒప్పందాలను రూపొందించాడు. ఇందులో సాంఘిక సంస్కరణలకు ప్రాధాన్యత లేదు. 1871 లో దక్షిణ భారత సమాజ్‌ను స్థాపించాడు. దేవేంద్రనాథ్ ఠాగూర్ రచించిన బ్రహ్మధర్మ అను గ్రంధాన్ని తమిళ, తెలుగు బాషల్లోకి అనువదించాడు. తత్వ బోధిని అనే బ్రహ్మ సమాజ్ మాస పత్రికను పునరుద్ధరించి సమర్థవంతంగా నిర్వహించాడు. బెంగుళూరు, మంగలూర్, తంజావూర్ మొదలైన నగరాల్లో పర్యటించి బ్రహ్మ సమాజ సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు.

పండిత శివనాథ శాస్త్రి, హేమచందర్ సర్కార్, సతీష్ చంద్ర చక్రవర్తి, బెంగాళి బ్రహ్మ ప్రచారకులు కేవశ చంద్రసేన్ స్థాపించిన నవ విధాన బ్రహ్మ సమాజ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి మద్రాస్‌లో స్థిరపడిన మన్నవ బుచ్చయ పంతులు చాలా మంది ఉత్సాహవంతులైన ప్రజలను బ్రహ్మ సమాజ్‌లో చేర్చారు. బుచ్చయ్య నిశ్చల విశ్వాసం నిరాడంబర జీవితం నిష్ కపట స్వభావం ప్రజల్లో ఆయన పట్ల గౌరవాన్ని పెంపొందించాయి. బ్రహ్మసమాజ్ సిద్ధాంతాల గురించి, శివనాధ శాస్త్రి చేసిన అద్భుత ప్రసంగాల వల్ల ప్రభావతుడైన బుచ్చయ్య పంతులుకు మద్రాస్ క్రైస్తవ కళాశాల విద్యార్థి అయిన వెంకటరత్నం నాయుడు శాస్త్రి సందేశాన్ని ప్రచారం చేయడంలో చాలా సహాయం చేశాడు. వెంకట రత్నం సాంఘిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. రాజమండ్రి, బాపట్ల, మచిలీపట్నం, ఆంధ్ర ప్రాంత బ్రహ్మసమాజ్ ముఖ్య కేంద్రాలుగా శాస్త్రి వర్ణించాడు.

19వ శతాబ్దం ప్రారంభంలోనే ఏనుగుల వీరాస్వామి సంఘ సంస్కరణ ఆవశ్యకతను తెలియజేశాడు. మద్రాస్ వాడైన వీరాస్వామి అంటరానితనం, కుల వ్యవస్థ, సతీసహగమనం, బాల్య వివాహాలు మొదలైన సాంఘిక దురాచారాలను విమర్శించాడు. మద్రాస్ రాష్ట్రంలో ఇతడు ఆంగ్ల విద్యా వ్యాప్తికి కృషి చేశాడు.

**4.2.17.1 కందుకూరి వీరేశలింగం :** ఆంధ్ర ప్రాంతంలో సంస్కరణ ఉద్యమ నాయకుడైన వీరేశలింగం రాజమండ్రిలో జన్మించాడు. తెలుగు, ఇంగ్లీష్ భాషలను అభ్యసించి అధ్యాపకుడైయాడు. అనేక పాఠశాలలలో ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేసి, రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో ఉపన్యాసకుడిగా చేరాడు. ఇతడు తెలుగు సాహిత్య వికాసానికి గొప్పగా కృషి చేశాడు. పుస్తకాలు అందరికి అర్థంకావాలి అని అందువల్ల వాటిని సులభశైలిలో వ్రాయాలి అని ఇతడు విశ్వసించాడు. తెలుగు గద్య రచనలో కొత్త శైలిని సృష్టించాడు. తెలుగు గద్యానికి చేసిన కృషికి ఇతనికి 'గద్య తిక్కన' అను బిరుదు నిచ్చారు. సంస్కరణలకు సంబంధించిన తన భావాలను ఆశయాలను ప్రజలు సులభంగా అర్థం చేసుకోడానికి అతడు సులభశైలిని ఉపయోగించాడు. ప్రాంతీయ భాష ద్వారా ప్రజలకు విద్యా బోధన చేయాలి అని కోరాడు. ఇతడు బహు గ్రంధ కర్త, మూఢ విశ్వాసాలను వర్ణ వ్యవస్థను తీవ్రంగా ఖండించాడు. 1874లో వివేకవర్ధని అను పత్రికను ప్రారంభించాడు. సాంఘిక దురాచారాలను అంతమొందించడానికి, వీరేశలింగం తన జీవితాన్ని ధార పోశాడు. స్త్రీ విద్యను గట్టిగా సమర్థించాడు. స్త్రీ విద్యపైనే దేశ ప్రగతి ఆధారపడుతుంది అని విశ్వసించాడు. బాల్య వివాహాలను ఖండించి వితంతు పునర్ వివాహాలను సమర్థించి, వితంతువుల పునరుద్ధరణకు ఉద్యమాన్ని నిర్వహించాడు. భోగం మేళాలను నిషేధించడానికి కృషి చేశాడు. అవినీతిపై ధ్వజమెత్తాడు. అనాధ స్త్రీలకు సహాయం చేయడానికి వితంతు గృహాలను, అనాధ శరణాలయాలను, పాఠశాలలను స్థాపించాడు. రాజమండ్రిలో హితకారిణి ధర్మకర్తృత్వ సంస్థను స్థాపించాడు. వీరేశలింగం స్థాపించిన అనేక సంస్థలను, ఈ హిత కారిణి సమాజం నిర్వహించింది. మన్నవ బుచ్చయ్య పంతులు వల్ల ప్రభావితుడై వీరేశలింగం బ్రహ్మ సమాజంలో చేరాడు. ఇతడు 1878లో ప్రార్థనా సమాజాన్ని స్థాపించాడు. బ్రహ్మసమాజ్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు.

**4.2.17.2 రఘుపతి వెంకటరత్నం నాయుడు :** ఆంధ్ర ప్రాంతంలో 'శుద్ధి' ఉద్యమాన్ని నిర్వహించిన వేంకటరత్నం గొప్ప పండితుడు, విద్యావేత్త. తన ఉపన్యాసాల ద్వారా ప్రజలను ఉత్తేజ పరచిన గొప్ప వ్యక్తి. బాల్యంలోనే దేవేంద్రనాధ్ బెనర్జీ, గంగాధర ముఖర్జీ వంటి అధ్యాపకులచే ప్రభావితుడై బ్రహ్మ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడైయాడు. రామ్మోహన్ రాయ్, బెంటింగ్ ప్రవేశ పెట్టిన సంస్కరణలు

రఘుపతి మనస్సుపై చెరగని ముద్రవేశాయి. సాంఘిక సంస్కరణల పట్ల ఎంతో అభిమానాన్ని ప్రకటించాడు. బ్రహ్మ ప్రకాశిక, ఫెలోవర్కర్, పీపుల్స్ ఫ్రెండ్, మొదలగు పత్రికలను ఆంగ్ల భాషలో నిర్వహించాడు. భోగం మేళాలను వ్యతిరేకిస్తూ, ఉద్యమాన్ని ప్రారంభించాడు. కాకినాడలోని పిఠాపురం రాజా కళాశాలకు అధ్యక్షుడైనప్పటి నుండి కాకినాడ బ్రహ్మ ధర్మ కేంద్రమైయింది. వెంకటరత్నం తన సర్వశక్తులను, సంపదను బ్రహ్మ ధర్మ ప్రచారానికి అర్పించాడు. వేంకటరత్నం వల్ల ప్రభావితుడై పిఠాపురం రాజా స్త్రీలకు సత్రాలు, ఆసుపత్రులు కట్టించడానికి, పాఠశాలలకు, కళాశాలలకు ఉదారముగా విరాళాలు ఇచ్చాడు. పీఠాపురంలో నిమ్న జాతులకు చెందిన బాల, బాలికలకు అన్ని సదుపాయాలతో రెండు వసతి గృహాలను, నిర్మించాడు. మద్రాస్ విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షునిగా ఎన్నికై ఆ పదవీ భాద్యతలను చాలా నేర్పుతో నిర్వహించాడు.

**4.2.17.3. దేశిరాజు పెదబాపయ్య :** బాపట్లలో త్యాగజీవి అయిన పెదబాపయ్య తన ఆదర్శ ప్రాయ జీవితం వల్ల పెక్కు మందిని బ్రహ్మ ధర్మానుష్ఠాన పరులను చేశాడు. వెంకటరత్నం వద్ద మచిలీపట్నంలో ఇతడు విద్యను అభ్యసించాడు. మద్రాస్ బ్రహ్మసమాజ నాయకులైన బుచ్చయ్య, వెంకటరత్నములతో కలసి, బ్రహ్మ ధర్మ ప్రచారాన్ని కొనసాగించాడు. ఇతడు బ్రహ్మ సూత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. 1905లో ఇతడు అనుష్ఠానీయకుడైయాడు. ఇతనినే వీరేశలింగం అనుసరించాడు.

**4.2.17.4. నారాయణ గురు :** సమానత్వం న్యాయం ప్రాతిపదికలపై ఆధారపడిన నవ సమాజ నిర్మాణానికి, నారాయణ కృషి చేశాడు. కేరళలో మత సంస్కరణ ఉద్యమానికి సాంఘిక దృక్పధాన్ని రూపొందించాడు. తిరువనంతపురం వద్ద ఎఝువ కుటుంభంలో జన్మించిన ఇతడు సంస్కృత, తమిళ, మళయాల భాషల్లో పండితుడు. చాలా భక్తి గీతాలను వ్రాశాడు. వెనుకబడిన తరగతుల నైతిక, సాంఘిక అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడు. వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. మతం పేరుతో జరిగే జంతు బలాలను నిషేధింపగలిగాడు. సాంఘిక, ఆర్థిక, విద్య, సాంస్కృతిక రంగాల్లో ఎఝువ మరియు వెనుకబడిన తరగతుల ప్రగతికి 1903 లో శ్రీమన్నారాయణ ధర్మ పరిపాలనా యోగం అను సంస్థను స్థాపించాడు. వర్ణ వ్యవస్థ అడ్డుగోడలను తొలగించడానికి, వర్ణరహిత, వర్గరహిత సమాజాన్ని రూపొందించడానికి వర్ణాంతర వివాహాలను, సమర్థించాడు. బడుగు వర్గాల వారి కోసం అనేక విద్యా సంస్థలు నెలకొల్పాడు. మనుష్యులందరికి, ఒకే కులం ఒకే మతం, ఒకే దేవుడు, నీ కులం చెప్పొద్దు, ఒకరి కులం అడుగవద్దు, కులం గురించి ఆలోచించవద్దు అని నారాయణ పేర్కొన్నాడు. దీనిని బట్టి అతడు కులతత్వం మీద సాగించిన పోరాటం అర్థమౌతుంది. నారాయణ గురు నిర్వహించిన ఉద్యమాల వల్ల కేరళలో బడుగు వర్గాల్లో నూతన ఆత్మ విశ్వాసం చైతన్యం ఏర్పడ్డాయి.

**4.2.17.5. ఆత్మ గౌరవ ఉద్యమం - రామస్వామి నాయకర్ :** తమిళనాడు ప్రాంతంలో ఆత్మ గౌరవ ఉద్యమానికి నాయకత్వం వహించి అనగారిన కులాల, అభ్యుదయానికి పాటుపడిన వాడు రామస్వామి. ఇతడు సమాజంలో బ్రాహ్మణ ఆధిక్యతను తీవ్రముగా ఖండించాడు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా, తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి అని బ్రాహ్మణేతర వర్గాలకు ఉద్బోధించాడు.

రామస్వామి 1879లో ఈరోడ్ నగరంలో జన్మించాడు. ఇతడు అస్పృశ్యత సాంఘిక అసమానతలను తీవ్రంగా వ్యతిరేకించాడు. మత గ్రంధాలను నిశితంగా పరిశీలించడం వల్ల, పండితులతో చర్చించడం వల్ల, హేతువాద దృక్పధాన్ని అలవరచుకున్నారు. నాస్తికుడైయ్యాడు. ఈరోడ్ పురపాలక సంఘానికి అధ్యక్షుడైయ్యాడు. భారత జాతీయ కాంగ్రెస్ కమిటీకీ అధ్యక్షుడైయ్యాడు. తిరువాన్కూర్ రాజ్యంలో అస్పృశ్యులపై విధించిన నిర్భందాలకు వ్యతిరేకంగా ఆందోళనలు విజయవంతంగా నిర్వహించి, ప్రజానాయకుడైయ్యాడు. రామస్వామి నాయకర్ చెరసాలలో ఉండగా, ఆయన భార్య నాగమ్మళ్ స్త్రీ విమోచనోద్యమాన్ని విజయవంతంగా నిర్వహించింది. కాంగ్రెస్ సంస్థలో బ్రాహ్మణులదే పై చేయి అని రామస్వామి తీవ్రంగా భావించాడు. బ్రాహ్మణేతరులకు ఉద్యోగాలను, శాసన సభా స్థానాల్లోనూ, ప్రత్యేకంగా కేటాయింపు జరగాలి అని కోరాడు. బ్రాహ్మణేతరుల పట్ల కాంగ్రెస్‌ను బ్రాహ్మణుల కంచుకోటగా వర్ణించి, కాంగ్రెస్ నుంచి నిష్క్రమించాడు. రామస్వామి ఆత్మ గౌరవ ఉద్యమాన్ని ప్రారంభించినప్పటికి జస్టిస్ పార్టి, ఇంకా వెలుగులోనే ఉంది. ఈ పార్టి కూడా బ్రాహ్మణ అధిక్యతను వ్యతిరేకించింది. 1936 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయి పతనావస్థలో ఉన్న జస్టిస్ పార్టీని పునరుత్తేజితం చేశాడు. 1936లో మధురలో బ్రాహ్మణేతర వర్గాల సమావేశం జరిగింది. ఈ సమావేశం బ్రాహ్మణ అధిపత్యాన్ని వ్యతిరేకించాలి అని స్పష్టీకరించింది. రామస్వామి ఆత్మ గౌరవ ఉద్యమం జస్టిస్ పార్టీ పరస్పరం సహకరించుకొన్నాయి. రామస్వామి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమానికి జస్టిస్ పార్టీకీ గొప్ప నాయకుడు.

### 4.2.18. నమూనా ప్రశ్నలు :

1. రాజారామ్‌మోహన్‌రాయ్ స్థాపించిన బ్రహ్మ సమాజం గూర్చి వ్రాయుము
2. దయానంద సరస్వతి స్థాపించిన ఆర్య సమాజాన్ని గూర్చి తెలుపుము ?
3. దివ్య జ్ఞాన సమాజాన్ని వివరించండి.
4. రామకృష్ణ పరమహంస
5. స్వామి వివేకానందుడు
6. బొంబాయిలో సాంఘిక మత సంస్కరణోద్యమాల గూర్చి వ్రాయుము

### 4.2.19. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


**ఆచార్య వై. కుమార స్వామి.**

ఖండిక - 4

### పాఠం - 4.3

# అస్పృశ్యత నివారణ, హరిజనోద్ధరణ ఉద్యమాలు

## 4.3.0. లక్ష్యం :

అస్పృశ్యత నివారణ, హరిజనోద్ధరణకు జరిగిన ప్రయత్నాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం

## విషయ సూచిక :


**4.3.1** పరిచయం

**4.3.2** అంటరానితన వ్యతిరేక పోరాటం

- **4.3.2.1** అంబేద్కర్ కృషి
- **4.3.2.2** సంస్కరణోద్యమాల కృషి
- **4.3.2.3** జాతీయోద్యమ నాయకుల కృషి - గాంధీ
- **4.3.2.4** కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి
- **4.3.2.5** భారత రాజ్యాంగంలో
- **4.3.2.6** హరిజనుల కృషి
- **4.3.2.7** బ్రిటీష్ విధానం
- **4.3.2.8** నూతన ఆర్థిక శక్తుల ప్రభావం
- **4.3.2.9** పాశ్చాత్య విద్యా ప్రభావం
- **4.3.2.10** జాతీయోద్యమ ప్రభావం

**4.3.3** సారాంశం

**4.3.4.** నమూనా ప్రశ్నలు

**4.3.5.** చదువదగిన గ్రంథాలు


## 4.3.1 పరిచయము :

హిందూ జనాభాలో అస్పృశ్యులు లేక పీడిత వర్గాల వారు ఐదవ వంతు ఉన్నారు. శతాబ్దాల తరబడి వీరిని ఛాందస్సులు అనేక రకాలైన యావగింపు కలిగించే ధమన నీతితో కూడిన అశక్తతలకు, ఆభ్యంతరాలకు లోను చేశారు. వీరి పిల్లలు, పాఠశాలకు వెళ్లరాదు. ఆసుపత్రులు న్యాయస్థానాలు, ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, బావులు వారికి నిషేధాలు అయినాయి. ఈ శతాబ్దంలో వారిని పైకి తీసుకొని రావడానికి అనేక సంఘాలు నడుముకట్టి పనిచేశాయి. ఆ సంఘాల్లో అఖిల భారత దళిత జాతుల సమాఖ్యను హరిజన నాయకుడైన అంబేద్కర్ నడిపాడు. అతని జీవితం అంతా, కుల నిరంకుశత్వంతో పోరాటం చేయడానికి ఉపయోగించాడు. హిందువుల

నుండి సాంఘిక న్యాయం పొందడంలో నిరాశ చెందిన అంబేద్కర్ **1945**లో అంటరాని వారికి కాంగ్రెస్, గాంధీ చేసింది ఏమిటి అనే గ్రంధాన్ని వ్రాసాడు. తరువాత అధిక సంఖ్యలో అంటరాని వారిని బౌద్ధ మతంలోకి మార్చడానికి, ఒక ఉద్యమాన్ని లేవ తీశాడు. గాంధీ ఆధ్వర్యంలో హరిజన సేవా సంఘం దళిత వర్గాల విద్య, ఆర్థిక సామాజిక ఉన్నతి కోసం కృషి చేసింది. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. గాంధీ అంటరానితన నిర్మూలనాన్ని స్వరాజ్య సాధనకు అనివార్యంగా భావించడం వల్లనే చేపట్టాడు. అంతేగాని ఔదార్యంతో సంఘ సంస్కరణ పరమావధిగా చేపట్టలేదు. దళిత వర్గ ఉన్నతికి దోహదం చేసిన ప్రధాన అంశాలు ప్రపంచ యుద్ధ కారణంగా ఏర్పడిన వాతావరణం, భారత జాతీయ స్వాతంత్ర్య సంగ్రామం భారత దేశమంతటా స్వైర విహారం చేస్తున్న ఆర్థికపరమైన మార్పులు జాతీయ, స్వాతంత్ర్య సంగ్రామం అన్ని వర్గాల వారిని శారీరకముగా దగ్గరకు చేర్చింది.

## 4.3.2. అంటరానితన వ్యతిరేక పోరాటం

ఆంగ్ల పాలనకు ముందుగల కాలంలోని హిందూ సామాజిక వ్యవస్థ అప్రజాస్వామిక లక్షణాలతో కూడి ఉంది. హిందువులలో కొందరిని, అంటరానివారిగా, వెలివేయడం జరిగింది. దేవాలయాల ప్రవేశం బావులలో జలాల వాడకం వీరికి నిషేదం అయ్యాయి. వీరిని తాకితేనే అపవిత్రమౌతాము అనే భావన ఉన్నత కులాల వారిలో ఏర్పడింది. చరిత్రను పరిశీలిస్తే, అంటరానితనం అనేది ఇండియా ఆర్య ఆక్రమణ సామాజిక ఫలితంగా ఏర్పడింది. సామాజిక పరిణామ ప్రక్రియగా జయించబడిన స్థానిక జనాభాలోని కొంత భాగం ఆర్య సమాజంలో కలుపుకోవడం జరిగింది. ఇలా కలుపుకొన్న వారిలో బాగా వెనుకబడి, అస్యహించుకోబడె విభాగాలు పారంపరిక అంటరాని కులముగా ఏర్పడినట్లు తెలుస్తుంది.

గౌతవ బుద్ధుడు, రామానుజుడు, రామానందుడు, చైతన్యుడు, కబీర్, నానక్, తుకారమ్, మొదలైన మానవతా వాదులు, మత సంస్కర్తలు అంటరానితనాన్ని నిర్మూలించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సంప్రదాయ మత ముద్ర వేసుకొని అనాగరిక ఉత్సాహంతో ఇది శతాబ్దాల తరబడి, హిందూ సమాజంలో కొనసాగుతూ వచ్చింది. హిందూ సమాజంలో వారసత్వముగా అస్పృశ్యత పాకీ పని చర్మకార వృత్తి మొదలగు అధమ వృత్తులను చేపట్టవలసి వచ్చింది. సామాజికంగా చట్ట పరంగా వీరికి ఇతర వృత్తులు నిషేధించడమైయింది. విద్య నేర్చుకొనేందుకు వీరు అనర్హులు, గ్రామం లేదా పట్నంలో వీరు ప్రత్యేకించిన ప్రాంతంలోనే ఉండాలి. వీరి పై శిక్షలు ఇతర హిందువులతో పోల్చితే చాలా కఠినంగా ఉండేవి. ఒక మాటలో చెప్పాలి అంటే వీరిపై దాడి యదేచ్ఛగా సాగింది.

అందువల్ల అస్పృశ్యత అనబడే అమానుష హత్యాచార నిర్మూలన, భారతదేశంలో తలెత్తిన అన్ని సామాజిక సంస్కరణ ఉద్యమాల, ప్రధాన లక్షణాల్లో ఒక్కటైయింది. అయితే హిందూ సమాజంలోని సంప్రదాయవాదులు అస్పృశ్యత నిర్మూలన గట్టిగా వ్యతిరేకించారు. హిందూ జనాభాలో సామాజికముగా, అడుగున ఉన్న ఈ వర్గాల వారు ఐదో వంతు ఉన్నారు. కాబట్టి వీరి ఉద్ధరణ జాతీయ స్వేచ్ఛ సామాజిక పునర్ నిర్మాణ పథకంలో వీరి విముక్తి, కీలక ప్రాధాన్యతను కలిగి ఉంది. అయితే విశేషం ఏమంటే, అస్పృశ్యులలోనే, సామాజిక అంచలు ఉన్నాయి. ఇది సమస్యను జటిలనం చేసింది. అంతేగాక, అంటరానితన ప్రమాణం ఒక ప్రాంతానికి, మరొక ప్రాంతానికి మధ్య వ్యత్యాసం ఉంది.

భారతీయులలోని విద్యావంతుల్లో అప్రజాస్వామికమైన అంటరానితనం పట్ల గొప్ప ఆగ్రహం వ్యక్తమైయింది. అస్పృశ్యులకు సమాన, సామాజిక, మత సాంస్కృతిక హక్కులను కలుగజేయడానికి, బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం, సామాజిక సంస్కరణ సభ, భారత జాతీయ కాంగ్రెస్, అఖిల భారత హరిజన సంఘం కృషి చేశాయి.

**4.3.2.1 అంబేద్కర్ కృషి :** అస్పృశ్యుల బాధలు, ఇబ్బందులను తెలియజేయడమే గాక, వీరి ప్రాథమిక మానవ హక్కులకై అంబేద్కర్ పోరాటం సాగించాడు. మహారాష్ట్రలోని 'మహర్ల'నబడే అంటరాని కులంలో **1892**లో జన్మించినాడు. అంబేద్కర్ అస్పృశ్యుల బాధలను అనుభవించి సమస్యలను తెలుసుకొని భారతదేశం మొత్తంలో అస్పృశ్యుల ఉద్ధరణకై తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప సంస్కర్త అంబేద్కర్. ఇతడు తన అభిప్రాయాలను కార్యక్రమాలను బహిష్కృత్ భారత్ అనే తన వార్తా పత్రికలో వివరిస్తూ లక్ష్య సాధనలో భాగంగా అనేక సత్యాగ్రహాలు నిర్వహించాడు. వీటిలో పేర్కొనదగినవి చాల్దర్, చెరువు సత్యాగ్రహం, దేవాలయాల ప్రవేశ నిమిత్తం అమరావతి సత్యాగ్రహం, పూనాలో పార్వతి దేవాలయ ప్రవేశ సత్యాగ్రహం, నాసిక్ దేవాలయ ప్రవేశ పంచవర్ష సత్యాగ్రహం మొదలగునవి.

అస్పృశ్యత నివారణకు ఇతడు అనుసరించిన పద్ధతులు అవసరం, సమయా సమయాలను బట్టి రాజీ, సంఘర్షణ, బల ప్రయోగం. అస్పృశ్యుల ఉద్ధరణకై కాంగ్రెస్, గాంధీ చేసిన కృషి పట్ల ఇతడు అసంతృప్తి చెందాడు. అస్పృశ్యులకు కాంగ్రెస్, గాంధీ చేసింది ఏమిటి అనే గ్రంథాన్ని వ్రాసి అస్పృశ్యులను రెచ్చగొట్టాడు. దళితులకు ఆత్మ గౌరవాన్ని సామాజిక, సాంస్కృతిక గుర్తింపును హిందువులకు కనువిప్పు కలుగజేయడానికి ఇతడు బౌద్ధ మతంలోకి మారే కార్యక్రమాన్ని చేపట్టినాడు. ఇతడు మొట్ట మొదటగా, బహిష్కృత్ హితకారిణి సభ అను పోరాట సంస్థను ఏర్పాటు చేసి, విద్యావంతులు కావడం, సమీకృతం కావడం, పోరాటం చేయడం అనే మూడు చర్యలను దళితులకు సూచించాడు. ఇతడు స్వతంత్ర లేబర్ పార్టీని ఏర్పాటుచేసి, తరువాత దానిని అఖిలభారత జాతుల ఫెడరేషన్‌గా మార్చాడు. భారత స్వాతంత్ర్యం తరువాత కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా రాజ్యాంగ నిర్మాణ సంఘ అధ్యక్షుడుగా, పనిచేసిన అంబేద్కర్ రాజ్యాంగ రీత్యా దళితులకు శాసన సభలు, విద్యా సంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు కల్పించి, వీరికి సామాజికంగా ఆర్థికంగా స్థానాన్ని, గుర్తింపును లభింపజేశాడు. అఖిల భారత దళిత వర్గాల సంఘం, అఖిల దళిత జాతుల ఫెడరేషన్ అను రెండు ముఖ్యమైన సంస్థలను స్థాపించడమైయింది. ఇందులో రెండవ దాన్ని అంబేద్కర్ ప్రారంభించాడు.

ఈ సంస్థలన్నీ భిన్న పద్ధతుల్లో కొంత వరకు దళితులపై ఉన్న ఆంక్షలను తొలగించడానికి ప్రయత్నించాయి. ఈ ఆంక్షల్లో ముఖ్యమైనవి దేవాలయాలు పాఠశాల ప్రవేశంపై నిషేధం, బావుల వాడకంపై నిషేధం, నివాస ప్రదేశాల ఏర్పాటు వీటికి తోడు, అంబేద్కర్ దళితులను ఒక రాజకీయ సైన్యముగా మార్చి, రాజకీయ హక్కుల కొరకు గట్టిగా ఉద్యమించాడు. ఫలితంగా **1935** చట్టంలో ఈ వర్గం వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించడమైయింది. ఈ సౌకర్యం జాతీయ ఐక్యతకు భంగకరమైనా దళితుల రాజకీయ చైతన్యానికి ప్రతిబింబంగా నిలిచింది. లండన్‌లో **1931**లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధిగా హాజరైన గాంధి హరిజనులు, సిక్కులు, క్రైస్తవులు, ఆంగ్లో ఇండియన్లు, ప్రత్యేక నియోజక వర్గాలను కోరడం దానికి బ్రిటిష్ ప్రభుత్వం సుముఖత కనబరచడంతో నిరాశ చెంది ఇండియాకు తిరిగి వచ్చాడు. బ్రిటిష్ ప్రధాని రాల్ఫ్ మాక్ డొనాల్డ్ హరిజనులకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేస్తూ కమ్యూనల్ అవార్డ్ ప్రకటించాడు. గాంధీ ఇందుకు నిరసనగా ఉపవాసం ప్రారంభించాడు. హిందూ సమాజంలో హరిజనులు భాగం అని అట్టివారిని హిందూ సమాజం నుండి వేరు చేయడం అన్యాయం అని ఇతడు భావించాడు. హిందూ సమాజంలో ఐక్యత నెలకొన్నట్లయితే ఈ నిర్ణయంలో మార్పులు చేయడానికి, బ్రిటిష్ ప్రధాని అంగీకరించాడు. ఫలితంగా హరిజన చతుర్వర్ణ హిందూనాయకుల మధ్య ఒప్పందం కుదిరింది. దీనికి ప్రభుత్వం కూడా అంగీకరించింది. దీనికే పూనా ఒప్పందం అని పేరు. ఫలితంగా గాంధీ తన ఉపవాసాన్ని విరమించాడు. ఈ ఒప్పందం ప్రకారం హరిజనులకు ప్రత్యేక నియోజక వర్గాలకు బదులుగా సంయుక్త నియోజక వర్గాల్లో రిజర్వుడ్‌స్థానాల సంఖ్య పెంచడమైయింది. రాష్ట్ర శాసన సభల్లో వీటి సంఖ్య **71** నుండి **148**కి పెరిగింది. కేంద్ర శాసన సభలో దాదాపు **20%** స్థానాలు వీరికి కేటాయించారు. స్థానిక సంస్థలు ప్రజా సర్వీసుల్లో దళితులకు ప్రాతినిధ్యం కల్పించడమైయింది. దళితులు ఒక్కొక్క స్థానానికి మొదట నలుగురు వ్యక్తుల పెనల్‌ను ఎన్నుకొంటే వీరిలో ఒకరిని సంయుక్త నియోజక ఓటర్లు ఎన్నుకొంటారు. ఈ విధముగా హరిజనులకు రాజకీయ, ఉద్యోగ ప్రాతినిధ్యం హిందూ సంఘ ఐక్యత సాధించడమైయింది.

**4.3.2.2 సంస్కరణోద్యమాల కృషి :** ఆర్య సమాజం, బ్రహ్మ సమాజం మొదలగు హిందూ మత సంస్కరణోద్యమాలు హేతువాద ప్రాతిపదికపై హిందూ సమాజ పటిష్ఠతను తమ లక్ష్యంగా చేసుకొన్నాయి. ఈ ఉద్యమ నాయకులు ప్రజాస్వామ్యం వైపు ముందుకు వెళ్లడానికి ప్రయత్నించారు. అనగారిన హిందువులను పట్టి పీడిస్తున్న తీవ్ర అన్యాయాలకు, ఈ నాయకులు తమ వ్యతిరేకతను తెల్పి వీటి రద్దును ప్రబోధించారు. అంటరానితనం మొదలగు సామాజిక అన్యాయాలను, వ్యక్తి స్వేచ్ఛ మానవ హక్కుల సమానత్వం పేరుతో సంస్కరణోద్యమాలు ఖండించాయి.

**4.3.2.3. జాతీయోద్యమ నాయకుల కృషి - గాంధీ :** గోఖలే, గాంధీ మొదలగు జాతీయ ఉద్యమ స్వేచ్ఛా వాదులు వామపక్ష రాజకీయవాదులు, రాజకీయ రంగంలో వలె సామాజిక రంగంలో కూడా ప్రజాస్వామికంగా వ్యక్తులు, కులాలు, జాతుల మధ్య సమాన స్వేచ్ఛా హక్కులు నెలకొనాలి అని ఉద్బోధించారు. నిరాడంబర జీవితం, శారీరక శ్రమ, పవిత్రత పట్ల, గాంధీ ఆకర్షింపబడ్డాడు. పెట్టుబడిదారీ వ్యవస్థపై విమర్శనాత్మకంగా రాయబడ్డ 'జాన్ రస్కిన్' గ్రంథాన్ని చదివిన తరువాత గాంధీ దక్షిణాఫ్రికాలో ఫొనిక్స్ వద్ద ఒక క్షేత్రాన్ని ఏర్పాటు చేశాడు. ఇచ్చట గాంధీ అతని స్నేహితులు శ్రమ పడి జీవనం సాగించారు. **6** సంవత్సరాల తరువాత గాంధీ పర్యవేక్షణలో జోహాన్స్ బర్గ్ సమీపంలో మరొక క్షేత్రం ఏర్పాటు చేయడమైయింది. ప్రముఖ రష్యన్ రచయిత టాల్‌స్టాయ్ పేరుతో ఈ క్షేత్రాన్ని పిలుస్తారు. ఇండియాలో

అహ్మదాబాద్ సమీపంలో సబర్మతి వద్ద సేవా గ్రామం వద్ద గాంధీ నెలకొల్పి నిర్వహించిన ఆశ్రమాలకు పై రెండూ క్షేత్రాలు మార్గదర్శకాలుగా నిలిచాయి.

హిందూ రాజ్యాన్ని కోరే సవార్కర్ లాంటి వారు కూడా దళిత జాతుల హోదాను పెంచాలి అని కోరారు. అందుకు కారణం సామాజిక సమానతను ఎక్కువగా ఇవ్వగలిగే ఇస్లాం క్రైస్తవ మతాలలోనికి అస్పృశ్యులు మారటం అనేది హిందూ సమాజ సంఖ్యా భావాన్ని తగ్గిస్తూ వీరిని ఆందోళన పరచడమే.

దళిత వర్గాల స్థితిని పెంచేందుకు వారి దుర్భర ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకు వారిలో విద్యావ్యాప్తిని పెంచేందుకు బావులు, పాఠశాలలు, రహదార్లు వాడేందుకు, దేవాలయాల్లో ప్రవేశించేందుకు స్వేచ్ఛను కల్పించేందుకు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు, దేశంలో క్రమంగా, ఒక ఉద్యమం అభివృద్ధి చెంది, బలపడింది. నీటి హక్కు కొరకై అంబేద్కర్ నాయకత్వంలో నడిచిన 'మహద్' సత్యాగ్రహం, అస్పృశ్యులు జరిపిన ప్రముఖ పోరాటాల్లో ఒకటి.

దళిత జాతుల కొరకు గాంధి **1932** లో అఖిల భారత హరిజన సేవా సంఘం ప్రారంభించాడు. ఈ సంఘం హరిజనులకై నివాసిత వృత్తి, విద్యా పాఠశాలలతో సహా అనేక పాఠశాలలను ప్రారంభించింది. ఈ సంఘానికి తోడు అనేక సంఘాలు ఏర్పాటు అయ్యాయి. గాంధి హిందూ మతం నుంచి అంటరానితనాన్ని నిర్మూలించడానికి గొప్ప ప్రయత్నం చేశాడు. అస్పృశ్యులకు, హరిజనులు లేదా దైవ బిడ్డలు అనే కొత్త పేరు పెట్టింది ఇతడే. యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్, అను పత్రికల ద్వారా అస్పృశ్యత నివారణకు గాంధీ నిర్విరామంగా కృషి చేశాడు.

**4.3.2.4. కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి : 1937** తరువాత వివిధ రాష్ట్రాల్లో పనిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వాలు దళిత జాతుల ఉద్ధరణకై ఉపయోగకర కార్యక్రమాలను నిర్వహించాయి. బొంబాయి కాంగ్రెస్ ప్రభుత్వం బొంబాయి హరిజన దేవాలయ ఆరాధన చట్టాన్ని చేసింది. దీని ప్రకారం ప్రస్తుత ఆచారం ధర్మ సంస్థల నియమాలతో నిమిత్తం లేకుండా, తమకు ఇష్టం ఉన్నట్లు అయితే హరిజనులను దేవాలయాలలోకి అనుమతించవచ్చు. మధ్య రాష్ట్రాలు, బీహార్ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రాథమిక స్థాయి నుండి విశ్వ విద్యాలయాల స్థాయి వరకు హరిజనులకు ఉచిత విద్యను ఏర్పాటు చేశాయి. కాంగ్రెస్ పాలిత ఇతర రాష్ట్రాల్లో కూడా ఇటువంటి ఏర్పాటు చేయడమైయింది.

**4.3.2.5. భారత రాజ్యాంగంలో :** భారత రాజ్యాంగంలో భాగమైన ప్రభుత్వ విధాన నిర్దేశిక సూత్రాల్లో షెడ్యూల్డు కులాల, జాతుల రక్షణ అభ్యున్నతి, పొందుపరచటమైనది. వీటిని రాజ్యాంగంలోని **4**వ భాగంలో గల **36-51** ఆర్టికల్స్ వివరిస్తున్నాయి. పౌరులందరికీ సరైన జీవన ఆధార కల్పన భౌతిక వనరుల పంపిణి, ధన ఉత్పత్తి, సాధనాల కేంద్రీకరణ నిరోధం, చక్కని జీవన విధానం, గ్రామ పంచాయితీల ఏర్పాటు, కుటీర పరిశ్రమలను పెంపొందించుట, **14** సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య మొదలైన విషయాలను ప్రభుత్వం చేపటాల్సిందిగా రాజ్యాంగం ద్వారా నిర్దేశించడమైయింది. చట్టరీత్యా షెడ్యూళ్ల కులాలు,జాతుల అభ్యున్నతికై, భారత రాజ్యాంగంలో కొన్ని అధికరణాలు పొందుపరచటమైయింది అవి :

1. లోక్‌సభ, రాష్ట్రాల శాసన సభల్లో, షెడ్యూళ్ల కులాలు, జాతులవారికి స్థానాలు రిజర్వు చేయడం జరిగింది. ఇది మొదట **1960** వరకు, తరువాత దీనిని కొనసాగించడమైయింది. పంచాయితీ రాజ్ వ్యవస్థ ఏర్పడిన తరువాత వీరికి అన్నిచట్ట బద్ధ వ్యవస్థల్లో కూడా, ప్రాతినిధ్యం ఇవ్వడమైయింది.

2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులు, ఉద్యోగాల నియామకాల్లో షెడ్యూళ్ళ కులాలు, జాతుల వారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించడమైయింది. వీరికి వయోపరిమితి సడలింపు యోగ్యతలో కూడా, ఇతర కులాల వారితో పోల్చినపుడు సడలింపు ఇవ్వడం జరిగింది.

3. షెడ్యూళ్ల కులాలు, జాతుల వారికి ఇచ్చిన, రక్షణలకు సంబంధించిన, అన్ని విషయాలను పరిశీలించి, భారత రాష్ట్రపతికి, ప్రతి ఏటా నివేదిక సమర్పించడానికి, ఒక ప్రత్యేక అధికారి నియామకానికి, రాజ్యాంగంలో సదుపాయం కల్పించబడింది.

4. పార్లమెంట్ సభ్యులు ఇతరులతో కూడిన రెండు కేంద్ర సలహా బోర్డుల్లో ఒకటి షెడ్యూల్డు కులాలకు, మరొకటి షెడ్యూల్డు జాతులకు ఏర్పాటు చేశారు. ఇవి వీరి సంక్షేమానికి సంబంధించిన పథకాల తయారీ, సమీక్షలతో పాటు అన్ని విషయాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహాలను ఇస్తాయి.

5. షెడ్యూల్డు ప్రాంతాలు, జాతుల పాలన పర్యవేక్షణకై ప్రత్యేక అధికరణాలు పొందుపరచారు.

6. బలహీన వర్గాలు, ప్రత్యేకించి షెడ్యూల్డు కులాలు, జాతుల వారి విద్య, ఆర్థిక ప్రయోజనాలను, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పెంపొందించి, వీరిని సామాజిక అన్యాయం అన్ని రకాల దోపిడీల నుంచి రక్షించాలి.

**4.3.2.6. హరిజనుల కృషి :** హరిజనులు కూడా అనేక సత్యాగ్రహ ఉద్యమాలు నిర్వహించారు. వీటి ద్వారా వీరు దేవాలయ ప్రవేశంపై ఉన్న ఆంక్షను ధిక్కరించి, దేవాలయాల్లో ప్రవేశించుటకు ప్రయత్నించారు. వీరి ప్రజాస్వామిక కోర్కెలకు ప్రజల సానుభూతి లభించడంతో ఈ ఉద్యమాలు పటిష్టమై చాలా చోట్ల అంటరాని వారికి, దేవాలయ ప్రవేశ హక్కును సంపాదించి.

ట్రావెన్కూర్, ఇండోర్, అయోధ్య, దేవాస్‌లలో సంస్థానాధీసులే అన్ని రాజ్యాలయాలను హరిజనులకు తెరచి ఉంచడంలో చొరవ తీసుకొన్నారు.

**4.3.2.7. బ్రిటిష్ విధానం :** దళిత జాతుల హక్కులను, అప్రజాస్వామికంగా తిరస్కరించడం గట్టిగా వ్యతిరేకించడంలోనూ, కోల్పోయిన హక్కులను, పునరుద్ధరించడంలోనూ, బ్రిటిష్ ప్రభుత్వం శక్తివంతముగా వ్యవహరించలేదు అని భారత జాతీయవాదులు పేర్కొన్నారు. భారత ప్రజల చేతులలోకి అధికారం వచ్చి ఆ అధికారం సామాజికంగా అనగారిన వర్గానికి, సంక్రమించనంత వరకు ఆ వర్గాన్ని బాధిస్తున్న సామాజిక, న్యాయ, సాంస్కృతిక బలహీనతలను తుడిచి వేయడం పూర్తిగా సాధ్యం కాదు అని అంబేద్కర్ భావించాడు. మీ చేతులలోకి రాజకీయ అధికారం రానిదే మీరు వీటిని తొలగించలేరు. సామాజిక, ఆర్థిక జీవన చట్టాన్ని సవరించడానికి ఏ ప్రభుత్వం అయితే వెనుకాడదో అటువంటి ప్రభుత్వం మనకు కావాలి అని అంబేద్కర్ అంటాడు. బ్రెయిల్స్ ఫోర్డ్ లాంటి ఆంగ్లేయులు ఇండియాలోని ప్రాచీన ప్రగతి నిరోధక సారంలేని సామాజిక సంస్థలు, ఆచారాల పట్ల బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ఇతడు తన గ్రంథమైన 'పాలిత ఇండియా'లో ఈ విమర్శ చేశాడు. దళిత జాతుల్లో ప్రజాస్వామ్య చైతన్యం వారి ప్రాథమిక మానవ హక్కుల గురించి వారిలో పెరుగుతున్న జాగృతి బ్రిటిష్ పాలనలో ఇండియా ప్రజల్లో సంభవించిన, సార్వత్రిక జాతీయ ప్రజాస్వామ్య చైతన్యంలో భాగమే. ఆనాడు నూతన ఆర్థిక, రాజకీయ విధానం ఇండియాలో నెలకొల్పబడింది. సమాజంలోని వ్యక్తులందరూ, సమాన వ్యక్తిగత స్వేచ్ఛా చట్టం ముందు సమానత గలవారు అను సూత్రంపై ఈ విధానము ఆధారపడింది. తన ఇష్టం వచ్చిన వృత్తిని చేపట్టడానికి ప్రతి వ్యక్తికీ సమాన హక్కు స్వేచ్ఛ సంక్రమించింది. ఫలితంగా సామాజికంగా అనగారిన వర్గాల్లో స్వేచ్ఛా భావాన్ని కలిగించింది. ఉన్నత కులాల వారి మానవతా వాద కృషి, అనగారిన వర్గాల విప్లవ పోరాటాలను వృద్ధి పరచడం ఇండియాలో సామాజిక, సంస్కరణ ఉద్యమం అయింది.

**4.3.2.8. నూతన ఆర్థిక శక్తుల ప్రభావం :** సామాజిక అసమానతలు భేదాలను తగ్గించే అనేక లక్షణాలు, బాహ్యంగా దాగి ఉన్నాయి. రైలు, బస్సు రాకతో శారీరకముగా ఉన్నత కులాల వారిని దళితుల దగ్గరకు చేర్చడమైయింది. ఇండియాలో స్థాపించిన ఆధునిక పరిశ్రమలు తమ కూలీలను అన్ని కులాల వారి నుండి తీసుకోవడం ప్రారంభించాయి. దీనికి తోడు, కార్మికులందరూ యంత్రాల దగ్గర శారీరకముగా దగ్గరై పనిచేయసాగిరి. కార్మిక సమ్మెలో అన్ని కులాల వారు కలసి పోరాడినారు. ఇటువంటి వర్గ చైతన్యం వేగముగా కుల చైతన్యాన్ని తొలగించసాగింది. పట్టణాలలోని హోటళ్ళు కుల విద్వేషాలను తగ్గించి, బలమైన శక్తులైయ్యాయి.

**4.3.2.9. పాశ్చాత్య విద్యా ప్రభావం :** పాశ్చాత్య విద్యా వ్యాప్తి వల్ల అస్పృశ్యులలో ఎక్కువ మంది ఉన్నత కులాల వారి వృత్తులను చేపట్టసాగారు. ఒకే వృత్తిని ఆచరించే ఉన్నత కులాల దళిత జాతుల మధ్య ఒకే రకమైన భౌతిక ప్రయోజనాలు ఏర్పడ్డాయి. ఫలితముగా కొంత కాలానికి తమ ఐక్య ప్రయోజనాల వృద్ధికై ఉన్నత దళిత వర్గాల ప్రశక్తి లేకుండా ఒకటై సహకరించుకోసాగారు. పాశ్చాత్య విద్యను ప్రవేశపెట్టడంతో భారతీయుల్లో ఉదారవాద ప్రజాస్వామ్య భావాలు జనించాయి. ఇది ఉన్నత కులాలకు చెందిన వ్యక్తుల్లో కుల అసమానతల పట్ల నిరాశను కలిగించింది. అస్పృశ్యులలోని చదువుకొన్న వారిలో ఈ కుల అసమానతలు విప్లవ మనస్తత్వాన్ని ప్రేరేపించింది. అస్పృశ్యులు

తక్కువ వృత్తులను అవలంభించడానికి, ప్రధాన కారణం వారికి విద్య లేకపోవడమే. దీని వల్లనే వారిలో ఆర్థిక, సాంస్కృతిక పేదరికం చోటు చేసుకున్నది. వీరు పాశ్చాత్య విద్యను అభ్యసించే కొద్దీ వీరి స్థితిగతులు మెరుగు పరచడమే గాక ఒకే వృత్తిని అవలంభిస్తున్న భిన్న కులాల వారి మధ్య వర్గ ఐక్యత ఏర్పడసాగింది. ఫలితంగా దళితులు ఫ్యాక్టరీ కార్మికులు, ఉపాధ్యాయులు, గుమస్తాలు, వర్తకులు మొదలైన సామాజిక వర్గాలుగా రూపొందారు. ఒకే వృత్తిని అవలంభిస్తున్న భిన్న కులాల వారి మధ్య ఆర్థిక ఛందాల వల్ల అంటరానితనం అనే విద్వేషాన్ని తగ్గించసాగింది. ఈ లక్షణం పారిశ్రామిక కేంద్రాల్లో కనిపిస్తుంది. ఈ కేంద్రాల్లో తమ పరిస్థితుల మెరుగు కొరకు అన్ని కులాలకు చెందిన కార్మికులు ఏకమై యజమానులకు వ్యతిరేకంగా, పోరాటాలు సాగించారు. ఒక అస్పృశ్యుడు విద్యావంతుడై తన ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచుకొన్నపుడు అతని పట్ల ఉన్నత కులాల వారి దృక్పధం కూడా మారసాగింది.

**4.3.2.10. జాతీయోద్యమ ప్రభావము :** జాతీయ ఉద్యమం స్వాతంత్ర్యయ సాధనకై కుల ప్రమేయం లేకుండా భారతీయులందరిని ఐక్యపరచేందుకు కృషి చేసింది. స్వరాజ్య పోరాట విజయానికై భారతదేశంలోని అన్ని కులాల వారి ప్రజాస్వామ్య మైత్రి అవసరం అయింది. అన్ని కులాల వారు స్వాతంత్ర్య సాధనకై జరిగిన పోరులో ఏకం అయ్యారు. ఈ విధముగా జాతీయ ఉద్యమం కుల విభేదాలు అంతరించేందుకు దోహదం చేసింది. మరొక వైపు అంటరానితనం వంటి సామాజిక అన్యాయాలను రూపుమాపేందుకు ఉద్దేశించిన సంస్కరణ ఉద్యమం భారత ప్రజల జాతీయ ఐక్యతను సాధించేందుకు తోడ్పడింది.

## 4.3.3. సారాంశం :

హిందూ సమాజం అనేక రకాల కులాలుగా విభజింపబడింది. ఈ కుల నిచ్చెన అడుగు భాగాన అస్పృశ్యులు ఉన్నారు. హిందూ జనాభాలో వీరు 20%. వీరి అనేక నిర్బంధాలకు, అనర్హతలకు గురి అయ్యారు. అవి ఒక్క ప్రాంతంలో ఒకొక్క రకముగా ఉండేవి. వారిని ముట్టుకుంటే మైలు పడిపోయినట్లు భావించేవారు. అగ్రవర్ణాల హిందువులపై దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అంటరాని వారి నీడ కూడా పడకూడదు. బ్రాహ్మణులు వస్తునట్లు కనిపించిన వినిపించిన అస్పృశ్యులు దూరంగా తప్పుకోవాలి. అగ్ర వర్ణాల వారు నీరు తోడుకొనే బావిలో అస్పృశ్యులు వాడుకొనే వీలులేదు. అగ్రవర్ణాల వారు నీరు తెచ్చుకొనే చెరువుకు అంటరాని వారు వెళ్ళడానికి వీలులేదు. అస్పృశ్యుల కోసం ప్రత్యేకించబడిన నూతులు, చెరువుల్లో మాత్రమే వీరు నీరు వాడుకోవాలి. అలా లేని చోట పంటకాలువల్లోని మురుగు నీరు తెచ్చుకొని త్రాగాలి. అస్పృశ్యుడికి హిందూ దేవాలయంలో ప్రవేశించే హక్కు లేదు. శాస్త్రాలు చదివే అధికారం లేదు. పోలీస్, సైనిక శాఖల్లో వీరికి ఉద్యోగాలు నిషేధం. పాకి పని, చెప్పులు కుట్టుట, మృత దేహాన్ని తొలగించుట, చనిపోయిన జంతువుల చర్మాలు వలచడం మొదలైన హీన వృత్తుల్లో వారిని బలవంతంగా ఇరికించారు. సొంత భూమి కలిగి ఉండే హక్కు లేదు.

కుల వ్యవస్థ అమానుషం మానహీనం మాత్రమే కాకుండా పుట్టుకతో సంక్రమించే అసమానతా సూత్రం మీద ఆధారపడి ఉంది. ఇది పూర్తి ప్రజాస్వామ్య వ్యతిరేక సూత్రం. సామాజిక అనైక్యతకు విచ్ఛిత్తికి కుల వ్యవస్థ కారణం. ఆధునిక యుగంలో జాతీయ సమైక్యతా భావం వికసించకుండా ప్రజాస్వామ్య వ్యాప్తిని కొనసాగించకుండా కుల వ్యవస్థ అడ్డుపడింది. కుల వ్యవస్థను క్రమేణ బలహీన పరిచే అనేక శక్తులు బ్రిటిష్ పాలనతో వెలికి వచ్చాయి. పరిశ్రమల స్థాపన, రైలు, బస్సు ప్రవేశం పట్టణాల పెరుగుదల మొదలైన వాటి వల్ల భిన్న కులాలకు చెందిన మనుష్యులకు మధ్య కలివిడి పెరిగింది. ఆధునిక వాణిజ్య పరిశ్రమలు, నూతన ఆర్థిక కార్యకలాపాలకు దారి తీసింది. ఒక బ్రాహ్మణ కులస్తుడు చెప్పుల వ్యాపారంలో అవశాసాలను వదులుకోలేక పోయాడు. అలాగే డాక్టరు కావడానికి, సైనికుడు కావడానికి అవకాసం వస్తే, నిరాకరించలేదు. లాభార్జన ప్రధాన పాత్ర నిర్వహించి ఆధునిక పారిశ్రామిక సమాజంలో కులానికి, వృత్తికి మధ్య ఉండే సన్నిహిత సంబంధం కొనసాగలేదు. బ్రిటిష్ వారు చట్టం ముందు అందరూ సమానులే అను సూత్రాన్ని ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో కుల విచక్షణకు తావు లేకుండా అందరికి సమాన అవకాశాలు కల్పించారు. అంతేగాక వారు ప్రవేశపెట్టిన నూతన విద్యా వ్యవస్థ లౌకికమైయింది.

బ్రిటిష్ పాలన ఫలితముగా భారతీయుల్లో ప్రజాస్వామ్య హేతువాద భావాలు వ్యాపించడంతో వారు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ధ్వజమెత్తారు. సంఘ సంస్కర్తలందరూ ప్రధానంగా అస్పృశ్యతను ఖండించారు. జాతీయ ఉద్యమ వికాసం కులవ్యవస్థను బలహీన

పరచడంలో గొప్ప పాత్ర నిర్వహించింది. గాంధీ జీవించినంత కాలం తన ప్రజాసేవా కార్యక్రమంలో అస్పృశ్యత నిర్మూలనకు ప్రధమ స్థానం ఇచ్చాడు. అతడు అఖిల భారత హరిజన సంఘాన్ని స్థాపించాడు.

అనేక మంది వ్యక్తులు, సంస్థలు అస్పృశ్యుల్లో విద్యా వ్యాప్తికి కృషి చేయడం జరిగింది. వారికి దేవాలయ తలుపులు తెరిపించడానికి, అందరూ ఉపయోగించుకొనే నూతులు, చెరువుల నుంచి వారు నీరు తీసుకొనడానికి ఆ వ్యక్తులు కృషి చేశారు. విద్యా చైతన్యం వ్యాప్తి కావడంతో అస్పృశ్యులు తమంతట తామే ముందుకు నడిచారు. క్రమముగా వారు ఒక గొప్ప ఉద్యమాన్ని నిర్మించారు. హరిజన కులంలో పుట్టిన అంబేద్కర్ జీవితాంతం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడినాడు. అందుకోసం అతడు అఖిల భారత దళిత వర్గాల సంస్థను స్థాపించాడు. దక్షిణాన బ్రాహ్మణేతరులు, ఆత్మ గౌరవ ఉద్యమాన్ని ప్రారంభించారు. అస్పృశ్యులు అఖిల భారత స్థాయిలో నిర్భందాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు సాగించారు. "ఎవ్వరు నీ అగచాట్లను తొలగించలేరు రాజకీయ అధికారం హస్తగతం కానిదే మీరు ఆ పని చేయలేరు. ప్రజల కోసం, ప్రజల చేత ఏర్పడ్డ ప్రజల ప్రభుత్వం ఒక్కటే అంటే స్వరాజ్య ప్రభుత్వం ఒక్కటే లక్ష్యసాధనను సాధ్యం చేస్తుంది." అని అంబేద్కర్ పేర్కొన్నాడు. 1950 లో రూపొందించిన మన రాజ్యాంగం అస్పృశ్యత అంతిమ నిర్మూలనకు చట్టబద్ధమైన చట్టాన్ని తయారుచేసింది. రాజ్యాంగం అస్పృశ్యతను రద్దు చేసినట్లు ప్రకటించింది. ఏ రూపంలో గాని అస్పృశ్యతను ఆచరణలో పాటించడాన్ని నిషేధించింది. అస్పృశ్యత ద్వారా తలెత్తె ఎటువంటి అనర్హతను సంక్రమింపజేసినా అది చట్టరీత్యా శిక్షార్హమైన నేరంగా పరిగణించబడింది.

## 4.3.4. నమూనా ప్రశ్నలు :

1. అంటరాని తనము రూపుమాపుటకు చేసిన వ్యతిరేక పోరాటములను గూర్చి వ్రాయుము ?

## 4.3.5. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


**ఆచార్య వై. కుమార స్వామి.**

ఖండిక - 4

## పాఠం - 4.4.

# మహమ్మదీయులలో సాంస్కృతిక పునర్వికాసం

### 4.4.0. లక్ష్యం :

మహమ్మదీయులలో, పార్శీలలో, సిక్కులలో కొనసాగిన సాంఘిక, మత సంస్కరణోద్యమాలు, సాంఘిక సంస్కరణలు, దాని ఫలితాలు, ఉద్యమాలు అణగారిపోవడానికి కారణాలు గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయ సూచిక :


**4.4.1** పరిచయం

- **4.4.1.1** అహమ్మదీయ ఉద్యమం - మీర్జా గులామ్ అహమద్
- **4.4.1.2** అలీఘడ్ ఉద్యమం - సర్ సయ్యద్ అహమద్ ఖాన్
- **4.4.1.3** సర్ మహమూద్ ఇక్బాల్
- **4.4.1.4** ఇతర ముస్లిం సంస్కరణోద్యమాలు
- **4.4.1.5** సమీక్ష

**4.4.2** పార్శీలలో సంఘ సంస్కరణోద్యమం

**4.4.3** సిక్కులలో సంస్కరణోద్యమం

**4.4.4** సాంఘిక సంస్కరణలు

- **4.4.4.1** పరిచయం
- **4.4.4.2** సతీసహగమన నిషేధం
- **4.4.4.3** పసిపిల్లల హత్య
- **4.4.4.4** బాల్య వివాహాలు
- **4.4.4.5** వితంతు పునర్వివాహాలు
- **4.4.4.6** అణగారిన తరగతుల ఉద్ధరణ
- **4.4.4.7** సంస్కరణోద్యమ ముఖ్య లక్షణాలు
- **4.4.4.8** సంస్కరణోద్యమ ఫలితాలు
- **4.4.4.9** సంస్కరణోద్యమాలు అణగారి పోవడం

**4.4.5.** నమూనా ప్రశ్నలు

**4.4.6.** చదువదగిన గ్రంథాలు

## 4.4.1 పరిచయము :

మహమ్మదీయులలో మత సంస్కరణోద్యమాలు హిందువుల కంటే కొంత ఆలస్యంగా ఆవిర్భవించాయి. ముస్లీం ఉన్నత వర్గాల వారు ప్రధమములో పాశ్చాత్య విద్యా సంస్కృతులకు దూరముగా ఉండిపోయారు. 1857 తిరుగుబాటు తరువాత మాత్రమే మత సంస్కరణోద్యమ నూతన భావాలు వారిలో కూడా జనించసాగింది. 1863 లో కలకత్తాలో మహమ్మదీయ సాహిత్య ఆవిర్భావం ఈ దశలో మొదటి మెట్టు. ఈ సమాజం నవీన భావాల వెలుగులో మత సాంఘిక రాజకీయ సమస్యల మీద చర్చలు ప్రారంభించింది. ఉన్నత మధ్య వర్గాల ముస్లీం ప్రజలను పాశ్చాత్య విద్యాభ్యాసానికి ప్రోత్సాహరపరచింది.

**4.4.1.1 అహమదీయ ఉద్యమం - మీర్జా గులామ్ అహమద్ :** 1889 లో మీర్జా గులామ్ అహమద్ ఈ ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ ఉద్యమం ఉదారవాద సూత్రాల మీద ఆధారపడింది. తనను తాను ముస్లీం పునరుజ్జీవన మార్గదర్శిక జ్యోతిగా వర్ణించుకున్నది. ఇది విశ్వ మానవ మత సూత్రాలపై ఆధారపడింది. పాశ్చాత్య ఉదారవాదం, దివ్య జ్ఞాన సమాజం, హైందవ మత సంస్కరణ ఉద్యమాల చేత ప్రభావితుడైన అహమద్ ఈ ఉద్యమాన్ని స్థాపించాడు. ఈ ఉద్యమం ముస్లీమేతరులపై జరిపే యుద్ధాన్ని వ్యతిరేకించింది. ప్రజలందరి మధ్య సోదర సంబంధాలను నెలకొల్పడానికి ఇది పూనుకుంది. ఇది భారతీయ ముస్లీంలలో పాశ్చాత్య ఉదార విద్యను వ్యాప్తి చేసింది. దీని కొరకు పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించింది. ఆంగ్ల, ప్రాంతీయ భాషల్లో పత్రికలు, గ్రంధాలు ప్రచురించింది.

**4.1.2 అలీగఢ్ ఉద్యమం - సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ :** ముస్లీంలలో అతి ముఖ్య సంస్కర్త సయ్యద్ అహ్మద్ ఖాన్. ఆధునిక శాస్త్రీయ ఆలోచనా విధానం ఇతనిని గొప్పగా ఆకర్షించింది. ఈ ఆలోచనా విధానాన్ని ఇస్లాంలో మేళవింపజేయాలి అని ఇతడు తను జీవితాంతం కృషి చేశాడు. ఇస్లాం మతానికి 'ఖురాన్' ఒక్కటే అధికారిక గ్రంధం అని ప్రకటించి తన లక్ష్య సాధనకు జాగ్రత్తగా బాట వేసుకున్నాడు. 'ఖురాన్'కు ఆయన సమకాలీన హేతువాద విజ్ఞాన శాస్త్రాల వెలుగులో అర్థ వివరణ ఇచ్చాడు. సాంప్రదాయానికి గుడ్డిగా తల వొగ్గడానికి వ్యతిరేకంగా అతడు జీవితాంతం పోరాడినాడు. విమర్శనాత్మక వైఖరిని భావ స్వాతంత్ర్యాన్ని అలవరుచుకోమని ఇతడు ప్రజలకు ఉద్బోధించాడు. భావ స్వాతంత్ర్యం వికసించనంత వరకు నాగరిక జీవితం అనేది ఉండజాలదు అని పేర్కొన్నాడు. మత మూర్ఖత్వానికి, సంకుచిత మనస్తత్వానికీ వ్యతిరేకంగా, ఇతడు హెచ్చరిక చేశాడు. విశాల దృష్టి, సహన శీలం అలవరుచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశాడు. ఉత్తమ ప్రపంచ గ్రంధాల అధ్యయనాన్ని ఇతడు ప్రశంసించాడు. ఈ అధ్యయనం ద్వారా ప్రపంచం చాలా విశాలమైనది అనే జ్ఞానోదయం కలుగుతుంది అని చెప్పాడు.

మహ్మదీయుల మత, సాంఘిక జీవనం ఆధునిక పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానాన్ని సంస్కృతిని జీర్ణించుకోవడం ద్వారానే మెరుగుపడుతుంది అని సయ్యద్ అహ్మద్ ఖాన్ గట్టిగా నమ్మాడు. అందువల్ల ఆధునిక విద్యా వ్యాప్తి అనేది ఆయన జీవితంలో మొదటి కర్తవ్యం అయింది. ఒక ప్రభుత్వ అధికారిగా ఇతడు అనేక పాఠశాలలు నెలకొల్పాడు. పాశ్చాత్య గ్రంధాలను ఉర్దూలోకి తర్జుమా చేయించాడు. మత సహనంలో ఇతడు గొప్ప నమ్మకం కలవాడు. అన్ని మతాల్లో ఒకానొక అంతర్గతమైన ఏకత్వం కలదని ఇతను నమ్మాడు. దానినే క్రియాత్మక నీతి అనవచ్చు.

ఒక వ్యక్తి యొక్క మతం అతని వ్యక్తిగత వ్యవహారం అని నమ్మాడు. కనుక మత దురభిమానాన్ని నిరసించాడు. మత ఘర్షణను ప్రతిఘటించాడు. హిందూ, ముస్లిం ప్రజలను ఐక్యముగా ఉండమని విజ్ఞప్తి చేశాడు. మనం ఉభయులం భారత గాలి పీలుస్తూ, గంగాయమునా నీరు తాగుతూ బతుకుతున్నాం భారత గడ్డ మీద పండినది భుజిస్తున్నాం. జీవన్మరణాల్లో కలసి మెలసి ఉన్నాం మనం ఎంత కలసి పోయాము అంటే ఉర్దూ అనే నూతన భాషను అభివృద్ధి చేసుకున్నాం. అది అందరిది కాబట్టి మన జీవితాల్లో భగవంతునికి చెందిన భాగం మినహా, మనమంతా ఒకే జాతి వారము మన పరస్పర విభేదాలు మొండితనం మనల్ని ఖచ్చితముగా నాశనం చేస్తాయి అని 1883 లో సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ హిందూ, ముస్లిం ప్రజలను కోరాడు.

బ్రిటిష్ ప్రభుత్వాన్ని అంతం చేయడం సాధ్యం కాదు కాబట్టి తక్షణ రాజకీయ ప్రగతి సాధ్యం కాదు అనే భావం సయ్యద్ అహమ్మద్ ఖాన్ మనస్సులో నాటుకొన్నది. అందువల్ల ఇతని రాజకీయ దృక్పథంలో మార్పు వచ్చింది. బ్రిటీష్ వారు కక్ష పూనితే ముస్లింలలో తను

కోరుకున్న విద్యా వ్యాప్తికి ఆటంకాలు కలగవచ్చు అని ఇతడు అభిప్రాయపడ్డాడు. భారతీయులు తమ ఆలోచనల్లో కార్యాచరణలో బ్రిటిష్ వారంతటి ఆధునికులైతేనే విదేశీ పాలనను విజయవంతముగా సవాలు చేయగలుగుతారు అని ఆయన భావించాడు. అందువల్ల అతడు విద్యలో వెనుకబడి ఉన్న ముస్లీమ్‌లను కొంత కాలం పాటు రాజకీయాలకు దూరంగా ఉండమని సలహా ఇచ్చాడు. ముస్లీమ్‌లలో విద్యా వ్యాప్తి కొరకు ఇతడు ఇతర ప్రయోజనాలన్నింటినీ బలి పెట్టడానికి సిద్ధమయ్యాడు. సనాతన ముస్లీంలు తన కళాశాలను నిరసించకుండా ఉండటానికి మత సంస్కరణ ఉద్యమాన్ని వదులుకున్నాడు.

అదే కారణముగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే పని చేయకూడదు అనుకున్నాడు. అక్కడితో ఆగకుండా మత తత్వాన్ని ఏర్పాటు వాదాన్ని ప్రోత్సహించాడు. ఇది ఘోర రాజకీయ తత్వం. ఇతని అనుచరులు కొందరు ఇతర మతాలను విమర్శిస్తూ ఇస్లాంను దాని గతాన్ని ఆకాశానికి ఎత్తారు. సయ్యద్ అహమ్మద్ ఖాన్ "పరదా'' పద్ధతని వ్యతిరేకించాడు. ముస్లీం స్త్రీలలో విద్యా వ్యాప్తికి ప్రచారం చేశాడు. ముస్లీంలలో బహు భార్యత్వాన్ని, విడాకుల మంజూరును నిరసించాడు.

సయ్యద్ అహమ్మద్ ఖాన్ రాజకీయపరంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకి. జాతీయ ఉద్యమం చివరికి ఆంగ్లేయులను, భారతదేశం నుంచి వెల్లగొట్టడానికి దారితీస్తుంది అని, అప్పుడు పరిపాలన మెజారిటీ వర్గమైన హిందూవుల చేతుల్లోకి వస్తుంది అని బ్రిటిష్ రాజ్యం కన్నా ముస్లిమ్‌లకు హిందూ రాజ్యమే ప్రమాదకరమైయింది అని ఇతడు భావించేవాడు. ఈ రకంగా ఇతడు ముస్లీంలకు ప్రత్యేక దేశాన్ని కొరకపోయినప్పటికీ దానికి సంబంధించిన బీజాలను కొంత వరకు వేశాడు అని చెప్పవచ్చు. సిపాయిల తిరుగుబాటు తరువాత మహ్మదీయులు అనే దారుణ ఫలితాలను ఎదుర్కొనవలసి వచ్చింది. అయితే సయ్యద్ అహమ్మద్ ఖాన్ నాయకత్వంలో మహ్మదీయులు 19వ శతాబ్ద అంతానికి శక్తివంతమైన వర్గముగా ఆవిర్భవించారు.

అలీగఢ్ ఉద్యమం ముస్లీంలలో తొలిసారిగా జాతీయ చైతన్యాన్ని రగులు కోల్పింది. ఈ ఉద్యమాన్ని ప్రారంభించినవాడు సయ్యద్ అహమ్మద్ ఖాన్ రాజకీయముగా ముస్లీంలను చైతన్యవంతులుగా చేసి, వారిలో విద్యను వ్యాప్తి చేయడానికి ఈ ఉద్యమం ఉద్దేశింపబడింది. సయ్యద్ అహమద్ ఖాన్‌కు కవి ఖ్వాజా అల్టఫ్ హుస్సేన్ అలీ, మౌల్వీ నజీర్ అహ్మద్, మౌల్వి షిబ్లీ నుమానీ లాంటి సమర్థులు చేదోడుగా ఉండేవారు.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రారంభించిన ఉదారవాద సాంఘిక సంస్కరణ, సాంస్కృతికోద్యమానికే, అలీగఢ్ ఉద్యమం అనే పేరు. అలీగఢ్ వద్ద **1875**లో, మహ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల స్థాపించడంతో, ఈ ఉద్యమానికి ఈ పేరు వచ్చింది. ఈ కళాశాల **1890**లో అలీగఢ్ విశ్వ విద్యాలయంగా అభివృద్ధి చెందింది. దీనితో బాటు, అఖిల భారత ముస్లిం ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ అనే సంస్థ కూడా ఏర్పాటు చేయడం జరిగింది. అయితే, గమనించాల్సిన విషయం ఏమంటే, అలీగఢ్ కళాశాల స్థాపకుడు, దాని తొలి ఇద్దరు ప్రధానాచార్యులు మహ్మదీయుల్లో హిందువుల పట్ల, కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతా భావాన్ని పెంపొందించుటకు దోహదమయ్యారు. అలీగఢ్ ఉద్యమానికి ఇటువంటి లక్షణాన్ని వీరాపదింపజేశారు. హిందువులు, ముస్లింలు భిన్న దృక్పథం విరుద్ధ ప్రయోజనాలతో కూడిన రెండు వేర్వేరు జాతుల వారు అని ప్రజాస్వామ్య వ్యవస్థ పోటీ పరిక్షల ద్వారా ఉన్నత ఉద్యోగాల్లో భర్తి హిందువుల పెత్తనం కారణంగా, ముస్లింలకు హానికరం అని అందువల్ల బ్రిటిష్ అధికారమే ముస్లింల ప్రయోజనాలను కాపాడుతుంది అని ప్రచారం చేయడం జరిగింది.

ముస్లింల సేవకై ఇంగ్లాండ్‌లో తన జీవితాన్ని వదులుకొని అలీగఢ్ కళాశాలకు ప్రధాన ఆచార్యుడిగా "థియోడోర్ బెక్'' పని చేశాడు. ఇతడు కళాశాల సారస్వత పత్రిక ఇన్‌స్టిట్యూట్ గెజిట్ సంపాదకత్వాన్ని నిర్వహిస్తూ అనేక రాజకీయ వ్యాసాలు వ్రాసాడు. ఇందులో భారత దేశంలో పార్లమెంటరీ ప్రభుత్వం హిందువుల నిరంకుశ అధికారానికి దారితీస్తుంది అని ఆ విధముగా ఏ ముస్లీమ్ చక్రవర్తి వ్యవహరించలేదు అని తెల్పాడు. **1889**లో బ్రిటిష్ కామన్ సభలో ఇండియాలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయాలి అని చార్లెస్ బ్రాస్‌లాఫ్ బిల్లును ప్రవేశపెట్టగా బెక్ స్వయముగా తన విద్యార్థులతో ఢిల్లీ వెళ్ళి ముస్లింల తరుపున వ్యతిరేక అర్జీని తయారుచేసి, **20** వేల మంది ముస్లీంల సంతకాలను తీసుకోగలిగాడు. ఇతడు హిందువులు, ముస్లీమ్‌లతో కూడిన ఒక సంఘాన్ని, కాంగ్రెస్‌ను తిరస్కరించడానికీ, ముస్లింలను కాంగ్రెస్ నుండి వేరుచేసి, ఆంగ్లేయులకు విధేయులుగా చేయడానికి ముస్లింలతో కూడిన మరో సంఘాన్ని స్థాపించాడు. హిందూ వ్యతిరేక ప్రాతిపదికపై 'బెక్' అలీగఢ్ ఉద్యమం నిర్వహించాడు. ఇస్లాం పట్ల ముస్లీంల విధేయత బలహీన పడకుండా వారిలో ఆంగ్ల విద్యను వ్యాప్తి

గావించడం. అలీగఢ్ ఉద్యమ లక్ష్యం అయింది. ఇది ప్రారంభించిన విద్యా సంస్థల్లో లౌకిక విద్యకు మత విద్య జోడించడమైయింది. ఈ ఉద్యమం సాంఘిక సంస్కరణను కూడా చేపట్టింది. బహు భార్యత్వాన్ని, వితంతు పునర్ వివాహం పైగల సామాజిక నిషేధాన్ని నిరసించింది.

**4.2.1.3. సర్ మహమూద్ ఇక్బాల్ :** ఆధునిక భారత కవుల్లో ఒకడైన మహ్మద్ ఇక్బాల్ తన కవిత ద్వారా హిందూ ముస్లీం యువతరం యొక్క తాత్విక మత దృక్పధాన్ని గాఢంగా ప్రభావితం చేశాడు. వివేకానందునిలాగా ఇతడు నిరంతర మార్పుని ఆహ్వానించాడు. ఉన్నంత వరకు తృప్తి పడే లక్షణాన్ని నిరసించాడు. ఈ ప్రపంచాన్ని మార్చడానికి దోహదము చేసే విధానాన్ని అలవరుచుకోమని విజ్ఞప్తి చేశాడు. ఇతడు మౌళికముగా మానవతావాది. మానవులు ప్రకృతికి లొంగిపోకూడదు అనే అతడు ఈ ప్రపంచాన్నే తన కృషితో నియంత్రించాలి అని కోరాడు. ఉన్న పరిస్థితిని అంగీకరించడం ఇతని దృష్టిలో మహా పాపం, కర్మ కాండ కఠోర నియమాలు ఇతనికి గిట్టవు. సుఖ సంతోషాలు సాధించడానికి కృషి చేయమని ఇతడు ప్రజలకు ఉద్బోదించాడు. ఇతడు తన తొలి కవితా రచనల్లో దేశాభిమానం ప్రభోదించాడు. కాని తరువాత ముస్లీం ఏర్పాటు వాదాన్ని ప్రభోదించాడు. యురప్ నాగరికతను మానవత్వం లేని అత్యాస, దోపిడీ క్షీణతతో కూడినదిగా ఇక్బాల్ వర్ణించాడు. దీని భిన్న లక్షణాలను విమర్శించే నిమిత్తం నీషె, స్కొపెన్ హార్, స్పెంగ్లర్, కార్లమార్క్స్ వంటి రచయితలను పేర్కొన్నాడు. ఇతడు యూరప్ నాగరికతను తన పద్యాల్లో తీవ్రంగా దూయబట్టాడు. పెట్టుబడిదారి వ్యవస్థకు బదులుగా పాశ్చాత్యీకరణను ఇతడు వ్యతిరేకించడంతో ఉదారవాద వ్యతిరేక తిరోగామి వాదులకు ఏరగా మారాడు.

**4.4.1.4. ఇతర ముస్లీం సంస్కరణోద్యమాలు :** ల్యాబ్జీ అనే ఒక ప్రగతిశీలక ముస్లీం, ముస్లీం స్త్రీల విమోచనకు పరదాల్లాంటి పద్ధతులను వ్యతిరేకించేందుకు, బొంబాయిలో ఒక ఉద్యమాన్ని ప్రారంభించాడు. షేక్ అబ్దుల్ హలీల్ షేరార్ అనే రచయిత పాత్రికేయుడు సంయుక్త రాష్ట్రాల్లో పరదా పద్ధతి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాడు. ముస్లీంలలో ఉదార భావాలు వ్యాపించడంతో తమ స్త్రీల సామాజిక స్థితిని మెరుగుపరచడానికి వారికి హానికరంగా ఉన్న ఆచారాలను నిర్మూలించడానికి ఉద్యమం బలాన్ని పుంజుకున్నది. ఫలితంగా ముస్లీంలలో బహు భార్యాత్వము, బాల్య వివాహాలు తగ్గసాగాయి. అఖిల భారత ముస్లిం కాన్ఫరెన్స్ ముస్లిం స్త్రీల విద్యాభివృద్ధికి, ఆర్థిక సదుపాయాన్ని కల్పించింది. ముస్లీంలు ముస్లీం సంస్థలు స్త్రీల కొరకు దేశం అంతటా విద్యా సంస్థలు నెలకొల్పారు. కాల క్రమేణా ముస్లిం స్త్రీలలో విద్యా వ్యాప్తి కాసాగింది.

**4.4.1.5. సమీక్ష :** పై విధముగా ముస్లింలలో మత, సామాజిక సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమై బలాన్ని పుంజుకున్నాయి. టర్కిలో జాతీయ లౌకిక రాజ్యస్థాపన అరబ్ జాతీయ వాద విజ్రుంభణ ప్రభావం భారత ముస్లింలపై ప్రసరించింది. ఫలితంగా వీరి ధృక్పదంలో మార్పులు వచ్చాయి. టర్కి ఆధునీకరణ, ఇండియాలోని అధిక సంఖ్యాక ముస్లీంల మనస్సును ఆధునీకరణ పరచడానికి దారితీసింది. జాతీయ ఉద్యమం కూడా, ముస్లీంలను అధిక సంఖ్యలో భారత జాతీయతావాద పరిధిలోనికి తీసుకొని వచ్చింది. భారతదేశంలో శీఘ్రగతిని అభివృద్ధి చెందిన కార్మిక, కర్షక ఉద్యమాలు సామాన్య ముస్లిం ప్రజలను జాతీయ దృష్టిని వర్గ చైతన్యం కలవారిగా చేసెందుకు తోడ్పడ్డాయి.

## 4.4.2. పార్శీలలో సంఘ సంస్కరణోద్యమాలు

బొంబాయిలోని పార్శీలలో 1850 తరువాత మత సంస్కరణ ఉద్యమం మొదలైయింది. వారు సమాజంలో ప్రక్షాళన ఉద్యమాన్ని ప్రారంభించారు. మేధావులైన పార్శీలు మతాన్ని సమాజాన్ని సంస్కరించడానికి 'రెహ్నుమాయి మజ్దయాన్ సభ' అనే సంఘాన్ని 1851 లో స్థాపించారు. ఈ సభ జోరాష్ట్రియన్ మతంలోని ప్రాచీన పవిత్రతను పునరుద్ధరించాలి అని పట్టుబట్టింది. సామాజిక మత రంగాల్లో సంస్కరణలు ప్రోత్సహించడానికి పార్శీలు 'రస్త్గఫ్తర్' అను వార పత్రికను ప్రారంభించారు. పార్శీలలో నౌరోజీఫర్ దొంజి, దాదాబాయ్ నౌరోజి, యస్, యస్. బెంగాలీలు ప్రముఖ సంస్కర్తలు. మత రంగంలో పాతుకు పోయిన ఛాందస తత్వానికి వ్యతిరేకంగా వీరు ప్రచారం చేశారు. స్త్రీ విద్య, వివాహం వారి సామాజిక అంతస్థుకు సంప్రదించి పార్శీ సాంఘిక ఆచారాల ఆధునీకరణను ప్రారంభించారు. మలాబారీ అను పార్శీ నాయకుడు స్త్రీలకు పిల్లలకు సామాజికాభివృద్ధి, కార్యక్రమాలను నిర్వహించడానికి సేవాసదన్‌ను ప్రారంభించాడు. కాల క్రమేణా పార్శీలు భారత సమాజంలో అందరికంటే ఎక్కువగా పాశ్చాత్య నాగరికతను అలవరుచుకున్న వర్గంగా రూపొందారు.

## 4.4.3 సిక్కులలో సంస్కరణ ఉద్యమం

మత రంగంలో కలిగిన చైతన్య ప్రభావం వల్ల సిక్కులు కూడా తమ వర్గాన్ని ప్రక్షాళన చేయడానికి ప్రయత్నించారు. అమృతసర్‌లో 1890లో 'ఖాల్సా' కళాశాల స్థాపించినప్పటి నుండి సిక్కుల్లో మత సంస్కరణోద్యమం మొదలైంది. గురు ద్వారాలను సంస్కరించడానికి అవినీతి పరులైన మహంత్‌లను తొలగించడానికి శిరోమణి గురుద్వారా ప్రభంధక్ కమిటీని సిక్కులు స్థాపించారు. 1920 తరువాత మత సంస్కరణ కార్యక్రమం ఊపు అందుకొన్నది. గురుద్వారాల యాజమాన్యాన్ని ప్రక్షాళన చేయాలన్నది అకాలీల ప్రధాన అశయం.

## 4.4.4. సాంఘిక సంస్కరణలు

**4.4.4.1. పరిచయం :** 19వ శతాబ్దంలో భారతీయ పునరుజ్జీవన ఉద్యమం ఉదృతముగా కొనసాగుతున్న రోజుల్లో మత సంస్కర్తలకు మత సంస్కరణలతో బాటు మత వర్గాలకు సంబంధించిన సాంఘిక అలవాట్లను, మార్చవలసిన అవసరం ఏర్పడి, సంఘ సంస్కరణలు అమలుపరచడంలో కూడా శ్రద్ధ వహించారు. 19వ శతాబ్దం చివరి దశలో ప్రారంభమైన భారత జాతీయోద్యమ నాయకులు కూడా సాంఘిక దురాచాల సమస్యలను తొలగిస్తేగాని, భారతీయ సమాజం సంఘటితంగా ఉద్యమం కొనసాగించలేదు అని ఆలోచన ఏర్పడి జాతీయ ఉద్యమంతో బాటు మత సాంఘిక సంస్కరణ ఉద్యమాలు ప్రచారం చేయసాగారు. కనుక 19వ శతాబ్ది ప్రధాన ఉద్యమాలైన జాతీయోద్యమం, మత సంస్కరణ ఉద్యమం సాంఘిక సంస్కరణ ఉద్యమం, కొంత వరకు కలసి, కొంత విడిగా తమ ఉద్యమ సాఫల్యతకు కృషి చేశాయి. భారతీయుల్లో మత సంస్కరణ ఆవశ్యకత, సంఘ సంస్కరణల పట్ల ఉత్సాహం కలగడానికి కొంత వరకు పాశ్చాత్య విద్య క్రైస్తవ మత ప్రచారకుల కార్యకలాపాలు కారణం అయ్యాయి. ఆంగ్ల ప్రభుత్వం తమ పరిపాలనా ప్రారంభంలో సాంఘిక దురాచారాల తొలగింపుకు గట్టి ప్రయత్నం చేశారు. కాని కొన్ని సందర్భాల్లో కలిగిన ప్రతికూలత వల్ల విషయంలోని సున్నితత్వాన్ని గ్రహించి ఆంగ్లేయులు తటస్థ విధానాన్ని పాటించారు. తప్పని సరైన సందర్భాల్లో మాత్రం ప్రభుత్వం ముందుకు వచ్చి సంస్కర్తలకు తమ సహకారాన్ని అందించింది.

19వ శతాబ్ద ప్రారంభంలో భారత సమాజంలో పెక్కు సాంఘిక దురాచారాలు వుండేవి. వాటిలో సతీసహగమనం, బాల్య వివాహాలు వర్ణ విభేదాలు, అడ శిశువులను చంపడం మొదలైనవి. ఈ దురాచారాలు కొనసాగటానికి కారణం నాటి ప్రజలకు తమ పాత ఆచార వ్యవహారాల పట్ల గౌరవ భావం ఉండటమే. విశేషం ఏమిటంటే ఆనాటి సాంఘిక దురాచారాలు అన్ని ప్రధానంగా స్త్రీకి సంబంధించినవి.

**4.4.4.2. సతీసహగమన నిషేధం :** హిందూ సమాజంలోని ఉన్నత కులాల వారిలో సతీసహగమన విధానం ఉండేది. భర్త మరణించగానే అతని భార్య అదే చితిపై భర్త మృత దేహంతో బాటు ప్రాణత్యాగం చేయడాన్ని 'సతీ' అనేవారు. ఈ పద్ధతి హిందూ సమాజంలో వేదకాలం నుండి అమలులో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ పద్ధతి నిబంధనో లేదా ఐచ్ఛికము తెలియదు. మొత్తం మీద 'సతీ' అనే వినాదం పవిత్రమైనది అని అందువల్ల భార్యకు భర్తపై గల గౌరవం, ప్రేమ ధృవీకరిస్తుంది అని నమ్మేవారు. కాల క్రమేణా, సతీ అనేది ఒక మత విధిగా రూపొంది దాని ఆచరణకు, కొన్ని పద్ధతులు రూపొందించారు. బెంగాల్, రాజకుతాని విజయనగర రాజుల్లో సతీసహగమనం ఎక్కువగా అమల్లో ఉండేది.

బ్రిటిష్ వారికి ముందే 1510 లో పోర్చుగ్రీస్ రాజ ప్రతినిధి ఆల్బూకర్క్ సతీని నిషేధించాడు. మొగల్ చక్రవర్తి అక్బర్ సతీ నిషేధానికి ప్రయత్నించి విఫలుడైయాడు. పీష్వ రెండో బాజీరావు సతీసహగమనాన్ని తన రాజ్యంలో నిషేధించాడు. అలాగే డచ్చి వారు, ఫ్రెంచివారు సతీని నిషేధించారు. కాని భారతదేశ హిందూ, ముస్లీంల విశ్వాసాలను గౌరవించగలమని, ప్రకటించిన, కంపెనీ ప్రభుత్వానికి ఈ నిషేధం విధించడానికి కొంత ఇబ్బంది ఏర్పడింది. వారన్ హేస్టింగ్స్, కారన్ వాలీస్, వెలస్లీ మొదలైనవారు సతిని నిషేధించాలి అని కోరుకున్నా ప్రత్యక్షంగా నిషేధించడానికి ఇష్టపడలేదు. చివరకు 1929 నాటికి ఆ నాటి గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్ పాలనా కాలంలో భారతీయ పునరుజ్జీవన ఉద్యమ పితామహుడు, బ్రహ్మ సమాజ స్థాపకుడు రామ్మోహన్ రాయ్ ప్రాబల్యంతో ఒక చట్టం ద్వారా సతీసహగమనాన్ని నిషేధించడమైయింది. తన అన్న గారి భార్య తన కళ్ళ ఎదుట సతీసహగమనము ఆచరించి దగ్ధమై పోవడాన్ని చూసిన రామ్మోహన్‌రాయ్ సతీనిషేదం కోసం తీవ్రంగా కృషి చేశాడు. నాటి సనాతుల కోపాన్ని సైతం లక్ష్యపెట్టక వినతి పత్రాల ద్వారా ఆంగ్ల ప్రభుత్వాన్ని కదిలించి సతీసహగమన నిషేధం చట్టబద్ధం చేయించాడు. 1850 నాటికి సతీసహగమన నిషేధం దాదాపు పూర్తి అయింది.

**4.4.4.3. పసిపిల్లల హత్య :** పసిపిల్లలను, అందులో ముఖ్యంగా ఆడశిశువులను చంపివేసే ఆచారం, కధియావార్‌లోని రాజపుత్ర కుటుంబంలో ఎక్కువగా ఉంది. అడశిశువు జననం పాపహేతువని, వారికి వివాహం చేయడం కష్టసాధ్యం అని, వివాహం వ్యయ ప్రయాసాలతో కూడుకొని, తమ శక్తికి మించుతుందని భయపడే మధ్య తరగతి, బీదవారిలో ఈ దురాచారం ఎక్కువగా ఉంది. శిశువులకు నల్లమందు తినిపించడం ఊపిరాడనీయకుండా చేయడం, తల్లీ శిశువుకు ఆహారమీయక, చంపడం జరిగింది. సర్ జాన్ షోర్, విలియం బెంటింక్ ప్రభువుల, నిబంధనలు, శాసనాల వల్ల శిశుహత్యలను నిషేధించడం జరిగింది.

**4.4.4.4. బాల్య వివాహాలు :** బాల్య వివాహాల వల్ల జరుగుతున్న అనేక అనర్థాలను గ్రహించిన భారతీయ పునరుజ్జీవన సంస్కర్తలైన, రాజారామ్మోహన్‌రాయ్, కేశవ చంద్రసేన్, ఆర్య సమాజ్ సంస్కర్తలు, పార్శీ సంస్కర్త మలబారీల కృషి ఫలితంగా, ఆంగ్ల ప్రభుత్వం 1891లో చట్టం ద్వారా బాలికల వివాహ వయస్సు 10 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు పెంచింది. 1930 లో మరొక చట్టం (శారదా చట్టం) వల్ల, బాలురకు వివాహ వయస్సు 18 సంవత్సరాలుగానూ, బాలికలకు 14 సంవత్సరాలుగానూ నిర్ణేశించడమైయింది. 1872 లో కేశవ చంద్రసేన్ కృషి వల్ల జారీ చేసిన చట్టం బహు భార్యత్వాన్ని నిషేధించి, వితంతు పునర్వివాహాలను, కులాంతర వివాహాలను అనుమతించింది. బాల్య వివాహాలను నిషేధించింది.

**4.4.4.5. వితంతు పునర్వివాహాలు :** సతీసహగమన నిషేధ ఉద్యమం ప్రారంభమైన రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు చట్ట బద్ధం చేయించే ఉద్యమం ప్రారంభమైయింది. నాటి హిందూ సమాజంలో ఉన్నత కులాల వితంతువులు పునర్వివాహము చేసుకునేవారు కాదు. కాని ఈ నిషేధం ఇతర కులాల వారి విషయంలో సవరించడమైయింది. బాల్య వివాహాల ఫలితంగా భర్తలు మరణించగా, బాలికలు ఎంతో మంది వితంతువులయ్యే వారు. ధర్మ శాస్త్రాల్లో ఎక్కడా అంక్ష విధించక పోయినా వారు పునర్ వివాహము చేసుకోరాదు అనే అచారం అమలులో ఉండేది. వితంతు పునర్వివాహాలను చట్టం బద్ధం చేయడానికి ఈశ్వర చంద్ర విద్యాసాగర్ గొప్ప కృషి చేశాడు. అనేక శాస్త్ర చర్యలు చేసి, అతడు ఛాందస్సుల అవరోధాలను అధిగమించాడు. చివరకు 1856 లో గవర్నర్ జనరల్ డల్హౌసీ ప్రభువుతో ఒక చట్టం ద్వారా వితంతు పునర్వివాహాలను చట్టబద్ధం చేయించాడు. ఈ రంగంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం ప్రార్థనా సమాజం గొప్ప కృషి చేసింది. మహారాష్ట్రలో పండిత విష్ణు శాస్త్రీ, మహాదేవ గోవింద రానడేలు వితంతు సమస్య పరిష్కారానికి కృషి చేశారు. వారితో బాటు భండార్కర్, అగార్కర్, కార్వేలు సహకరించారు. కార్వే ఒక వితంతువును వివాహం ఆడినాడు. హిందూ వితంతువుల కోసం పూనాలో ఒక సదనాన్ని స్థాపించాడు. స్త్రీల కోసం వైద్య కళాశాలలు స్థాపించి డాక్టర్లకు, నర్సులకు, శిక్షణ ఇవ్వడమైయింది. ఆంధ్రలో కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాల విషయంలో గొప్ప కృషి చేశాడు. రాజమండ్రిలో వితంతు సేవాసదనాన్ని స్థాపించి మొదట వితంతు వివాహాన్ని తన గృహములో జరిపించాడు. తరువాత వివిధ ప్రాంతాల్లో ఇతడు దాదాపు 40 వితంతు వివాహాలు జరిపించాడు. స్త్రీ విద్య కోసం బాలికా పాఠశాలలను స్థాపించాడు.

**4.4.4.6. అణగారిన తరగతుల ఉద్ధరణ :** కుల వ్యవస్థ ఫలితంగా హిందూ సమాజంలోని అణగారిన తరగతుల ఉద్ధరణకు అంటరానితన నిర్మూలనకు, ఉద్యమము జరిపిన వారిలో గాంధి కృషి పేర్కొనగలిగింది. క్రైస్తవ మత ప్రచారకులు అణగారిన తరగతుల వారిని తమ మతంలో చేర్చుకొనే ప్రయత్నాలు అధికం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో సంఘ సంస్కర్తలు దళిత వర్గాల ఉన్నతి కోసం కృషి చేసి, మత మార్పిడిని చాలా వరకు నివారించగలిగారు. వీరి కృషి వల్ల హిందూ సమాజం చీలిపోకుండా సంఘటితంగా ఉండటమేగాక, చైతన్యవంతమైన మహాశక్తిగా రూపొంది భారత జాతీయ ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించింది.

**4.4.4.7. సంస్కరణోద్యమ ముఖ్య లక్షణాలు :** సంస్కరణోద్యమాల్లో కొన్ని పాశ్చాత్యుల ప్రభావం వల్ల మరికొన్ని భారతదేశ ప్రాచీన సంస్కృతి ఆధారంగా ప్రారంభమయ్యాయి. ఉద్యమాలు అన్నీ మతంలో ఆధునికతను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాయి. సంస్కరణ ఉద్యమాలు అన్నీ సమాజంలోని లోపాలను తొలగించి, సమాజాన్ని పటిష్టం చేయడానికి ప్రయత్నించాయి. సంస్కర్తలందరూ మతాన్ని అందులోని భోదనలను ప్రజలకు సన్నిహితంగా తెచ్చారు అన్ని ఉద్యమాలు మనవతావాదానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాయి.

**4.4.4.8. సంస్కరణ ఉద్యమ ఫలితాలు :** సంస్కరణోద్యమాల ఫలితంగా, సనాతన సంప్రదాయాలు, మూఢ నమ్మకాలు కొంత వరకు తగ్గిపోయాయి. మతం పేరుతో జరిగే ఆక్రమాలను విద్యావంతులైన ప్రజలు తెలుసుకోగలిగారు. పాశ్చాత్య విద్య, శాస్త్రీయ విజ్ఞానం వ్యాప్తి చెందాయి. ఫలితంగా హేతువాద ధృక్పదం ఏర్పడింది. అర్థం లేని క్రతువులు, కర్మకాండలు, మూఢ నమ్మకాలను విమర్శించడం ఆరంభమైయింది. మత సంస్కర్తలందరూ మానవ శ్రేయస్సును లక్ష్యముగా పెట్టుకొన్నారు. అన్ని మతాలు, మానవునికి మేలు కలిగించే రీతిలో పనిచేయాలి అని సంస్కర్తలు ప్రభోదించారు. మతం పేరుతో మానవులను హింసించడం సరైనది కాదు అని మానవసేవయే మాధవ సేవ అని మతం మానవులు సృష్టించింది అని సంస్కర్తలు ఉద్భోదించారు. ఫలితముగా మనవతా వాదానికి ప్రాముఖ్యం లభించి సంఘంలో దురాచారాలను, చట్టాల ద్వారా తొలగించడానికి కృషి జరిగింది. బాల్య వివాహాలు, దేవదాసీ వ్యవస్థ, బాహు భార్యత్వం, వితంతువుల దుస్థితిని తొలగించడానికి తీవ్రమైన కృషి జరిగింది. స్త్రీ విద్యను ప్రోత్సహించడం ద్వారా సామాజిక దురాచారాలను తొలగించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. స్త్రీలకు ముఖ్యంగా వితంతువుల పునర్వివాహం వంటి సంస్కరణలు ప్రవేశపెట్టారు.

సంస్కరణల వల్ల విద్యా రంగం గొప్పగా ప్రభావితం అయింది. పాశ్చాత్య విద్య శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించడానికి ప్రయత్నాలు జరిగాయి. అనేక పాఠశాలలు, ఉన్నత విద్యాసంస్థలు స్థాపించారు. సంస్కరణలు ప్రజలందరికీ తెలిసేటట్లుగా ఉండాలి అని భావించారు. అందువల్ల దేశీయ భాషలకు ప్రాధాన్యం పెరిగింది. ప్రాచీన సంస్కృతీ విశిష్ఠతను మరచినందు వల్లనే సమాజం దుస్థితికి చెరిందని ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడం ద్వారా భారతదేశం అభివృద్ధి చెందగలదు అని ఉద్భోదించారు. దాని ఫలితంగా భారతీయుల్లో అత్మ గౌరవం, దేశభక్తి పెంపొందింది. సంస్కరణల వల్ల ప్రజలు నూతన విజ్ఞానాన్ని, శాస్త్రీయ దృక్పధాన్ని అలవరుచుకొని నూతన చైతన్యంతో స్పందించి, పునరుజ్జీవిత ఆధునిక భారతదేశ నిర్మాణానికి శ్రీకారం చుట్టగలిగారు.

**4.4.4.9. సంస్కరణోద్యమాలు అణగారి పోవడం :** 19వ శతాబ్ది ప్రథమ, ద్వితీయార్థాల్లో భారతదేశ భిన్న ప్రాంతాల్లో సాగిన సంస్కరణోద్యమాలు మత, సామాజిక సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో గాఢ ప్రభావాన్ని ప్రసరింపజేసి, అనేక మార్పులను తీసుకురాగలిగాయి. అయితే 19 వ శతాబ్ధి అంతానికి ఈ సంస్కరణోద్యమాలు ప్రారంభదశలోని ఉధృతి కోల్పోయి బలహీనపడిపోయాయి. అందుకు కారణం పటిష్టమైన సంస్థ అంటూ లేకపోవడమే. భారత సమాజంలోకి ఆధునికతను ప్రవేశపెట్టడానికి సంస్కర్తలు చేస్తున్న ప్రయత్నాలకు సంప్రదాయవాదులు అడుగడుగునా అడ్డు తగులుతూ వచ్చారు. హిందూ సమాజంలో రామమోహనరాయ్ ప్రవేశపెడుతున్న అభ్యుదయ సంస్కరణలను వ్యతిరేకించడానికి రాధాకంతదేవ్ 'ధర్మసభ' అనే సంస్థను నిర్వహించడం అందుకు తార్కాణం. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్‌పై ముస్లిం సంప్రదాయ వాదులు 'దియోబంద్' ఉద్యమం పేరుతో పూర్తిగా తిరుగుబాటు చేశారు. విభజన వ్యతిరేక ఉద్యమం తరువాత సాంఘిక సంస్కరణ వాదులపై రాజీకయ నాయకులు ఆధిపత్యం సంపాదించగలిగారు. ఈ విధానం అనేక దశాబ్దాల పాటు కొనసాగింది. తరువాత జాతీయోద్యమం మిగిలిన ఉద్యమాలన్నిటినీ వెనుకకు నెట్టివేసి ప్రముఖ స్థానం ఆక్రమించింది. తీవ్రవాద జాతీయవాదం పటిష్టమైన రూపం తీసుకొని సంస్కరణోద్యమాలను చావుదెబ్బకొట్టింది. సంస్కర్తలు వలసవాద ప్రభుత్వంపై ఎక్కువగా ఆధారపడి ఉద్యమాన్ని కొనసాగించడం, సంస్కర్తలకు సామాన్య ప్రజానీకం మద్దతులేకపోవడం, సంస్కర్తల బోధనలు మధ్యతరగతి వారికి మాత్రమే అందుబాటులో ఉండటం, వలస ప్రభుత్వ పాలకులలో సంస్కరణల పట్ల ఆసక్తి లేకపోవడం, భూస్వామ్య వ్యవస్థ ఈ ఉద్యమానికి కొంతవరకు అడ్డుకట్ట వేయడం, అప్పుడప్పుడే పెరుగుతున్న పెట్టుబడిదారీ వర్గం సంస్కరణ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం కారణాలుగా ఉద్యమాలు అణగారి పోవడం ప్రారంభమైయింది.

## 4.4.5. నమూనా ప్రశ్నలు :

1. అలీఘడ్ ఉద్యమం గూర్చి వ్రాయుము
2. పార్శిలలో, సిక్కులలో సంఘ సంస్కరణోద్యమాలను గూర్చి తెలుపుము
3. సాంఘిక సంస్కరణలు గూర్చి వివరించండి.

## 4.4.6. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


ఆచార్య వై. కుమార స్వామి.

ఖండిక - 4

## పాఠం - 4.5

# సామాజిక, మత సంస్కరణోద్యమాలు అనుకూల ప్రతికూల అంశాలు

### 4.5.0. లక్ష్యం :

క్రీ.శ. 19వ శతాబ్దంలో భారతదేశంలో సాగిన సామాజిక, మత సంస్కరణోద్యమాల అనుకూల, ప్రతికూల అంశాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయ సూచిక :


**4.5.1** పరిచయం

**4.5.2** సంస్కరణోద్యమాలు - అనుకూల అంశాలు

- **4.5.2.1.** జాతీయతా భావం
- **4.5.2.2.** మానవతావాదం
- **4.5.2.3.** ఆత్మ గౌరవం, దేశభక్తి
- **4.5.2.4.** హేతువాద దృక్పథం
- **4.5.2.5.** లౌకిక స్వభావం
- **4.5.2.6.** ఆంతరంగిక జనైక్యత

**4.5.3** సంస్కరణోద్యమాలు - ప్రతికూల అంశాలు

- **4.5.3.1.** కొద్ది మంది భారతీయులకే పరిమితం
- **4.5.3.2.** మత పరమైన స్పృహ అధికం కావడం
- **4.5.3.3.** పట్టణ జీవన పెరుగుదల
- **4.5.3.4.** కులాచారాల్లో వైరుధ్యం
- **4.5.3.5.** ఐక్య లౌకిక ప్రయోజనాల పరిణామం మందగించడం

**4.5.4** సంస్కరణోద్యమాల స్వభావం

**4.5.5** సంస్కరణోద్యమాలు అణగారి పోవడం

**4.5.6** సారాంశం

**4.5.7.** నమూనా ప్రశ్నలు

**4.5.8.** చదువదగిన గ్రంథాలు

## 4.5.1 పరిచయము :

ప్రజాస్వామ్యం, జాతీయవాదం, శాస్త్ర విజ్ఞానం ప్రాబల్యం వహించిన ఆధునిక ప్రపంచపు ఆపేక్షలకు అనుగుణంగా తమ సమాజాన్ని మలచుకోవాలనే కాంక్షతో ఆలోచనాపరులైన భారతీయులు కొందరు తమ సాంప్రదాయక మతాలను సంస్కరించడానికి సన్నద్ధులయ్యారు. తమ మత ప్రాతిపదికలకు బద్ధులై ఉంటూనే, వారు వాటికి భారత ప్రజల నూతన అవసరాలకు తగినట్లుగా కొత్త రూపు దిద్దారు.

భారతదేశంలో ఆధునిక యుగంలో ప్రారంభమైన చాలా ఉద్యమాలు హేతువాదం, మానవతావాదం అనే రెండు సిద్ధాంతాల మీద ఆధారపడ్డాయి. అయితే కొన్ని సమయాల్లో ఈ ఉద్యమాలు ప్రజల దృష్టిని తమవైపు తిప్పుకోడానికి మత విశ్వాసాన్ని, ప్రాచీన ప్రమాణాలను ఆధారంగా తీసుకున్నాయి. మత సంస్కరణోద్యమాలు అప్పుడే పైకి వస్తున్న మధ్యతరగతి వారి ఆకాంక్షలను ప్రతిబింబించడం చేత, అవి వారి దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. అవి మానవ మేధని తర్క వ్యతిరేకమైన మూర్ఖమత సిద్ధాంతాల నుంచి, పిడివాదం నుంచి విడిపించి ఆలోచనా పటిమ, హేతువాదం అలవరచటానికి ప్రయత్నించాయి. అవి భారతీయ మతాలలో అనుష్టానికమైన, మూఢ విశ్వాస పూరితమైన, హేతురహితమైన, అర్థరహితమైన సూత్రాలను ప్రతిఘటించాయి. చాలా ఉద్యమాలు కొంత హెచ్చుతగ్గులుగా మతంలో ప్రామాణ్యతా సూత్రాన్ని వదిలివేసి తర్కం, హేతువాదం లేదా శాస్త్రీయ విచారాలకు అనుగుణ్యంగా ఏ మతంలోగానీ, పవిత్ర గ్రంధాలలో గాని సత్య నిరూపణ చేశాయి. విజ్ఞాన శాస్త్రాలకు, బాహ్య జ్ఞానానికి పరిశోధనా పద్ధతులను వర్తింపజేస్తున్నామో మతం అనే శాస్త్రానికి కూడా అవే పద్ధతుల్ని అనువర్తింపజెయ్యాలని వివేకానంద చెప్పాడు. సంస్కర్తలలో కొందరు సంప్రదాయం వైపు దృష్టిని మరల్చారు. తాము కేవలం గతంలోని శుద్ధ సిద్ధాంతాన్ని, విశ్వాసాల్ని ఆచారాన్ని పునరుద్ధరిస్తున్నాం అని చెప్పుకున్నారు కాని నిజానికి గతాన్ని పునరుద్ధరించడం జరగని పని. గతానికి సంబంధించి సర్వామోదణీయమైన చిత్రణ తరచు కనబడదు. గతాన్ని పునరుద్ధరించడం అనే అంశాన్ని రానడే తీవ్రంగా దుయ్యబట్టాడు. సమాజమనేది ఒక సజీన వ్యవస్థ నిరంతర పరిణామ శీలం. కాబట్టి అది గతంలోకి మరలిపోదు అన్నాడు. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానానికి విరుద్ధంగా పరిణమించిన ఆలోచనలను, భావాలను తప్పుడు భాష్యంగా ప్రకటించడం జరిగింది. ఛాందసులు ఈ దృక్పధాన్ని అంగీకరించలేదు. కాబట్టి సంఘ సంస్కర్తలు సనాతన వర్గాలతో సంఘర్షించారు. కనీసం ఆ మొదటి రోజుల్లో వారు మత, సామాజిక తిరుగుబాటుదారులయ్యారు. దయానందుని పట్ల సనాతన వర్గాలు తీవ్ర వ్యతిరేకత వెళ్ళగక్కాయి. అదే విధంగా, సంప్రదాయ వాదులు సయ్యద్ అహ్మద్ ఖాన్‌ని దుర్భాషలాడారు. ఆయనికి వ్యతిరేకంగా మత పరమైన డిక్రీలు జారీ చేశారు. ప్రాణహాని చెయ్యడానికి సైతం తెగించారు.

## 4.5.2. సంస్కరణోద్యమాలు - అనుకూల అంశాలు :

**4.5.2.1. జాతీయతా భావం :** భారతదేశంలో ఆంగ్లేయులు తమ సామ్రాజ్యాన్ని స్థాపించిన తర్వాత రాజకీయ, ఆర్థిక రంగాలలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి మార్పులు తెచ్చారు. అలాగే హిందూ మతాన్ని ఖండించి, క్రైస్తవ మతాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టడం కూడా పరిపాలకులుగా తమ భాధ్యత, ధర్మమని తలచారు. అందుచేత అనేక మంది క్రైస్తవ మత ప్రచారకులు 19వ శతాబ్ది ఆరంభం నుంచి భారతదేశానికి రావడం జరిగింది. ఈ మత ప్రచారకులు ప్రభుత్వ సహాయంతో కొంత వరకు, తమ శక్తితో క్రైస్తవ మత వ్యాప్తికై ఎంతో పాటుపడినారు. మొదట్లో వారి ప్రచారానికి కొంత ప్రోత్సాహం కనిపించినా, మత విషయంలో మాత్రం ఆంగ్లేయులు సఫలులు కాలేకపోయారు. ప్రజలలో జాతీయత ప్రబలం కావడానికి ఆంగ్లేయులు హిందూ ముస్లిం మతాలను ఖండించడం ఒక కారణమైతే, భారత మత సంస్కర్తలు ఆనాడు ప్రచారంలో ఉన్న హిందూ మతంలోని లోపాలను సంస్కరించడానికి ప్రయత్నించడం మరో కారణం. అందువల్ల ప్రజలలో నూతన చైతన్యం బయలుదేరి జాతీయ భావం పెంపొందడానికి మార్గదర్శి అయింది. ఈ మార్పు ప్రజలలో రావడానికి రాజారామమోహనరాయ్, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు మొదలగు వారు పాటు పడినారు. వీరు తమ ప్రభోదనలలో తిరిగి ప్రజలకు ప్రాచీన కాలంలో భారతదేశం సాధించిన గొప్పలను గుర్తింపజేసి, గర్వించునట్లు చేశారు. వీరు మతానికి సరైన నిర్వచనం ఇచ్చి, ప్రజల్లో మతానికి, ప్రజా సేవకు, దేశ సేవకు గల సంబంధాన్ని చక్కగా తెలియజేసి వారిలో మార్పు తేగలిగారు. అందుకే ప్రజలు క్రైస్తవ మత ప్రచారకులకు లొంగక, వారిని ప్రతిఘటించి, పోరాడి విజయాన్ని సాధించగలిగారు. విదేశీయులైన ఆంగ్లేయులను

కూడా తమదేశం నుంచి తరిమివేయగలమనే విశ్వాసం వారికి సంపూర్ణంగా కలిగింది. దేశ స్వాతంత్ర పోరాటానికి ప్రజల సహకారం సంపూర్ణముగా కలగడానికి మత సంస్కరణోద్యమం ఒక గొప్ప కారణమని చరిత్రకారుల అభిప్రాయం. ప్రజలలో జాతీయతా భావం పెరగడానికి మత సంస్కరణోద్యమం మార్గమైంది. జాతీయోద్యమం ప్రజా ఉద్యమంగా పరిణమించడానికి ఈ ఉద్యమాలు ఎంతో దోహదం ఇచ్చాయని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. అందుకే భారత జాతీయోద్యమ చరిత్రలో మత సంస్కరణోద్యమానికి ప్రధాన స్థానం కల్పించడం జరిగింది.

**4.5.2.2. మానవతావాదం :** 19వ శతాబ్దిలో సాగిన మత సంస్కరణోద్యమాలన్నీ కూడా మత సూత్రాలతో బాటు మానవతావాదాన్ని గొప్పగా ప్రబోధించాయి. సంకుచిత మధ్యయుగ మనస్తత్వం క్రమంగా బీటలువారి, దాని స్థానంలో విశాల, విస్తృత, సమన్వయ, లౌకిక దృష్టి చోటు చేసుకోసాగింది. తన కుటుంబం, కులం, తెగకు మాత్రమే పరిమితమైన మధ్యయుగ పౌరుని దృష్టి, ఆలోచనలు సంస్కరణోద్యమాల ప్రభావ కారణంగా దేశ, జాతీయ, రాష్ట్ర రంగాలకు ప్రయోజనాలకు విస్తృతి చెందాయి. తన క్షేమంతో బాటు, సమాజ శ్రేయస్సుకై కూడా వ్యక్తి పాటు పడాలనే సామాజికాశయం, బాధ్యత గట్టిగా చెప్పడమయింది. మానవసేవే మాధవసేవనే సూక్తి విశేషంగా వ్యాప్తి చేయడం జరిగింది. అందువల్ల మానవతా వాదానికి ప్రాముఖ్యం లభించి సంఘంలో దురాచారాలను చట్టాల ద్వారా తొలగించడానికి కృషి జరిగింది. బాల్య వివాహాలు, దేవదాసీ వ్యవస్థ, బహు భార్యత్వం, వితంతువుల దుస్థితిని తొలగించడానికి తీవ్రమైన కృషి జరిగింది. సంస్కర్తలందరు మానవ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకొన్నారు. అన్ని మతాలు మానవుడికి మేలు కలిగించే దిశగా పనిచేయాలని ప్రబోధించారు. మతం పేరిట మానవులను హింసించడం సరియైనది కాదనీ, మతం మానవుడు సృష్టించిందేనని సంస్కర్తలు ఉద్బోదించారు.

**4.5.2.3. ఆత్మ గౌరవం, దేశ భక్తి :** మత సంస్కరణోద్యమాలు భారతీయులలో గొప్ప ఆత్మ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని దేశం పట్ల వర్థిల్లజేశాయి. మత సంబంధమైన గతాన్ని ఆధునిక హేతువాద అర్థంలో నిర్వచించటం ద్వారా, 19 వ శతాబ్ది నాటి మత విశ్వాసాలు, ఆచారాలలోని అవినీతికరమైన, హేతురహితమైన అంశాలను ఏరిపారెయ్యటం ద్వారా సంస్కర్తలు తమ అనుచరులను భారతీయ మతాలు, సమాజంపైన ఆంగ్లేయులు విసిరే విసుర్లను ఎదుర్కొనడానికి సన్నద్ధుల్ని చేశారు. భారతీయ మతాలు, సమాజం అధమ స్థాయికి చెందినవనీ, అవి పతనావస్థలో ఉన్నాయనీ వేళాకోళంగా మాట్లాడే అధికారుల వెక్కిరింతని గట్టిగా ఎదుర్కొనడానికి అనువుగా సంస్కర్తలు తమ అనుచరులను తీర్చిదిద్దారు. సంస్కర్తలు చాలా వరకు ప్రాచీన భారతీయ వైభవాన్ని ప్రశంసిస్తూ భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని తెలియపరిచారు. ప్రాచీన సంస్కృతి విశిష్టతను మరచినందు వల్లనే సమాజం దుస్థితికి చేరిందని ప్రాచీన వైభవాన్ని పునరుద్ధరించడం ద్వారా భారతదేశం అభివృద్ధి చెందగలదని ఉద్బోధించారు. ఫలితంగా భారతీయులలో ఆత్మగౌరవం, దేశభక్తి పెంపొందింది.

**4.5.2.4. హేతువాద దృక్పథం :** సంస్కరణోద్యమాల ఫలితంగా సనాతన సంప్రదాయాలు, మూఢ నమ్మకాలు కొంత వరకు తగ్గిపోయాయి. మతం పేరిట జరిగే అక్రమాలను విద్యావంతులైన ప్రజలు తెలుసుకోగలిగారు. పాశ్చాత్య విద్య, శాస్త్రీయ విజ్ఞానం వ్యాప్తి చెందాయి. దీని వలన హేతువాద దృక్పథం ఏర్పడింది. అర్థం లేని క్రతువులు, కర్మకాండలు, మూఢ నమ్మకాలను విమర్శించడం ఆరంభమయింది.

**4.5.2.5. లౌకిక స్వభావం :** సంస్కరణోద్యమాలు చాలా మంది భారతీయులకు ఆధునిక ప్రపంచంతో రాజీకి రావడానికి సహాయపడ్డాయి. వాస్తవానికి అవి పాత మతాలను సమాజంలోని నూతన సామాజిక వర్గాల అవసరాల కనుగుణంగా ఒక కొత్త ఆధునికమైన మూసలో పోశాయి. గతం మీద గర్వభావం ఉన్నా, భారతీయులు ఆధునిక ప్రపంచం గొప్ప తనాన్ని ముఖ్యంగా విజ్ఞాన శాస్త్రంలో దాని ఆధిక్యతని అంగీకరించడానికి అది అడ్డురాలేదు. సంస్కరణ దృష్టి ఫలితంగా, చాలా మంది భారతీయులు కుల, మత విచక్షణలతో నిండిన సంకుచిత దృక్పథం స్థానే ఆధునికమైన, ఇహలోకానికి పరిమితమైన, లౌకిక స్వభావం కలిగిన జాతీయతా ప్రభావితమైన దృక్పథాన్ని అలవరచుకోసాగారు. అంత మాత్రం చేత కుల మత విచక్షణా సహితమైన సంకుచిత దృక్పథం అంతమైపోలేదు. భారతదేశం సాంస్కృతికంగా, భౌతికంగా మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా మడి కట్టుకుని కూర్చున్న పరిస్థితిని ఈ ఉద్యమాలు తొలగించాయి. ప్రపంచ భావ వెల్లువలో భారతీయులు కూడా పాలు పంచుకునేటట్లు చేశాయి. అదే సమయంలో, భారతీయులు పాశ్చాత్య ప్రపంచానికి చెందిన ప్రతిదానికీ సమ్మోహితులు కాలేదు. పాశ్చాత్యుల్ని గుడ్డిగా అనుసరించిన విదేశ మానస పుత్రుల్ని వారు తృణీకార భావంతో చూశారు.

**4.5.2.6. ఆంతరంగిక జనైక్యత :** సంస్కరణోద్యమాలు హిందూ, మహమ్మదీయ మతాల వారిని రెండు అఖిల భారతీయ జన సందోహాలుగా ఐక్యపరచాయి. మధ్యయుగాలలో స్వతంత్రంగా ఉన్న పలు చిన్న చిన్న ప్రాంతీయ సాంస్కృతిక విభాగాలు ఏకమయ్యాయి. ఈ విధమైన ఆంతరంగిక జనైక్యత 19వ శతాబ్దిలో గణనీయమైన ప్రగతిని సాధించింది. వేరొక ప్రక్రియైన ఈ రెండు సందోహాల రాజకీయైక్యత కూడా వృద్ధి చెందింది. దేశ ఆర్థిక వెనుకబడిన తనం, ప్రజల మధ్యయుగ దృక్పథం వారి విద్య ఘోరంగా నిర్లక్ష్యం చేయబడ్డం, జాతీయ భావాల సత్వరాభివృద్ధిని అరికట్టినా, విద్యావంతుల్లో అనేకుల ఆలోచన, అనుభూతి, క్రియ ఒకే విధంగా ఉన్నాయి. పలు జాతులు, భాషలు, సంస్కృతులు, మతాలున్నదేశంలో, లౌకిక వాద పునాదుల పైననే స్వేచ్ఛాయుత భారతీయ రాజ్య వ్యవస్థ నిర్మించడం జరుగుతుందనే విషయాన్ని వీరు గ్రహించారు.

**4.5.2.7. జాతి ప్రాచీన వైభవ పునరుద్ధరణ :** హిందూ, ఇస్లాం మతాలు రెండింటిలో మత సంస్కరణోద్యమం శక్తివంతంగా నడిచింది. రెంటిలో కూడా సంస్కరణ, ప్రతి సంస్కరణ భావాలు వ్యాపించాయి. ఈ సమానాంతర పరిణామాలు ఒకే రకమైన లక్ష్యాల ద్వారా ప్రేరణ పొందాయి. వీటిలో మొదటిది జాతి ప్రాచీన వైభవ పునరుద్ధరణ. తమ పూర్వీకులు విశాల సామ్రాజ్యాలను నిర్మించారని, సంస్కృతీ పురోగతికి అఖండ కృషి సల్పారని, ప్రపంచ విషయాల్లో మరువలేని పాత్రను నిర్వహించారని, చరిత్ర వీరికి గుర్తు చేయడం జరిగింది. లక్ష్యాల్లో రెండోదిగా గతంతో పోల్చినపుడు వర్తమానం వీరికెంతో అవమానకరంగా, సిగ్గుచేటుగా కన్పించింది. వీరు స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. విదేశీ జాతుల వారు వీరి రాజ్యాల డాబు, దర్పాలను ధూళిలో కలిపారు. వీరి పరిశ్రమలు ధ్వంసమయ్యాయి. ప్రజలు పేదరికానికి లోనయ్యారు. వీరిలోని ఉన్నత వర్గాలవారు తమ యాజమానుల నుండి స్వల్ప రాయితీలను పొందేందుకు, నిస్సహాయక యాచనకు దిగారు. వీరి నైతిక స్థితి దిగజారి, అంతఃకరణ సన్నగిల్లింది. కాబట్టి వీరు అసహ్యాన్ని కలిగించే వర్తమానాన్ని వీలైనంత తొందరలో సమాధి గావించి నూతనమైన, విశాలమైన జీవన విధానంలో అడుగిడేందుకు అభిలషించారు.

**5.2.8. అస్పృశ్యతా నివారణ, మహిళా సమస్యలు :** సంస్కరణ వాదులందరూ అస్పృశ్యతా నివారణకూ, మహిళా సమస్యలకూ అధిక ప్రాధాన్యమిచ్చినారు. అనేక శతాబ్దాల పాటు కనీస హక్కులకు కూడా నోచుకోని ఈ రెండు వర్గాల అభివృద్ధికి స్పష్టమైన కార్యక్రమాలను చేపట్టారు. ముఖ్యంగా 20వ శతాబ్ది ప్రథమంలో అణచివేతకు గురవుతున్న వర్గాలపై దృష్టి కేంద్రీకరించడం జరిగింది. వారి సంక్షేమం కోసం నిరంతరం చర్చలు జరగడమేగాక అనేక తీర్మానాలు చేశారు.

అస్పృశ్యులకు సమాన సామాజిక, మత, సాంస్కృతిక హక్కులను కలుగజేసేందుకై ప్రచారం, విద్య, ఆచరణాత్మక చర్యలను బ్రహ్మసమాజం, ఆర్యసమాజం, సామాజిక సంస్కరణ సభ చేపట్టాయి. రాజారామమోహన రాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం అస్పృశ్యతా నివారణకు గణనీయమైన కృషి చేశారు. ప్రార్థనా సమాజం కార్యకర్తలు నిమ్నజాతుల కోసం రాత్రి పాఠశాలలు నిర్వహిస్తూ, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహిస్తూ గణనీయమైన సేవలనందించారు. ఆర్యసమాజం, రామకృష్ణ మిషన్, క్రైస్తవ మిషనరీలు కూడా ఈ రంగంలో అనేక సేవలనందించాయి. కుల వ్యవస్థ నిర్మూలన జరిగినపుడే భారత జాతిలో సాంఘిక సమైక్యత సాధ్యమవుతుందని చెప్పాడు. నారాయణ గురు, జోతి రావు ఫులే నిర్వహించిన ఉద్యమాల వల్ల బడుగు వర్గాల్లో నూతన ఆత్మ విశ్వాసం, చైతన్యం ఏర్పడ్డాయి. ఈ విధంగా, అస్పృశ్యుల స్థితిని పెంచేందుకు, వారి దయనీయ ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చేందుకు, వారిలో విద్యా వ్యాప్తిని గావించేందుకు, బావులు, పాఠశాలలు, రహదార్లను వాడేందుకు, దేవాలయాలలో ప్రవేశించేందుకు ఒక ఉద్యమం దేశంలో క్రమంగా అభివృద్ధి చెంది ఊపునందుకుంది.

సంస్కర్తలందరూ స్త్రీ జనోద్ధరణకు ప్రాముఖ్యం ఇచ్చారు. సంస్కర్తలందరూ బాల్య వివాహాలను, బహు భార్యత్వం, సతీసహగమనం, దేవదాసి వ్యవస్థ వంటి దురాచారాలను ఖండించారు. బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం, రామకృష్ణ మఠం స్త్రీ విద్యను అభివృద్ధి పరచడంలో మార్గ దర్శక కృషిని సల్పాయి. రామ్మోహనరాయ్ ప్రోత్సాహంతో గవర్నర్ జనరల్ బెంటింక్ సతీసహగమనాన్ని నిషేధిస్తూ చట్టం చేశాడు. విద్యాసాగర్ కృషి ఫలితంగా డల్హౌసీ వితంతువును వివాహమాడిన వ్యక్తి సంతానానికి ఆస్తి హక్కు కల్పిస్తూ చట్టాన్ని చేశాడు. స్వదేశీయుల వివాహ చట్టం వల్ల వర్ణాంతర వివాహాలు ఆమోద యోగ్యమయ్యాయి. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమయ్యాయి.

## 4.5.3 సంస్కరణోద్యమాలు - ప్రతికూలాంశాలు :

**4.5.3.1. కొద్ది మంది భారతీయులకే పరిమితం :** సంస్కరణోద్యమాల ప్రభావం విద్యావంతులైన కొద్ది మంది భారతీయులకే పరిమితమైంది. నిరక్షరాస్యులు, అధిక సంఖ్యాకులైన సామాన్య గ్రామీణ ప్రజల మీద వీటి ప్రభావం పూజ్యమై, సంప్రదాయ, పురాతన రీతుల్లోనే ఆలోచిస్తూ వీరు జీవించసాగారు. దీనికి కారణం బ్రిటిష్ ప్రభుత్వమనుసరించిన అసమగ్ర, అసంబద్ధ, ప్రజా వ్యతిరేక విధానాలే. నూతన విద్యా విధానం ద్వారా మధ్యతరగతి వర్గానికి నూతన వైజ్ఞానిక వాతావరణం, ఆధునిక మేధో దృక్పథాన్ని కలిగింపజేసి, ప్రజల ఆర్థిక పరిస్థితిని గాలికి వదలివేయడమైయింది. వ్యవసాయం, పరిశ్రమలు మధ్యయుగ సాధనాలు, ఉత్పత్తి పద్ధతులనే కొనసాగించాయి. పెట్టుబడిదారీ విధానం, పారిశ్రామికత్వం, ఎదుగూబొదుగూ లేకుండా పోయాయి. ఫలితంగా ప్రజలు బూజుపట్టిన ఆచారాలు, పద్ధతులు ఆలోచనలలోనే కొనసాగారు. సామాజిక వ్యవస్థ కరుడుగట్టి నిస్తేజమైంది.

**4.5.3.2. మత పరమైన స్పృహ అధికం కావడం :** ఇక, రెండో పరిమితి ప్రధాన వ్యతిరేకాంశం అయింది. అది వెనక్కి చూసే ధోరణి, గత ఔన్నత్యం గురించి గొప్పలు పలికే ధోరణి, మత గ్రంథాల ప్రామాణ్యం మీద ఆధారపడే ధోరణి. ఈ ధోరణులు మత సంస్కరణోద్యమాలు ప్రచారం చేసిన నిర్మాణాత్మక బోధలకు వ్యతిరిక్తంగా తయారయ్యాయి. మానవుని హేతు విచార బుద్ధి, శాస్త్రీయ దృక్పథాల ప్రాధాన్యానికి కొంత చెరుపు చేశాయి. మార్మికతకి కొత్త తొడుగులు తొడిగాయి. కుహనా శాస్త్రీయ విచారానికి పాలు పోశాయి. గత ఔన్నత్యాన్ని గొప్పగా చెప్పుకోవడం వల్ల మిధ్యాగర్వం, శుష్క ఆత్మ సంతృప్తి చోటు చేసుకున్నాయి. గతం పొరల అడుగున స్వర్ణయుగాన్ని గాలించే అలవాటు నవీన శాస్త్ర విజ్ఞానాన్ని సంపూర్ణంగా ఆమోదించ నివ్వకుండా అడ్డుకుంది. వర్తమాన పరిస్థితిని మెరుగుపర్చుకునే కృషికి విఘాతం కలిగించింది. అన్నిటికాన్న ముఖ్యంగా ఈ ధోరణులు హిందువుల్ని, ముస్లిముల్ని, సిక్కుల్ని, పార్శీల్ని విడదీసే దిశలో సాగాయి. అగ్రవర్ణ హిందువుల్ని తక్కువ కులాల హిందువుల నుంచి వేరుపర్చాయి. అనేక మతాలు పోగుబడ్డ దేశంలో మతానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటం తప్పకుండా చీలికలు తెచ్చి పెడుతుంది. అంతేగాక, సంస్కర్తలు సాంస్కృతిక వారసత్వం తాలూకు మత, తాత్విక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వటంలో పక్షపాతం ప్రదర్శించారు. ఆ అంశాలు అన్ని వర్గాల, మతాల ప్రజల ఉమ్మడి వారసత్వం కావు. అన్ని వర్గాల, మతాల ప్రజలు సమాన పాత్ర నిర్వహించిన కళలు, శిల్పం, సాహిత్యం, సంగీతం, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు వగైరా విషయాలకు మన సంస్కర్తలు సముచిత ప్రచారం ఇవ్వలేదు. పైగా, హిందూ సంస్కర్తలు భారతదేశపు గత కీర్తిని గానం చేసినప్పుడల్లా, ప్రాచీన యుగం మీద దృష్టి నిల్పారు. వివేకానందుని వంటి విశల దృష్టిగలిగిన వ్యక్తి సైతం ఇదే దృష్టితో భారతీయ చైతన్యాన్ని, భారతదేశ గత విజయాల్ని గానం చేశాడు. ఈ సంస్కర్తలంతా భారత చరిత్రలో మధ్యయుగాన్ని క్షీణ యుగంగా పరిగణించారు. ఇది చరిత్ర విరుద్ధమైనదే కాకుండా సామాజికంగా, రాజకీయంగా చెరుపు చేసేది కూడా. రెండు భిన్న జాతుల సిద్ధాంతాన్ని సృష్టించడానికి కారణమవుతుంది. ప్రాచీన యుగాన్ని, మతాన్ని విచక్షణా రహితంగా ఆకాశానికెత్తటం క్రింది కులాల ప్రజలకు నచ్చదు కూడా. ఎందుచేతనంటే, వాళ్ళు శతాబ్దాలుగా వినాశకరమైన కుల దోపిడీకి గురయ్యారు. అది సరిగ్గా మన సంస్కర్తలు గొప్పగా చెప్పే ప్రాచీన యుగంలోనే పుట్టి పెరిగింది. ఫలితంగా భారతీయులు సమానంగా తమ గతాన్ని, సాంస్కృతిక విజయాల్ని గర్వకారణంగా భావించడానికి బదులుగా గతం కొద్ది మంది వారసత్వం అయింది. పాక్షికత ప్రాతిపదిక మీద గతం అనేది రెండు వేర్వేరు అరలుగా చీలిపోయింది. ముస్లిం మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది తమ మహత్వ సంప్రదాయాలు, గర్వోన్నత ఘడియలు గుర్తు తెచ్చుకునేందుకు పశ్చిమాసియా చరిత్ర పుటలు తిప్పారు. అధికాధికంగా మత సంస్కరణోద్యమ ప్రభావితులైన హిందువులు, ముస్లిములు, సిక్కులు, పార్శీలు తరువాత కింది కులాల హిందువులు ఒకరికొకరు వేరయిపోయారు. మరొక వైపు సాంప్రదాయక మార్గంలో జీవిస్తూ, మత సంస్కరణోద్యమ ప్రభావం సోకని హిందువులు, ముస్లింలు పరస్పరం సఖ్యతలో మెలిగారు. తమ తమ భిన్న మతాచారాలను అనుష్టించారు. కొద్ది శతాబ్దాలుగా సాగుతున్న సమ్మిశ్ర సంస్కృతీ వికాస పరిణామానికి కొంత విఘాతం కలిగింది. అయితే, ఇతర రంగాలలో భారత ప్రజల జాతీయ ఏకీకరణ వేగం పుంజుకున్న మాట కూడా నిజం. ఏమైనప్పటికీ జాతీయ చైతన్యంతో పాటే మధ్య తరగతి ప్రజలలో మతతత్వం కూడా పెచ్చు పెరగసాగింది. మత సంస్కరణోద్యమాల ప్రతికూలాంశాలే కాకుండా, ఇంకా తదితర కారణాలనేకం ఆధునిక యుగంలో మత తత్వ ఆవిర్భావానికి బాధ్యత వహించాయి అయితే మత సంస్కరణోద్యమాల స్వభావం దీనికి నిస్సందేహంగా దోహదం చేసింది. సయ్యద్ అహ్మద్ ఖాన్, దయానంద సరస్వతి మొదలగు వారి కార్యకలాపాలు మత సామరస్యాన్ని దెబ్బతీసి ప్రజలలో మత పరమైన స్పృహను ఎక్కువ చేశాయి.

**4.5.3.3. పట్టణ జీవన పెరుగుదల :** పట్టణ జీవన పెరుగుదల, ఆర్థిక ప్రగతికి సంకేతికమైంది. జనాభాలో అధిక శాతం గ్రామాల్లో నివసించేవారు. 1881 నుంచి 1911 వరకు సాగిన 30 సంవత్సరాల కాలంలో జనాభాలో నగర వాసుల శాతం పదికి మించలేదు. ఫలితంగా గ్రామాల్లో సాంప్రదాయక జీవనమే కొనసాగింది. నగర వాసుల్లో కూడా స్వల్ప వర్గాన్ని మినహాయిస్తే మిగిలిన వారందరూ పురాతన పద్ధతుల్లోనే జీవించసాగారు.

**4.5.3.4. కులాచారాల్లో వైరుధ్యం :** కులమనేది ఒక సంస్థగా, వృత్తి, ఆర్థిక చర్యతో సంబంధాన్ని కల్గి ఉంది. ఆర్థిక కార్యక్రమం పాత పద్ధతిలో కొనసాగినంతకాలం, దీని నిర్మాణం ఏ మార్పు రాలేదు. వాస్తవంగా కులం, ఆచారాల ప్రభావం ఎంత తీవ్రంగా ఏర్పడిందంటే సంస్కరించబడ్డ మత శాఖలు, దీన్ని తగ్గించలేకపోయాయి. ఉదాహరణకు బ్రహ్మ సమాజం విగ్రహారాధనను తిరస్కరించినా, ఠాగూర్ల కుటుంబం మాత్రం దుర్గాదేవిని ప్రతి సంవత్సరం గొప్ప ఉత్సాహంతో పూజించేవారు. అదే విధంగా పుట్టుకను బట్టి హిందువులను వర్గీకరించడాన్ని ఆర్య సమాజం ఖండించింది. కాని తమ కులం వెలుపల ఉన్న వారిలో వివాహ సంబంధాన్ని పెట్టుకునేందుకు బహు కొద్ది మంది ఆర్య సమాజీకులు సాహసించగల్గారు. ఈ పరిస్థితి నైతికంగా అనారోగ్యకరమైయింది. ఎందుకంటే నైతిక ప్రమాణాల్లో ఒకటి ఇంటికి మరొకటి ప్రజల కొరకనే వైరుధ్యాన్ని పెంచింది.

**4.5.3.5. ఐక్య లౌకిక ప్రయోజనాల పరిణామం మందగించడం :** సాంస్కృతిక, మత పరమైన జీవన కొనసాగింపు, ఉద్దేశ పూర్వక భారతదేశ చరిత్ర పఠనం, అప్పటి వర్తమానంలో అసంతృప్తి, నాటి సంస్కరణ ప్రతి సంస్కరణ వాదులను గతాన్ని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ఆశించేందుకు బలవంతపరచాయి. ఫలితంగా, చారిత్రక ఆలోచనా ముసుగులో మత ధోరణి లేదా ఆవేశం, చోటుచేసుకోసాగింది. ఆర్థిక కార్యకలాపాల్లో సహకారావకాశాల లేమి, రాజకీయాలు, వాటి రాజీధోరణుల నుండి పూర్తిగా వైదొలగటం, ప్రత్యేకించి గ్రామ ప్రాంతాల్లోని సామాజిక వర్గాల మధ్యయుగ ఏకాంతత్వం కొనసాగింపు కారణంగా, ఇరు మతాల ప్రజలను ఒకటిగా సంధించగల ఐక్య లౌకిక ప్రయోజనాల పరిణామం మందగించింది. అయితే, గమనించదగిన విషయమేమంటే, మత శక్తులు ప్రబలంగా ఉన్నప్పటికీ 19వ శతాబ్ది ద్వితీయార్థమంతా జాతీయవాదం పెరగసాగింది.

## 4.5.4. సంస్కరణోద్యమాల స్వభావం

19వ శతాబ్దంలో భారతదేశంలోని సంస్కర్తలు అనేక విషయాల్లో భిన్న దృక్పధాలతో ఉన్నా ఆధ్యాత్మిక పరంగా మాత్రం వారు ఒకే అభిప్రాయానికి కట్టుబడి ఉండేవారు. ఆనాటి సామాజిక, మతపరమైన ఉద్యమాలన్నీ మతంపైనే ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించారు. అప్పటికి లౌకిక వాదం ఒక స్థిర రూపం దాల్చలేదు. దీన్ని గురించి ఈశ్వర చంద్ర విద్యాసాగర్ లాంటి వారు మాత్రమే ప్రస్తావించేవారు. సంస్కరణోద్యమంలో భాగంగా తలెత్తిన నాయకులు ఆధ్యాత్మిక నాయకులుగా పేరు గాంచారు. హిందూ మత పునరుద్ధరణకు కృషి చేసిన స్వామి వివేకానందుడు, దయానంద సరస్వతి లాంటి వారు ప్రధానంగా రాజకీయాలకు దూరంగా ఉండేవారు. బాల గంగాధర తిలక్, రానడే, బంకించంద్ర చటర్జీ వంటి కొంత మంది నాయకులు మాత్రమే ఆంగ్ల పాలనను వ్యతిరేకించి వారిని దేశం నుంచి వెళ్ళగొట్టాలని పేర్కొనేవారు. ఇతర నాయకులు అనేక మంది ఆంగ్ల విధానాన్ని అనుసరించి దాని ఉదారతను విశ్వసించేవారు. ఈ సంస్కరణ వాదులు సాంప్రదాయికమైన ఆర్థికాభిప్రాయాలకూ, విధానాలకూ ప్రాధాన్యమిచ్చేవారు తప్ప అతివాద, ఆర్థిక విధానాలకు సంబంధించిన ఆలోచనలు వారికి వచ్చేవి కావు. అయితే ఈ నాయకులందరూ సాంఘిక న్యాయం అన్న భావన వల్ల ప్రభావితులయ్యారు. సంస్కరణోద్యమాన్ని నిర్వహించడంలో వివిధ సంస్కర్తల, నాయకుల దృక్పధంలో, పద్ధతుల్లో బేధం గలదు. రాజారామమోహనరాయ్ సంప్రదాయ హిందూ సమాజ ప్రవాహం నుంచి పక్కకు తొలిగాడు. హిందూ సమాజంలో క్రమ క్రమంగా సంస్కరణలు తీసుకురావాలనీ, ఈ క్రమంలో కొన్ని సర్దుబాట్లు తప్పవనీ రానడే విశ్వసించాడు. దయానంద సరస్వతి వేదాలను అభిమానించి విదేశీ ప్రభావాల పట్ల కఠినమైన వ్యతిరేక ధోరణి ప్రదర్శించాడు. 19వ శతాబ్ది అంతానికి రానడేతో తిలక్ విభేదించాడు. సాంఘిక సంస్కరణ వాదులు రాజకీయ స్వాతంత్ర్యం కోసం కూడా పోరాడాలని తిలక్ భావించాడు. రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సాంఘిక న్యాయానికి దారితీస్తుందనీ తద్వారా సాంఘిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనీ భావించాడు.

## 4.5.5. సంస్కరణోద్యమాలు అణగారి పోవడం :

భారతదేశంలోని సాంఘిక,మత సంస్కరణోద్యమాలు ప్రారంభదశలోని ఉధృతిని 19వ శతాబ్ది అంతానికి కోల్పోయి బలహీనమైపోయాయి. అందుకు పటిష్ఠమైన సంస్థ లేకపోవడమూ ఒక కారణమయింది. భారత సమాజంలోకి ఆధునికతను ప్రవేశపెట్టడానికి సంస్కరణ వాదులు చేస్తున్న ప్రయత్నాలకు సంప్రదాయ వాదులు అడుగడుగునా అడ్డు తగులుతూ వచ్చారు. హిందూ సమాజంలో రాజారామమోహనరాయ్ ప్రవేశపెడుతున్న అభ్యుదయ సంస్కరణలను వ్యతిరేకించడానికి రాధాకాంత దేవ్ 'ధర్మసభ' అనే సంస్థను నిర్వహించడం అందుకు తార్కాణం. సయ్యద్ అహ్మద్ ఖాన్‌పై ముస్లిం సాంప్రదాయ వాదులు 'దియోబంద్' ఉద్యమం పేరుతో తిరుగుబాటు చేశారు. బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం తరువాత సాంఘిక సంస్కరణ వాదులపై రాజకీయ నాయకులు ఆధిపత్యం సంపాదించగలిగారు. ఈ విధానం అనేక దశాబ్దాల పాటు కొనసాగించి తరువాత జాతీయోద్యమం మిగలిన ఉద్యమాలన్నిటినీ వెనుకకు నెట్టివేసి ప్రముఖ స్థానం ఆక్రమించింది. తీవ్రవాద జాతీయవాదం పటిష్టమైన రూపం తీసుకొని సంస్కరణ ఉద్యమాలను చావుదెబ్బకొట్టింది.

సంస్కరణోద్యమాలన్నిటికీ సంస్కర్తలు ఎక్కువగా వలసవాద ప్రభుత్వంపై ఆధారపడి కొనసాగించారు. తమ లక్ష్యాల సాధనకు వీరు తరచుగా ఆంగ్లేయుల సహాయసహకారాలపై ఆధారపడుతూ ఉండేవారు. అంతే కాకుండా సంస్కరణ వాదులకు సామాన్య ప్రజానీకం మద్దతు లేకుండా పోయింది. వారి బోధనలూ, ప్రచారాలూ సాధారణంగా మధ్యతరగతి వారికి మాత్రమే అందుబాటులో ఉండటం, వారికి మాత్రమే అర్థం కావడం దీనికి కారణంగా చెప్పవచ్చు. అంతే కాకుండా ఈ ప్రజానీకం నిరక్షరాస్యతలో, అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతూ సంప్రదాయాలనూ, ఆచారాలను పట్టుకుని వేలాడుతూ ఉండేది. భూస్వామ్య వ్యవస్థ కూడా సంస్కరణల ఉద్యమానికి కొంత వరకు అడ్డుకట్టవేసింది. ఇక వలస ప్రభుత్వ పాలకులలో ఈ సంస్కరణల పట్ల అంత ఆసక్తి, ఉత్సాహం కనిపించలేదు. ఇక అప్పుడప్పుడే పెరుగుతున్న పెట్టుబడిదారీ వర్గం మత విషయాలకు అంత ప్రాధాన్యమివ్వలేదు. ఈ విధంగా సంస్కరణోద్యమాలకు సమాజంలో ఉన్నత వర్గాల నుంచి గానీ, క్రింది స్థాయి వర్గాల నుంచి గానీ ఆదరణ లభించలేదు. దాని ఫలితంగా సంస్కరణోద్యమాలు బలహీనమయి పోవడం మొదలైంది.

## 4.5.6. సారాంశం :

బ్రిటిష్ పాలన ఫలితంగా భారతదేశంలో ఆవిర్భవించిన పెట్టుబడిదారీ వ్యవస్థ ముఖ్య తత్వంగా ఉదారవాదమేర్పడింది. దీని ప్రధాన సూత్రాలు జాతీయత, ప్రజాస్వామ్యం. మత, సామాజిక రంగాలకు ఈ సూత్రాలను విస్తరింపజేయటానికి చేసిన ప్రయత్నాల ఫలితమే 19వ శతాబ్ది మత సంస్కరణోద్యమాలు. వ్యక్తి స్వాతంత్ర్యం నూతన సమాజ ప్రధాన లక్షణమైయింది. దీనికి భిన్నంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ముందు ఉన్న సమాజంలో అధికార నిరంకుశత్వం, పుట్టుక, లింగ భేదాలననుసరించి సామాజిక హోదా లేర్పడడం, వ్యక్తి, కులం, సమిష్టి కుటుంబ వ్యవస్థకు లోబడేటట్లు చేయడం, ప్రధాన లక్షణాలుగా ఉండేవి. నూతన సమాజం దాని అభివృద్ధికి అవసరమైన చర్యగా పుట్టుక, లింగ భేదాలాధారంగా ఏర్పడే ప్రత్యేక హక్కులు, అధికారాలను నిరసించింది. అనాదిగా దేశంలో ప్రచారంలో ఉన్న తమ దృక్పథం, పద్ధతులు వ్యవస్థలకు బ్రిటిష్ పాలన, పాశ్చాత్య విద్యా విధాన కారణంగా నెలకొన్న నూతన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులకు మధ్య ప్రతివాదం ఏర్పడింది. పర్యవసానంగా తొలి మత సంస్కర్తలు వ్యక్తి స్వేచ్ఛా సూత్రాన్ని మత రంగానికి విస్తరింపజేసేందుకు ప్రయత్నించారు. కాబట్టి వాస్తవంగా చూస్తే, ఈ మత సంస్కరణోద్యమాలు నూతన సామాజిక అవసరాలకనుగుణంగా ప్రాచీన మతం, సూత్రాలు, పద్ధతులను సవరించేందుకై వివిధ ప్రమాణాల్లో చేసిన ప్రయత్నాలు మాత్రమే. ఈ మత సంస్కరణోద్యమాల కార్యక్రమం కేవలం మత రంగానికి మాత్రమే పరిమితంగాక సామాజిక సంస్థలు, సంబంధాల పునర్ నిర్మాణానికి కూడా విస్తరించింది.

19 వ శతాబ్దిలో భారతదేశంలో సాగిన సంస్కరణోద్యమాలన్నీ మత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో గాఢ ప్రభావాన్ని ప్రసరింపజేసి, పలు ప్రశస్తమైన, శాశ్వతమైన, ప్రయోజనకరమైన మార్పులను తీసుకురాగలిగాయి. మత పరంగా హిందూ, ఇస్లాం మతాల్లో హేతువాద,ఉదారవాదాలు ప్రవేశించాయి. ఉద్యమాలన్నీ మత సూత్రాలకు తోడు మానవతావాదాన్ని గొప్పగా ప్రబోధించాయి. హిందూ, ముస్లిం సంస్కరణోద్యమాలు రెండు మతాల వారిని రెండు అఖిల భారతీయ జన సందోహాలుగా ఐక్యపరిచాయి. కాని 19 వ శతాబ్ది

ద్వితీయార్థంలో ఉత్పన్నమైన మతావేశం, మత చైతన్యం ప్రజలను మత పరమైన మార్గాల్లోకి మళ్ళించి, లౌకిక జాతీయోద్యమ ఊపును బలహీన పరిచింది. రెండింటిలో కూడా ఉదారవాద, సాంప్రదాయిక భావాలు వ్యాపించాయి. సంస్కరణోద్యమాల ప్రభావం విద్యావంతులైన కొంతమంది భారతీయులకే పరిమితమైంది. మిగిలిన వారందరూ పురాతన పద్ధతుల్లోనే జీవించసాగారు. సాంస్కృతిక పునరుజ్జీవన జనితాలైన వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక సమానత్వం, స్త్రీ, పురుష సమానత్వం అనే సూత్రాలు ఈ సామాజిక పోరాటాల ముఖ్య ప్రాతిపదికలుగా నిలిచాయి. హైందవ సమాజంలో బాగా ప్రబలిన అంటరానితనమనే సాంఘిక దురాచార నిర్మూలనకై సంస్కర్తలు ఉద్యమాలు నిర్వహించారు. ఫలితంగా అణగారిన వర్గాల్లో కూడా చైతన్యం ఏర్పడింది. విద్యావ్యాప్తి వీరిలో జ్యోతిబాపూలే, అంబేద్కర్ లాంటి మేధావులను తీసుకొచ్చింది. శతాబ్దాల తరబడి సామాజిక అణచివేతకు, అసమానతలకు గురి అవుతున్న భారతీయ మహిళలను వాటి నుండి విముక్తి పరచేందుకై 19 వ శతాబ్దిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడమైంది. ఫలితంగా వీరిలో గొప్ప కనువిప్పు కలిగింది. అధిక సంఖ్యలో తొలిసారిగా స్త్రీలు రాజకీయాలలో పాల్గొనడం జరిగింది.

మత సంస్కర్తలంతా ఒక ప్రాంతాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకోకుండా, భారతీయులందరిని మనస్సులో పెట్టుకొని ఈ ఉద్యమాలను నడిపారు. కేసవ చంద్రసేన్, వివేకానందుడు, అనీబిసెంట్ వంటి వారు దేశమంతా పర్యటించి, ఉపన్యాసాలిచ్చి ప్రజలలో దేశాభిమానాన్ని జాతీయాభిమాన్ని వృద్ధి చేశారు. భారతీయులంతా ఒక్కరే. కుల, మత, వర్ణ, వర్గ, లింగ బేధాలు, ధనికులు,పేదలు అనే తారతమ్యాలను, అస్పృశ్యులు, అంటరాని వారు అనే భావాలకు తావులేకుండా ప్రజలంతా ఒకే జాతివారనీ, భారత సంస్కృతి అంతా ఒక్కటే అని ప్రబోధించడంతో ప్రజల్లో నూతన చైతన్యం కల్గింది. భారత ప్రాచీన సంస్కృతి, ఆధ్యాత్మికతత్వం అన్నిటికన్నా ఉత్తమమైందనే నమ్మకం వివేకానందుడు కలిగించాడు. ఈ నమ్మకమే ప్రజలలో జాతీయాభివృద్ధికి దారితీసింది. దేశం సర్వతోముఖాభివృద్ధి కావాలంటే, ఆ బాధ్యత ప్రజలది అని ప్రజలు తెలుసుకొన్నారు. ఈ మతోద్యమమే గాంధీ నాయకత్వంలో కొత్త రూపం దాల్చి, ప్రజలతో అంతం లేని త్యాగాలను చేయించింది. ప్రజలు ఏక దృష్టితో పోరాడి విజయాన్ని సాధించారు. అందుకే ఈ మత సంస్కరణోద్యమాలు భారత స్వాతంత్రోద్యమానికి నాంది అని చెప్పవచ్చు.

## 4.5.7. నమూనా ప్రశ్నలు :

1. సంస్కరణోద్యమాలు - అనుకూల అంశాలను వివరించండి
2. సంస్కరణోద్యమాలు - ప్రతికూల అంశాలను వివరించండి.

## 4.5.8. చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | K.K. Datta | : | A Social History of Modern India |
| 2. | K.K. Datta | : | Renaissance, Nationalism and Social Charge in Modern India |
| 3. | Bipin Chandra | : | Nationalism and Colonialism in Modern Indian. |
| 4. | Tapan Raychaudhuri and | : | The Cambridge Economic History of Indian Vols. 2 irfan Habib |
| 5. | Sumit Sarkar | : | Modern Indian 1885-1947 |
| 6. | R. Plame Dutt | : | Indian Today |
| 7. | R.C. Majumdar | : | History of Freedom Movement in Indian, 3 Vols. |
| 8. | R.C. Majumdar and others (Ed.) | : | The History and Culture of Indian People Vols. IX and X |
| 9. | B.N. Chopra, B.N. Puri and M.N. Das | : | A Social, Cultural and Economic History of India, 3 Vols |
| 10. | Tarachand | : | History of Freedom Movement in India, 4 Vols. |
| 11. | S.C. Roychaudhuri | : | Social, Cultural and Economic Hisoty of India, Vol. 3 Modern India. |


**ఆచార్య వై. కుమార స్వామి.**

**యూనిట్ - 5**

**పాఠం - 1**

# జాతీయత – దాని లక్షణాలు – అభివృద్ధి

# (Nationalism in India and Its Characteristics)

## 1.0 లక్ష్యం :

జాతీయత లక్షణాలు, భారతదేశంలో జాతీయత ఆవిర్భావం, విస్తరణ, జాతీయాభివృద్ధికి దోహదం చేసిన అంశాలు, బ్రిటిష్ వారు అనుసరించిన విభజించి పాలించు విధానం గురించి వివరించటమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


**1.1** ఉపోద్ఘాతము

**1.2** జాతీయతా లక్షణాలు

**1.3** జాతీయత ఆవిర్భావం, విస్తరణ

**1.4** జాతీయాభివృద్ధికి దోహదం చేసిన అంశాలు

- **1.4.1.** ఆంగ్ల విద్య
- **1.4.2.** బ్రిటిష్ సామ్రాజ్య వాదం
- **1.4.3.** మధ్యతరగతి ప్రజల పాత్ర
- **1.4.4.** ఆంగ్ల పాలనా విధానం
- **1.4.5.** ప్రయాణ సౌకర్యాలు
- **1.4.6.** పాశ్చాత్య విజ్ఞానం
- **1.4.7.** విదేశీ ఉద్యమాలు
- **1.4.8.** సాహిత్యం, పత్రికలు
- **1.4.9.** రాజకీయ సంఘాలు
- **1.4.10.** పునరుజ్జీవనం
- **1.4.11.** జాతి విచక్షణ
- **1.4.12.** బ్రిటిష్ పాలకుల విధానాలు
- **1.4.13.** ఇల్బర్ట్ బిల్లు
- **1.4.14.** భారతదేశ గతం పునరావిష్కరణ

**1.5.** విభజించి పాలించు విధానం

**1.6.** ముగింపు

**1.7.** నమూనా ప్రశ్నలు

**1.8.** చదువదగిన గ్రంథాలు

## 1.1 ఉపోద్ఘాతము

తమలో తమకు సాంఘికంగాను, ఆర్థికంగాను ఎన్ని భేదాలున్నా రాజకీయంగా తామందరూ ఒకటేనని ఇతరులు వేరనీ భావించే మానవుల సముదాయానికి 'జాతి' అనే అటువంటి భావానికి 'జాతీయత' అని పేర్లు. ఒక్కొక్క జాతికి ఒక సర్వసామ్యం గల ప్రత్యేక రాజ్యం ఉండవలెననీ జాతి హద్దులు, రాజ్యం హద్దులు ఏకం కావలెననీ నేటి రాజకీయ సిద్ధాంతము. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి 18,19 శతాబ్దాలలో ఐరోపా ఖండంలోను, 19, 20 శతాబ్దాలలో ఆసియా, ఆఫ్రికా ఖండాలలోను అనేక దేశాల వారు తమ దేశాలలోని పరాయి ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసి జాతీయ రాజ్యాలను స్థాపించుకొన్నారు. ఇదే కారణంగా భారతదేశంలోని భారతీయులంతా రెండు శతాబ్దాల కాలం ఆంగ్ల ప్రభుత్వానికి లోబడి అనేక కష్టాలకు గురి అయి జాతీయోద్యమాన్ని లేవదీసి స్వాతంత్ర్యం సంపాదించుకొన్నారు. ఆసియా ఖండంలో ప్రధమంగా స్వాతంత్ర్యం సంపాదించిన దేశము భారతదేశము. ఇదే మిగతా దేశాలకు మార్గదర్శి అని చెప్పవచ్చు.

స్వాతంత్ర్యం కోసం భారతదేశము పోరాడటం ఇది తొలిసారి కాదు. అనేక సార్లు విదేశీయులు దండయాత్రలు చేయడం, వారి ప్రభుత్వాలను భారతదేశంలో స్థాపించినా తిరిగి భారతీయులు వారిని ఓడించి స్వంత ప్రభుత్వాలను స్థాపించుకోవడం జరిగింది. చంద్రగుప్త మౌర్యుడు గ్రీకులను పారదోలడం, యశోధర్ముడు హూణులను వెళ్ళగొట్టడం మనకు తెలుసు. చాళుక్యులు, విజయనగర రాజులు, రాజపుత్రులు, మహారాష్ట్రులు, శిక్కులు విదేశాల నుంచి వచ్చి ఆఫ్ఘన్‌లతో, మొగలాయిలతో పోరాడి వారి సామ్రాజ్య వ్యాప్తిని, అధికార విస్తరణను, అరికట్టడానికి ప్రయత్నించారు. అలాగే ఆంగ్లేయులు భారతదేశంలో ప్రభుత్వాన్ని స్థాపించిన తరువాత భారతీయులు పోరాడి తాము కోల్పోయిన స్వాతంత్ర్యాన్ని తిరిగి గెలుచుకున్నారు.

బ్రిటిష్ వారి కంటే పూర్వం వచ్చిన విదేశీయులు భారతదేశంలో ఏదో ఒక భాగాన్ని ఆక్రమించడం, ఆ భాగాన్ని పరిపాలించే రాజు తన పదవిని కోల్పోవడం, తిరిగి అవకాశం దొరికినపుడు వారిపై తిరగబడి తన రాజ్యాన్ని పొందడం జరిగేది. ఈ యుద్ధాలలో రాజులు, వారి సైన్యం మాత్రం పాల్గొనేవి. అనగా పూర్వం స్వాతంత్ర్య సమరాలలో సామాన్య ప్రజలు పాల్గొనక పోవడం ఒక విశేషము. రెండో విశేషమేమిటంటే స్వాతంత్ర్య సమరం ఒక ప్రాంతానికి మాత్రం పరిమితమై ఉండేది, దేశమంతా వ్యాపించేది కాదు. బ్రిటిష్ వారు దేశాన్నంతా ఆక్రమించారు. కాబట్టి దేశంలో అందరూ తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయినారు. అందువల్ల ఒక ప్రాంతం వారే కాక అన్ని ప్రాంతాల వారూ ఏకమై పోరాటం చేసి ఆంగ్లేయులను వెళ్ళగొట్టడం జరిగింది. అంతేగాక ఈ పోరాటంలో సామాన్య ప్రజలు ఎక్కువగా పాల్గొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని అహింసా మార్గంలో ధిక్కరించినారు. అనగా సామాన్య ప్రజలు సంపాదించిన స్వాతంత్ర్యమిది. ఈ పోరాటం వంద సంవత్సరాలకు పైగా సాగింది.

భారతదేశాన్ని ఆక్రమించుకొన్న బ్రిటిష్ వారికి, ఇతర విదేశీయులకు తారతమ్యముంది. బ్రిటిష్ వారికి ముందు వచ్చిన విదేశీయులు రాజ్య కాంక్షతోనే భారతదేశానికి వచ్చారు. వారు క్రమంగా భారతీయులతో కలసిపోయి భారతీయ సంస్కృతికి అలవాటు పడినారు. కాని బ్రిటిష్ వారు వ్యాపారం చేసే ఉద్దేశంతో మాత్రమే భారతదేశానికి వచ్చి వ్యాపారం చేయడమే కాకుండా భారతదేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకొని ధనాన్ని, స్వాతంత్ర్యాన్ని తమ పరం చేసుకొన్నారు. బ్రిటిష్ వారు క్రమంగా తమ సంస్కృతిని, అలవాట్లను భారతదేశంలో ప్రవేశపెట్టి భారతప్రజల దృక్పధాన్ని మార్చి వేయడానికి ప్రయత్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో భారత నాయకులు పత్రికల ద్వారా, తమ సంఘాల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రజలలో జాతీయ చైతన్యం తెచ్చి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించడానికి పూనుకొన్నారు.

## 1.2. జాతీయ లక్షణాలు

అత్యంత ప్రాచీన కాలం నుండి భారతదేశంలో అనేక రాజ్యాలు ఏర్పడి ఉండేవి. క్రీ.పూ. 6 వ శతాబ్దిలో షోడశ మహాజన పదాలుండేవి. అప్పుడప్పుడు కొంత కాలం పాటు గొప్ప సామ్రాజ్యాలు స్థాపించబడినా, అవి ఎక్కువ కాలం నిలబడలేదు. ఏదైనా ఒక సామ్రాజ్యం విచ్ఛిన్నం కాగానే దాని స్థానే అనేక చిన్నరాజ్యాలు ఏర్పడేవి. సామాన్య ప్రజలు దేశ రాజకీయాల పట్ల ఉదాశీనులుగా ఉండేవారు. ఈ ఉదాశీనతే వారిలో జాతీయ భావాన్ని లోపింపజేసింది. ఇటువంటి పరిస్థితి కీ.శ. 18వ శతాబ్ది వరకు సాగింది. తమ మధ్య ఎన్ని భేదాలున్నా

తామంతా ఒకే దేశంలో పుట్టి పెరిగిన కారణంగా ఒక మాతృ దేశ సంతానమని భావించి తామందరు కలసి మెలసి ప్రవర్తించాలనే భావం వారిలో కలిగినపుడు వారు ఒక జాతిగా పరిగణించబడతారు. దేశమంతా తమదని దానిని వశపరచుకొని పరిపాలించే హక్కు ఇతర దేశాల వారికి లేదని, ఇతరులు తమ అంగ బలాన్ని, అర్థ బలాన్ని, యుద్ధ విద్యలో నైపుణ్యాన్ని వినియోగించి దేశాన్ని వశపరచుకొన్నపుడు వారి అధికారాన్ని ఏదో విధంగా తొలగించి దేశ స్వాతంత్ర్యాన్ని సంపాదించడమే తమ ప్రధాన కర్తవ్యమని భావించి, ఆ కర్తవ్యాన్ని నిర్వహించడానికి సిద్ధపడి, నిరంతరమైన కృషి చేయడానికి ముందుకు రావడం వారిలో జాతీయత ఉందని భావించడానికి బాహ్య చిహ్నాలు. తమ దేశ స్వాతంత్ర్యానికి పోరాడి దాని పట్ల పట్టుదల చూపినపుడు అలాంటి ప్రజలలో జాతీయ భావం ఉన్నట్లు, వారు ఒక జాతిగా ఏర్పడినట్లు చెప్పవచ్చు. 1857 తిరుగుబాటు తరువాత భారత ప్రజలలో క్రమ క్రమంగా జాతీయ భావం పెరగడం, ఫలితంగా స్వాతంత్ర్య ఉద్యమం సాధ్యం కావడం జరిగింది. ఈ జాతీయ భావం లోపించినంత కాలం బ్రిటిష్ వారు భారతదేశాన్ని జయించడానికి, పరిపాలించడానికి సాధ్యమైంది. కాని జాతీయతా భావం ప్రజలలో పెంపొందడం ప్రారంభం కాగానే బ్రిటిష్‌వారు భారతదేశాన్ని విడిచే పరిస్థితులు ఏర్పడ్డాయి.

## 1.3 జాతీయతా ఆవిర్భావం విస్తరణ :

జాతీయత విశాలమైన పదం. ఇందులో అనేక భావాలు ఇమిడి ఉన్నాయి. ప్రజలలో జాతీయతా భావం పెరగడంతో వారిలో ఐకమత్యం ఏర్పడింది. భారతదేశ ప్రజలలో మత భేదాలు, భాషా భేదాలు, ప్రాంతీయ భేదాలు, వర్ణ భేదాలు లాంటివి ఎన్నో అనాదిగా ఉన్నాయి. కాని, జాతీయ భావం వారిలో పెంపొందుతూ ఉంటే వారిలో పైన పేర్కొన్న విభేదాలు తమ ప్రాధాన్యతను కోల్పోవడం మొదలై రాజకీయంగా తామందరం ఒక ప్రజానీకమనే భావం ప్రజలలో ఏర్పడ సాగింది. రాజకీయ విషయాలలో తాము పై విభేదాలను పాటించక సమిష్టిగా ఐకమత్యంగా మెలగడమే మంచిదని ప్రజలు గుర్తించసాగారు. జాతీయతా భావాన్ని ప్రజలలో పెంపొందించే నాయకులు ఒక దేశంలో పుట్టి పెరుగుతున్న ప్రజలందరు ఒకే దేశీయులు, ఒకే తల్లి బిడ్డలని ప్రతిపాదించారు. దేశాన్ని ఉమ్మడి తల్లిగా భావించి కాళి, దుర్గ మొదలైన దేవతల నారాధించినట్లే దేశ మాతను గూడా ఆరాధించాలనే ఆశయాన్ని వర్థిల్ల చేశారు. భారతమాతను దేవతా స్థాయినధిరోహింప చేశారు. బంకిమ్ చంద్ర చటర్జీ వ్రాసిన 'వందేమాతరం' ఈ విషయాన్ని విశదపరిచింది. బాల గంగాధర తిలక్ స్వాతంత్రోద్యమాన్ని సాగిస్తూ 'స్వరాజ్యం మన జన్మహక్కు' అని ఉద్ఘాటిస్తూ, ప్రతి భారతీయుడు దానిని సాధించడం కోసం ఎటువంటి త్యాగం చేయడానికి అయినా వెనుదీయకూడదని, అన్ని ఇక్కట్లను ఓర్పుతో భరించడానికి సిద్ధంగా ఉండాలన్నాడు. ఈ జాతీయ భావమే స్వాతంత్ర్యోద్యమాన్ని అనివార్యంగా చేసింది. పరుల హస్తగతమైన తమ దేశాన్ని తిరిగి తమ వశంలోకి తెచ్చుకొనే ప్రత్నం చేయడం ప్రజల విధి. ఇది జాతీయతకు ముఖ్య లక్ష్యం అని ప్రజలు తెలుసుకోవడం వల్ల, వారికి కనువిప్పు కలిగి భారత స్వాతంత్ర్యోద్యమానికి దారి తీయడం జరిగింది. ఈ విధంగా జాతీయతకు గొప్ప గెలుపు కలిగింది.

జాతీయత అంటే పరాయి పరిపాలన తొలగించడం మాత్రమే కాదు. జాతీయతకు అంతకన్నా ముఖ్య లక్ష్యం ఉంది. అరవింద ఘోష్ ఈ లక్ష్యాన్ని విపులీకరించారు. జాతీయత, భారతీయత అభిన్నాలు. భారతీయత అంటే జీవితానికి సంబంధించిన సకల విషయాలలో భారతీయుడుగా ఉండాలి. పరాయి వారైన బ్రిటిష్ వారి జీవిత విధానాల అనుకరణ మానుకోవాలి. స్వదేశీ విధానాన్ని రూపొందించాలి. గాంధీజీ స్వదేశీ పదాన్ని విపులీకరించారు. విదేశీ వస్తువులను విడిచి భారతదేశంలో తయారైన వస్తువులను వాడాలి. భారతీయులు తమ మతాలను, తమ నాగరికతను, తమ భాషలను, తమ సంస్కృతి, పంచాయితీ వంటి రాజకీయ సంస్థలను అనుసరించాలి. విదేశీయులకు లొంగక తమను తామే పాలించుకోగల ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలి. అప్పుడే జాతీయత సార్థకమవుతుందని ప్రజలు తెలుసుకున్నారు. భారతీయులు విదేశీయులను బహిష్కరించడమే కాదు. తమ సంస్కృతి, నాగరికతలను ఆదరించి గర్వించ దగ్గ పరిస్థితుల్లో ఉండాలి. జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తలు ఈ భావాలను ప్రజలలో పాదు గొలిపారు. స్వామి వివేకానందుడు విదేశాలలో పర్యటించి భారతీయుల గొప్పతనాన్ని చాటాడు. ఈ పర్యటన భారతీయులలో నూతన చైతన్యం కలిగించింది. జాతీయత ప్రజలను కలిపింది. ఒక నిర్మాణ శక్తిగా పనిచేసింది. జాతీయత భారతీయ ప్రజలపై గొప్పగా ప్రభావితమై భారత స్వాతంత్ర్యోద్యమం కొత్త దారులు, కొత్త పరుగులు పెట్టడానికి దోహదమైంది.

ప్రాచీన, మధ్యయుగాలలో భారతదేశాన్ని విదేశీ పరిపాలన నుంచి విముక్తి కలిగించడానికి రాజులు, సైనికులు పోరాటం సాగించారు. ఇందులో సామాన్య ప్రజలకు ఎటువంటి పాత్ర లేదు. దేశ రక్షణ బాధ్యత తమదని ప్రజలెన్నడూ భావించలేదు. రక్షణ ఇవ్వడం ప్రభుత్వ ధర్మం కాబట్టి ప్రభుత్వం, పాలకులే రక్షణ బాధ్యత స్వీకరించాలని ప్రజలు భావించారు. ప్రజలు పూర్తిగా బాధ్యతా రహితులై మెలుగుతుండేవారు. కాని, ఆధునిక యుగంలో జాతీయతా భావం ప్రభావం వల్ల ఆంగ్లేయులపై పోరాటం జరిపిన వారు సైనికులు, పాలకులు కాక అన్ని వర్గాల ప్రజలు, అన్ని తరగతులు వారు, రైతులు, కార్మికులు, స్త్రీలు, పురుషులు, విద్యాధికులు, గొప్ప వారు, పేద వారు పాల్గొన్నారు. ప్రజలంతా ఏకమై, విదేశీయులైన ఆంగ్లేయులపై తిరగబడి, విజయం సాధించి స్వతంత్ర భారతాన్ని ఏర్పరచుకోవడమే గాక, ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించారు. ఈ కొత్త జాతీయ రాజ్యంలో పూర్వం లాగా రాజులు లేరు. ప్రజలే దేశం, దేశమే ప్రజలు ఇదే ఉద్యమ స్వరూపం ప్రత్యేకత.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమానికి మరొక ప్రత్యేకత ఉంది. ఇది జాతీయోద్యమం. ఇందులో మతానికి, భాషకు, ప్రాంతానికి సంబంధం లేదు. ఇది యావత్ భారతదేశ ఉద్యమం. ప్రజలందరిలో ప్రాంతీయ భావం పోయి, మనమందరం భారతీయులం అనే జాతీయ భావం జనించింది. హైదరాబాద్, తిరువాన్కూరు, భోపాల్ సంస్థానాలు, దక్షిణంలో ద్రావిడులు, పంజాబ్‌లో సిక్కులు స్వతంత్ర్య రాజ్యాలుగా ఉండాలని మొదట కోరినా, 20వ శతాబ్దం ఆరంభం నుండి ప్రాంతీయ అభిమానం కన్నా జాతీయ భావం అధికం కావడంతో భారత జాతీయోద్యమం ప్రజల ఉద్యమంగానే కాకుండా యావత్ దేశీయమై జాతీయోద్యమంగా రూపొంది, దేశం విచ్ఛిన్నం కాకుండా కాపాడింది. అయితే ముస్లింలలో కొంత మందికి ఈ జాతీయ భావం లోపించినందు వల్ల జిన్నా నాయకత్వంలో పాకిస్తాన్ ప్రత్యేక స్వతంత్ర్య రాజ్యంగా నెలకొల్పడం జరిగింది. మొత్తం మీద దేశమంతా ఏకమై ఒకే ప్రభుత్వం కిందికి వచ్చింది. పూర్వంలాగ విదేశీ పాలన అంతం కాగానే చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడలేదు. ఒకే రాజ్యం, ఒకే ప్రభుత్వం, ఒకే ప్రజలుగా ఏర్పడినాయి.

ఆధునిక యుగంలో ఐరోపా వారు క్రీ.శ. 18వ శతాబ్ది నాటికి అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకొని వలస రాజ్యాలను ఏర్పరచుకొన్నారు. అందువల్ల ఆ దేశాలన్నీ తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయి విదేశీయులకు బానిసలయ్యారు. అనేక దేశాలలో ప్రజలు రాజకీయ స్వాతంత్ర్యంతో బాటు, ఆర్థిక, సాంఘిక, మత స్వాతంత్ర్యాన్ని కూడా కోల్పోయి ఎన్నో కష్టాలకు లోనయ్యారు. వారందరూ కూడా పరిస్థితులు అనుకూలించగానే స్వతంత్ర్యం కోసం పోరాటం సాగించారు. అటువంటి వారిలో ఉత్తర అమెరికా వారు ఒకరు. వీరు రక్తపాతంతో తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించి నిలబెట్టుకొన్నారు. అలాగే మధ్య అమెరికాలోను, దక్షిణ అమెరికాలోను ప్రజలు తిరగబడి స్పెయిన్ ప్రభుత్వాన్ని పడగొట్టారు. అక్కడి ప్రజలందరు క్రైస్తవ మతస్తులే, అందరూ స్పెయిన్ భాష మాట్లాడేవారు. అయినప్పటికీ ఆ దేశాలలోని స్పెయిను రాజ్యాలు విడిపోయి 20 ప్రత్యేక స్వతంత్ర రాజ్యాలు ఏర్పరచుకొన్నాయి. వారిలో జాతీయ భావం లేకపోవడమే దీనికి కారణం అలాగే ఆగ్నేయ ఐరోపాలోని బాల్కన్ ప్రజలు తురుష్కులతో పోరాడి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని స్వతంత్ర్యం సంపాదించుకోగానే ఏకంగా ఉండక నాల్గు స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయారు. వారిలో జాతీయ భావం లోపించడమే దీనికి కారణం. కాని భారతీయులు కుల మత వర్ణ భాషా భేదాలెన్ని ఉన్నా ఏకమై బ్రిటిష్ వారితో పోరాడి స్వాతంత్ర్యం సంపాదించుకొని ఏక రాజ్యాన్ని స్థాపించారు. అందుకు జాతీయ భావమే కారణం.

భారతదేశంలో జరిగిన జాతియోద్యమానికి ఒక విశిష్టత ఉంది. ఈ ఉద్యమం చాలా వరకు అహింసా మార్గంలో నడిచింది. తిలక్, బిపిన్ చంద్రపాల్, లాలాలజపతి రాయ్ మొదలైన అతి వాదులు సైతం స్వరాజ్యం ప్రజల జన్మహక్కు అని ఉద్ఘాటించి దానిని సాధించడానికి అహింసా మార్గమే మేలైన మార్గమని నిర్ణయించారు. ఆ తరువాత ఉద్యమానికి నాయకత్వం వహించిన గాంధీ అహింసావాది. అందువల్ల ఉద్యమం తప్పనిసరిగా అహింసా మార్గంలోనే సాగింది. తన ఉద్యమం ఎప్పుడైనా హింసా మార్గంగా పరిణమించవచ్చునని అనుమానం వస్తే తాత్కాలికంగా ఉద్యమాన్ని నలిపివేసేవాడు. ఈ విధంగా అహింసా మార్గంలో జాతీయోద్యమం నడిపి స్వాతంత్ర్యం సంపాదించిన ఘనత భారతదేశానికి దక్కింది. అపారమైన నౌకా బలం, ఇతర సంపద గల బ్రిటిష్ సామ్రాజ్యంతో అహింసా మార్గంలో జరుపవలసి వచ్చిన పోరాటం అవడం వల్ల ఉద్యమం దీర్ఘకాలం సాగింది.

## 1.4. జాతీయాభివృద్ధికి దోహదం చేసిన అంశాలు :

వర్తకులుగా భారతదేశానికి వచ్చిన బ్రిటిష్ వారు, క్రమంగా దేశ పరిపాలకులయ్యారు, ప్లాసీ యుద్ధ విజయంతో (1757) బ్రిటిష్ వారి పాలన భారతదేశంలో ప్రారంభమైంది. విదేశీ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమమే భారత జాతీయోద్యమము. ఈ ఉద్యమంలో

అధిక భాగం శాంతి యుతంగా సాగింది. ఈ ఉద్యమం అన్ని ప్రాంతాల్లో సాగిన ప్రజా ఉద్యమం. అన్ని మతాల వారు, వర్గాల వారు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. అందువల్ల ఉద్యమ స్ఫూర్తి దేశ ఐక్యతకు తోడ్పడుతుంది. ఈ ఉద్యమం మొదట ఒక చిన్న ఉద్యమంగా ప్రారంభమయి తరువాత ఒక మహా ప్రజా ఉద్యమంగా పరిణమించింది. ప్రజలలో జాతీయ భావం వృద్ధి పొందడానికి చాలా కారణాలున్నాయి.

**1.4.1. ఆంగ్ల విద్య :** జాతీయాభివృద్ధికి దోహదమైన అంశాలలో ప్రప్రథమమైంది ఆంగ్ల విద్య. బ్రిటిష్ వారు భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టినారు. ఈ ఆంగ్ల విద్య ఫలితంగా ప్రజలలో చాలా మంది నూతన హేతువాద, లౌకిక, ప్రజాస్వామిక, జాతీయవాద రాజకీయ దృక్పధాన్ని అలవర్చుకున్నారు. యూరప్ దేశాలలోని సమకాలీన జాతీయోద్యమాల్ని అధ్యయనం చెయ్యసాగారు, అభిమానించారు. వాటి నుండి ఉత్తేజం పొందారు. వాటిని ఆదర్శంగా తీసుకొన్నారు. రూసో, పేస్, జాన్ స్టూవర్ట్ మిల్ మొదలగు పాశ్చాత్య తత్వ వేత్తలు వారికి రాజకీయ గురువులయ్యారు. మాజినీ, గారి బాల్డీ, ఐరిష్ జాతీయోద్యమ నేతలు వారికి రాజకీయ వీర మూర్తులయ్యారు. పరాధీనతలోని పరాభవాన్ని తొలిసారిగా అనుభవించిన వారు ఈ విద్యావంతులే. తమ ఆలోచనా విధానంలో నవ్యతను సంతరించుకొన్నందు వల్ల వారు విదేశీ పాలన యొక్క దుష్పరిణామాల్ని అధ్యయనం చేసే సామర్థ్యాన్ని పొందారు. ఒక నూతన సంపన్న సమైక్య భారతదేశం గురించి కన్న స్వప్నం వారిని ఉత్తేజితుల్ని చేసింది. కాలక్రమంలో వారిలోని అతిరధులు జాతియోద్యమ నిర్వాహకులు, నాయకులయ్యారు.

ఆంగ్ల విద్యా విధానం జాతీయోద్యమాన్ని సృష్టించలేదు. బ్రిటన్, ఇండియా ప్రయోజనాల పరస్పర సంఘర్షణలో జాతీయోద్యమం పుట్టింది. అయితే, భారతీయుల్లో విద్యావంతులు పాశ్చాత్య ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడానికి, తద్వారా జాతీయోద్యమ నాయకత్వాన్ని స్వీకరించానికి దానికి నవీన ప్రజాస్వామిక దృష్టి ప్రసాదించడానికి ఆధునిక విద్యా విధానం తోడ్పడింది. నిజానికి పాఠశాలల్లో, కళాశాలల్లో అధికార్లు విద్యార్థులకు బానిస భావాలు అలవర్చడానికి ప్రయత్నించారు. ఆధునిక భావాలు సార్వత్రిక వ్యాప్తిలో జాతీయోద్యమ భావాలు ఒక భాగం. చైనా, ఇండోనేషియా వంటి ఇతర ఆసియా దేశాలలో ఆఫ్రికా అంతటా నూతన పాఠశాలలు, కళాశాలలు చాలా కొద్దే అయినప్పటికి నూతన, జాతీయ భావాలు వ్యాప్తి చెందాయి. విద్యావంతులైన భారతీయులలో కొత్త చదువులు ఒకానొక పొందికని సృష్టించాయి. సమిష్టి దృష్టి, ఉమ్మడి ప్రయోజనాలు అవగాహన కలిగించాయి. ఈ విషయంలో ఇంగ్లీషు ఒక ముఖ్య పాత్ర నిర్వహించింది. నవీన భావాలు వ్యాప్తి చెందటానికి అది ఒక సాధనమయింది. దేశంలోని వివిధ భాషా ప్రాంతాలకు చెందిన విద్యావంతులు పరస్పరం తమ భావాలు తెలుసుకోడానికి, తమ ఆలోచనలు ఇచ్చి పుచ్చుకోవడానికి అది ఒక మార్గం అయింది. అయితే ఆధునిక విజ్ఞాన వ్యాప్తి కొద్ది మంది పట్టణ వర్గాల వరకే పరిమితమైపోయింది. ఈ వాస్తవాన్ని చాలా మంది రాజకీయ నాయకులు గుర్తించారు. దాదాబాయ్ నౌరోజీ, సయ్యద్ అహ్మద్ ఖాన్, జస్టిస్ రానడే మొదలైన వారు విద్యా వ్యవస్థలో భారతీయ భాషలకు పెద్ద పీట వెయ్యాలని ఆందోళన చేసారు. ఆధునిక విద్యా విధానం దేశమంతటా ఒకే మాదిరి పాఠ్యాంశాలను ప్రవేశపెట్టింది. ఫలితంగా విద్యార్థుల్లో ఒకే రాజకీయ, ఆర్థిక దృక్పధాన్ని కలిగించడం పట్ల మొగ్గుచూపాయి. దీనిలో విద్యావంతులందరిలో ఒకే రకమైన భావాలు అనుభూతులు, ఆశలు, ఆదర్శాలు ఉదయించే అవకాశం ఏర్పడింది.

**1.4.2. బ్రిటిష్ సామ్రాజ్య వాదం :** బ్రిటిష్ ఆధిపత్యం తాలూకు సవాలుని ఎదుర్కొనడానికి ఆధునిక భారత జాతీయ వాదం ప్రాధమికంగా తలెత్తింది. బ్రిటిష్ పాలన సృష్టించిన పరిస్థితులే భారత ప్రజల్లో జాతీయ వాదం వ్యాప్తికి నారు పోశాయి. బ్రిటిష్ పాలన, దాని ప్రత్యక్ష పరోక్ష ఫలితాలు భారతదేశంలో జాతీయోద్యమ సూర్తికి భౌతిక, నైతిక, బౌద్ధిక పరిస్థితులు కల్పించాయి. భారతదేశంలో బ్రిటిష్ పాలకుల ప్రయోజనాలతో భారత ప్రజల ప్రయోజనాలు సంఘర్షణకు తలపడ్డమే దీనికంతటికి కారణం. బ్రిటిష్ వారు తమ ప్రయోజనాల కోసం ఈ దేశాన్ని జయించారు. ఆ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని దేశాన్ని పాలించారు. భారత ప్రజల శ్రేయస్సుని బ్రిటిష్ ప్రయోజనాల కోసం బలి పెట్టారు. లాంక్ షైర్ పారిశ్రామికుల లాభాల కోసం బ్రిటన్‌లో ప్రాబల్యం వహించిన ఇతర శక్తుల ప్రయోజనాల కోసం తమ సంక్షేమాన్ని బలిపెడుతున్నారనే వాస్తవాన్ని భారతీయులు క్రమేణా గ్రహించారు. విదేశీ పాలన దుష్పరిణామాలను గుర్తించటం ప్రారంభించారు. భారత ప్రభుత్వ విధానాలను విదేశీ శక్తులకు బదులు భారతీయులే గనుక నడిపివుంటే ఈ చెడు జరగకుండా ఉండేదని అనేక మంది భారతీయ మేధావులకు తట్టింది. భారతదేశపు ఆర్థిక హీన స్థితికి బ్రిటిష్ పాలన ప్రధాన కారణం అనే వాస్తవం భారత జాతీయోద్యమానికి పునాది. ఈ దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, వివేకవంతంగా, రాజకీయంగా పురోభివృద్ధి కానివ్వకుండా

బ్రిటిష్ పాలన అడ్డుగోడుగా నిలచింది. ఈ వాస్తవాన్ని భారత ప్రజల్లో చాలా మంది ఇతోధికంగా అవగాహన చేసుకొన్నారు. భారత సమాజంలో ప్రతి వర్గం, ప్రతి తరగతి తమ ప్రయోజనాలు విదేశీ పాలకుల చేతుల్లో చితికి పోతున్నాయని క్రమంగా గుర్తించింది. ప్రభుత్వం భూమి శిస్తు రూపేణా తను పండించిన పంటలో అధిక భాగం గుంజుకుంటున్నదని రైతుకు అర్థమయింది. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగానికి మూల స్తంభాలైన పోలీసులు, కోర్టులు, అధికార్లు రైతాంగాన్ని పీడించుకుతినే వారి పక్షాన వున్నారని రైతు గుర్తించాడు. చేతివృత్తి కార్మికులు ఈ ప్రభుత్వం తమని నాశనం చెయ్యడానికి విదేశీ పోటీకి మద్దతు ఇచ్చిందని అర్థం చేసుకున్నారు. తమకు పునరావాసం కల్పించడానికి ఏమీ చెయ్యలేదని గ్రహించారు.

కర్మాగారాల్లో, గనుల్లో, తోటల్లో పనిచేసే కార్మికులు ఈ ప్రభుత్వ పెట్టుబడిదారీ అనుకూల స్వభావాన్ని గుర్తించారు. ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారులతో చేతులు కలిపిన వైనం అర్థం చేసుకొన్నారు. తమ పరిస్థితి మెరుగుపరచుకోవడానికి కార్మికులు ప్రయత్నించినా ప్రభుత్వ యంత్రాంగం తమకు వ్యతిరేకంగా తమపైన విరుచుకుపడుతున్నదని గమనించారు. పెరిగిపోయే నిరుద్యోగాన్ని అరికట్టాలంటే సత్వర పారిశ్రామికీకరణ జరగాలనీ, అది స్వతంత్ర ప్రభుత్వ పాలనలో గాని సాధ్యం కాదనీ కార్మిక వర్గానికి కనువిప్పు కలిగింది. జనాభాలో ఎక్కువ భాగానికి ప్రాతినిధ్యం వహించే భారత సమాజంలోని ఈ మూడు వర్గాలు - రైతులు, కార్మికులు, వృత్తి కారులు తమకెటువంటి రాజకీయ హక్కులు, అధికారాలు లేవని గ్రహించారు. తమ మేధో సాంస్కృతిక వికాసానికి బొత్తిగా కృషి జరగటం లేదని గుర్తించారు. విద్య ఇంకా కింది తరగతుల దాకా రాలేదు. గ్రామాల్లో పాఠశాలలు లేవు. ఆచరణలో ఉన్నత విద్యా ద్వారాలు ఈ తరగతుల ప్రజలకి అందుబాటులో లేదు.

ఆధునిక విజ్ఞానాన్ని ఆకళించుకున్న విద్యావంతులు మాతృదేశం యొక్క ఆర్థిక రాజకీయ విషాద పరిస్థితిని అర్థం చేసుకొన్నారు. బ్రిటిష్ పెట్టుబడిదారీ విధానం స్వదేశంలో మాదిరి భారతదేశంలో కూడా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి దోహదపడుతుందని విద్యావంతులు ఆశించారు. కాని దానికి బదులు బ్రిటిష్ పెట్టుబడిదారుల చెప్పుచేతల్లో నడిచే బ్రిటిష్ ఇండియా ప్రభుత్వ విధానాలు భారతదేశంలో ఉత్పత్తి శక్తుల్ని పెరగనివ్వకుండా దేశాన్ని ఆర్థికంగా బడుగుస్థితిలో అణచివుంచుతున్నాయని వారు అర్థం చేసుకొన్నారు. బ్రిటిష్ వారి ఆర్థిక దోపిడి భారతదేశంలో దారిద్ర్యాన్ని పెంచుతుంది. మాతృదేశంలో బ్రిటిష్ పరిపాలన దుష్పరిణామాల్ని విద్యావంతులు సంపూర్ణంగా అవగాహన చేసుకొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ మీద సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞలు సాగినంత కాలం దాన్ని అభివృద్ధి చెయ్యటం అసంభవం, ముఖ్యంగా పారిశ్రామికీకరణ పూర్తిగా అసాధ్యం అని వారు గ్రహించారు.

బ్రిటిష్ వారు భారతదేశాన్ని రాజకీయంగా స్వపరిపాలన దిశలో నడిపిస్తున్నట్లుగా లోగడ ఆడిన నాటకాన్ని ఇప్పుడు కట్టిపెట్టినట్లు అర్థమైంది. తాము భారతదేశాన్ని వదలి వెళ్ళేది లేదని బ్రిటిష్ అధికార్లు, రాజకీయ నాయకులు బహిరంగంగా పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులైన వాక్, పత్రికా, వ్యక్తి స్వాతంత్ర్యాలను ప్రోత్సహించడానికి బదులు వాటి మీద నిర్బంధాలు ఎక్కువ చేశారు. ప్రజాస్వామ్యానికి, స్వపరిపాలనకు భారతీయులు అనర్హులని బ్రిటిష్ అధికార్లు, రచయితలు ఉద్ఘాటించారు. ఉన్నత విద్య, నూతన భావాల వ్యాప్తి పట్ల పాలకులు వ్యతిరేక ధోరణినే కాకుండా శత్రుత్వ వైఖరిని చేపట్టారు. చదువుకొన్న వారు కొద్దిమందే అయినా, ఆ కొద్ది మందికైనా ఉద్యోగాలు దొరకడం కష్టమైపోయింది. ఉద్యోగం దొరికినా మంచి మంచి ఉద్యోగాలన్నీ బ్రిటిష్ వారికి ప్రత్యేకించబడ్డాయి. కాబట్టి విదేశీ పాలన నుంచి విముక్తి పొందితేనే తప్ప తమకు మేలైన ఉద్యోగావకాశాలు రావని విద్యావంతులు గుర్తించారు.

పెరుగుతున్న భారత పెట్టుబడిదారీ వర్గంలో జాతీయ రాజకీయ చైతన్యం చాలా నెమ్మదిగా కలిగింది. సామ్రాజ్యవాదుల చేతుల్లో తాము దెబ్బ తింటున్నామని వారు క్రమేణా గుర్తించారు. ప్రభుత్వం అనుసరించే వాణిజ్య విధానం, టారిఫ్, పన్నులు, రవాణా విధానాలు ఈ వర్గం ప్రగతిని దారుణంగా అడ్డుకొన్నాయి. కొత్తగా పుట్టిన ఈ వర్గానికి ప్రభుత్వం ఎటువంటి సహాయం చెయ్యలేదు. అంతేగాక ప్రభుత్వం భారతదేశానికి అపారమైన వనరులతో వచ్చిన విదేశీ పెట్టుబడిదార్లను ఆదరించింది. విదేశీ పెట్టుబడిదార్ల బలమైన పోటీని భారత పెట్టుబడిదార్లు నిరసించారు. కాబట్టి భారతపెట్టుబడిదార్లు కూడా సామ్రాజ్యవాదానికి తాము స్వతంత్రంగా అభివృద్ధి కావటానికి మధ్య వైరుధ్యం ఉన్నదనే వాస్తవాన్ని గ్రహించారు. భారత వ్యాపార, పరిశ్రమలు శీఘ్రంగా అభివృద్ధి కావాలంటే అందుకు అవసరమైన అనుకూల పరిస్థితుల్ని జాతీయ ప్రభుత్వం మాత్రమే సృష్టించగలదని వారు గుర్తించారు. ఇక జమీందార్లు, భూ స్వాములు, సంస్థానాధీశులలో కొందరు జాతీయోద్యమంలో చేరారు. ఆలోచనాపరుడు, ఆత్మాభిమాని అయిన ప్రతి భారతీయుడు అతడు ఏ వర్గానికి చెందినా బ్రిటిష్

జాత్యదురహంకార, వివక్ష విధానాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. అన్నిటి కన్నా ముఖ్యంగా బ్రిటిష్ పరిపాలన యొక్క విదేశీ స్వభావం జాతీయతా భావాన్ని రేకెత్తించింది. విదేశీ పాలకుల ఆధిపత్యం తప్పనిసరిగా పాలిత ప్రజల హృదయాల్లో దేశభక్తి భావాలను ఉత్తేజ పరిచింది. బ్రిటిష్ సామ్రాజ్య వాదం భారత ప్రజా జీవనం మీద దాని దుష్పరిణామాల సహజ సిద్ధమైన స్వభావం ఫలితంగా భారతదేశంలో ఒక శక్తివంతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం క్రమంగా ఆవిర్భవించి వికసించింది. ఈ ఉద్యమం జాతీయ ఉద్యమం.

**1.4.3. మధ్య తరగతి ప్రజల పాత్ర :** మధ్య తరగతి ప్రజలు తాము రాజకీయంగా ఎట్లా నష్టపోయినామో తెలుసుకోకపోలేదు. వారిలో చాలామంది ఆంగ్ల గ్రంధాలు చదివి ఇంగ్లాండ్‌లోను తదితర దేశాలలోను తిరుగుబాట్లు జరిపి ప్రజాస్వామిక ప్రభుత్వాలను ఎట్లా స్థాపించుకొన్నారో తెలుసుకొన్నారు. స్వాతంత్ర్యం ప్రజల హక్కు, ప్రభుత్వం ప్రజల చేతనే నడపవలె, పరిపాలకులకు, ప్రజలకు అగాధం ఉండరాదు. ఇట్లాంటి సిద్ధాంతాలకు ఇంగ్లాండ్‌లో 19వ శతాబ్దంలో నాయకుల మద్దతు లభించింది. కాని ఆ నాయకులే భారతదేశ విషయంలో ఆ సిద్ధాంతాలను అంగీకరించకపోవడం భారతీయులు గ్రహించారు. ఆంగ్లేయులకు ఈ దేశం అధీన రాజ్యము కనుక బానిసదేశంగా ఉండటం భారతదేశంలోని విద్యాధికులకు కోపకారణమయింది. కాని ఈ విధంగా అర్థం చేసుకోగల సమర్థులు భారతదేశంలో చాలా తక్కువ. కనుక రాజకీయ విప్లవం లేవదీయడానికి ముందు ప్రజలలో రాజకీయ చైతన్యం కల్గించడానికి పూనుకొన్నారు.

**1.4.4. ఆంగ్ల పాలనా విధానం :** బ్రిటిష్ వారు దేశమంతటా ఒకే విధమైన పరిపాలనా వ్యవస్థని ప్రవేశపెట్టి పాలనా పరంగా దేశం మొత్తాన్ని ఒక్కటిగా చేశారు. గ్రామీణ స్థానిక స్వయం సంపూర్ణ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమై పోయి అఖిల భారత స్థాయిలో ఆధునిక వ్యాపార పరిశ్రమలు ప్రారంభం కావటం వల్ల భారత ఆర్థిక జీవనం ఏకరాశి అయింది. వివిధ ప్రాంతాల్లో జీవించే ప్రజల ఆర్థిక గతిలో ఒక అవినాభావ సంబంధం నెలకొన్నది. ఉదాహరణకు దేశంలో ఒక ప్రాంతంలో కరువు, ఆహార కొరత ఏర్పడితే, దాని ప్రభావం దేశంలో అన్ని ప్రాంతాలకు వ్యాపించింది. 19వ శతాబ్దానికి ముందు పరిస్థితి అలాలేదు. బొంబాయిలో ఒక కర్మాగారంలో తయారైన వస్తువులు ఎక్కడో దూరంగా ఉన్న లాహోర్, పెషావర్‌లలో అమ్ముడవుతున్నాయి. మద్రాస్, బొంబాయి, కలకత్తాలలో ఉండే కార్మికులు పెట్టుబడిదార్ల జీవితాలు భారత గ్రామ సీమల్లో జీవించే కోట్లాది రైతుల జీవితాలతో సన్నిహితంగా ముడిపడ్డాయి. ఇవన్నీ కాక రైలు మార్గాలు, తంతి, ఏకీకృతమైన తపాల వ్యవస్థ దేశంలోని వివిధ ప్రాంతాల్ని కలిపాయి. ప్రజల మధ్య పరస్పర సంబంధాలు పెంపొందించాయి. దేశమంతటా ప్రజలు తాము ఉమ్మడి శత్రువైన బ్రిటిష్ వారి చేతుల్లో బాధలు పడుతున్నామని గ్రహించారు. ఈ సామ్రాజ్య వాద వ్యతిరేక భావనే దేశ సమైక్యతకు, ఒక సమిష్టి జాతీయ దృక్పధం ఆవిర్భవించడానికి కారణభూతమైంది.

**1.4.5. ప్రయాణ సౌకర్యాలు :** ఆధునిక రవాణా సౌకర్యాలయిన రైల్వేలు, తంతి, తపాలా జాతీయోద్యమాభివృద్ధికి దోహదం చేశాయి. ఇవి ఒక ప్రాంతం నుండి మరియొక్క ప్రాంతానికి త్వరితగతిని ప్రయాణము చేయడానికి, వివిధ ప్రాంతాల మధ్య ఆర్థిక సాంఘిక రాజకీయ సంబంధాలను ఏర్పరచడానికి దోహదపడి ఐక్యతను పెంపొందించినాయి.

**1.4.6. పాశ్చాత్య విజ్ఞానము :** ఆంగ్ల భాష ద్వారా పాశ్చాత్య విజ్ఞానము వ్యాప్తి చెందుటచే భారతీయులలో జాతీయ భావము పెంపొందినది. పాశ్చాత్య విజ్ఞానము, మూఢ విశ్వాసాల నిర్మూలనకు ఉపకరించింది. పాశ్చాత్య విజ్ఞానము ఆలోచనను ప్రేరేపించి అశక్తులను శక్తిమంతులను చేసింది. బైరన్, షెల్లీ, వర్డ్స్ వర్త్ రచనలు భారతీయులలో స్వేచ్ఛా కాంక్షను వృద్ధి చేసినాయి. స్వేచ్ఛ, సమానత్వము, సౌభ్రాతృత్వ నినాదాలు నూతనోత్సాహాన్ని రేకెత్తించినాయి. ఫలితంగా భారతీయ విద్యావంతులలో స్థైర్యము, ధైర్యము, దేశభక్తి పెరిగి దేశ స్వాతంత్ర్యం గురించి ఆలోచించసాగిరి. ఆధునిక రాజకీయ భావాలైన జాతీయత, దేశభక్తి, రాజకీయ హక్కుల పరిజ్ఞానము సంపాదించినారు. పాశ్చాత్య రాజనీతి సిద్ధాంతము ప్రత్యేకంగా లాక్, స్పెన్సర్, మిల్, మెకాలే, బర్కు రచనల ప్రభావం భారతీయుల రాజకీయ ఆలోచనపై ప్రసరించింది. పాశ్చాత్య విద్య వలన భారతీయులకు ఐరోపా నూతన ప్రపంచాన్ని తెలిసికొనుటకు అవకాశం కలిగింది. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, అమెరికా, గ్రీస్ రాజ్యాల చరిత్రను, అమెరికా, ఫ్రెంచి విప్లవాలను, గ్రీకుల స్వాతంత్ర్య యుద్ధం గురించి భారతీయులు గ్రహించారు. ఫలితంగా భారతీయులలో నూతన విశ్వాసాన్ని నెలకొల్పినాయి. అనాది నుంచి తమకు సంక్రమించిన మత సాంఘిక వ్యవస్థలను సవిమర్శనగా పరిశీలించి అందులోని లోటుపాట్లను కనుగొన్నారు. దానిని ప్రజలకు తెలియజేసి వారిలో వివేక సముచితమైన దృక్పధాన్ని కలిగేటట్లు ఆంగ్ల విద్యను నేర్చిన భారతీయులు ప్రేరేపించారు.

**1.4.7. విదేశీ ఉద్యమాలు :** పాశ్చాత్య విద్యను పఠించిన భారతీయ విద్యావంతులపై అమెరికా, ఫ్రెంచి విప్లవాలు గొప్ప ప్రభావాన్ని చూపాయి. అంతేగాక గ్రీస్, ఇటలీ స్వాతంత్ర్య పోరాటాల ప్రభావం భారతీయులపై ప్రసరించింది. ముఖ్యంగా ఐర్లాండ్ స్వాతంత్ర్య సమరం భారతీయులను గొప్పగా ఆకర్షించింది. పాశ్చాత్య దేశాలలో జరిగిన సంఘటనలు భారత జాతీయోద్యమాభివృద్ధికి తోడ్పడినాయి.

**1.4.8. సాహిత్యము, పత్రికలు :** 19వ శతాబ్దంలో భారతదేశంలో వెలువడిన సాహిత్యం, పత్రికలు కూడా భారతీయులలో జాతీయ భావాలను పెంపొందించాయి. ప్రఖ్యాత బెంగాలీ రచయిత బంకిం చంద్ర చటర్జీ వ్రాసిన 'అనందమఠం' నవల భారతీయులలో స్వాతంత్ర్య స్ఫూర్తిని కలిగించడానికి ప్రముఖపాత్ర వహించింది. ఈ నవలలోని 'వందేమాతర' గేయం ఉద్యమకారులకు జాతీయ గీతమైంది. నాటి రచయితలైన హేమ చంద్ర బెనర్జీ, రమేష్ చంద్రదత్, ద్విజేంద్ర లాల్ రాయ్‌ల గ్రంథాలు ప్రజలలో దేశభక్తి, జాతీయ భావాలను వ్యాప్తి చేయడానికి దోహదం చేసినాయి. ప్రజలలో చైతన్యం కలిగించడానికి పత్రికలు కూడా ముఖ్య పాత్ర వహించాయి. పత్రికలు ప్రభుత్వాన్ని విమర్శించి భారతీయుల అభిప్రాయం వెల్లడి చేసినాయి. ప్రజాస్వామ్యము, స్వయం పాలిత వ్యవస్థ, పారిశ్రామికాభివృద్ధి మొదలైన సిద్ధాంతాలు, వాటి ప్రయోజనాలు ఈ పత్రికల ద్వారా తెలియపరచడమైంది. దేశం నాలుగు మూలల ఉన్న జాతీయ నాయకులు, స్వాతంత్ర్య యోధులు ఎప్పటికప్పుడు ఏమి చేయాలో, ఏ విధానం అవలంభించాలో వాదోపవాదాలు చేసుకోవడానికి పత్రికలు ఎంతో ఉపయోగపడినాయి. ఇటువంటి పత్రికలలో ముఖ్యమైనవి హిందూ పేట్రియాట్, అమృతబజార్ పత్రిక, ఇండియన్ మిర్రర్, బెంగాలీ, సోమ్ ప్రకాశ్, సంజీవిని, రాస్త్ గొఫ్తర్, నేటివ్ ఒపీనియన్, ఇందు ప్రకాశ్, మరాటా, కేసరీ, హిందూ, స్వదేశీ మిత్రన్, ఆంధ్ర ప్రకాశిక, శశిరేఖ, కేరళ పత్రిక, హిందూస్థానీ, అజాద్, ట్రిబ్యూన్, కోహినూర్, ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక మొదలగునవి.

పత్రికలు పరిపాలన విధానాలలోని లోపాలను చూపించి వాటిని తొలగించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని సూచించేవి. సదుపాయాలు లభించడం లేదని, కరువు కాటకాల వల్ల లక్షలాది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ విషయాలేవి అధికారులు పట్టించుకోవడం లేదని, ఉద్యోగులలో లంచగొండితనం పెరిగిపోతుందని, భారతీయులకు ఉన్నత ఉద్యోగాలు లభించడం లేదనీ, ప్రభుత్వం ముస్లీంల పట్ల పక్షపాతం వహిస్తుందనీ పత్రికలు అనేక విమర్శలు చేయడంతో ప్రజలకు ప్రభుత్వంపై అసంతృప్తి, అయిష్టం కలగడమే గాక వారిలో జాతీయాభివృద్ధికి దోహదమిచ్చాయి. జాతి భేదాలు ఆంగ్లేయుల ప్రతి చర్యలో కనిపించేవి. ఆంగ్లేయులు వెళ్ళే విలాస ప్రదేశాలకు, క్లబ్‌లకు భారతీయులు వెళ్ళకూడదు. ఆంగ్ల ప్రయాణీకుల సరసన భారతీయులు రైళ్లలో కూర్చోకూడదు. ఇంకా ఇట్లాంటి విషయాలెన్నో పత్రికల మూలంగా ప్రజలకు తెలియడంతో ప్రజలలో నూతన చైతన్యం, జాతీయ భావము పెంపొందినాయి.

**1.4.9. రాజకీయ సంఘాలు :** ప్రజలలో జాతీయ భావం వ్యాప్తి కావాలంటే వారికి ఒక పటిష్టమైన యంత్రాంగం అవసరమని ప్రజా నాయకులు భావించి వివిధ రాష్ట్రాలలో రాజకీయ సంఘాలను ఏర్పాటు చేశారు. భూస్వామ్య సంఘం, బ్రిటిష్ ఇండియా సంఘము, తూర్పు ఇండియా సంఘము, మద్రాస్ మహా జనసభ, బొంబాయి ప్రెసిడెన్సీ సంఘము, పూనా సార్వజనీక సభ, కలకత్తా భారతీయ సంఘం మొదలైన సంఘాలు ఏర్పడ్డాయి. 1885 లో భారతీయ జాతీయ కాంగ్రెస్ స్థాపన దేశానికంతా ఉమ్మడిగా ఒక రాజకీయ సంస్థ ఏర్పాటయింది. ప్రతి సంవత్సరం కాంగ్రెస్ సమావేశమయినపుడు భారతీయ ప్రజలందరిని ఉద్దేశించి తీర్మానాలు చేసేది. భారతదేశ ప్రజలంతా ఒకే దేశం వారనీ, అందరూ కలసికట్టుగా పనిచేయాలని, సామ్రాజ్య వాదులైన ఆంగ్లేయులు భారతీయులందరికి ఉమ్మడి శత్రువులనీ, ప్రజలు ఐకమత్యంతో మెలగాలనీ కాంగ్రెస్ తీర్మానాలలో చాటేది. ప్రజలకు కావలసింది ప్రజా ప్రతినిధుల ప్రభుత్వం, పౌరసత్వం కానీ బానిసత్వం కాదని కాంగ్రెస్ ప్రజలకు ప్రబోధించి, ఈ ఆశయాలను ప్రజలకు పరిచయం చేసింది. జాతీయాభివృద్ధికి దోహదమిచ్చింది ఈ కాంగ్రెస్.

**1.4.10. పునరుజ్జీవనం :** 19వ శతాబ్దం నుంచి భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం మొదలైంది. ఈ ఉద్యమం చేపట్టిన మత, సాంఘిక సంస్కరణలు జాతీయోద్యమాభివృద్ధికి తోడ్పడ్డాయి. ఆంగ్లేయులు రాజకీయాలలోనే కాకుండా భారత మత సాంఘిక వ్యవస్థలలో కూడా మార్పులు తేవడానికి ప్రయత్నించారు. భారత సంస్కృతికి మారుగా వారి సంస్కృతిని ప్రవేశపెట్టాలని వాంఛించారు. భారత సంఘంలోని మూఢాచారాలైన సతీసహగమనము, బాల్య వివాహము, శిశు హత్య మొదలైన వాటిని నిర్మూలించడానికి శాసనాలు చేసి భారతీయ మతాల కంటే క్రైస్తవ మతము ఉత్తమమైనదని దాని వ్యాప్తి కోసం క్రైస్తవ మత ప్రచారకులను ఇంగ్లండ్ నుంచి భారతదేశానికి పంపి వారి ద్వారా అనేక మంది భారతీయులను ముఖ్యంగా అల్పజాతుల వారిని క్రైస్తవ మతంలోకి మార్చినారు.

ఆంగ్లేయులు భావించినట్లు భారత సంస్కృతి హీనమైనది కాదని సాంఘిక దురలవాట్లను పోగొట్టి తిరగి భారత మతాలను యధా స్థాయికి తీసుకొని రావలెనని మత సంస్కర్తలు పూనుకొన్నారు. వారు ప్రజలకు తమ మతంపైన, సంస్కృతిపైన అభిమానం కలిగేటట్లు చేసి జాతీయ చైతన్యం రేకెత్తించినారు. ఆధునిక యుగానికి అనుగుణంగా భారత మతాన్ని తీర్చి దిద్దిన సాంఘిక సంస్కరణోద్యమాలలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణ మఠం ముఖ్యమైనవి. ఈ సంఘాలు కుల మత వర్ణ విభేదాలు తొలగించి సంఘంలో అందరినీ ఏకం చేయడానికి తోడ్పడినాయి. వీటి ప్రబోధాలు ప్రజలలో నూతన చైతన్యం కలిగించి ఆంగ్లేయులను ద్వేషించేటట్లు చేసినాయి. విదేశీయులు కూడా ఆర్య విజ్ఞాన మత ధర్మాల పట్ల ఆకర్షితులయినారు. వారు భారత గ్రంథాలను తమ భాషలలోకి అనువదించడమే గాక భారత సంస్కృతి గొప్పతనాన్ని నిరూపించినారు. దీనితో భారత జాతీయ వికాసానికి నూతన శోభ కలిగింది.

**1.4.11. జాతి విచక్షణ :** బ్రిటిష్ వారిలో చాలా మంది భారతీయులతో వ్యవహరించిన సందర్భాలలో ప్రదర్శించిన జాతి పరమైన ఆధిక్యతా భావం భారతదేశంలో జాతీయాభిమానం ఎదుగుదలకు ముఖ్య కారణం అయింది. చాలా మంది బ్రిటిష్ వారు విద్యా వంతులైన భారతీయులను బహిరంగంగా అవమానించారు. ఆఖరికి వారి మీద చెయ్యి చేసుకొన్నారు కూడా. ఒక భారతీయునితో ఆంగ్లేయుడు వివాదంలో ఇరుక్కున్నప్పుడల్లా న్యాయం కళ్ళూ, చెవులూ మూసుకుంది. ఇది జాత్యహంకారం తరచూ ధరించిన జుగుప్సాకరమైన రూపం. ఇంగ్లీష్‌వాడు భారతీయున్ని కొట్టి చంపి కూడా తేలిక శిక్షతో, స్వల్ప జరిమానాతో తప్పించుకున్న అనేక సంఘటనలను సందర్భాలను భారతీయ పత్రికలు తరచు ప్రకటించాయి. న్యాయ మూర్తులు, న్యాయ నిర్వహణాధికార్ల పక్షపాత బుద్ధివల్ల మాత్రమే కాకుండా, అంతకన్నా ఎక్కువగా జాత్యభిమానం వల్ల న్యాయం జరగలేదు. కుల, మత, వర్గ, ప్రాంత విచక్షణ లేకుండా భారతీయులందర్నీ ఈ బ్రిటిష్ జాత్యహంకారం అధమాలని ముద్ర వేసింది. ఇంగ్లీష్ వారికి మాత్రమే ప్రత్యేకితమైన క్లబ్బుల్లో భారతీయులకు ప్రవేశార్హతలేదు. రైల్లలో యూరోపియన్ ప్రయాణీకులతో పాటు ఒకే పెట్టెలో భారతీయులు ప్రయాణించడానికి వీలు లేదు. జాతికి జరిగిన పరాభవంగా భారతీయులు వీటిని పరిగణించారు. ఇంగ్లీషు వారి ముందు భారతీయులు తామంతా ఒక్కటే అని భావించడానికి ఇది దారి తీసింది.

**1.4.12. బ్రిటిష్ పాలకుల విధానాలు :** కొంత మంది బ్రిటిష్ పరిపాలకుల భారత వ్యతిరేక ఆలోచనలు, విధానాలు కూడా దేశ ప్రజల్లో జాతీయ దృక్పధాన్ని కలగజేశాయి. డల్హౌసీ, కర్జన్, లిట్టన్ తదితర బ్రిటిష్ అధికారులు భారతీయులను కించపరిచే అనేక ప్రసంగాలు చేయటమే గాక, భారత ప్రజలను రెచ్చగొట్టే విధానాలను కూడా అమలుపరిచారు. అందువల్ల దేశంలో జాతీయతా భావం పెంపొందడానికి వారు కారకులని చెప్పవచ్చు. 1876 నుంచి 1880 వరకు వైస్రాయిగా వ్యవహరించిన లిట్టన్ విధానాలు, ప్రజా వ్యతిరేకమైన కారణంగా ప్రజలలో తీవ్ర సంచలనం కలిగించాయి. దేశంలో క్షామం సంభవిస్తుండగా, ఆయన ఢిల్లీలో దర్బార్ నిర్వహించటం, ఆయన చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనం. రెండో ఆఫ్ఘన్ యుద్ధానికి దేశ ఖజానా నుంచి 30 కోట్ల రూపాయలు వ్యయం చేయటం, విదేశీపాలన పట్ల ప్రజల వ్యతిరేక భావాన్ని పెంచింది. దేశ భాషా పత్రికలపై ఆయన విధించిన ఆంక్షలు పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించాయి. భారతీయులు ఆయుధాలు ధరించరాదనే ఆయన ఆంక్ష విమర్శకు గురి అయింది. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక కాకూడదనే ఉద్దేశంతోనే సివిల్ సర్వీస్ పరీక్ష వయో పరిమితిని 21 నుంచి 19 సంవత్సరాలకు తగ్గించాడు. ఈ చర్య కూడా భారతీయుల్లో ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకతను పెంచి జాతీయత పెంపొందడానికి తోడ్పడింది.

**1.4.13. ఇల్బర్ట్ బిల్లు :** లార్డ్ లిట్టన్ లోలోపల దహించే అసంతృప్తికి కారకుడయితే, ఇల్బర్ట్ బిల్లుకు సంబంధించిన వివాదం ఆ ఆసంతృప్తిని మండించే అగ్నికణం అయింది. లిట్టన్ తరవాత వైస్రాయిగా వచ్చిన వార్డ్ రిప్పన్ 1883లో ఒక శాసనాన్ని ఆమోదింపజేయడానికి ప్రయత్నించాడు. రిప్పన్ కాలం వరకు న్యాయ పరిపాలనా రంగంలో జాతి విచక్షణా విధానం కొనసాగింది. అప్పటికే ఆంగ్ల విద్య నభ్యసించిన భారతీయులెందరో, న్యాయ శాస్త్ర పట్టాలు పుచ్చుకొని న్యాయాధికారులయ్యారు. బ్రిటిష్ న్యాయమూర్తులు తమ పరిధిలో ఎవరికైనా ఎటువంటి కేసునైనా విచారించి నేరస్తులను శిక్షించే అధికారం కలిగి ఉండేవారు. కానీ భారత న్యాయ మూర్తులకు భారత నేరస్తులు మినహా, బ్రిటిష్ నేరస్తులను విచారించడానికి గానీ, శిక్షంచడానికి కానీ అధికారం ఉండేది కాదు. న్యాయ వ్యవస్థలోని ఈ లోపాన్ని గుర్తించిన రిప్పన్, దాని తొలగింపుకు ప్రయత్నించి, తన న్యాయ విషయాల సలహాదారు ఇల్బర్ట్‌తో సంప్రదించి న్యాయ పాలనలో తేడాలు తొలగించడానికి, ఇల్బర్ట్ బిల్లును ప్రవేశపెట్టినాడు. దీనివల్ల భారత న్యాయాధీశులకు బ్రిటిష్ వారితో సమానంగా భారత, ఆంగ్ల నేరస్తులను

విచారించి శిక్షించే అవకాశం కలిగింది. ఆంగ్లేయులతో భారతీయులను సమానం చేసిన ఇల్బర్ట్ బిల్లును ఆంగ్లేయులు వ్యతిరేకించి, సంఘటితంగా పోరాడి బిల్లును ఉపసంహరించేటట్లు చేయగలిగారు. ఇల్బర్ట్ బిల్లును వ్యతిరేకించి ఆంగ్లేయులు విజయాన్ని సాధించిన విధానం, భారతీయులకు కనువిప్పు కలిగించింది. సంఘటితంగా, ఐక్యతతో, జాతీయతా భావంతో ఉద్యమం జరపవలసిన ఆవశ్యకతను భారతీయులు గుర్తించారు.

**1.4.14. భారతదేశ గతం పునరావిష్కరణ :** చాలా మంది భారతీయులు స్వపరిపాలనా సామర్థ్యంలో విశ్వాసం కోల్పోయేటంతగా కుంగి పోయారు. ఇదే సమయంలో బ్రిటిష్ అధికార్లు, సమకాలీన రచయితలు పనిగట్టుకొని భారతీయుల అసమర్థతని పదే పదే ప్రచారం చేశారు. గతంలో భారత ప్రజలు తమని తాము ఎన్నడూ పరిపాలించుకోలేదని, హిందూ ముస్లింలు పరస్పరం ఎప్పుడు సంఘర్షించుకొంటారని, పరాయి వారిచేత పరిపాలించబడడం భారతదేశానికి రాసి పెట్టి వుందని, భారతీయుల మతం, సామాజిక జీవనం వారిని ప్రజాస్వామ్యానికి ఆఖరికి స్వపరిపాలనకు కూడా పనికి రాకుండా చేసినంతటి అధమాధమమైనవని, అనాగరికమైనవని బ్రిటిష్ అధికారులు, రచయితలు పేర్కొనసాగారు. చాలా మంది నాయకులు ఈ ప్రచారానికి విరుగుడుగా ప్రజల్లో ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానం పురికొల్పడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో భాగంగా వారు భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని సగర్వంగా చాటారు. ఆశోకుడు, చంద్రగుప్త విక్రమాదిత్యుడు, అక్బర్ వంటి భారత సామ్రాట్టుల రాజకీయ విజయాలను విమర్శకులకు గుర్తు చేశారు. కళలు, శిల్పం, సాహిత్యం, తత్వ శాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, రాజకీయాల్లో భారత జాతీయ వారసత్వాన్ని పునరావిష్కరించడానికి ఐరోపా, భారతీయ పండితులు ఉభయలు జరిపిన కృషి వారికి తోడ్పాటు, ప్రోత్సాహం ఇచ్చాయి. కాని దురదృష్టవశాత్తు జాతీయవాదుల్లో కొందరు 'అతి'గా పోయి భారత గత వైభవాన్ని ఆకాశానికెత్తారు. విమర్శనా దృష్టి లేకుండా ప్రాచీన భారత సమాజంలోని బలహీనతల్ని, వెనుకబాటు తనాన్ని విస్మరించారు. కేవలం ప్రాచీన భారతీయ వారసత్వం మీద మాత్రమే దృష్టి నిలిపి మధ్యయుగంలో ప్రాచీన భారత విజయాలకు తీసిపోని ఘన విజయాల్ని నిర్లక్ష్యం చేయటం వల్ల గొప్ప హాని జరిగింది. ఆ ధోరణి హిందువుల మనస్సులో స్వమత అభిమానాన్ని ప్రోత్సహించింది. ముస్లింలలో దానికి వ్యతిరేకమైన వైఖరి ప్రబలింది. వారు చారిత్రక, సాంస్కృతిక ఉత్తేజం కోసం అరబ్బుల, టర్కుల చరిత్ర పుటల్ని తిరగవేశారు.

## 1.5. విభజించి పాలించు విధానం :

1857 తిరుగుబాటుకు ముందు బ్రిటిష్ వారు తమ ప్రయోజనానికి అనుగుణంగా భారతదేశాన్ని ఒకే దేశంగా భావిస్తూ వచ్చారు. దేశం మొత్తాన్ని జయించడం వల్ల రాజకీయపరమైన పాలనాపరమైన ఐక్యత సాధ్యమవుతుందని బ్రిటిష్ వారు పేర్కొన్నారు. కాని ఆ తరువాత భారతదేశాన్ని ఒకే దేశంగా పరిగణించడంలో గల ప్రమాదాలను గ్రహించి బ్రిటిష్‌వారు తమ విధానాన్ని మార్చుకొన్నారు. స్వదేశీ సంస్థానాలు కొనసాగడమే ఉపయోగమని భావించిన బ్రిటిష్ వారు వాటిని ఆక్రమించే విధానాన్ని విడిచిపెట్టారు. భారతీయులను విభజించే పద్ధతిని బ్రిటిష్‌వారు ఎంతో చురుకుగా చేపట్టారు. ఫలితంగా 'భారతదేశం ఒకే దేశం' అన్న భావనకు తిలోదకాలివ్వడం ఆవశ్యకమైంది. దీనికి తోడు బ్రిటిష్ చరిత్రకారులు, పండితులు భారత ఉప ఖండం అసలు ఎప్పుడూ ఒక దేశంగా లేదని బ్రిటిష్ పాలకులకు వత్తాసు పలికారు. భారత భూమి భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, మతాలు, జాతులు, భావాలలో కూడి, రాజకీయంగా కూడా భారతదేశం ఐక్యత సాధించలేదు. పైగా రాజకీయ ఐక్యత కోసం జరిగిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయి. బ్రిటిష్ వారి పరిపాలనా కాలంలో మాత్రమే భారతీయులు జాతీయతా భావాన్ని పెంపొందించుకొన్నారు. ఆ విధంగా భారత జాతీయతా వాదం అనేది బ్రిటిష్ పరిపాలనా వారసత్వ ఫలితమేనని బ్రిటిష్ చరిత్రకారులు తెలియజేస్తూ వచ్చారు. అయితే వీరి అభిప్రాయాలను భారతీయ పండితులు తిరస్కరించారు. మౌళికంగా భారత ఉపఖండం ఒకే దేశమని భారతీయ పండితులు వాదించారు. భౌగోళికంగా వైశాల్యం, ప్రజల సాంస్కృతిక ఉదారవాదం వల్ల భిన్న సంస్కృతులకూ, ఆచార వ్యవహారాలకూ నిలయమైందని వారి అభిప్రాయం. భిన్న సంస్కృతులు, వివిధ మతాలు, సాంఘిక ఆచార వ్యవహారాలు ఉన్నప్పటికీ భారత ప్రజల మధ్య మౌళికమైన ఐక్యత ఉంది. భారతదేశం రాజకీయంగా విడిపోయి ఉన్నప్పటికీ, రాజకీయ ఐక్యతకు చేసిన ప్రయత్నాలు విఫలమయినప్పటికీ సాంస్కృతికంగా భారతదేశం సమైక్యంగానే ఉండేది. వేదాలు, సంస్కృత భాష, హిందూ ఆచార వ్యవహారాలు, భారతదేశమంతటా వ్యాపించి ఉన్న పుణ్యక్షేత్రాలు భారతదేశ ఐక్యతకు తోడ్పడ్డాయి. రాజకీయంగా, సాంస్కృతికంగా భారతీయ ముస్లింలు భారతదేశంలో అంతర్భాగమయ్యారు. హిందూ, ముస్లింలుగా, బ్రిటిష్ వారు బుద్ధి

పూర్వకంగా సృష్టించిన చీలిక రెండు గ్రూపుల మధ్య మత విభేదాలకు దారి తీసింది. ఆ విధంగా జాతీయతా భావం రూపు దిద్దుకోవడానికి దోహదం చేసే అంశాలు భారతదేశంలో ఆనాటికే ఉన్నాయి. అయినప్పటికీ, జాతీయ భావాన్ని ఆధునిక అర్థంలో చూసినపుడు బ్రిటిష్ వారు పరిపాలనలో 19వ శతాబ్దం రెండో భాగంలో మాత్రమే భారతదేశంలో జాతీయతా వాదం అభివృద్ధి చెందిందని అంగీకరించవచ్చు. బ్రిటిష్ వారు రాక పూర్వమే భారతదేశంలో జాతీయతావాదం వేళ్ళూనికొని ఉన్నప్పటికీ, బ్రిటిష్ పరిపాలనా కాలంలోనే అది పూర్తి స్థాయిలో అభివృద్ధి చెంది, సమీకరణ శక్తిగా తయారయింది. జాతీయతా భావమే భారత స్వాతంత్ర పోరాటానికి దారి తీసింది.

## 1.6. ముగింపు :

భారతదేశానికి ఆరువేల మైళ్ళ దూరంలో ఉన్న ఒక చిన్న దేశానికి చెందిన బ్రిటిష్‌వారు ఇంత దూరం భారతదేశం వచ్చి దీనిని జయించి, పాలించడం ఆశ్చర్యకరమయిన విషయం. ప్రపంచ చరిత్రలోనే ఇంత అద్భుత సంఘటన మరొకటి లేదని చెప్పవచ్చు. భారతీయులలో ఐకమత్యం, పరిపాలనా దక్షత, నిర్మాణ కార్యక్రమాలలో ఆసక్తి, అన్నిటికంటే ముఖ్యమయిన జాతీయత లోపించడం ఆంగ్లేయుల విజయానికి కారణమయింది. ఈ కారణాల వల్లనే తొలి ప్రయత్నంగా భారతీయులు 1857 లో ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసినా అది విఫలమయింది. 1857 తరువాత భారత ప్రజలలో గొప్ప మార్పు వచ్చింది. వారిలో జాతీయతా భావం మొలకెత్తింది. జాతీయత అనేది గొప్ప శక్తి. దానిలోని ఒక గొప్ప సుగుణం ఏమంటే ఐకమత్యం లేని ప్రజలలో ఐకమత్యం కల్పించడము. ప్రాచీన, మధ్య యుగాలలో విదేశీయులను పారదోలడానికి భారత పాలకులు, సైనికులు ప్రయత్నిస్తే ఆధునిక యుగంలో 1857 తరువాత జాతీయ శక్తిచే ప్రభావితులయిన సామాన్య ప్రజలు ఆంగ్లేయులను పారదోలడానికి పూనుకొన్నారు. సాధారణంగా రాజకీయ విప్లవాలు యుద్ధ రూపంలోనూ, హింసాత్మకంగాను ఉంటాయి. కాని భారత జాతీయోద్యమం అందుకు భిన్నంగా అహింసాత్మకమైన సమరంగా రూపొందడం దాని విశిష్టత.

బ్రిటిష్ వారు భారతదేశం మొత్తాన్ని తమ స్వలాభం కోసం ఏకం చేసి చక్రవర్తి క్షేత్రంగా రూపొందించినా దాని వల్ల ఎక్కువ లాభపడినవారు భారతీయులు. ప్రథమంగా వారందరూ ఏకం కావడానికి స్వరాజ్యం సంపాదించుకొన్న తరువాత కూడా దేశం మొత్తానికి ఒకే ప్రభుత్వం ఏర్పరచుకొనడానికి వీలయింది. పూర్వ కాలంలో విదేశీయులతో పోరడటానికి కొన్ని కొన్ని రాజ్యాలు కలసినా, యుద్ధానంతరం అవి విడిపోయేవి. బ్రిటిష్ ప్రభుత్వంలో అన్ని రాజ్యాలు లేవు. అంతా ఒకటే రాజ్యం. అదే బ్రిటిష్ రాజ్యం. ఒకే ప్రజ వారు భారతీయులు. అందుచేత స్వరాజ్యానంతరం వారు విడిపోయే ప్రసక్తి లేదు. కాని ఆంగ్లేయుల కుట్ర ద్వారా హిందూ ముస్లింలు వేరుపడి భారతదేశంలో ఒక చిన్న భాగం పాకిస్తాన్ పేరుతో ఏర్పడినా, మొత్తం మీద చాలా భాగం ఏకమైంది. ఈ విధంగా బ్రిటిష్ ప్రభుత్వం, జాతీయతకు, స్వాతంత్ర్య సమరానికి దారి తీసింది.

## 1.7. నమూనా ప్రశ్నలు

1. జాతీయతా లక్షణాలు వివరింపుము
2. భారతదేశంలో జాతీయతాభివృద్ధికి దోహదం చేసిన అంశాలు చర్చించుము
3. బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన విభజించి పాలించు విధానం వివరింపుము

## 1.8. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Nationalism and Colonialism in Modern India, New Delhi, 1979 |
| 2. | Bipin Chandra, | : | Modern India, New Delhi, 1971 |
| 3. | Percival Spear, | : | A History of India, Vol. 2, Harmondsworth, 1978 |
| 4. | Sumit Sarkar, | : | Modern India, 1885 - 1947, Delhi, 1983 |
| 5. | Alladi Vaidehi, | : | History of Freedom Movement in India, Hyderabad 1991 |

| | | | |
|---|---|---|---|
| 6. | Heimsath, | : | Indian Nationalism and Hindu Social Reform, Princeton, 1964 |
| 7. | Vma Kaura, | : | Muslims and Indian Nationalism, New Delhi, 1977 |
| 8. | Mc lane, Indian | : | Nationalism and the Early Congress, Prination, 1977 |
| 9. | Anil Seal, The | : | Emergence of Indian Nationalism, Cambridge, 1967. |


డా॥ వి.కె. మోహన్

యూనిట్ - 5

పాఠం - 2

# భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన - దాని ఆశయాలు 1905 వరకు భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాలు

# (Foundation of Indian National Congress and its aims and activities upto 1905)

**2.0 లక్ష్యం :**

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావమునకు దోహదము చేసిన తొలి రాజకీయ సంఘాలు, భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన, దాని లక్ష్యాలు, 1905 వరకు కాంగ్రెస్ కార్యకలాపాలు గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


2.1 ఉపోద్ఘాతము

2.2 కాంగ్రెస్ ముందు ఏర్పడ్డ రాజకీయ సంఘాలు

2.2.1. సంఘాలు స్థాపించడానికి కారణాలు

2.2.2. రాష్ట్ర స్థాయి సంఘాలు

2.2.2.1. విజ్ఞాన సభ

2.2.2.2. భూకామందుల సొసైటీ

2.2.2.3. బ్రిటీష్ ఇండియా సొసైటీ

2.2.2.4. బెంగాల్ బ్రిటీష్ ఇండియా సొసైటీ

2.2.2.5. బ్రిటీష్ ఇండియా సంఘం

2.2.2.6. మద్రాస్ దేశీయ సంఘం

2.2.2.7. బొంబాయి సంఘం

2.2.2.8. పూనా సార్వజనిక సభ

2.2.2.9. ఇండియా లీగ్

2.2.2.10. మద్రాస్ మహాజన సభ

2.2.2.11. బొంబాయి ప్రెసెడెన్సీ సంఘం

2.2.2.12. లండన్ ఈస్ట్ ఇండియా సంఘం

2.2.2.13. తూర్పు ఇండియా సంఘం

2.2.3. ఇండియన్ అసోసియేషన్

**2.3** భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన, లక్ష్యాలు

**2.3.1.** ఏ.ఓ.హ్యూం

**2.3.2.** కాంగ్రెస్ స్థాపన ముఖ్య ఉద్దేశం

**2.3.3.** భారత జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశం

**2.3.4.** కాంగ్రెస్ ఉద్దేశాలు

**2.3.5.** కాంగ్రెస్ చేసిన తీర్మానాలు

**2.3.6.** సమీక్ష

**2.4** భారత జాతీయ కాంగ్రెస్ - **1905** వరకు దాని కార్యక్రమాలు (మిత వాద జాతీయత - **1885-1905**)

**2.4.1.** ఉపోద్ఘాతము

**2.4.2.** కాంగ్రెస్ లక్ష్యాలు

**2.4.3.** మితవాదుల విధానాలు

**2.4.4.** మితవాద కార్యక్రమాలు

**2.4.4.1** రాజ్యాంగ సంస్కరణలు

**2.4.4.2.** ఆర్థిక సంస్కరణలు

**2.4.4.3.** పాలనా సంస్కరణలు

**2.4.4.4.** ఇతర సంస్కరణలు

**2.4.4.5.** పౌర హక్కుల రక్షణ

**2.4.4.6.** రాజకీయ కార్య పద్ధతులు

**2.4.4.7.** కాంగ్రెస్ అఖిల భారత జాతీయ సంస్థ (తీర్మానాలు)

**2.4.4.8.** ప్రభుత్వ స్పందన

**2.4.4.9.** ముగింపు

**2.5.** నమూనా ప్రశ్నలు

**2.6.** చదువదగిన గ్రంథాలు

## 2.1 ఉపోద్ఘాతము

బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన వలన ప్రప్రథమంగా భారతదేశ చరిత్రలో కేంద్రీకృత రాజకీయ వ్యవస్థ ఏర్పడింది. భారతదేశాని కంతటికి బ్రిటిష్ పాలకులు రూపొందించిన ఒకే విధమైన పరిపాలనా యంత్రాంగం, శాంతియుత వాతావరణం, రాజకీయ ఐక్యత, పాశ్చాత్య రాజకీయ భావాల ప్రచారం దేశంలో రాజకీయ చైతన్యాన్ని రేకెత్తించాయి. ఆంగ్ల భాషను బోధన భాషగా ప్రవేశపెట్టడం వల్ల, భాషాపరంగా దేశం సమైక్యమైంది. విద్యావంతులైన భారతీయులు పాశ్చాత్య, శాస్త్రీయ, రాజకీయ విజ్ఞానాల వల్ల ప్రభావితులయ్యారు. విద్యావంతులైన భారతీయుల కృషి వలన దేశంలో రాజకీయ చైతన్యం పెంపొందింది. భారతదేశంలో జాతీయ భావాల పెరుగుదలను పాశ్చాత్య భావ పరంపర పెంపొందించాయి. బ్రిటిష్ పరిపాలనా ప్రభావ పరిణామమే భారత జాతీయవాదం అని తిలక్ చక్కగా పేర్కొన్నాడు. 19వ శతాబ్దంలో చాలా మంది సమర్థులైన నాయకులు బెంగాల్‌లో ఉద్భవించారు. వారు రాజకీయ, సాంస్కృతిక విషయాలలో భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు మార్గదర్శకులయ్యారు. వారి కృషి ఫలితంగా కొత్త జాతీయోద్యమం రూపు రేఖలను సంతరించుకుంది.

19వ శతాబ్దంలో భారత ప్రజలలో రాజకీయ చైతన్యం కలిగించడానికి రాజకీయ సంస్థలు స్థాపితమైనాయి. విశ్వ విద్యాలయాలలో పాశ్చాత్య విద్య అభ్యసించి, పాశ్చాత్య సంస్కృతిలో సంబంధాన్ని సంపాదించి పాశ్చాత్య ప్రపంచంలో ప్రాధాన్యం వహించిన ప్రజాస్వామిక భావాలతో చైతన్యవంతులయిన భారతీయులు ఆ దేశాలలో వలెనే ప్రజల కష్ట నిష్ఠురాలను తొలగించడానికి రాజకీయ సంఘాలు, సభలు, సమావేశాలు గొప్ప సాధనాలని గ్రహించినారు. 1885 కి పూర్వం దేశం మొత్తానికి ఒక రాజకీయ సంఘం కాకుండా ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక సంఘాలు ఏర్పడినాయి. కాని దేశానికంతకూ ఒకే రాజకీయ సంఘం ఉంటే బాగుంటుందని అనేక మంది అభిప్రాయపడినారు. రిప్పన్ ప్రభువు కలకత్తా విశ్వ విద్యాలయం స్నాతకోపన్యాసంలో మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం ప్రభుత్వానికి ఎంతో అవసరమనీ, అందుకోసం దేశానికి అంతకూ ఒక రాజకీయ సంఘం ఉండవలెనని ఉద్బోధించాడు. ఇటువంటి సమయంలోనే దేశ స్థాయిలో రాజకీయ సభ ఏర్పాటు చేయవలెనని తలచి దానికోసం సురేంద్రనాధ్ బెనర్జీ కృషి చేసినాడు. ఈతని ప్రయత్నాలకు నిరోధం కల్పిస్తూ హ్యూం అనే బ్రిటిష్ ప్రముఖుడు 1885 లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు చేశాడు.

## 2.2. కాంగ్రెస్ ముందు ఏర్పడ్డ రాజకీయ సంఘాలు :

19వ శతాబ్దంలో భారతీయ మేధావులు దేశంలో రాజకీయ విజ్ఞానాన్ని వ్యాపింపజేసి రాజకీయ కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా కొన్ని రాజకీయ సంఘాలను నెలకొల్పారు. ఈ కార్యక్రమం నూతన రాజకీయ భావాలు, వాస్తవ పరిస్థితి పట్ల ఆధునిక దృక్పథం, నూతన సామాజిక, ఆర్థిక రాజకీయ లక్ష్యాలు, కొత్త పోరాట శక్తులు, రాజకీయ వ్యవస్థకు సంబంధించిన కొత్త విధానాల ప్రాతిపదిక మీద ఏర్పాటయింది. ప్రధమంగా రాజారామమోహనరాయ్ రాజకీయ సంస్కరణలు కావాలని కోరుతూ ఆందోళన జరిపాడు. ఆయన మరణించిన తరువాత 'డెరోజియన్లు'గా పేరుగాంచిన తీవ్రవాద బెంగాలీ యువకులు రామమోహనరాయ్ ఆశయసాధన కోసం కృషి చేశారు. ఆ విధంగా ఆధునిక రాజకీయ చైతన్యానికి మొదట్లో రామమోహనరాయ్ తరువాత 'డెరోజియన్లు' బీజాలు నాటారు.

**2.2.1. సంఘాలు స్థాపించడానికి కారణాలు :** 1857 తిరుగుబాటు తరువాత భారత ప్రజలు ఒక పక్షంగాను, బ్రిటిష్ ప్రభుత్వం ఒక పక్షంగాను ఏర్పడి ప్రభుత్వ చట్టాలను ప్రజలు ఖండించడం ప్రారంభించారు. ఇందుకోసం ఒక యంత్రాంగం అవసరమని భావించి రాజకీయ సంఘాలు ఏర్పరచారు. ప్రధమంలో ఈ సంఘాలు రాష్ట్రాలకే పరిమితమయి ఉండేవి. ఒక రాష్ట్రంలోని సంఘానికి మరొక రాష్ట్రంలోని సంఘానికి సంబంధం ఉండేది కాదు. ఈ సంఘాలను స్థాపించి ప్రోత్సహించినవారు ముఖ్యంగా ఆంగ్ల విద్యను నేర్చుకొన్నవారు. అంతేగాక మొదటి దశ ఆంగ్ల విద్య వ్యాపించిన రాష్ట్రాలలోనే సంఘాలు ఏర్పాటు అయ్యాయి. దానికి కారణం ఆంగ్ల విద్య ఇక్కడ మొదటి వ్యాపించింది. క్రమేపి దేశం మధ్యరాష్ట్రాల్లో ఆంగ్ల విద్య వ్యాపించడం, ఫలితంగా అక్కడ కూడా రాజకీయ సంఘాలు ఏర్పడ్డాయి.

ఆంగ్ల విద్యను పఠించిన భారతీయ ప్రముఖుల్లో ఇటువంటి సంఘాలను స్థాపించడానికి కారణాలు పరిశీలించినట్లైతే ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తాయి. అందులో మొదటి కారణం బ్రిటన్‌లో ఇటువంటి సంఘాలు ఆనాడు ఉండేవి. అది ప్రశాంత మార్గంలో తమ ఆంధోళనలను జరిపి, ప్రభుత్వం వద్ద నుంచి తాము కోరిన సంస్కరణలు, సౌకర్యాలు పొందేవి. ఇదే పద్ధతిని భారతీయులు అవలంభించదలచారు. రెండు దేశాలలోను అధికారులు ఆంగ్లేయులే కాబట్టి, వారు తప్పక తమ కోరికలను శాంతియుత పద్ధతిలో తీర్చగలరని భారతీయుల నమ్మకం. అందుకే వారు తమ తమ రాష్ట్రాలలో అటువంటి సంఘాలను స్థాపించారు. రాజకీయ సంఘాలు కోస్తా ప్రాంతాల్లో స్థాపించడానికి కారణం మొదటి దశలో ఆంగ్ల విద్య వ్యాపించింది. బెంగాల్, బొంబాయి, మదరాసు రాష్ట్రాలలోనే స్థాపించబడిన రాజకీయ సంఘాల కృషి వల్ల ప్రజలలో జాతీయ చైతన్యం దినదినాభివృద్ధి చెందింది. దాని ఫలితంగా దేశానికంతా ఒకే కేంద్ర రాజకీయ సభ ఉన్నట్లైతే ఎంతో లాభదాయకమని అనేక మంది భావించారు. ఈ అభిప్రాయానికి ప్రతిరూపమే 1885లో అవతరించిన భారత జాతీయ కాంగ్రెస్. దాని అవతరణతో రాజకీయోద్యమంలో ఒక నూతన శకం ఆరంభమైంది. దాని ఆధ్వర్యానే భారత స్వాతంత్ర్యోద్యమం చాలా వరకు నడిచింది.

**2.2.2. రాష్ట్ర స్థాయి సంఘాలు :** భారత జాతీయ కాంగ్రెస్ పుట్టుకను గురించి తెలుసుకోవడానికి ముందు రాష్ట్ర స్థాయిలోని సంఘాలు ఏ విధంగా పనిచేశాయో పరిశీలిద్దాం.

**2.2.2.1. విజ్ఞాన సభ :** కలకత్తాలోని కళాశాలలో ఆచార్యుడుగా పనిచేసిన ఉత్సాహవంతుడు, ప్రతిభాశాలి ఐన డిరోజియో విజ్ఞాన సభను స్థాపించి, మతం, దేశాభిమానం గురించి అందులో చర్చలు జరిపేవాడు. కాని అతడు వెలిబుచ్చిన అభిప్రాయాలు అతివాద ఆధారాలైనవని అధికారులు అతనిని ఉద్యోగం నుంచి తొలగించారు. కాని అతడు తన ఉద్యమాన్ని మానక పత్రికనొకదాన్ని నడిపి, తన ఆశయాలను ప్రచారం చేశాడు. యువకులు దేశాభిమానం కలిగి ఉండాలని, విద్య అందుకు తగినట్లుగా రూపొందాలని అతడు ఆశించాడు. అతనితోనే చర్చాయుగం ప్రారంభమైందని చెప్పవచ్చు. అతనితో ప్రభావితులైన విద్యార్థులు అనేక సంఘాలను స్థాపించారు. అందులో ఒకటి 1823 లో స్థాపితమైన గౌడీయ సమాజం అలా భూస్వాముల సంఘం 1839లో స్థాపితమైంది.

**2.2.2.2. భూకామందుల సొసైటీ :** 1839 లో భారతదేశంలో ప్రథమంగా ఏర్పడిన రాజకీయ సంస్థ భూకామందుల సొసైటీ. కలకత్తాలో ఏర్పాటయిన ఈ సొసైటీ బెంగాల్, బీహార్, ఒరిస్సా జమీందారుల సంకుచిత ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రారంభమైన సంస్థ. ఈ సంస్థ తొలి సమావేశమునకు రెండు వందల మంది జమీందారులు హాజరైరి. ఈ సంఘం తమ ప్రతినిధిగా లండన్‌లో జాన్ క్రాఫర్డును నియమించింది. ఈ సంఘం జమిందారుల సంక్షేమమును కాంక్షించుటయేగాక కొన్ని ప్రజాసమస్యలను కూడా ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. అవి : న్యాయస్థానాలందు బెంగాలీ భాషను ఉపయోగించుట, స్టాంపు డ్యూటీ తగ్గించుట మొదలగునవి. ఈ సంస్థ 1844లో లండనులో ఒక శాఖను ఏర్పాటుచేసి జాన్ క్రాఫర్డు స్థానంలో జార్జి థామ్సన్‌ను నియమించింది. ఈ సంస్థ ఆచరణలో ఏమీ సాధించకపోయినా, పాశ్చాత్య దేశాలలో మాదిరిగా భారతదేశములో ఒక రాజకీయ సంఘము ఏర్పాటుకు జరిగిన మొదటి ప్రయత్నము. భారతదేశములో స్వాతంత్ర్యమునకు మార్గము చూపిన సంస్థ ఇది అని రాజేంద్రలాల్ మిత్రా అభిప్రాయపడినాడు. ఈ సంస్థ 1851 లో బ్రిటిష్ ఇండియా సొసైటీలో విలీనమైపోయింది.

**2.2.2.3. బ్రిటిష్ ఇండియా సొసైటీ :** బ్రిటిష్ ఇండియాలోని భారతీయుల స్థితిగతులను మెరుగు పరచవలెనను లక్ష్యంతో కొందరు బ్రిటిష్‌వారు 1839 లో లండన్‌లో బ్రిటిష్ ఇండియా సొసైటీని స్థాపించిరి. ఇందలి సభ్యులైన లార్డ్ బ్రౌగామ్, డేనియల్ ఓకొనెల్, జార్జి థామ్సన్, సర్ చార్లెస్ ఫోర్‌బెస్ మొదలగువారు ఇంగ్లండులో విస్తృతంగా పర్యటించి భారతీయుల ఇక్కట్లు తీర్చాలని పేర్కొన్నారు. ఈ సంఘము ఆచరణలో ఏమీ సాధించకపోయినా ఇంగ్లండ్‌లోని భారతీయుల శ్రేయస్సును కాంక్షించు వారినందరిని ఒక వేదికపైకి తీసుకొని వచ్చింది. అంతేగాక ఈ సంఘము ఆంగ్లేయులలో భారతీయుల పట్ల స్నేహము, సానుభూతిని రేకెత్తించెను.

**2.2.2.4. బెంగాల్ బ్రిటిష్ ఇండియా సొసైటీ :** 1843 లో థామ్సన్, ద్వారకానాథ్ టాగూరు మొదలగువారు ఈ సంఘాన్ని స్థాపించారు. భారతీయుల కష్టాలను ప్రభుత్వ దృష్టికి ఇంగ్లండ్‌లోని ఆంగ్లేయుల దృష్టికి తీసికొనివచ్చుటయే ఈ సంస్థ లక్ష్యం. ఈ సంఘము భారతీయుల ఆర్థిక పరమైన, వృత్తి పరమైన అంశాలనే గాక హిందూ సమాజంలోని దురాచారాలను నిర్మూలించాలని కోరింది. ఈ సంస్థ 1851 లో బ్రిటిష్ ఇండియా సొసైటీలో కలిసిపోయింది.

**2.2.2.5. బ్రిటిష్ ఇండియా సంఘము :** 1851 లో బెంగాల్లోని ప్రముఖులు బ్రిటిష్ ఇండియా సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘాన్ని స్థాపించడానికి అనేక కారణాలు గలవు. ప్రతి 20 సంవత్సరాలకొకసారి కంపెనీ అధికారాలను పార్లమెంట్ సంస్కరిస్తూ ఉండేది. 1853 లో 20 సంవత్సరాల కాలపరిమితి అవతుంది. అందువల్ల పార్లమెంట్ కొత్త చట్టమొకటి చేయాల్సి ఉంది. ఆ సందర్భంలో తమ సమస్యలను ప్రభుత్వం ద్వారా పార్లమెంట్‌కు అందజేస్తే బాగుంటుందని బెంగాల్లోను, ఇతర ప్రాంతాలలోని నాయకులు అభిప్రాయపడినారు. తమ సమస్యలకు ఒక నిర్దిష్టమైన స్వరూపాన్ని కల్పించాలంటే ఒక సంఘం అవసరమని వారు నమ్మారు. ఆలస్యం చేస్తే తిరిగి 20 సంవత్సరాల వరకు వారికి ఇటువంటి అవకాశం లభించదు. 1858లో పార్లమెంట్‌లో భారతీయ పరిస్థితుల చర్చలు జరుగుతాయి. అందుకే కలకత్తాలోని ప్రముఖులు సమావేశాలు జరిపి, తమ సూచనలను బ్రిటన్‌లోని అధికారులకు అందజేయడానికి ఈ సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘం భారతీయులకు శాసనసభలో ప్రాతినిధ్యము కల్పించవలెనని, సివిల్ సర్వీస్ పరీక్షలు ఇండియాలోనే జరుపవలెనని ప్రభుత్వానికి విన్నవించింది. భారతీయులలో రాజకీయ చైతన్యము కల్గించుటలో ఈ సంఘం గొప్ప కృషి చేసింది.

**2.2.2.6. మద్రాస్ దేశీయ సంఘం :** 1852లో మద్రాస్ నేటివ్ సంఘము స్థాపితమైంది. అప్పటివరకు మద్రాస్ ప్రజలలో మత పరమైన చైతన్యమే ఎక్కువగా ఉండి, క్రైస్తవ మిషనరీల దుష్ప్రచారాన్ని ప్రతిఘటించడంలో అది వ్యక్తమవుతూ ఉండేది. కాని రాజకీయ

చైతన్యం వారిలో ఎంత మాత్రం కనబడలేదు. ఈ సంఘము స్థాపించిన తరువాత వారు రాజకీయాల్లో కూడా ఎక్కువ శ్రద్ధ వహించడం ప్రారంభించారు. ఈ సంఘంలో ఎక్కువ పాత్ర వహించినవాడు గాజుల లక్ష్మీ నరసు సెట్టి. 1853లో చార్టర్ సవరణ సందర్భంలో ఈ సంఘం వారు పార్లమెంట్‌కు చేసిన హెచ్చరికలన్నిటిని వారు ఎంతగానో మన్నించారు. అయినప్పటికీ ఈ సంఘం 1862 తరువాత సమావేశం కాలేదు. దానికి అనేక కారణాలు కలవు. కలకత్తాలో ఉన్నట్లు మదరాస్‌లో జమీందారులు లేరు. ఆంగ్ల విద్య కూడా బెంగాలో వ్యాపించినంత వేగంగా మద్రాస్‌లో వ్యాపించలేదు. రాజకీయాలలో పాల్గొనగల న్యాయవాదులు, వైద్యులు కూడా చాలా తక్కువ సంఖ్యలో ఉండిరి. 1878లో 'హిందూ' పత్రిక స్థాపించేంతవరకూ ఆ రాష్ట్రంలో ప్రముఖమైన వార్తా పత్రిక కూడా లేదు.

**2.2.2.7. బొంబాయి సంఘము :** 1852 లో బొంబాయి పట్టణంలోని ప్రముఖులు ఈ సంఘాన్ని స్థాపించారు. మొదట్లో ఈ సంఘం ఎక్కువ చురుకుగా పనిచేయలేదు. దానికి కారణము బొంబాయిలోని ప్రత్యేక పరిస్థితులే కారణం. ఇచట వర్తకులకే ఎక్కువ ప్రాబల్యం ఉండేది. ప్రజల్లో వారి మాట ఎక్కువ చెల్లేది. కాని వారికి రాజకీయాలకన్నా వర్తక వ్యాపారాల్లో ఆసక్తి ఎక్కువ. ఆంగ్ల విద్య చదివిన వారు బొంబాయిలో గలరు కాని వర్తకుల సహకారం లేనిదే వారేమి చేయడానికి వీలు లేకుండెను. అంతేగాక ఇచట అనేక వర్గాల వారున్నారు. ఈ వర్గాల వారంతా కలసి సహకరిస్తేనే రాజకీయ కార్యక్రమం సాధ్యం కాదు. అందువల్లనే చాలా కాలం వరకు పూనా నగరం రాజకీయ కార్యక్రమాలకు కేంద్రంగా ఉండేది.

**2.2.2.8. పూనా సార్వజనిక సభ :** 1870 లో రెనడే నాయకత్వంలో పూనాలో సార్వజనిక సభలనే రాజకీయ సంస్థలా స్థాపించారు. సామాన్య ప్రజలకు రాజకీయాలు పరిచయం చేసి వారి బాధ్యతలను గుర్తు చేయడం ఈ సభ ముఖ్య ఉద్దేశం. ఇందులో వారు చాలా వరకు కృత కృత్యులయ్యారు. తమ ప్రతినిధుల ద్వారా, నివేదికల ద్వారా ప్రజల కష్టాలను ప్రభుత్వం వారి దృష్టికి తెచ్చారు. గ్రామాల్లోని రైతుల కష్టాలను కూడా వారు పరిశీలించి, వారికి తమ చేతనైన సహాయం చేశారు. ఈ సభ అచిర కాలంలోనే మంచి ప్రాముఖ్యం సంపాదించింది. కాలక్రమేణ ఈ సభ సభ్యులలో అభిప్రాయ భేదాలు పొడచూపాయి. దానికి కారణం మితవాదులు, అతివాదులు అని రెండు వర్గాల వారు సభలో ఏర్పడడమే.

**2.2.2.9. ఇండియా లీగ్ :** 1875లో అమృత బజార్ పత్రికా సంపాదకుడైన శశికుమార్ ఘోష్ బెంగాల్‌లో ఇండియా లీగ్‌ను స్థాపించాడు. భారతీయులలో జాతీయ భావమును పెంపొందించుటమే దీని లక్ష్యం. ఈ సంస్థ ఎక్కువ కాలం పని చేయలేదు.

**2.2.2.10. మద్రాస్ మహాజన సభ :** 1884లో విద్యావంతులైన యువకులు మద్రాస్ మహాజనసభ అనే ఒక సభను స్థాపించారు. ఈ సభ చాలా కాలం వరకు దక్షిణాదికి ముఖ్య రాజకీయ సంఘంగా ఉండెను. ఈ సంఘంలో ప్రధాన పాత్ర వహించిన నాయకుడు ఆనందాచార్యులు.

**2.2.2.11. బొంబాయి ప్రెసిడెన్సీ సంఘం :** 1885 లో తెలాంగు, త్యాబ్జి, ఫిరోజ్ షామెహతా అను ముగ్గురు చేరి ఈ సంఘాన్ని స్థాపించారు. ఈ సంస్థ ఇంగ్లండ్‌కు మూడు ప్రతినిధి వర్గాలను పంపింది. ఈ సంఘం తొలి జాతీయ కాంగ్రెస్ మహాసభను జరుపుటకు ఆతిధ్యమిచ్చి చరిత్ర ప్రసిద్ధిగాంచింది.

**2.2.2.12. లండన్ ఈస్టిండియా సంఘం :** 1865 లో అన్ని రాష్ట్రాలకు చెందిన భారతీయులు ఏకమై ఒక కేంద్ర సంఘాన్ని ఇంగ్లండులో మొదటిసారిగా స్థాపించారు. దాని పేరు లండన్ ఈస్టిండియా సంఘము. రాజకీయ, సాంఘిక విషయాలను చర్చించడం, భారతదేశంలోని ఆంగ్ల పరిపాలనలోని లోపాలను బ్రిటిష్ ప్రజలకు తెలియపరచడం, భారతీయుల గురించి వారిలో నాటుకొన్న అపోహలను తొలగించడం ఈ సంఘం ఉద్దేశాలు. కాని ఈ సంఘం ఎక్కువ కాలం పనిచేయలేదు.

**2.2.2.13. తూర్పు ఇండియా సంఘము :** 1866లో తూర్పు ఇండియా సంఘము స్థాపించబడింది. ఇందులో భారతీయులే కాక, ఆంగ్లేయులు కూడా సభ్యులుగా చేరారు. ఇందులో భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందినవారు ఉండేవారు. వారిలో ముఖ్య పాత్ర వహించిన నాయకుడు దాదాభాయి నౌరోజి. ఇతడు సంఘ కార్యక్రమాలన్నీ శ్రద్ధతో చూసేవాడు. ఈ సంఘ శాఖలను కలకత్తా, బొంబాయి, మద్రాస్ మొదలైన పట్టణాల్లో స్థాపించాలని నౌరోజి యత్నించాడు. కాని బొంబాయిలోని శాఖ మాత్రం కొంత వరకు పనిచేసింది.

బొంబాయిలోని ప్రముఖులకు రాజకీయాలంటే ఆసక్తి లేకపోవడం, ఆంగ్ల సభ్యుల సంఖ్య ఈ సంఘంలో నానాటికి పెరగడం, వారికి భారతీయులపట్ల అభిమానం లేకపోవడం, తమ అధికారులు అమలులో పెట్టిన విధానాలను గుడ్డిగా నమ్మడం వల్ల ఈ సంఘం క్రమేపీ నిర్జీవమైపోయింది.

భారతీయుల సమస్యలు, ప్రయోజనాలను సాధించడానికి, వాటిపై కృషి చేయడానికి కేంద్ర సంఘం ఒకటి భారతదేశంలో స్థాపించాల్సిన అవసరం ఉందని, అందులో భారతీయులు మాత్రమే ప్రాధాన్యం వహించాలని గ్రహించి, ఆనాటి నుంచి భారతీయుల కేంద్ర సంఘ స్థాపనకు పాటుపడ్డారు.

**2.2.3. ఇండియన్ అసోసియేషన్** : కాంగ్రెస్‌కు ముందు ప్రారంభమైన జాతీయ సంస్థలలో అత్యంత ముఖ్యమైంది కలకత్తా భారతీయ సంఘం. బెంగాలీ యువ జాతీయవాదులు బ్రిటిష్ ఇండియా అసోసియేషన్ వారి సంప్రదాయవాద, భూస్వామ్య అనుకూల విధానాలతో విసుగెత్తిపోయారు. విస్తృత ప్రజానీకానికి సంబంధించిన సమస్యల మీద నిర్విరామ రాజకీయ ఆందోళన సాగాలని ఆ యువకులు వాంఛించారు. వారికి సురేంద్రనాథ్ బెనర్జీ నాయకుడు. ఇతడు ఉజ్వల రచయిత, మహావక్త, ఇండియన్ సివిల్ సర్వీసుకు ఎంపికైన ఐ.సి.యస్. అధికార్లలో స్వతంత్ర భావాలు కలిగిన భారతీయుడు. అందువల్ల బ్రిటిష్ పాలకులు అతనిని పదవి నుంచి తొలగించారు. ఇతని ప్రజా జీవితం 1875లో మొదలైంది. కలకత్తా విద్యార్థులకు జాతీయ విషయాలపైన ఆయన గంభీరోపన్యాసం ఇవ్వటంతో ఆయన రాజకీయ జీవితం ప్రారంభమయింది. ఇతని ప్రోత్సాహంతో ఆనందమోహన్ బోస్, వంగ యువ జాతీయ వాదులు 1876లో భారతీయ సంఘాన్ని స్థాపించుకొన్నారు. ఈ సంస్థ ముఖ్యాశయాలు 1) ఉమ్మడి రాజకీయ కార్యక్రమాలలో, భారత ప్రజలను సమైక్య పరచడం 2) హిందూ ముస్లిం సఖ్యతను పెంపొందించడం 3) దేశంలో బలమైన ప్రజాభిప్రాయాన్ని సృష్టించడం 4) నాటి ప్రజా ఉద్యమాలలో ప్రజానీకాన్ని కలుపుకోవడం.

సురేంద్రనాథ్ బెనర్జీ భారతమంతా పర్యటించాడు. ఆయన గంభీరోపన్యాసాలకు ప్రజలు మంత్రముగ్ధులై ఆకర్షితులయ్యారు. దేశ రాజకీయ రంగంలో ప్రముఖ పాత్రను నిర్వహించాడు. పరీక్షల వయోపరిమితిని 21 సంవత్సరాల నుండి 19 సంవత్సరాలకు తగ్గించడంతో ఇండియన్ అసోసియేషన్ ఈ చర్యను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇల్బర్ట్ బిల్లు వివాదం సందర్భంగా, ఈ సంఘం దృఢంగా వ్యవహరించింది. ఈ సంస్థ ఇల్బర్ట్ బిల్లును సమర్థిస్తూ నిర్వహించిన ఆందోళనా పటిమను చూసి బ్రిటిష్ అధికారులు ఆశ్చర్యపడ్డారు. దేశీయ పత్రికలకు వ్యతిరేకంగా ఆమోదించిన శాసనాన్ని తీవ్రంగా విమర్శించింది. లంకా షైర్ మిల్లు వస్త్రాలకు అనుకూలంగా స్వదేశీ వస్త్ర పరిశ్రమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా, దిగుమతి సుంకాలను రద్దు చేయడాన్ని, ఈ సంఘం గర్హించింది. రిప్పన్ పరిపాలనా కాలంలో ఈ సంస్థ ప్రజా సమస్యల చర్చా వేదిక అయింది. జమీందార్ల పీడన నుంచి కౌల్దార్ల రక్షణ కోసం ఇది ఉద్యమం సాగించింది. దాదాపుగా బానిస పరిస్థితులు కొనసాగే తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులకు మెరుగైన పరిస్థితులకోసం అది ఆందోళన చేసింది. బెంగాల్‌లో అనేక పట్టణాల్లో గ్రామాల్లో, బెంగాల్‌కు వెలుపలా ఆ సంఘం శాఖలు ప్రారంభమయ్యాయి. అశేష ప్రజానీకాన్ని తన జండా కిందికి ఆకర్షించడానికి పేద తరగతుల వారి కోసం అతి తక్కువ సభ్యత్వ రుసుము నిర్ణయించింది.

రాజకీయ సమైక్యతను ప్రాతిపదికగా, భారతీయ వాదానికి నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి ఈ సంఘం, అఖిల భారత సమావేశాన్ని నిర్వహించాలని సంకల్పించింది. 1883లో కలకత్తాలోని మొదటి జాతీయ సమావేశాన్ని నిర్వహించి ఆనాడు భారతీయ విద్యావంతులను కలవరపరుస్తున్న రాజకీయ సమస్యల గురించి చర్చించింది. ఈ సమావేశానికి వందమంది ప్రతినిధులు హిందువులు, ముస్లింలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. వాటిలో ముఖ్యమైనవి 1) శాసన సభలో ప్రజలు ఎన్నుకొన్న సభ్యులుండాలి. 2) ఐ.సి.యస్. పరీక్షకు కూర్చునే అభ్యర్థుల వయసు, పెంచాలి 3) న్యాయ శాఖను, కార్యనిర్వాహణ శాఖ నుంచి వేరు చేయాలి 4) ఆయుధ చట్టాన్ని రద్దు చేయాలి. 5) సాంకేతిక విద్యకు ప్రాధాన్యం కల్పించాలి. 6) జాతీయ నిధి సేకరించాలి.

భారతీయ సంఘం రెండవ సమావేశం 1885 డిసెంబర్ 25, 26, 27 తేదీలలో కలకత్తాలో చర్చించిన సమస్యలనే, భారతీయ కాంగ్రెస్ బొంబాయి సమావేశంలో ప్రతినిధులు చర్చించారు. సురేంద్రనాథ్ బెనర్జీ ఈ జాతీయ పరిషత్తు తప్పక అఖిల భారత పరిషత్‌గా

రూపొందగలదని నమ్మాడు. కాని అతని ఆశ నిరాశే అయింది. ఎందుకంటే ఇతనికి విరుద్ధంగా 1885 డిసెంబరు ఆఖరులో ఏ.ఒ. హ్యూమ్ భారత జాతీయ కాంగ్రెస్ అనే అఖిల భారత రాజకీయ సంస్థను సమావేశపరిచాడు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడైన ఉమేష్ చంద్ర బెనర్జీ ఆహ్వానము మేరకు సురేంద్ర నాథ్ బెనర్జీ నెలకొల్పిన నేషనల్ కాన్ఫెరెన్స్ 1886లో జాతీయ కాంగ్రెస్‌లో విలీనమయ్యెను.

పైన పేర్కొన్న వివిధ సంఘాలు, సంస్థలు ఎంతో ప్రయోజనకరమైన సేవ చేసినప్పటికీ, వాటి పరిధి పని విధానం అనేక పరిమితులకు లోబడి ఉంది. స్థానిక సమస్యల ప్రాతిపదికపైనే అవి వ్యవహరించాయి. ఆయా సంస్థల్లో సభ్యత్వం, నాయకత్వం ఒకే నగరానికి చెందిన కొద్ది మంది ప్రజలకు పరిమితమైంది. అఖిల భారత స్థాయికి ఎదగడం కోసం ఇండియన్ అసోషియేషన్ రెండు పర్యాయాలు అఖిల భారత సమావేశాలు ఏర్పాటు చేసినప్పటికీ, దేశ వ్యాప్తంగా కొన్ని రాజకీయ కార్యకర్తలకు, నాయకులకు ప్రాతినిధ్యం వహించగల సంస్థగా ఇండియన్ అసోసియేషన్ విజయం సాధించలేకపోయింది.

## 2.3 భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన, లక్ష్యాలు :

రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయులు అఖిల భారత స్థాయిలో ఒక సంస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ సంస్థ ఒకే కార్యక్రమ రూపకల్పన కోసం, ఏకాభిప్రాయం కలిగిన వ్యక్తుల వేదికగా మాత్రమే కాకుండా విస్తృత ప్రాతిపదిక కలిగిన స్వాతంత్ర్య పోరాట దృక్పధాన్ని కలిగించేందుకు కావలసిన ప్రజా చైతన్యాన్ని అందించేదిగా ఉండాలని వారు అభిప్రాయపడినారు. ఆ విధమైన సంస్థ ఏర్పాటుకు కావలసిన సాంఘిక పునాది ప్రస్తుతం వేయడం జరిగింది. దానికి తగిన అనుభవం తోడైంది. దేశంలోని విభిన్న ప్రాంతాల నుంచి ఎంతో మంది నాయకులు అఖల భారత స్థాయి సంస్థ స్థాపనకు ఏక కాలంలో ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, ఆ ఆలోచనకు ఒక నిర్ధిష్టమైన తుది రూపు ఇచ్చిన ఘనత ఏ.ఓ. హ్యూం కు దక్కుతుంది.

**2.3.1. ఏ.ఓ. హ్యూం :** హ్యూం ఉదారవాద భావాలు గల స్కాటిష్ కుటుంబంలో జన్మించాడు. ఇతడు 1849లో ఐ.పి.యస్ హోదాలో భారతదేశానికి వచ్చాడు. ఇతనికి మొదటి నుంచి భారతీయులపై అభిలాష ఎక్కువ. విద్యావంతులైన భారతీయులంటే ఇతనికి సానుభూతి. ఇతడు మొదట్లో జిల్లా కలెక్టర్‌గా పని చేశాడు. దాని తర్వాత అనేక పదవులను స్వీకరించి, కేంద్ర ప్రభుత్వంలో సెక్రటరీ హోదా కూడా పొందాడు. అధికారంలో ఉన్నప్పుడు విద్యా విధానంలో అనేక మార్పులు చేశాడు. సంఘ సంస్కరణ, మధ్యపాన నిషేధం మొదలైన వాటిలో ఆసక్తి చూపాడు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి నానాటికి పెరుగుతుందని, ప్రభుత్వం ప్రజల పట్ల అనుకూలంగా వ్యవహరించాలనీ ప్రభుత్వానికి సలహా ఇచ్చాడు. ఇతని భావాలను ఇతర ఆంగ్ల అధికారులు హర్షించలేదు. లిట్టన్ ప్రభువు కూడా ఇతనితో సహకరించలేదు. ప్రభుత్వం వారికి తన పట్ల నిరాదరణ పెరగడంలో 1882లో హ్యూం తన పదవికి రాజీనామా ఇచ్చి తిరిగి ఇంగ్లండ్ వెళ్ళకుండా సిమ్లాలోనే స్థిరపడి, భారత ప్రజల కోసం పాటుపడడానికి నిశ్చయించుకొన్నాడు. దివ్య జ్ఞాన సమాజ సభ్యుడు కావడం వల్ల కూడా ఇతనికి భారతీయులపై పక్షపాతం ఎక్కువగా ఉంది. కలకత్తా విశ్వ విద్యాలయ పట్టభద్రులను ఉద్దేశించి 1882 మార్చిలో ప్రసంగిస్తూ, తమ దేశానికి స్వేచ్ఛను పట్టుదలతో సాధించడానికి సంఘర్షణకు సిద్ధపడవలసిందని ఉద్బోధించాడు. 1885 డిసెంబరులో బొంబాయిలో జరిగిన మొదటి కాంగ్రెస్ సమావేశం విజయవంతం కావడానికి మార్గదర్శకుడయ్యాడు. చాలా సంవత్సరాలు ప్రధాన కార్యదర్శిగా ఎంతో శ్రద్ధతో సమర్థవంతంగా నిర్వహించాడు.

**2.3.2. కాంగ్రెస్ స్థాపన ముఖ్య ఉద్దేశం :** జాతీయ స్థాయిలో హ్యూం కాంగ్రెస్‌ను స్థాపించడంలోని ముఖ్య ఉద్దేశం, ఈ సంస్థ ద్వారా బ్రిటిష్ పరిపాలన భారతదేశంలో శాశ్వతంగా ఉండేటట్లు చేయడమే. సురంద్రనాథ్ బెనర్జీ స్థాపించిన జాతీయ సంఘం విప్లవాత్మకమైందని, అది ఏనాటికైనా, ఆంగ్లేయులపై తిరుగుబాటు చేస్తుందని అందువల్లనే దానిని అణచివేసి తానే జాతీయ స్థాయిలో ఒక రాజకీయ సంఘాన్ని స్థాపించదలిచినాడు. ఈ సంస్థ నిర్మాణ కార్యక్రమాలు జరిపి ప్రజలకు ఉపయోగకరమైన సాధనంగా నిలిచిపోవలెనని అతని ఉద్దేశము. ఈ సంస్థ మితవాదులను ఎక్కువగా ప్రోత్సహించేదిగా ఉండవలెనని అతడి అభిమతం. ఆ రోజులలో రష్యావారు భారతదేశంపై దండెత్తే అవకాశం ఉందని, రహస్యంగా భారతీయులు వారితో చేరవచ్చుననీ, అతడు భయపడినాడు. అందుకే భారతీయులను ఏకం చేసి, ఆంగ్లేయులు రష్యావారి కన్నా ఎన్నోరెట్లు మంచివారనీ, వారు ప్రజల పురోభివృద్ధికి పాటు పడినారనీ చాటడానికే ఈ సంఘాన్ని

స్థాపించాలనుకొన్నాడు. ఈ విషయాలన్నింటినీ హ్యూం కొత్తగా వచ్చిన డఫ్రిన్ ప్రభువుతో చర్చించి, ఇంగ్లండ్ కూడా వెళ్ళి తన అభిప్రాయాలను పార్లమెంటుకు విశదం చేసినాడు. వారందరూ అతనితో ఏకీభవించినారు.

ప్రజలను ఆనాడు ముందుకు నడిపించేవారు ఆంగ్ల విద్యను నేర్చిన వారు. వారే అసలు నాయకులు. అందువల్ల విద్యాధికులను తమవైపు తిప్పుకోవాలంటే వారికి కావలసినట్లుగా ఒక సంస్థను ఏర్పాటుచేసి, ఆ సంస్థ ద్వారా వారి సమస్యలకు పరిష్కారం చూపాలి. హ్యూం కనుక అటువంటి సంస్థ స్థాపించినట్లయితే ప్రభుత్వ సహకారం తప్పక లభిస్తుందని అదే సహకారం సురేంద్రనాథ్‌కు లభించదని అతడు నమ్మాడు. విద్యావంతులయిన భారతీయుల్లో పెరుగుతున్న అసంతృప్తి జ్వాలల నుంచి బ్రిటిష్ వారికి తగిన 'రక్షణ కవాటం' కల్పించేందుకు వీలుగా హ్యూం ఈ సంస్థను స్థాపించాడన్నది ఒక వర్గం వాదన.

అయితే కాంగ్రెస్ స్థాపనకు చెందిన మొత్తం వ్యవహారంలో హ్యూం పాత్ర పరిమితమని చెప్పాలి. భారత సంపదను మాతృదేశానికి తరలిస్తున్న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అఖిల భారత స్థాయి రాజకీయ సంస్థను ఏర్పాటు చేయడంలో దేశంలోని నూతన సాంఘిక శక్తి ఐన మధ్యతరగతి వర్గం ప్రాతినిధ్యం వహించింది. భారతదేశాన్ని రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు తీసుకెళ్ళేందుకు తగిన పోరాట పటిమగల సంస్థ వారికి అవసరమయింది. వీరందరూ నిష్కళంకమైన దేశభక్తులేగాని బ్రిటిష్ ప్రభుత్వానికి తొత్తులు కాదు. అఖిల భారత రాజకీయ సంస్థను ప్రారంభించే తొలి ప్రయత్నాల్లో అధికార యంత్రాంగం నుంచి అవరోధాలు ఏర్పడకుండా ఉండేందుకు వారు ఆంగ్లేయుడు, పదవీ విరమణ చేసిన సివిల్ సర్వెంటు అయిన హ్యూంతో సహకరించారు. హ్యూం ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపనలో చురుకుగా పాల్గొంటే బ్రిటిష్ వారిలో అనుమానాలకు, అపోహలకు ఆస్కారం ఉండదని భారతీయ దేశ భక్తులు భావించారు. అన్నిటికన్నా హ్యూంకు భారతదేశం పట్ల ప్రేమ ఉంది.

**2.3.3. భారత జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశం :** 1885 డిసెంబర్ 28 మధ్యాహ్నం 12 గంటలకు బొంబాయిలోని తేజపాల్ సంస్కృత కళాశాల గోకుల్‌దాస్ భవనంలో మొదటి జాతీయ కాంగ్రెస్ సభ డబ్ల్యు.సి. బెనర్జి అధ్యక్షతన సమావేశమైంది. ఏ.ఓ. హ్యూం, కె.టి. తెలాంగ్ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి బొంబాయి నగరం నుంచి 38 మంది, మద్రాస్ నుంచి 21 మంది, బెంగాల్ నుంచి ముగ్గురు, అయోధ్య నుంచి ఏడుగురు, పంజాబ్ నుంచి ముగ్గురు మొత్తం 72 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇదే తేదీల్లో సురేంద్రనాథ్ ఏర్పాటు చేసిన సమావేశం కూడా జరుగుతున్నందువల్ల బెంగాల్ నుంచి ముగ్గురు మాత్రమే రావడం జరిగింది. కాంగ్రెస్‌కు వచ్చిన ప్రతినిధులు వివిధ రంగాలకు, వర్గాలకు, కులాలకు చెందినవారు. వారిలో లాయర్లు, డాక్టర్లు, జమిందార్లు, బాంకర్లు, ఉపాధ్యాయులు, పత్రికా సంపాదకులు, మత సంస్కర్తలు, హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు మొదలైన వారున్నారు. వారిలో ఫిరోజ్ షామెహతా, దాదాబాయి నౌరోజీ, దిన్ షావాచా, ఆప్టే, రంగయ్యనాయుడు, ఆనందాచార్యులు, సుబ్రమణ్య అయ్యర్, కేశవ పిళ్ళై ముఖ్యులు. ఈ విధంగా భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన భారత రాజకీయ సంస్థ ఆవిర్భవించింది. భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కాంగ్రెస్ ఆవిర్భావం చాలా ప్రధానమైన సంఘటన.

**2.3.4. కాంగ్రెస్ ఉద్దేశాలు :** మూడు రోజుల పాటు జరిగిన బొంబాయి సమావేశంలో అధ్యక్షుడు డబ్ల్యు.సి. బెనర్జీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఉద్దేశాలు నలుగు అని వివరించాడు. అవి :

1. సామ్రాజ్యంలోని వివిధ భాగాలలో భారతదేశ సౌభాగ్యం గురించి శ్రద్ధ వహించి, పాటుపడే వారందరికి పరస్పర పరిచయం కలిగించి మిత్ర భావాన్ని పెంపొందించడం
2. దేశాభిమానులందరిలోను ప్రత్యక్ష స్నేహ సంభాషణల మూలంగా జాతిమత రాష్ట్ర దురభిమానాలను తొలగించి, చిరస్మరణీయమైన రిప్పన్ ప్రభువు పరిపాలనలో ప్రారంభమైన జాతీయైక్యతాభిప్రాయాలను కేంద్రీకరించి ఇంకా పెంపొందించడం.
3. నేటి ప్రధాన సాంఘిక సమస్యలపైన విద్యావంతులైన ప్రముఖులైన భారతీయులు సంపూర్ణంగా చర్చించి వారి పరిణత అభిప్రాయాలను అధికార రీత్యా ప్రకటించడం.
4. దేశ రాజకీయ కార్య దురంధరులు రాబోయే పండ్రెండు నెలల్లో ప్రజా శ్రేయస్సు కోసం చేయదగ్గ కార్యక్రమ విధానాన్ని నిర్ణయించడం.

**2.3.5. కాంగ్రెస్ చేసిన తీర్మానాలు :** ప్రథమ భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ తొమ్మిది తీర్మానాలను చేసింది. అవి :

1. భారతదేశ పరిపాలనా వ్యవహారాలను గురించి క్షుణ్ణంగా పరిశీలించడానికి బ్రిటిష్‌వారు, భారతీయులు సభ్యులుగా గల ఒక రాయల్ కమిషన్ నియామకం చేయాలి
2. ఇండియా కౌన్సిల్ రద్దు కావాలి.
3. శాసనసభలో ప్రజలు ఎన్నుకొన్న భారతీయులకు తగిన ప్రాతినిధ్యం ఉండాలి. బడ్జెట్‌ను చర్చించడానికి, ప్రశ్నలు వేయడానికి శాసనసభ్యులకు అధికారం ఉండాలి. పంజాబ్, ఉత్తర ప్రదేశ్, అయోధ్య రాష్ట్రాలలో శాసనసభలు స్థాపించాలి. శాసనసభల్లోని అధిక సంఖ్యాకులు వెలిబుచ్చిన వ్యతిరేక అభిప్రాయాలను విచారించడానికి పార్లమెంటులోని కామన్స్ సభలో ఒక స్థాయి సంఘం ఉండాలి.
4. పోటీ పరీక్షలు ఏక కాలంలో ఇంగ్లండ్, భారతదేశాలలో జరగాలి
5. సైనిక ఖర్చులు తగ్గించాలి
6. సైనిక ఖర్చులలో కొంత భాగం ఇంగ్లాండు భరించాలి.
7. బర్మాను జయించడం, భారతదేశంలో చేర్చడం నిరసించదగింది.
8. కాంగ్రెస్ చేసిన తీర్మానాలన్నిటినీ దేశంలో రాజకీయ సంఘాలు చర్చించి ప్రజల్లో రాజకీయాల పట్ల ఆసక్తి కలిగించాలి.
9. 1886 డిసెంబర్ 28వ తేదీన మరో కాంగ్రెస్ సమావేశం జరపాలి.

ఈ విధంగా 1885 లో ప్రథమంగా కాంగ్రెస్ సమావేశమై దేశ చరిత్రలో నూతన శకాన్ని ప్రారంభించి, భారతదేశ రాజకీయ చరిత్రలో శాశ్వత స్థానాన్ని కూడా సంపాదించింది. ఈ సందర్భంలో 'హిందూ' పత్రిక ఈ సమావేశం గురించి ఇంకా చెప్పింది. కాంగ్రెస్ ప్రధాన సమావేశం దిగ్విజయంగా జరిగిపోయింది. భారతదేశం రాజకీయ జీవితంలో నూతన శకంలో అడుగుపెట్టింది. భారత జాతీయ చరిత్రలో 1885 డిసెంబర్ 28 మరుపురాని దినం. వాణిజ్యానికి, సంస్కృతికి, విజ్ఞానానికి, దేశాభిమానానికి ముఖ్యమైన నగరం బొంబాయి. అటువంటి పట్టణంలో ఇంతకుముందెప్పుడు భారతదేశ చరిత్ర కనివిని ఎరుగని రీతిలో ఒక గొప్ప సంస్థ అయిన భారత జాతీయ కాంగ్రెస్ ప్రథమ సమావేశం జరగడం గర్వకరాణం. భారతదేశంలో త్వరలో జరగబోయే అనేక రాజకీయ మార్పులకు కారణమైన కాంగ్రెస్ సమావేశంపై ఈ తరంవారు రానున్న తరాలవారు చిరకాలం జ్ఞాపకం ఉంచుకుంటారు. జాత్యాభిమానం గల వివిధ ప్రాంతాలవారు, వివిధ భాషలు మాట్లాడేవారు, విద్యావంతులు కలిసి తమ జాతీయ సమస్యలను ఒకే కేంద్రం ద్వారా చర్చించి తమ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలో నిర్ణయించుకోవడానికి ప్రయత్నం చేయడం నేడు అసంభవం కాదని కాంగ్రెస్ ప్రథమ జాతీయ సమావేశం నిరూపించింది.

**2.3.6. సమీక్ష :** 1885 లో భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావంతో విదేశీ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం ఒక సంఘటిత మార్గంలో చిన్న ఎత్తున పోరాటం మొదలయింది. 1886లో భారతీయ సంఘం వారు జాతీయ కాంగ్రెస్‌లో విలీనమయ్యారు. రెండవ జాతీయ కాంగ్రెస్ సదస్సు 1886 డిసెంబర్‌లో కలకత్తాలో దాదాభాయ్ నౌరోజీ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సు జరిగినప్పటి నుంచి జాతీయ కాంగ్రెస్ ప్రజలందరి సంస్థ అయింది. భారత జాతీయ కాంగ్రెస్ ఏ ఏటికాయేడు మరింతగా బలపడుతూ విదేశీ పాలకులకు వ్యతిరేకంగా శక్తివంతమైన సంఘటితమైన ప్రజా ఉద్యమాలను నిర్మించింది.

## 2.4. భారత జాతీయ కాంగ్రెస్ - 1905 వరకు దాని కార్యక్రమాలు : (మితవాద జాతీయత 1885 - 1905)

**2.4.1. ఉపోద్ఘాతము :** 1885లో భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావంతో, దేశ స్వాతంత్ర్య సాధన కోసం సంఘటిత మార్గంలో చిన్న ఎత్తున పోరాటం మొదలైంది. 1905 వరకు కాంగ్రెస్ కార్యక్రమాలు, ఉద్యమం బలపడి, ప్రతిష్టను పెంపొందించుకొని, విదేశీ పరిపాలకులకు వ్యతిరేకంగా బలమైన తీవ్రవాద ఉద్యమాలలో భారతీయులను ప్రవేశింపచేసింది. 1885 నుంచి 1905 వరకు గల మధ్య కాలాన్ని మితవాద, జాతీయవాద శకంగా పేర్కొనవచ్చు. ఈ కాలంలో భారత పాలనా యంత్రాంగంలో అంచెలవారి సంస్కరణలను ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ అర్థించింది. ఈ కాలంలో మితవాదులు కాంగ్రెస్ సంస్థలపై పెత్తనాన్ని చెలాయించారు.

ప్రథమంలో కాంగ్రెస్‌కు యంత్రాంగం ఏదీ లేదు. కార్యదర్శి మాత్రమే ఉండేవాడు. కాంగ్రెస్ సంవత్సరానికి ఒకసారి మాత్రమే సమావేశం అయ్యేది. ఆ వార్షిక సమావేశాలు ఎక్కడ జరగాలి అన్నది కిందటి ఏడాది సమావేశంలో నిర్ణయం అయ్యేది. ప్రతి ఏటా కాంగ్రెస్ మహాసభలు ఏఏ విషయాలు చర్చించాలో వాటిని హ్యూమ్, అతని ఆంతరంగిక సహచరులు కలిసి నిర్ణయించేవారు. రెండు మూడు సంవత్సరాలైన తర్వాత చర్చనీయ విషయాలను నిర్ణయించడానికి కాంగ్రెస్‌కు హాజరైన సభ్యులకు కూడా హక్కులు ఉండాలని ఒక నిర్ణయం జరిగింది. దాంతో 1887 నుంచి విషయం నిర్ణయ సంఘం ఒకటి ఏర్పడింది. ఈ కమిటి తాత్కాలికమైంది. ఈ విధంగా కాంగ్రెస్ చరిత్రలో 15 సంవత్సరాలు గడిచిపోయాయి. సభ్యులలో కొంత అసంతృప్తి బయలుదేరింది. ఏటా మూడు రోజులు సమావేశాలు జరపడం తరవాత సభ్యులు విడిపోవడం యాంత్రికమైంది. సంవత్సరం పొడుగునా కాంగ్రెస్ పనిచేస్తేనే సవ్యంగా తన భాధ్యతలను నిర్వర్తిస్తుందనే భావన ఏర్పడింది. 15వ కాంగ్రెస్ సమావేశం లక్నోలో జరిగినపుడు ఆ నిర్ణయాన్ని అమలులోకి తీసుకొనివచ్చారు. ఆ నిర్ణయం ప్రకారం అఖిల భారత కాంగ్రెస్ కమిటి ఏర్పడింది.

కాంగ్రెస్ ప్రతి ఏటా జరిపే సమావేశం మంచి ఆదరణ పొందుతుండేది. అందుకు సాక్ష్యం సమావేశానికి హాజరయ్యే ప్రతినిధుల సంఖ్య ప్రతి ఏటా పెరగడమే. 1885లో బొంబాయిలో జరిగిన మొదటి సమావేశానికి 72 మంది, 1886లో కలకత్తాలో జరిగిన రెండో సమావేశానికి 436 మంది, మూడో సమావేశానికి 607 మంది, నాల్గో సమావేశానికి 1248 మంది, ఐదో సమావేశానికి 1859 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే ప్రేక్షకుల సంఖ్య కూడా పెరిగింది. నాటి మితవాద నాయకులలో సురేంద్రనాథ్ బెనర్జీ, దాదాబాయి నౌరోజి, బద్రుద్దీన్ త్యాబ్జీ, ఫిరోజ్ షామెహతా, గోపాలకృష్ణ గోఖలే, ఆనందాచార్యులు ముఖ్యులు. సమావేశాలకు హాజరైన ప్రతినిధుల్లో చాలా మంది ఆంగ్ల విద్యను అభ్యసించిన లాయర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, పత్రికా సంపాదకులు. వీరు కాంగ్రెస్‌లో పాల్గొనడానికి కారణం వీరిలో జాతీయ భావం ఎక్కువగా ఉండడమే.

**1.4.2. కాంగ్రెస్ లక్ష్యాలు :** నాటి భారత జాతీయ కాంగ్రెస్ ముఖ్య లక్ష్యాలు నాలుగు. అవి :

1. భారతీయులకు, ఆంగ్లేయులకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడం
2. భారతదేశంలోని వివిధ వర్గాలను ఒకే సంఘటితమైన జాతిగా రూపొందించడం
3. ప్రజల కోరికల్ని తెలుసుకొని, వాటిని చర్చించి, వాటికి పరిణత రూపమిచ్చి ప్రభుత్వం ముందు పెట్టుట.
4. దేశంలో ప్రజాభిప్రాయాన్ని సుశిక్షితం చేయటం, సమీకరించడం

ఈ పై నాల్గు లక్ష్యాలలో చివరిది అన్నింటికన్నా ముఖ్యమైనది.

**2.4.3. మితవాదుల విధానాలు :** బ్రిటిష్ సార్వభౌమత్వం పట్ల అచంచల విశ్వాసం, చట్ట బద్ధమైన విధానాల ద్వారా మాత్రమే ఆందోళన నిర్వహించాలనే రెండు స్థిర భావాలలో కాంగ్రెస్ సంస్థను స్థాపించారు. ఈ కాలంలో కాంగ్రెస్ సంస్థకు నాయకత్వం వహించిన నాయకులు, రాజ్యాంగ పద్ధతుల ద్వారా ఆందోళనను జరిపి, తమ రాజకీయ ఆశయాలను సాధించగలమని గట్టిగా నమ్మారు. ఈ నాయకులు బ్రిటిష్ సామ్రాజ్యవాద దుష్పరిణామాలను ఘాటుగా విమర్శించినా, బ్రిటిష్ పరిపాలనను మెచ్చుకున్నారు. బ్రిటిష్ పరిపాలన భారతదేశాన్ని పేదరికం నుండి ఉద్ధరించడానికి వర ప్రసాదమని వారు భావించారు. ఈ నాయకులు ఆంగ్లేయుల బుద్ధిని, నిష్పాక్షిక వైఖరిని గుడ్డిగా నమ్మారు. భారతదేశ వివిధ ప్రాంతాల నుండి ప్రతి సంవత్సరం సమావేశమయ్యే, ప్రధాన ప్రతినిధులు భారతీయ సమైక్యతకు ప్రతీక. ఆంగ్ల విద్యాభ్యాసకులైన భారతీయులలో దేశభక్తిని పెంపొందించి రాజకీయ చైతన్యాన్ని రేకెత్తించారు.

**2.4.4. మితవాద కార్యక్రమాలు :** భారతదేశాన్ని బ్రిటిష్ వారి చేతులలో నుంచి తప్పించి రాజకీయ పరమైన విముక్తి కల్పించడానికి, ప్రత్యక్ష పోరాటం చేపట్టడానికి ఇంకా సమయం ఆసన్నం కాలేదనీ, అందుకే దానిని ఇంకా అప్పుడే తమ కార్యక్రమం క్రింద చేపట్టడం సాధ్యం కాదనీ మితవాదులు స్థిరంగా అభిప్రాయపడుతూ వచ్చారు. మితవాదులు తమ లక్ష్యాలుగా పెట్టుకొన్న అంశాలు భారతీయులందరినీ

ఒక జాతి కింద ఐక్యం చేసే కార్యక్రమాన్ని పూర్తి చేయడం, జాతీయ రాజకీయ వేదికను రూపొందించడం, బ్రిటిష్ వలస ప్రభుత్వపు దోపిడీ విధానాలను బహిర్గతం చేయడం, ఆధునిక రాజకీయాలను ప్రవేశపెట్టడం, భారతీయులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి కృషి చేయడం, భారతదేశంలో ఆధునిక పెట్టుబడీదారీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ప్రోత్సాహం ఇవ్వడం మొదలైనవి.

**2.4.4.1. రాజ్యాంగ సంస్కరణలు :** ప్రథమంగా మితవాదులు తమ స్వీయ దేశాన్ని పాలించే ప్రభుత్వంలో ఎక్కువ భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రజాస్వామ్య సూత్రాన్ని పాటించమని విజ్ఞప్తి చేశారు. కాని వారు తక్షణ లక్ష్య సిద్ధి కోసం పట్టుబట్టలేదు. క్రమ క్రమంగా స్వాతంత్ర్యం సాధించాలని ఆశించారు. తమ కార్యకలాపాలను ప్రభుత్వం ఎక్కడ అణచివేస్తుందోనని వారు అతి జాగరూకతతో వ్యవహరించారు. 1885 నుంచి 1892 వరకు వారు కేవలం శాసన మండలుల విస్తరణ, సంస్కరణల కోసం మాత్రమే డిమాండు చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రతినిధులకు శాసన మండలి సభ్యత్వం పరిమితం కావాలనీ, మండలికి ఎక్కువ అధికారాలు ఉండాలనీ వారు కోరారు. మితవాదుల ఆందోళనకు లొంగిపోయి ప్రభుత్వం 1892 లో శాసనసభల చట్టం చేసింది. దీని ప్రకారం కేంద్ర శాసనసభలోనూ, రాష్ట్ర శాసనసభల్లోను సభ్యుల సంఖ్య పెరిగింది. వారిలో కొందరిని భారతీయులు పరోక్షంగా ఎన్నుకునే వీలుకలిగింది. ఏమైనా, ప్రభుత్వం చేత నియమితులైన సభ్యుల సంఖ్యాధిక్యత యధాతథంగానే ఉండి పోయింది. నూతన సభ్యులకు వార్షిక బడ్జెట్‌పై చర్చల్లో పాల్గొనే అవకాశం కలిగింది. కాని వారికి వోటు చేసే హక్కు లేదు. 1892 శాసనసభల్లో భారతీయులకు హెచ్చు ప్రాతినిధ్యం, అధికారాలు ఉండాలని వారు డిమాండు చేశారు. 20వ శతాబ్దం ప్రారంభమైన నాటికి జాతీయ నాయకులు ఇంకా కొంత ముందడుగులేసి స్వరాజ్యం కావాలని ఘోషించారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో స్వపరిపాలిత దేశాలైన ఆస్ట్రేలియా,కెనడాల నమూనాలో భారతదేశానికి స్వయం పరిపాలనా ప్రతిపత్తి కావాలని ఒత్తిడి తెచ్చారు.

**2.4.4.2. ఆర్థిక సంస్కరణలు :** మితవాదులు ఆర్థిక రంగంలో సంస్కరణల కోసం కూడా ఆందోళన జరిపారు. భారతదేశంలో పెరుగుతున్న దారిద్ర్యానికి, ఆర్థిక పరమైన బడుగు స్థితికి, ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయం అభివృద్ధి కాకుండా నిలిచిపోయిన మందకొండి స్థితికి బ్రిటీష్ పాలకుల విధానాలే కారణం అని వారు నిందించారు. బ్రిటిష్ పరిపాలన శాశ్వతంగా పాతుకుపోయి, నిత్యమూ పెరుగుతూ పోయే ఒక విదేశీ ఆక్రమణ అని దాదాభాయ్ నౌరోజీ పేర్కొన్నాడు. స్వదేశీ పరిశ్రమల విధ్వంసానికి బ్రిటిష్ వారిని నిందించారు. భారతదేశ దారిద్ర్య నిర్మూలనకు సత్వర ఆధునిక పారిశ్రామికాభివృద్ధి ఒక్కటే మార్గమని సూచించారు. టారిఫ్ రక్షణ ఇవ్వటం ద్వారా, ప్రత్యక్ష ప్రభుత్వ సహాయం అందజేయడం ద్వారా ఆధునిక పరిశ్రమల్ని పెంపొందించమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భారత పరిశ్రమల పెంపుకోసం వారు స్వదేశీ వస్తువుల వాడకాన్ని పోత్సహించారు. విదేశీ వస్తు బహిష్కరణ ప్రచారం చేశారు. భారతదేశ సంపదని బ్రిటిష్ వారు ఇంగ్లండుకు తరలించుకు పోతున్నారనీ, ఆ తరలింపుని నిలుపు చేయాలనీ జాతీయవాదులు కోరారు. భూమిశిస్తు తగ్గించాలని, తోటల్లో పనిచేసే కూలీల జీవన పరిస్థితుల మెరుగుదల కోసం జాతీయవాదులు ఆందోళన చేశారు. ఉప్పు పన్ను రద్దుకోసం డిమాండు చేశారు. మితిమీరిన సైనిక వ్యయాన్ని ప్రభుత్వం తగ్గించుకోవాలని కూడా కోరారు.

**2.4.4.3. పాలనా సంస్కరణలు :** ఉన్నత పదవులలో అధిక సంఖ్యలో భారతీయుల నియామకం జరగాలని భారతీయులు డిమాండు చేశారు. ఆర్థికంగా ఉన్నతోద్యోగాలలో యూరోపియన్లకు అత్యధిక వేతనాలు చెల్లించటం వల్ల పరిపాలన అతి ప్రియంగా తయారైంది. అవే అర్హతలు గల భారతీయులను తక్కువ వేతనాల మీద నియమించవచ్చు. యూరోపియన్ అధికార్లు తమ వేతనాల్లో హెచ్చు మొత్తాన్ని భారతదేశం వెలుపలికి పంపుకొంటున్నారు. వారికి పింఛను ఇంగ్లండులో చెల్లించబడుతోంది. భారత సంపద హరించుకుపోవటానికి ఇది కూడా అదనంగా తోడ్పడింది. రాజకీయ దృష్ట్యా ఉన్నతోద్యోగాల్లో భారతీయుల్ని నింపితే, ప్రభుత్వ పరిపాలన భారతీయుల అవసరాలకనుగుణంగా స్పందిస్తుంది. న్యాయ శాఖ అధికారులను కార్యనిర్వాహక శాఖ అధికారుల నుంచి వేరుచేయాలని జాతీయ వాదులు కోరారు. జూరీ సభ్యుల అధికారాల్లో కోతని వారు ప్రతిఘటించారు. ప్రజల్ని నిరాయుధుల్ని చేసే చర్యని వారు నిరసించారు. ప్రజల్లో విశ్వాసం ఉంచి వారికి ఆయుధాలు ధరించే హక్కును ప్రసాదించి, సందర్భం వచ్చినపుడు తమని, తమ దేశాన్ని పరిరక్షించుకునే అవకాశం ఉండేలాగు చూడమని వారు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఇతోధికంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవలసిందిగా జాతీయ వాదులు ప్రభుత్వాన్ని కోరారు.

**2.4.4.4. ఇతర సంస్కరణలు :** జాతీయవాదులు ఈ క్రింది డిమాండ్లను కూడా ప్రభుత్వానికి నివేదించారు. అవి : ప్రజల్లో ప్రాథమిక విద్యా వ్యాప్తికి ప్రాధాన్యం ఇవ్వాలి. సాంకేతిక, ఉన్నత విద్యలకు ఎక్కువ సౌకర్యాలు కలగజేయాలి. రైతాంగాన్ని వడ్డీ వ్యాపారస్థుల కోరల నుంచి తప్పించడానికి వ్యవసాయ పరపతి బ్యాంకుల్ని అభివృద్ధి చేయాలి. దేశాన్ని కరువు కాటకాలనుంచి రక్షించడానికి, వ్యవసాయాభివృద్ధికి, నీటి పారుదల సౌకర్యాల విస్తరణకు భారీ స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలి. వైద్య, ఆరోగ్య సదుపాయాలు విస్తృత పరచాలి. పోలీసు వ్యవస్థను నీతివంతంగా, సమర్థవంతంగా ప్రజాభిమాన పాత్రంగా తీర్చిదిద్దే చర్యలు తీసుకోవాలి. పేదరికాన్ని తట్టుకోలేక బ్రతుకు తెరువు కోసం విదేశాలకు తరలిపోయిన కార్మికుల తరపున జాతీయ నాయకులు గట్టిగా వాదించారు.

**2.4.4.5. పౌరహక్కుల రక్షణ :** వాక్, పత్రికా స్వాతంత్ర్యాన్ని తగ్గించడానికి జరిగే ప్రయత్నాలను జాతీయవాదులు ప్రతిఘటించారు. నిజానికి వాక్ పత్రికా స్వాతంత్ర్యం కోసం పోరాటం స్వాతంత్ర్యం కోసం సాగిన జాతీయ పోరాటంలో అంతర్భాగమయింది. తిలక్, ఇతర నాయకులు తమ ప్రసంగాలు, రచనల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవిశ్వాసం రేకెత్తిస్తున్నారనే ఆరోపణ మీద బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం వారిని విచారించి దీర్ఘకాల కారాగారవాస శిక్ష విధించింది. అదే సమయంలో ఇద్దరు పూనా నాయకులు విచారణ లేకుండా దేశం నుంచి బహిష్కరించబడ్డారు. ఈ దాడికి వ్యతిరేకంగా దేశం మొత్తం ఉడుకెత్తిపోయింది.

**2.4.4.6. రాజకీయ కార్య పద్ధతులు :** చట్టం యొక్క నాలుగు గోడల మధ్య రాజ్యాంగ బద్ధమైన ఆందోళన జరపడం మితవాదుల రాజకీయ పద్ధతి. నెమ్మదిగా, క్రమ బద్ధంగా రాజకీయ ప్రగతి సాధించడం వారు ఎన్నుకున్న పద్ధతి. దేశంలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి, ప్రజల కోర్కెలను మహజర్లు, సభలు, తీర్మానాలు, ప్రసంగాల ద్వారా ప్రభుత్వానికి నివేదించినట్లయితే, అధికార్లు క్రమంగా ఆ కోర్కెల్ని ఆమోదిస్తారని మితవాదుల విశ్వాసం. అందువల్ల వారి రాజకీయ కృషి రెండు దిశల్లో సాగింది. ఒకటి ప్రజల్లో జాతీయ భావాన్ని, రాజకీయ చైతన్యాన్ని ఉద్దీప్తం చెయ్యటానికి భారతదేశంలో ఒక పటుతరమైన ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి. రాజకీయ సమస్యలపైన ప్రజానీకాన్ని విజ్ఞానవంతుల్ని చేసి, ఒక త్రాటిమీద నడిపించాలి. మౌలికంగా కాంగ్రెస్ తీర్మానాలు, విజ్ఞాపనలు ఈ గమ్యం దిశగానే సాగాయి. రెండు జాతీయవాదులు నిర్దేశించిన మార్గంలో సంస్కరణలు ప్రవేశపెట్టమని ప్రభుత్వానికి నచ్చజెప్పాలి. బ్రిటిష్ ప్రజలకు, పార్లమెంటును భారతదేశం పట్ల న్యాయబద్ధంగా వ్యవహరించాలనే కాంక్ష ఉందని మితవాదులు భావించారు. అయితే వారికి భారతదేశంలోని వాస్తవ పరిస్థితులు తెలియవని మితవాదుల విశ్వాసం. కాబట్టి, దేశంలో ప్రజాభిప్రాయాన్ని చైతన్యవంతం చేసే కార్యక్రమం తరువాత బ్రిటిష్ ప్రజలకు కనువిప్పు కలుగజేసేందుకు మితవాదులు కృషి చేశారు. అది సాధించేందుకు వారు బ్రిటన్‌లో చురుగ్గా ప్రచార కార్యక్రమం కొనసాగించారు. అయితే తిలక్ లాంటి రాజకీయ నాయకులకు మొదటి నుంచీ బ్రిటిష్ వారి సదుద్దేశాల పట్ల విశ్వాసం లేదు. వీరు ఒక సమరశీల రాజకీయ, ఆర్థిక కార్యక్రమానికి అనుకూలంగా వాదించారు. వీరినే తరువాత అతివాదులని వ్యవహరించారు.

**2.4.4.7. కాంగ్రెస్ అఖిల భారత జాతీయ సంస్థ (తీర్మానాలు) :** కాంగ్రెస్ అఖిల భారత జాతీయ సంస్థ అని చెప్పడంలో తప్పులేదు. కాంగ్రెస్‌లో ప్రతిపాదించే తీర్మానాలు, అమల్లోకి తీసుకొచ్చిన తీర్మానాలు దేశంలోని వివిధ వర్గాల వారికి సంబంధించినవి. రైతులకు, పారిశ్రామికులకు, వ్యాపారస్తులకు సంబంధించిన తీర్మానాలెన్నో కాంగ్రెస్‌లో చేశారు. 1885 నుంచి కాంగ్రెస్ చేసిన తీర్మానాలను పరిశీలిస్తే కాంగ్రెస్ దృక్పథం ఎంత విశాలమైందో తెలుస్తుంది. ఆ తీర్మానాలలో ముఖ్యమైనవి :

1. ఇండియా కౌన్సిల్‌ను రద్దు చేయాలి.
2. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరిక్షలు ఏక కాలంలో బ్రిటన్, భారతదేశాల్లో జరగాలి.
3. న్యాయ, కార్యనిర్వహణ శాఖలు రెండూ తక్షణం వేరు చేయాలి.
4. సైనిక వ్యయం తగ్గించి, ఇంగ్లండ్, ఇండియా రెండు దేశాలు సైనిక వ్యయాన్ని భరించి, ఆ సైనిక వ్యయం న్యాయంగా విభజించాలి.
5. జ్యూరీ విచారణను విస్తరింపజేయాలి
6. భారతీయులలో స్వచ్ఛంద సైనికులను ఏర్పాటు చేయాలి

7. భారతీయులకు సైనిక ఉద్యోగ శిక్షణ ఇప్పించే నిమిత్తం సైనిక కళాశాలలను నిర్మించాలి.

8. ఆయుధ శాసనాలను, నిబంధనలను మార్పు చేయాలి

9. పారిశ్రామిక విద్య, పారిశ్రామిక వృద్ధిపై శ్రద్ధ వహించాలి

10. నిర్భంద కూలీ విధానాన్ని, నిర్భంధంగా వస్తువులను సరఫరా చేయాల్సిన పద్ధతిని రద్దు చేయాలి.

11. దేశీయ పత్తి పరిశ్రమలపై పన్ను తీసి వేయాలి.

12. న్యాయవాది సంఘం నుంచి ఉన్నత న్యాయమూర్తి పదవులకు తగిన వారిని నియమించాలి.

13. వలస రాష్ట్రాలలోని భారతీయుల స్థితిని మెరుగుపరచాలి.

14. వ్యవసాయ బ్యాంకులు స్థాపించాలి. క్షామ భీమా నిధి వెంటనే నిర్మించాలి.

15. భారతదేశం నుంచి విదేశానికి పోతున్న ధన ప్రవాహాన్ని అరికట్టాలి.

16. ప్రభుత్వ వ్యయం, పన్నులు తగ్గించాలి

17. భూమి పన్నుల విధానాన్ని సంస్కరించడం,

18. భారతీయులకు న్యాయం కలిగేటట్లు విద్యాశాఖలో, ఉద్యోగ పద్ధతుల్లో మార్పు చెయ్యాలి.

19. చిన్న, సివిల్ ఉద్యోగాల్లో ఎక్కువ మంది భారతీయులను నియమించాలి.

20. పి.డబ్ల్యు.డి. ఉన్నతోద్యోగాల్లో భారతీయులను ఎక్కువ సంఖ్యలో నియమించాలి.

21. మూడు నాలుగు తరగతుల కిందకు వచ్చే అడవుల్లో వంట చెరకు, పశువులకు పచ్చగడ్డి, చిన్న చిన్న ఇళ్ళకు, వ్యవసాయ పనిముట్లకు కావాల్సిన కలప సామాగ్రి రైతులకు ఉచితంగా ఇవ్వాలి.

22. అటవీ నిబంధనలు రైతులను అవమానపరచడానికి, నిర్భంధ పరచడానికి ప్రయత్నించరాదు.

పై తీర్మానాలను పరిశీలిస్తే అన్ని కూడా జాతి, మత, కుల, విచక్షణ లేకుండా ప్రజలందరి దృష్టిని మనస్సులో పెట్టుకొని చేసిన తీర్మానాలని తెలుసుకోవచ్చు.

**2.4.4.8.** ప్రభుత్వ స్పందన : భారత జాతీయ కాంగ్రెస్ అవతరించి ప్రతిష్టను పెంపొందించుకుంటున్నప్పుడు బ్రిటీష్ అధికార వర్గం ఎలా స్పందించిందో పరిశీలిద్దాం. తొలిదశలో కాంగ్రెస్ ప్రతినిధులను వనభోజనాలకు ఆహ్వానించి గౌరవించారు. కానీ ఈ స్నేహపూరిత వాతావరణ ఎక్కువ కాలం కొనసాగలేదు. ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక సంస్థగా కాంగ్రెస్ హక్కును లార్డ్ డఫ్రిన్ తిరస్కరించి కాంగ్రెస్‌ను ఎగతాళి చేశాడు. భారత జాతీయ కాంగ్రెస్ కొద్దిమంది రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయుల చర్చా వేదికగా మాత్రమే కొనసాగుతుందని బ్రిటిష్ అధికారులు భావించారు. కానీ కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించారు. సమావేశాలను నిర్వహించి కర పత్రాలను పంచిపెట్టారు. ఈ కొత్త పరిణామాలను బ్రిటిష్ అధికారులు దేశ ద్రోహ చర్యగా భావించారు.

జాతీయ ఆర్థిక ఆందోళన సామ్రాజ్యవాదపు దోపిడీ స్వరూపాన్ని బట్టబయలు చేసిందని బిపిన్ చంద్ర అభిప్రాయపడినాడు. బ్రిటీష్ అధికారులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తీవ్ర పద జాలంతో దుష్ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులపట్ల శత్రుభావాన్ని ప్రకటించారు. జాతీయ నాయకులను ప్రభుత్వంపైన విశ్వాసం లేనివారని, రాజద్రోహ పూరిత బ్రాహ్మలని, తీవ్ర భావాలు కల దుర్మార్గులను బ్రిటిష్ అధికారులు విమర్శించారు. కాంగ్రెస్‌ను దేశ ద్రోహాన్ని ప్రోత్సహించే సంస్థ అని నిందించారు. కాంగ్రెస్ నాయకులు ఆ పదవులను

పొందలేక అసంతృప్తి చెందిన న్యాయవాదులని, వారు స్వీయ ప్రయోజనాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని బ్రిటిష్ అధికారులు విమర్శించారు. కాంగ్రెస్ పతనం కావటానికి సిద్ధంగా ఉంది. "నేను భారతదేశంలో ఉండగానే ఆదికన్ను మూమహినికి సహాయపడాలని నా కోరిక' అని కర్జన్ ప్రకటించాడు.

భారతీయులలో సమైక్యత తమ పరిపాలనకు ప్రమాదాన్ని తెస్తుందని బ్రిటిష్ అధికారులు గుర్తించారు. కాంగ్రెస్ సంస్థ ప్రభావాన్ని తగ్గించడానికి కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి బ్రిటిష్ అధికారులు విభజించి పాలించు విధానాన్ని అనుసరించారు. సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్, శివ ప్రసాద్ మొదలగు బ్రిటిష్ అనుకూలులచే కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమాన్ని మొదలుపెట్టించి ప్రోత్సహించారు. హిందువులకు, ముస్లింలకు మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నించారు. బ్రిటీష్ అధికారులు ఉన్నత, మధ్య తరగతి ముస్లింలను జాతీయ ఉద్యమానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టారు. విభజించి పాలించే విధానం హిందువులకు, ముస్లింలకు మాత్రమే పరిమితము కాలేదు. ఫ్యూడల్ వర్గాలను మేధావి వర్గానికి వ్యతిరేకంగా వైషమ్యాన్ని పెంచటానికి అధికారవర్గం తీవ్రంగా ప్రయత్నించిందని 'బిపిన్ చంద్ర' అంటారు. కానీ జాతీయ ఉద్యమ వికాశాన్ని అరికట్టడంలో అధికారుల ప్రతిఘటన పనిచేయలేదు.

**2.4.4.9. ముగింపు :** జాతీయ ఉద్యమము కానీ, జాతీయ కాంగ్రెస్ కానీ ప్రారంభ దశలో అనగా మితవాద యుగంలో ఏమీ సాధించలేదని కొందరు విమర్శకుల వాదన. జాతీయ వాదులు ఆందోళన జరిపిన సంస్కరణలలో కొన్నింటిని మాత్రమే బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మితవాద యుగంలో జాతీయ ఉద్యమం ప్రజలలో వ్యాప్తి చెందలేదని కూడా విమర్శకులు పేర్కొన్నారు. ఈ విమర్శలలో చాలా నిజం ఉంది. కానీ తొలి జాతీయ ఉద్యమం వైఫల్యం అని చెప్పడం మాత్రం సరికాదు. జాతిని మేల్కొల్పడంలో అది విజయవంతమైంది. తామంతా ఒకే జాతికి చెందిన వారం, తమది భారతజాతి అనే సంవేదనని ప్రజల్లో రేకెత్తించటంలో అది విజయవంతమైంది. అది ప్రజల్ని రాజకీయ కుశలతలో సుశిక్షితుల్ని చేసింది. జాతీయత, ప్రజాస్వామ్యాల పట్ల ప్రజల్లో అభిమానం పెంపొందించింది. వాళ్ళలో ఆధునిక దృక్పథాన్ని ప్రభోదించింది. బ్రిటిష్ పాలన దుష్పరిణామాన్ని వాళ్ళ కళ్ళకు కట్టింది. అన్నింటికన్నా ముఖ్యంగా అది బ్రిటిష్ సామ్రాజ్యవాద ఆర్థిక తత్వాన్ని స్వభావాన్ని ప్రజల చేత గుర్తింప చేసింది. బ్రిటన్ భారతదేశాన్ని ముడిపదార్థాలు సరఫరా చేసే దేశంగా బ్రిటీష్ వస్తువులకు విపణివీధిగా బ్రిటిష్ పెట్టుబడులకు సుక్షేత్రంగా తయారుచేస్తున్నదనే సత్యాన్ని పూర్వజాతీయోద్యమం ప్రజలకు చాటి చెప్పింది. తరువాత దశలో ప్రజలు విరివిగా ముందుకు వచ్చి, రాజకీయ పోరాటాన్ని సాగించడానికి అవసరమైన ఒక ఉమ్మడి రాజకీయ, ఆర్థిక కార్యక్రమాన్ని అది రూపొందించింది. భారత ప్రజల ప్రయోజనాల కోసం భారతదేశ పరిపాలన జరగాలనే రాజకీయ సత్యాన్ని అది ప్రతిష్ఠించింది. భారతీయ జీవనంలో జాతీయతా సమస్యను ప్రబలం చేసింది.

## 1.5. నమూనా ప్రశ్నలు

1. భారత జాతీయ కాంగ్రెస్‌కు పూర్వం ఉన్న సంఘాల స్వరూపం, వాటి ఆశయాలు గురించి వివరింపుము
2. ఇండియన్ అసోసియేషన్ స్థాపనకు దారి తీసిన పరిస్థితులు, దాని ఆశయాలు, సాధించిన విజయాలు తెలుపుము
3. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన గురించి వ్రాయుము
4. 1905 వరకు భారత జాతీయ కాంగ్రెస్ (మితవాదుల) కార్యక్రమాలను వివరింపుము.

## 1.6. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Modern India, |
| 2. | R.C. Majumdar, | : | Advanced History of India |
| 3. | R.C. Agarwal, | : | Constitutional History of Indian National Movement |
| 4. | Percival Spear, | : | History of India, Vol. 2 |
| 5. | Sumit Sarkar, | : | Modern India, |
| 6. | S. Gopal, British | : | Policy in India, 1885-1905 |
| 7. | B.N. Pandey (ed), | : | The National Movement, 1885 - 1947 |
| 8. | V.B. singh (ed), | : | Economic History of India, 1857 - 1956 |
| 9. | Tarachand, | : | History of Freedom Movement in India. |


డా॥ వి.కె. మోహన్

యూనిట్ - 5

పాఠం - 3

# వందేమాతర ఉద్యమము – కాంగ్రెస్‌లో తీవ్రవాద విజృంభణ, ముస్లిం లీగ్ – మత తత్వ విజృంభణ

# (The Vandematarem Movement - The Rise of Extremist Section in Congress and League)

**3.0 లక్ష్యం :**

బెంగాల్ విభజనకు వ్యతిరేఖంగా ప్రారంభమైన వందేమాతర ఉద్యమం గురించి, కాంగ్రెస్‌లో తీవ్రవాద విజృంభణ గురించి, ముస్లింలీగ్, మతతత్వ విజృంభణ గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయసూచిక :**


3.1 ఉపోద్ఘాతము

3.2 తీవ్రవాద విజృంభణకు కారణాలు

3.2.1. 1892 - 1905 మధ్య సంభవించిన రాజకీయ సంఘటనలు

3.2.2. ప్రభుత్వ ఆర్థిక విధానాలు

3.2.3. నాయకుల బోధనలు

3.2.4. కర్జన్ విధానాలు

3.2.5. స్వరాజ్య సాధన

3.2.6. అంతర్జాతీయ ప్రభావం

3.2.7. నిరుద్యోగం

3.2.8. అనుకూల రాజకీయ వాతావరణం

3.2.9. పునరుద్దరణ స్వభావం

3.2.10. భారత జాతీయ బీజదశ

3.3 మిత వాదులు, తీవ్ర వాదులు మధ్య బేధాలు

3.4 బెంగాల్ విభజన

3.5. వందేమాతర ఉద్యమం లేదా స్వదేశీ ఉద్యమం

3.5.1. విదేశీ వస్తు బహిష్కరణ

3.5.2. స్వదేశీ ఉద్యమం

3.5.3. బ్రిటీష్ అణచివేత విధానం

3.5.4. ముగింపు

3.6. సూరత్ కాంగ్రెస్ సమావేశం

3.7. మింటో - మార్లే సంస్కరణల చట్టం

3.8. ముస్లిం లీగ్ - మత తత్వ విజృంభణ

3.8.1. విభజించి పాలించు విధానం

3.8.2. ఆలీఘర్ ఉద్యమం

3.8.3. మతతత్వ విజృంభణకు కారణాలు

3.8.4. మింటో వద్దకు ముస్లిం ప్రతినిధి వర్గం

3.8.5. ముస్లిం లీగ్ స్థాపన

3.8.6. లక్నో ఒప్పందం

3.8.7. హిందూ మహా సభ

3.8.8. ముగింపు

3.9. నమూనా ప్రశ్నలు

3.10. చదువదగిన గ్రంథాలు


## 3.1 ఉపోద్ఘాతము

జాతీయ కాంగ్రెస్ శాంతియుత విధానం, రాజ్యాంగ బద్ద పద్దతులు, మితవాద ధోరణి ఆంగ్ల ప్రభుత్వంపై పెద్దగా ప్రభావం చూపలేదు. అందువల్ల కాంగ్రెస్‌లోని అతివాద వర్గం తీవ్రవాద ధోరణితో తలపడి కోర్కెలను సాధించుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. భారతదేశ వివిధ ప్రాంతాలలో పంజాబ్, బెంగాల్, మహారాష్ట్రలలో లాలా లజపతిరాయ్, బిపెన్ చంద్రపాల్, బాలగంగాధర్ తిలక్‌ల (వీరినే లాల్‌పాల్ బాల్ అనేవారు) నాయకత్వంలో తీవ్రవాద కార్యక్రమం ఉద్రుతమైంది. ఈ నాయకులు 'పోరాడితేగానీ రాజకీయ హక్కులు లభించవని' ప్రకటించారు. వీరు నిద్రాణమైన జాతిని మేల్కొలిపి ప్రజలను చైతన్యవంతులుగా చేశారు. వీరి నాయకత్వంలోని తీవ్రవాధులు బ్రిటిష్ వాగ్దానాలను నమ్మలేదు. ప్రజలను ఆత్మగౌరవం పెంపొందించుకోవాలని వీరు ఉద్బోదించారు. జాతిమనాధులను భారతీయప్రజల శక్తి సామర్థ్యాలపై నమ్మకముంచి ఆధారపడాలని ఈ నాయకులు కోరారు. రాజకీయ స్వేచ్ఛ కోసం సుదీర్ఘ సంఘర్షణకు దారితీసే కార్యక్రమాన్ని అనుసరించాలని వీరు ప్రగాఢంగా విశ్వసించారు.

## 3.2. తీవ్రవాద విజృంభణకు కారణాలు :

1905 నుంచి కాంగ్రెస్‌లో అతివాద మితవాద వర్గాల మధ్య భేదాభిప్రాయాలు ఎక్కువయ్యాయి. క్రమంగా మితవాదుల ప్రభావం తక్కువై అతివాదుల ప్రభావం ఎక్కువైంది. వారి ప్రభావం తక్కువ కావటానికి ముఖ్య కారణాలు :

**3.2.1. 1892-1905 మధ్య సంభవించిన రాజకీయ సంఘటనలు :** 1892 చట్టం జాతీయ వాదులను సంతృప్తి పరచలేదు. దీనివల్ల భారతీయులకు పరిపాలన అధికారాలు ఏ మాత్రం లభించలేదు. విదేశీ ప్రభుత్వం పట్ల ప్రజానీకంలో రాజకీయ అసంతృప్తిని రెచ్చగొట్టడం నేరంగా ప్రకటిస్తూ 1898 లో చట్టం వచ్చింది. 1899లో కలకత్తా పురపాలక సంస్థలో భారతీయ సభ్యుల సంఖ్య తగ్గించబడింది. 1904 లో ప్రభుత్వం పత్రికా స్వాతంత్రం మీద ఆంక్షలు విధిస్తూ చట్టం తెచ్చింది. 1897లో నాతూ సోదరులను విచారణ లేకుండా దేశం నుంచి బహిష్కరించింది. అదే సంవత్సరం విదేశీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నారనే నేరం మాద తిలక్, ఇతర పత్రికా సంపాదకులు కారాగార శిక్షలకు గురయ్యారు. ప్రభుత్వం తమకు రాజకీయ హక్కులు ఎక్కువ చేయటానికి బదులు ఉన్న స్వల్ప

హక్కులను సైతం లాగి వేసుకుంటుందని ప్రజలు అర్థం చేసుకున్నారు. కర్జన్ కాంగ్రెస్ వ్యతిరేక వైఖరి ప్రజలకు బోధపడింది. బ్రిటిష్ పాలన సామాజికంగా, సాంస్కృతికంగా కూడా అభ్యుదయాత్మకముగా లేదు. ప్రాథమిక, సాంకేతిక విద్యావ్యాప్తి స్తంభించిపోయింది. ఉన్నత విద్యపట్ల అధికారులకు అనుమానాలు ఎక్కువయ్యాయి. ఉన్నత విద్యా వ్యాప్తిని నిరుత్సాహపరచటానికి అధికారులు ప్రయత్నము చేశారు. 1904లో వచ్చిన భారత విశ్వ విద్యాలయాల చట్టాన్ని జాతీయ నాయకులు ఆమోదించలేదు. భారతీయ విశ్వ విద్యాలయాలను ప్రభుత్వం పూర్తిగా తన అదుపాజ్ఞలలో పెట్టుకోవటానికి ఉన్నత విద్యా వ్యాప్తిని అరికట్టటానికి ఉద్దేశింపబడిన చట్టముగా జాతీయ నాయకులు దానిని పరిగణించారు. ఈ విధముగా భారత ప్రజలలో చాలా మంది దేశ రాజకీయ, సాంస్కృతిక అభివృద్ధికి స్వపరిపాలిత ప్రభుత్వం తప్పనిసరిగా ఉండితీరాలని గట్టిగా నమ్మారు. రాజకీయ దాస్యం అంటే భారత ప్రజల అభివృద్ధిని ఎదగనివ్వకుండా చేయటమేనని ప్రజలకు ఆధారమైంది.

**3.2.2. ప్రభుత్వ ఆర్థిక విధానాలు :** ప్రభుత్వ ఆర్థిక విధానం అతివాద ధోరణి పెరగటానికి దోహదం చేసింది. భారతదేశం నుండి ఇంగ్లండ్‌కు ఎగుమతి అవుతున్న వస్త్రాలపై సుంకాలు అధికం చేసి ఇంగ్లండ్ నుండి దిగుమతి అయ్యే వస్త్రాలపై సుంకాన్ని తొలగించడంవల్ల దేశ వస్త్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. సామ్రాజ్య వాద ఆర్థిక విధానాల ఆంతర్యాన్ని గ్రహించిన నాయకులు మితవాద పద్ధతుల వల్ల ఉపయోగం లేదని అతివాద వర్గాన్ని ఎంచుకున్నారు. 1896 నుండి 1900 వరకు దేశంలో అనేక ప్రాంతాలు దుర్భర క్షామానికి గురయ్యాయి. దీనిని అరికట్టటానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదు. క్షామ నివారణ చర్యలు చేపట్టక రాజదర్బార్ నిర్వహించటానికి కర్జన్ చూపిన ఉత్సాహం సైనిక వ్యయాన్ని తగ్గించటానికి విముఖత వ్యక్తం చేయటం కూడా తీవ్రవాదానికి బలం చేకూర్చింది. భయంకరమైన ప్లేగు వ్యాధి సోకటం వల్ల అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణ సంఘటన వల్ల బ్రిటిష్ ప్రభుత్వం పట్ల ప్రజలలో నమ్మకం పోయింది. ప్రభుత్వాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శించారు. చైతన్యవంతులైన యువకులు తీవ్రవాద భావాల వల్ల ప్రభావితులై ఉద్యమంలో చేరారు.

**3.2.3 నాయకుల బోధనలు :** ఆనాటి ప్రముఖ నాయకుల బోధనలు యువకులను అతివాదం వైపుకు మళ్ళించాయి. బంకించంద్ర చటర్జీ, స్వామి దయానంద సరస్వతి, స్వామి వివేకానంద, అరవింద ఘోష్‌ల రచనలు, బోధనలు నాటి యువ తరాన్ని ఎక్కువగా ప్రభావితం చేశాయి. బంకించంద్ర చటర్జీ తన ఆనందమఠ్ నవలలో దేశ భక్తికి ప్రాముఖ్యమిచ్చి దేశం కోసం ఏ త్యాగమైనా చేయటానికి సంసిద్ధులు కావాలనే సందేశాన్ని ప్రచారం చేశాడు. దయానందుడు, వివేకానందుడు తమ బోధనలలో దేశాన్ని దేవతగా పూజించి గౌరవించాలని ప్రబోధించారు. వివేకానందుని రచనలు తమకెంతో స్ఫూర్తిని కలిగించాయని నాటి అతివాద నాయకులు పేర్కొన్నారు. ప్రాచీన భారతీయ వైభవాన్ని గుర్తుచేసి భారతీయుల జాతీయ ఐక్యతకు ప్రాధాన్యం ఇచ్చిన దయానందుని బోధనలు నాయకులను అతివాదంవైపు మళ్ళించాయి. అరవింద ఘోష్ రచనలు ప్రత్యక్షంగా అతివాద సిద్ధాంతాన్ని బలపరిచాయి. అతడు మితవాద కాంగ్రెస్‌వారి విధానాలను ఘాటుగా విమర్శించాడు. పిరికితనం పోవాలని ధైర్య సాహసాలు, త్యాగాలతోనే విదేశీయుల నుంచి విముక్తి లభిస్తుందని అరవిందుడు తెలియ చేశాడు. బెంగాల్‌లో రాజ నారాయణ బోస్, అశ్వనీ కుమార్ దత్త్ వంటివారు, మహారాష్ట్రంలో విష్ణు శాస్త్రి, చిప్లంకర్ వంటి వారు సమరశీల జాతీయ భావాలు వ్యాప్తి చేశారు. బెంగాల్‌లో వెలువడిన పత్రికలు, నవలలు, నాటకాలు ప్రజా హృదయాలలో దేశ భక్తిని, జాతీయ అభిమానాన్ని రగుల్గొల్పాయి.

**3.2.4. కర్జన్ విధానాలు :** 1899 నుంచి 1905 వరకు గవర్నర్ జనరల్‌గా వ్యవహరించిన కర్జన్ భారతదేశ మధ్యతరగతి విద్యాధికులను అనేక పద్ధతులలో అవమానపరచాడు. విశ్వ విద్యాలయాలపై ప్రభుత్వ ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. దేశ ప్రజల భావాలను లెక్కచేయక ఏక పక్షముగా బెంగాల్‌ను విభజించి ముస్లింలను బ్రిటిష్ ప్రభుత్వానికి అనుకూలముగా మళ్ళించటానికి ప్రయత్నించాడు. దానితో ప్రజలలో ఆంగ్ల ప్రభుత్వం పట్ల ద్వేషం పెరిగింది. బెంగాల్ విభజనను అతివాద నాయకులు జాతీయ సమస్యగా అభివర్ణించారు. బెంగాల్ ఏకీకరణకు ఉద్యమం చేపట్టాలని తీర్మానించారు. ప్రభుత్వంతో తీవ్రతర ఆందోళనా మార్గంలో పోరాడితేగానీ ప్రభుత్వం దిగిరాదు అనే భావం అతివాద వర్గ నాయకులలో బలీయమైంది. వీరు మితవాదులను బిక్షాటకులుగా విమర్శించారు. స్వరాజ్య సాధనే కాంగ్రెస్ ధ్యేయం కావాలని ఉద్ఘాటించారు.

**3.2.5. స్వరాజ్య సాధన :** అతివాద నాయకులు స్వరాజ్య సాధన జాతీయ ఉద్యమ లక్ష్యమని స్వరాజ్యమంటే భారతీయులు తమను తాము స్వయంగా పరిపాలించుకోవటమే అని స్పష్టంగా ప్రకటించారు. ఇంకా వారు జాతీయతా భావాన్ని ఆధ్యాత్మిక సాంస్కృతిక భావాల

సమ్మేళనంగా నిర్వచించి గణపతి ఉత్సవాలను దుర్గ పూజలను జరిపించి ప్రజలను సమైక్య పరచటమే కాకుండా వారిలో బ్రిటిష్ వ్యతిరేక భావాలను వెదజల్లటానికి ప్రయత్నించారు.

**3.2.6. అంతర్జాతీయ ప్రభావం :** ఇదే కాలంలో ఇతర దేశాలలో సంభవించిన సంఘటనలు భారతదేశంలో అతివాద జాతీయ వాదం అభివృద్ధికి దోహదం చేశాయి. 1868 తరువాత జపాన్ గొప్ప అభివృద్ధి సాధించింది. ఇక వెనుకబడిన ఆసియాదేశం స్వశక్తి మీద అభివృద్ధి పొందవచ్చుననేది జపాన్ అవతరణ నిరూపించింది. కొద్ది కాలములోనే జపాన్ నాయకులు తమ దేశాన్ని ప్రథమ స్థాయి పారిశ్రామిక సైనిక శక్తిగా రూపొందించారు. సమర్థవంతమైన ఆధునిక పరిపాలనా విధానాన్ని నిర్మించారు. సార్వత్రిక ప్రాథమిక విద్య ప్రవేశపెట్టారు. ఇటువంటి జపాన్ చేతిలో యూరోపియన్ అగ్ర రాజ్యాలలో ఒకటైన రష్యా 1404లో విడిపోవడం భారతీయులలో నూతన ఉత్తేజాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించింది. తిలక్ కేసరి పత్రికలో జపాన్ విజయాన్ని ప్రసంసిస్తూ ఉత్తేజకరమైన వ్యాఖ్యలు చేశాడు. ఆసియా దేశాలు స్వతంత్ర జాతులుగా అవతరించి తమ ఐరోపా ప్రత్యర్థులకు సముజ్జీకాగలరని 'కేసరి' వ్యాఖ్యానించింది. ఇటలీ సైన్యం 1896లో ఇథియోపియన్ల చేతిలో పరాజయం చెందింది. ప్రజలంతా ఒక్కటై రంగంలోకి దూకితే శక్తివంతమైన నిరంకుశ ప్రభుత్వాలనైనా సవాలు చేయవచ్చుననే సత్యాన్ని ఐర్లండ్ రష్యా, ఈజిప్ట్, టర్కీ, చైనాలలోని విప్లవ ఉద్యమాలు భారత ప్రజల మనస్సుకు ఎక్కించాయి.

**3.2.7. నిరుద్యోగము :** 19వ శతాబ్దానికి దేశంలో విద్యావంతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారిలో చాలా మంది అతి తక్కువ వేతనం మీద ప్రభుత్వ ఉద్యోగాలలో చేరారు. ఇంకా చాలా మంది నిరుద్యోగులుగా మిగిలిపోయారు. నిరుద్యోగులలో చాలా మంది అతివాద రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. విద్యా వ్యాప్తి వల్ల పాశ్చాత్య భావాల ప్రభావం అధికమైంది. ప్రజాస్వామ్యం, జాతీయవాదం మొదలగు పాశ్చాత్య సిద్ధాంతాలు వ్యాప్తి చెందాయి. విద్యావంతులు ఈ భావాలను వ్యాప్తి చేయుటలో ప్రచారకులుగా తయారయ్యారు. తీవ్రవాద జాతీయవాదాన్ని అనుసరించారు.

**3.2.8. అనుకూల రాజకీయ వాతావరణం :** 20వ శతాబ్దం ఆరంభంలో జాతీయవాదుల ఉద్యమానికి అనుకూల రాజకీయ వాతావరణం ఉదయించింది. ఈ ఉద్యమం అనుయాయిలు జాతీయ ఉద్యమ ద్వితీయ ఘట్టానికి సారథ్యం వహించటానికి ముందుకు వచ్చారు. తిలక్ మాత్రమే కాకుండా బిపిన్ చంద్రపాల్, అరవిందఘోష్, లాలా లజపతిరాయ్‌లు అతివాద జాతీయ ఉద్యమ ప్రముఖ నేతలయ్యారు. భారతీయులు తమ విముక్తి కోసం తామే కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని తమ స్థితిగతుల మెరుగుకు స్వయంగా పాటుపడాలని వారు నమ్మారు. ఈ కర్తవ్య పరిపూర్తికి త్యాగాలకు సిద్ధపడాలని వారు ప్రకటించారు. వారి ప్రసంగాలలో రచనలలో రాజకీయ కార్యకలాపాలలో ఆత్మ విశ్వాసం వెల్లివిరిశాయి. వీరు విదేశీ పాలనను తీవ్రంగా గర్హించారు. స్వరాజ్య సాధనే జాతీయ ఉద్యమ లక్ష్యమని వారు ప్రకటించారు.

**3.2.9. పునరుద్ధరణ స్వభావము :** తీవ్రవాద జాతీయనాయకులు హిందువుల ప్రాచీన వైభవం వల్ల ఉత్తేజితులయ్యారు. వేద కాలం నుండి హిందూ వైభవం నుండి చంద్ర గుప్తుడు, అశోకుడు మొదలైన చక్రవర్తులు పరిపాలన వల్ల రాణా ప్రతాప్, శివాజీ వంటి గొప్ప నాయకుల సాహస కృత్యాల వల్ల రాణి ఝాన్సీ, లక్ష్మిబాయి పరాక్రమము వల్ల ఉత్తేజితులయ్యారు. జాతీయతను మతపరిభాషలో మత తాంత్రిక ముసుగులో తత్వవేత్తలు ప్రకటించారు.

**3.2.10. భారత జాతీయ బీజదశ :** 1885-1905 మధ్య కాలంలో భారత జాతీయత మొలకెత్తింది. జాతీయ వాదులు జాతీయ ఉద్యమం బలపడటానికి గట్టి పునాదులు వేశారు. మితవాద నాయకుల మాచకత్వ విధానాన్ని ఘాటుగా విమర్శించారు. జాతీయ ఉద్యమ లక్ష్యం స్వాతంత్ర్యం అని స్పష్టంగా ప్రకటించారు. బంకించంద్ర చటర్జీ, అరవింద ఘోష్, తిలక్‌లు మితవాదులు అనుసరించిన విధానాలను ఘాటుగా విమర్శించారు. ఈ విధముగా అతివాద జాతీయవాద ఆవిర్భావానికి పరిస్థితులు పరిణమించాయి.

## 3.3 మితవాదుల, తీవ్రవాదుల మధ్య బేధాలు :

మితవాదులు బ్రిటిష్ సామ్రాజ్యం పట్ల అచంచల విశ్వాసాన్ని ప్రకటించారు. సాంఘిక, సాంస్కృతిక రంగాలలో వెనుకబడిన భారతీయుల అభివృద్ధికి ప్రాతినిధ్య ప్రభుత్వ నిర్వహణకు తర్ఫీదు ఇవ్వటానికి బ్రిటన్ మార్గదర్శకం కావాలని భావించి బ్రిటన్‌ను ఆదర్శప్రాయంగా

పరిగణించారు. భారతదేశంలోని ఉదారవాదులు తమ దేశ ప్రయోజనాలు, బ్రిటన్ ప్రయోజనాలు ఒకటేనని భావించారు. మితవాదుల నాయకత్వంలో కాంగ్రెస్ సామాన్య ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహించలేదు. కానీ, వారి కష్టాల గురించి మాత్రం వ్యాఖ్యానించింది. మిత వాదులు క్రమ బద్ధమైన అభివృద్ధినే విశ్వసించారు. విప్లవాత్మకమైన మార్పులను వ్యతిరేకించారు.

తీవ్రవాదులు బ్రిటిష్ పరిపాలనను వ్యతిరేకించారు. ఆందోళనతో కూడిన కార్యక్రమాన్ని కాంగ్రెస్ అనుసరిస్తే తప్ప బ్రిటిష్ పాలకులు అధికారాన్ని వదులుకోరని తీవ్రవాదులు నమ్మారు. వారు స్వరాజ్యాన్ని, రాజకీయ స్వేచ్ఛను కోరారు. ప్రభుత్వంపై ఆర్థిక పరంగా ఒత్తిడి తీసుకురావటానికి స్వదేశీ దృక్పథాన్ని ప్రోత్సహించారు. బ్రిటిష్ వస్తువుల బహిష్కరణను సమర్థించారు. స్వరాజ్‌ను గాఢంగా సమర్థించారు. ప్రతి దేశానికి స్వేచ్ఛ పొందే హక్కు ఉందని భావించి బ్రిటిష్ పాలన నుండి స్వేచ్ఛను సాధించాలని తీవ్రంగా భావించారు. సైనిక తిరుగుబాటు ఆచరణ సాధ్యం కాదు కనుక వీరు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని సమర్థించారు. ప్రజలలో ఉత్సాహాన్ని రేకెత్తించటానికి వీరు ఉద్యమానికి మత రంగు ఆపాదించారు. మాతృ భూమిని దేవతగా ఆరాధించటానికి బంకించంద్రుని వందేమాతరం గేయాన్ని ప్రార్థనాగీతంగా ఉపయోగించారు. వీరు రాజకీయ యాచకత్వ విధానాన్ని వ్యతిరేకించారు. బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక దోపిడీ విధానాన్ని గర్హించి విదేశీ వస్తు బహిష్కరణను సూచించారు. 'స్వరాజ్యం నా జన్మ హక్కు దానిని పొంది తీరుతాను' అని తిలక్ తన ఆశయం గురించి ఒకే వాక్యంలో స్పష్టంగా చెప్పాడు. స్వరాజ్యమంటే బ్రిటిష్ పరిపాలనపై ఆధారపడకుండా స్వతంత్ర్యం సాధించటం. తీవ్రవాద నాయకులు వేద సంస్కృతి ఆధిక్యతను ఉజ్వలమైన ప్రాచీన చరిత్రను గురించి ప్రజలకు తెలిపారు. వీరి ప్రబోధాల వల్ల తీవ్రవాద జాతీయభావం పెంపొందింది. వీరు దేశ ప్రజానీకంలో భవిష్యత్‌పట్ల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింపచేశారు. బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్‌ల ప్రభావం వల్ల బెంగాల్‌లో జాతీయ వాదం మత దృక్పథాన్ని సంతరించుకుంది. తిలక్ చైతన్యవంతమైన విధానాల వల్ల సామాన్య ప్రజలు ఆకర్షితులయ్యారు. తిలక్ ఆశయాలు స్వదేశీ ఉద్యమానికి ఊపును ఇచ్చాయి.

## 3.4. బెంగాల్ విభజన :

1905 లో బెంగాల్ విభజన ప్రకటనతో భారత జాతీయ ఉద్యమం రెండో ఘట్టంలో ప్రవేశించింది. లార్డ్ కర్జన్ 1905 జూలై 20న బెంగాల్ రాష్ట్రాన్ని రెండుగా విభజిస్తూ ఉత్తరువు జారీ చేశాడు. మూడు కోట్ల పది లక్షల జనాభా కలిగిన తూర్పు బెంగాల్, అస్సాంలు కలిపి ఒక భాగం. ఐదుకోట్ల నలభై లక్షల జనాభా కల మిగతా బెంగాల్ రెండవ భాగం. అందులో కోటి ఎనభై లక్షల మంది బెంగాలీలు, మిగిలిన మూడుకోట్ల అరవై లక్షల మంది బీహార్, ఒరిస్సా వారు. భారతదేశంలో అతిపెద్ద రాష్ట్రం బెంగాల్. దీనిని ఒక రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా పరిపాలించటం చాలా కష్టమైన పని కాబట్టి, రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విభజిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఈ విభజన వ్యూహాన్ని రచించిన అధికారుల లక్ష్యాలు వేరు. బెంగాల్‌లో ఉప్పొంగే జాతీయోద్యమ వెల్లవకు అడ్డుకట్ట వేయటం వారి ఆశయం. భారత ప్రభుత్వ హోం శాఖ కార్యదర్శి రిస్లీ 1904 డిసెంబర్ 6న రాసిన నోట్‌లో ఇలా ఉంది. "అవిభక్త బెంగాల్ ఒక శక్తి దానిని విడగొడితే కకావికలమౌతుంది." కాంగ్రెస్ నాయకులు భావించేది అదే. వారి అనుమానాలు పూర్తిగా సరైనవే. బెంగాల్ విభజన ప్రతిపాదనలో గొప్పగా పరిగణింపదగ్గ అంశం అదే. "బీరార్‌ను మధ్య పరగణాలతో విలీనం చేసిన పద్ధతి మాదిరిగానే ఈ పథకంలో బెంగాల్‌ను చీల్చి, మన పాలనని ప్రతిఘటించే గట్టి ప్రత్యర్థుల్ని బలహీన పర్చటమే మన ప్రధాన ధ్యేయం". 1905 ఫిబ్రవరిలో లార్డ్‌కర్జన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ సంస్థ పలుకుబడి యావత్తు బెంగాల్‌లోనే కాకుండా, దేశం మొత్తంలో పాకిపోవటానికి కలకత్తా ఒక కేంద్రమైందని లార్డ్ కర్జన్ అభిప్రాయం. కాబట్టి, కాంగ్రెస్ సంస్థ యొక్క విజయవంతమైన కుతంత్రానికి కేంద్రంగా తయారైన కలకత్తాని పడగొట్టాలని ఆయన రాశాడు.

## 3.5. వందేమాతర ఉద్యమం (లేదా) స్వదేశీ ఉద్యమం :

పరిపాలనా సౌలభ్యం నెపంతో అతిపెద్దదైన బెంగాల్ రాష్ట్రాన్ని 1905లో కర్జన్ 2 రాష్ట్రాలుగా విభజించాడు. ఈ చర్య వల్ల బెంగాల్‌లో హిందువులు, మహమ్మదీయులు అధిక సంఖ్యలో ఉండే ప్రాంతాలు వేరయ్యాయి. ఈ విభజన ఇరు వర్గాలకు ఇష్టం లేదు. అన్ని ప్రధాన ఉద్యమాలకు కేంద్రంగా ఉంటూ వచ్చిన బెంగాలీల ఉధృతాన్ని తట్టుకోలేక కర్జన్ విభజించి పాలించు సూత్రాన్ని పాటించి బెంగాల్‌ను విభజించాడు. కాంగ్రెస్‌లోని అతివాదులు, మితవాదులు కలిసికట్టుగా విభజన వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమాన్ని

వందేమాతర ఉద్యమం, స్వదేశీ ఉద్యమం అని అంటారు. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన తొలి ప్రజా ఉద్యమం వందేమాతర ఉద్యమం. బంకించంద్ర చటర్జీ వ్రాసిన ఆనంద మఠ్ నవలలోని వందేమాతర గేయం ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చింది. అందువల్ల దీనిని వందేమాతర ఉద్యమం అన్నారు. ఈ ఉద్యమం బెంగాలుకు పరిమితంకాక దేశ వ్యాప్తమైనది. ఈ ఉద్యమం మొదట్లో మితవాదుల నేతృత్వంలో జరిగినా క్రమంగా అతివాద, తీవ్రవాద నాయకత్వానికి మరలింది.

1903 లో కర్జన్ ప్రతిపాదన తెలిసినప్పటి నుండి బెంగాలీలు ఆందోళన ప్రారంభించారు. 1903 డిశెంబర్ నుండి 1905 అక్టోబర్ లోపల సుమారు 3 వేలకు పైగా బహిరంగ సభలను నిర్వహించారు. రాజకీయ సంఘాలు, వార్తా పత్రికలు, ఈ ప్రతిపాదనను గర్హిస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేశాయి. సుమారు 70వేల మంది ప్రజలు సంతకం చేసిన వినతి పత్రాన్ని భారత రాజ్య కార్యదర్శికి సమర్పించారు. ఈ విధంగా ప్రకటితమైన తీవ్రమైన అసంతృప్తిని నిర్లక్ష్యం చేసి బ్రిటిష్ ప్రభుత్వం 1905 అక్టోబర్ 16న బెంగాల్‌ను విభజించింది.

భారత జాతీయ కాంగ్రెస్, బెంగాల్ జాతీయవాదులు విభజనను దృఢంగా వ్యతిరేకించారు. భారత జాతీయతకు బెంగాల్ విభజన ఒక సవాలుగా జాతీయవాదులు పరిగణించారు. ఈ చర్య కేవలం పరిపాలనా సౌలభ్యం కొరకు తలపెట్టిందికాదని వారు గ్రహించారు. వారి దృష్టిలో అది బెంగాల్‌ను చీల్చి, బెంగాల్‌లో జాతీయ ఆవేశాన్ని నిర్వీర్యపరచి కూలగొట్టటానికి పన్నిన బుద్ధి పూర్వక ప్రయత్నం. అది బెంగాల్ భాషా సంస్కృతుల వికాశానికి కూడా గొడ్డలిపెట్టు. పరిపాలనా సామర్థ్యమే ఆ ప్రతిపాదన లక్ష్యమైతే బెంగాలీ భాషా ప్రాంతం నుంచి హిందీ, ఒరియా భాషా ప్రాంతాలను విడదీస్తే సరిపోతుందని జాతీయ నాయకులు సూచించారు. అది ప్రజాభిప్రాయాన్ని కాలరాసివేస్తూ ప్రభుత్వం తీసుకున్న చర్య. బెంగాల్ ప్రజల సున్నిత హృదయాన్ని గాయపరచిన చర్య. ప్రజాభిప్రాయాన్ని కర్జన్ మొండిగా నిర్లక్ష్యం చేయటం వల్ల చట్టబద్ధమైన ఆందోళనా విధానానికి సమాధి కట్టడమైందని ఆర్. సి. మంజుదార్ అభిప్రాయపడినాడు. బెంగాల్ విభజన ప్రకటన నిశ్చేష్టులను చేసిందని సురేంద్రనాద్ బెనర్జీ పేర్కొన్నాడు. ఈ నిర్ణయం బెంగాలీలను ఘోరంగా అవమానపరచిందని, దగా చేసిందని ప్రకటించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్, గురుదాస్ సింగ్ బెనర్జీ, మైమెన్ సింగ్, కాశింబజార్ మహారాజులు ఈ విభజనను వ్యతిరేఖించారు. బెంగాల్ విభజనను అందరూ ముక్తకంఠంలో గర్హించారు. అన్ని రాజకీయ వర్గాలు బెంగాల్ విభజనను ప్రతిఘటించాయి. ఉద్యమ ప్రారంభదశలో సురేంద్రనాధ్ బెనర్జీ, కృష్ణ కుమార మిత్ర వంటి మితవాదులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. మలిదశలో అతివాదులు ఉద్యమాన్ని చేపట్టారు. నిజానికి అతివాదులు, మితవాదులు ఉభయులూ ఉద్యమంలో పరస్పరం సహకరించుకున్నారు.

బెంగాల్ విభజన వ్యతిరేఖ ఉద్యమం 1905 ఆగస్ట్ 7న ప్రారంభమైంది. ఆ రోజు కలకత్తా టౌన్ హాల్‌లో విభజనకు వ్యతిరేకంగా ప్రదర్శన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన ప్రతినిధులు ఉద్యమాన్ని రాష్ట్ర నలుమూలలకు తీసుకుపోవటానికి తలా దిక్కుకు కదలి వెళ్ళారు. బెంగాల్ విభజన అమలులోకి వచ్చిన రోజున **(1905 అక్టోబర్ 16)** ప్రతిఘటన ఉద్యమ నాయకులు ఆ రోజుని బెంగాల్ అంతటా జాతీయసంతాప దినంగా ప్రకటించారు. నిరాహార దీక్ష పాటించారు. కలకత్తాలో హర్తాల్ జరిగింది. ప్రజలు జోళ్ళు లేకుండా వట్టి కాళ్ళతో నడచివెళ్ళి ఉషః కాలంలో గంగా నదిలో స్నానాలు చేశారు. ఆ సందర్భానికనుగుణంగా రవీంద్ర కవీంద్రుడు ఒక జాతీయ గీతం రచించాడు. ఆ గీతం ఆలపిస్తూ అశేష జనవాహిని కలకత్తా వీధుల్లో ఒక పరవళ్ళు తొక్కింది. బంకించంద్రుని వందేమాతరం నినాదంతో కలకత్తా వీధులు మార్మోగిపోయాయి. ఆనాటి నుచే వందేమాతరం వంగజాతీయ గీతమైంది. రక్షాబంధన ఉత్సవం కొత్త పుంత తొక్కింది. ఆ రోజున బెంగాల్ ప్రజలు రెండు బెంగాలుల, బెంగాలీల అభేద్య సమైక్యతకు చిహ్నంగా పరస్పరం ఒకరిచేతికొకరు రక్షా బంధం కట్టారు.

ఆ రోజు మధ్యాహ్నం బ్రహ్మాండమైన ప్రజా ప్రదర్శన జరిగింది. జాతీయ నాయకుల్లో అతిరధుడు ఆనంద మోహన్ బోస్ బెంగాల్ సమైక్యతకు ప్రతీకగా ఫెడరేషన్ హాలుకు శంకుస్థాపన చేశాడు. 50 వేల మంది ప్రజలకు పైగా హాజరైన బహిరంగ సభలో ప్రసంగించాడు. ఆ మహాసభలో బెంగాల్ ఐక్యత పరిరక్షణకు శాయశక్తులా కృషి చేస్తామని ఒక ప్రతిజ్ఞా తీర్మానం ఆమోదించబడింది.

**3.5.1. విదేశీ వస్తు బహిష్కరణ :** ప్రజా ప్రదర్శనలో, బహిరంగ సభలు, తీర్మానాలు బ్రిటిష్ పాలకులపై ఎటువంటి ప్రభావం చూపకపోవచ్చునని బెంగాల్ నాయకులు భావించారు. ప్రజల తీవ్ర ఆవేదన, ఆవేశం ప్రస్ఫుటంగా ప్రదర్శితమయ్యే ఒక దృఢ కార్యాచరణ అవసరమైంది. అదే విదేశీ వస్తు భహిష్కరణ, స్వదేశీ ఉద్యమం. దిగుమతి చేసుకున్న వస్త్రాలను చాలా ప్రాంతాలలో బహిరంగంగా దహనం చేశారు. ఆర్థిక బహిష్కరణ ఉద్యమం బ్రహ్మాండంగా విజయవంతమైంది. బెంగాల్ వస్త్ర వ్యాపారం అకస్మాత్తుగా తగ్గిపోయింది.

కొద్దికాలం తరువాత విదేశీ ఉప్పు, పంచదార ఇతర వస్తువులను కూడా బహిష్కరించారు. భారతదేశానికి స్వాతంత్రం సాధించటంకోసం ప్రతి రంగంలోనూ బ్రిటిష్ వారికి సహాయ నిరాకరణ చేయాలనే భావం తలపడింది.

**3.5.2. స్వదేశీ ఉద్యమం :** బ్రిటిష్ వస్తువుల బహిష్కరణ వల్ల స్వదేశీ వస్తువులకు గిరాకీ ఎక్కువైంది. అందువల్ల స్వదేశీ వస్తువుల ఉత్పత్తి పెంచవలసి వచ్చింది. అరవిందుడు ఈ ఉద్యమ ప్రాధాన్యతను గురించి తెల్పిన అభిప్రాయం వల్ల పూర్తిగా ఆర్థిక దృక్పథం నుండి ఈ సమస్యను పరిశీలించటం జరగలేదు. ఈ ఉద్యమం జాతీయ వాదానికి ప్రత్యక్ష నిదర్శనం. బెంగాల్ విభజన తరువాతే భారతదేశంలో నిజమైన చైతన్యం పెంపొందినదని బెంగాల్ విభజన దినం బ్రిటిష్ సామ్రాజ్య విభజన దినంగా పరిగణించాలని గాంధీ పేర్కొన్నాడు.

స్వదేశీ ఉద్యమం భారతీయ పరిశ్రమలకు గొప్ప ఊపు నిచ్చింది. అనేక బట్టల మిల్లులు, అగ్గి పెట్టెలను, సబ్బులను తయారుచేసే కర్మాగారాలు, కుండలను, పాదరక్షలను తయారుచేసే కర్మాగారాలను చాలా చోట్ల స్థాపించారు. బెంగాల్ కెమికల్ కర్మాగారాన్ని P.C. రే స్థాపించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వదేశీ స్టోర్‌ను తెరిచాడు. బ్యాంకులను, భీమా కంపెనీలను స్థాపించటానికి చాలా మంది జమీందారులు, వ్యాపారులు రాజకీయ నాయకులతో కలిశారు.

సాంస్కృతిక రంగంలో స్వదేశీ ఉద్యమం అనేక ఫలితాలను సాధించింది. జాతీయ కవిత, వచనం, పత్రికా రచన వికసించాయి. రవీంద్రనాథ్ ఠాగూర్, రజనీకాంత్ సేన్, ముకుంద దాస్‌లు దేశభక్తి గేయాలను వ్రాశారు. జాతీయ భావాన్ని ప్రోత్సహించటానికి తిలక్, లజపతిరాయ్ జాతీయ విద్యాభావాన్ని విస్తరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో జాతీయ విద్యా సంస్థలను సాధించారు. కలకత్తాలో, మచిలీపట్నంలో జాతీయ కళాశాలలు స్థాపించబడింది.

స్వదేశీ ఉద్యమం దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించింది. ఆర్థిక బహిష్కరణ, స్వదేశీ ఉద్యమం అఖిల భారత ప్రాతిపదికను సంతరించుకుంది. బెంగాల్ ఐక్యతను విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాన్ని సమర్థిస్తూ బొంబాయి, మద్రాస్ నగరాలలో ఉత్తర భారతదేశంలో చాలా చోట్ల ఉద్యమాలు నిర్వహించారు. తిలక్, బిపిన్ చంద్ర, అరవిందు, లజపతిరాయ్ మొదలగువారు పత్రికలు, సమావేశాల ద్వారా దేశం అంతటా ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం వేగంగా విస్తరించింది. బ్రిటిష్ వారి వ్యాపారం చాలా వరకు తగ్గింది. బహిరంగ సమావేశాలు, ప్రదర్శనలు, హర్తాళ్‌లు జరిగాయి. స్వదేశీ ఉద్యమాన్ని విస్తరించటంలో తిలక్ ప్రముఖ పాత్ర నిర్వహించాడు. తిలక్ పశ్చిమ భారతంలో స్వదేశీ ఉద్యమాన్ని ప్రచారం చేశాడు. పూనాలో విదేశీ వస్త్ర దహన కార్యక్రమాన్ని నిర్వహించాడు. పూనాలో నేత కంపెనీని స్థాపించాడు.

స్వదేశీ ఉద్యమం ఆంధ్ర ప్రాంతంలో కూడా జరిగింది. ప్రజలలో స్వదేశీ భావం పెంపొందించటానికి స్వదేశీ సభలు ఏర్పడ్డాయి. గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు, న్యాపతి సుబ్బారావు స్వదేశీ సందేశాలను ప్రచారం చేశారు. బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర జిల్లాలో పర్యటించి ప్రసంగించినప్పుడు ఆంధ్ర ప్రాంత ప్రజలలో స్వదేశీ జాతీయ భావాలు పెల్లుబికాయి. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు వందేమాతరం బ్యాడ్జిలతో కళాశాలకు వెళ్ళినందుకు వందేమాతర నినాదాలు చేసినందుకు కళాశాల నుంచి బహిష్కరించారు. కాకినాడలో కృష్ణారావు అనే బాలుడు వందేమాతరం నినాదం చేసినందుకు మెడికల్ ఆఫీసర్ డా॥కెంప్ అతనిని చితకబాదాడు. అందుకు నిరసనగా ప్రజలు ఉద్యమం నిర్వహించారు.

స్వదేశీ ఉద్యమంలో స్త్రీలు ప్రముఖంగా పాల్గొన్నారు. ఊరేగింపులలో, పికెటింగ్‌లలో స్త్రీలు ఎంత ఉత్సాహంతో చేరారు. పట్టణాలలో మధ్య తరగతి స్త్రీలు జాతీయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. ప్రథమంలో చాలా మంది ముస్లింలు స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్నారు కానీ, మధ్యతరగతి మధ్యఉన్నత వర్గాలలో చాలా మంది తటస్థంగా ఉండిపోయారు. ముస్లింలలో కొందరు ఉన్నత వర్గాల వారు డక్కా నవాబు నాయకత్వంలో బెంగాల్ విభజనను సమర్థించారు. మతతత్వ ధోరణిని ప్రోత్సహించి బ్రిటిష్ అధికారులు డక్కా నవాబును తదితర ముస్లిం ప్రముఖులను ప్రోత్సహించారు. బెంగాల్ విభజన వ్యతిరేఖ ఉద్యమం ప్రజాదరణ పొందినప్పటికీ బెంగాల్‌లో ఈ ఉద్యమం రైతాంగాన్ని కదలించలేదు. మొత్తం మీద ఈ ఉద్యమం పట్టణాలకు రాష్ట్రంలో మధ్య తరగతి ప్రజలకు పరిమితమైంది.

**3.5.3. బ్రిటిష్ అణచివేత విధానం :** బెంగాల్ విభజనకు వ్యతిరేఖంగా ప్రారంభమైన వందేమాతర ఉద్యమం 1908 వరకు సాగింది. చివరికి ప్రభుత్వం అణచివేత విధానాల ఫలితముగా ఉద్యమం క్షీణించింది. ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయటానికి ప్రభుత్వం

ఒకవైపు, దమననీతిని, మరొకవైపు కుటిల నీతిని ప్రయోగించింది. ప్రభుత్వం విద్యార్థులపై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. చాలా మంది విద్యార్థుల నుండి ప్రభుత్వం జరిమానా వసూలు చేసింది. పాఠశాలలు, కళాశాలల నుండి విద్యార్థులను ప్రభుత్వం బహిష్కరించింది. కొందరు విద్యార్థులను నిర్బంధించారు. మరికొందరిని లాఠీలతో కొట్టారు. అలాగే ప్రభుత్వం వేలాది ప్రజలను నిర్బంధించి చెరశాలకు పంపింది. ఊరేగింపులలో పాల్గొన్న ప్రజలను పోలీసులు లాఠీలతో కొట్టారు. పత్రికలపై నిర్భంధాలను విధించారు. వందేమాతరం సంపాదకుడు అరవింద ఘోష్, సంధ్య సంపాదకుడు ఉపాధ్యాయ, యుగంధర్ సంపాదకుడు భూపేంద్రనాథ్‌దత్‌లను విచారించి శిక్షించారు. ఉద్యమాన్ని అణచటానికి అధికారులు నాయకులను నిర్బంధించి దేశం నుండి పంపించి వేశారు. లజపతిరాయ్, అజిత్ సింగ్‌లను దేశం నుండి బహిష్కరించారు. తిలక్‌పై విచారణ జరిపి కఠిన కారాగార శిక్ష విధించారు.

గవర్నర్ జనరల్ మింటో హిందువులు, ముస్లిం మధ్య మితవాదులు, అతి వాదుల మధ్య విభేదాలు సృష్టించటానికి నిరంతరం కృషి చేశాడు. భారతీయుల అభిమతానికి అనుగుణమైన నూతన రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టడం జరుగుతుందని వాగ్దానం చేసి మితవాద, నాయకులను ఆకర్షించటానికి ప్రయత్నాలు జరిగాయి. నూతన రాజ్యాంగ సంస్కరణలను అనుసరించి జరగబోయే ఎన్నికలలో ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పరచి వారి హక్కులను కాపాడటం జరుగుతుందని వాగ్దానం చేసి ముస్లిం నాయకులను ఆకర్షించడానికి ప్రయత్నించారు. బ్రిటిష్ అధికారుల ప్రోత్సాహం వల్లే 'అఖిల భారత ముస్లిం లీగ్' స్థాపితమైంది. ఇందువల్ల కొంత మంది ముస్లిం నాయకులు వందేమాతర ఉద్యమానికి దూరమయ్యారు.

**3.5.4. ముగింపు :** వందేమాతర ఉద్యమం వల్ల బెంగాల్ విభజన రద్దు కానప్పటికీ ఉద్యమ లక్ష్యాలు చాలా వరకు నెరవేరాయి. స్వదేశీ భావన దేశమంతటా అన్ని రంగాలలో వ్యాపించింది. ఈ ఉద్యమ కాలంలో జాతీయ భావాలు ఇంకా ఎక్కువ మంది ప్రజలను ప్రభావితం చేశాయి. 1911లో బ్రిటిష్ సామ్రాజ్య చక్రవర్తి జార్జ్ - 5 భారతదేశానికి వచ్చిన సందర్భంలో ఢిల్లీలో ఏర్పాటు చేసిన దర్బార్‌లో బెంగాల్ విభజన రద్దు చేస్తున్నట్లు నాటి గవర్నర్ జనరల్ హార్డింజ్ ప్రకటించాడు. దీనితో 1905లో ప్రారంభమైన వందేమాతర ఉద్యమం ముగిసింది. అదే సంవత్సరం రాజధానిని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చటం జరిగింది.

బెంగాల్ రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దటానికి ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం జాతీయ ఉద్యమంగా రూపొందింది. జాతీయ ఉద్యమంలో తీవ్రవాద జాతీయవాదం శాశ్వత లక్షణంగా రూపొందింది. వివిధ రాజకీయ వర్గాల ప్రజలు అకుంటితమైన దేశ భక్తితో బెంగాల్ విభజనను ప్రతిఘటించటానికి సమైక్యంగా వ్యవహరించారు. ఈ విభజన రద్దు కావాలని ఉద్యమం ప్రారంభమైందో ఆ విభజన రద్దు అయ్యింది. ఈ విజయాన్ని వందేమాతర ఉద్యమం సాధించింది. ఇది బెంగాల్ ప్రజలకు మాత్రమే గాక భారతీయులందరికి విజయం ప్రభుత్వాన్ని ఎదిరించి భారతీయులు సాధించిన తొలి ఘన విజయం ఇదే. 1905 నుంచి 1911 వరకు ప్రజాశక్తి, ప్రజాశక్తుల మధ్యపోరాటం జరిగి చివరకు ప్రజాశక్తి విజయం చెందింది అని వెంకట రంగయ్య తన స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో పేర్కొన్నాడు.

## 3.6. సూరత్ కాంగ్రెస్ సమావేశం :

మితవాద, అతివాద వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో 1907లో సూరత్ సమావేశం జరిగింది. 1907 కాంగ్రెస్ సమావేశం నాగపూర్‌లో జరగవలసి ఉండగా అతివాదులు ప్రాబల్యం ఆ ప్రాంతంలో ఎక్కువని భయపడిన మితవాదులు సమావేశాన్ని మితవాద నాయకుడైన ఫిరోషా మెహతాకు ఎక్కువ ప్రజాధరణ ఉన్న సూరత్‌కు మార్చారు. సమావేశ అధ్యక్ష పదవికి అతివాదులు లాలా లజపతిరాయ్‌ని ప్రకటించగా మిత వాదులు రాస్ బిహారి ఘోష్‌ను ప్రతిపాదించారు. లజపతిరాయ్ పోటీ నుంచి విరమించుకున్నాడు. సమావేశానికి ముందుగా ప్రచురించిన చర్చనీయ అంశాల కరపత్రాలలో అతివాదులు కోరిన స్వయం పాలన, విదేశీ వస్తు బహిష్కరణ, జాతీయ విద్య ప్రసక్తి లేకపోవటంతో వారు ఆగ్రహించారు. తిలక్ ఇతర అతివాద నాయకులతో చర్చలు జరిపి స్వరాజ్యం భహిష్కరణ అంశాలు చర్చనీయ అంశాలుగా అంగీకరించకపోతే తగిన చర్య తీసుకోవాలని నిర్ణయించారు. సూరత్‌లో 23వ కాంగ్రెస్ సమావేశం ప్రారంభం కాగానే తిలక్ సభను ఉద్దేశించి ప్రసంగించటానికి అనుమతి కోరగా అధ్యక్షుడు రాస్ బిహారీ ఘోష్ నిరాకరించాడు. తిలక్ అధ్యక్షుని నిర్ణయాన్ని ఆమోదించలేదు. అందువల్ల సమావేశంలో కొట్లాటలు జరిగాయి. అధ్యక్షునికి, సురేంద్రనాథ్ బెనర్జీకి గాయాలు తగిలాయి. సమావేశం రద్దయింది. తిలక్ రాజీ యత్నాలు ఫలించలేదు. మితవాదులు విడిగా సమావేశమై అతివాదులను కాంగ్రెస్ నుంచి

బహిష్కరించారు. తిలక్ నాయకత్వంలో Nationalist Party అనే నూతన పార్టీ స్థాపించబడింది. ఈ చీలిక వల్ల ఉభయులకు ప్రయోజనము కలుగలేదు. మితవాద, నాయకులకు యువతరముతో సంబంధం పోయింది. బ్రిటిష్ ప్రభుత్వం విభజించి పాలించే విధానం ద్వారా అతివాదులను అణచటానికి మితవాదులను తమవైపుకు తిప్పుకోవటానికి ప్రయత్నించింది. దాని ఫలితమే మింటో మార్లే సంస్కరణలు లేక 1919 భారత శాసన సభల చట్టము.

## 3.7. మింటోమార్లే సంస్కరణల చట్టం :

బెంగాల్ విభజనకు వ్యతిరేఖంగా దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన వందేమాతరం ఉద్యమం తరువాత ముఖ్యంగా దేశంలోని మితవాద వర్గాన్ని తృప్తిపరచటానికి బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టింది. వాటినే 'మింటో మార్లే సంస్కరణలు' అంటారు. ఆనాటి వైస్రాయి మింటో, ఇంగ్లండ్‌లోని భారతదేశ వ్యవహారాల కార్యదర్శి కలసి రూపొందించినవే 1909 మింటో మార్లే సంస్కరణలు చట్టం. ఈ చట్టాన్ని అనుసరించి కేంద్ర, రాష్ట్ర శాసన సభలను విస్తరించారు. 16 మంది సభ్యులున్న కేంద్ర శాసన సభను 69కి పెంచారు. వీరిలో 37 మంది అధికార సభ్యులు కాగా, 32 మంది అనధికార సభ్యులు. పెద్ద రాష్ట్రాల శాసన సభ్యుల సంఖ్యను 50కి చిన్నరాష్ట్రాల సంఖ్యను 30కి పెంచారు. కేంద్ర శాసన సభలలో భారతీయ సభ్యులకు ప్రజా సమస్యలను, ప్రజా సంక్షేమ కార్యక్రమాల విషయాలను చర్చించి తీర్మానాలు ప్రతిపాదించే వీలు కల్పించారు. ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు వేయటానికి అనుమతించారు. బడ్జెట్‌ను చర్చించటానికి, విమర్శించటానికి అవకాశం కల్పించారు. రాష్ట్రాలలో అధికార సభ్యులకు ఆధిక్యత ఏర్పడినప్పటికీ గవర్నర్‌లకిచ్చిన అధికారం వల్ల మెజారిటీ నిర్ణయాలను తోసిపుచ్చే అధికారం గవర్నర్‌కు ఉంది. 'విభజించి పాలించు' అను విధానానికి అనుగుణంగా ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పడ్డాయి. ఈ చట్టం భారత రాజ్య కార్యదర్శి సలహా మండలిలో ఇద్దరు భారతీయులకు వైస్రాయి కార్యనిర్వహక సంఘంలో ఒక భారతీయునికి స్థానం కల్పించింది. ఈ విధంగా వైస్రాయి కార్యనిర్వహక సంఘంలో సత్యేంద్ర ప్రసన్నసిన్హా నియమింపబడినాడు. ఈ చట్టం భారతీయులకు ఏ విధంగానూ బాధ్యతాయుత అధికారాన్ని కల్గించలేదు. స్త్రీలకు ఓటు హక్కు కల్గించలేదు. ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పరచటంతో భవిష్యత్తులో దేశంలోని శిక్కులు, క్రైస్తవులు ప్రత్యేక ప్రాతినిధ్యం కోరే అవకాశం కలిగింది. ఈ ప్రత్యేక ప్రాతినిధ్య సౌకర్య విధానమే 1947 నాటి దేశ విభజనకు దారి తీసింది.

## 3.8. ముస్లింలీగ్ - మతతత్వ విజృంభణ :

భారతదేవంలో మత తత్వ పరమైన రాజకీయాల విజృంభణ వల్ల విద్వేష వాతావరణం నెలకొన్నది. భారతదేశంలో హిందువులు, మహ్మదీయులు రెండు ప్రత్యేక జాతులమని ముస్లిం లీగ్ ఒక కొత్త సిద్ధాంతాన్ని రూపొందించింది. ఈ అశాస్త్రీయ వ్యాఖ్యానానికి ధీటుగా హిందూ మత తీవ్రవాదులు హిందువులే భారత జాతివారని ఇతర మతాలను అనుసరించేవారు విదేశీయులని పేర్కొన్నారు. ఈ విధంగా జాతీయవాదానికి పూర్తి విరుద్ధమైన మతతత్వం బ్రిటిష్ సామ్రాజ్య వాదపు శిశువు.

బ్రిటిష్ వారు భారతదేశంపై తన ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి ముందు మహమ్మదీయులు అనేక శతాబ్దాల పాటు పరిపాలించారు. పరాజితులైన జాతిగా బ్రిటిష్ పాలనను ముస్లింలు తీవ్రంగా నిరసించారు. మొదటి బ్రిటిష్ కంపెనీ హిందువులకు అనుకూలంగా వ్యవహరించి ప్రోత్సహించింది. ముస్లింలు తమ పాలనకు వ్యతిరేకులని బ్రిటిష్ వారు భావించి కంపెనీ పరిపాలనా యంత్రాంగంలో వారికి ప్రముఖ పదవులను ఇవ్వలేదు. చాలా మంది ముస్లింలు చేతి వృత్తులపై ఆధారపడినారు. అయితే కుటీర పరిశ్రమలు నాశనం కావటంతో చాలా మంది ముస్లింలు జీవనోపాధిని కోల్పోయారు. విద్యాపరంగా కూడా ముస్లింలు వెనకపడ్డారు. 1857 తిరుగుబాటులో హిందువుల, ముస్లింలు కలసి పోరాడిన బ్రిటిష్ అధికార వర్గం ముస్లింలనే శత్రువులుగా భావించింది. ముస్లింలు అణచివేసి సైనిక సివిల్ పరిపాలన యంత్రాంగంలో ఉన్నత పదవులకు అనర్హులుగా ప్రభుత్వం పరిగణించింది. ముస్లింలు బ్రిటిష్ అధికార్ల వైఖరిని ద్వేషించి నిరసించారు.

**3.8.1. విభజించి పాలించు విదానం :** భారత జాతీయ ఉద్యమం ఉధృతి కావటంతో బ్రిటిష్ అధికారులు ముస్లింల పట్ల అనుకూలముగా వ్యవహరించటానికి నిశ్చయించుకున్నారు. తమ అధికారాన్ని శాశ్వతంగా కొనసాగించటానికి బ్రిటిష్‌వారు అనుసరించిన కుటిల విధానమే విభజించి పాలించు విధానం. బ్రిటిష్‌పాలకులు భారత రాజకీయాలలో మతతత్వ వేర్పాటు ధోరణులను ప్రోత్సహించారు.

ముస్లింల అల్ప సంఖ్యాక వర్గాల హక్కులను రక్షించే బాధ్యతను స్వీకరించినట్లు చెప్పుకొని ముస్లింలను తమ విధానాలవైపు ఆకర్షించుకోవటానికి ప్రయత్నించారు. భారత సమాజంలో చీలికలు తేవటానికి ప్రయత్నించారు. బెంగాలీల ఆధిక్యతకు వ్యతిరేఖంగా బ్రహ్మణేతరులను, అగ్ర కులాలకు వ్యతిరేఖముగా క్రింది కులాల వారిని రెచ్చగొట్టటానికి కుల వ్యవస్థను వాడుకోసాగారు. హిందువులు, ముస్లింలు కలసి జీవించే ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో కోర్‌లు భాషగా ఉర్దూను తొలగించి హిందీని ప్రోత్సహించాలని ఉద్యమానికి ప్రత్యక్షంగా మద్దతు ఇచ్చారు. కుల, మత ప్రాతిపదికపై బ్రిటిష్ పాలకులు సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఈ విధంగా అధికారులు ప్రజలలో వేర్పాటు వైఖరులను ప్రోత్సహించారు.

**3.8.2. ఆలీఘర్ ఉద్యమం :** భారత జాతీయ కాంగ్రెస్‌తో సహకరించకుండా ఉండటానికి బ్రిటిష్ ప్రభుత్వం ముస్లింలను ఆదరించింది. ముస్లింలను సమైక్యపరచి వారిలో పాశ్చాత్య విద్య, సంస్కృతుల పట్ల అభిలాష పెంపొందించటానికి మొదట సయ్యద్ అహమ్మద్ ఖాన్ ఉద్యమం ప్రారంభించాడు. ఇతడు భారతీయ ముస్లింలకు, బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య సత్ సంబంధాలు పెంపొందించటానికి కృషి చేశాడు. ఇస్లాం పునరుజ్జీవనానికి ఇతడు ప్రతీక. ఇతడు గొప్ప విద్యావేత్త, సంఘ సంస్కర్త. పాశ్చాత్య విద్యపట్ల ముస్లింలలో తీవ్రమైన కోర్కెలను రేకెత్తించాడు. తన ఆశయాల సాధనకు ఆలీఘర్‌లో ఆంగ్ల - ఓరియంటల్ కళాశాలను స్థాపించాడు. ఆ కళాశాలే క్రమంగా ఆలీఘర్ విశ్వ విద్యాలయమైనది. ముస్లిం సమాజ పునర్ వికాసానికి ఈ కళాశాల ప్రముఖ పాత్ర నిర్వహించింది. ఈ కళాశాల బ్రిటిష్ ప్రభుత్వం పట్ల మోజు పెంపొందించుకొని పాశ్చాత్య సంస్కృతి పట్ల మోజు చూపించే ఆధునిక మేధావి వర్గాన్ని సృష్టించింది.

ప్రధమంలో అహమ్మద్ ఖాన్ జాతీయ భావాల పట్ల ప్రభావితుడై హిందూ, ముస్లిం సమైక్యతను వాంఛించాడు. కానీ తరువాత జాతీయవాదానికి, కాంగ్రెస్‌కు బద్ధ విరోధి అయ్యాడు. మత తత్వ పరమైన వేర్పాటు ధోరణి ఆవిర్భావానికి ప్రముఖ పాత్ర నిర్వహించాడు. బ్రిటిష్ వారికి మిత్రుడై ఆంగ్లో ముస్లిం మైత్రిని ప్రోత్సహించాడు. ఆంగ్లో ముస్లిం మైత్రి వల్ల ముస్లింల పరిస్థితి మెరుగవుతుందని జాతీయ వాదులతో చేయికలిపితే ఇబ్బందులు పడతారని ఆంగ్లో ఓరియంటల్ కళాశాల అధ్యక్షుడు బెక్ చెప్పి అహమ్మద్ ఖాన్‌ను నమ్మించి ఒప్పించాడు. అహమద్ ఖాన్ ముస్లిం జాతీయ వాదానికి ప్రతీక. **1883** లో అహమ్మద్ ఖాన్ ఒక ఉపన్యాసంలో మాట్లాడుతూ హిందువులు,ముస్లింలు సంఘర్షణకు తలపడ్డ జాతులని, సమిష్టి రాజకీయ జీవనాన్ని కొనసాగించలేరని ప్రకటించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌ను వ్యతిరేకించి ముస్లింలు అందులో చేరటాన్ని అంగీకరించలేదు. హిందువులతో కలసి ఉంటే ముస్లింలు నష్టపోతారని అహమ్మద్ ఖాన్ పేర్కొన్నాడు. ముస్లింలు బ్రిటిష్ ప్రభుత్వం పట్ల విశ్వాస పాత్రులై ఉండాలని సలహా ఇచ్చాడు. ప్రజాస్వామ్య పరిపాలన అంటే అధిక సంఖ్యాకుల పరిపాలన అని భారతదేశంలో అదిక సంఖ్యాకులు హిందువులు కాన వారిదే పరిపాలన అని చెప్పాడు. అందువల్ల ఆంగ్లో ముస్లిం మైత్రిని సమర్థించి కాంగ్రెస్‌కు బద్ధ విరోధి అయ్యాడు.

అహ్మద్ ఖాన్ ప్రచార ఫలితంగా ఎక్కువమంది ముస్లింలు కాంగ్రెస్‌లో చేరలేదు. ముస్లింలు విద్యారంగంలో వెనుకబడి ఉండటం వల్ల వరిలో మత తత్వం, వేర్పాటు ధోరణులు విజృంభించాయి. అహమ్మద్ ఖాన్, బద్రుద్దీన్, త్యాబ్జీ మొదలగు విద్యావేత్తల కృషి వల్ల ఆధునిక విద్య ముస్లింలలో విస్తరించింది. పాశ్చాత్య విద్యను ముందు నుండి హిందువులు అభ్యసించినందువల్ల వారు పరిపాలనా రంగంలో ఉన్నత పదవులు చేపట్టి ముస్లింల కంటే ఎక్కువ లాభం పొందారు.

**3.8.3. మతతత్వ విజృంభణకు కారణాలు :** సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ ముస్లిం మతతత్వ విజృంభణకు చాలా ఎక్కువగా కృషి చేశాడు. భారతదేశాన్ని మత ప్రాతిపదికపై విభజించాలనే బ్రిటిష్ పాలకుల కుటిల విధాన వ్యూహంలో సయ్యద్ అహమ్మద్ ఖాన్ ఒక పాములాగా వ్యవహరించాడు. విద్యావంతులైన ముస్లింలకు వాణిజ్య వ్యాపార రంగాలలో ఎక్కువ అవకాశాలు లభించనందువల్ల వారు తప్పనిసరిగా ప్రభత్వంపై ఉద్యోగాలపై ఆధారపడ్డారు. విద్యావంతులైన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువగా ఉండటం చేత బ్రిటిష్ అధికారులు ప్రభుత్వం పట్ల విశ్వాసం ప్రకటించినా ముస్లిం నాయకులు విద్యావంతులైన ముస్లింలను చదువుకొన్న హిందువులపై రెచ్చగొట్టారు. ముస్లిం విద్యావంతులు బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయులుగా ఉంటే ప్రభుత్వం వారికి ఉద్యోగాలిచ్చి గౌరవిస్తుందని ముస్లిం నాయకులు ఉద్భోదించారు.

బ్రిటిష్ చరిత్రకారులు భారతదేశ చరిత్రను ప్రాచీన, మధ్యయుగాలుగా విభజిస్తూ ప్రాచీన యుగాన్ని హిందూయుగంగానూ, మధ్య యుగాన్ని ముస్లిం యుగంగా గుర్తించారు. తురుష్క, ఆఫ్ఘన్, మొగల్ రాజ వంశాలు మధ్య యుగంలో భారతదేశాన్ని పరిపాలించాయి. ఈ పాలకులను ముస్లింలుగా వర్ణించి, మధ్య యుగాన్ని ముస్లిం యుగంగా గుర్తించారు. పాలకులందరూ ముస్లింలని, ముస్లిమేతరులు పాలితులనే భావాన్ని ప్రజల మనస్సుల్లో హత్తుకునేలా సృష్టించారు. పరిపాలకును ఒక వర్గంగా పరిశీలిస్తే సామాన్య ప్రజానీకాన్ని - హిందువులను ముస్లింలను, చాలానీచంగా పరిగణించి, స్వప్రయోజనాలకు వాడుకోవటాన్ని, చరిత్రకారులు చాలా వరకు నిర్లక్ష్యం చేశారు. పన్నులు వసూలు చేసే అధికారులు హిందువులను, ముస్లింలను కూడా దారుణంగా హింసించారు. బ్రిటిష్ చరిత్రకారులు భారతదేశ మిశ్రమ సంస్కృతిని ఎక్కువగా ప్రస్తావించలేదు.

వ్యక్తి సమిష్టి జీవనములో మతాధిక్యతను హిందువులు, ముస్లింలు, విశ్వసించారు. అంతేగాక వీరు నిత్యజీవితంలో ఒకే జీవన సరళిని, ఆచారాలను అనుసరించారు. భాషా సంస్కృతులు వీరిని ప్రత్యేకత సంతరించుకున్న వర్గాలుగా విభజింపలేదు. మత విభేదాలున్నప్పటికీ అప్పుడప్పుడు హిందూ ముస్లింల మధ్య సంఘర్షణలు తలెత్తాయి. మొత్తం మీద **2** మతాల వారు అన్యోన్యంగా కలసి మెలిగారు.

అతివాద జాతీయవాదం ముస్లిం మతతత్వ విజృంభణకు దోహదం చేసింది. లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, బాల గంగాధర్ తిలక్, అరవింద ఘోష్ మొదలగు అతివాద నాయకులు హిందూ భావాలకు, సాంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వటం వల్ల ముస్లింలలో అనుమానాన్ని రేకెత్తించింది. ఈ అతివాద నాయకులు గొప్ప దేశ భక్తులేగానీ మతతత్వ వాదులు కారు. వీరు ముస్లిం వ్యతిరేకులు కారు. వీరు హిందూ, ముస్లిం ఐక్యతావాదులు. కానీ, మత వాదులు ఈ పరిస్థితిని తమ స్వార్థానికి వాడుకున్నారు. ఈ విషయంలో ముస్లింల అనుమానాలను తొలగించటానికి హిందువులు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. అంతేగాక కొందరు అతివాద హిందూ నాయకులు మొగల్ చక్రవర్తులను విదేశీయులుగా వర్ణించి ముస్లింలను దూరం చేసుకున్నారు. బ్రిటిష్ వారు బ్రిటిష్ అనుకూల వాదులు హిందూ మత భావనను ముస్లింల మనసుల్లో విష బీజాలు చల్లటానికి వాడుకున్నారు. హిందువుల ఆధిపత్యంలో ముస్లింల పరిస్థితి పూర్తిగా దిగజారిపోతుందని ముస్లింలను బ్రిటిష్ వారు భయపెట్టారు. అందువల్ల ముస్లింలలో చాలా మంది విద్యావంతులు జాతీయ ఉద్యమం పట్ల నిర్లిప్త వైఖరిని అనుసరించారు. వారిలో వేర్పాటు భావాలు పెంపొందాయి. బెంగాల్ విభజన హిందూ ముస్లింల మధ్య అగాధాన్ని సృష్టించింది.

**3.8.4. మింటో వద్దకు ముస్లిం ప్రతినిధి వర్గం :** భారతదేశంలో కొత్త సంస్కరణలను ప్రవేశపెట్టే ఆవశ్యకతను పరిశీలించటానికి మింటో ప్రభువు ఒక కమిటీని నియమించాడు. మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయటంలో అధికార వర్గం ప్రముఖ పాత్ర నిర్వహించింది. ఆలీఘర్ కళాశాలకు అధ్యక్షుడైన 'ఆర్చ్‌బాల్డ్', వైస్రాయి ఆంతరంగిక కార్యదర్శి డన్‌లప్ స్మిత్‌తో చేతులు కలిపి ఈ వ్యవహారం నడిపాడు. ఆగాఖాన్ నాయకత్వంలో ప్రముఖ ముస్లిం నాయకుల ప్రతినిధి వర్గం వైస్రాయిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించాలని వీరు నిర్ణయించారు. ఈ ప్రతినిధి వర్గం మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేయటానికి నిశ్చయించారు. ఆగాఖాన్ నాయకత్వంలో ముస్లిం ప్రతినిధి వర్గం **1906** అక్టోబర్ **1**న సిమ్లాలో లార్డ్ మింటోను కలుసుకొని ఈ ప్రతినిధి వర్గం ప్రత్యేక నియోజక వర్గాలను కేంద్ర శాసనసభ నుండి జిల్లా కోర్టుల వరకు మత ప్రాతిపదికపై సభ్యత్వాన్ని ఇవ్వాలని కోరింది. ఈ ప్రతినిధి వర్గం క్రొత్త ముస్లిం విశ్వ విద్యాలయాల స్థాపనకు ప్రభుత్వ సహాయాన్ని కోరింది. ఈ ప్రతినిధి వర్గం సమర్పించిన వినతి పత్రంలోని కోరికల పట్ల వైస్రాయి పూర్తిగా సానుభూతి చూపాడు. ముస్లిం రాజకీయ ప్రయోజనాలను పూర్తిగా కాపాడటం జరుగుతుందని హామీ ఇచ్చాడు. ఈ విధముగా భారతదేశ రాజకీయాలలో మతతత్వ విషబీజాలను మింటో ప్రభువు ప్రవేశపెట్టాడు. **1909** చట్టంలో దుష్పరిణామాలను కల్పించిన ఈ సూత్రాన్ని ప్రవేశ పెట్టాడు. ప్రత్యే నియోజక వర్గాలను కల్పించి ప్రాతినిధ్యంలో ప్రాధాన్యతను గుర్తించి ముస్లింలను మింటో ప్రత్యేకంగా గుర్తించాడు. బ్రిటిష్ ప్రభుత్వం అనుసరించిన ఈ విధానం వల్ల ముస్లింలు కాంగ్రెస్‌కు, హిందువులకు దూరమయ్యారు రాజకీయంగా ప్రయోజనాలు పొందటానికి ముస్లింలు బ్రిటిష్ ప్రభుత్వానికి సన్నిహితులయ్యారు. మత ప్రాతిపదికపై ప్రాతినిధ్య విధానం హిందూ ముస్లిం వర్గాల మధ్య అగాధాన్ని పెంచింది. అందువల్ల వేర్పాటు వాద ధోరణి తలపడి చివరకు **1947** భారతదేశ విభజన జరిగింది.

**3.8.5. ముస్లిం లీగ్ స్థాపన :** ఆగాఖాన్, ఢక్కా నవాబు సలీముల్లాల నాయకత్వంలో ఆలిండియా ముస్లింలీగ్ 1906లో స్థాపించబడింది. ఈ లీగ్ నవాబుల, జమిందార్ల, కులీన వర్గాల ప్రత్యేక ప్రయోజనాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించింది. ఈ లీగ్‌కు సామాన్య ప్రజల మద్దతు లేదు. బ్రిటిష్ అధికార వర్గం కాంగ్రెస్‌ను వ్యతిరేకించటానికి ముస్లిం లీగ్‌కు ప్రోత్సాహాన్ని ఇచ్చింది.

ఆల్‌ఇండియా ముస్లిం లీగ్ ముఖ్య ఆశయాలు : 1. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల విధేయతను పెంపొందించటం 2. భారతదేశంలోని ముస్లింల రాజకీయ హక్కులకు, ప్రయోజనాలకు రక్షణ కల్పించి పెంపొందించటం 3. ఇతర వర్గాల పట్ల ద్వేష భావాలు పెంపొందకుండా నిరోధించటం.

ముస్లింలీగ్ స్థాపన భారత ముస్లింల రాజకీయ పరిణామంలో ఒక ముఖ్య సంఘటన. ఈ సంస్థ ఆవిర్భవించినప్పటి నుండి దేశ ద్రోహాన్ని ప్రోత్సహించే జాతి వ్యతిరేక సంస్థగా రూపొందినది. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో వ్యవహరించింది. ముస్లిం లీగ్ తొలి సమావేశం అమృతసర్‌లో జరిగింది. దీనికి సర్ సయ్యద్ ఆలీ ఇమామ్ అధ్యక్షత వహించాడు. ఈ సమావేశంలో లీగ్ నాయకులు శాసనసభలలో సివిల్ సర్వీసులలో ఎక్కువ ప్రాతినిధ్యాన్ని కోరారు. అమృత సర్ సమావేశంలో లీగ్ మతతత్వ ధోరణి స్పష్టమైంది. పదవుల కోసం, ఉద్యోగాల కోసం ముస్లిం వృత్తి వర్గాల ప్రయోజనాలకు లీగ్ మద్దతు ఇచ్చింది. లీగ్ రాజకీయ కార్యక్రమాలు విదేశీ పాలనకు వ్యతిరేకం కాదు. ఈ కార్యక్రమాలు హిందూవులకు, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సాగాయి. లీగ్ మతతత్వ లక్షణాలను జాతీయ నాయకులు గర్హించారు. జిన్నా కూడా ముస్లిం మతతత్వ విధానాన్ని ద్వేషించాడు. అలహాబాద్ కాంగ్రెస్ సమావేశంలో జిన్నా మతతత్వం ఆధారంగా చేసుకున్న లీగ్‌ను ఖండిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ తీర్మానాన్ని మౌలానా మజహర్ ఉల్‌హక్ సమర్థిస్తూ హిందూ ముస్లిం వర్గాల మధ్య ఎక్కువ స్నేహం, అవగాహన పెంపొందాలని అర్థించాడు. లీగ్ అనుసరించిన మతతత్వ విధానాన్ని బ్రిటిష్ ప్రభుత్వం పట్ల లీగ్ ప్రదర్శించిన విధేయతా విధానాన్ని నవాబ్ సయ్యద్ మహమ్మద్, మౌలానా అజాద్ మొదలగు నాయకులు తీవ్రంగా విమర్శించారు. హస్సన్ ఇమామ్, హకీమ్ అజ్మల్ ఖాన్, హుస్సేన్ మొదలగు అభ్యుదయ భావాలు గల నాయకులు లీగ్ విధానాలను సమర్థించలేదు.

**3.8.6. లక్నో ఒప్పందము :** మింటో మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత కొన్ని సంఘటనల వల్ల లీగ్ కాంగ్రెస్‌కు చేరువైంది. బ్రిటిష్ ప్రభుత్వం తమను సమర్థించదని లీగ్ నాయకులు భావించారు. కొత్త వైశ్రాయి 'హార్డింజ్' తటస్థ విధానాన్ని అనుసరించాడు. బ్రిటన్ ఇతర ముస్లిం రాజ్యాల పట్ల అనుసరించిన విధానాల వల్ల బ్రిటన్ పట్ల లీగ్‌కు విశ్వాసం క్షీణించింది. ఇంగ్లండ్, టర్కీ అవలంబించిన విధానము హిందూ ముస్లిం సఖ్యతకు ముఖ్య కారణం. టర్కీ, ఇటలీ యుద్ధంలో, బాల్కన్ యుద్ధాలలో టర్కీని బ్రిటన్ సమర్థిస్తుందని ఇండియా ముస్లింలు ఆశించారు. బ్రిటిష్ విధానం పట్ల వీరు తీవ్రంగా ఆశాభంగం చెందారు. ఇంగ్లీష్‌వారు ముస్లింలకు విశ్వాసపాత్రులైన మిత్రులుకారని వారు భావించారు. ముస్లింలీగ్ బ్రిటన్ పట్ల అనుకూల విధానాన్ని త్యజించి కాంగ్రెస్‌కు చేరువైనది. 1916 లో కాంగ్రెస్, ముస్లిం లీగ్‌లు ఒకే సమయంలో లక్నోలో సమావేశమయ్యాయి. ఈ 2 సంస్థలు పరస్పరం సన్నిహితమయ్యాయి. ఈ 2 సంస్థలు ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం మత ప్రాతిపదికపై ప్రత్యేక నియోజక వర్గాలు కావాలన్న లీగ్ డిమాండ్‌ను కాంగ్రెస్ అంగీకరించింది. రెండు పార్టీల నాయకులు ఒకే విధమైన భావాలను ప్రదర్శించారు. సురేంద్రనాథ్ బెనర్జీ, మోతీలాల్ నెహ్రూ, తిలక్‌లు కాంగ్రెస్ పతినిధులుగా జిన్నా, అన్‌సారి లీగ్ ప్రతినిధులుగా ఒకే పద్ధతిలో మాట్లాడారు. హిందూ ముస్లిం సమైక్యతను పెంపొందించటానికి ఇది దోహదము చేసింది. ఈ ఒప్పందంలో మతపరమైన షరతులను అంగీకరించినందున భారత జాతీయ కాంగ్రెస్‌ను విమర్శించారు. నిజానికి భారత జాతీయ కాంగ్రెస్ మతతత్వాన్ని ఆమోదించింది.

**3.8.7. హిందూ మహా సభ :** మింటోమార్లే సంస్కరణలు ముస్లింలకు చాలా అనుకూలంగా ఉండటంతో చాలా మంది హిందువులు ఆందోళన చెందారు. హిందువుల హక్కులను రక్షించటానికి హిందూ మహాసభ అనే మతపరమైన సంస్థను 1916లో స్థాపించారు. పండిట్ మదన్‌మోహన్ మాలవ్య, లాలా లజపతిరాయ్, వీరసవార్కర్ మొదలగు నాయకుల ప్రోత్సాహం ఈ సంస్థకు లభించింది. రాజకీయ ఆశయాలు గల కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఈ మతపరమైన సాంస్కృతిక సంస్థ స్థాపన పట్ల బ్రిటిష్ ప్రభుత్వం సంతోషించింది.

**3.8.8. ముగింపు :** భారతదేశంలో మతతత్వ ఆవిర్భావం వ్యాప్తివల్ల జాతీయ ఉద్యమ శక్తులు బలహీనమయ్యాయి. మతతత్వ వాదం స్వాతంత్ర్య సాధనను కొన్ని సంవత్సరాల వరకూ వాయిదా వేయించగలిగింది. ముస్లింలు ప్రత్యేక దేశం కావాలని కోరడం ఫలితంగా జరిగిన భారత విభజన కూడా మతతత్వ వాద ఫలితమే అన్నిటికన్నా మతతత్వవాదం మతకల్లోలాలను సృష్టించింది.

## 3.9. నమూనా ప్రశ్నలు

1. వందేమాతర ఉద్యమం లేదా స్వదేశీ ఉద్యమం గురించి వ్రాయుము
2. తీవ్రవాద విజృంభణకు కారణాలు తెలుపుము
3. ముస్లింలీగ్ స్థాపనకు దారి తీసిన పరిస్థితులు వివరింపుము
4. బెంగాల్ విభజనకు కారణాలు, ఫలితాలు వివరింపుము

## 3.10. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | A.R. Desai, | : | Social Background of Indian Nationalism |
| 2. | Bipin Chandra, | : | Modern India, |
| 3. | R.C. Majumdar, | : | Advanced History of India |
| 4. | R.C. Agerwal, | : | Constitutional History of Indian National Movement |
| 5. | Tarachand, | : | History of the Freedom Movement in India. |
| 6. | R.C. Majumder, | : | Three Phases of India's struggle for Freedom |
| 7. | Natarajan and prema Ramakrishna, | : | Political and Cultural History of India, Vol II |
| 8. | Ahmed Aziz, | : | Islamic Modernism in India and Pakistan 1857-1964 |
| 9. | Peter Hardy, | : | The Muslims of British India |
| 10. | K.N. Panikkar, (ed), | : | Communalism in India |


**డా॥ వి.కె. మోహన్**

**యూనిట్ - 5**

**పాఠం - 4**

# హోం రూల్ లీగ్

# (The Home Rule League)

## 4.0 లక్ష్యం :

భారత జాతీయ ఉద్యమ చరిత్రలో వందేమాతం తరువాత ముఖ్యఘట్టం హోంరూలు ఉద్యమం. ఈ ఉద్యమ ఆశయం బ్రిటిష్ సామ్రాజ్య ఆధిపత్యం క్రింద దేశీయులకు స్వీయ ప్రభుత్వం లభింపచేయటమే. ఈ ఉద్యమానికి నాయకులు అనిబిసెంట్, తిలక్. హోంరూలు ఉద్యమంలో అనిబిసెంట్, తిలక్ నిర్వహించిన పాత్ర గురించి వివరించటమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


**4.0.** లక్ష్యం

**4.1.** ఉపోద్ఘాతము

**4.2.** మొదటి ప్రపంచ యుద్ధం - జాతీయ ఉద్యమం

**4.3.** మొదటి ప్రపంచ యుద్ధం పట్ల జాతీయవాదుల వైఖరి

**4.4.** లక్నో సమావేశం

**4.5.** హోం రూల్ ఉద్యమం

- **4.5.1.** అనిబిసెంట్
- **4.5.2.** తిలక్
- **4.5.3.** ప్రాముఖ్యత

**4.6.** మాంటేగూ ప్రకటన

**4.7.** నమూనా ప్రశ్నలు

**4.8.** చదువదగిన గ్రంథాలు


## 4.1 ఉపోద్ఘాతము

1914లో ప్రారంభమైన మొదటి ప్రపంచయుద్ధం భారత జాతీయ ఉద్యమ రూపురేఖలనే మార్చివేసింది. ఇది జాతీయ ఉద్యమ వేగాన్ని పెంచటమేగాక ఉద్యమ లక్ష్యాలను స్పష్టంగా నిర్వచించింది. ఆధునిక భారతదేశ పురోభివృద్ధిలో మొదటి ప్రపంచ యుద్ధం ఒక మైలురాయి. ఈ యుద్ధం ప్రారంభమైన తరువాత భారతీయుల మనోభావాలలో విప్లవం ప్రజ్వరిల్లింది. ఈ కాలములోనే అనీబిసెంట్, తిలక్‌ల ఆధ్వర్యంలో హోంరూలు ఉద్యమం సాగింది. 1914కు ముందు విధాన నిర్ణాయాలను నిశ్చయించి అమలుపరచే శక్తి భారత ప్రభుత్వానికే ఉండేది. కానీ, యుద్ధం తరువాత విధాన నిర్ణయాలను నిశ్చయించి అమలుజరిపే సామర్థ్యాన్ని కాంగ్రెస్ సాధించింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో భారతదేశంలో జాతీయవాదం పరిణత స్థితిని పొందింది.

## 4.2. మొదటి ప్రపంచ యుద్ధం - జాతీయ ఉద్యమం :

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే భారతదేశ ప్రజలు ప్రభుత్వం పట్ల ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటించారు. ప్రభుత్వం పట్ల దేశం నలుమూలలా విధేయతా భావం వ్యాపించింది. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పటికీ దేశంలో రాజకీయ కార్యకలాపాలు చురుకుగా కొనసాగలేదు. తిలక్ ఇంకా చెరసాల నుండి విడుదల కాలేదు. ఆయన నాయకత్వం వహించిన పార్టీని ప్రభుత్వం అణచివేసింది. మితవాదులకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ వార్షిక సమావేశాలు జరిపి కొన్ని తీర్మానాలు ఆమోదించటం తప్ప ఏ ఇతర కార్యక్రమాలను అమలు జరుపలేదు. ఆనాడు జాతీయవాదం బలహీన స్థితిలో ఉంది. 1914 మద్రాస్ సమావేశంలో కాంగ్రెస్ బ్రిటిష్ చక్రవర్తి పట్ల విధేయతను ప్రకటించి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా బ్రిటిష్ సామ్రాజ్యానికి మద్దతు ఇస్తానని ప్రకటించింది. సమాజంలోని ప్రభువులు, భూస్వాములు, వ్యాపారులు రాజకీయాలతో సంబంధంలేని ఇతర వర్గాలవారు కూడా బ్రిటిష్ ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని ప్రకటించారు. ఈ విధంగా యుద్ధం ప్రారంభమైనప్పుడు దేశంలో ఎక్కువగా ఉత్సాహం వెల్లివిరిసింది. భారత ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వానికి అన్ని విధాలా సాధ్యమైనంత సహాయం చేయటానికి ఇష్టపడ్డారు. మొదటి ప్రపంచ యుద్ధం భీకరంగా సాగుతున్న కాలంలో భారతీయ సైన్యాలు బ్రిటిష్ సామ్రాజ్యానికి గొప్ప సేవ చేశాయి. మొదటి ప్రపంచ యుద్ధం వ్యాప్తి చెందడం వల్ల భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి వేగం పుంజుకున్నది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుండటం వల్ల బ్రిటిష్ వారు తమకంటే నైతికంగా, ఆర్థికంగా అధికులనే భావాన్ని భారతీయులు వదులుకున్నారు. మధ్య ఆసియాలో ఉన్న సైన్యాలకు చిన్న ఆయుధాలు, ప్రేలుడు పదార్థాలు, వస్త్రాలు, ఆహార పదార్థాలు సరఫరా చేయటానికి భారతదేశం ప్రధాన స్థావరమైంది.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత రాజకీయ సంస్కరణల రూపంలో ప్రతిఫలాన్ని పొందవచ్చునని భావించి చాలామంది భారతీయులు యుద్ధ కృషికి హృదయ పూర్వకంగా మద్దతు ఇచ్చారు. ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటం కోసం పోరాడుతున్నట్లు మిత్ర రాజ్యాలు ప్రకటించాయి. మిత్ర రాజ్యాలకు సహాయం చేస్తున్న భారతీయులు యుద్ధానంతరం స్వపరిపాలన ఇస్తామని వెంటనే ప్రకటించాలని ఎదురు చూశారు. మొదటి ప్రపంచయుద్ధంలో వివిధ రాజ్యాలు తమ వలస ప్రాంతాలను కాపాడుకోవటానికి మాత్రమే పోరాడుతున్నాయనే నిజాన్ని భారతీయులు గుర్తించలేదు.

మొదటి ప్రపంచయుద్ధం భీకరంగా కొనసాగుతున్న కాలంలో కొద్దిమంది విపరీతంగా లాభపడ్డారు. అధిక సంఖ్యాకులు యుద్ధ భారాన్ని మోయలేక అసంతృప్తి చెందారు. యుద్ధ నిధికి బలవంతంగా ధనాన్ని వసూలు చేయటంతో ఆర్థికంగా భారతదేశం దివాలా తీసింది. ప్రజలలో రాజకీయ చైతన్యం పెంపొందింది. బ్రిటిష్ సామ్రాజ్యంపట్ల భారతీయుల భావాలలో తీవ్రమైన మార్పు వచ్చింది. బ్రిటిష్ సైన్యాలను జయించటం అసాధ్యమనే భావం మిథ్య అని స్పష్టంగా తేలిపోయింది.

యుద్ధం కొనసాగుతున్న కాలంలో భారతీయ పరిశ్రమలు వేగంగా వృద్ధి చెందాయి. యుద్ధ పరికరాలను ఉత్పత్తి చేయటానికి అవసరమైన పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఇండియాకు, బ్రిటన్‌కు చెందిన పెట్టుబడిదారులు భారతదేశంలోని సామాన్య ప్రజలను కొల్లగొట్టి విపరీతంగా లాభాలను ఆర్జించి ఐశ్వర్యవంతులయ్యారు. వేతనాలు పెరిగినా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగటం వల్ల దురదుష్టవశాత్తు కార్మికుల పరిస్థితి దిగజారింది. భారతీయ పెట్టుబడిదారులు బలపడటం వల్ల మొదటిసారి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. యుద్ధం కొనసాగిన కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం పెద్ద పరిశ్రమలను ప్రోత్సహించి దేశాన్ని త్వరితంగా పారిశ్రామికీకరణం చేయటానికి చర్యలు తీసుకుంది.

## 4.3 మొదటి ప్రపంచయుద్ధం పట్ల జాతీయ వాదుల వైఖరి :

**1914 - 1919** మధ్య కాలంలో సాగిన మొదటి ప్రపంచ యుద్ధం పట్ల భారత జాతీయ నాయకుల దృక్పథం ఈ క్రింది విధంగా ఉంది. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల భారతీయులు ప్రకటించిన విశ్వాసానికి మూల్యంగా రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టాలని కోరింది. తిలక్ **1914**లో చెరసాల నుండి విడుదల కాగానే అతనిని జాతీయ ఉద్యమానికి గొప్ప నాయకుడుగా కీర్తించారు. జాతీయ వర్గాలు తిలక్‌కు ఘనంగా స్వాగతం పలికాయి. తిలక్ కూడా ప్రభుత్వ కృషికి మద్దతు ఇవ్వటానికే నిశ్చయించాడు. "ఇలాంటి క్లిష్ట సమయంలో గొప్ప

వారైన, అల్పులైన, ధనికులైన, పేదవారైనా అందరూ ప్రతి భారతీయుడు బ్రిటిష్ ప్రభుత్వానికి శక్తి కొలది మద్దతు ఇచ్చి సహాయం చేయాలని" తిలక్ ప్రకటించాడు. భారతీయులను సైన్యంలో చేరవలసిందిగా గాంధీ పిలుపునిచ్చాడు. బ్రిటిష్ సామ్రాజ్య రాజనీతిపరుల సుహృద్భావంతో స్వరాజ్‌ను సాధించవచ్చునే ఉద్దేశ్యంతో గాంధీ భారతీయులను సైన్యంలో చేరవలసిందని పిలుపు నిచ్చాడు. టర్కీ పట్ల బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిని ముస్లింలు నిరశించినా ముస్లిం సైనికులు టర్కీ సైనికులతో ఇరాక్‌లో ధైర్య సాహసాలతో పోరాడారు.

బాలగంగాధర తిలక్ 1914లో ఇండియాకు తిరిగి వచ్చాడు. అతని ప్రతిష్ఠ తారా స్థాయికి చేరింది. ఇతడు భారతదేశ రాజకీయాలను చైతన్యవంతం చేశాడు. ఇతని రాక జాతీయ అభిమానానికి ఊపు నిచ్చింది. కానీ, అప్పటికి జాతీయ కాంగ్రెస్ మితవాద వర్గం ఆధీనంలో ఉంది. అనిబిసెంట్ 1914లో భారత జాతీయ ఉద్యమానికి మద్దతు ఇచ్చింది. ఈమె మొదట్లో కాంగ్రెస్‌లో 2 వర్గాల సమైక్యతను సాధించటానికి ప్రయత్నించింది. కానీ, ఆ కృషి ఫలించలేదు. చాలా మంది కాంగ్రెస్ వాదులు తిలక్‌తో ఏదో విధంగా రాజీ కుదుర్చుకోవాలని భావించారు. కానీ, గోఖలే, ఫిరోషా మెహతాలు ఈ చర్యను వ్యతిరేకించారు. అయితే వీరిద్దరూ 1915లో మరణించటంతో మితవాద వర్గానికి నాయకులు లేరు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరచి అనిబిసెంట్ 2 వర్గాలు కలసి పనిచేసేటట్లు ఒప్పించింది. తీవ్రవాదులు కాంగ్రెస్‌లో చేరటానికి అవకాశం కల్పిస్తూ కాంగ్రెస్ తన నియమావళిని మార్చింది. దేశంలో నానాటికీ పెరుగుతున్న జాతీయ భావన దేశ సమైక్యత సాధించాలనే పట్టుదల వల్ల 1916లో భారత జాతీయ కాంగ్రెస్ లక్నోలో సమావేశమైంది.

## 4.4. లక్నో సమావేశం :

భారతదేశంలో ఉప్పొంగే జాతీయతా భావం జాతీయ సమైక్యత కోసం ఆరాటం 1916 లక్నో, కాంగ్రెస్ సమావేశంలో 2 చారిత్రక పరిణామాలను సృష్టించాయి. అవి :

1. కాంగ్రెస్ సంస్థలోని అతివాదులు, మితవాదులు ఒకటయ్యారు. పాత వివాదాలు సమసిపోయాయి. ఉప్పొంగే జాతీయవాద వెల్లువ తిలక్‌వంటి అతివాద జాతీయ నాయకులను కాంగ్రెస్ సంస్థలో కలిపింది. కాంగ్రెస్ పాత నాయకులు అతివాద జాతీయవాదులను మాతృ సంస్థలోకి సాదరంగా ఆహ్వానించారు. తిలక్ లక్నో కాంగ్రెస్‌ను పూర్తిగా ప్రభావితం చేశాడు. ఇతడు గొప్ప విజేతగా కాంగ్రెస్‌లో తిరిగి ప్రవేశించాడు. ఆనాటి నుండి భారత రాజకీయాలలో తిలక్ మకుటంలేని మహారాజు అని చెప్పవచ్చు. 1916 లక్నో కాంగ్రెస్ పునర్ వికాశాన్ని పొందింది. మొదటిసారి కాంగ్రెస్ మధ్యతరగతి వర్గానికి చెందిన సంస్థ అయ్యింది.

2. లక్నో కాంగ్రెస్ సాధించిన మరొక ఘన విజయం హిందూ ముస్లిం సమైక్యత. లక్నో సమావేశంలో కాంగ్రెస్, ముస్లిం లీగ్‌లు తమ పాత విభేదాలు విస్మరించి తమ ఉమ్మడి రాజకీయ డిమాండ్‌లను ప్రభుత్వం ముందు ఉంచారు. కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య ఒడంబడిక మీద సంతకాలు జరగటంతో ఉభయ పక్షాల మధ్య సమైక్యత నెలకొన్నది. కాంగ్రెస్, లీగ్‌ల మధ్య ఐక్యత సాధనలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. ఈ 2 సంస్థలు తమ సమావేశాల్లో ఒకే తీర్మానాన్ని ఆమోదించాయి. ప్రత్యేక నియోజక వర్గాల ప్రాతిపదిక మీద సంయుక్తంగా రాజకీయ సంస్కరణల పథకాన్ని ప్రభుత్వం ముందు ఉంచాయి. భారతదేశానికి సత్వరం స్వపరిపాలనాధికారం ప్రసాదిస్తామని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించాలని కోరాయి. హిందూ ముస్లిం ఐక్యతకు సంబంధించి లక్నో ఒడంబడిక గొప్ప ముందంజ కానీ, హిందూ ముస్లిం విద్యావంతులను భిన్న అస్థిత్వాలు కలిగిన వ్యక్తులుగా అంగీకరించి ఉభయుల మధ్య సంగీభావం నెలకొల్పే సిద్ధాంతం మీద లక్నో ఒడంబడిక ఆధారపడటం దురదృష్టము. మరో మాటలో చెప్పాలంటే వారి రాజకీయ దృక్పథం, లౌకిక స్వభావం సంతరించుకుంటేనే గానీ రాజకీయాలలో హిందూ ముస్లింల ప్రయోజనాలు వేరు అనే భావం వారిలో పోదు. అంటే లౌకిక రాజకీయ దృక్పథం ద్వారా వారు హిందూ ముస్లింల రాజకీయ ప్రయోజనాలు ఒక్కటే అని గ్రహించగలుగుతారు. కాబట్టి ఆ దృష్ట్యా లక్నో ఒడంబడిక భారత రాజకీయాలలో మత తత్వ పునరుజ్జీవనానికి తలుపు తెరచి ఉంచింది. అయితే లక్నో పరిణామాల ద్వారా సంభవించిన తక్షణ ఫలితాలు మహత్తరమైనవి. అతివాద, మితవాద జాతీయ వాదుల మధ్య కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య ఐక్యత దేశంలో గొప్ప రాజకీయ ఉత్సాహాన్ని రేకెత్తించింది. చివరికి బ్రిటిష్ ప్రభుత్వం కూడా జాతీయ వాదులను సంతృప్తి పరచవలసిన అవసరాన్ని గుర్తించింది. అప్పటిదాకా ప్రభుత్వం జాతీయ వాదుల ఆందోళనను అణచివేయటానికి దమన నీతిమీద ఆధారపడింది. వేలాది అతివాద, జాతీయవాదులను, విప్లవకారులను ప్రభుత్వం చెరసాలలో నిర్బంధించింది. ఇప్పుడు జాతీయ వాదుల అసంతృప్తిని శాంతింప చేయటానికి ప్రభుత్వం నిశ్చయించింది.

## 4.5. హోంరూలు ఉద్యమం :

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 1916లో ప్రారంభమైన ప్రజా ఉద్యమమే హోంరూలు ఉద్యమం. ఈ ఉద్యమానికి నాయకులు అనిబిసెంట్, బాల గంగాధర తిలక్. బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ భారతదేశానికి స్వపరిపాలన సాధించటం ఈ ఉద్యమ లక్ష్యం.

**1.5.1. అనిబిసెంట్ :** అనిబిసెంట్ హోంరూలు ఉద్యమాన్ని ప్రారంభించి ఎంతో విశ్వాసంతో భారతదేశానికి సేవచేసి అమరజీవి అయ్యింది. హోంరూలు ఉద్యమం భారత జాతీయ ఉద్యమ చరిత్రలో ఒక ప్రధానఘట్టం. 1914కు వరకూ అనిబిసెంట్ మత, విద్య, సాంఘిక రంగాలలో మార్పులు తీసుకురావటానికి తన శక్తినంతా ధారపోసింది. కానీ 1914 తరువాత ఆమె తన దృష్టిని రాజకీయ రంగం మీదికి మరల్చింది. 1914లో 'కామన్‌వెల్' అనే వార పత్రికను 'New India' అను దిన పత్రికను ప్రారంభించింది. భారతదేశంలో వస్తున్న మార్పులను వివరించటానికి వీటిని ప్రారంభించింది. స్వాతంత్రోద్యమ చరిత్రను గురించి ఈమె చాలా వ్యాసాలను వ్రాసింది. ఈమె 1914 లో కాంగ్రెస్‌లో చేరిన తరువాత తిలక్‌ను కాంగ్రెస్‌లో తిరిగి ప్రవేశించవలసిందని ఒప్పించటానికి చర్చలు ప్రారంభించింది. భారతదేశానికి స్వపరిపాలన ఆవశ్యకతను గూర్చి హుందాగా, శక్తివంతంగా తెలియజేసింది. జాతీయ ఆశయాలు సాధించటానికి కాంగ్రెస్ సంస్థ యంత్రాంగం పటిష్టంగా లేకపోవటం వల్ల అనిబిసెంట్, తిలక్‌లు స్వతంత్రంగా హోంరూలు ఉద్యమం గురించి ఆలోచించారు. అనిబిసెంట్, తిలక్‌లు స్వతంత్రంగా హోంరూలు ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రజలను ఉత్తేజ పరిచారు.

1916 సెప్టెంబరు 15న మద్రాస్ నగరంలోని గోఖలే హాలులో అనిబిసెంట్ హోంరూలు లీగ్‌ను ప్రారంభించింది. తదుపరి ఆమె హోంరూలు లీగ్ శాఖలను బొంబాయి, కాన్పూర్, బెనారస్, అలహాబాద్, కాలికట్ మొదలగు ప్రదేశాలలో నెలకొల్పింది. తను నెలకొల్పిన దివ్యజ్ఞాన సమాజ శాఖల ద్వారా కూడా హోంరూలు ఉద్యమాన్ని కొనసాగించింది. ఈమె ఉత్తర భారతదేశంలో మద్రాస్ రాష్ట్రంలో సుదీర్ఘ పర్యటనలు జరిపి తన ఉపన్యాసాల ద్వారా ప్రజలను మేల్కొలిపింది.

**1.5.2. తిలక్ :** 1916 డిసెంబర్ 28న బాల గంగాధర తిలక్ పూనాలో హోంరూలు లీగ్‌ను స్థాపించాడు. తొలి సమావేశానికి బొంబాయి, మధ్య పరగణాలు, బీహార్‌కు చెందిన పెక్కుమంది జాతీయవాదులు హాజరై లీగ్‌కు జోసఫ్ బాప్టిస్ట్ అధ్యక్షుడుగా, కేల్కార్ కార్యదర్శిగా ఎన్నికైరి. లీగ్ స్థాపించిన తరువాత తిలక్ మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, మధ్యప్రదేశ్ మొదలగు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి తన గంభీర ఉపన్యాసాల ద్వారా స్వయం పాలన అనేది బ్రిటిష్ సామ్రాజ్యంలోని అంతర్భాగమని ప్రజాస్వామ్య పద్ధతిద్వారా బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన తన ఉద్యమ లక్ష్యమని పేర్కొన్నాడు. మరాఠీ, కేసరి అను పత్రికలలో అనేక రచనలు చేశాడు.

హోంరూలు ఉద్యమంలో అనిబిసెంట్, తిలక్‌లు వేరువేరుగా లీగ్‌లను స్థాపించిననూ ఇరువురూ సన్నిహిత సహకారంతో వ్యవహరించారు. తిలక్ తన ప్రచారాన్ని పశ్చిమ ఇండియాకు పరిమితం చేయగా అనిబిసెంట్ ఉత్తర భారతదేశంలో మద్రాస్ రాష్ట్రంలో ప్రచారం చేసింది. అంతేగాక అనిబిసెంట్ పూనాకు వచ్చి తిలక్ అధ్యక్షత వహించిన సమావేశంలో ఉపన్యసించింది. స్వదేశీ జాతీయ విద్యా విధానం భారతదేశానికి హోంరూలు లీగ్ చాటిన నినాదాలు. ఒక్క సంవత్సరంలోనే తిలక్ లీగ్ నందలి సభ్యుల సంఖ్య 14 వేలకు పెరిగింది. అనిబిసెంట్ జాతీయ కాంగ్రెస్‌లోని అతివాదులను, మితవాదులను ఏకం చేసింది. లక్నో సమావేశం తరువాత అనిబిసెంట్, తిలక్‌లు దేశంలో విస్తృతంగా పర్యటన జరిపినపుడు కాంగ్రెస్ సభ్యులు తమ బేధాలను విస్మరించి వీరిని ఆహ్వానించిరి. జిన్నా కూడా ఈ ఉద్యమంలో చేరుట విశేషం. తిలక్ సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడి సామూహిక ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ ఉద్యమ కాలంలోనే తిలక్ 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు, దానిని నేను పొందుతాను'. అనే నినాదాన్ని ప్రారంభించాడు. ఆ నినాదం ప్రజలందరినీ ఆకర్షించింది. హోంరూలు ఉద్యమం వేగాన్ని పుంజుకున్నది. ఇంత త్వరితముగా ఉద్యమం విజృంభించటం పట్ల ప్రభుత్వం ఆందోళన చెందింది. ఉధ్రుత ప్రచార ఫలితంగా ఈ ఉద్యమం 1917లో పరాకాష్టకు చేరింది.

హోంరూలు ఉద్యమాన్ని అణచి వేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించింది. అనిబిసెంట్ "న్యూ ఇండియా" పత్రిక నుండి ఎక్కువ ధరావత్తును ప్రభుత్వం వసూలు చేసింది. 1917 జూన్‌లో ప్రభుత్వం అనిబిసెంట్‌ను నిర్భందించింది. ఆమె నిర్భందాన్ని నిరసిస్తూ

అనేక ప్రాంతాలలో సభలు, ప్రదర్శనలు జరిగాయి. తిలక్‌ను దేశ ఉత్తర ప్రాంతాలలో పర్యటించటాన్ని నిషేధించటం కూడా ప్రజలు వ్యతిరేకించారు. ప్రజా ఆందోళనకు తల ఒగ్గి అనిబిసెంట్‌ను మద్రాస్ ప్రభుత్వం సెప్టెంబర్‌లో విడుదల చేసింది. ఆమె దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కాంగ్రెస్ ప్రతినిధులు ఆమెను 1917లో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవిని అలంకరించిన తొలి మహిళ అనిబిసెంట్.

రెండు హోంరూలు లీగ్‌లు రాజకీయ రంగంపై ఎక్కువ ప్రభావాన్ని కనపరచలేదు. 1917లో మాంటెగూ చేసిన విధాన ప్రకటన తరువాత ఉద్యమం బలహీనమైంది. ఈ ప్రకటన భారత రాజకీయాల రూపు రేఖలనే మార్చివేసింది. హోంరూలుకు అనుకూలంగా ఆందోళన కొనసాగించవలసిన అవసరం లేదనే అభిప్రాయం బలపడింది.

**1.5.3. ప్రాముఖ్యత :** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో హోంరూలు ఉద్యమం ఒక నూతన పోకడను ప్రవేశపెట్టింది. గతంలో జరిగిన వందేమాతర ఉద్యమంలా కాకుండా ఈ ఉద్యమం అన్ని ప్రాంతాలలో వ్యాపించింది. ఈ హోంరూలు ఉద్యమం యావత్ భారత ప్రాతిపదికను సంతరించుకుంది. మాచకత్వ విధాన శిధిలాలపై జాతీయ భావాల వల్ల ప్రభావితమైన భారతదేశం విజృంభించింది. అతివాద, జాతీయనాయకుల కల ఫలించింది. భవిష్యత్తులో గాంధీ నాయకత్వంలో జరిగే ఉద్యమాలకు ఈ హోంరూలు ఉద్యమం పునాది అయింది.

## 4.6. మాంటేగూ ప్రకటన :

అతివాద, మితవాద జాతీయ నాయకుల మధ్య, కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య ఐక్యత దేశంలో గొప్ప రాజకీయ ఉత్సాహాన్ని రేకెత్తించింది. చివరకు బ్రిటిష్ ప్రభుత్వం జాతీయ వాదులను తృప్తిపరచవలసిన అవసరాన్ని గుర్తించింది. రాజ్యాంగ సంస్కరణలను పోలిన భారతీయులను తృప్తి పరచటానికి ఎంతో విశ్వాసంతో యుద్ధకాలంలో భారతీయులు చేసిన సహాయాన్ని గుర్తించి 1917ఆగష్ట్ 20న భారత రాజ్యకార్యదర్శి మాంటేగూ ఒక ప్రకటన చేశాడు. పరిపాలనా శాఖలలో భారతీయులకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వటం అవుతుందని స్వపరిపాలనా సంస్థలు క్రమాభివృద్ధి చెంది సామ్రాజ్యంలో భారతదేశం క్రమక్రమంగా అంచెలమీద భాధ్యతాయుత ప్రభుత్వం పొందుతుందని ప్రకటించాడు. బ్రిటిష్ ప్రభుత్వ విధానంతో భారత ప్రభుత్వం పూర్తిగా ఏకీభవించిందని తెలియచేశాడు. ఈ ప్రకటన విపరీత అర్థాలతో కూడినది, సందిగ్ధమైంది. బ్రిటిష్‌వారి కుటిల నీతికి ఈ ప్రకటన ఒక ఉదాహరణ. ఈ ప్రకటన ఎలాంటి హామీలు ఇవ్వలేదు. మాంటేగూ ప్రకటనను మితవాదులు హక్కుల ప్రకటనగా భావించి హర్షించారు. ఈ ప్రకటనలోని హామీలు జాతీయవాదులను మోసగించటమేనని తీవ్రవాదులు భావించారు. ఈ ప్రకటన తరువాత మితవాదులు తీవ్రవాదుల నుండి విడిపోయారు. మితవాదులు 1867లో తీవ్రవాదులను కాంగ్రెస్ నుండి బహిష్కరించగా 1918లో మితవాదులు కాంగ్రెస్ నుండి వెళ్లిపోయారు. కాంగ్రెస్ నుండి మితవాదులు నిష్క్రమించటంతో భారత స్వాతంత్ర్య యుద్ధ చరిత్ర నుండే వారు కనుమరుగయ్యారు. 1917 నవంబర్‌లో మాంటేగూ భారతదేశాన్ని దర్శించి చెమ్స్‌ఫర్డ్‌తో చర్చించాడు. మాంటేగూ తయారుచేసిన నివేదికను వైశ్రాయి ఆమోదించాడు. ఆ నివేదికను 1918లో ప్రకటించారు. 1919 భారత ప్రభుత్వ సంస్కరణలకు ఈ నివేదిక ఆధారమైంది.

## 4.7. నమూనా ప్రశ్నలు

1. హోంరూల్ ఉద్యమంలో అనిబిసెంట్, తిలక్‌ల పాత్ర వివరింపుము

## 4.8. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra, | : | Modern India, |
| 2. | R.C. Majumdar, | : | Advanced History of India |
| 3. | P. Spear, | : | History of India, Vol. 2 |
| 4. | Tarachand, | : | History of Freedom Movement in India Vol. III |


డా॥ వి.కె. మోహన్

యూనిట్ - 5

పాఠం - 5

# 1919, 1935 రాజ్యాంగ సంస్కరణలు - జాతీయోద్యమంపై దాని ప్రభావం

## (Constitutional Reforms of 1919 and 1935 and their Impact on the National Movement)

### 5.0 లక్ష్యం :

1919 రాజ్యాంగ సంస్కరణలు మరియు 1935 రాజ్యాంగ సంస్కరణలు, జాతీయ ఉద్యమంపై ఈ రాజ్యాంగ సంస్కరణల ప్రభావం గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయసూచిక :


5.0 లక్ష్యం

5.1 1919 భారత రాజ్యాంగ చట్టము (మాంటేగు - ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు)

5.1.1. ఉపోద్ఘాతము

5.1.2. సంస్కరణలకు కారణాలు

5.1.2.1. హోంరూల్ ఉద్యమం

5.1.2.2. విభజించి పాలించు విధానం

5.1.2.3. మొదటి ప్రపంచ యుద్ధం

5.1.3. చట్టంలోని ప్రధాన అంశాలు

5.1.3.1. భారత కార్యదర్శి, అతని కార్యాలయం

5.1.3.2. కేంద్ర ప్రభుత్వం

5.1.3.2.1. రాజ్యసభ

5.1.3.2.2. దిగువ సభ

5.1.3.2.3. ఓటింగ్ హక్కు

5.1.3.2.4. శాసన సభ అధికారాలు

5.1.3.2.5. గవర్నర్ జనరల్

5.1.3.3. రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వము

5.1.4. 1919 చట్టంలోని సుగుణాలు

5.1.5. 1919 చట్టంలోని లోపాలు

5.2 1935 భారత ప్రభుత్వ చట్టం

5.2.1. ఉపోద్ఘాతము

5.2.2. 1935 చట్టంలోని ప్రధాన అంశాలు
5.2.2.1. సమాఖ్య రాజ్యాంగము
5.2.2.2. కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వము
5.2.2.3. ప్రభుత్వ అధికారాలు
5.2.2.4. కేంద్రము
5.2.2.5. ఫెడరల్ న్యాయస్థానము
5.2.2.6. రిజర్వ్ బ్యాంక్
5.2.2.7. రాష్ట్రాలు
5.2.3. 1935 చట్టంలోని సుగుణాలు
5.2.4. 1935 చట్టంలోని లోపాలు
5.3. నమూనా ప్రశ్నలు
5.4. చదువదగిన గ్రంథాలు

## 5.1. 1919 భారత రాజ్యాంగ చట్టం (మాంటేగు - ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు)

### 5.1.1. ఉపోద్ఘాతము

భారతదేశంలోని ప్రజలను ఎప్పటికప్పుడు తృప్తిపరచడానికి పార్లమెంటు 1861 నుంచి రాజ్యాంగంలో ఏవో మార్పులు చేస్తూనే ఉంది. భారతీయులకు శాసనసభలోను కార్యనిర్వాహక సభలలోనూ ఇంగ్లాండ్‌లోని ఇండియా కౌన్సిల్‌లోను సభ్యత్వం కల్పించి వారికి కొన్ని ప్రత్యేక హామీలు కూడా ఇచ్చినట్లు మనం తెలుసుకున్నాము. 1909 శాసన చట్టంలో ఈ మార్పులు బాగా కనిపిస్తున్నా, ఈ చట్టంలోని అనేక లోపాల వల్ల ప్రజలకు ఈ చట్టం తృప్తికరం కాలేదు. మాంటేగు ఈ చట్టాన్ని విమర్శిస్తూ "1909 చట్టం భారతీయులకు ఎటువంటి తృప్తినీ ఇవ్వలేదు. అత్యల్పమైన ఓటుహక్కు, పరోక్ష ఎన్నికలు, ప్రజల, శాసన సభ్యుల బాధ్యతా భావాన్ని శాసన సభలలో ఉద్భవింపజేయ జాలకపోయినాయి. ఈ అధికారం అంతా ప్రభుత్వానిదైతే, విమర్శ మాత్రం శాసన సభలదే. అందువల్ల కార్యదర్శికి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వాలూ ముడిపడినాయి. ఇది నిరంకుశ ప్రభుత్వ విధాన లక్షణము. పాలితుల అభిమతాన్ని తెలుసుకొడానికి మాత్రమే వీలైనది. ప్రజా ప్రభుత్వానికి ఈ సంస్కరణలు ఉపయోగపడలేదు. ప్రజా ప్రభుత్వానికి బాధ్యతే ముఖ్యము. ఈ బాధ్యత సంస్కరణలలో లేదు." అని చెప్పినాడు. అందుకే మాంటేగూ ఇండియా మంత్రి పదవికి రాగానే భారత రాజ్యాంగంలో మార్పులు చేయదలచినాడు. అతడు భారతదేశ స్వపరిపాలన పట్ల కొంత సుముఖుడు. అతడు క్యాబినెట్ మంత్రులందరి సమ్మతితో 1917 ఆగష్టు 20న కామన్సుసభలో ఒక చారిత్రాత్మకమైన ప్రకటన చేస్తూ తాను చేయదలచిన మార్పులకు పూర్తి స్వరూపాన్ని కల్పించినాడు. ఆ ప్రకటనలోని ముఖ్యాంశాలు ఏవంటే "భారత దేశపు ప్రతి పాలనా శాఖలోనూ భారతీయులకు ఎక్కువ సంబంధం కలగజేయడం, ఆంగ్ల సామ్రాజ్యంలో ప్రధాన భాగంగా ఉంటూ భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని స్థాపించడానికి అనుగుణమైన స్వపరిపాలనా సంస్థలను క్రమక్రమంగా వృద్ధి చేయడం, ఆంగ్ల ప్రభుత్వం అవలంబించదలచిన పరిపాలనా విధానము. భారతదేశ ప్రజలకు"బాధ్యతాయుత ప్రభుత్వం కల్పించడానికి 1919 చట్టం ప్రవేశపెట్టడం జరిగింది." అని మాంటేగు చెప్పినాడు.

### 5.1.2. సంస్కరణలకు కారణాలు :

**5.1.2.1 హోంరూల్ ఉద్యమం :** 1919 శాసన చట్టం మితవాదులను, మహ్మదీయులను కూడా తృప్తిపరచలేదు. కాంగ్రెస్‌లోని మితవాదులు జాతీయవాదులు కలిసిపోయినారు. ఈ కలయికకు ముఖ్య కారకురాలు అనిబిసెంట్. 1914లో తిలక్ కూడా కారాగార విముక్తుడై తిరిగి స్వాతంత్రోద్యమం లేవదీయడానికి పూనుకున్నాడు. అతని లక్ష్యం కూడా కాంగ్రెస్‌లోని చీలికలను కలిపివేసి, ఒకే కాంగ్రెసును

ఏర్పాటు చేయడము. అతడూ అనిబిసెంటూ కలిసిపోయినారు. 1916లో లక్నోలో కాంగ్రెస్ సమావేశం అయి, అతి త్వరలో భారతదేశంలో స్వపరిపాలనా విధానాన్ని బ్రిటిష్‌వారు తప్పక ప్రవేశపెట్టవలెనని, అందుకు అనుగుణంగా చక్రవర్తి ప్రకటన చేయవలెననీ, ఒక తీర్మానం చేసింది. అంతేకాక మహ్మదీయులు కూడా కాంగ్రెస్‌తో చేరి, ఆంగ్ల ప్రభుత్వంతో పోరాడటానికి నిశ్చయించినారు. లక్నో కాంగ్రెస్ ఈ విధంగా చారిత్రాత్మకమైనది. ఇందులో తిలక్, రాష్ బిహారీ ఘోష్, సురేంద్రనాధ్ బెనర్జీ, అనిబిసెంట్, మహాత్మాగాంధీ, మజ్రిల్ హక్కు, రస్సో, జిన్నా వంటి సుప్రసిద్ధులు పాల్గొన్నారు. వారంతా కలసి, హోంరూల్ ఉద్యమాన్ని సాగించినారు. దేశంలో అలజడి ఎక్కువైంది. ఈ ఉద్యమాన్ని అరికట్టి భారతీయులను కొంత వరకు సంతృప్తి పరచటం కోసమే సంస్కరణలు ప్రవేశపెట్టడం జరిగింది.

**5.1.2.2. విభజించి పాలించు విధానం :** మహ్మదీయులు కాంగ్రెస్‌లో చేరిపోవటంతో 'విభజించి పాలించు' అనే ఆంగ్ల విధానానికి ఓటమే లభించింది. వారిని విడదీయడానికి, శాసన సభలలో మహ్మదీయులకు ప్రత్యేక నియోజక వర్గాలూ ప్రత్యేక స్థానాలూ 1909 చట్టంలో కల్పించటం జరిగింది. కాని 1911లో ముస్లింలీగ్‌తో సంప్రదించకుండానే, బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ రాష్ట్ర విభజనను రద్దు చేసింది. అంత వరకు తమకు ప్రత్యేక రాష్ట్రం నిర్మాణం కావటం గొప్ప విజయంగా భావించిన మహ్మదీయులు ఈ విభజన రద్దు కావడం తమ ఓటమిగా భావించినారు. ఇది నమ్మక ద్రోహం అని, బ్రిటిష్ ప్రభుత్వపు వాగ్దానాలు నమ్మదగినవి కావు అని, ఒక భావం వారిలో కలిగింది. అందుకే వారు కాంగ్రెస్‌తోను, హిందువులతోనూ చేరుటకు నిశ్చయించుకొన్నారు. మహ్మదీయులు కాంగ్రెస్‌లో చేరడంతో ఆంగ్లేయులకు ఒక విధమైన భయం కలిగింది. ఇదే గనుక ఎల్లకాలం కొనసాగితే తమ అధికారానికే ముప్పుకలగవచ్చు. అందుకే రాజ్యాంగంలో మార్పులు తీసుకొనివచ్చి ఎట్లయినా మహ్మదీయులను కూడా సంతృప్తిపరచి వారిని తిరిగి తమ పట్ల సుముఖులుగా చేసుకొవటం కోసం మాంటేగు పన్నిన పన్నాగ ఫలితమే 1919 భారత ప్రభుత్వ చట్టం.

**5.1.2.3. మొదటి ప్రపంచ యుద్ధం : 1914**లో ప్రధమ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. ఇందులో ఆంగ్లేయులు ముఖ్యపాత్ర వహించినారు. ఈ యుద్ధం ప్రజా ప్రభుత్వాన్ని, స్వల్పజాతుల స్వాతంత్ర్యాన్ని నిలబెట్టటం కోసం, జరుగుతూందనీ, దానిని బలపరచడానికి ఆంగ్లేయులు ఈ యుద్ధంలో పాల్గొంటున్నారని, బ్రిటిష్ మంత్రులు ప్రకటించటం వల్ల తమకు కూడా యుద్ధానంతరం స్వపరిపాలన వస్తుందని ఆశించి భారతీయులు అనేకులు యుద్ధంలో పాల్గొని, అపార ధైర్యసాహసాలు ప్రదర్శించి, ఆంగ్లేయులకు సహాయం చేసినారు. తమ ఆశయాలు ఫలించే కాలం వచ్చిందని వారు విశ్వసించినారు. ఇటువంటి విప్లవ భావాలు ప్రజలలో తీవ్రం కాక పూర్వమే వారిని తృప్తిపరచడానికి 1919లో భారత ప్రభుత్వ చట్టం ప్రవేశపెట్టడం జరిగింది.

**5.1.3. చట్టంలోని ప్రధాన అంశాలు :** ఇంతకు పూర్వం ప్రవేశపెట్టిన చట్టాలలో వలెనే దీనిలో కూడా రెండు భాగాలు ఉన్నాయి. మొదటిది బ్రిటిష్‌లోని యంత్రాంగంలో మార్పులు సూచిస్తే, రెండోది భారతదేశంలోని యంత్రాంగంలో మార్పులు సూచించింది.

**5.1.3.1. భారత కార్యదర్శి, అతని కార్యాలయం :** ఈ శాసనం ప్రకారం భారతదేశంపై - ఇది వరకు ఉన్నట్లే తుది అధికారం పార్లమెంట్‌దే. భారత రాజ్యాంగ కార్యదర్శి జీతభత్యాల ఖర్చు ఇక మీదట బ్రిటిష్ ప్రభుత్వమే వహించడానికి ఏర్పాటైంది. అతని అధికారాలను కూడా కొంత వరకు సడలించడం జరిగింది. అతడే అనుభవిస్తున్న అనేక అధికారాలు గవర్నరు జనరల్‌కూ, గవర్నర్లకూ ఇవ్వడమైంది. విదేశీ వ్యవహారాలు, సైనిక విషయాలు, కస్టమ్స్, నాణేలు, భారతదేశంలోని ఆంగ్లేయుల హక్కులు, మొదలైన కొన్ని ముఖ్య విషయాలను గురించి కేంద్ర శాసనసభలో చేసిన తీర్మానాలపై మాత్రం అతని ఆమోదం పొందవలసి ఉంది. హై కమిషనర్ అనే ఒక కొత్త పదవిని సృష్టించడమైంది. అతనిని భారత ప్రభుత్వం నియమించడమేగాక, అతని ఖర్చులన్నీ అది భరించవలె అతడు స్టోర్స్ డిపార్ట్‌మెంట్, భారత విధ్యార్థుల డిపార్టుమెంటు బాధ్యతలు వహిస్తూ గవర్నరు జనరల్ అతని కౌన్సిలుకు బాధ్యుడుగా ఉండవలె. ఇండియా కౌన్సిలులోని సభ్యుల సంఖ్య ఎనమండుగురికి తగ్గకుండా 12 మందికి హెచ్చకుండా ఉండవలె. వారిలో కనీసం సగం మంది భారత దేశంలో 10 సంవత్సరాలు ఉండటమో, భారత ప్రభుత్వంలో అంతకాలం పనిచేసి ఉండటంమో అవసరము. వారి పదవీకాలం 7 నుంచి 5 సంవత్సరాలకు తగ్గించడమైంది. వారి జీతం 1000 నుంచి 1200 పౌనులకు పెంచడమైంది.

**5.1.3.2. కేంద్ర ప్రభుత్వం : 1919** ప్రభుత్వ చట్టం భారత దేశంలోని ప్రభుత్వ విధానంలో అనేక మార్పులు ప్రవేశపెట్టింది. కేంద్ర శాసన సభలో దిగువశాఖ, ఎగువ శాఖ అనే రెండు శాఖలు ఏర్పడినాయి. దిగువ శాఖకు శాసన సభ అనీ, ఎగువ శాఖకు రాజ్యసభ అనీ, పేర్లు.

**5.1.3.2.1. రాజ్యసభ :** ఇందులో సభ్యుల సంఖ్య 60 - అందులో 33 మంది ఎన్నుకొన్న సభ్యులు, 27 మంది గవర్నర్ జనరల్ నామనిర్దేశం వల్ల సభ్యులైన వారు. వారిలో చాలా మంది ప్రభుత్వోద్యోగులు. వారే కాక కొందరు కార్యనిర్వహక సభ్యులు కూడా దానిలో ఉన్నారు. వారిని గవర్నర్ జనరల్ నియమిస్తాడు. ఈ కార్యనిర్వహక సభ్యులు రాజ్యసభ లోను, శాసన సభలోనూ కూడా పాల్గొనవచ్చు. ఈ సభ కాల పరిమితి 5 సంవత్సరాలు.

**5.1.3.2.2. దిగువ సభ :** దిగువ సభలోని సభ్యుల సంఖ్య 140. కొంత కాలం తరువాత ఈ సంఖ్య 140 నుంచి 145కు పెంచినారు. 103 మంది ఎన్నిక సభ్యులు నామనిర్దేశం ద్వారా సభ్యులైన, 42 మందిలో 25గురు అనధికారులు, 17 మంది ఉద్యోగి వర్గానికి చెందిన వారు. ఈ సభ కాల పరిమితి 3 సంవత్సరాలు. ఈ సభలో 51 మంది సాధారణ నియోజక వర్గాల నుంచి, 30 మంది ప్రత్యేక ముస్లిం నియోజక వర్గాల నుంచి, 7గురు భూస్వాముల చేతను, 9 మంది యూరోపియన్ల చేతను, నలుగురు భారతీయ వాణిజ్య సంఘాల చేతను ఎన్నికవుతారు.

**5.1.3.2.3. ఓటింగు హక్కు :** వోటింగు హక్కు అందరికి ఇవ్వటం జరగలేదు. రాజ్యసభ సభ్యులను ఎన్నుకొనే హక్కు ధనికులకు లభించింది. కనీసం 10వేల రూపాయల సంవత్సరాదాయం మీద రాబడి పన్నుకట్టే వారికి, 750 రూపాయిలు భూమిశిస్తుకట్టేవారికి ఈ హక్కు ఉంది. అలాగే విశ్వ విద్యాలయపు సెనేట్ సభ్యత్వం కలవాడో, అంతకు పూర్వం శాసనసభలో సభ్యత్వం వహించినవాడో, బిరుదులు పొందినవాడో, వోటింగ్ హక్కు పొందుతాడు. ఆ రోజులలో దేశంలో ఎగువ సభకు వోటు చేసే హక్కు 17,364 మందికి ఉండేది. దిగువ సభకు కూడా రమారమి ఇటువంటి నిబంధనలే ఉండేవి. మొత్తం మీద ప్రాముఖ్యం ధనిక వర్గాల వారికే ఉండేవి. 180 రూపాయలు అద్దె వచ్చే స్వంత ఇల్లు గలవాడు, ఏడాదికి 15 రూపాయలు మునిసిపల్ పన్ను కట్టేవాడు, లేక 2,000 రూపాయిల ఆదాయం మీద పన్నుకట్టేవారు, 50 రూపాయలు భూమిశిస్తు కట్టేవాడు, వోటింగ్ హక్కు పొందుతారు. దిగువ సభలోని వోటర్ల సంఖ్య 1920 సంవత్సరములో 9,09,874 ఒక్కొక్క రాష్ట్రానికి దాని ప్రాముఖ్యాన్ని బట్టి కేంద్ర శాసన సభలో సభ్యత్వం ఇవ్వడం జరిగింది.

**5.1.3.2.4. శాసన సభ అధికారాలు :** కొన్ని మినహాయింపులకు లోబడి పరిపాలనా సంబంధమైన వ్యవహారాల గురించి శాసనాలు చేసే అధికారం శాసన సభలకు లభించింది. అట్లే కొన్ని మినహాయింపులకు లోబడి బడ్జెట్ పద్దులన్నింటిని చర్చించడానికి, కోత తీర్మానాలు ప్రతిపాదించి, వోటుకు పెట్టడానికి శాసన సభకు అధికారం కల్పించడం జరిగింది.

**5.1.3.2.5. గవర్నర్ జనరల్ :** గవర్నర్ జనరల్‌కు ప్రత్యక్ష అధికారం ఈ చట్టము ద్వారా ఇవ్వటం జరిగింది. అతడి ఆమోదం లేకుండా ఏ బిల్లూ చట్టం కావడానికి వీలులేదు. పైగా శాసన సభ నిరాకరించిన బిల్లు తప్పకుండా చట్టం కావడం అవసరమని అతనికి తోస్తే అతడు దానిని చట్టం చేయడానికి ప్రత్యేకాధికారం పొందినాడు. శాసన సభ నిరాకరించిన బడ్జెట్ పద్దులను చట్ట సమ్మతం చేసే అధికారం కూడా అతనికి ఇవ్వడం జరిగింది. ఈ ప్రత్యేకాధికారానికి 'సర్టిఫికేషన్' అని పేరు. శాసన సభల సమావేశ కాలాన్ని గవర్నరు జనరల్ నిర్ణయిస్తాడు. ఈ విధంగా 1919 తరువాత కూడా గవర్నర్ జనరల్ అధికారం నిరంకుశంగా ఉంది.

**5.1.3.3. రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం : 1919** చట్టం రాష్ట్ర ప్రభుత్వములో చేసిన మార్పులు చాలా ముఖ్యమైనవి. కొంత వరకు రాష్ట్రాలలో బాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పడమైంది. ఈ చట్టం ప్రకారం మద్రాస్, బొంబాయి, బెంగాల్ సంయుక్త రాష్ట్రం పంజాబ్, బీహార్‌లతో పాటు ఒరిస్సా, మధ్య పరగణాలు అస్సాం, బర్మాలు గవర్నర్ల పాలనలోకి వచ్చాయి. రాష్ట్ర పరిపాలన సాగించటానికి గవర్నర్‌కు సహాయంగా ఒక కార్యనిర్వహక శాఖయే గాక ఒక మంత్రి వర్గం ఏర్పడింది. పరిపాలనా సేకరణ రెండు భాగాలుగా చేసి కొన్నింటిని గవర్నర్లు కార్యనిర్వహక సభ ఆధీనంలో మిగతావి గవర్నర్ మంత్రి వర్గం ఆధీనంలో ఉంచటం జరిగింది. కార్యనిర్వహక శాఖకు రిజర్వుడు శాఖ అనీ, మంత్రి వర్గ శాఖకు శాసన సభ ఆధీనసభ అనీ, పేర్లు, ప్రభుత్వ ఆధీన శాఖలో 4గురు మించకుండా సభ్యులు ఉండవలెను. వారిలో కనీసం ఒకరు ప్రభుత్వ ఉద్యోగంలో 12 సంవత్సరములు అనుభవం కలవాడై ఉండవలెను. సగం మంది భారతీయులుగా ఉండవలెను. వారి సభ్యత్వ కాలపరిమితి 5 సంత్సరాలు. వారిని చక్రవర్తి రాజ్యాంగ కార్యదర్శి సలహాపై నియమిస్తాడు. వారి జీతము కూడా చట్టము నిర్ణయించింది. వారందరు అధికార రీత్యా శాసన సభ సభ్యులుగా ఉంటారు. కాని వారు ఆ సభకు ఎంత మాత్రం బాధ్యులు కారు. శాసన సభ ఆధీన శాఖలో మంత్రుల సంఖ్య ఎంత ఉండవలసింది చట్టం పేర్కొనలేదు. మంత్రిగా ఉండటానికి అతడు

శాసన సభలో సభ్యుడుగా ఉండాలి. లేదా మంత్రి పదవి పొందిన 6 నెలలలోగా శాసన సభ్యుడుగా ఎన్నిక కావలెను. అంతేగాక మంత్రులకు శాసన సభలో అధిక సంఖ్య బలం ఉండవలెను అటువంటి బలం ఉన్న వారిని గవర్నర్ మంత్రులుగా నియమించవలెను. వారు శాసనసభ విశ్వాసాన్ని కోల్పోతే తమ పదవులకు రాజీనామా ఇవ్వవలెను. ఈ విధముగా రాష్ట్రములో రెండు రకాల అధికారాలు శాఖలున్నందువల్ల దానికి ద్వంద్వ పరిపాలనా అనే పేరు వచ్చింది. మంత్రుల ఆధీనంలోకి వచ్చిన శాఖలు స్థానిక స్వపరిపాలనా, వైద్యం, విద్యా, వ్యవసాయం, పశుపోషణ రిజిస్ట్రేషన్, దేవాలయాలు, పరిశ్రమాభివృద్ధి. వీటిలో మంత్రులు శాసనసభ ఆమోదముతో తమ ఇష్టం వచ్చినట్లు మార్పులు చేయవచ్చు. భూమిశిస్తు, నీటి పారుదల, కార్మిక విషయాలు, వార్తా పత్రికలపై అజమాయిషి క్షామ నివారణ, శాంతి భద్రతలు మొదలైనాయి. కీలక విషయంలో ప్రభుత్వ ఆధీనశాఖ స్వాదీనంలో ఉంచినారు.

గవర్నర్లు పరిపాలించే రాష్ట్రాలలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక శాసన సభ ఏర్పడింది. రాష్ట్రాలలో శాసన సభ్యుల సంఖ్య వేరు వేరుగా నిర్ణయించటమైయింది. మద్రాస్‌లో 127, బొంబాయిలో 111, బెంగాల్‌లో 139, పంజాబ్‌లో 93, సంయుక్త రాష్ట్రాలలో 123గా సభ్యుల సంఖ్య నిర్ణయించబడింది. వీరిలో 70% ఎన్నికల ద్వారా సభ్యత్వాన్ని సంపాదించిన వారు మిగతా 30% గవర్నర్ ద్వారా సభ్యత్వం పొందినవారు. ఎన్నిక సభ్యులు అధిక సంఖ్యలో ఉండటకు ఈ చట్టంలో గొప్ప విశేషం. దీని వల్లనే బాధ్యతాయిత విధానానికి సార్థకత లభించింది.

రాష్ట్ర శాసన సభ్యులను ఎన్నుకొని హక్కు ధనికులకే పరిమితమైయింది. ఎన్నికలు జరిగే నియోజక వర్గంలో కనీసం 12 నెలలు నివశించి ఏడాదికి 3 రూపాయిలు తక్కువ కాకుండా మున్సిపల్ పన్ను కట్టేవారు, లేదా ఏడాదికి 36 రూపాయిలు ఇంటి అద్దె కట్టేవారు. లేదా అంతరాబడి వచ్చే ఇల్లు కలవారు, 2,000 రూపాయిలకు తక్కువ కాని సంవత్సర ఆదాయంపై పన్ను కట్టేవారు, ఓటింగ్ హక్కు కలిగి ఉంటారు. 25 సంవత్సరాల లోపు వయస్సు వారికి శాసన సభ్యత్వం ఇవ్వలేదు. శాసన సభ కాలపరిమితి 3 సంవత్సరాలు, ఐతే గవర్నర్ అవసరమైతే దాని కాలాన్ని పొడిగించవచ్చు లేదా తగ్గించవచ్చు.

గవర్నర్ జనరల్‌కు వలే గవర్నర్‌కు కూడా అసాధారణ అధికారాలు ఇవ్వటం జరిగింది. కౌన్సిల్ అనుమతి ఇవ్వకపోయినా అత్యవసర పరిస్థితులలో అతడు తనకు కావలసిన విధంగా ఖర్చుపెట్టవచ్చు. శాసన సభలో చేసిన బిల్లులు అతనికి నచ్చకపోతే, తిరిగి వాటిని వెనుకకు పంపి తగిన మార్పులు చేయమని కోరవచ్చు. గవర్నర్ జనరల్‌కు వలే గవర్నర్‌కు కూడా సర్టిఫికేషన్ అధికారం ఇవ్వటం జరిగింది.

కేంద్రంలో వలే రాష్ట్రాలలో కూడా సాధారణ నియోజక వర్గాలు, ప్రత్యేక నియోజక వర్గాలు, ఏర్పాటు అయినాయి. మహ్మదీయులు, యూరోపియన్లు, క్రైస్తవులు, భూస్వాములు విశ్వ విద్యాలయాలకు ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పడినాయి. పంజాబ్ రాష్ట్రంలో సిక్కులకు మద్రాస్‌లో బాహ్మణేతరులకు సాంఘిక ప్రాతినిత్యం అంగీకరించటమైంది. ఈ బహ్మణేతరులకు వందకు యాభై మంది ఎన్నిక సభ్యులుగా ఉండవలెననే నిర్ణయం జరిగింది.

**5.1.4. 1919 చట్టంలోని సుగుణాలు :** 1919 ప్రభుత్వ చట్టం ప్రథమముగా రాష్ట్రాలలో బాధ్యతాయిత ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టడం ఒక మంచి లక్షణమని పేర్కొనవచ్చు. దీని మూలంగా భారతీయులు మంత్రి పదవులు పొందటానికి ప్రభుత్వ పరిపాలనా విషయాలు తెసుకోవటానికి ఎటువంటి మార్పులు చేస్తే ప్రజలకు లాభదాయకముగా ఉంటుందో తెలుసుకోవటానికి వీలైయింది. ఈ విధముగా క్రమేణా ప్రభుత్వ విధానంలో అనుభవం పొందటానికి వీలైంది. ఈ చట్టం ద్వారా అనేక మందికి ఓటింగ్ హక్కు కలగటం వల్ల ప్రభుత్వము వేరు తాము వేరు అనుభావం కొంత వరకు తొలగిపోయింది. జాతీయ భావం బాగా నాటుకొన్న ప్రజలకు ఈ చట్టం మొదటిలో కొంత ఉపశాంతిని కలిగించింది. ఈ చట్టం ద్వారా మొదటి సారిగా భారత శాసన సభ్యత్వం పొందటానికి ఓటు వేయటానికి స్త్రీలకు హక్కు ఏర్పడింది. శాసన సభలలో సభ్యుల సంఖ్య బాగా పెంచటం వల్ల, భారతీయులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వటం వల్ల రాష్ట్ర శాసన సభలలో అనధికారుల సంఖ్య ఎక్కువ కావటం వల్ల భారతీయులకు బాధ్యత ఎక్కువైయింది. ఇంగ్లండ్‌లో వలే ఈ దేశంలో కూడా ప్రజా ప్రభుత్వం స్వపరిపాలన ఏర్పాటైయింది. అనే తృప్తి కొంత వరకు ప్రజలలో కలిగింది. అంత వరకు రహస్యంగా జరుగుతున్న విషయాలలో వారు జోక్యం కలిగించుకోవటానికి వీలైయింది. ఏ చర్యల వల్ల సాంఘిక దురాచారాలను మాన్పటానికి ఆంగ్ల ప్రభుత్వం ప్రయత్నం చేసి ప్రజల నిరసనకు గురి అయినదో అదే చర్యలను భారతీయులు ధైర్యంగా చేపట్టటానికి వీలైయింది. ప్రజలకు ఉపయోగపడే అనేక మార్పులు మంత్రుల ద్వారా చేయించటానికి ఈ చట్టం అవకాశం కల్పించింది.

**5.1.5. 1919 చట్టంలోని లోపాలు :** 1919 చట్టంలో అనేక లోపాలు కూడా ఉన్నాయి. ఇది భారతదేశంలో నిజమైన భాద్యతాయిత ప్రభుత్వాన్ని సృష్టించటానికి గాని మాంటేగు చెప్పినట్లు క్రమ క్రమముగా స్వపరిపాలన ప్రవేశపెట్టటానికి గాని చేసింది కాదు. తాత్కాలికముగా భారత ప్రజలు అలజడి చేయకుండా ఉండటానికి చేసిన చట్టం ఇది. కేంద్రములోని కార్యనిర్వాహక సభ్యులు శాసన సభలకు బాధ్యులు కారు. వారిని పదవి నుంచి తొలగించే అధికారం భారత కార్యదర్శికి ఇవ్వటం జరిగింది. గవర్నర్ జనరల్ తనకు కావలసిన వారిని కార్యనిర్వాహక సభలో అదనపు సభ్యులుగా వేసుకోవటానికి వీలు కల్పించటం వల్ల వారు అతడు చెప్పినట్లు వినేవారుగానీ శాసన సభలకు ఏ విధముగాను ఉపయోగపడేవారు కాదు. స్వార్థపరులై ధనదాహముతో వీలైనంత ధనం సంపాదించటమే వారి ఉద్దేశ్యం. ఈ విధముగా శాసన సభలకు, కార్యనిర్వాహక సభలకు పొత్తులేకపోవటం ఈ చట్టం ప్రధాన లోపాలలో ఒకటి. కేంద్ర శాసన సభలకు అన్ని విషయాలపై శాసనాలు చేసే అధికారం ఇవ్వటం జరగలేదు. పైగా గవర్నర్ జనరల్‌కు శాసన పరిపాలనా ఆదాయ విషయాలలో ప్రత్యక్ష అధికారాలు ఇవ్వడంతో అతడు మకుటం లేని మహారాజు అయినాడు. శాసన సభలకు ఇచ్చిన న్యాయం, విద్య, ఆరోగ్యం మొదలగు విషయాలు అంత ముఖ్యమైనవి కావు. శాసన సభలు చేసిన ఏ చట్టానైనా తొలగించి తన ఇష్టం వచ్చినట్లు చేయటానికి గవర్నర్ జనరల్‌కు అధికారం దాఖలు పడింది. ప్రజలకు, ఆంగ్లేయులకు శ్రేయస్సుకరము కాదని అతనికి తోచినప్పుడు అతనికి కావలసిన విధముగా ప్రవర్తించటానికి ప్రత్యక అధికారం అతనికి కల్పించటం వల్ల ఈ చట్టం ఒక విధముగా గవర్నర్ జనరల్ నిరంకుశ ప్రభుత్వాని ప్రవేశపెట్టిందని చెప్పవచ్చు. ఓటింగ్ హక్కు కూడా వయోజనులందరికి ఇవ్వక కొన్ని నిబంధనలను తృప్తి పరచిన వారికి మాత్రమే ఇవ్వటం ప్రజా ప్రభుత్వానికి విరుద్ధం. రాష్ట్రంలో ద్వంద్వ ప్రభుత్వం కూడా సరిగా అమలు జరగలేదు. మంత్రులను తీసివేయటానికి గవర్నర్లకు అధికారం ఉన్నందు వల్ల వారు అతనికి కావలసినట్లు గానే నడుచుకొనవలసి వచ్చింది. ఆదాయ వ్యయాల మీద ధన సంబంధాలతో వారికి ఎటువంటి అధికారము జోక్యము లేనందువల్ల ఏ పథకాలు తలపెట్టటానికి వారికి వీలు లేకపోయింది. క్రొత్త కాలువలు త్రవ్వాలన్నా ధనము అవసరం కాని ఆ ధనము లభించటానికి వారికి ఈ చట్టం దారి చూపదు. దానికోసం వారు గవర్నర్ అతని కౌన్సిల్‌పై ఆధారపడవలసి వచ్చింది. గవర్నర్ జనరల్ వలె గవర్నర్లలకు కూడా ప్రత్యేక అధికారాలు కల్పించటంతో ఏ మాత్రం బాధ్యతాయుత ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన దానికి విలువ లేకుండా పోయింది. మంత్రులకు కార్యనిర్వాహక మండలికి పొత్తు కుదరలేదు. ఈ విధముగా రాష్ట్రములో ద్వంద్వ ప్రభుత్వం వ్యర్థము కావటమే ఈ చట్టంలోని ముఖ్య లోపం. అందువల్ల ఏ కారణం చేత ఈ చట్టం ప్రవేశపెట్టటం జరిగిందని అవతారికలో చెప్పబడిందో అది సఫలం కాలేదు.

## 5.2 1935 భారత ప్రభుత్వ చట్టం :

**5.2.1. ఉపోద్ఘాతము :** ఆంగ్లేయులు మన దేశంలోని ప్రభుత్వంలో మార్పులు తేవడం కోసం అనేక చట్టాలు చేసినారు. 1858 నుంచి భారతీయులకు ప్రభుత్వంలో ఏదో ఒక రకమైన బాధ్యత కల్పించి వారి సహకారంతో వారి అభిప్రాయాలకు అనుగుణంగా పరిపాలించడం కోసం పార్లమెంటు ప్రవేశపెట్టిన చట్టాలను మనం పరిశీలించినాము. ఈ శాసనాలన్నింటిలోను 1935 లో అమలులో పెట్టిన శాసనం చాలా ముఖ్యమైనది. దీనిని తయారు చేయడానికి వారికి కొన్ని సంవత్సరాలు పట్టింది. వారు ఈసారి ప్రత్యేకంగా భారతదేశ ప్రతినిధులతో దీర్ఘాలోచనలు చేసి దీనిని రూపొందించినారు. ఈ చట్టం చాలా విస్తృతమైనది. ఇందుమూలంగా దేశంలో ఒక నూతన రాజ్యాంగమే ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పవచ్చు. కెనడా, ఆస్ట్రేలియాల వలె సమాఖ్య రాజ్యాంగం రూపొందించడం ఈనూతన చట్టం ప్రధాన లక్షణం అని అనేకులు చెబుతారు. కాని ఈ చట్టం మిగతా చట్టాలవలె పూర్తిగా అమలుకాలేదు. ప్రజలు దానిని అతి త్వరలో ఖండించి ఆంగ్లేయులపై దాడి చేసినారు. ఇంత కష్టపడి చేసిన శాసనానికి ఈ విధంగా ప్రతిఘటన ఎందువల్ల వచ్చిందో, దాని ప్రధాన అంశాలు ఏవో, గుణదోషాలు ఏవో తెలుసుకోవలెను.

**5.2.2. చట్టం ప్రవేశపెట్టటానికి కారణాలు :** 1935 ప్రభుత్వం చట్టం ప్రవేశపెట్టడానికి అనేక కారణాలు 1919 చట్టం లోపభూయిష్టమైనదనీ, తమను ఏ విధంగానూ తృప్తిపరచలేదనీ, తమకు ఏమీ లాభదాయకం కాదనీ, భారతీయులు త్వరలోనే తెలుసుకొన్నారు. వారి ఏకైక నాయకుడైన మహాత్మాగాంధీ నాయకత్వంలో మొదటి సహాయ నిరాకరణోద్యమం, తరువాత శాసనోల్లంఘనోద్యమం లేవదీసినారు. దేశం అంతా ఏకమై ఆంగ్ల ప్రభుత్వంపై దాడి చేసింది. ఈ ఉద్యమాలను అణచడానికి పూర్వం వలెనే ప్రభుత్వం రెండు విధానాలను

అనుసరించింది. దారుణమైన ఆర్డినెన్సులను అమలు పరచి, సాయుధ పోలీసులను, సైనికులను వినియోగించి, వందలాది ప్రజలను చంపించి, వేలాది ప్రజలను నిర్బంధంతో కూడిన నరకం వంటి జైళ్ళపాలు చేసి, కటినంగా శిక్షించడం వారు అనుసరించిన మొదటి విధానం. దాని వల్ల జాతీయ భావం కలిగిన అనేక మంది ప్రజలు కష్టాల పాలైనారు. 'విభజించు పాలించు' అనే సిద్ధాంతాన్ని అమలుపరచి, ముస్లింలను, అల్ప సంఖ్యకులను వారి నుంచి వేరు చేసి, వారిని తృప్తి పరచటానికి ముఖ్యంగా ఈ 1935 చట్టం ప్రవేశపెట్టినారు. కాని దేశం మొత్తం ప్రజలను తృప్తి పరచడానికే ఈ శాసనం చేసినట్లు పైకి కనిపించడానికి ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేసింది. ఆంగ్లేయుల రాజనీతికి ఇది ఒక గీటురాయి. 1927లో ఈ ఉద్దేశ్యంలో సైమను కమీషన్ దేశంలో పర్యటించి ప్రజాభిప్రాయం తెలుసుకోవడం కోసం వచ్చింది. దానిని అనేక కారణాల వల్ల భారతీయులు బహిష్కరించినా, అది దానికి వీలైన పరిధిలో అన్ని విషయాలు తెలుసుకొంది. ఇంగ్లండ్‌లోమూడు పర్యాయాలు భారతీయ ప్రతినిధులతో కూడిన రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగినాయి. కాని ఈ ప్రజా ప్రతినిధులందరూ అల్ప సంఖ్యక వర్గాల వారూ మహ్మదీయులు కావటం వల్ల అందులో కాంగ్రెసు వారికి స్థానం లేదు. రెండో సమావేశంలో మాత్రం గాంధీ మహాత్ముడు పాల్గొన్నా ఎక్కువ ప్రయోజనం లేకపోయింది. చివరకు భారతీయుల ప్రమేయం ఎక్కువ అవసరం లేదని సైమన్ కమీషన్ సలహాను అనుసరించి కొత్త చట్టం చేయవచ్చునని పార్లమెంటు తీర్మానం చేసినా, నెహ్రూ కమిటి రిపోర్టు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్ణయాలు, వైట్ పేపరు, జాయింటు సెలెక్షన్ రిపోర్టు, లోధియన్ రిపోర్టులలోని అంశాలకు కూడా కొంచెం ప్రాముఖ్యం ఇవ్వటం జరిగింది. అందుకే భారతీయులు ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి మహ్మదీయులకు, హిందువులకు మధ్య శాశ్వతమైన చీలికలు ఏర్పరచటం అల్ప సంఖ్యాకులైన మహ్మదీయులు, అస్పృశ్యులు, బలహీనవర్గాలు సిక్కులు, ఆంగ్లో ఇండియన్లు, భారతీయ క్రైస్తవులు, యూరోపియనులు, కార్మికులు మొదలైన వారిని తృప్తి పరచడానికి 1935 చట్టం ప్రవేశపెట్టడం జరిగింది.

**5.2.2. 1935 చట్టంలోని ప్రధాన అంశాలు :** ఈ చట్టం చాలా విస్తృతమైనది. ఇందులో 321 సెక్షను, పది షెడ్యూళ్లు ఉన్నాయి. ఈ చట్టం ద్వారా బర్మా భారతదేశం నుంచి విడిపోయింది. సింధు, ఒరిస్సా రాష్ట్రాలు కొత్తగా ఏర్పరచడం జరిగి అవి, వాయువ్య సరిహద్దు రాష్ట్రం. మిగతా రాష్ట్రాలతో సమానం చేయబడినాయి.

**5.2.2.1. సమాఖ్య రాజ్యంగం :** 1935 చట్టం సమాఖ్య రాజ్యాంగాన్ని రూపొందించింది. సమాఖ్య రాజ్యాంగానికి సాధారణంగా మూడు ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. 1. లిఖిత పూర్వక రాజ్యాంగము 2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉండి, వాటి అధికారాలు ఖచ్చితంగా నిర్ణయం జరగడము. 3. రాజ్యాంగాన్ని సంరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తగాదాలు తీర్చడం కోసం ఒక ఉన్నత న్యాయస్థానం 1935 రాజ్యాంగ చట్టం లిఖిత పూర్వక రాజ్యాంగం గాను, ఫెడరల్ న్యాయస్థానం ఉన్నత న్యాయస్థానం గాను ఏర్పరచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేరు వేరు విషయాలు కేటాయించటం వల్ల సమాఖ్య రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టిందని చెప్పవచ్చు. భారతదేశమందలి బ్రిటిష్ రాష్ట్రాలు మొత్తం 16. ఈ నూతన సమాఖ్యలో సభ్య రాష్ట్రాలు. ఇవి గాక ఏయే సంస్థానాలు ఈ సమాఖ్యలో చేరవలెనని ఇష్టపడతాయో అవి ప్రత్యక్షంగా ప్రభుత్వంతో ఒక వడంబడిక చేసుకోవలెను. 1935 చట్టం భారత రాజ్యాంగ మంత్రి అధికారాలలో ఎక్కువ మార్పులు తీసుకొని రాలేదు. ఇండియా కౌన్సిల్ రద్దు అయింది. దానికి బదులు ముగ్గురికి తగ్గకుండా ఆరుగురికి హెచ్చుకుండా ఒక సలహా సంఘం ఏర్పాటైంది. కాని మంత్రి ఆ సంఘ సలహాలకు బద్దుడు కాడు. ఇంగ్లండ్‌లోని ఇండియా కార్యాలయానికి సంబంధించిన ఖర్చులన్నీ బ్రిటిష్ ప్రభుత్వమే భరించవలెను.

**5.2.2.2. కేంద్ర ద్వంద్వ ప్రభుత్వం :** భారతదేశ కేంద్రంలో ఈ నూతన చట్టం ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రానికి కేటాయించిన విషయాలు కొన్ని ప్రభుత్వాదీనశాఖకు, మిగతావి శాసన సభ శాఖకు కేటాయించడమైంది. ప్రభుత్వాధీనశాఖకు అప్పగించిన విషయాలలో ముఖ్యమైనవి దేశ రక్షణ, మత సంబంధ విషయాలు విదేశీ వ్యవహారాలు మొదలైనవి. గవర్నర్ జరల్ ముగ్గురికి మించని ఒక సలహాసంఘం సహాయంతో పై విషయాలకు సంబంధించినంత వరకు పరిపాలిస్తాడు. ప్రభుత్వాధీన శాఖ విషయాలను పరిపాలించడానికి 10 మందికి మించకుండా శాసన సభకు బాధ్యులైన మంత్రులతో కూడిన సభ ఏర్పాటైంది. దీనిని బట్టి కేంద్రంలో అతి ముఖ్యమైన అధికారి గవర్నర్ జనరల్ అని తెలుసుకొవలెను. అతడు భారతదేశంలో ఉండే ఇంగ్లాండ్ దేశ ప్రతినిధి. బ్రిటిష్ ప్రధాని సలహాతో చక్రవర్తి అతనిని నియమిస్తాడు. అతని ఉద్యోగ కాల పరిమితి 5 సంవత్సరాలు. జీతం ఏడాదికి 2,50,800 రూపాయిలు. దానిని కేంద్ర ప్రభుత్వమే భరించవలెను.

ఈ నూతన చట్టం గవర్నరు జనరల్‌కు పరిపాలనాధికారాలు, శాసనాధికారాలు, ప్రత్యేక అధికారాలు ఇచ్చింది. అతడు భారతదేశంలో శాంతి భద్రతలు కాపాడువలె. అల్ప సంఖ్యాకుల హక్కులు రక్షించవలె, స్వదేశీ సంస్థానాల హక్కులు, సంస్థానాధీశుల అధికార గౌరవాన్ని కాపాడవలెను. పబ్లిక్ సర్వీస్‌లోని ఉద్యోగుల హక్కులు, వారి వారసుల హక్కులు సంరక్షించవలె, చక్రవర్తి ఇతని సలహాపై మద్రాసు, బొంబాయి, బెంగాలు మినహా ఇతర రాష్ట్ర గవర్నర్లను నియమిస్తాడు. కౌన్సిలు సభ్యులను, మంత్రులను, ఆర్థిక, సలహాదారుని, ఛీఫ్ కమీషనర్లను, శాశ్వత కార్యదర్శులను, పబ్లిక్ సర్వీసు చైర్మన్, ఇతర సభ్యులను అతడే తమకు ఇష్టమైన వారిని నియమించవచ్చు. శాసన సభలపై కూడా అతనికి పూర్తి అజమాయిషి ఉంది. శాసన సభలను సమావేశపరచడానికి వాయిదా వేయడానికి, రద్దు చేయడానికి అతనికి అధికారం ఉంది. శాసనసభలలో తనకు ఇష్టం వచ్చినప్పుడు ఉపన్యసించవచ్చు. అతనికి కేటాయింపు అయిన సంరక్షణ, మత విషయశాఖ, విదేశీ వ్యవహారాల విషయాలపై ప్రశ్నలు వేయడానికి, వాటిని శాసన సభలలో చర్చించడానికి సభ్యులు ముందుగా గవర్నరు జనరల్ అంగీకారం పొందవలె. ఏ సందర్భంలోనైనా, శాసన సభలు రెండూ కలిపి ఏ బిల్లునైనా పరిష్కరించవలెనని గవర్నరు జనరల్ ప్రకటిస్తే ఏ శాసన సభా ప్రత్యేకంగా ఆ బిల్లును చర్చించడానికి వీలులేదు. శాసన సభలు ఆమోదించిన బిల్లును గవర్నరు జనరల్ ఆమోదించడానికి నిరాకరించవచ్చు. లేదా ఆ బిల్లును మళ్ళీ విచారించమని శాసన సభకు తిరిగి పంపవచ్చు. లేదా దానిని ఏ విధంగా పరిష్కరించవలెనో సూచనలు చేయవచ్చు. అట్లే ఆదాయ వ్యయాలకు సంబందించిన బిల్లును గవర్నర్ జనరల్ ఆమోదం పొందందే ఆమల్లోకి రావటానికి వీలులేదు. శాసన సభలు గవర్నర్ జనరల్ కోరికలను వ్యతిరేకంగా ఏ మొత్తమైనా నిరాకరిస్తే, లేదా కోరిన దానికన్నా తక్కువ వస్తే గవర్నర్ జనరల్ తన ప్రత్యేకాధికారంతో తనకు కావలసిన విధంగా ఆ వ్యయ మొత్తాన్ని పునరిద్ధరించవచ్చు. శాసన సభ సమావేశాలు లేని కాలంలో మంత్రుల ఆమోదంతో గవర్నర్ జనరల్ ఆర్డినెన్సు మూలంగా కొత్త శాసనాలు చేయవచ్చు. కాని వాటి కాల పరిమితి ఆరు మాసాలు మాత్రమే. ఏ కారణం వల్లనైనా రాజ్యాంగం భగ్నమై పరిపాలన స్తంభించినపుడు గవర్నర్ జనరల్‌కే రాజ్యాంగం నిర్వహించే అధికారం ఉంటుంది. గవర్నర్ జనరల్‌కు రాష్ట్రాలపైన కూడా అధికారం ఇవ్వటం జరిగింది. ఇతని అనుమతి పొందనిదే కొన్ని ముఖ్య విషయాలకు సంబంధించిన బిల్లులు ఉదాహరణకు బ్రిటిష్ ఇండియాకు సంబంధించిన పార్లమెంటు చేసిన శాసనాలను రద్దు చేయడం లేక సవరించడం, ఆంగ్లేయ పౌరులను నేర విచారణ చేసే విధానాన్ని మార్చడం, అతడుగాని గవర్నర్‌గాని స్వేచ్ఛతో చేసిన ఆర్డినెన్సులు రద్దు చేయడం, సవరించడం రాష్ట్ర శాసన సభలో ప్రవేశపెట్టరాదు. ఈ విధంగా రాష్ట్రాలకు కల్పించిన స్వాతంత్ర్య ప్రతిపత్తికి భంగం కలిగించడానికి వీలయింది. అవసరం అయితే రాష్ట్రాలను చిన్నవిగా, పెద్దవిగా చేసే అధికారం కూడా అతనికి ఇవ్వడం జరిగింది. తాత్కాలికంగా ఉన్నత న్యాయస్థానాలలోని న్యాయమూర్తులను నియమించడానికి కూడా అతనికి హక్కు కల్పించడం జరిగింది. సైన్యం బాధ్యత అతనిదే. దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు అతని బాధ్యతలే. మొత్తం మీద 1935 చట్టం బాధ్యతాయుత ప్రభుత్వం ప్రవేశపెట్టినా, గవర్నర్ జనరల్‌ను నిరంకుశుడిగా చేసి, బాధ్యతాయుత ప్రభుత్వం వట్టి బూటకం అని నిరూపించింది.

**5.2.2.3. ప్రభుత్వ అధికారాలు :** పైన చెప్పినట్లుగా **1935** చట్టం ప్రభుత్వాదికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విడివిడిగా కేటాయించింది. కేంద్రానికి **59** విషయాలు, రాష్ట్రాలకు **54** విషయాలు, కేటాయించడమేగాక ఉభయ ప్రభుత్వ ఉమ్మడి విషయాలు కూడా కొన్ని కల్పించింది. కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించిన విషయాలలో ముఖ్యమైనవి దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు, నాణేలు, మత విషయాలు, తంతి తపాలా, టెలిఫోన్, దూర శ్రవణం, రైలుమార్గాలు, నౌకాయానం, తులామానం, ఆదాయపు పన్ను మొదలైనవి. రాష్ట్ర ప్రభుత్వ విషయాలలో ముఖ్యమైనవి. ఆరోగ్యం, విద్య, నీటి వసతులు, వ్యవసాయం, అడవులు, వ్యవసాయపు పనులు, మరికొన్ని రకాల పనులు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు మొదలయినవి ఏవైనా కొత్త విషయాలు, పై మూడు విభాగాలతో పేర్కొనివి తటస్థించినప్పుడు వాటిని గవర్నర్ జనరల్ తన విచక్షణ ద్వారా కేంద్రానికో, రాష్ట్రానికో లేక ఉమ్మడిగానో కేటాయించవచ్చు.

**5.2.2.4. కేంద్రము :** **1935** రాజ్యాంగ చట్టం ద్వారా కేంద్రంలో పూర్వం వలెనే రెండు శాసన సభలు ఏర్పడినాయి. ఎగువ సభ, లేక రాజ్యసభ **260** మంది సభ్యులు. దిగువ సభ, లేక సమాఖ్యసభలో **375** మంది సభ్యులు ఉంటారు. రాజ్యసభలోని **260** మందితో **104** మందిని సంస్థానాలకు మిగతా **156** మందిని బ్రిటిష్ రాష్ట్రాలకు కేటాయించడం అయింది. ఆ సంస్థానాల హోదాను అనుసరించి అవి ఏంత మంది ప్రతినిధులను ఎన్నుకోవలెనో చట్టమే సూచించింది. ఉదాహరణకు హైదరాబాదు నుంచి **5,** మైసురు నుంచి **3,** పాటియాలా బికనీరుల నుంచి **2,** ఇట్లు వేరు వేరు సంఖ్యలలో ప్రజా ప్రతినిధులు కేటాయింపు అయినారు. సంస్థానాలలో ప్రజాస్వామ్యం ప్రవేశపెట్ట

వరకూ సంస్థానాదీశులే సభ్యులనునామ నిర్దేశం చేయవలె. రాష్ట్రాలకు కేటాయించిన 156 సభ్యులలో గవర్నర్ జనరల్ 6 గురిని నామ నిర్దేశం చేయవలెను. 75 మంది హిందూ సాధారణ నియోజక వర్గం నుంచి ఎన్నిక అవుతారు. 49 మందిని మహ్మదీయులు, 48ని సిక్కులు, 7 గురిని తెల్లవారు, ఇద్దరిని దేశీయ క్రైస్తవులు, ఒకనిని ఆంగ్లో ఇండియన్లు 6 గురుని స్త్రీలు, 6గురిని నిమ్నజాతుల వారు ఎన్నుకొంటారు. సంస్థానాల వలెనే రాష్ట్రాలకు కూడా ప్రతినిధుల సంఖ్య వేరు వేరుగా నియమించడమైనది. ఆ రాష్ట్రాల ప్రాముఖ్యం జనసంఖ్య ఇంకా ఇతర విషయాల దృష్టిలో ఉంచుకొని ఈ ఏర్పాట్లు జరిగినాయి.

సమాఖ్యసభలోని సభ్యుల సంఖ్య 375. ఇందులో మూడవ వంతు అనగా 125 మంది సంస్థానముల నుంచి మిగతా 250 మంది రాష్ట్రాల నుంచి ఎన్నికయినవారు. ఎగువసభలోవలెనే ఈ సభలో కూడా ఆయా స్థానాలు, రాష్ట్రాల ప్రాముఖ్యాన్ని బట్టి సభ్యుల సంఖ్య నిర్ణయించడమైంది. ఈ సభలోని సభ్యులను పరోక్షంగా రాష్ట్ర శాసన సభ్యులు ఎన్నుకొంటారు. ఈ సభ్యుల కాల పరిమితి 5 సంవత్సరాలు, రాజ్యసభకు కాలపరిమితి లేదు. అది శాశ్వత సభ. ప్రతి మూడు సంవత్సరాలకు మూడోవంతు మంది సభ్యులు తమ పదవులను విరమించుకొంటారు. సభ్యుల కాలపరిమితి మూడు సంవత్సరాల నుండి 9 సంవత్సరాల వరకు ఉంటుంది. సమాఖ్య సభలో ఉన్న బ్రిటిష్ రాష్ట్రాలకు కేటాయించిన స్థానాలు తిరిగి కుల మతాలను అనుసరించి విభజన అయినాయి. ఉదాహరణకు హిందూ, ముస్లిం సిక్కు స్థానాల ప్రతినిధులను రాష్ట్ర శాసన సభలో గల ఆయా మతాల వారు ఎన్నుకొంటారు. కేంద్ర మంత్రులు శాసన సభకు బాధ్యులై శాసన సభ విశ్వాసము వారిపై ఉన్నంత వరకు అధికారంలో ఉంటారు.

**5.2.2.5. ఫెడరల్ న్యాయస్థానం :** 1935 చట్టం ప్రకారం ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు అయినది. ఈ న్యాయస్థానానికి మూడు విధాలైన అధికారం లభించాయి. సహజమైన అధికారం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు సంస్థాన ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వానికి మధ్య లేక అన్నింటి మధ్య రాజ్యాంగ శాసనానికి సంబంధించిన తగవులు పరిష్కరించటమే ఈ సహజ అధికారం. బ్రిటిష్ ఇండియా హైకోర్టుల తీర్పులపైన, సమాఖ్యలో చేరిన సంస్థానాల హైకోర్టుల తీర్పులపైన అపీల్‌లను ఈ న్యాయస్థానం పరిష్కరిస్తుంది. ఈ న్యాయస్థానం సామాన్యముగా ఢిల్లీలోనే సమావేశం అవుతుంది. ఇందు ఒక ప్రధాన న్యాయమూర్తి 6 గురికి మించకుండా ఇతర న్యాయమూర్తులు ఉంటారు. వకీలుగా కనీసం 15 సంవత్సరాల అనుభవం కలవాడై ప్రధాన న్యాయమూర్తి పదవికి అర్హుడు.

**5.2.2.6. రిజర్వు బ్యాంక్ :** దేశంలోనే నాణేలను అదుపులో పెట్టడానికి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి చక్కబెట్టడానికి గవర్నర్‌తో కూడిన 15 మంది డైరెక్టర్లతో రిజర్వు బ్యాంకును ఈ చట్టం నెలకొల్పింది.

**5.2.2.7. రాష్ట్రాలు :** 1935 చట్టం రాష్ట్రాలలో అనేక మార్పులను తీసుకొని వచ్చింది. వీటిలో అన్నింటికంటే ముఖ్యమైనది. రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం రద్దయి పూర్తిగా బాధ్యతాయిత ప్రభుత్వం ఏర్పాటు కావటం. పరిపాలనా శాఖలన్నీ మంత్రులకు ఇవ్వడం జరిగింది. రాష్ట్రాలకు పూర్వం వలే అధికారి గవర్నర్. ఇతనిని చక్రవర్తి నియమిస్తాడు. రాష్ట్రాలకు కేటాయించిన విషయాలలో ఇతనికి సలహా ఇచ్చి సహాయ పడటం కోసం మంత్రి వర్గం ఏర్పడింది. అసాధారణ పరిస్థితులలో తప్ప గవర్నర్ మంత్రుల సలహాలను పాటించాలి. ఈ మంత్రులు తప్పనిసరిగా శాసన సభ్యులై ఉండవలెను. లేక పదవిలోకి వచ్చిన 6 నెలలలో ఎన్నిక ద్వారా శాసన సభ సభ్యత్వం పొందవలెను. గవర్నర్ మంత్రి వర్గము ఏర్పాటు చేసేటప్పుడు శాసన సభలో ఏ పక్షం అధిక సంఖ్యాకులతో ఉంటుందో ఆ పక్ష నాయకుని ముఖ్య మంత్రిగాను అతనితో సంప్రదించి ఇతర మంత్రులను ఏర్పాటు చేయవలెను. పెద్ద రాష్ట్రాలైన మద్రాస్, బొంబాయి, బెంగాల్ సంయుక్త రాష్ట్ర బీహార్, అస్సాం మొదలగు వాటిలో కేంద్రములో వలె రెండు సభలు ఏర్పడినాయి. అవి శాసన సభ, శాసన మండలి, కేంద్రములో వలె మత, కుల, బేధాలను అనుసరించి సభలలో సభ్యత్వ సంఖ్య నిర్ణయించటమైయింది. గవర్నర్ జనరల్‌కు వలె గవర్నర్‌కు కూడా ప్రత్యేక అధికారాలు ఇవ్వటమైయింది. అవసరమైతే ఆర్డినెన్సులు ప్రవేశపెట్టడానికి శాసనాలు చేయడానికి అధికారం పొందాడు. ఈ సందర్భంలో అతడు గవర్నర్‌కు పార్లమెంటుకు బాధ్యుడు.

**5.2.3. చట్టంలోని సుగుణాలు :** 1935 చట్టంలో అనేక సుగుణాలు కలవు. ప్రధమముగా భారతీయులు కేంద్రములో మంత్రి వర్గాన్ని ఏర్పరచుకొని పరిపాలించటానికి అవకాశం ఏర్పడింది. కాని పరిస్థితుల ప్రాముఖ్యం వల్ల వారు ఈ అవకాశం వినియోగించుకోవటానికి వీలులేకపోయింది. ఈ చట్టము పూర్తిగా అమలులోకి రాక పూర్వమే రెండో ప్రపంచ యుద్ధం జరగడం తిరిగి స్వాతంత్ర్యయ ఉద్యమం

లేవదీయడం జరిగాయి. ఈ చట్టం లోని మంచి లక్షణం ఏమంటే రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం రద్దయి రాష్ట్రియ స్వపరిపాలన ఏర్పాటైయింది. రాష్ట్రాల పరిపాలనా శాసనసభకు బాధ్యత వహించి మత్రుల ఆధీనంలోకి వచ్చింది. దేశ పరిపాలనలో భారతీయులకు భాగస్వామ్యం ఉండవలెనని జాతీయ వాదులు వ్యకత్తం చేస్తూ వచ్చిన అభిప్రాయం కొంత వరకు ఆచరణ సాధ్యమైయింది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఈ చట్టం ద్వారా మెరుగుపడే అవకాశం కలిగింది. రాష్ట్ర కేంద్ర ఆదాయాలను ప్రత్యేకించి జరిగింది. అంతేగాక కొన్ని కొన్ని రాబడులలో కేంద్రం నుంచి రాష్ట్రాలకు, రాష్ట్రలనుంచి కేంద్రానికి వాటాలు ఇవ్వడమైయింది. కేంద్ర రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయడానికి వీలు కలిగింది. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నిబంధనల ప్రకారం ప్రజల వద్ద నుండి ఋణాలు తీసుకోవచ్చు. ఈ విధముగా 1935 చట్టములో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు ఇది వరకు కంటే మెరుగుపడింది. ఈ చట్టంలో మరో గొప్ప విశేషమేమంటే కేంద్ర రాష్ట్రాలు వేరు వేరు రంగాలు అయినట్లుగా ఒక దానితో ఒకటి సంబంధం లేకుండా ప్రవర్తించవలెనను నిబంధనను సడలించడం జరిగింది. దేశ ప్రజలందరు దేశానికి సంబంధించిన వారు. ఒక్కొక్క సారి రెండు మూడు రాష్ట్రాలకు ఒకే రకమైన సమస్యలు వచ్చినప్పుడు ఉమ్మడిగా పనిచేయడానికి అంతర్ రాష్ట్ర మండలి ఏర్పాటు జరిగింది. రెండు మూడు రాష్ట్రాలకు కలిపి ఒకే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేసుకొవటం అవసరమైతే ఫెడరల్ సర్వీస్ కమీషన్‌ను రాష్ట్రాలు ఉపయోగించుకోవటం కోసం వీలు కల్పించడం వల్ల కేంద్ర రాష్ట్రాల మధ్య రాష్ట్రాల నడుమ సక్యం ఎక్కువ కావటానికి ప్రభుత్వం సవ్యముగా నడవటానికి వీలైయింది. అందుకే కాంగ్రెస్ వారు ఈ చట్టానికి మొదటిలో విముఖత చూపిన తరువాత పరిపాలన అధికారం చేపట్టటానికి సమ్మతించారు.

**5.2.4. చట్టంలోని లోపాలు : 1935** చట్టంలో అనేక లోపాలు ఉన్నాయి. రాష్ట్రాలలో మంత్రులకు లభించిన అధికారం చాలా స్వల్పమని వాస్తవ అధికారం అంతా గవర్నర్లదే అని అలాంటి అధికారాన్ని చలాయించటం ద్వారా ప్రజల స్థితిగతులను చక్కబరచడం సాధ్యం కాదని కాంగ్రెస్ వారు భావించారు. ఈ చట్టం ప్రకారం ఏర్పడే మంత్రి వర్గంలో అల్ప సంఖ్యాక వర్గాల వారికి సముచిత ప్రాతినిధ్యం ఉండవలెనని బ్రిటిష్ ప్రభుత్వం గవర్నర్లను ఆదేశించింది. ఈ అల్ప సంఖ్యకులు అధిక సంఖ్య బలము గల పార్టీకి సంబంధించిన వారుగా ఉంటేనే మంత్రులు సమిష్టి బాధ్యత సక్రమముగా నిర్వర్తించటానికి వీలవుతుంది. కాని ఈ చట్టం ఈ విషయాన్ని గురించి వివరముగా చర్చించలేదు. పైగా కాంగ్రెస్‌లో లేని ముస్లింలు ఇందులో చేరితే మంత్రి వర్గంలో పని చేయటం కష్టం. గవర్నర్లకు, గవర్నర్ జనరల్‌కు ప్రత్యేక అధికారాలు కలగజేయటం వల్ల ఎన్ని బాధ్యతాయిత అంగాలు ఉన్నపటికి వారి నిరంకుశత్వానికి ఎటువంటి అడ్డంకులు లేకపోయినాయి. ఈ చట్టం స్వదేశీ సంస్థానాలకు కూడా కేంద్ర ప్రభుత్వంలో శాసన సభలలో సభ్యత్వం కల్పించబడింది. దీని వల్ల రాష్ట్రాలు సంస్థానాలు ఆంగ్లేయులు ఒకే బాటలో ఉమ్మడిగా కలసి పని చేయడానికి వీలవుతుందని అనేక మంది భావించారు. కాని అందుకు భిన్నంగా చట్టం సంస్థానాలకు అనేక ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ఈ చట్టం కొన్ని విషయాలలో కేంద్రానికి, కొన్ని విషయాలు రాష్ట్రాలకు కేటాయించింది. సంస్థానాల విషయంలో ఈ విభజన పూర్తిగా వర్తించలేదు. సంస్థానాల కన్నా రాష్ట్రాలకు ఈ చట్టం వల్ల తక్కువ హోదా ఏర్పడింది. ఇది సమాఖ్య సిద్ధాంతానికి విరుద్ధం. రాష్ట్రాలు పాటించవలసిన నిర్బంధాలు అన్నింటిని సంస్థానాలు పాటించనవసరం లేనప్పుడు కేంద్ర శాసన సభలలో మండలిలో సంస్థానాలకు రాష్ట్రాల కన్నా తక్కువ ప్రాతినిధ్యం కలిగించటం న్యాయం. అట్లాగాక సంస్థానలన్నింటిలోను జన సంఖ్య **25%** ఉండగా సంస్థానాలకు ఎగువ సభలో **40%** దిగువ సభలో **33%** ప్రాతినిధ్యం ఇవ్వటం జరిగింది. కేంద్ర కార్యనిర్వహక మండలిలో కూడా వారికి ప్రత్యేక న్యాయస్థానాలు కేటాయించటమైంది. శాసన సభలలో ఎన్నికల ద్వారా రాష్ట్రాల ప్రతినిధులు స్థానాలను పొందగా సంస్థానాలలో ఈ హక్కు సంస్థానాదీశులకు ఇవ్వటం జరిగింది. ఈ విధముగా ఈ చట్టం సమాఖ్య సిద్ధాంతానికి విరుద్ధముగా చేయబడింది. పార్లమెంటు భారత ప్రభుత్వంలో మార్పులు చేయటానికి అనేక చట్టాలు చేసింది. ఐతే ఈ విధముగా పూర్తిగా అమలు జరగని చట్టం స్వల్పకాలంలోనే విఫలమైన చట్టం **1935** చట్టం. బ్రిటిష్ వారు తమ అధికారాన్ని భారతదేశంలో పటిష్టం చేసుకొవటానికి చేసిన ఆఖరి చట్టం **1935** భారత చట్టం.

H.B.L. స్మిత్ అను ప్రధమ రౌండ్ టేబుల్ సభ సభ్యుడు ఈ చట్టాన్ని గురించి ఈ విధముగా తన అభిప్రాయం తెలియచేశాడు. “భారతీయ సమాఖ్య రాజ్యంగం వంటి రాజ్యాంగాన్ని ఇంతవరకు కనివిని ఎరుగని ఎందుకంటే బ్రిటిష్ రాష్ట్రాలకన్నింటికి ఒకే విధమైన అధికారం స్వదేశీ సంస్థానాలకన్నింటికి తలకొక్క విధమైన అధికారం ఉంది. ఈ రాజ్యంగంలోని కొంత భాగం పార్లమెంటరీ సూత్రాలను అనుసరించి పరిపాలిస్తుంటే మరికొంత భాగం నిరంకుశ సూత్రాలను అనుసరించి పరిపాలించటం జరుగుతుంది. కీర్ అను రాజ్యంగ

నిపుణుడు, చరిత్రకారుడు ఈ చట్టాన్ని విమర్శిస్తూ ప్రభుత్వం రెండు కలపటానికి వీలులేని వస్తువులను కలపటానికై ప్రయత్నించింది. బాధ్యతాయిత ప్రభుత్వాన్ని ఇస్తునట్లు ఒకవంక భారతీయులను తృప్తి పరచడానికి సూచించింది. మరొక వైపు బాధ్యతాయిత ప్రభుత్వాన్ని నామమాత్రం చేసింది. ఈ చట్టం ఈతరానికి వర్తించింది కాదనీ ఫిలిప్స్ అనే రాజ్యాంగ నిపుణుడు పేర్కొన్నాడు. ఈ చట్టం ద్వారా భారతీయులకు బ్రిటిష్ వారిపై మరింత అపనమ్మకం కలగటానికి వీలైందని క్లెమెంటు అట్లి పేర్కొన్నాడు. మొత్తం మీద ఈ చట్టం ఎవరిని తృప్తిపరచలేదు. ముస్లింలు తామ కోరినంత హక్కులు తమకు దొరకలేదని బాధపడ్డారు. ఈ చట్టం పరిణామమే 'క్విట్ ఇండియా' ఉద్యమం.

## 5.3. నమూనా ప్రశ్నలు

1. 1919 రాజ్యాంగ సంస్కరణలు, జాతీయ ఉద్యమంపై దాని ప్రభావం తెలుపుము
2. 1935 రాజ్యంగ సంస్కరణలు, దాని ప్రభావం వివరింపుము

## 5.4. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | R.C. Agarawal | : | Constitutional History of Indian National Movement |
| 2. | Bipin Chandra | : | Modern India, |
| 3. | Spear | : | A History of India, Vol. 2 |
| 4. | Tarachand | : | History of The Freedom Movement, Vol - III |
| 5. | R.C. Majumdar | : | Three Phases of the Indian Struggle for Freedom |
| 6. | Sumit Sarkar | : | Modern India, |
| 7. | R.C. Majumdar (Ed) | : | The Struggle for Freedom, Bharatiya Vidya Bhavan Series, Vol X |
| 8. | S.C. Raychoudary | : | History of Modern India |


డా॥ వి.కె. మోహన్

**యూనిట్ - 5**

**పాఠం - 6**

# గాంధీ యుగం - జాతీయోద్యమం

# (Gandhian Phase of the National Movement)

**విషయక్రమం :**


**6.1.ఎ)** గాంధీజీ అహింసా, సత్యాగ్రహ సిద్ధాంతాలు

- **1.0.** లక్ష్యం
- **1.1.** ఉపోద్ఘాతము
- **1.2.** సత్యాగ్రహ, అహింసా సిద్ధాంతాలు
- **1.3.** చంపరాన్ సత్యాగ్రహం
- **1.4.** అహ్మదాబాద్, కైరా సత్యాగ్రహం
- **1.5.** శాసనోల్లంఘన
- **1.6.** సాంఘిక, ఆర్థిక కార్యక్రమాలు
- **1.7.** ముగింపు

**6.1.బి)** సహాయ నిరాకరణోద్యమము

- **1.0.** లక్ష్యం
- **1.1.** ఉపోద్ఘాతము
- **1.2.** సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించడానికి కారణాలు
    - **1.2.1.** రౌటల్ చట్టము
    - **1.2.2.** రౌలట్ చట్ట వ్యతిరేక సత్యాగ్రహం
    - **1.2.3.** జలియన్ వాలాబాగ్ దురంతాలు
    - **1.2.4.** ఖిలాఫత్ ఉద్యమం
    - **1.2.5.** స్వరాజ్య సంపాదన
- **1.3.** సహాయ నిరాకరణోద్యమం
    - **1.3.1.** సహాయ నిరాకర కార్యక్రమం
    - **1.3.2.** ఉద్యమ దశలు
    - **1.3.3.** ఆంధ్రాలో సహాయ నిరాకరణోద్యమం

**1.3.3.1.** చీరాల - పేరాల సత్యాగ్రహం

**1.3.3.2.** పలనాడు సత్యాగ్రహం

**1.3.3.3.** పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమం

**1.3.4.** ఉత్తర ప్రదేశ్‌లో రైతుల పోరాటం

**1.3.5.** మోప్లా తిరుగుబాటు

**1.3.6.** చౌరీ చౌరా సంఘటన

**1.3.7.** వివిధ సామాజిక వర్గాల స్పందన

**1.3.8.** ఉద్యమ ప్రాముఖ్యం

**6.1.సి) శాసనోల్లంఘన ఉద్యమము (లేదా) ఉప్పు సత్యాగ్రహం**

**1.0.** లక్ష్యం

**1.1.** ఉపోద్ఘాతము

**1.2.** స్వరాజ్య పార్టీ స్థాపన

**1.3.** సైమన్ కమీషన్

**1.4.** నెహ్రూ నివేదిక

**1.5.** లాహోర్ కాంగ్రెస్ సామావేశం

**1.6.** శాసనోల్లంఘనోద్యమం

**1.6.1.** ఉప్పు సత్యాగ్రహం

**1.6.2.** ప్రభుత్వ అణచివేత విధానం

**1.6.3.** మొదటి రౌండ్ టేబుల్ సమావేశం

**1.6.4.** గాంధీ - ఇర్విన్ ఒప్పందము

**1.6.5.** రెండో రౌండ్ టేబుల్ సమావేశం

**1.6.6.** మూడో రౌండ్ టేబుల్ సమావేశం

**1.6.7.** శాసనోల్లంఘన - చివరి ఘట్టం

**1.6.8.** ప్రభుత్వ అణచివేత విధానం

**1.6.9.** ప్రాముఖ్యత

**6.1.డి) క్విట్ ఇండియా ఉద్యమం**

**1.0.** లక్ష్యం

**1.1.** ఉపోద్ఘాతము

1.2. **1935-39** మధ్య జాతీయోద్యమము

1.3. రెండో ప్రపంచ యుద్ధం - కాంగ్రెస్ ముస్లిం లీగ్‌ల స్పందన

1.4. ఆగస్ట్ ప్రకటన

1.5. వ్యక్తిగత సత్యాగ్రహం

1.6. క్రిఫ్స్ రాయబారం

1.7. క్విట్ ఇండియా తీర్మానం

1.8. క్విట్ ఇండియా ఉద్యమం

1.9. ఉద్యమ అణచివేత

1.10. ఉద్యమ ప్రాముఖ్యత

**6.1.ఇ) 1906-1947** మధ్య ముస్లిం లీగ్ కార్యక్రమాలు

1.0. లక్ష్యం

1.1. ఉపోద్ఘాతము

1.2. ముస్లిం లీగ్ ఏర్పాటు

1.3. పాకిస్థాన్ ఏర్పాటుకు ముస్లిం లీగ్ డిమాండ్

1.4. మహమ్మద్ ఆలీ జిన్నా

**6.2** నమూనా ప్రశ్నలు

**6.3** చదువదగిన గ్రంథాలు

# 6.1.ఎ) గాంధీజీ అహింసా, సత్యాగ్రహ సిద్ధాంతాలు

## 1.0 లక్ష్యం :

భారత స్వాంత్రోద్యమంలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించిన గాంధీజీ అహింసా సత్యాగ్రహాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 1.1. ఉపోద్ఘాతము :

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధజీకి విశిష్ట స్థానం ఉంది. 1869 అక్టోబర్ 2న సౌరాష్ట్రలోని పోర్‌బందర్ గ్రామంలో జన్మించిన మోహన్ దాస్ కరంచెంద్ గాంధీ 20వ శతాబ్ది ప్రపంచ నాయకులలో ఒకరు. చిన్న వయస్సులోనే వివాహమైన గాంధీ 19వ ఏట ఇంగ్లాండ్ వెళ్ళి న్యాయ శాస్త్రంలో బారిస్టర్ పట్టా పుచ్చుకొన్నాడు. కొంత కాలం న్యాయవాద వృత్తి చేపట్టినాడు. 1893 మే నెలలో పోర్‌బందర్‌లోని ఒక ముస్లిం కంపెని తరుపున వకీలుగా దక్షిణ ఆఫ్రికాలోని 'నేటాల్'కు వెళ్ళాడు. దక్షిణ ఆఫ్రికాలో నివశిస్తున్న భారతీయుల పట్ల చూపబడుతున్న రాజకీయ సాంఘిక విచక్షణ విధానాన్ని గమనించిన గాంధీ చాలా బాధపడినాడు. అనేక సందర్భాలలో స్వయంగా తానే అవమానాల పాలైనాడు. భారతీయులకు నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ అనే ఒక శాశ్వత రాజకీయ సంస్థను ఏర్పరిచాడు. నేటాల్ ప్రభుత్వం భారతీయులకు ఓటింగ్ హక్కు తీసివేస్తు చట్టం చేయడమేగాక భారతదేశం నుంచి వచ్చిన కార్మికులపై తలసరి వార్షిక పన్ను విధించింది. ఇట్టి అభ్యంతర కరమైన చట్టాలు, పనులు చేస్తున్నా గాంధీ బ్రిటిష్ పాలన పట్ల విధేయముగానే ఉండటమేగాక వారి పరిపాలన సముచితమైనదిగానే భావించాడు.

దక్షిణాఫ్రికా ప్రభుత్వం మరొక చట్టం చేసి ట్రాన్స్‌వాల్‌లోని భారతీయులు సుమారు 10వేల మంది తమ వేళ్ళ గుర్తులను ముద్రిస్తు ప్రభుత్వ రికార్డులలో రిజిష్టరు చేశారు. ఈ చట్టం అన్యాయమని భావించి గాంధీ ట్రాన్స్‌వాల్‌లో స్థిరపడిన స్వేత జాతీయులతో పోరాటం సాగించవలసి వచ్చింది. గాంధీ మొదటిసారిగా ఈ చట్టానికి విరుద్ధముగా ఒక నూతన రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించాడు. దీనినే సత్యాగ్రహం అని పిలుస్తారు. అన్యాయమైన ఈ నూతన చట్టానికి విరుద్దముగా పోరాటం సాగించాడు. భారతీయులను వేళ్ళ ముద్రలు ఇవ్వవద్దని రిజిష్టర్ చేయుంచుకోవద్దని అవసరమైతే జైలుకు వెళ్ళటానికి, చావటానికి కూడా సిద్ధం కావలెనని గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించి 150 మంది అనుచరులతో అరెస్టు అయినాడు. ప్రభుత్వం రాజీకి వచ్చింది. ట్రాన్స్‌వాల్ లోనికి భారతీయులను అనుమతించకుండా 1907 లో చేసిన శాసనానికి విరుద్దముగా గాంధీ ఇటువంటి సత్యాగ్రహ ఉద్యమాన్ని నడిపాడు. కొంతమంది అనుచరులతో చట్ట విరుద్దముగా ట్రాన్స్‌వాల్ సరిహద్దులలో ప్రవేశించి మరొకసారి జైలుకు వెళ్ళాడు. క్రైస్తవ పద్దతులలో వివాహలు జరగకుండా రిజిష్టరు కాని వివాహలు చెల్లనేరవని దక్షిణ ఆఫ్రికా కోర్టు తీర్పు నిచ్చింది. భారతీయుల వివాహాలను చట్టబద్దం చేస్తూ ప్రత్యేక శాసనం చేయవలసిందిగా గాంధీ ప్రభుత్వాన్ని అర్థించాడు. మహిళలతో సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించగా గాంధీ, ఆయన భార్య కస్తూరిబా నిర్బంధింపబడినారు. భారత జాతీయులకు సానుభూతిగా 'న్యూకాజిల్'లోని 6 వేల మంది గని కార్మికులు సమ్మె చేశారు. వారిని నివాస గృహాల నుండి బలవంతంగా తొలగించారు. ఐనా వారు లొంగలేదు. గాంధీ వారికి నాయకత్వము వహించాడు. 2000 మందితో సత్యాగ్రహం ప్రారంభించాడు. గాంధీని అరస్టు చేసి 9 నెలల కారాగార శిక్ష విధించారు. సమ్మె చేస్తున్న వారిని దారుణముగా కొరడాలతో కొట్టి హింసించారు. ఐనా వారు ధైర్యంగా అన్ని బాధలను సహించారు. ప్రభుత్వం చివరకు కాల్పులు సాగించింది. శ్వేత జాతీయుల నిరంకుశత్వాన్ని ప్రతిఘటిస్తూ భారత జాతీయులు ఒకటిగా నిలిచారు. దీనితో బ్రిటిష్ గవర్నర్ గాంధీని సంప్రదింపులకు ఆహ్వానించాడు. సుప్రీం కోర్టు తీర్పును రద్దు చేస్తూ ప్రభుత్వం శాసనం చేసింది. హిందూ ముస్లిం పారశీకుల వివాహాలను చట్టబద్దముగా అంగీకరించారు. 1920 నుండి భారతదేశం నుండి కార్మికులను కొనుగోలు పద్దతిలో తీసుకురావటాన్ని నిషేధింపబడింది. 1906లో మొదలైన సత్యాగ్రహ పోరాటం 1914లో జారీ చేయబడిన 'రిలీఫ్' చట్టంతో ముగిసింది. ఇది బ్రహ్మాండమైన విజయం. దక్షిణాఫ్రికాలోని భారతీయులకు గాంధీ ఏకైక నాయకుడైనాడు.

## 1.2. సత్యాగ్రహ అహింసా సిద్ధాంతాలు :

గాంధీ భారత రాజకీయ రంగంలో ప్రవేశించి ప్రజలను క్రొత్త మార్గంలో నడపటానికి పూనుకొన్నాడు. దక్షిణ ఆఫ్రికాలో తాను ప్రయోగించిన సత్యాగ్రహ ఆయుధాన్ని గాంధీ భారతదేశంలో కూడా ప్రయోగించ పూనుకున్నాడు. గాంధీ ఈ సత్యాగ్రహ సిద్ధాంతాన్ని దక్షిణ ఆఫ్రికాలో రూపకల్పన చేశాడు. అన్యాయానికి లొంగిపోవటం పిరికితనం, దానిని ఎదుర్కొనటమే ఆత్మగౌరవం. అన్యాయాన్ని ఎదుర్కొనటం అంటే దానికి కారణమైన ప్రభుత్వ శాసనాన్ని ఎదుర్కొనటం. శాసనాన్ని ధిక్కరించిన పక్షంలో శిక్షకు గురి అవుతాడు. కాని ఆ శిక్షను అనుభవించటానికి సిద్ధ పడటమే గౌరవం. గాంధీ తన ఊహలో మెదులుతున్న ఈ పద్ధతికి ఒక పేరు సూచించవలసిందిగా దక్షిణ ఆఫ్రికాలోని ప్రజలకు ఇండియన్ ఓపీనియన్ ద్వారా విజ్ఞప్తి చేశాడు. ఈ ప్రకటన చూసి మదన్‌లాల్ గాంధీ అనే ఆయన సదా గ్రహ అనే పదాన్ని సూచించగా గాంధీ దానిని సత్యాగ్రహ అని మార్చాడు. అహింసాయుతమైన పోరాటం గనుక సత్యాగ్రహ అనే పేరు బాగా అన్వయించింది. సత్యాగ్రహ అనగా సత్యాన్ని అంటి పెట్టుకొని ఉండటం అని అర్థం. ఈ సత్యాగ్రహ సూత్రం క్రొత్తది కాదు. గృహ జీవనంలో అవలంభిస్తున్న ఈ సూత్రం రాజకీయ జీవనానికి అన్వయించబడింది. కుటుంబ కలహాలు ప్రేమ వల్లనే పరిష్కరింపబడుతాయి. ప్రత్యర్థిని బాధపెట్టడం వల్ల సత్యాన్ని నిలబెట్టలేమని మనం బాధపడటానికి ఒప్పుకొన్నందు వలననే సత్య నిర్ధారణ జరుగుతుందని ఈ సిద్ధాంత తాత్పర్యము. సత్యాగ్రహి అజాత శత్రువు సత్యగ్రహి తన త్యాగము, ఆత్మార్పణ, ఆత్మ శక్తి వలన ప్రత్యర్థి హృదయాన్ని కరిగింప చేస్తాడు. దీనిలో రెండు వైపుల వారు అహింసాయుతముగా పోరాడవచ్చు. లేదా ఒక వైపు హింసాయుతముగా ఉన్నా సత్యాగ్రహులు అహింసాయుతంగా ఉండవచ్చు. సత్యాగ్రహులు ప్రతిపక్షం వారు హింస చేయటానికి వీలు లేని పరిస్థితులను కల్పిస్తారు. సత్యాగ్రహులు బాధలను సహిస్తారు. నష్టాలను అనుభవిస్తారు. కాని సత్యాగ్రహ సాధనలో ప్రతి క్రియ అనేది లేదు. "నీ కుడి చంపపై కొట్టిన వారికి నీ ఎడం చెంప కూడా ఇవు'' అనేది సత్యగ్రహ సిద్దాంత మూల సూత్రం. ప్రతి పక్షము వారు సత్యాగ్రహం సహనాన్ని నిశ్చలత్వాన్ని చూసి సిగ్గుపడి వారిని బాధించటం విరమించుకుని వారి కోర్కెలను తీరుస్తారు. సత్యాగ్రహ సిద్ధాంతం పూర్తిగా మానసిక ప్రవృత్తి పైనే ఆధారపడి ఉంది. ఈ సిద్ధాంతం స్త్రీలను బాగా ఆకర్షించింది. సహనం, ఓర్పు మొదలైన లక్షణాలు కలిగిన స్త్రీలకు ఇది ఆయుధమైయుంది. స్త్రీలు స్వాతంత్ర్య సమరంలో విరివిగా పాల్గొనటానికి వీలైంది. అహింస లేకుండా సత్యాన్వేషణ దుర్లబం. అహింసలను ఆచరణలోకి తెస్తే అన్ని చెడు లక్షణాలు కోపం, అహంకారం మొదలైవని నశిస్తాయి. ఆత్మనిగ్రహం అహింస పరమ ఉద్దేశ్యం. అహింస వలన మానవుడు ఎన్నడు అసహాయుడు కాడు అని గాంధీ అభిప్రాయ పడినాడు. అందువల్లనే గాంధీ స్వాతంత్ర్య సముపార్జనకు అహింసాయుత మార్గాన్ని ఎన్నుకొన్నాడు. ఈ అహింసా సిద్ధాంతం అనేక మంది రైతులను ఆకర్షించింది. భారత స్వాతంత్ర్య సమరం అహింసా స్వరూపము దాల్చినందువల్లనే స్త్రీలు కూడా అందులో పాల్గొనటానికి వీలైంది. గాంధీ శకములో నడచిన స్వాతంత్రియ ఉద్యమాన్ని అహింసా సమరం అని కూడా అంటారు.

1917 నుండి గాంధీ భారత రాజకీయాలలో చురుకుగా ప్రవేశించి స్థానికముగాను తరువాత జాతీయస్థాయిలో సత్యాగ్రహ ఉద్యమాలను ప్రారంభించాడు. గాంధీ స్థానికముగా నడిపిన సత్యాగ్రహాలు

1. బీహర్‌లో చంపరాన్ సత్యాగ్రహం (1917)
2. గుజరాత్‌లో కైరా సత్యాగ్రహం (1918)
3. గుజరాత్‌లో అహమదాబాద్ సత్యాగ్రహం (1918)

గాంధీ జాతీయ స్థాయిలో నడిపిన సత్యాగ్రహాలు

1. రౌలట్ చట్ట వ్యతిరేక సత్యాగ్రహం (1919)
2. సహాయ నిరాకరణ ఉద్యమం (1921-22)
3. ఉప్పు సత్యాగ్రహం (1930)

4. వ్యక్తిగత సత్యాగ్రహం (1940)

5. క్విట్ ఇండియా ఉద్యమం (1942)

పై ఉద్యమాలలో గాంధీ కేవలం అహింస, సత్యాలకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చాడు. జాతీయ ఉద్యమంలో అన్ని వర్గాలకు చెందినవారు పాల్గొనేటట్లు చేసి ఒక ప్రజా ఉద్యమముగా మార్చాడు. కాని క్విట్ ఇండియా ఉద్యమం ఎంతో హింసాయుతంగా జరిగింది. ఈ పాఠంలో గాంధీ స్థానికముగా నడిపిన సత్యాగ్రహాల గురించి పరిశీలిద్దాం !

## 1.3. చంపరాన్ సత్యాగ్రహం :

చంపరాన్ సత్యాగ్రహం గాంధీని ఒక జాతీయనాయకునిగా నిలబెట్టింది. బీహార్‌లో చంపరాన్ జిల్లా బాగా వెనుకబడింది. ఇక్కడ రైతులు ఎక్కువుగా నీలిమందు పండించే వారు. ఈ నీలి మందు తోటలు ఆంగ్లేయుల క్రింద ఉండేవి. వారు రైతులను పీడించేవారు రైతులు తమ భూములలో తప్పనిసరిగా 3/20 వంతులో నీలి మందు పండించి ఆంగ్లేయులు చెప్పిన ధరకు అమ్మాలి. ఇట్టి పరిస్థితులు బెంగాల్‌లో ఇంతకు ముందే ఉండగా రైతులు తిరుగుబాటు చేసి విముక్తులైయారు. ఈ విప్లవాన్ని 'నీలి విప్లవము'గా పిలుస్తారు. దక్షిణ ఆఫ్రికాలో గాంధీ సాధించిన విజయాల గూర్చి విన్న చంపరాన్ రైతులు తమకు సహయపడవలసిందిగా గాంధీని అర్థించారు. 1917 లో చంపరాన్ దర్శించిన గాంధీ భారతదేశంలోని రైతులు ఎటువంటి పేదరికాన్ని అనుభవిస్తున్నారో స్వయముగా చూచాడు. గాంధీ వెంట రాజేంద్ర ప్రసాద్, కృపాలుని మొదలగు వారు కూడా చంపరాన్ వెళ్ళారు. ఈ బృందం 'మోతీహరి' చేరు సరికి ఆ ప్రదేశం నుండి తక్షణమే వెళ్ళి పోవలసిందిగా ప్రభుత్వం ఆదేశాన్ని జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాన్ని గాంధీ ధిక్కరించి విచారించబడినాడు. తాను ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించింది వాస్తవమేనని అంగీకరించాడు. తనకు ప్రభుత్వ అధికారం పట్ల గౌరవం ఉన్నా అంతకు మించి మానవ న్యాయం పట్ల అంతః కరణ పిలుపు వల్ల ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించవలసి వచ్చిందని గాంధీ పలికాడు. గాంధీ వ్యక్తిత్వం అతను పలికిన మాటలు భారత రాజకీయ రంగములో నూతన మార్గానికి నాంది పలికాయి. వేలాది మంది ప్రజలు గాంధీని అనుసరించారు. ప్రభుత్వం గాంధీపై పెట్టిన కేసును రద్దు చేసి రైతుల ఇబ్బందులను పరిశీలించటానికి ఒక సంఘాన్ని నియమించింది. ఇది గాంధీ సత్యాగ్రహానికి బ్రహ్మాండమైన విజయం.

## 1.4. అహ్మదాబాద్, కైరా సత్యాగ్రహాలు :

గాంధీ తరువాత అహ్మదాబాద్‌లోని నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కంకణం కట్టుకొన్నాడు. గాంధీ ఆమరణ నిరాహారదీక్షకు పూనుకొనగా మిల్లు యజమానులు కార్మికుల జీతాలను 35% పెంచటానికి అంగీకరించారు. తరువాత గాంధీ గుజరాత్‌లోని కైరాను దర్శించారు. అచ్చట పంటలు కొన్ని సంవత్సరాలుగా పండలేదు. సాలుసరి దిగుబడి 25% నికి పడిపోయింది. భూమి శిస్తు నిలుపుదలకై గాంధీ ఉద్యమం ప్రారంభించాడు. మొదట భూమిశిస్తు రద్దుకు అంగీకరించని ప్రభుత్వం చివరకు సత్యాగ్రహ ఉద్యమ ప్రభావం వల్ల రైతుల కోరికలను మన్నించవలసి వచ్చింది. సత్యాగ్రహ పద్ధతులు భారత రాజకీయాలలో అద్భుతమైన విజయాలను సాధించటం ప్రారంభమైయింది.

## 1.5. శాసనోల్లంఘన :

తప్పుగా ప్రవర్తించే బ్రిటిష్ వారితో సహకరించకుండా సహాయ నిరాకరణ ప్రకటించడం నిజమైన పౌరుడి బాధ్యత అని గాంధీ భావించాడు. సహాయ నిరాకరణ సున్నితమైన ఉద్యమ ప్రక్రియగా గాంధీ భావించాడు. 1921-22 మధ్య కాలంలో గాంధీ సహాయ నిరాకరణను చేపట్టాడు. బ్రిటిష్ వారు ఇచ్చిన బిరుదులు దేశ భక్తులైన భారతీయులు తిరిగి బ్రిటిష్ వారికి ఇచ్చి వేయటం. ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను బహిష్కరించటం, న్యాయస్థానాలను, ప్రభుత్వ ఉద్యోగాలను బహిష్కరించటం, విదేశీ వస్తువులను బహిష్కరించటం మొదలైనవి అన్ని సహాయ నిరాకరణ క్రిందకు వస్తాయి. బ్రిటిష్ పాలనలో అనేక కష్టాలు అనుభవిస్తున్న ప్రజలను ఎందరినో ఇవి ఆకర్షించాయి. నియంతృత్వ ప్రభుత్వం రూపొందించిన అన్యాయమైన అక్రమమైన చట్టాలను ధిక్కరించటం అనేది పటిష్టమైన విస్తృతమైన రాజకీయ

ఉద్యమానికి దారితీస్తుందని గాంధీ విశ్వసించాడు. అతని అభిప్రాయంలో ఇది సాయుధ విప్లవం కన్నా కూడా ప్రమాదకరమైనది, శక్తివంతమైనది కాబట్టి దీనిని చివరి ఆయుధముగా ఎంచుకోవాలని ఆయన సూచించాడు. ఐతే ఇప్పటికే బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి లోనవటంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన ఆర్థిక సంక్షోభం కారణంగా దుర్భర దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున ప్రజలు తమ కష్టాలు తీర్చుకోవటానికి ఇదే సరైన మార్గమని భావించారు. అందుకే వారు ఉప్పు చట్టాలను ధిక్కరించటం, విదేశీ వస్త్రాల, మద్యం దుకాణాల ముందు పికెటింగ్‌లు చేయటం, హర్తాళ్‌లు, సమ్మెలు నిర్వహించటం మొదలైన కార్యక్రమాలలో ఉత్సాహముగా పాల్గొన్నారు.

## 1.6. సాంఘిక ఆర్థిక కార్యక్రమాలు :

గాంధీ సాంఘిక, ఆర్థిక కార్యక్రమాలలో ఖాదీ ఉద్యమం, గ్రామాల పునర్ నిర్మాణం, హిందూ ముస్లిం ఐక్యత, హరిజన సంక్షేమం మొదలైనవి ఉన్నాయి. మొదట గాంధీ చేపట్టిన ఖద్దర్ ఉద్యమం పారిశ్రామిక వ్యతిరేక విధానం. ముఖ్యముగా వలస పాలన పరిస్థితులలోని ఆధునీకరణ పారిశ్రామికీకరణ ప్రక్రియ వల్ల పెద్ద ఎత్తున నష్టపోయిన రైతులను చేతి వృత్తుల వారిని విశేషముగా ఆకర్షించాయి. గ్రామాల పునర్ నిర్మాణ కార్యక్రమం భారత జనాభాలో అధిక సంఖ్యాకులుగా ఉన్న గ్రామ ప్రజల మద్దత్తును సంపాదించి పెట్టింది. అస్పృశ్యుల పరిస్థితులను మెరుగు పరిచే లక్ష్యముతో వారిని ఊరు బావుల నుండి నీరు తోడుకోనివ్వటం, దేవాలయాలలోకి ప్రవేశం కల్పించటం, రోడ్లపై నడవనివ్వటం మొదలగు మానవతా దృక్పధముతో కూడిన హరిజన సంక్షేమ కార్యక్రమం సహజంగానే వారందరిని గాంధీకి దగ్గర చేసింది. ఈ విధముగా జాతీయ ఉద్యమ సందేశం గ్రామ ప్రాంతాలలోని అట్టడుగు వర్గాల వారికి అత్యంత పీడితులకు చేరటానికి ఈ ఉద్యమం పరోక్షముగా దోహదం చేసింది. దేశంలోని అనేక ప్రాంతాలలో హరిజనులు సాంప్రదాయక విశ్వాసం పెంచుకొన్నారు.

## 1.7. ముగింపు :

గాంధీ 1915లో దక్షిణ ఆఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చే వరకు కాంగ్రెస్ వర్గాలలో ఆయన ఎటువంటి ప్రముఖ పాత్రను వహించలేదు. అంతేగాక అంతకు ముందు గాంధీ అంటే ఎవరో ప్రజలకు తెలియదు. ఐతే ఆశ్చర్యకరముగా కేవలం 5 సంవత్సరాల వ్యవధిలో (1915 - 1920) గాంధీ కాంగ్రెస్‌కు సామాన్య ప్రజలకు తిరుగులేని నాయకుడిగా రూపొందాడు. అందుకు ప్రధాన కారణం దక్షిణ ఆఫ్రికాలో సత్యము, అహింస ఆయుధాలుగా నడిపిన 'సత్యాగ్రహం' అనే నూతన విధానం విజము సాధించడమే. అంతేగాక మితవాదులు, అతివాదులు అనుసరించిన విధానాలు, విప్లవ ఉగ్రవాదులు అనుసరించిన విధానాలు విఫలము కావటం అందుకు మరొక కారణం. వీటన్నింటికి తోడు గాంధీ వ్యక్తిత్వం, అతని నిరాడంబర జీవితం, అలవాట్లు భారత రాజకీయాలలో గాంధీని ప్రముఖ నాయకుడిగా తీర్చి దిద్దటానికి దోహదం చేశాయి.

# 6.1.బి) సహాయ నిరాకరణోద్యమము

## 1.0 లక్ష్యం :

గాంధీ నాయకత్వంలో సాగిన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని గురించి వివరించటం ఈ పాఠ్య భాగం లక్ష్యం

## 1.1. ఉపోద్ఘాతము :

గాంధీ రాజకీయ జీవితం దక్షిణాఫ్రికాలో ప్రారంభమైంది. దక్షిణాఫ్రికాలో భారతీయులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటిస్తూ సత్యాగ్రహం అనే ఆయుధాన్ని ప్రయోగించి అనేక ఉద్యమాలను నడిపి సఫలీకృతుడైనాడు. 1815లో గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చాడు. తన రాజకీయ గురువైన గోపాలకృష్ణ గోఖలే సలహా మేరకు వెంటనే భారత రాజకీయాలలో చురుకుగా ప్రవేశించలేదు. ఒక సంవత్సరం దేశమంతా తిరిగి పరిస్థితులను స్వయంగా అర్థం చేసుకున్నాడు. 1916లో గాంధీ అహ్మదాబాద్ దగ్గర సబర్మతీ ఆశ్రమాన్ని నిర్మించి దాన్ని కేంద్రంగా అనేక ఉద్యమాలు ప్రారంభించాడు. మొదట్లో గాంధీ స్థానికంగా ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించాడు. 1917 లో బీహార్‌లోని చంపరాన్‌లో, 1918లో గుజరాత్‌లోని కైరా జిల్లాలో అదే సంవత్సరం గుజరాత్‌లోని అహమదాబాద్‌లో సత్యాగ్రహాలను ప్రారంభించి గాంధీ విజయాలు సాధించాడు. 1919 నుంచి గాంధీ జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించి అహింసా, సత్యాగ్రహం ఆయుధాలుగా అనేక ఉద్యమాలు నిర్వహించాడు. గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ సంస్థ పటిష్టమైంది. గాంధీ కృషి ఫలితంగా దాదాపు అన్ని వర్గాలకు చెందినవారు జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. గాంధీ జాతీయ ప్రాతిపదికపై నిర్వహించిన మొదటి సత్యాగ్రహం రౌలట్ చట్ట వ్యతిరేక సత్యాగ్రహం.

## 1.2. సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభించటానికి కారణాలు

1920-1922 మధ్య జరిగిన స్వరాజ్యపోరాటానికి సహాయ నిరాకరణ ఉద్యమం అని పేరు. ఈ ఉద్యమం ప్రారంభించటానికి అనేక కారణాలు కలవు. అవి :

**1.2.1. రౌలట్ చట్టము :** 1919 మాంటేగు - చంస్‌ఫర్డ్ సంస్కరణలు భారతీయులలో తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. నిరాశాపరులైన భారతీయులు ఆందోళన ప్రారంభించారు. ప్రజలు తమ కోరికల సాధనకై ఎటువంటి కఠిన శిక్షనైనా అనుభవించటానికి సిద్ధపడ్డారు. హత్యలు, బాంబు ప్రయోగాలు సర్వసాధారణమయ్యాయి. ఈ పరిస్థితులలో బ్రిటిష్ ప్రభుత్వం ఆందోళన అణచి వేయటానికి ప్రయత్నించింది. ఈ సందర్భంలో ప్రభుత్వం 1919 మార్చిలో రౌలట్ చట్టం జారీ చేసింది. ఈ చట్టం విచారణ జరపకుండానే ఎవరినైనా శిక్షించే అధికారం అధికారులకు సంక్రమింపచేసింది. ఈ రౌలట్ చట్టం బ్రిటిష్ పౌర హక్కులకు మూలమైన హబిమాస్ కార్పస్ హక్కును భారతీయులకు లేకుండా చేసింది. ఈ చట్టాన్ని ప్రజానాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు.

**1.2.2. రౌలట్ చట్ట వ్యతిరేక సత్యాగ్రహం :** రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా భారతదేశంలో పెద్ద ఆందోళన ప్రారంభమైంది. ఈ ఆందోళనలోని గాంధీ జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. చట్టాన్ని ఉపసంహరించుకోమని చేసిన విన్నపాలను ప్రభుత్వం ఖాతరు చేయకపోవటంతో గాంధీ రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1919 ఏప్రియల్ 6వ తేదీని నిరసన దినంగా ప్రకటించాడు. గాంధీ ఆదేశానుసారం ఆ రోజు దేశం నలుమూలలా హర్తాళ్ జరిగింది. బహిరంగ సభలు, ప్రజా ఊరేగింపులు జరిగాయి. ఈ ఉద్యమంలో హిందువులు ముస్లింలు కలసి పాల్గొన్నారు.

**1.2.3. జలియన్ వాలాబాగ్ దురంతాలు :** పంజాబ్‌లోని అమృతసర్ పట్టణంలోని జలియన్ వాలాబాగ్‌లో జరిగిన అమానుష కృత్యం భారత ప్రజలను కలచివేసింది. రౌలట్ చట్ట వ్యతిరేక సత్యాగ్రహ ఉద్యమం పంజాబ్‌లో శాంతియుతంగానే జరిగింది. కానీ, 1919 ఏప్రియల్ 13న కాంగ్రెస్ నాయకులైన సత్యపాల్, కిచ్లూలను ప్రభుత్వం నిర్బంధించినందుకు నిరసనగా జలియన్ వాలాబాగ్‌లో బహిరంగ

సభ ఏర్పాటైంది. శాంతియుతంగా బహిరంగ సభలో పాల్గొన్న అమాయక ప్రజలపై జనరల్ డయ్యర్ అమానుషంగా కాల్పులు జరిపాడు. బాగ్ గోడలు కోటగోడలాగా ఉండి ఒకే మార్గం ఉండటం వల్ల ప్రజలు తప్పించుకొని పారిపోలేకపోయారు. 379 మంది అక్కడిక్కడే మరణించగా 1200 మంది తీవ్రంగా గాయపడ్డారు. నాటి నుండి జలియన్ వాలా బాగ్‌కు ఖూనీబాగ్ అనే పేరు వచ్చింది. జలియన్ వాలా బాగ్ విషాద సంఘటన భారతదేశంలోని ప్రజలందరినీ దిగ్భ్రాంతులను చేసింది. జరల్ డయ్యర్‌ను శిక్షించాలని దేశ ప్రజలంతా ఆందోళన చేశారు. చివరకు ప్రభుత్వం ప్రజలను శాంతింప చేయటానికి 1919లో లార్డ్ హంటర్ అధ్యక్షతన పంజాబ్ దురంతాలను విచారించటానికి ఒక సంఘాన్ని నియమించింది. ప్రభుత్వం జనరల్ డయ్యర్ మీద ఎటువంటి చర్య తీసుకొనలేదు. పంజాబ్ దురంతాలకు నిరసనగా గాంధీ సత్యాగ్రహ ఉద్యమం ప్రారంభింప నిశ్చయించాడు.

**1.2.4. ఖిలాఫత్ ఉద్యమం :** ఈ సమయంలోనే దేశంలో హిందువులను, ముస్లిములను ఐక్యం చేసే సంఘటన జరిగింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత మిత్రరాజ్యాల వారు టర్కీ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేశారు. అంతేగాక టర్కీ సుల్తాన్‌ను ఖలీఫాగా వ్యవహరించరాదని నిర్ణయించారు. దీని ఫలితంగా అంతర్జాతీయ ముస్లిం మతాధికార వ్యవస్థ రద్దైంది. ఈ చర్యకు ఇతర దేశాల ముస్లింలతో బాటు భారతదేశంలోని ముస్లింలు కూడా ఆందోళన ప్రారంభించారు. దీనినే ఖిలాఫత్ ఉద్యమం అని అంటారు. భారతదేశంలో ఆలీ సోదరులు మొదలగు ముస్లిం నాయకులు ఖిలాఫత్ కమిటీని ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా ఒక ఉద్యమాన్ని నిర్వహించటానికి నిర్ణయించారు. హిందువులు, ముస్లింలు ఐక్యం కావటానికి ఒక అవకాశంగా భావించి ఈ ఉద్యమం పట్ల గాంధీ సానుభూతి మద్దతు ప్రకటించాడు. ఖిలాపత్ ఉద్యమంలో భారతీయ ముస్లింల కోరికలు నెరవేర్చటానికి ఒక జాతీయసహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తానని గాంధీ ప్రకటించాడు. గాంధీ హిందూ ముస్లింల నాయకుడుగా గుర్తింపబడ్డాడు.

**1.2.5. స్వరాజ్య సంపాదన :** ఈ దురంతాలన్నింటికీ మూలకారణం పరాయి ప్రభుత్వం కాబట్టి స్వరాజ్యసంపాదన ఒక్కటే వాటికి పరిష్కారం. భావి కాలంలో ఇలాంటి అన్యాయాలు జరగకుండా జాతీయ గౌరం దృఢంగా నిలుపుకోవాలంటే స్వరాజ్య స్థాపన ఎంతో అవసరమని వేరే మార్గం లేదని గాంధీ ఉద్ఘాటించాడు.

## 1.3. సహాయ నిరాకరణ ఉద్యమం :

జలియన్ వాలా బాగ్ దురంతాలకు వ్యతిరేకంగా ఖిలాపత్ ఉద్యమానికి అనుకూలంగా స్వరాజ్య సాధన కొరకు గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఇది ఒక గొప్ప జాతీయ ప్రజా ఉద్యమం. 1920 సెప్టెంబర్ నెలలో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం గాంధీ ప్రతిపాదించిన సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని ఆమోదించింది. 1980 డిసెంబర్‌లో నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశం కూడా గాంధీ సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని ఆమోదించింది. ఈ నాగపూర్ సమావేశంలో కాంగ్రెస్ మొదటి సారిగా తన ధ్యేయం స్వరాజ్యమని ప్రకటించింది.

**1.3.1. సహాయ నిరాకరణ కార్యక్రమం :** గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమంలో రెండు భాగాలున్నాయి. అవి : బహిష్కరణ కార్యక్రమాలు, నిర్మాణాత్మక కార్యక్రమాలు, బహిష్కరణ కార్యక్రమాలలో ముఖ్యమైనవి - 1. ప్రభుత్వం ఇచ్చిన బిరుదులు, పదవులను త్యజించటం. 2. ప్రభుత్వం ఏర్పాటు చేసే సన్మానాలను, తదితర కార్యక్రమాలను బహిష్కరించటం 3. విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాలను బహిష్కరించటం 4. ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేయటం. 5. ప్రభుత్వ న్యాయస్థానాలను బహిష్కరించటం. 6. విదేశీ వస్త్రాలను, వస్తువులను బహిష్కరించటం 7. శాసనసభ ఎన్నికలను బహిష్కరించటం, 8. 1921లో ఇంగ్లండ్ దేశపు యువరాజు పర్యటన బహిష్కరించటం. నిర్మాణాత్మక కార్యక్రమాలలో ముఖ్యమైనవి - 1. తిలక్ స్మారక నిధికి విరాళాలు వసూలు చేయటం. 2. రాట్నాలపై నూలు ఒడికి ఖద్దరు వస్త్రాలు తయారు చేయటం. 3. అస్పృశ్యతను నిర్మూలించటం 4. మద్యపాన నిషేధానికి అనుకూలంగా ఉద్యమం నడపడం. 5. జాతీయ విద్యాలయాలు నెలకొల్పటం 6. హిందూ ముస్లిం సమైక్యతను సాధించటం.

**1.3.2. ఉద్యమ దశలు :** కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమంలో 4 దశలు కలవు. మొదటి దశలో (1921 జనవరి నుండి మార్చి వరకు) విద్యార్థులు పాఠశాలలను, కళాశాలలను వదిలిపెట్టడం పై, న్యాయవాదులు కోర్టులను బహిష్కరించటంపైన ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించారు. చరఖా కార్యక్రమం మేధావి వర్గాన్ని కూడా బాగా ఆకర్షించింది. విద్యార్థులు విద్యావంతులైన పట్టణ ప్రజలు కూడా స్వచ్ఛందంగా నూలు ఒడికే కార్యక్రమం పట్ల ఆసక్తి చూపారు. గ్రామీణ ప్రజలతో కలసిపోవటానికి స్వదేశీకి దగ్గర దారిగా వారు చరఖా కార్యక్రమాన్ని భావించారు. కలకత్తా, లాహోర్‌లలో పెద్ద ఎత్తున విద్యార్థులు జరిపిన సమ్మెలతోనూ సి. ఆర్. దాస్, మోతీలాల్ నెహ్రూ లాంటి గొప్ప న్యాయవాదులు తమ వృత్తిని విడిచిపెట్టి ఉద్యమంలో పాల్గొనటంలో అద్భుతంగా ప్రారంభమైన ఈ ఉద్యమం త్వరలోనే క్షీణ దశ చిహ్నాలను చూపటం ప్రారంభించింది.

రెండో దశ (1921 ఏప్రియల్ నుంచి జూన్ వరకు)లో దేశం ఇంకా శాసన ఉల్లంఘనకు అవసరమైన క్రమశిక్షణను సంఘటిత శక్తిని అలవరచుకోవాలని విజయవాడలో జరిగిన సమావేశంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అభిప్రాయపడింది. అందుకే తిలక్ స్వరాజ్య నిధి కింద కోటి రూపాయిల మేరకు నిధులు వసూలు చేయాలని కాంగ్రెస్ సభ్యుల నమోదును కోటికి చేర్చాలని జూన్ చివరకు 20 లక్షల చరఖాలను నెలకొల్పాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్నది.

మూడవ దశలో (1921 జూలై నుండి నవంబర్ వరకు) కొంత మేరకు విప్లవ కార్యక్రమాలు చేపట్టాలని బొంబాయిలో జరిగిన A.I.C.C. సమావేశం నిర్ణయించింది. దీని కింద విదేశీ వస్తు బహిష్కరణ, ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాకను బహిష్కరించుట మొదలైన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించటమైంది. అయితే పన్నులు చెల్లించటానికి నిరాకరించటం ద్వారా పూర్తి స్థాయి సహాయ నిరాకరణను ప్రారంభించటాన్ని వాయిదా వేశారు. స్వచ్ఛందంగా జైళ్లను నింపటానికి ముందుకు రావలసిందిగా గాంధీ కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చాడు. స్వచ్ఛంద దళాల నిర్మాణానికి కూడా ప్రాధాన్యం ఇవ్వటం జరిగింది. స్వచ్ఛంద దళాల ఏర్పాటు, పికెటింగ్, జైళ్ళను స్వచ్ఛందంగా నింపడం మొదలగు కార్యక్రమాల ద్వారా సామాన్య ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేయటానికి జరుగుతున్న ప్రయత్నాన్ని వైశ్రాయి రీడింగ్ త్వరలోనే గ్రహించాడు. గాంధీ మేధావుల నుంచి తన దృష్టిని సామాన్యుల వైపుకు మళ్ళించటం వారిలో చైతన్యాన్ని తీసుకురావటంతో మారిన పరిస్థితిని రీడింగ్ చక్కగా అంచనా వేశాడు. అయితే దీనివల్ల బ్రిటిష్ వారికి ఒక ప్రయోజనం కలిగింది. మేధావులు, సంపన్న వర్గాల వారిని బ్రిటిష్ వారు తమ వైపు తిప్పుకోగలిగారు. నవంబర్ 17న 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' భారతదేశానికి వచ్చినప్పుడు దేశ వ్యాప్తంగా హర్తాళ్‌లు నిర్వహించటంలో కాంగ్రెస్ విజయం సాధించింది. బొంబాయిలో హింసాత్మక సంఘటనలు జరగటంతో హింసను ఖండిస్తూ, గాంధీ శాసన ఉల్లంఘన కార్యక్రమాన్ని వాయిదా వేశాడు.

4వ దశలో (1921 నవంబర్ నుండి 1922 ఫిబ్రవరి వరకు) ప్రభుత్వాన్ని ఉద్యమం దాదాపు తమ కాళ్ళ వద్ద తెచ్చుకోగలిగింది. సైన్యం నుంచి పదవీ విరమణ చేయవలసిందిగా ఖిలాఫత్ సమావేశంలో పిలుపు ఇచ్చారనే కారణంతో బ్రిటిష్ ప్రభుత్వం ఆలీ సోదరులను నిర్బంధించింది. దీనితో ఆగ్రహించిన ఖిలాఫత్ నాయకులు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేస్తూ అహింసకు స్వస్తి చెప్పారు. దీనితో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున తిరుగుబాటు చెలరేగే సూచనలు కన్పించాయి. గాంధీ చివరకు వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వాతంత్రం, సంఘాలు నెలకొల్పుకునే స్వాతంత్రం కోరుతూ 1922 ఫిబ్రవరిలో భార్డోలీలో భూమి శిస్తు చెల్లింపు నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించాడు. అయితే చౌరీ చౌరా సంఘటనతో నిలుపు చేశాడు.

**1.3.3. ఆంధ్రలో సహాయ నిరాకరణ ఉద్యమం :** ఆంధ్రలో సహాయ నిరాకరణ ఉద్యమ సందర్భంలో కొన్ని ముఖ్య సంఘటనలు జరిగాయి. అవి :

**1.3.3.1. చీరాల - పేరాల సత్యాగ్రహం :** గుంటూరు జిల్లాలో చీరాల - పేరాల అను 2 గ్రామాలు కలవు. ఇచటి ప్రజలలో ఎక్కువ మంది చేనేతవారు. వారు బడుగు వర్గానికి చెందినవారు. 1919 లో మద్రాస్ ప్రభుత్వం చీరాల - పేరాల గ్రామాలు కలిపి ఒక పురపాలక సంఘంగా ఏర్పరచింది. దీని వల్ల ఆ గ్రామాల ప్రజలు 30వేలకు బదులు 4 లక్షల రూపాయిలు పన్నులుగా చెల్లించవలసి వచ్చింది. పురపాలక సంఘాన్ని రద్దు చేయవలసిందిగా ప్రజలు చేసిన విజ్ఞప్తులను ప్రభుత్వం నిరాకరించింది. పురపాలక సంఘ బహిష్కరణకు ప్రజలు సంసిద్ధులైనారు. ఎడింబర్గ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య నేర్చి ఉపన్యాసకునిగా తన పదవికి రాజీనామా చేసిన దుగ్గిరాల

గోపాలకృష్ణయ్య ఆంధ్ర విద్యాగోష్టి అనే సంస్థను స్థాపించాడు. ఇతడు పురపాలక సంఘ బహిష్కరణ ఉద్యమానికి నాయకత్వం వహించి పన్నులు చెల్లించవద్దని ప్రజలను కోరినాడు. పన్నుల నిరాకరణ ఉద్యమం విజయవంతమైంది. ప్రభుత్వం దమన చర్యకు పాల్పడింది. విజయవాడ కాంగ్రెస్ సమావేశానికి విచ్చేసిన గాంధీని గోపాలకృష్ణయ్య కలిశాడు. వారి సలహానుసరించి చీరాల - పేరాల ప్రజలు పురపాలక సంఘ సరిహద్దులు దాటి నివాసం ఏర్పరచుకున్నారు. వారిపై పురపాలక సంఘానికి ఎటువంటి అధికారం ఉండదు. కానీ, కొత్త ప్రదేశంలో ప్రజలు నానా ఇబ్బందులకు గురైనారు. వారి ఉద్యమం కొనసాగింపుకు కావలసిన నిధులు లభ్యం కాలేదు. చివరకు గత్యంతరం లేక ప్రజలు తిరిగి చీరాల - పేరాలలోని తమ స్వగృహాలకు తరలి వెళ్ళారు.

**1.3.3.2. పలనాడు సత్యాగ్రహం :** గుంటూరు జిల్లా పలనాడులో నివసించే ప్రజలు పేదవారు. వీరు అడవులలో పశువులు మేపుకొని జీవించేవారు. అటవీశాఖ అధికారులు వారిని నానా బాధలు పెట్టేవారు. సహాయ నిరాకరణ ఉద్యమం ప్రభావంతో పలనాడు ప్రజలు అటవీ శాఖ నిబంధనలను ఉల్లంఘింప నిశ్చయించారు. అటవీ శాఖ అధికారులను సాంఘిక వెలికి గురి చేశారు. ప్రభుత్వం అటవీ శాఖ నిబంధనలను కఠినంగా అమలు పరచటానికి నిశ్చయించింది. 1921 సెప్టెంబర్‌లో అధికారులు ఒక గ్రామంపై దాడిచేసి 3రకాల పశువులను పట్టుకొన్నారు. అధికారులు పశువులతో వెళ్ళుతుండగా కన్నెగంటి హనుమంతు నాయకత్వంలో కొన్ని వందల మంది స్త్రీలు, పురుషులు అధికారులపై దాడి చేశారు. పోలీసులు కాల్పులు జరపగా హనుమంతు, మరికొందరు మరణించారు. ప్రభుత్వం దమన చర్యలు కొనసాగించింది. ఇంతలో సహాయ నిరాకరణ ఉద్యమం నిలుపు చేయబడింది. దీనితో పలనాడు ప్రజల అటవీ సత్యాగ్రహం అర్థాంతరంగా ముగిసింది.

**1.3.3.3. పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం : 1922** జనవరిలో సమావేశమైన ఆంధ్ర కాంగ్రెస్ సంఘం శాసన ఉల్లంఘన ఉద్యమంలో భాగంగా పన్నుల నిరాకరణ ఉద్యమ నిర్వహణను ఆమోదిస్తూ తీర్మానించింది. పని ఎక్కువ, జీతం తక్కువగా ఉన్న గ్రామాధికారులు ఈ తీర్మానాన్ని హర్షించారు. గ్రామాధికారి ఉపకరణము దళారుల ఉద్యోగాలను తీసివేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తరువులకు నిరసనగా పెదనందిపాడు తాలుకా గ్రామాధికారులు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. భూమి శిస్తు వసూలు స్థంబించి పోయింది. ఈ ఉద్యమానికి పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వం వహించాడు. పన్నులు చెల్లించకుండా గ్రామస్థులు ఉద్యమానికి మద్దతు పలికారు. అధికారులను సాంఘిక వెలి వేశారు. ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దింపింది. అయినా రైతులు పన్నులు చెల్లింపుకు నిరాకరించారు. దురదృష్టవశాత్తు ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వటంలో జాతీయ కాంగ్రెస్‌లో విభేదాలు పొడ చూపాయి. క్రమంగా ఉద్యమం ఉధృతం తగ్గి క్షీణించిపోయింది.

**1.3.4. ఉత్తర ప్రదేశ్‌లో రైతుల పోరాటం : 1921**లో ఉత్తర ప్రదేశ్‌లోని రామ్ బరేలీ, ఫైజాభార్ జిల్లాలలో రైతులు భూ స్వాములకు వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభించారు. వీరు సహాయ నిరాకరణ ఉద్యమం చేత ప్రభావితులైనారు. అందువల్ల న్యాయాధికారులు రైతులకు అనేక రకాల శిక్షలు విధించారు. ఈ తిరుగుబాటు అనేక గ్రామాలకు వ్యాపించింది. 10వేల మంది రైతులు మున్షీగంజ్‌లోని జైలుపై దాడి చేశారు. వారిని చెదరగొట్టటానికి కాల్పులు జరిగాయి. రచర్వాన్‌లో జరిగిన మరో రైతు తిరుగుబాటులో పెక్కు మంది పోలీసులు మరణించారు. ప్రజా నాయకులు ప్రభుత్వ అధికారులను ధిక్కరించి పన్నులు చెల్లించవద్దని, అలా చేస్తే స్వరాజ్యం త్వరంలో సిద్ధించగలదని ప్రచారము చేశారు.

**1.3.5. మోప్లా తిరుగుబాటు :** అరబ్ జాతి నుండి వచ్చిన మోప్లా ముస్లింలు పేదవారు. మలబార్ కోస్తా ప్రాంతంలో సుమారు 10 లక్షల మంది మోప్లా ముస్లింలు స్థిరపడి భారతీయ స్త్రీలను వివాహమాడినారు. వీరు హిందువులతో కలసి జీవించేవారు. ఆంగ్ల పాలనకు వ్యతిరేకంగా వీరు చేసిన తిరుగుబాట్లలో ముఖ్యమైనది 1921 లో జరిగింది. ఖిలాఫత్ ఉద్యమానికి అనుబంధంగా అనుకూలముగా జరిగిన తిరుగుబాటులో మోప్లాలు పాల్గొన్నారు. వీరు భూస్వాములు విధిస్తున్న అన్యాయపు పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమం లేవ తీశారు. ఖిలాఫత్ నాయకుల ప్రసంగాలు వీరిని రెచ్చగొట్టాయి. వీరు ఆయుధాలు సమీకరించుకొని తిరుగుబాటు చేశారు. వీరు అనేక పోలీస్‌స్టేషన్లపై దాడి చేశారు. అనేక మంది యూరోపియన్‌లను హత్య చేశారు. రైల్వే లైన్లను, తంతి తీగలను ధ్వంసం చేశారు. వీరు స్వరాజ్యాన్ని ప్రకటించి దానిని ఖిలాఫత్ రాజ్యంగా వ్యవహరించారు. ప్రభుత్వం మలబారుకు సైన్యాన్ని తరలించింది. తిరుగుబాటుదారులు కొండలకు పారిపోయారు. తిరుగుబాటు అణచివేయబడింది. ఈ తిరుగుబాటులో 3 వేలమంది మోప్లాలతో బాటు అనేకమంది సైనికులు మరణించారు.

**1.3.6. చౌరీ చౌరా సంఘటన, ఉద్యమం నిలుపుదల :** ఉత్తర ప్రదేశ్‌లోని గోరక్‌పూర్ జిల్లాలో గల ఒక గ్రామం చౌరీ చౌరా. **1922** ఫిబ్రవరి **5**న సుమారు **30**వేలమంది రైతుల ఒక పెద్ద ఊరేగింపు చేశారు. వారిపై పోలీసులు అకారణంగా కాల్పులు జరిపారు. వారి దగ్గర మందుగుండు సామాగ్రి అయిపోగానే ఉద్రిక్తులైన ప్రజలు పోలీస్ ఠానాపై దాడిచేసి నిప్పుపెట్టి పోలీసులను ఆ మంటల్లో వేశారు. **22** మంది పోలీసులు సజీవదహనం పొందారు. ఈ సంఘటన వల్ల తీవ్ర ఆవేదన పొందిన గాంధీ కార్యకర్తలు ఇంకా అహింసా పద్దతులలో శిక్షణ పొందలేదని అందువల్ల శాసన ఉల్లంఘన ఉద్యమం విజయం సాధించలేదని భావించారు. బల ప్రయోగం ద్వారా ప్రభుత్వం ఎట్టి హింసాయుత ఉద్యమాన్ని అయినా అణచివేయగలదని గాంధీ అభిప్రాయపడ్డారు. బార్డోలీలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాసన ఉల్లంఘనకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను రద్దు చేసింది. కాంగ్రెస్ కార్యకర్తలు క్రియా శీల రాజకీయాలలో శ్రద్ద చూపాలని సలహా ఇచ్చింది. గాంధీ నిర్ణయాన్ని యువ నాయకులు నిరసించారు. ప్రజా చైతన్యం పరాకాష్టకు చేరుకున్న సమయంలో వెనుదిరిగి ఉద్యమాన్ని నిలుపు చేయటం జాతీయ విపత్తు అని సుభాష్ చంద్రబోస్ వ్యాఖ్యానించాడు. ఒక చోట జరిగిన తప్పుకు దేశాన్ని యావత్తు గాంధీ శిక్షించాడని నెహ్రూ అభిప్రాయపడినాడు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని ప్రభుత్వం గాంధీని అరెస్టు చేసి విచారించి **6** సంవత్సరాల కారాగార శిక్ష విధించింది.

**1.3.7. వివిధ సామాజిక వర్గాల స్పందన :** సహాయ నిరాకరణ ఉద్యమానికి వివిధ సామాజిక వర్గాల నుంచి లభించిన స్పందన భిన్నంగా ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఫలితంగా విద్యా పరమైన బహిష్కరణ కార్యక్రమం దేశమంతటా అమలు జరిగింది. పెద్ద సంఖ్యలో జాతీయ పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పటం జరిగింది. అయితే వీటిలో అనేకం అతి త్వరలోనే మూతపడ్డాయి. స్వరాజ్యం సంవత్సరంలోగా రాకపోవటంతో అందరూ తిరిగి ప్రభుత్వ కళాశాలలు, డిగ్రీలవైపు ఆసక్తి చూపడం ప్రారంభించారు. దేశంలో అనేక ప్రజా న్యాయస్థానాలు నెలకొల్పబడినవి. మద్యపాన నిషేధ కార్యక్రమం కొంత వరకు విజయవంతమైంది. చేనేత వస్త్రాల ఉత్పత్తి పెరిగింది. హిందూ ముస్లిం ఐక్యతను ఈ ఉద్యమం సాధించగలిగింది. కార్మికులు ఈ కాలంలో అనేక కష్టాలకు గురైనారు. కార్మికులు ఆర్థిక కారణాల వల్ల సమ్మెలు జరిపారు. ఉన్నత, మధ్యతరగతి వర్గాల వారు ఈ ఉద్యమంపట్ల అంతగా స్పందించలేదు. అయితే వర్తకులు పెద్ద సంఖ్యలో ఉద్యమంలో పాల్గొన్నారు. విదేశీ వస్త్రాల దిగుమతి పడిపోయింది. వర్తకుల మద్దతు కాంగ్రెస్‌ను ఆర్థిక చిక్కుల్లో నుంచి బయట పడవేసింది. అయితే పెద్ద పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు మాత్రం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగానే ఉండిపోయారు.

**1.3.8. ఉద్యమ ప్రాముఖ్యం :** సహాయ నిరాకరణ ఉద్యమం ఒక విధంగా విఫలమైందని చెప్పవచ్చు. ఖిలాఫత్ సమస్య, పంజాబ్ దురంతాలు, స్వరాజ్యం అను **3** కారణాల వల్ల ఈ ఉద్యమం ప్రారంభమైంది. కానీ అవి సమస్యలుగానే ఉండిపోయింది. ఆంగ్లేయులు ఎప్పటివలె నిరంకుశంగా పాలించటానికి వీలైంది. ఉద్యమకారులు పడిన కష్టాలు, చేసిన త్యాగాలు వ్యర్థమైందనే చెప్పాలి. కానీ, ఉద్యమం పూర్తిగా విఫలమైందని చెప్పటం సరికాదు. ప్రజలు తలపెట్టిన **3** ఆశయాలలో ముఖ్యమైంది స్వరాజ్యము. ఈ ఉద్యమం ద్వారా ప్రజలు స్వరాజ్యం తమ జన్మహక్కు అని గుర్తించి దాని కోసం తాము ఎటువంటి తాగ్యమైనా చేయటానికి తయారుగా ఉన్నట్లు స్పష్టమైంది. ప్రజలకు పరాయి ప్రభుత్వం పట్ల అసహ్యం కలగటమేగాక పోలీసులన్నా, జైలు శిక్షలన్నా భయం పూర్తిగా పోయింది. తత్ఫలితంగా ఉద్యమము ఆగిపోయిందేగాని అంతము కాలేదు. కాల క్రమాన తమ ఆశయాలు ఫలప్రదం కావటానికి కావలసిన పునాదులు ఏర్పచటానికి ఉద్యమం సహాయపడిందని చెప్పవచ్చు. అందుకే ఈ ఉద్యమం పూర్తిగా విఫలమైందని చెప్పటానికి వీలులేదు.

దేశ స్వాతంత్ర పోరాట చరిత్రలో సహాయ నిరాకరణ ఉద్యమం ఒక మహా ఉద్యమం. దేశ వ్యాప్తంగా సమాజంలోని అన్ని వర్గాల వారూ ఉత్సాహంతో పాల్గొన్న సామాన్య ప్రజల ఉద్యమం ఇది. ఈ ఉద్యమం వల్ల స్వరాజ్యం రాకపోయినప్పటికీ దేశమంతటా సామాన్య ప్రజలలో కూడా సామ్రాజ్య కాంక్ష పెరిగి రాజకీయ చైతన్యం అధికమైంది.

# 6.1.సి) శాసనోల్లంఘన ఉద్యమం లేదా ఉప్పుసత్యాగ్రహం

## 1.0 లక్ష్యం :

1930 లో ప్రారంభమైన శాసన్లోంఘన ఉద్యమం లేదా ఉప్పు సత్యాగ్రహం భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ముఖ్యమైన ఘట్టం. మహాత్మాగాంధీ నాయకత్వంలో జరిగిన ఈ ఉద్యమాన్ని గురించి వివరింటమే ఈ పాఠం లక్ష్యం.

## 1.1. ఉపోద్ఘాతము :

సహాయ నిరాకరణ ఉపసంహరణ దేశ ప్రజలకు నిస్ప్రుహ కల్గించింది. కొంత మంది కాంగ్రెస్‌నాయకులు శాసనసభలలో ప్రవేశించి శాసనసభల ద్వారా స్వరాజ్య లక్ష్యాన్ని సాధించాలని ప్రతిపాదించారు. వారికి నాయకుడు చిత్తరంజన్ దాస్. ప్రజా ఉద్యమం లేని సమయంలో శాసనసభల బహిష్కరణ వల్ల లాభం కంటే నష్టం ఎక్కువ జరగగలదని వారు భావించారు. శాసనసభలలో ప్రవేశించి అవి పని చేయకుండా అవరోధాలు కల్పించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని వారు వాదించారు. వారిని మార్పుకోరేవారు అన్నారు. చిత్తరంజన్‌తో బాటు వారిలో మోతీలాల్ నెహ్రూ, విఠల్ బాయ్ పటేల్, శ్రీనివాస అయ్యంగారు ఉన్నారు. కానీ, శాసనసభల ప్రవేశానికి చాలా మంది కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించారు. రాజేంద్రప్రసాద్, వల్లభాయ్ పటేల్, రాజగోపాలాచారి, అన్‌సారి మొదలగువారు శాసనసభల ప్రవేశం వల్ల ఏ మాత్రం లాభం ఉండదని వాదించారు. వారిని మార్పుకోరని వారు అన్నారు. ఎన్నికల వల్ల జాతీయ వాదుల్లో విభేదాలు ఏర్పడతాయని శాసనసభలు నాయకుల ప్రజల దృష్టిని స్వరాజ్య లక్ష్యం నుంచి మళ్ళిస్తాయని విమర్శించారు. అందువల్ల నిర్మాణ కార్యక్రమాల పట్ల కూడా శ్రద్ధ తగ్గగలదని వారి విమర్శ.

## 1.2. స్వరాజ్య పార్టీ స్థాపన :

సహాయ నిరాకరణ ఉద్యమ వైఫల్యం కాంగ్రెస్‌లో మరొక విభజనకు దారి తీసింది. 1922 డిసెంబర్‌లో గయలో జరిగిన వార్షిక సమావేశంలో సమావేశ అధ్యక్షుడైన చిత్తరంజన్‌దాస్ ప్రవేశపెట్టిన శాసనసభల ప్రవేశ తీర్మానం వీగిపోయింది. అందువల్ల చిత్తరంజన్ దాస్ 1922 డిశెంబర్ 31న స్వరాజ్య పార్టీని నెలకొల్పాడు. చిత్త రంజన్ దాస్ తనను అధ్యక్షునిగా మోతీలాల్ నెహ్రూను కార్యదర్శిగా ప్రకటించాడు. స్వరాజ్ పార్టీ కాంగ్రెస్‌కు పోటీ సంస్థ కాదని, అందులో భాగమేనని చిత్తరంజన్ దాస్ వివరించాడు. 1923 నవంబర్‌లో జరిగిన ఎన్నికలలో స్వరాజ్ పార్టీ ఘన విజయాలు సాధించింది. కేంద్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో స్వరాజ్ 101 సీట్లలో 42 స్థానాలలో విజయం సాధించింది. ఇతర భారతీయ సభ్యుల సహకారంతో శాసనసభలలో అనేక సార్లు ప్రభుత్వ ఓటమికి కారణమైంది. 1925లో స్వరాజ్ పార్టీ అభ్యర్థి విఠల్‌భాయ్ పటేల్ కేంద్ర శాసనసభ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. కానీ, స్వరాజ్ పోర్టీ విదేశీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను మార్చలేకపోయింది. 1925 జూన్‌లో చిత్తరంజన్ దాస్ మరణంతో స్వరాజ్ పార్టీ అంతరించింది. స్వజార్ పార్టీవారు దేశానికి చేసిన సేవ చెప్పుకోదగింది. సహాయ నిరాకరణ ఉద్యమం హఠాత్తుగా నిలిపి వేసిన సమయంలో ఈ పార్టీ వారు కొత్త విధానాలతో ప్రజలను ఉత్తేజ పరచటానికి ప్రయత్నించారు. భారతదేశంలో రాజ్యాంగ సంస్కరణల గూర్చి పరిశీలించటానికి 1927లో బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన సైమన్ కమీషన్ వీరి కృషి ఫలితమే.

## 1.3. సైమన్ కమీషన్ :

1927 లో బ్రిటిష్ ప్రభుత్వం మాంటేగ్ చంస్‌ఫర్డ్ సంస్కరణలు ఎట్లా పనిచేస్తున్నాయో, భారతీయులు స్వాతంత్రానికి ఎంత వరకూ అర్హులో పరిశీలించటానికి సర్‌జాన్ సైమన్ అనే ఆంగ్లేయుని అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘంలో ఉన్న 7 సభ్యులు ఆంగ్లేయులు కావటం వల్ల ఒక్క భారతీయుడూ అందులో లేనందు వలన నిష్పక్షపాతంగా పరిశీలన జరగదని భావించిన అన్ని పార్టీలకు చెందిన భారతీయులు సైమన్ సంఘాన్ని బహిష్కరించాలని తీర్మానించారు. సైమన్ కమీషన్ 1928 ఫిబ్రవరి 3న బొంబాయి వచ్చింది. ఈ సంఘం వెళ్ళిన అన్ని ప్రదేశాలలో హర్తాళ్ జరిగింది. సైమన్ వెనక్కి వెళ్లిపో అనే నినాదం ప్రతిచోటా వినిపించింది. మద్రాస్‌లో

టంగుటూరి ప్రకాశం పంతులు, లాహోర్‌లో లాలాలజపతిరాయ్, ఉత్తరప్రదేశ్‌లో జవహర్ లాల్ నెహ్రూ సైమన్ కమీషన్ బహిష్కరణ ఉద్యమాలకు నాయకత్వం వహించినారు. లాహోర్‌లో సాండర్స్ అనే పోలీస్ ఉద్యోగి లాలా లజపతిరాయ్‌ని బాదగా తీవ్రమైన గాయాలు తగిలి 1928 నవంబర్ 17న మరణించాడు. భగత్ సింగ్,రాజగురులు సాండర్స్‌ను కాల్చి చంపారు. మద్రాస్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు ఆధ్వర్యంలో సైమన్ వ్యతిరేక ఉద్యమం జరిగింది. ప్రదర్శనను అణచటానికి జరిగిన కాల్పులలో ఒకరు మరణించారు. అతనిని చూడటానికి ముందుకు దూసుకు వెళుతున్న ప్రకాశం పంతుల్ని సాయుధ పోలీస్‌లు అడ్డుకున్నారు. ప్రకాశం అతనికి తన ఛాతీ చూపించి ధైర్యముంటే కాల్చమని అన్నాడు. ప్రకాశం ధైర్యానికి నివ్వెర పోయిన పోలీసు వెనక్కు తప్పుకున్నాడు. ఈ సంఘటన తరువాత ప్రకాశం పంతుల్ని 'ఆంధ్ర కేసరి'గా కొనియాడారు.

## 1.4. నెహ్రూ నివేదిక :

భారతదేశానికి సైమన్ కమీషన్ రాక ఒక నూతన రాజ్యాంగ రూపకల్పనకు దారి తీసింది. నాటి భారత వ్యవహారాల మంత్రి బర్కెన్ హెడ్ భారతదేశంలోని అన్ని రాజకీయ వర్గాలకూ ఆమోద యోగ్యమైన భావి భారత రాజ్యాంగాన్ని భారతీయ మేధావులు రూపొందించినట్లైతే భారతదేశానికి వెంటనే స్వాతంత్ర మిస్తామని బి.బి.సి. రేడియోలో ఒక ప్రకటన చేశాడు. దానికి జవాబుగా భారత నాయకులు దేశీయులకు అందరికీ ఆమోద యోగ్యమైన రాజ్యాంగాన్ని రూపొందించటానికి ప్రయత్నించారు. దీని కోసం జాతీయ కాంగ్రెస్ 1928 ఫిబ్రవరిలో అఖిల పక్ష మహాసభను జరిపింది. ఈ మహాసభ నూతన రాజ్యాంగ రచనకై ఒక ఉప సంఘాన్ని నియమించింది. ఈ ఉప సంఘానికి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షుడు. ఆలీ ఇమామ్, తేజ్ బహదూర్ సప్రూ, సుభాష్ చంద్రబోస్ మొదలగువారు సభ్యులు. 1928 ఆగష్టులో ఉప సంఘం తన నివేదికను సమర్పించింది. అదే నెహ్రూ నివేదికగా ప్రసిద్ది చెందింది. స్వయంపాలన తక్షణమే ఇవ్వాలని సంఘం కోరింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికపై భారతదేశాన్ని సంయుక్త రాజ్యంగా ప్రకటించవలెనని కార్య నిర్వాహక వర్గం శాసనసభకు బాధ్యత వహించాలని మత అల్ప సంఖ్యాక వర్గాలకు పదేళ్ళపాటు రిజర్వేషన్లు కొనసాగాలని వారు సిఫార్సు చేశారు. 1928 డిశెంబర్‌లో, కలకత్తాలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో నెహ్రూ నివేదిక సమర్పించబడింది. ముస్లిం లీగ్, హిందూ మహాసభ అనేక అభ్యంతరాలను లేవదీశాయి. తిరిగి మత ప్రాతిపదిక పై విభేదాలు చెలరేగాయి. జిన్నా ముస్లింలీగ్ తరపున 14 సూత్రాలు కలిగిన కోర్కెల పత్రాన్ని ప్రకటించాడు. ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలు కావాలని కేంద్ర శాసనసభలో 3% సీట్లు ఇవ్వాలని పంజాబ్ శాసనసభలలో జనాభా ప్రాతిపదికపై తమకు సీట్లు కేటాయించాలని పట్టుపట్టాడు. ముస్లింలకు అనుకూలంగా నెహ్రూ నివేదిక రూపొందించారని హిందూ మహా సభ విమర్శించింది. నెహ్రూ నివేదికలో సూచించిన భాధ్యతాయుత పాలన కాంగ్రెస్‌లోని యువకులైన జవహర్ లాల్ నెహ్రూ, సుబాష్ చంద్రబోస్‌లకు నచ్చలేదు. వారు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరారు. మోతీలాల్ నెహ్రూ పంపిన నివేదిక విషయంలో భారతీయ నాయకులలో ఏకీభావం కుదరక పోవటంతో బ్రిటిష్ ప్రభుత్వం ఈ నివేదికను గుర్తించలేదు.

## 1.5. లాహోర్ కాంగ్రెస్ సమావేశం :

జాతీయ ఉద్యమంలో 1929 వ సంవత్సరం ఒక మైలురాయి. 1929 జూలైలో కాంగ్రెస్ వాదులు తమ శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేయవలసిందిగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానించింది. ఈ తీర్మానం సర్వసాధారణ సభ ముందు ప్రవేశ పెట్టబడగా శాసన సభల బహిష్కరణను గాంధీ బలపరిచాడు. మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ కూడా గాంధీని సమర్థించారు. ఇంగ్లండ్‌లో జరిగిన సాధారణ ఎన్నికలలో 'లేబర్ పార్టీ' విజయం సాధించి రామ్‌సే మాక్ డోనాల్డ్ ప్రధాన మంత్రి అయ్యాడు. రాజ్యాంగ ప్రగతిని గురించి చర్చలు జరిపేందుకు వారు భారత వైశ్రాయి లార్డ్ ఇర్విన్‌ను లండన్ రావలసిందిగా కోరారు. ఇర్విన్ భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత సైమన్ సంఘ సిఫార్సులను ప్రభుత్వం అంగీకరించదని ఈ సిఫార్సులను చర్చించటానికి త్వరలో సమావేశం ఏర్పాటు చేయగలమని ప్రకటించాడు. ఈ ప్రకటనను ఇంగ్లండ్‌లోని కన్సర్‌వేటీవ్, లిబరల్ పార్టీలు విమర్శించాయి. ఈ విమర్శల వల్ల ప్రభుత్వం వెనుకంజ వేయవలసి వచ్చింది. లేబర్ పార్టీకి పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీ లేదు. నెహ్రూ తదితర కాంగ్రెస్ నాయకులు ఇర్విన్‌ను కలసి స్వయం పాలనా ప్రతిపత్తి ఇవ్వగలమనే నిర్దిష్టమైన హామీ ఇవ్వవలసిందని కోరినారు. ఇర్విన్ తన అసక్తతను వెల్లడించాడు.

ఇటువంటి పరిస్థితులలో అఖిల భారత కాంగ్రెస్ 1929 డిశెంబర్ 29న లాహోర్‌లో సమావేశమైంది. జవహర్ లాల్ నెహ్రూ ఈ సమావేశానికి అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. సమావేశం ఒక సుదీర్ఘ తీర్మానాన్ని ఆమోదించింది. రాజ్యాంగ ప్రగతికి వైస్రాయి చేసిన కృషిని అభినందిస్తూ ప్రస్తుత పరిస్థితులలో దాని వల్ల ఎట్టి లాభం చేకూరదని అభిప్రాయం వ్యక్తం చేయబడింది. అందువల్ల రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావలసిన పనిలేదని భావించారు. నెహ్రూ నివేదిక కూడా కాల దోషం పట్టిందని, నాటి కాంగ్రెస్ వాదులు భారతదేశ సంపూర్ణ స్వరాజ్య సాధనకు కృషి చేయాలని తీర్మానించారు. ఈ కృషిలో ప్రధమ ఘట్టంగా కాంగ్రెస్ వారు కేంద్ర, రాష్ట్ర సభల నుండి రాజీనామా చేయాలని రానున్న ఎన్నికలలో పాల్గొన కూడదని స్పష్టం చేయబడింది. కాంగ్రెస్ వాదులు నిర్మాణాత్మక కార్యక్రమాలలో పాల్గొంటూ, అవసరమనుకున్నప్పుడు ఏ క్షణంలోనైనా పన్నుల నిరాకరణతో సహా ఎట్టి శాసనోల్లంఘన ఉద్యమానికైనా పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా జరిగిన హింసాయుత చర్యలకు బాధపడిన గాంధీ అట్టి చర్యలు పునరావృతం కాకుండా యువశక్తిని అహింసాయుత నిర్మాణాత్మక కార్యక్రమాలకు వినియోగించాలని కోరుతూ తీర్మానం చేయించాడు. 1929 డిశెంబర్ 31 రాత్రి 12 గంటలకు కాంగ్రెస్ అధ్యక్షుడు నెహ్రూ ప్రశాంత గంభీరమైన ఊరేగింపుగా వచ్చి రావేనదీ తీరంలో పింగళి వెంకయ్యచే తయారు చేయబడిన స్వతంత్ర త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాడు.

లాహోర్ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్యాన్ని కాంక్షించింది. 1930 జనవరి 26న దేశమంతటా పూర్ణ స్వరాజ్య దినంగా జరపాలని పట్టణాలలో, పల్లెలలో ఆ రోజున తీర్మాన ప్రతులను ప్రజల ముందు చదువ వలెనని నిర్ణయించారు. ఈ ప్రకటన సుదీర్ఘమైంది. ఆంగ్ల ప్రభుత్వం ఏ రీతిగా భారతదేశాన్ని దోచుకున్నదీ తెలియచేస్తూ భవిష్యత్ కార్యక్రమాన్ని వివరించింది. ప్రజలు అహింసాయుత శాసనోల్లంఘనకు సిద్ధం కావాలని పూర్ణ స్వరాజ్యసాధనకై కాంగ్రెస్ పార్టీ ఇచ్చే ఆదేశాలను అమలు పరచాలని కోరడమైంది. దేశ మంతటా స్వాతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంగా జరిపారు. కాంగ్రెస్‌వారు తమ శాసనసభా సభ్యత్వాలకు రాజీనామా చేశారు. పెక్కు మంది నిర్బందింపబడి శిక్షలకు గురైనారు. 1930 ఫిబ్రవరిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సబర్మతిలో సమావేశమై శాసన ఉల్లంఘన గూర్చిన తీర్మానం చేసింది. ఈ ఉద్యమాన్ని ప్రారంభించటానికి గాంధీకి అధికారమిస్తూ ఉద్యమం పూర్తిగా అహింసా పద్దతులపై నిర్వహించాలని స్పష్టం చేయబడింది.

## 1.6. శాసనోల్లంఘనోద్యమం :

లాహోర్ సమావేశంలో శాసనోల్లంఘన తీర్మానం ఆమోదింపబడిన నాటి నుండి గాంధీ ఉద్యమాన్ని ఎలా నిర్వహిస్తాడా అని కుతూహలంగా ప్రజలు ఎదురు చేశారు. దేశమంతటా సంచలనం కలిగింది. గుజరాత్‌లో గల 'దండి' గ్రామంలో ఉప్పు తయారుచేసి సత్యాగ్రహం నిర్వహించాలని గాంధీ నిశ్చయించాడు. ఉప్పు శాసనాలను బహిరంగంగా ఉల్లంఘించటానికి నిర్ణయించాడు. తన నిర్ణయాన్ని వైస్రాయికి తెలిపి సంభాషణలకు రాగలనని తెలియ చేశాడు. గాంధీ చర్య చట్ట విరుద్దమేగాక శాంతి భద్రతలకు ముప్పుగా పరిణమించగలదని వ్యాఖ్యానిస్తూ వైస్రాయి సంప్రదింపులకు నిరాకరించాడు.

**1.6.1. ఉప్పు సత్యాగ్రహం :** గాంధీ తన అనుచరులతో 1930 మార్చి 12న సబర్మతి నుండి 200ల మైళ్ల దూరాన ఉన్న దండికి బయలుదేరాడు. దారి పొడవునా గ్రామాల ప్రజలు గాంధీకి గొప్పగా స్వాగతం పలికారు. గాంధీ ఏప్రియల్ 6న దండి చేరి కొంత ఉప్పు తయారు చేసి శాసన ధిక్కారము చేశాడు. దండి యాత్ర జాతీయ వాదులకు తీర్ధ యాత్రగా మారింది. దండిలో ఉప్పు తయారుచేయటం, దేశ నలుమూలలా శాసన ధిక్కారం చేస్తూ ఉప్పు తయారీకి నాంది పలికింది. ఉప్పు తయారీకి అనుకూలం కాని ప్రాంతాలలో తదితర శాసనాలను ఉల్లంఘించటం జరిగింది. విదేశీ బట్టలు, వస్తువులు బహిష్కరణకు ముమ్మర ప్రచారము సాగింది. ఇందులో అనేక స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. బొంబాయి సెంట్రల్ ప్రావిన్స్‌లో భూమి శిస్తు తదితర పన్నుల చెల్లింపు నిరాకరణ ఉద్యమం ప్రారంభమైంది.

ఈ ఉద్యమాన్ని ముస్లింలీగ్ బలపరచలేదు. హిందూ రాజ్య స్థాపనకే ఈ ఉద్యమం నిర్వహించబడుతున్నదని మొత్తం భారతీయులందరి కోసం కాదని జిన్నా ప్రకటించాడు. అయినా ముస్లింలలో కొన్ని వర్గాలు ఈ ఉద్యమంలో పాల్గొన్నాయి. వాయవ్యసరిహద్దు రాష్ట్రంలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయత్వాన ఏర్పడిన "ఖుదాయ్ ఖిద్మత్ గార్స్" (Servents of God) సంస్థ అహింసా మార్గాన ఉద్యమం సాగించింది. ఈ సంస్థకు చెందిన స్వచ్ఛంద సేవా దళ సభ్యులు 3 రోజులు పెషావర్ నగరాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ సరిహద్దు గాంధీ అని పిలువబడ్డాడు.

దేశమంతా గాంధీ అడుగుజాడల్లో నడిచి శాసనోల్లంఘన ఉద్యమములో పాల్గొన్నది. ప్రజలు ఉప్పు చట్టాలను ఉల్లంఘించారు. విదేశీ వస్త్రాల బహిష్కరణ జరిగింది. అనేక మంది విద్యార్థులు, ఉద్యోగులు కళాశాలలు ప్రభుత్వోద్యోగాలు వదిలివేశారు. ప్రజలు ప్రభుత్వానికి పన్నులు చెల్లించటం నిరాకరించారు. దేశమంతా ప్రభుత్వ యంత్రాంగం స్తంభించిపోయింది. పురుషులతో బాటు స్త్రీలు కూడా సమానంగా ఉద్యమంలో పాల్గొన్నారు. సూరత్ జిల్లాలో ధరాసన వద్ద గాంధీ ఉప్పుకుటారు స్వాధీనం చేసుకుంటానని ప్రకటించాడు. దీనితో అతనిని ప్రభుత్వం నిర్బందించింది. అంతట గుజరాత్‌లోని వివిధ ప్రాంతాల నుండి నాయకులు, కార్యకర్తలు ధరాసనకు వెళ్ళి ఉప్పు కొటారులపై దాడి చేశారు. వీరి పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారు. గాంధీ మహిళలను పికెటింగ్ చేపట్టమని, నూలు ఒడకటం చేపట్టమని కోరాడు. గాంధీ కోర్కెలను మన్నించి వేలాది స్త్రీలు తమ ఏకాంత వాసాన్ని విడనాడి అరెస్టయినారు.

**1.6.2. ప్రభుత్వ అణచివేత విధానం :** ప్రభుత్వం మొదట్లో శాసన ఉల్లంఘన ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఉద్యమం ఉధృతం కావటంతో ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేటానికి తీవ్ర చర్యలు తీసుకున్నది. గాంధీతో సహా అనేక మంది నాయకులను నిర్బందించింది. అనేక మంది కాంగ్రెస్ నాయకులతో సహా 90 వేలకు పైగా కాంగ్రెస్ కార్యకర్తలు జైలుపాలయ్యారు. వ్యక్తి స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్సులు ద్వారా పెక్కు అధికారాలను సంతరించుకుంది. అత్యవసర పత్రికా చట్టం చేసి ధరావత్తు చెల్లించలేదని 9 పత్రికల ప్రచురణను 1930లో నిలిపివేశారు. దేశం యావత్తూ కారాగార బంధితమైనట్లు కన్పించింది.

**1.6.3. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం :** ఉప్పు సత్యాగ్రహం తీవ్ర స్థాయిలో ఉన్న దశలో 1930 జూన్‌లో సైమన్ సంఘ నివేదిక సమర్పించబడింది. నూతన రాజ్యాంగంలో వీలున్నంత వరకూ స్వయం అభివృద్ధికై వలసిన సూత్రాలను పొందుపరచాలని నివేదికలో సిఫార్సు చేయబడింది. భారత రాజ్యాంగం అంతిమ రూపంలో సమ్మేళన రాజ్యంగా రూపొందాలని రాష్ట్రాలకు శాంతి భద్రతలతో సహా అన్ని అధికారాలలో స్వయం పాలన ఉండాలని నివేదికలో పేర్కొనబడింది. నూతన రాజ్యాంగం ప్రతిపాదనలపై 1929లో వైశ్రాయి చేసిన ప్రకటనకు అనుగుణంగా ఆంగ్ల ప్రభుత్వం భారత ప్రతినిధుల మధ్య చర్చలు జరగాలి. అందువల్ల 1930 నవంబర్‌లో లండన్ మొదటి రౌండ్ టేబుల్ సమావేశము ఏర్పాటైంది. ఈ సమావేశానికి బ్రిటిష్ ప్రధాని రామ్‌సేమెక్ డొనార్డ్ అధ్యక్షత వహించాడు. ఇంగ్లండ్‌లోని వివిధ పార్టీలకు చెందిన 16 మంది, సంస్థానాల నుండి 16 మంది, ఆంగ్ల పాలనలోని భారతదేశం నుండి 57 మంది ప్రతినిధులు చర్చలకు ఆహ్వానించబడిరి. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ తన ప్రతినిధులను పంపలేదు. మిగతా పార్టీల నాయకులు హాజరైనారు. భారతదేశానికి స్వయం పాలనా ప్రతిపత్తిని కేంద్రంలో భాధ్యతాయుత ప్రభుత్వాన్ని భారత ప్రతినిధులు కోరారు. అంతేగాక బ్రిటిష్ పార్లమెంటరీ విధానాన్ని ప్రవేశపెట్టాలని వారు కోరారు. భారత సంస్థానాధిపతులు సమ్మేళన రాజ్యాంగానికి అంగీకరించారు. అయితే ఈ రాజ్యాంగం ఆంగ్ల పాలనలోనే ఉండాలని కోరినారు. సమ్మేలన రాజ్యాంగ రూపంపై కొంత ప్రగతి సాధింపబడింది. కానీ, అంబేద్కర్ నిమ్న జాతులకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని పట్టుపట్టగా చర్చలలో కొంత ప్రతిస్తంభన ఏర్పడింది. ఈ విభేదాల వల్ల సమావేశం వాయిదా వేయబడింది. కొన్ని రాజ్యాంగ సంస్కరణలను ఆమోదించిన బ్రిటిష్ ప్రధాని మత పరమైన విభేదాలను భారతీయులు తమలో తామే పరిష్కరించుకోవాలని కోరారు. నూతన రాజ్యాంగ సంస్కరణలను త్వరలో అమలు చేయాలని ప్రభుత్వం కోరుకుంటుందని ఉద్యమాన్ని నడుపుతున్న నాయకులు ఈ విషయంలో సహకరించాలని కోరాడు. మొదటి రౌండ్ టేబుల్ సమావేశ నిర్ణయాలను తాము గుర్తించటం లేదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలియచేసింది. బ్రిటిష్ ప్రధాని ప్రకటన అస్పష్టంగా ఉంది కాన కాంగ్రెస్ తమ విధానాలను మార్చుకొనే పరిస్థితి లేదని తెలియచేసింది. ఉద్యమాన్ని ఉత్సాహంతో నిర్వహించమని ప్రజలను కోరింది. బ్రిటిష్ ప్రధాని చేసిన విధాన ప్రకటనలోని విషయాలను చర్చించటానికి వీలుగా ప్రభుత్వం నిర్బందంలో ఉన్న కాంగ్రెస్ నాయకులందరినీ విడుదల చేసింది.

**1.6.4. గాంధీ - ఇర్విన్ ఒప్పందము :** మొదటి రౌండ్ టేబుల్ సమావేవానికి హాజరైన నాయకులు గాంధీని, కాంగ్రెస్‌ను తమ బహిష్కరణ విధానాన్ని విడనాడి వైశ్రాయిని కలవమని అర్థించారు. ఫలితంగా గాంధీ 1931 ఫిబ్రవరిలో వైశ్రాయి ఇర్విన్‌ను కలిశాడు. కాంగ్రెస్ తరపున సంప్రదింపులు జరుపుటకు వర్కింగ్ కమిటీ గాంధీకి అధికారం ఇచ్చింది. గాంధీకి, ఇర్విన్‌కు మధ్య చర్చలు సాగి ఒక అంగీకారం కుదిరింది. ఈ అంగీకారాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదించింది. గాంధీ - ఇర్విన్ ఒప్పందంపై 1931 మార్చి 5న వైశ్రాయి ఇర్విన్, గాంధీ సంతకాలు చేశారు.

గాంధీ - ఇర్విన్ ఒప్పందం ప్రకారము 1. శాసన ఉల్లంఘన ఉద్యమం నిలుపు చేయబడుతుంది. 2. రాజ్యాంగ విషయాల చర్చకై మరో సమావేశం జరుగగలదు. అందులో కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొనగలరు. 3. సమ్మేళన రాజ్యాంగం రిజర్వేషన్‌లో మైనారిటీల రక్షణ రాజ్యాంగంలో అంతర్భాగంగా అంగీకరించారు. 4 ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులన్నింటినీ ఉపసంహరించుకుంటుంది. 5 అత్యవసర శాసనాలను రద్దు చేయగలమని ప్రభుత్వం ప్రకటించింది. 6. శాసనాలను ధిక్కరించకుండా విదేశీ వస్తువుల బహిష్కరణకై జరిగే శాంతియుత పికెటింగ్ అనుమతించబడగలదు. 7. సముద్ర తీరాన ఉన్న ప్రజలు తమ ఉపయోగానికై ఉప్పు తయారు చేసుకొనవచ్చును. కానీ, అమ్మకానికి చేయకూడదు.

పై ఒప్పందం ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని ఆపుచేసి రాజ్యాంగ చర్చలలో పాల్గొనటానికి అంగీకరించింది. కొంతమంది నాయకులు ఈ ఒప్పందం లాహోర్ తీర్మానానికి అనుగుణంగా లేదని భావించారు. ముఖ్యంగా యువజన సంస్థలు ఈ ఒప్పందాన్ని నిరసించాయి. సుభాష్ చంద్రబోస్ ఈ ఒప్పందాన్ని విమర్శించాడు. అయితే ఆంగ్ల ప్రభుత్వ పాలనా చరిత్రలో తొలిసారిగా జాతీయకాంగ్రెస్‌ను సమరాజకీయ ప్రత్యర్థిగా గుర్తించటం జరిగింది. కరాచీలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో గాంధీ - ఇర్విన్ ఒప్పందం చర్చకు వచ్చింది. యువకులు ఒప్పందం పట్ల సుముఖత వ్యక్తం చేయలేదు. ఈ సందర్భంలోనే భగత్‌సింగ్, రాజగురు సుఖ్‌దేవ్‌లను ఉరితీయటం జరిగింది. ఈ సంఘటన వల్ల కాంగ్రెస్ సమావేశం ఉద్రిక్త పరిస్థితులలో జరిగింది. సమావేశం గాంధీ - ఇర్విన్ ఒప్పందాన్ని ఆమోదిస్తూ దీనివల్ల పూర్ణ స్వరాజ్య ధ్యేయాన్ని కాంగ్రెస్ విడనాడదని ప్రకటన చేసింది. రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రతినిధులను పంపటానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా అంగీకరించింది. సుదీర్ఘ చర్చల పిదప కాంగ్రెస్ గాంధీని తమ పార్టీ ఏకైక ప్రతినిధిగా లండన్ పంపటానికి నిశ్చయించింది. ఇదే సమయంలో ఇర్విన్ స్థానములో లార్డ్ వెల్లింగ్‌టన్ వైస్రాయిగా వచ్చాడు. ఇతడు గాంధీ - ఇర్విన్ ఒప్పందంలోని అనేక షరతులను అంగీకరించక అణచివేత పద్ధతులను సాగించాడు. దీనితో గాంధీ తాను రాజ్యాంగ చర్చలకు లండన్ వెళ్ళటం లేదని ప్రకటించాడు. తరువాత గాంధీ వైస్రాయిని కలిశాడు. కాంగ్రెస్ చేసిన ఫిర్యాదులను విచారించగలనని వైస్రాయి హామీ ఇచ్చాడు. దీనితో గాంధీ రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరగుటకు అంగీకరించాడు.

**1.6.5. రెండోరౌండ్ టేబుల్ సమావేశం :** 1931 సెప్టెంబర్‌లో లండన్‌లో రెండో రౌండ్ టేబుల్ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో గాంధీ పాల్గొన్నాడు. ఈ సమావేశం రెండు ముఖ్య సమస్యలను పరిష్కరించవలసి ఉంది. అవి : 1. సమ్మేళన రాజ్యాంగ వివరాలను ఖరారు చేయటం 2. అల్ప సంఖ్యాక వర్గాలకు ఆమోదయోగ్యమైన ప్రణాళికను రూపొందించటం. కరాచి కాంగ్రెస్ తీర్మానాన్ని అనుసరించి కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ తక్షణమే బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గాంధీ పట్టుపట్టాడు. ఆ ప్రభుత్వాలకు ఆర్థిక, సైనిక రక్షణ, విదేశీ సంబంధాలపై పూర్తిగా అధికారాలుండాలని కోరాడు. భారత జాతికి ప్రాతినిధ్యం వహించగల ఏకైక సంస్థ కాంగ్రెస్ అని పేర్కొన్నాడు. ప్రాతినిధ్యంపై అంతులేని చర్చ జరిగింది. అయితే అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం రూపొందించలేకపోయారు. నిమ్నజాతులకు శాసనసభల్లో కొన్ని స్థానాలు ప్రత్యేకంగా కేటాయించాలని అంబేద్కర్ ప్రతిపాదించాడు. దీనిని గాంధీ అంగీకరించలేదు. ముస్లింలు, ఆంగ్లో ఇండియన్లు, నిమ్న జాతుల ప్రతినిధులు తమలో తాము ఒక అంగీకారం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. హిందూ, శిక్కు ప్రతినిధులు దీనిని ఆమోదించలేదు. రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడింది. గాంధీ భారతదేశానికి తిరిగివచ్చి ఉద్యమాన్ని పునఃప్రారంభించాడు. ప్రభుత్వం గాంధీని నిర్బంధించింది.

రెండో అఖిల పక్ష సమావేశంలో ప్రత్యేక నియోజక వర్గాల సమస్యలపై వివిధ పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరక పోయినట్లైతే బ్రిటిష్ ప్రభుత్వమే ఆ సమస్యపై ఒక నిర్ణయం తీసుకొని దానిని అమలు జరుపుతుందని బ్రిటిష్ ప్రధాని మాక్ డొనాల్డ్ తన తీర్పును ప్రకటించాడు. దీనినే 'కమ్యూనల్ అవార్డ్' అని అంటారు. ఈ తీర్పు ముస్లింలకు, క్రిస్టియన్లకు, శిక్కులకు, స్త్రీలకు, వెనుకబడిన జాతుల వారికి, భారతదేశంలో నివసిస్తున్న యూరోపియన్లకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని సూచించింది. వెనుకబడిన జాతుల వారికి ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయటాన్ని గాంధీ వ్యతిరేకించి పూనాలోని ఎర్రవాడ జైలులో నిరసన వ్రతాన్ని ప్రారంభించాడు. కానీ, నిమ్నజాతుల సమస్యపై 1932లో గాంధీ, అంబేద్కర్‌ల మధ్య పూనాలో ఒప్పందం కుదిరింది.

**1.6.6. మూడో రౌండ్ టేబుల్ సమావేశం :** 1932 నవంబర్‌లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. ఈ సమావేశంలో ఓటింగ్ అర్హత రాష్ట్రాల ఆర్థిక వనరులను గురించి చర్చించారు. మహిళలకు ఓటింగ్ హక్కు కల్పించటం, రాష్ట్రాల శాసనసభ్యులు సమాఖ్య, ఎగువ సభ ప్రతినిధులను ఎన్నుకోవటం ఈ సమావేశం నిర్ణయించిన నూతన విషయాలు. సంస్థానాధిపతులలో సమాఖ్య రాజ్యం పట్ల సానుభూతి తగ్గింది. ఈ సమావేశం ముగిసే నాటికి రాజ్యాంగం పట్ల భారత ప్రజలలో ఇంతకు ముందు ఉన్న ఆసక్తి క్షీణించింది. మూడు సమావేశాల చర్చల ఆధారంగా రాజ్యాంగ సంస్కరణలు ప్రతిపాదిస్తూ 1933లో బ్రిటిష్ ప్రభుత్వం ఒక శ్వేత పత్రాన్ని ప్రకటించింది. దాని ఆధారంగానే భారత ప్రభుత్వ చట్టం ఏర్పడింది.

**1.6.7. శాసన ఉల్లంఘన - చివరి ఘట్టం :** గాంధీ - ఇర్విన్ ఒప్పందం తరువాత గాంధీ శాసన ఉల్లంఘన ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలుపు చేశాడు. ఒప్పందం ప్రకారం గాంధీ రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నాడు. కానీ, ఈ సమావేశం విఫలమైంది. గాంధీ లండన్ నుండి తిరిగి వచ్చే సరికి అనేక ప్రాంతాలలో అణచివేత శాసనాలు అమలులో ఉన్నాయి. ప్రభుత్వ చర్యల వల్ల ఇంతకు ముందున్న సుహృద్భావ వైఖరి నశించిందని గాంధీ వైస్రాయికి తెలియచేయగా వైస్రాయి సమాధానమిస్తూ ప్రభుత్వ దమన చర్యలను సమర్థించాడు. కొత్తగా అమలు చేసిన శాసనాలు పూర్వాపరాలపై విచారణ జరిపించమని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం తమ విధానాన్ని సమర్థించుకుంటూ మరికొన్ని అత్యవసర శాసనాలు చేసింది. దానితో గాంధీ శాసన ఉల్లంఘన ఉద్యమాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించాడు. ఈ నిర్ణయాన్ని - కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమోదించింది. తిరిగి గాంధీ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

శాసన ఉల్లంఘన ఉద్యమం దావానంలాగ వ్యాప్తించింది. వేలాది మంది ప్రజలు అరెస్టును కోరారు. పెద్ద ఎత్తున పన్నుల నిరాకరణ ఉద్యమం నిర్వహించబడింది. మహిళా వాలంటీర్‌లు పికెటింగ్‌లో పాల్గొన్నారు. విదేశీ వస్త్రాలను పోగుచేసి దహనం చేయటం, గ్రామాలలో పట్టణాలలో నిత్యకృత్యమైంది. సారాదుకాణాల ముందు పికెటింగ్ జరిగింది. ప్రభుత్వాధీశులకు వ్యతిరేకంగా ఊరేగింపులు జరిగాయి. ప్రభుత్వ బ్యాంక్‌లు, ఇన్సూరెన్సు కంపెనీలు కూడా పికెటింగ్ చేయబడినవి. ప్రభుత్వ కార్యాలయాలపై వాలంటీర్లు జాతీయ పతాకాలను ఎగురవేశారు. అధికారులు ఆమోదించిన అనేక కరపత్రాలను బహిరంగంగా పంచిపెట్టారు.

**1.6.8. ప్రభుత్వ అణచివేత విధానం :** బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యమాన్ని అణచుటకై అనేక దారుణమైన అమానుష కిరాతక చర్యలకు ఒడిగట్టింది. సమన్యాయ సిద్ధాంతానికి తిలోదకాలు ఇవ్వటం జరిగింది. చివరకు స్త్రీలను, పిల్లలను కూడా పోలీసులు కొట్టారు. కాల్పులు జరిపారు. గృహాలలో ప్రవేశించి సోదా చేయటం జరిగింది. పోలీస్ నిర్బంధంలో కొట్టడం తదితర చిత్ర హింసలు పెట్టేవారు గ్రామాలలో భీతావః పరిస్థితులను కల్పించారు. వారి ఆస్తులను దోపిడీ చేశారు. భారతదేశంలో ఆంగ్ల ప్రభుత్వ పాలన మధ్యయుగ అమానుష నిరంకుశ పాలన స్థాయికి దిగజారింది. ప్రజలు అలసిపోయినారు. 1934లో గాంధీ జైలు నుండి విడుదలైనాడు. తాత్కాలికంగా ఉద్యమాన్ని ఆపుచేసినాడు.

**1.6.9. ప్రాముఖ్యత :** 1930-1934 కాలంలో జరిగిన శాసన ఉల్లంఘన ఉద్యమం కొంత వరకూ విజయం సాధించిందని చెప్పాలి. ఇంతకు పూర్వం జరిగిన ఉద్యమాలలో కన్నా ఈ ఉద్యమంలో ప్రజలు ఎన్నో రెట్లు పాల్గొన్నారు. స్త్రీలు అసంఖ్యాకరంగా పాల్గొన్నారు. ప్రజలలో దేశాభిమానం, పరాయి ప్రభుత్వం పట్ల ద్వేషం ప్రబలింది. ఈ విధంగా ప్రజలలో కలిగిన మార్పుల వల్ల వారిని స్వరాజ్యానికి మరింత దగ్గరగా వచ్చేటట్లు చేసింది. ప్రభుత్వము తన నైతిక బలాన్ని పూర్తిగా కోల్పోయింది. ప్రజల ఆదరాభిమానాలను కూడా పూర్తిగా పోగొట్టుకుంది. ఎన్నటికైనా తమకు స్వరాజ్యం వచ్చి తీరుతుందని ప్రజలలో గట్టి నమ్మకం ఏర్పడినందువల్లనే క్విట్ ఇండియా ఉద్యమం త్వరలోనే ప్రారంభం కావటం జరిగింది. అందుకే భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో శాసనోల్లంఘన ఉద్యమానికి చాలా ప్రాముఖ్యముంది.

# 6.1.డి) క్విట్ ఇండియా ఉద్యమం

## 1.0 లక్ష్యం :

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చిట్ట చివరి ప్రజా ఉద్యమమైన క్విట్ ఇండియా ఉద్యమం గురించి వివరించటమే ఈ పాఠం లక్ష్యం.

## 1.1. ఉపోద్ఘాతము :

భారత జాతీయోద్యమంలో రెండో ప్రపంచ యుద్ధ కాలం ఒక కీలకమైన ఘట్టం. ఈ యుద్ధములో బ్రిటిష్ వారు భారతీయుల సహాయాన్ని పొందటానికి ప్రయత్నించారు. ఆ కృషిలో భాగమే క్రిప్స్ రాయబారము. క్రిప్స్ రాయబారం విఫలమైన తరువాత క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైనది. భారత స్వాతంత్ర్య సమయంలో ఆఖరి ఘట్టం 1942-44 మధ్య జరిగిన ఈ క్విట్ ఇండియా ఉద్యమం. యుద్ధ కాలంలో భారతదేశ విముక్తి కొరకు దేశం వెలుపల నుండి బ్రిటిష్ వారి శత్రువుల సహాయంతో సుభాష్ చంద్రబోస్ వీరోచిత ప్రయత్నం చేశాడు. యుద్ధం చివరి దశలో భారత దేశ రాజకీయ సమస్యను పరిష్కరించటానికి సిమ్లా సమావేశం ఏర్పాటు చేయబడింది.

## 1.2. 1935-39 మధ్య జాతీయోద్యమం :

1935 భారత ప్రభుత్వ చట్టం రాష్ట్రాలకు స్వయం పాలనాధికారము ఇవ్వటం వలన కాంగ్రెస్ ముస్లిం లీగ్‌లు రాష్ట్ర శాసనసభలకు జరిగే ఎన్నికలలో పాల్గొనటానికి నిర్ణయించాయి. 1937 ఏప్రియల్‌లో రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ 7 రాష్ట్ర శాసనసభలలో అధిక స్థానాలు గెలుచుకొన్నది. పంజాబ్, బెంగాలలో ముస్లింలీగ్ అధిక స్థానాలను పొందింది. అస్సాం, సింధూ రాష్ట్రాలలో సంకీర్ణ మంత్రి వర్గాలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ మంత్రి వర్గాలు రెండు సంవత్సరాల 4 నెలలు అధికారములో ఉన్నాయి. మంత్రి వర్గాలు బ్రిటిష్ పాలనలోని మౌళిక సామ్రాజ్యవాద లక్షణాలను పెద్దగా మార్పు చేయలేకపోయాయి. ఈ మంత్రి వర్గాలు ఉన్న పరిమితులలో ప్రజా జీవనాన్ని మెరుగు పరచటానికి ప్రయత్నాలు చేశాయి. మంత్రులు తమ జీతాలను బాగా తగ్గించుకొని 5 వందల రూపాయిలు తీసుకుంటు రెండు లేక 3 తరగతి రైలులో ప్రయాణం చేసేవారు. విద్యా, వైద్యా సదుపాయాలపై ఎక్కువ శ్రద్ధ చూపారు. పౌర హక్కులను కల్పించి కార్మిక సంఘాలు అధిక వేతనాలను పొందేటట్లు కృషి చేశారు. పత్రికా స్వాతంత్ర్యం అధికమైయింది. రాజకీయ ఖైదీలను విడుదల చేయటం ద్వారా వ్యక్తి స్వేచ్ఛపై ఆంక్షలు తొలగించారు. కమ్యూనిష్టులపై ఉన్న నిషేధాన్ని రద్దు చేసి వారిపై ఉన్న కేసులను ఉపసంహరించారు. ఐతే పేదరికం నిరుద్యోగం రైతుల ఋణ బాధ మొదలగు విషయాలలో మార్పు రాలేదు. కార్మికుల విషయంలో కూడా పెద్దగా మార్పు రాలేదు. ఐతే సాంఘిక సంస్కరణలకు కాంగ్రెస్ మంత్రి వర్గాలు గొప్పగా కృషి చేశాయి. ప్రాధమిక విద్యా, మధ్యపాన నిషేధం, అస్పృశ్యత నివారణతో సహ దళిత వర్గాల ఉద్ధరణ మొదలగు సాంఘిక కార్యక్రమాల పట్ల శ్రద్ధ చూపటం జరిగింది. ఉత్తర ప్రదేశ్, బీహార్, బొంబాయిలలో బెసిక్ విద్యా విధానం ప్రవేశ పెట్టబడింది.

1937 ఎన్నికల తరువాత కాంగ్రెస్ పార్టీ ముస్లిం లీగ్‌ల మధ్య దూరం ఎక్కువైయింది. 1937 లక్నోలో ముస్లిం లీగ్ సమావేశంలో జిన్నా ప్రసంగిస్తూ కాంగ్రెస్ పార్టీ విధానం హిందూ మత అనుకూలమైనదని మంత్రి వర్గాలలోని ముస్లిం ప్రతినిధులు ఆ మతానికి నిజమైన ప్రాతినిధ్యం వహించారని విమర్శించాడు. జిన్నా ముస్లింల తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. అనేక మంది స్వతంత్ర ముస్లిం శాసన సభ్యులు ముస్లిం లీగ్‌లో చేరారు. లక్నో సమావేశం తరువాత 3నెలల కాలంలో ముస్లిం లీగ్ కొత్త శాఖలను ప్రారంభించింది. 1939 లో 'ముస్లింలకు ప్రత్యేక రాజ్యం కావాలి' అనే అతివాద విధానాన్ని ముస్లిం లీగ్ లేవదీసింది. 1940లో జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని పేర్కొన్నాడు. లాహోర్ సమావేశంలో 1940 లో భారతదేశాన్ని మత పరముగా విభజించాలని ముస్లిం లీగ్ తీర్మానించింది.

## 1.3. రెండో ప్రపంచ యుద్ధము : కాంగ్రెస్ ముస్లిం లీగ్‌ల స్పందన :

1939 సెప్టెంబర్‌లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. నాటి వైశ్రాయి లార్డ్ లిన్‌లిత్‌గో రాష్ట్రాల మంత్రులతోగాని ఇతర జాతీయ నాయకులతో గాని సంప్రదించకుండానే బ్రిటన్ జర్మనితో చేయు యుద్ధంలో భారతదేశం బ్రిటన్ పక్షం ఉండేటట్లు ఏక పక్ష నిర్ణయం చేశాడు.

ఈ సమయంలోనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సమావేశమై లిన్ లిత్‌గో ఏక పక్ష నిర్ణయాన్ని వ్యతిరేకించి సామ్రాజ్య వాద కాంక్షతో కొనసాగు యుద్ధానికి తమ సహకారం ఉండదని స్పష్టం చేసింది. అదే విధముగా యుద్ధ లక్ష్యాలలో సామ్రాజ్య వాద నిర్మూలన భారతదేశాన్ని స్వతంత్ర రాజ్యముగా పరిగణించటమనే అంశాలు ఇమిడి ఉన్నాయా లేదా అను విషయాలు వివరించమని ఈ కమిటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరింది. అందుకు సంతృప్తి కరమైన సమాధానం రానందున కాంగ్రెస్ మంత్రులందరు రాజీనమా చేశారు. వాస్తవానికి బ్రిటన్ ఫాసిస్ట్ దాడికి గురి కావటంతో కాంగ్రెస్ సానుభూతిని కనపరిచింది. ఐతే ఒక బానిస రాజ్యముగా మార్చబడిన రాజ్యానికి స్వేచ్ఛ ప్రజాస్వామ్య ఆశయ సాధనకై పోరాడటం ఎలా సాధ్యమవుతుందని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. అందుకోసం భారతదేశాన్ని స్వతంత్ర రాజ్యముగా ప్రకటించాలని లేదా భారతదేశం యుద్ధంలో చురుకుగా పాల్గొనటానికి ముందు కనీసం భారతీయులకు తగినంత అధికారం ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

1937 సాధారణ ఎన్నికలలో పరాభవాన్ని చవిచూసిన ముస్లిం లీగ్ రాజకీయాలలో తిరిగి ప్రవేశించటానికి కాంగ్రెస్ మంత్రుల రాజీనామాను సదవకాశముగా భావించింది. నెహ్రూ ప్రజా సంబంధ కార్యక్రమం; హిందూ మహసభ మత తత్వం, బ్రిటిష్ ప్రభుత్వ చర్యలు ముస్లిం లీగ్ నాయకుల మనస్సులలో అనుమానాలను రెకెత్తించాయి. తద్వారా కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల మధ్య విభేదం ఎక్కువైయింది. అందువల్ల కాంగ్రెస్ మంత్రులు రాజీనామా చేయగా దానిని ముస్లిం లీగ్ విముక్తి దినముగా పాటించింది. అంతేగాక ముస్లిం లీగ్ ప్రభుత్వానికి తన పూర్తి మద్దతును సహకారాన్ని తెలియజేసింది. 1940లో జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. బ్రిటిష్ ప్రభుత్వం జిన్నాను ప్రోత్సహించింది.

## 1.4. ఆగస్ట్ ప్రకటన :

1940 వేసవి కాలములో యూరప్‌లోని యుద్ధం మిత్ర రాజ్యాలకు ఎదురు దెబ్బ తీయటమేగాక జర్మనీ దేశ బాంబుల దాడికి, విమాన దాడులకు గురి కావలసి వచ్చింది. ఈ సందర్భంలో భారత రాజకీయ పార్టీలతో కూడిన తాత్కాలిక ప్రభుత్వాన్ని అతి త్వరలో ఏర్పాటు చేసే షరతుతో బ్రిటన్‌కు కాంగ్రెస్ తన మద్దతును తెలిపింది. ఇందుకు బదులుగా 1940లో వైశ్రాయి ఆగస్ట్ ప్రకటన చేశాడు. ఈ ప్రకటనలోని అంశాలు

1. యుద్ధ అనంతరం భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించుటకు రాజ్యాంగ రచనల సంఘాన్ని ఏర్పరచుట
2. ప్రస్తుత కార్య నిర్వాహక మండలిలో భారతీయ నాయకులను చేర్చుకోవటం ద్వారా దానిని విస్తృత పరచటం
3. బ్రిటిష్ ఇండియా భారత రాజ్యాల ప్రతినిధులతో కూడిన వైశ్రాయ్ యుద్ధ మండలిని స్థాపించటం.
4. సంస్కరణల నూతన పథకంలో ప్రభుత్వం అల్ప సంఖ్యాక వర్గాల డిమాండ్‌కు తగిన ప్రాముఖ్యాన్ని ఇవ్వటం.

తనతో సహకరించవలసిందిగా వైశ్రాయ్ అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించాడు. కాని కాంగ్రెస్ తాను కోరిన జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయుటకు కార్య నిర్వాహక మండలిని విస్తృత పరచటం అందుకు ప్రత్యామ్నాయం కాదని ఆ ఆహ్వానాన్ని తిరస్కరించింది. అంతేగాక అల్పసంఖ్యాక వర్గాల సమస్యలకు ప్రాముఖ్యం ఇవ్వటాన్ని కాంగ్రెస్ నిరసించి తన అసంతృప్తిని తెలియజేసింది. ఐతే అల్ప సంఖ్యాక వర్గాల వరి డిమాండ్‌కు సంబంధించి ముస్లిం లీగ్ బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆహ్వానించింది.

## 1.5. వ్యక్తి గత సత్యాగ్రహం

బ్రిటిష్ ప్రభుత్వం ఎదుర్కొను సమస్యలను కాంగ్రెస్ అవకాశముగా తీసుకోలేదు. ఐతే అదే సమయంలో బ్రిటిష్ విధానానికి తన నిరసనను తెలియచేయాలని కాంగ్రెస్ భావించింది. అందువల్ల గాంధీ నాయకత్వంలో కొంత మంది కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత సత్యాగ్రహాన్ని పాటించుటకు అనుమతించబడింది. సామూహిక చర్య ఏ రూపములో ఉన్నా నిషేధింపబడింది. ఈ వ్యక్తిగత సత్యాగ్రహం బ్రిటిష్ విధానంపై గొప్ప ప్రభావాన్ని చూపలేదు. ఈ విధముగా రాజ్యంగ పరమైన సంక్షోభం కొంత కాలం సాగింది.

## 1.6. క్రిప్స్ రాయభారం :

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 1941లో రెండు ప్రధాన మార్పులు సంభవించాయి. అవి 1) 1941 జూన్‌లో నాజీ సేనలు సోవియట్ యూనియన్‌ను ముట్టడించాయి. 2) 1941 డిసెంబర్‌లో పెరల్ హార్బర్‌వద్ద అమెరికా యుద్ధ నౌకలపై జపాన్ ఆకస్మిక దాడి చేసింది. ఈ విధంగా జర్మనీ జపాన్‌లకు వ్యతిరేకముగా సోవియట్ యూనియన్ అమెరికా దేశాలు యుద్ధ రంగంలోకి ప్రవేశించాయి. జపాన్ 1942లో రంగూన్‌ను ఆక్రమించి యుద్ధాన్ని భారత సరిహద్దులకు తీసుకు వచ్చింది. ఇటువంటి పరిస్థితులలో బ్రిటిష్ ప్రభుత్వానికి మరో మార్గం లేక యుద్ధములో భారతీయులు చురుకుగా పాల్గొనాలని భావించింది. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడైన యఫ్. డి. రూజ్ వెల్ట్ బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిలను భారత నాయకులతో ఒక ఒప్పందానికి రావలసిందిగా వత్తిడి చేశాడు. అందువల్ల ప్రధాని చర్యలు రాజ్యాంగ పర సంస్కరణలు చేయు ప్రతిపాదనలతో లేబర్ పార్టీ అతివాద నాయకుడు, దౌత్యాధికారి అయిన స్టాఫ్ క్రిప్స్‌ను పంపాడు. క్రిప్స్ నెహ్రూకు స్నేహితుడు కావటం వల్ల భారత జాతీయ పోరాటానికి సానుభూతితో కూడిన వైఖరి కలిగి ఉండటం వల్ల భారత దేశంలో ఆశాజనకమైన పరిస్థితి ఏర్పడింది. క్రిప్స్ భారత నాయకులందరితో కలసి 1942 మార్చిలో ఈ క్రింది ప్రతిపాదనలు చేశాడు. అవి

1. యుద్ధము తరువాత ఒక రాజ్యాంగ రచనా సంఘాన్ని ఏర్పాటు చేయాలి
2. ఈ సంఘ సభ్యులను భారతదేశ దిగువ సభ నుండి ఎన్నుకోవాలి
3. బ్రిటిష్ కామన్‌వెల్త్ పరిధిలోనే ఒక డొమినియన్‌గా బ్రిటిష్ ఇండియా భారతీయ రాజ్యాల సమాఖ్య ఏర్పాటు కావాలి.
4. క్రింది షరతులకు కట్టుబడి రాజ్యాంగ రచనల సంఘం రూపొందించిన రాజ్యాంగాన్ని బ్రిటన్ అంగీకరించవలసి ఉంటుంది. ఆ షరతులు :

ఎ. ఎదైనా బ్రిటిష్ రాష్ట్రం ఈ సమాఖ్యలో చేరటం ఇష్టంలేకపోతే దానికి ప్రస్తుతం ఉన్న హోదాను అది నిలుపుకోవచ్చు. అందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఆ రాష్ట్రానికి ఇండియన్ యూనియన్‌లోని ఇతర రాష్ట్రాలకు ఇచ్చే హోదాను ఇవ్వవలసి ఉంటుంది.

బి. రాజ్యాంగ రచనల సంఘం బ్రిటిష్ ప్రభుత్వ అల్ప సంఖ్యాక వర్గాల హక్కులతో సహా అధికార బదిలీకి సంబంధించిన అన్ని అంశాలతో కూడిన ఒక ఒప్పందంపై సంతకం చేయవలసి ఉంటుంది.

సి. వైస్రాయ్ క్రిప్స్ రాయబారము రాష్ట్రాలకు అధినివేశ రాజ్య ప్రతిపత్తిని మరియు యూనియన్ నుండి వైదొలిగే హక్కును కూడా కల్పించింది. ఈ ప్రతిపాదనను విభజన కొరకు లీగ్ కోరికను పురస్కరించుకొని చేసిన మినహాయింపు.

బ్రిటిష్ ప్రభుత్వం విభజనను ఒప్పుకోనందున ముస్లిం లీగ్ క్రిప్స్ ప్రతిపాదనను తిరస్కరించింది. కాంగ్రెస్ కూడా ఇందుకు అభ్యంతరాలు తెలిపింది. వైస్రాయ్‌కి ఉన్న అధికారాలు ఏ మాత్రం తగ్గక ఇంకా దేశ రక్షణకు అతనిని బాధ్యుడుగా చేయటం వల్ల ఈ తాత్కాలిక ఏర్పాట్లు అసంతృప్తిని కలిగించే జపాన్ దాడిని త్రిప్పి కొట్టుటలో ప్రజల అండను, ప్రజా చైతన్యాన్ని పురికొల్పుటకు జాతీయ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. యూనియన్ నుండి రాష్ట్రం వేరుపడే ప్రతిపాదన వల్ల అది దేశ సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని కాంగ్రెస్ క్రిప్స్ ప్రతిపాదనను వ్యతిరేకించింది. బ్రిటిష్ రాజ్యపునాదులే శిధిలావస్థలో ఉన్న ఆ స్థితిలో ఈ అధినివేశ రాజ్య ప్రతిపత్తి నిచ్చే దీర్ఘకాలిక ప్రతిపాదనను ఒక దివాలా తీసిన బ్యాంకుకు వ్రాసిన ముందు తేది గల చెక్కుగా గాంధీ పేర్కొన్నాడు.

## 1.7. క్విట్ ఇండియా తీర్మానం :

క్రిప్స్ రాయబార వైఫల్యం భారతదేశ ప్రజలను బాగా విసిగించింది. రాజకీయ దిగ్బంధనాన్ని పరిష్కరించు ప్రయత్నాలు విఫలం కావటంతో బ్రిటిష్ ప్రభుత్వం ఎంత కాలం వరకు దేశాన్ని పరిపాలిస్తుందో అంత వరకు మత సమస్య పరిష్కరించబడదనే విషయం స్పష్టమైయింది. అదే విధముగా కాంగ్రెస్‌ను ఒక హిందూమత సంస్థగా భావించటం లీగ్‌ను ముస్లిం వర్గానికి చెందిన ఏకైక ప్రతినిధిగా చెప్పుకునే జిన్నా అభిప్రాయాన్ని అంగీకరించే బ్రిటిష్ విధానంతో కాంగ్రెస్ ఇష్టపడలేదు. రాజకీయాలలో రాజీకి సమ్మతించకుండా ఉండేటట్లు బ్రిటిష్ ప్రభుత్వం లీగ్‌ను రహస్యముగా బలపరుస్తుందని కాంగ్రెస్ భావించింది. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుండి అతి త్వరలో వైదొలగటం ఒక్కటే భారతదేశాన్ని జపాన్ వారి దాడి నుండి రక్షించగలదని కాంగ్రెస్ భావించింది.

రెండో ప్రపంచ యుద్ధములో భాగముగా జపాన్ బ్రిటిష్ వారిపై దాడి చేయటం భారత ప్రజలలో నూతన ఉత్సాహాన్ని నింపింది. జపాన్ విజయంతోపాటు ఆ తరువాత జరిగిన సంఘటనలో కూడా బ్రిటిష్ వారి పరువు ప్రతిష్టలను దెబ్బతీసింది. బ్రిటిష్ వారి ఓటమి భారతీయులకు ధైర్యాన్ని కలిగించి భారత దేశములో బ్రిటిష్‌వారి పాలన అంతమౌతుందన్న నమ్మకాన్ని పెంపొందించింది. దానికి తోడు బ్రిటిష్ ప్రభుత్వం ఆగ్నేయ ఆసియాలో బ్రిటిష్ వారి క్షేమానికి అన్ని చర్యలు తీసుకొని భారత వలసదారులను వారి ఖర్మానికి వదిలివేయటం భారతీయులలో తెల్లవారిపై ఆగ్రహాన్ని విముఖతను పెంపొందించింది. దీనికి తోడు భారత దేశంలోని బ్రిటిష్ సైనికులు వ్యవహరిస్తున్న తీరు కూడా భారతీయులకు ఆగ్రహాన్ని కలిగించింది. వీరు ప్రదర్శిస్తున్న జాతిపరమైన వివక్ష, స్త్రీలను మానభంగం చేయటం మొదలగు చర్యలకు సంబంధించి అనేక కేసులు కూడా నమోదైయాయి. ఇది కూడా దేశ వ్యాప్తంగా భారతీయులలో ఆగ్రహావేశాలు చలరేగటానికి కారణమైయింది. అంతేగాక ధరలు విపరీతముగా పెరిగిపోయాయి. బియ్యం, ఉప్పు మొదలైన నిత్యావసర వస్తువులకు తీవ్రమైన కొరత ఏర్పడింది. బర్మా నుండి బియ్యం దిగుమతులు నిలిచి పోయాయి. బ్రిటిష్ వారు తమ దేశంలో తీసుకున్న జాగ్రత్తలను భారత దేశంలో తీసుకొలేదు. ఫలితంగా బ్లాక్ మార్కెటింగ్, ఆహార పదార్థాల దాచివేత మొదలగు వాటి వల్ల తీవ్రమైన కరువు కాటకాలు ఏర్పడ్డాయి.

రెండో ప్రపంచ యుద్ధంలో మిత్ర పక్షాలు ఓడిపోతాయనే భావం భారతీయులకు ఎంతో బలాన్ని ఇచ్చింది. 1942 మధ్య నాటికి మిత్ర దేశాలు ఓడిపోవటం దాదాపు నిశ్చయమైంది. ఈ అభిప్రాయంతోనే కాంగ్రెస్ నాయకులు క్విట్ ఇండియా తీర్మానాన్ని రూపొందించారు. బ్రిటిష్ వారు అనుసరించిన రెచ్చగొట్టే విధానాలు 1942 ఉద్యమానికి మరొక కారణమైంది. వైశ్రాయ్ లిన్‌లిత్‌గో భారతీయ నాయకులను కనీసం సంప్రదించకుండా జర్మనీపై బ్రిటన్ చేసే యుద్ధములో భారతదేశం కూడా పాల్గొంటుందని ఏక పక్షం కూడా ప్రకటించాడు. కొన్ని కనీస షరతులకు అంగీకరిస్తే యుద్ధ రంగలో పూర్తి సహకారాన్ని అందచేయగలమని భారత నాయకులు చేసిన ప్రతిపాదనలను వైశ్రాయి తిరస్కరించాడు. బ్రిటిష్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వ్యతిరేక విధానాలకు జాతీయ సంకీర్ణ ప్రభుత్వానికి అధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చర్చిల్ మద్దతు లభించాయి. లిన్‌లిత్‌గో చేసిన ఆగస్ట్ ప్రతిపాదన అంతకు ముందు అతను చేసిన ప్రతిపాదన కన్నా ఏ మాత్రం మెరుగ్గా లేదు.

కాంగ్రెస్ దాని డిమాండ్‌ను వ్యక్త పరచటానికి 1942 ఆగస్ట్ 8న బొంబాయి సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించింది. ఇది అహింసా పూర్వక ప్రజా పోరాట ప్రారంభాన్ని ప్రతిపాదించింది. ఇందుకు కాంగ్రెస్ ప్రతినిధులతో మాట్లాడుతూ గాంధీ ఈ క్రింది విధముగా అన్నాడు.

" ఈ రోజు రాత్రి ఒక వేళ పొందగలిగితే తెల్లవారక ముందే స్వాతంత్ర్యము కావాలంటాను. అందుకు ఇక్కడ ఒక మంత్రముంది. అది నేను మీకు ఉపదేశించే చాలా చిన్న మంత్రం దానిని మీ హృదయాల మీద ముద్రించుకోవచ్చు. మీ ప్రతి శ్వాస దానికి చిహ్నముగా ఉండవచ్చు. ఈ మంత్రమేమంటే సాధించు లేక చావు (డూ ఆర్ డై) మనం భారతదేశానికి స్వేచ్ఛను కలిపిద్దాం లేక దాని ప్రయత్నంలో మరణిద్దాం, మనం మన బానిసత్వం వృద్ది పొందటాన్ని చూడటం కోసం బ్రతక కూడదు."

## 1.8. క్విట్ ఇండియా ఉద్యమం :

భారత జాతీయ కాంగ్రెస్ తన ఉద్యమాన్ని ప్రారంభించక ముందే ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులందరిని అరెస్టు చేసింది. దీనితో బ్రిటిష్ వారు అనుసరించిన అణచివేత విధానాలతో అంతవరకు ప్రజలలో దాగిఉన్న అసంతృప్తి ఒక్కసారిగా భగ్గుమంది. ప్రజలు సంఘటితముగా బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేశారు. దేశమంతట సమ్మెలు, హర్తాళ్ళు, ఊరేగింపులు జరిగాయి. వీటికి ఒక నాయకుడుగాని సంస్థగాని లేక ప్రజలు వారికి ఇష్టము వచ్చిన రీతులతో ప్రతి చర్యకు పూనుకున్నారు. బ్రిటిష్ అధికారానికి సంకేతాలైన పోలీస్ స్టేషన్లు, తపాలా కార్యాలయాలు, రైల్వేలు మొదలగునవి ప్రజల ఆగ్రహానికి గురికాబడినవి. ఈ ఉద్యమానికి విద్యార్థులు కార్మికులు, కర్షకులు అండగా నిలిచారు. బ్రిటిష్ ప్రభుత్వం కొంత కాలం పాటు అనేక పట్టణాలపై తన అజమాయిషిని కోల్పోయింది. 1942 ఆగస్ట్ 9 నుండి జరిగిన పరిణామాలన్నింటిని లిన్‌లిత్‌గో వ్యక్తిగతముగా ఇలా అన్నాడు. 1857 సిపాయిల తిరుగుబాటు కంటే కూడా ఇది చాలా తీవ్రమైన తిరుగుబాటు. భద్రత దృష్ట్యా దీని తీవ్రతను, విస్తృతిని ప్రపంచానికి తెలియకుండా మేము మరుగు పరిచాము.

క్విట్ ఇండియా ఉద్యమంలో ఆంధ్రుల ఆగ్రహం మిన్నుముట్టింది. తెనాలి రైల్వే స్టేషన్ ప్రజల ఆగ్రహానికి గురైంది. పోలీసులు ప్రదర్శకుల మీద కాల్పులు జరుపగా 6 గురు హతులైయారు. చీరాల, బాపట్లలో కూడా ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం సంభవించింది. గుంటూరులో వందలాది యువకులు పోలీస్ స్టేషన్‌పై దాడి జరిపారు. పోలీస్ కాల్పులలో ఇద్దరు మరణించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో కాంగ్రెస్‌తో పాటు ఫార్వర్డ్ బ్లాక్, సోషలిస్టు పార్టీ తీవ్రవాదులు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వానికి పట్టుబడకుండా రహస్యంగా తిరుగుతూ యువ నాయకులు జయ ప్రకాష్ నారాయణ, రాం మనోహర్ లోహియా, అరుణ ఆసఫ్ ఆలీలు ఉద్యమాన్ని కొనసాగించారు. ఉద్యమ కాలంలో బొంబాయి నుంచి కాంగ్రెస్ రహస్య రేడియో ప్రసారాలు కూడా చేసింది. ఈ కాలములో కొన్ని ప్రాంతాలలో ప్రజా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

## 1.9. ఉద్యమ అణచివేత :

1942 క్విట్ ఇండియా ఉద్యమాన్ని అణచి వేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నది. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తూ ఆంక్షలు విధించింది. అనేక చోట్ల పోలీస్ సైనిక కాల్పులు జరిగాయి. వాటిలో సుమారు వేయి మంది మరణించారు. 60వేల మందిని నిర్బంధించారు. విమానాల నుంచి కాల్పులు కూడా జరిపించారు. ఎంతో మంది కార్యకర్తలను భందించారు. చాలా ప్రాంతాలలో ప్రజలపై సామూహిక జరిమానాలు విధించారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని బ్రిటిష్ ప్రభుత్వం అతి క్రూరంగా అణచివేసింది.

"ఈ ఆగస్ట్ విప్లవం నిరంకుశత్వముపై తిరుగుబాటు దీనిని ఫ్రెంచి చరిత్రలో బాస్టిల్ పతనముతో లేక రష్యా చరిత్రలో అక్టోబర్ విప్లవంతో పోల్చవచ్చు" అని ఆచార్య ఈశ్వర ప్రసాద్ అంటాడు.

## 1.10. ఉద్యమ ప్రాముఖ్యం :

క్విట్ ఇండియా ఉద్యమం తక్షణ విజయం సాధించలేకపోయినా ఆంగ్ల ప్రభుత్వ దమన నీతిని ప్రపంచ దృష్టికి తెచ్చింది. భారత ప్రజల పట్ల ప్రపంచ రాజ్యాధిపతుల సానుభూతిని సంపాదించింది. నాయకత్వము లేకపోయినా ప్రజలు తమకు తాముగా నాయకత్వ భాద్యతలు చేపట్టగలరని చాటి చెప్పారు. ఉద్యమముతో భారత ప్రజలు సంపూర్ణ స్వరాజ్యం మినహా తమకు ఏది తృప్తి నివ్వదని తేల్చి చెప్పారు. కాబట్టి క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చివరిదిగాను విశిష్టమైనదిగాను పేరొందినది. ఉద్యమం వల్ల దేశం స్వాతంత్ర్యానికి దగ్గరైయింది. బిపిన్ చంద్ర మాటలలో "అది దేశములో పెల్లుబికిన జాతీయ భావనల లోతులను, పోరాటానికి అవసరమగు సామర్ధతలను, ప్రజలు అలవరుచుకొన్న త్యాగాన్ని వ్యక్తీకరించటంలోను దాని ప్రాముఖ్యం నిబిడీకృతమై ఉంది." విప్లవ నాయకుడు సుభాష్ చంద్రబోస్ సాగించిన సాయుధ పోరాటం, కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమం, ముస్లిం లీగ్ ప్రవర్తన, ఆంగ్లేయుల వైఖరిలో గొప్ప మార్పు తెచ్చినాయి. ఈ మార్పు సంప్రదింపుల ఖాండకు దారి తీసింది.

# 6.1.ఈ) 1906 - 1947 మధ్య ముస్లింలీగ్ కార్యక్రమాలు

## 1.0 లక్ష్యం :

1906-1947 మధ్య కాలంలో ముస్లిం లీగ్ కార్యక్రమాల గురించి వివరించడమే ఈ పాఠ్య భాగం యొక్క లక్ష్యం

## 1.1. ఉపోద్ఘాతము :

భారతదేశంలో కలసిమెలసి జీవిస్తున్న హిందూ, ముస్లింలను విడదీయడానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది. 1857 తిరుగుబాటులో హిందూ, ముస్లింల ఐక్యత బ్రిటిష్ వారిని కలవరపెట్టింది. 1857 తిరుగుబాటును అణచివేసిన తరువాత బ్రిటిష్ వారు విభజించి పాలించు విధానాన్ని పాటించి హిందూ, ముస్లింలను విడదీయడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలు కొంతవరకు ఫలించాయి. ముస్లింలను బుజ్జగించి వారిని ప్రభుత్వానికి అనుకూలంగా మళ్ళించి హిందూ ముస్లిం మధ్య ద్వేషాన్ని రగల్చడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో వారికి కొందరు భారతీయులు కూడా తోడ్పడ్డారు. అందులో ముఖ్యడు సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్. సంఘ సంస్కర్త, మేధావిగా ప్రసిద్ధి చెందిన అహ్మద్‌ఖాన్ ప్రథమంలో హిందూ ముస్లిం మధ్య సఖ్యతకు కృషి చేశాడు. కానీ బ్రిటిష్ వారి ప్రభావం వల్ల ఆయన ముస్లింలలో వేర్పాటు ధోరణిని ప్రోత్సహించాడు. కాంగ్రెస్‌లో చేరవద్దని అతడు ముస్లింలకు విజ్ఞప్తి చేశాడు. ఆలీఘర్‌లో ఏర్పాటైన ఆంగ్లో - ముస్లిం విద్యాలయం ప్రిన్సిపాల్ బెక్ ప్రభావం అతని మీద పడింది. బెంగాల్‌లో పూర్తి ఐక్యతతో నివసిస్తున్న హిందూ - ముస్లింలను విభజించడానికి 1905లో కర్జన్ బెంగాల్ రాష్ట్రాన్ని విభజించాడు. అయితే దేశమంతటా హిందూ - ముస్లింలు కలిసి బెంగాల్ విభజనను వ్యతిరేకించడం వల్ల ప్రభుత్వం ఆశించినట్లు హిందూ - ముస్లింల మధ్య విభేదాలు తీవ్రతరం కాలేదు.

## 1.2. ముస్లింలీగ్ ఏర్పాటు :

విద్యావంతులయిన ముస్లింలలో, పెద్ద నవాబులలో, భూస్వాములలో ఏర్పడిన వేర్పాటువాద వైఖరి అఖిల భారత ముస్లింలీగ్ స్థాపనతో పరాకాష్టకు చేరుకుంది. 1906లో బ్రిటిష్ అధికారులు సహకారంతో ఢాకా నవాబు ఆగాఖాన్, నవాబు మొహిసిక్-ఉల్-ముల్క్ కలిసి ముస్లిం లీగ్‌ను ఏర్పాటు చేశారు. ముస్లింలకు ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉండాలని, ఎన్నికలలో ప్రత్యేక నియోజక వర్గాలు ఉండాలని ముస్లింలకు ప్రత్యేక రక్షణ కల్పించాలని ముస్లింలీగ్ ప్రభుత్వాన్ని కోరింది. ముస్లింలీగ్‌కు ఆనాటి గవర్నర్ జనరల్ మింటో సహకారం ఉండేది. 1909 లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలలో భాగంగా ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేసి, వారిలో వేర్పాటు ధోరణిని ప్రభుత్వం ప్రోత్సహించింది. పాకిస్థాన్ ఏర్పాటుకు అదే పునాది అయిందని ఒక అభిప్రాయం. ముస్లింల మత తత్వ వాదాన్ని బ్రిటిష్ ఆగమనంతో వచ్చిన కీడుగా గాంధీ అభివర్ణించాడు. బ్రిటిష్ ప్రభుత్వం అనేక విధాల హిందూ - ముస్లింలను విడదీయడానికి ప్రయత్నించినా వారిరువురి మధ్య సఖ్యత పెంచడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నాల ఫలితమే 1916 లో కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల 'లక్నో ఒప్పందం' ఖిలాఫత్ ఉద్యమం ద్వారా కూడా గాంధీ హిందూ - ముస్లింల మధ్య ఐక్యత పెంచడానికి ప్రయత్నించారు.

1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం 1937 లో జరిగిన ఎన్నికలలో అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ విజయాన్ని సాధించడం, ముస్లిం లీగ్ నాయకులలో తీవ్ర అసంతృప్తి కలిగించింది. ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ - ముస్లింలీగ్‌లు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని లీగ్ నాయకుడు జిన్నా ప్రతిపాదించాడు. అందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. ఆ తిరస్కారం మహమ్మద్ ఆలీ జిన్నాలో పట్టుదల పెంచింది. ముస్లింలలో వేర్పాటు ధోరణిని పెంచడానికి తన కృషిని ఎక్కువ చేశాడు. మత తత్వాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు ఎక్కువయ్యాయి. ముస్లిం లీగ్ నాయకులు తీవ్రంగా పాకిస్థాన్ రాజ్య అవతరణ దిశగా కృషి కొనసాగించారు.

## 1.3. పాకిస్థాన్ ఏర్పాటుకు ముస్లిం లీగ్ డిమాండ్ :

మహ్మద్ ఇక్బాల్ కవి చేసిన ప్రసంగంలో ముస్లింలకు ప్రత్యేక దేశం అనేక భావనకు తొలి ఆధారం లభిస్తుంది. 1930లో ముస్లిం లీగ్ అధ్యక్షోపన్యాసంలో ఇక్బాల్ వాయవ్య భారత ముస్లిం దేశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సూచించాడు. అయితే, అప్పటి సందర్భాన్ని

బట్టి చూస్తే ఉర్దూకవి, దేశ భక్తుడూ అయిన ఇక్బాల్ నిజంగా దేశ విభజనను కోరలేదని, ఆయన కేవలం వాయువ్య భారతదేశంలో ఉన్న ముస్లిం అధిక సంఖ్యాక ప్రాంతాలకు భారత సమాఖ్యలో ఒక భాగంగా ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాలని మాత్రమే కోరినట్లు అర్థమవుతుంది.

భారతదేశంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలను కలిపి పాకిస్థాన్ అనే కొత్త రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని 1933లో కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో విద్యార్థి నాయకుడు రహమత్ ఆలీ ప్రకటించాడు. ఇతడు 1933 లో ప్రచురించిన ఒక కరపత్రంలో ముస్లిం వర్గానికి ప్రత్యేక జాతీయ ప్రతిపత్తి కల్పించాలన్న అభిప్రాయంతో పాకిస్థాన్ అనే పదానికి రూప కల్పన చేశాడు. ఇందులో 'పి' పంజాబ్‌కు 'ఎ' ఆఫ్ఘనిస్థాన్‌కు 'కె' కాశ్మీరుకు, 'ఎస్' సింధుకు, 'టి.ఎ.ఎన్.' బెలూచిస్తాన్‌కు చిహ్నాలని ఇతడు తెలియజేశాడు. దీంతో దేశ విభజన భావనకు అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు. రహమత్ ఆలీ తన ఆలోచనకు దేశంలోని ముస్లింల ఆమోదాన్ని సాధించడానికి కృషి చేశాడు. అయినా 1937 వరకు ముస్లిం లీగ్ పాకిస్తాన్ గురించి ప్రస్తావించలేదు. ముస్లిం లీగ్ తరపున రెండో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు హాజరైన ప్రతినిధులు కూడా దీనిని విద్యార్థుల పగటి కల కింద కొట్టివేశారు. అయితే 1937 నుంచి ముస్లింలకు ప్రత్యేక దేశం అవసరం అనే భావనపై లీగ్ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. దీనికి ప్రధానంగా రెండు కారణాలున్నాయి. అవి. 1) 1935 చట్టపు ఫెడరల్ క్లాజులు అమల్లోకి వస్తాయన్న నమ్మకం వారికి సన్నగిల్లింది. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వంలో తాము హిందూ అధిక్యతకు తలవంచక తప్పదనే అభిప్రాయం కూడా వారికి కలిగింది. 2. రాష్ట్రాలతో ముస్లిం లీగ్‌తో కలసి సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలనే లీగ్ ప్రతిపాదనను కాంగ్రెస్ వారు నిరాకరించడం జిన్నాకు, ముస్లిం లీగ్‌కు అవమానంగా తోచింది.

ముస్లింలకు ప్రత్యేక ప్రతిపత్తి సంబంధించి లీగ్ అనేక ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేయడం జరిగింది. 1939 మార్చిలో వివిధ ప్రతిపాదనలు పరిశీలించడానికి లీగ్ ఒక ఉపసంఘాన్ని నియమించింది. జఫ్రుల్ హసన్ హుస్సేన్ రూపొందించిన ఆలీఘడ్ పథకం పాకిస్థాన్, బెంగాల్, హైదరాబాద్, హిందూస్థాన్ అనే నాలుగు ప్రత్యేక రాష్ట్రాలను రూపొందించాలని సూచించగా, మిగిలిన ప్రతిపాదనలలో అధిక భాగం పూర్తి విభజన జరగాలని, భారత సమాఖ్యలో వివిధ స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ముస్లిం విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించాయి.

పంజాబ్ ఏకీకరణ వాది అయిన సికిందర్ హయాత్‌ఖాన్ మూడు అంచెల వ్యవస్థను సూచించాడు. స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న రాష్ట్రాలను ఏడు విభాగాల కింద విడగొట్టి వాటికి వేర్వేరు ప్రాంతీయ లెజిస్లేచర్లను ఏర్పాటు చేసి వాటిని ఒకే కేంద్రంలో సమాఖ్య, కిందకు తీసుకురావాలని, రక్షణ, విదేశీ వ్యవహారాలు, కస్టమ్స్, కరెన్సీ మొదలైన వాటిని కేంద్రానికి అప్పగించాలని సూచించాడు. ఇలాంటి ప్రత్యామ్నాయాలకు ఆలోచనలకు బ్రిటిష్ వారి మద్దతు కూడా లభించింది. మరో ప్రముఖ ముస్లిం నాయకుడు ఖలీ ఖుజ్జుమన్ ఈ విషయాన్ని సెక్రటరీ ఆఫ్ స్టేట్ జెట్లాండ్ సానుభూతితో పరిశీలించినట్లు తెలియచేశాడు. 1939లో జెట్లాండ్ రహ్మత్ ఆలీఖాన్ పథకాన్ని తిరిగి రూపొందిస్తూ వాయువ్య భారతంలో ఒకటి, బెంగాల్, అస్సాంలతో కలిపి తూర్పు భారతదేశంలో ఒకటి చొప్పున రెండు ముస్లిం సమాఖ్యలను ఏర్పాటు చేసుకోవచ్చని సూచించినట్లు కోజామెన్ తెలియచేశాడు. ఇటీవల వెల్లడైన కొన్ని పత్రాలు ఈ విషయాన్ని స్పష్టం చేయడమే గాక మరికొన్ని సాక్ష్యాధారాలను చూపింది. అందులో ఒకటి 1940 లో వైస్రాయి జిన్నాను పిలిపించి బ్రిటన్‌లో ముస్లింలపై దురభిప్రాయం కలుగకుండా ఉండాలంటే వారు త్వరలోనే తమ పథకాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించటం.

1939 లో కాంగ్రెస్ మంత్రి వర్గాల రాజీనామాను ముస్లిం లీగ్ విముక్తి దినంగా భావించి ఉత్సవాలు జరుపుకొంది. అందుకు కారణం 1937-39 మధ్య కాలంలో కాంగ్రెస్ మంత్రి వర్గాలు ముస్లిం ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక చర్యలు తీసుకున్నాయని లీగ్ భావించడమే. 1940 మార్చి 23న జరిగిన లాహోర్ సమావేశంలో ముస్లింలీగ్ ఆమోదించిన తీర్మానం ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న వాయవ్య భారతం తూర్పు ప్రాంతాలను స్వతంత్ర రాష్ట్రాలుగా రూపొందించాలని, భారతదేశంలో వీటిని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాష్ట్రాలుగా పరిగణించాలని డిమాండ్ చేసింది. అయితే ఈ తీర్మానంలో పాకిస్తాన్ గూర్చి గానీ, విభజన గురించి గానీ స్పష్టమైన ప్రస్తావన లేదు. 1940 లో రూపొందించిన ప్రత్యేక రాష్ట్రాల ప్రస్తావనను కొన్ని భారతీయ ఆంగ్ల పత్రికలు పాకిస్తాన్‌గా వ్యవహరించడం ప్రారంభించాయి. అయితే లీగ్ దానిని అధికారికంగా 1943లో మాత్రమే పాకిస్తాన్ అని వ్యవహరించింది.

ప్రథమంలో ముస్లిం లీగ్ నాయకులెవ్వరూ పాకిస్తాన్‌ను డిమాండ్ చేయలేదు. జిన్నా కూడా దీనిని కాంగ్రెస్ వారికిస్తున్న రాజ్యాంగ పరమైన మినహాయింపులకు అడ్డుకట్టగా ముస్లింలకు అదనపు ప్రయోజనాలు కల్పించేందుకే ఉపయోగించుకోవాలనుకున్నాడు. అయితే

విద్యావంతులైన ముస్లింలలో అధిక సంఖ్యాకులకు కూడా ఈ విభజన పథకాలలో ఏదీ కూడా నచ్చలేదనీ హయత్‌ఖాన్ స్వయంగా అంగీకరించాడు. ఈ తీర్మానంలో ఉన్న అస్పష్టత ముస్లింలలో అసంతృప్తిని పెంచి పాకిస్తాన్ నినాదం ఒక్కటే సరియైనది అను అభిప్రాయాన్ని కలిగించింది. ఫలితంగా పంజాబ్‌లోనూ పాకిస్తాన్ నినాదం కొన్ని సంవత్సరాల పాటు ప్రతి ధ్వనించి మత భావాలను పెంపొందించింది. తమ సమస్యలన్నింటికీ స్వతంత్ర ముస్లిం దేశాన్ని ఏర్పాటు చేయటమే పరిష్కారమని ముస్లింలు భావించారు. ఈ విధంగా ప్రథమంలో విద్యార్థుల పగటికలగా కొట్టి వేసిన ముస్లింల ప్రత్యేక దేశం అనే భావన చివరికి ముస్లిం లీగ్ ప్రధాన డిమాండ్‌గా రూపొందిందింది.

## 1.4. మహమ్మద్ ఆలీ జిన్నా :

జాతీయ ఉద్యమం నందు వివాదాస్పదమైన పాత్ర నిర్వహించి, ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రవచించి ముస్లిం రాజకీయాలను పెంపొందించి పాకిస్తాన్ ఆవిర్భావానికి ముఖ్య కారణమైన వాడు మహమ్మద్ ఆలీ జిన్నా. ఇతడు 1876 డిశెంబర్ 25న కరాచీలో జన్మించాడు. ఇతని తండ్రి కోజా తెగకు చెందిన హిందువుగా ఉండి ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. జిన్నా పూర్వీకులు గుజరాత్‌లోని కతియవాడ్‌లో అనేక సంవత్సరాలుగా స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఇతని తల్లి మాతృభాష గుజరాతి. 1892లో జిన్నా ఇంగ్లండ్‌కు వెళ్ళి 4 సంవత్సరాలు అక్కడే వుండి 'లా' పరీక్ష పాసైనాడు. ఇంగ్లండ్‌లో ఉన్న కాలంలో ఇతడు తరచూ పెద్ద పెద్ద వారి ఉపన్యాసాలకు వెళ్ళేవాడు. కామన్స్ సభలో జరిగే చర్చలు కూడా వినేవాడు. ఈ అనుభవాన్ని ఆధారం చేసుకొని దాదాభాయ్ నౌరోజి పార్లమెంట్ ఎన్నికలకు నిలబడ్డప్పుడు ఆయన తరపున ఎన్నికల ప్రచారం చేసి ఆయన గెలుపుకు ఎంతో సహాయ పడ్డాడు.

జిన్నా చదువు ముగించుకొని కరాచీకి తిరిగి వచ్చాడు. కొంత కాలం తరువాత బొంబాయి హైకోర్ట్‌లో వకీలుగా నమోదు చేసుకొని మంచి పేరు ప్రఖ్యాతలు గడించాడు. 1906లో కాంగ్రెస్‌కు దాదాభాయ్ నౌరోజి అధ్యక్షుడుగా ఉన్నప్పుడు జిన్నా ఆయనకు ఆంతరంగిక కార్యదర్శిగా వ్యవహరించాడు. జిన్నా ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యుడుగా ఉండేవాడు. దేశ స్వాతంత్రం సంపాదించటానికి హిందూ ముస్లిం సఖ్యత చాలా అవసరమని దృఢ నమ్మకం కలిగి ఉండేవాడు. 1906 లో స్థాపించబడిన ముస్లిం లీగ్ ఆదర్శాల పట్ల జిన్నాకు నమ్మకం లేదు. అతనికి ముస్లింలు వేరుపడటం ఇష్టం లేదు. మొదట్లో ఇతడు ఏకరాజ్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. లౌకిక రాజ్యానికి ప్రాధాన్యమిచ్చాడే గానీ మత పరమైన రాజ్యము కాదు. మతానికి, రాజకీయాలకు ఎటువంటి సంబంధం ఉండకూడదని ఉద్ఘాటించాడు. అందుకే 1909లో ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పాటైతే అతడు హర్షించలేదు. ముస్లిం లీగ్ మత పరమైందని దానిని విమర్శిస్తుండేవాడు. 1910 అలహాబాద్ కాంగ్రెస్‌లో జిన్నా ముస్లిం లీగ్ వేర్పాటు విధానాన్ని వ్యతిరేకిస్తూ ఒక ప్రతిపాదన ప్రవేశ పెట్టాడు. కానీ, ఈ తీర్మానంలో ముస్లింలకు ప్రాతినిధ్యం కావాలని డిమాండ్ చేశాడు. 1912లో ఆగాఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ముస్లిం లీగ్ సమావేశంలో మాట్లాడుతూ సంస్థ రాజ్యాంగాన్ని విశాల దృక్పథంలో ఉండేటట్లు మార్చమన్నాడు. 1916లో తిలక్‌పై మోపబడిన రాజ ద్రోహం కేసులో వాదించి జిన్నా అతనిని కాపాడాడు. మహమ్మద్ ఆలీ సయ్యద్, వజీర్ హుస్సేన్‌ల ప్రోత్సాహంతో జిన్నా ముస్లిం లీగ్‌లో చేరాడు. అయినా జాతీయ ప్రయోజనాలకు భంగకరంగా వ్యవహరించరాదని ముస్లిం మిత్రులకు సలహా ఇచ్చాడు. అనిబిసెంట్ నిర్బంధం తరువాత జిన్నా బొంబాయి హోంరూల్ లీగ్‌లో చేరాడు. 1916లో ముస్లిం లీగ్ అధ్యక్షుడై హిందూ ముస్లిం ఐక్యతను కోరటమేగాక కాంగ్రెస్ లీగ్ ల మధ్య జరిగిన లక్నో ఒడంబడికను జిన్నా బలపరిచాడు.

జిన్నా సైమన్ కమీషన్‌ను బహిష్కరించి మోతీలాల్ నెహ్రూ నివేదికను తయారు చేయటంలో సహకరించి 3 సవరణలు కావాలని కోరాడు. కానీ, అందుకు కాంగ్రెస్ సమ్మతించలేదు. దీనికి జిన్నా నిరాశతో కాంగ్రెస్‌లో తనకు సముచిత స్థానం లేదని విశాల భావాలకు స్వస్తి చెప్పి సంకుచిత స్వభావుడై మత రాజకీయాలకు దిగాడు. తరువాత జిన్నా 14 కోర్కెలను ప్రతిపాదించాడు. జాతీయ కాంగ్రెస్ హిందూ సంస్థ అని ఆరోపించి రెండవ ప్రపంచ యుద్ధంలో భారతదేశాన్ని జర్మనీకి శత్రు రాజ్యమనే ఆంగ్లేయుల ప్రకటనను కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజకీయం చేయగా దానిని జిన్నా విమోచన దినంగా పాటించాడు. 1940 మార్చి 24న లాహోర్‌లో జిన్నా అధ్యక్షతన ముస్లిం లీగ్ సమావేశమై పాకిస్తాన్ కావాలని తీర్మానం చేసింది. ఇప్పుడు జిన్నా బ్రిటిష్ వారిని కోరేది 'విభజించి వెళ్లు'. ఇప్పటి వరకూ వారు అవలంభించిన 'విభజించి పరిపాలించు' సిద్ధాంతానికి స్వస్తి చెప్పమన్నాడు. ఇటువంటి జిన్నా సంకుచిత భావాల వల్ల రాజాజీ ప్రణాళిక,

వేవల్ ప్రణాళిక మంత్రిత్రయ, రాయబార ప్రతిపాదన భారత రాజకీయ సమస్యను పరిష్కరించుటలో విఫలమైంది. చివరకు పాకిస్తాన్ సాధనకు హిందువులపై ప్రత్యక్ష చర్యను ప్రారంభించి హింసా కాండకు దిగాడు. మతకలహాలు అధికం కావటంతో దేశ విభజన అనివార్యమని మౌంట్ బాటన్ భావించాడు. ఫలితంగా దేశ విభజనకు సంబంధించిన మౌంట్ బాటన్ పథకాన్ని జిన్నా పద్ధతులతో విసిగి వేసారిన జాతీయ నాయకులు 1947 జూలై 15న ఆమోదించారు. 1947 ఆగస్ట్ 14న పాకిస్తాన్ ఏర్పడింది.

## 6.2. నమూనా ప్రశ్నలు

1. గాంధీజీ సిద్ధాంతాలను వివరింపుము
2. సహాయ నిరాకరణోద్యమానికి కారణాలు, లక్షణాలు, ఫలితాలను వివరించండి
3. శాసనోల్లంఘన ఉద్యమాన్ని గురించి వ్రాయుము
4. క్విట్ ఇండియా ఉద్యమానికి కారణాలు, ఫలితాలు వివరించండి.
5. 1906-40 మధ్య ముస్లిం లీగ్ గురించి వ్రాయుము.

## 6.3. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Louis Fisher | : | Mahatma Gandhi |
| 2. | Tara Chand | : | History of Freedom Movement in India, Vol. 3 |
| 3. | R.C. Majumdar | : | Three Phases of The india's struggle for Freedom |
| 4. | Moulana Azad | : | India Wins Freedom |
| 5. | Judith Brown | : | The Emergence of Mahatma Gandhi |
| 6. | Sumit Sarkar | : | Modern India |
| 7. | Bipin Chandra | : | Modern India |
| 8. | Percival Spear | : | History of India, Vol II. |


డా॥ వి.కె. మోహన్

**యూనిట్ - 5**

**పాఠం - 7**

# విప్లవోద్యమము - సుభాష్ చంద్రబోస్ - భారత జాతీయ దళం

## 7.0 లక్ష్యం :

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆత్మార్పణ చేసి, చరిత్రలో చెరగని ముద్ర వేసుకొన్న ఉగ్రవాదుల వీరోచిత పాత్రను గురించి, సుభాష్ చంద్రబోస్, భారత జాతీయ దళం (INA) గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయసూచిక :


7.1 ఉపోద్ఘాతము

7.2 విప్లవోద్యమము - మొదటి ఘట్టము

7.2.1. బెంగాల్

7.2.1.1. అనుశీలన సమితి

7.2.1.2. రామకృష్ణ సేవా సంఘం

7.2.1.3. అరవింద ఘోష్

7.2.1.4. పత్రికలు

7.2.1.5. ఖుదీరామ్ బోస్, ప్రఫుల్ల చాకే

7.2.1.6. భూపేంద్ర బోస్

7.2.2. మహారాష్ట్ర

7.2.2.1. వాసుదేవరరావు ఆనందరావు ఫాడ్కే

7.2.2.2. చాపర్కు సోదరులు

7.2.2.3. విప్లవ సమితులు

7.2.3. పంజాబ్

7.2.3.1. రహస్య సమితులు

7.2.4. బీహార్, ఒరిస్సా

7.2.5. ఉత్తర ప్రదేశ్

7.2.6. దక్షిణ భారతదేశం

7.2.7. విదేశాలలో విప్లవ కార్యక్రమాలు

7.2..7.1. హరిదయాల్ - గదర్ విప్లవ సంఘం

7.2.7.2. కొమగటమరు

7.2.7.3. ఒబైదుల్లా

7.2.7.3. బర్కతుల్లా
7.2.7.5 మదామ్ కామా
7.2.7.6. రాజా మహేంద్ర ప్రతాప్
7.2.7.7. వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ
7.2.7.8. చంపక్ రామన్ పిళ్ళై
7.2.7.9. జతిన్ ముఖర్జీ
7.2.7.10. సయాం, చైనా, సింగపూర్
7.2.7.11. ముగింపు
7.3 విప్లవోద్యమము - రెండో ఘట్టము
7.3.1. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్
7.3.2. సచీంద్ర సన్యాలు
7.3.3. చంద్రశేఖర అజాద్
7.3.4. గోపీనాథ్ సాహా
7.3.5. సూర్యసేన్
7.3.6. రామ ప్రసాద్
7.3.7. అల్లూరి సీతారామరాజు
7.3.8. భగత్ సింగ్
7.3.9. కమ్యూనిష్టులు
7.4 సుభాష్ చంద్రబోస్
7.4.1. ఫార్వర్డు బ్లాకు
7.4.2. భారత జాతీయ దళం
7.4.3. అజాద్ హిందు ప్రభుత్వం
7.4.4. వైఫల్యం
7.5. ముగింపు
7.6. నమూనా ప్రశ్నలు
7.7. చదవదగిన గ్రంథాలు

## 7.1 ఉపోద్ఘాతము

ఆంగ్ల ప్రభుత్వ అణచివేత చర్యలు, దేశంలోని నాయకత్వం ఏమీ సాధించలేకపోయిందనే నిస్పృహల వల్ల యువతలో విప్లవ ధోరణులు మొలకెత్తాయి. శాంతియుత ఉద్యమాల వైఫల్యాలు వారిని విప్లవం వైపు మళ్ళించాయి. ఆంగ్లేయులను బల ప్రయోగంలో తరిమి వేయటమే వారి ముఖ్య ధ్యేయం ప్రజా వ్యతిరేక చర్యలను అమలు పరిచే ఆంగ్ల ఉద్యోగులను రష్యన్ సోషలిస్టుల పద్ధతి ద్వారా హత మార్చి, బ్రిటిష్ ప్రభుత్వానికి గుణపాఠం నేర్పాలని విప్లవవాదులు నిర్ణయించుకున్నారు. అందుకోసం వారు ఆయుధాలను, బాంబులను కూడా తయారుచేశారు. నాటి ఉగ్రవాదుల ప్రభావం ఎక్కువగా బెంగాల్, బొంబాయి, పంజాబ్ ప్రాంతాలలో ఉండేది. విదేశాలలో కూడా ఉగ్రవాదుల కార్యకలాపాలు విస్తరించాయి.

భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటం మూడు మార్గాల్లో సాగింది. అందులో మొదటి మార్గం మితవాదుల మార్గం. వారు కోరింది, వారి లక్ష్యం వలస రాజ్యాల్లోని స్వపరిపాలన. దాన్ని సంపాదించుకోడానికి చట్ట సమ్మతమైన మార్గాలనే అవలంభించడం వారి పద్దతి వందేమాతరం ఉద్యమమప్పుడు కాంగ్రెస్ చీలిపోవడానికి కారణం వారి ఆశయాలే. హింసాయుత చర్యలుగాని, విప్లవాత్మక చర్యలుగాని వారు ఎన్నడూ కోరలేదు. వారు బ్రిటిష్ ప్రభుత్వంతో తమ కోరికలను తెలుపుకోవడానికి ప్రశాంత మార్గంలో ఆందోళన సాగించడంతో తృప్తి పడేవారు. తమ కొరికల్లో ఏ కెంచెం సాధించగలిగినా వారికి ఎంతో తృప్తి కలిగేది.

స్వాతంత్ర్య పోరాటం అనుసరించిన రెండో మార్గం సత్యాగ్రహం. **1905** లో వీరు ఈ మార్గాన్ని అనుసరించారు. వీరిని అతివాదులని జాతీయ వాదులని చెప్పేవారు. వారి లక్ష్యం స్వరాజ్యం సంపాదించడం. వారి దృష్టిలో చట్టబద్దమైన విధానంలో ఎంత ఆందోళన సాగించినప్పటికీ బ్రిటిష్ వారు తమ అధికారాన్ని వదులుకోరు. ఏ సామ్రాజ్య పాలకులు మాత్రం ఇష్టపడి తమ రాజ్యాన్ని వదులకొంటారు. వారు ఆ రాజ్యంలో ఆర్థికంగా ఎన్నో లాభాలు అనుభవిస్తుంటారు. అలాంటి వారు శాంతియుతంగా ప్రజలు ఆందోళన సాగిస్తే సామ్రాజ్యాన్ని విడిచిపోరని అతివాదుల వాదన. ఐరోపా అమెరికా దేశాల్లో విదేశీయుల పాలనకు లోబడిన దేశాలు తమ స్వతంత్ర సిద్ధికై యుద్ధాలు చేసి తమ లక్ష్యాన్ని సాధించుకొన్నారు. అలాగే భారతీయులు కూడా పోరాడడంలో తప్పులేదు. ఎందుకంటే దేశ స్వాతంత్ర్యానికై పోరాటం ప్రజల ధర్మం. అప్పుడు జరిగే యుద్ధం ధర్మ యుద్ధం అలాంటప్పుడు సాయుధ పోరాటం సాగించడం తప్పుకాదు. భగవద్గీత వంటి భారతదేశ ప్రమాణ గ్రంధాలు ధర్మం కోసం పోరాడ్డం ధర్మ బద్ధమని చెపుతున్నపుడు ఆ మార్గం న్యాయమని అతివాదులు నమ్మారు. **1905** నాటికి అటువంటి అతివాదులు బిపిన్ చంద్రపాల్, బాలగంగాధర తిలక్, లాలాలజపతి రాయి, అరవింద ఘోష్. వారందరికీ సాయుధ పోరాటంలో ఎంతోనమ్మకం ఉన్నా ఆ మార్గాన్ని అనుసరించక పోవడానికి కారణం వీరికి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదురించేంత ఆయుధాలు లేవని, అలాంటప్పుడు ఎంత పోరాడినా బ్రిటిష్ వారిదే గెలుపు అవుతుందని తలచారు. దీనికి **1857-58** తిరుగుబాటు ఒక తార్కాణమని చెప్పారు.

స్వాతంత్ర్య సంపాదనకై అనుసరించిన మూడో వర్గం సాయుధ పోరాటం. దీనినే విప్లవ మార్గమని, ఆ మార్గాన్ని అనుసరించిన వారిని దౌర్జన్య వాదులని (Terrorists) అని చెప్తారు. హింసాయుత మార్గం ద్వారా బ్రిటిష్ పరిపాలనను దేశంలో అంతమొందించి స్వరాజ్యం స్థాపించడం ఈ దౌర్జన్య వాదుల లక్ష్యం. దీనిని బట్టి మనం గ్రహించాల్సిందేమంటే, వారికి చట్ట సమ్మతమైన ఆందోళన యందుగాని, సత్యాగ్రహం నందుగానీ ఎటువంటి నమ్మకం లేదు. ఒక్కుమ్మడిగా వారంతా బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసేటంత సైన్యం, ఆయుధాలు వారి వద్ద లేవని వారికి తెలుసు. అందుకని మొదటి మెట్టుగా వారు బ్రిటిష్ అధికారులను, వారి భారతీయ సహచరులను చంపాలని తీర్మానించుకొన్నారు. ఈ దౌర్జన్య వాదుల్లో ఎక్కువ మంది చదువుకొన్న నిరుద్యోగులు, మధ్యతరగతుల్లోని కింది వర్గంవారు. చదువుకొన్న నిరుద్యోగుల్లో చాలా మంది యువకులు, వారికి ఉత్సాహం కల్గడానికి మార్గదర్శకులు రష్యాలోని నివేలులు. వీరుగాక ఇటలీ మిగతా ఐరోపా దేశాల్లో వ్యాపించిన కార్బొనరీ ఉద్యమం. ఐర్లండులోని సిన్‌ఫిన్ ఉద్యమం. వీటన్నిటి వల్ల వారు ప్రభావితులైనారు. ఈ ఉద్యమం **1905** నుండి తీవ్రం కావడానికి ముఖ్య కారణం **1905**లో బెంగాలు రాష్ట్ర విభజన. ఈ విభజన ప్రజల సమ్మతికి విరుద్దంగా చేశారని, బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఇంకా సాగిస్తే ఇలాంటి విభజనలే కాకుండా భారతీయ మతానికి, సంస్కృతికి ముప్పు వస్తుందని వారు భయపడ్డారు. అరవింద్, పాల్ మొదలైనవారి దేశభక్తి జాతీయ భావాలు వారి యువక రక్తాన్ని పొంగించింది. అరవిందుడి కలంలో నుంచి వచ్చిన అగ్ని కణాలే యువజనులకు విప్లవోద్యమ జ్యోతులైనాయి. వందేమాతరోద్యమంలో అనేక మంది వివిధ త్యాగాలు చేయడం వారు చూసారు. వారి త్యాగబలమే నూతనాభిప్రాయ ప్రచారానికి మూలకందమని విప్లవకారుల విశ్వాసం. దుర్మార్గులను చంపడం పరమధర్మమని కూడా వారి మతం. లోక సంరక్షణార్థం దుర్మార్గులను వధించడంలో ఎటువంటి పాపం లేదని అది దైవ విధియేమని కూడా వారు నమ్మారు. ఈ ఉద్యమం అనేక రాష్ట్రాల్లో వ్యాపించింది. ఈ ఉద్యమ చరిత్ర రెండు భాగాలుగా వివరించడమైంది. గాంధీజీ **1921** లో సత్యాగ్రహోద్యమం ప్రారంభించినంత వరకు మొదటి ఘట్టంగాను **1923** నుంచి జరిగింది రెండో ఘట్టంగాను చెప్పడమైంది.

## 7.2. విప్లవోద్యమము - మొదటి ఘట్టం

**7.2.1. బెంగాలు :** బెంగాల్లో ఈ ఉద్యమాన్ని సాగించడానికి, ప్రజలకు దాన్ని గురించి ప్రచారం చేయడానికి అనేక సంఘాలు ఏర్పడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి. -

1. కలకత్తా అసున్ సమితి
2. కలకత్తా యుగంధర్ సంఘం
3. కలకత్తా తూర్పు సంఘం
4. కలకత్తా సరస్వతీ సమితి
5. సుహరాడు సమితి, మైమన సింగు
6. బందహబు సమితి, బీరిసాల్
7. యువసమితి, పరిదపూరు
8. జనమంగళ సమితి - లోగ్రా
9. అంసులేని సమితి - ఢక్కా

ఈ సంఘాలన్నీ బెంగాల్లోని యువకులకు శరీర వ్యాయామమందు శిక్షణ ఇవ్వడానికి, దేశ భక్తిని జాతీయ భావాన్ని పెంపొందించడంలో ఎంతో పాటుపడ్డాయి. అంతేకాకుండా ముష్టి యుద్ధం, కత్తి, లాఠీ మొదలైన వాటిలో కూడా యువకులకు తర్ఫీదు ఇస్తూ ఉండేవి. ఈ ఉద్యమ ప్రారంభకులు ముఖ్యంగా ఈ సమితుల్లో తర్ఫీదు పొందినవారే.

**7.2.1.1. అనుశీలన సమితి :** సమితిలన్నింటిలో చాలా ప్రసిద్ధి పొందిన సమితి అనుశీలన సమితి. ఈ సమితి మొదటి లక్ష్యం సాయుధులై తిరుగుబాటు చేయడానికి యువకులను తయారుచేయడమే కాదు, వారికి దేశభక్తి ధైర్యాన్ని కూడా నూరిపోయడం. ఆ రోజుల్లో బ్రిటిష్ వారు బెంగాలీలు పిరికివారనీ, కలం పట్టడానికి వారి చేతనవునుగాని, కత్తి పట్టనెరగరని పరిహసించేవారు. అలా పరాభవించడంలో తృప్తి పడక, బెంగాలీలను వారు హింసించినపుడు బెంగాలీలు కోర్టులకు ఎక్కగా న్యాయాధికారులు పక్షపాతంలో బ్రిటిష్ వారిపై శిక్షపడనీయకుండా తీర్పులు చెప్పేవారు. న్యాయస్థానాల్లో న్యాయం జరగనప్పుడు శిక్షించే అధికారం తమ చేతుల్లోకి తీసుకొని బెంగాలీ యువకులు తప్పు చేసిన వారిని తామే శిక్షించడానికి పూనుకొన్నారు. ఏది న్యాయమో, ఏది అన్యాయమో తెలుసుకోవడం చాలా అవసరమని వారు భావించారు.

**7.2.1.2. రామకృష్ణ సేవా సంఘం :** దేశ చరిత్ర, మత విషయాలు కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యమని బెంగాల్ యువకులు తెలుసుకొని, సమితులను దేశీయ విద్యాబోధన కేంద్రాలుగా రూపొందించారు. ఈ సమితులకు అనేక మంది విద్వాంసులు విచ్చేసి ఉపన్యాసాలు ఇచ్చేవారు. ఇలా వచ్చిన వారిలో రామకృష్ణ సేవా సంఘానికి సంబంధించిన అనేక మంది స్వాములవారు ఉన్నారు. సోదరి నివేదిత రామకృష్ణ సేవా సంఘ సమితి సభ్యుల్లో ముఖ్యురాలు. ఆమె కూడా ఉపన్యాసాలిస్తూ సమితి కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఈ సమితి వారు స్వామి వివేకానంద ఉపన్యాస వ్యాసాల చేత చాలా ఉత్తేజితులైనారు. భగవద్గీతలో వారు సంపూర్ణ జ్ఞానం పొందారు. వారంతా శారీరకంగా, మానసికంగా బాగా తర్ఫీదు పొంది ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సంసిద్ధులుగా ఉన్నారు. వారు తెలుసుకొన్న ముఖ్య సూత్రాలు, అలవరచు కొన్న నియమాలు ఏవంటే -

1. విదేశీయులనుంచి స్వదేశాన్ని విడిపించి స్వరాజ్యాన్ని సాధించాలి.
2. దౌర్జన్యాన్ని తొలగించడానికి ధర్మ యుద్ధం సాగించటం న్యాయం, అందులో దోషమేమి లేదు.
3. జనన మరణాలు దేహానికే గాని ఆత్మకులేవు. ఆత్మ అనశ్వరం దానికి మరణభయం లేదు.
4. పునర్జన్మ ఉంది.
5. వీలైనంత వరకు బ్రహ్మచర్యం అవలంబించాలి.
6. స్త్రీలను గౌరవించాలి.

**7.2.1.3. అరవింద ఘోషు :** అరవింద ఘోషు విప్లవోద్యమాన్ని బలపర్చాడు. ఆయన 1900 లో బరోడాలో మహారాజా కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేస్తూ ఉండేవారు. కలకత్తాలో విప్లవోద్యమాన్ని బలపరచమని ఆయన తన తమ్ముడు వీరేంద్ర కుమారుని పంపాడు. 1905 తర్వాత ఆయనే కలకత్తాకు వచ్చి విప్లవకారులకు అంతరంగిక సహచరుడైనాడు. వీరేంద్ర కుమారుడు 1906లో మందుగుండ్లను తయారుచేసే కర్మాగారాన్ని నెలకొల్పాడు. కొంత కాలమైన తర్వాత ప్రభుత్వం వారు దాన్ని కనుగొని వీరేంద్రుని, అతని అనుచరులను పట్టుకొని కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు జరుగుతుండగా వారిలో ఒకడైన నరేంద్రగోస్వామి ఆ కర్మాగారం గురించి వివరాలన్నీ ప్రభుత్వం పక్క చేరి వారికెరుకపరచగా వీరేంద్రుడు, ఇతరులను శిక్షించడం జరిగింది. కాని గోస్వామి తోటి నేరస్థులైన సత్యేన్‌బోసు, కన్నయిదత్తా గోస్వామిపై కసితీర్చుకోవాలని అతనిని హత్య చేయగా వారిద్దరిని ప్రభుత్వం ఉరికంబమెక్కించింది.

**7.2.1.4. పత్రికలు :** బెంగాలులో విప్లవోద్యమానికి దోహదమిచ్చిన మరొక శక్తి - పత్రికలు. వాటిలో ముఖ్యమైనవి 'సంధ్య', 'యుగంతర్' 'వందేమాతరం' పత్రికలు. బలప్రయోగాన్ని బలప్రయోగంతోనే ఎదిరించాలనీ, దేశంలోని ప్రజలంతా ఏకమై ఐకమత్యంతో మెలిగితే, విదేశీయులైన బ్రిటిష్ వారు వెంటనే దేశం నుంచి వెళ్లడం తథ్యమని ఈ పత్రికలు పదే పదే చెప్తూ ఉండేవి. పత్రికలు, సమితులు చేసిన ప్రచారం మూలానా అనేక మంది యువకులు విప్లవ కార్యకలాపాలలో పాల్గొన్నారు. కొన్ని సంఘటనల్లో ఈ విప్లవకారులు పట్టుబడి రాజద్రోహం నేరం కింద కఠిన శిక్షలకు గురి అయ్యారు.

**7.2.1.5. ఖుదీరామ్ బోస్, ప్రఫుల్ల చాకే :** ఆ రోజుల్లో కలకత్తాలో కింగ్‌ఫోర్డు అనే మెజిస్ట్రేటు ఉండేవాడు. అనేకమంది రాజద్రోహులను ఈయన శిక్షించాడు. అందుచే అనేకమంది బెంగాలీ యువకులకు అతనిపై చాలా కోపముండేది. వారిలో ఖుదీరామ్ బోస్, ప్రఫుల్ల చాకే ముఖ్యులు. వారిద్దరు మేజిస్ట్రేటును చంపడానికి ప్రయత్నించారు. అతనిని విప్లవకారుల బారినుండి తప్పించడానికి ప్రభుత్వం అతనిని ముజాఫూరుకు బదిలీ చేశారు. ఆ యువకులు ముజాఫూరుకు పోయి అక్కడ కూడా అతడిని వెంటాడారు. కింగ్‌ఫోర్డు బండిని పోలిన బండిలో ఇద్దరు యూరోపియన్ మహిళలు ప్రయాణం చేస్తుండగా ఆ బండిలో ఉంది కింగ్ ఫోర్డు అని భావించివారు. దానిపై బాంబులు విసరగా ఆ స్త్రీలిద్దరు మరణించారు. పోలీసులు వారిని వెంటాడగా ఖుదీరామ్ బోసు వారికి పట్టుబడ్డాడు. ప్రఫుల్ల చాకే తప్పించుకొన్నాడు. కాని వారి బారి నుండి శాశ్వతంగా తప్పించుకోవడం వీలు కాదని, ఎటూ తనకు మరణ దండన విధిస్తారని తానే ఆత్మహత్య చేసుకొన్నాడు. బోసుకు మాత్రం న్యాయస్థానం విచారణ చేసి అతనికి మరణ శిక్ష విధించింది. అతనిని వీరుడని, దేశ స్వాతంత్ర్యానికై ఆత్మార్పణ కావించిన వాడని విప్లవకర్తలు వార్తాపత్రికలవారు బెంగాల్లోనే కాక ఇతర ప్రాంతాల్లో కూడా కొనియాడారు. తన పత్రిక 'కేసరి'లో బోసును ప్రశంసిస్తూ రాసినందుకు తిలక్‌కు రాజద్రోహం కింద 6 సంవత్సరాలు జైలు శిక్షవేసి, మాండలే జైలుకు పంపారు. ఇదే విధంగా 'కాల' అనే పత్రిక సంపాదకుడు కూడా తిలక్ లాగానే రాసినందుకు అతనికి కూడా అలాంటి శిక్షే పడింది.

**7.2.1.6. భూపేంద్ర బోసు :** భూపేంద్ర బోసు తదితరులు బెంగాలు లెఫ్టినెంటు గవర్నరు సర్ ఆండ్రూసును, ఫ్రాన్సెరును చంపడానికై ప్రయత్నించినందుకు భూపేంద్రబోసుకు ద్వీపాంతర శిక్ష విధించడం జరిగింది. పోలీసు డిప్యూటీ సూపరిండెంటును చంపినందుకు సురేష్ ముఖర్జీ, బసంత చటర్జీలు, బలసూరు పోరాటంలో జంతముఖర్జీ, ఛత్రప్రియా దేవు, మనోరంజను, మిరన్‌లు ఉరిదీయబడ్డారు. ఇలాంటి కుట్రలు ఢక్కా, బారిసాలు మొదలైన ప్రాంతాల్లో జరగడం కుట్రదారులు ఉరికంబం ఎక్కడమో ద్వీపాంతర శిక్ష అనుభవించడమో జరిగింది.

**7.2.2. మహారాష్ట్రం :** బెంగాలులాగే మహారాష్ట్రం కూడా విప్లవోద్యమానికి పెట్టింది పేరు. 1857-58 తిరుగుబాటు తర్వాత ఈ ప్రాంతం విప్లవోద్యమానికి పేరు పొందింది.

**7.2.2.1. వాసుదేవరావు ఆనందరావు ఫాడ్కే :** ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో వాసుదేవరావు బలవంతరావు ఫాడ్కే అనే విప్లవవీరుడు ఉండేవాడు. అతడు 1879 లో తిరుగుబాటును ప్రారంభించాడు. దోపిడీలు చేసి ధనమార్జించాడు. ఆ ధనంతో సైన్యాన్ని సమకూర్చాడు. టెలిగ్రాపు, పోస్టాఫీసులను ధ్వంసం చేసి ఆక్రమించుకోసాగాడు. అతడు దీక్షపూని స్వతంత్రం సంపాదించేటంతవరకు బొట్టును పెట్టుకోనని, తలగుడ్డ ధరించనని, క్షౌరం చేసుకోనని నిశ్చయించుకొన్నాడు. 1879 జూలై 20వ తేదీన హైదరాబాదు సంస్థానంలో ఒక దేవాలయంలో ఉండగా ప్రభుత్వం ఇతనిని పట్టుకొని ప్రవాస శిక్ష విధించి ఏడెనుకు పంపింది. కాని అతడు కారాగృహం నుండి తప్పించుకొని పారిపోయాడు. అతడు 1883లో మరణించాడు.

**7.2.2.2. చాపర్కు సోదరులు :** ఇరవయ్యవ శతాబ్దారంభంనందు మహారాష్ట్ర విప్లవోద్యమానికి జీవం పోసినవాడు లోకమాన్య తిలక్. అసలు రాజకీయ ప్రయోజనాలకై హత్యలు కావించడం బెంగాలులో ఆరంభమవడానికి ఎంతో కాలం ముందే పూనాలో ఆరంభమైంది. 1897 లో పూనా నగరంలో ప్లేగువ్యాధి వ్యాపించింది. అప్పుడు మేజర్ రౌండు అతని సహచరుడు అయ్యర్డు ప్లేగు ఉద్యోగులుగా నియమింపబడ్డారు. కాని వారు ప్లేగు వ్యాధిగ్రస్తులపై అతి నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించారు. కోపంతో వారిద్దరిని చాపర్కు సోదరులు చంపారు. ఈ హత్యానేరం నెపంతో వారిద్దరినీ, వానితో బాటు ఇంకొక ఇద్దరిని ఉరితీశారు. తిలక్ మొదటిసారి కారాగృహ శిక్ష అనుభవించింది అప్పుడే. ఆయన ప్రారంభించిన గణపతి ఉత్సవాలు విప్లవోద్యమానికి బీజాంకురాలు. 1906 నుంచి బెంగాలు మహారాష్ట్రం కలసి విప్లవంలో పాల్గొన్నాయి.

**7.2.2.3. విప్లవ సమితులు :** మహారాష్ట్రలో కూడా బెంగాల్లో వలె విప్లవ సమితులు ఏర్పడ్డాయి. వాటిలో 'మిత్రమేల' అనే సమితి చాలా ముఖ్యమైంది. దాన్ని సావర్కారు సోదరులైన గణేశ్, వినాయక్‌లు స్థాపించారు. అటుపిమ్మట అభినవ భారత సొసైటీని కూడా గణేశ్ సావర్కారు స్థాపించాడు. దీనికి భారతదేశంలో అనేక శాఖలు ఏర్పడ్డాయి. ఒకసారి గణేశ్ సావర్కారును ఒక హత్యకేసులో ఇరికించడం జరిగింది. నాసిక్‌లో ఉన్న జాక్సన్ అనే న్యాయాధిపతి అతనికి ద్వీపాంతర శిక్షను విధించి అతడిని అండమానులకు పంపివేశాడు.

వినాయక సావర్కారు అప్పుడే పై చదువుల నిమిత్తం ఇంగ్లండు వెళ్ళాడు. అతనికి అక్కడ కృష్ణవర్మ అనే ఒక విప్లవవాదితో స్నేహం కుదిరింది. కృష్ణ వర్మ లండనులో ఇండియా హౌసు కేంద్రంగా తన విప్లవ కార్యాలను నడిపిస్తూ ఉండేవాడు. ఒకసారి అతడిని పోలీసులు పట్టుకోవడానికి వస్తున్నట్లు తెలిసి లండను నుంచి పారిస్ పారిపోయాడు. అక్కడ నుంచి తన విప్లవ కార్యక్రమాలను నడపసాగాడు. అతనికి సహాయంగా కామాపతి అనునతడు ఇంకా కొంతమంది ఉండేవారు. సావర్కరు కూడా ఇండియా హౌసు విచారణను తను చేపట్టి అక్కడ నుంచి విప్లవ కార్యక్రమాలను సాగిస్తూ ఉండేవాడు. మహారాష్ట్రానికి కొన్ని ఆయుధాలను కూడా పంపాడు. గణేశ్ సావర్కరుకు ద్వీపాంతర శిక్ష విధించినందుకు విప్లవవాదులకు కోపం వచ్చి జాక్సన్ అనే న్యాయాధిపతిని హత్యచేశారు.

కొన్నాళ్ళ తర్వాత వినాయక సావర్కరును ఖైదు చేసి ఒక బ్రిటిష్ నౌకలో భారతదేశానికి తీసుకొస్తుండగా, అ నౌక ఫ్రాన్సులో మార్సెల్సు నౌకాశ్రయాన్ని సమీపించేటప్పటికి సావర్కరు అ నౌక నుంచి గెంతి ఈదుకుంటూ ఫ్రాన్సు దేశంలో తలదాచుకున్నాడు. కాని బ్రిటిష్ పోలీసులు అతడిని వెంటాడి పట్టుకొని తిరిగి నౌకలోకి చేర్చారు. వేరే దేశంలోకి పారిపోయిన ఖైదీని పట్టుకోవడం అంతర్జాతీయ నీతికి విరుద్ధం. పైన చెప్పిన నాసిక్ కుట్రలో అతనికి, అతని అనుచరులకు సంబంధముందని, వారిని యుద్ధాయులుగా నిర్ణయించి భారతదేశానికి తీసుకొని వచ్చారు. వినాయక సావర్కరుకు కూడా ద్వీపాంతర వాస శిక్షను విధించడం జరిగింది. అతను కూడా తన అన్నతో అండమాను దీవుల్లో బంధించబడ్డాడు.

అదే సమయంలో ఎమ్.ఎల్. డింగ్రే లండను ఇండియా కార్యాలయంలో ఉద్యోగి అయిన కర్జను విల్లీని చంపాడు. భారతదేశంలో బ్రిటిష్ న్యాయాధిపతులు విప్లవవాదులపై తీసుకొంటున్న కఠిన చర్యలకు ప్రతీకారంగా కర్జనును హత్యచేశారు. డింగ్రే చేసిన హత్యను ఇంగ్లండులోని విన్‌స్టన్ చర్చిలు లాయడు జార్జి సైతనం ప్రశంసించకుండా ఉండలేకపోయారు. డింగ్రే చర్యల వల్ల భారతదేశంలో పరిస్థితులు బాగులేవని బ్రిటిష్ చక్రవర్తి కూడా గుర్తించాడు. విప్లవవాదుల చర్యలకంతా దేశభక్తియే ప్రేరకమని తెలుసుకోవాలి.

**7.2.3. పంజాబ్ :** విప్లవోద్యమ కేంద్రాల్లో మరొక ముఖ్యమైన రాష్ట్రం పంజాబు. ఏ కేంద్రంలోనైనా విప్లవానికి మూలకారణం ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి. పూనాలో లాగే 1900 తర్వాత 3 సంవత్సరాలు పంజాబులో క్షామం సంభవించింది. దాంతోబాటు ప్లేగువ్యాధి కూడా బాగా వ్యాపించి లక్షలాది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకొన్నారు. ప్రభుత్వం ఈ కష్టాలనేమి పాటించకుండా ప్రజలపై విపరీతంగా పన్నులు విధించినది. భూములపై నున్న ప్రజల హక్కులకు భంగం కల్గిస్తూ అనేక నిబంధనలు పెట్టింది. ఈ కష్టాలు ప్రాణహాని ఓర్వలేని కొంతమంది సభలు జరిపి ప్రభుత్వ చర్యలను ఖండించసాగారు. కాని ప్రభుత్వం అలాంటి వారిపై కఠిన చర్యలను తీసుకొంది. పత్రికలు కూడా ధైర్యంగా ప్రభుత్వాన్ని విమర్శించాయి. ప్రభుత్వం పత్రికా సంపాదకులను కూడా బాగా శిక్షించింది. లాలా లజపతిరాయి. అజిత్ సింగులను నిష్కారణంగా వారు ఈ ఉద్యమంలో పాల్గొనకపోయినప్పటికీ, అనుమానం మీద వారిని ఎటువంటి విచారణ లేక బర్మాలోని కారాగృహంలో 6 నెలలు బంధించింది. విప్లవకారులు ఉద్యమం లేపడానికి మరో కారణం కూడా ఉంది. అదే

బెంగాలు విభజన. ఇలాంటి విభజన పంజాబులో కూడా జరిగి సిక్కులను, ముస్లింలను విడదీయ వచ్చని వారి ఐకమత్యానికి భంగం కలిగించవచ్చని కూడా పంజాబు ప్రజలు భయపడ్డారు.

**7.2.3.1. రహస్య సమితులు :** పంజాబులో కూడా రహస్య సమితులు ఏర్పడ్డాయి. ఈ సమితీల ఉద్దేశం కూడా సాయుధ పోరాటం సాగించి ఉద్యమాన్ని ఫలప్రదం చేయడం. 1904 లో షహరన్ పూరు జిల్లాలో ఒక రహస్య సంఘం ఏర్పడింది. దానికి ప్రధాన కేంద్రం రూర్కి. దాంట్లో అనేక మంది ఇంజనీరింగు విద్యార్థులు సభ్యులుగా చేరారు. దానిలోని ప్రముఖ సభ్యుల్లో విప్లవ నాయకుడిగా ప్రసిద్ధి గాంచిన హరియాళ్, అజిత్ సింగ్ సూఫి, అంబా ప్రసాద్, దీనానాథ్, రాస్ హారీ బోసులు ముఖ్యులు. హరిదయాళ్ ప్రభుత్వం తనను ఖైదీ చేస్తారని భయపడి 1909 లో అమెరికా పారిపోయి తలదాచుకొన్నాడు. ఆ సమితి చేస్తున్న కార్యక్రమాల్లో ముఖ్యమైనవి ఆయుధ సేకరణ, బాంబులను తయారు చేయడం, అధికారులను హత్య చేయడం. 1912 లో భారతదేశ రాజధాని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చినప్పుడు వైస్రాయి హార్డింజ్ ఢిల్లీలో కారులో వెళ్తూ ఉండగా రాస్ హారిబోసు ఆ కారుపై విశ్వాస అనే వానితో బాంబులు వేయించాడు. అటు తర్వాత 1913 లో కూడా లాహోరులోని ఉన్నతాధికారి అయిన గార్డెనుపై కూడా బాంబు ప్రయోగం చేశాడు. ప్రభుత్వం అతనిని పట్టుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. రాస్ హారిబోసు అసలు బెంగాలీ విప్లవాది. అలీపూరు బాంబు కేసులో ఇరుక్కుని బెంగాలు నుంచి తప్పించుకొని ఇలా ఢిల్లీ పంజాబులో తలదాచుకుంటూ తన విప్లవ కార్యక్రమాలను సాగిస్తూ ఉండేవాడు. అతడు విప్లవోద్యమానికి ఎంతో కృషి చేశాడు. ప్రతిసారీ పోలీసులనుండి అతి నైపుణ్యంతో తప్పించుకొనేవాడు. మధ్య కాలంలో ప్రభుత్వానికి విశ్వాస పాత్రుడుగా ఉన్నట్టు నటిస్తే వారికి తనపై అనుమానం కలగదనీ, అప్పుడు తన కార్యక్రమాలు మరింత సులభంగా జరిపించడానికి వీలవుతుందని, తలచి అలీపూరు నుంచి తప్పించుకొని, డెహరాడూను అటవీ శాఖలో ఉద్యోగం సంపాదించుకొని ఉన్నత పోలీసు అధికారులతో సంబంధం ఏర్పరచుకొని వారికి విశ్వాస పాత్రుడైనాడు. అక్కడ రవీంద్రనాధ ఠాగూరు కుటుంబం ఉండేది. వారి పిల్లలకు ఉపాధ్యాయుడుగా కూడా పని చేసేవాడు. హార్డింజి మీద బాంబు ప్రయోగం చేయించింది తానే అయినా ఎంతో అమాయకుడుగా నటించి, హార్డింజి తప్పించుకొన్నందుకు హర్షం వెలిబుస్తూ ఒక బహిరంగ సభకూడా డెహరాడూనులో ఏర్పాటు చేసి దానికి అధ్యక్షత వహించాడు. లాహోరు, ఢిల్లీ హత్యకేసుల్లో అనేక మందికి ఉరిశిక్ష, ద్వీపాంతర వాస శిక్ష పడింది. పోలీసులకు కొంత కాలానికి బోసు సంగతి తెలిసి అతనిని పట్టుకోడానికి వెళ్తే, వారి కంట్లో దుమ్ముకొట్టి మాయమై జపాను చేరుకొన్నాడు. అక్కడ ఒక జపాను మహిళను వివాహమాడినాడు. రెండో ప్రపంచ సంగ్రామమప్పుడు సింగపూరులో భారతీయ సైన్యాన్ని ఏర్పాటు చేసినపుడు దానిలో అతడు ప్రముఖ స్థానాన్ని వహించాడు. అతని తర్వాత సుభాష్ చంద్రబోసు ఆ స్థానాన్ని ఆక్రమించాడు.

**7.2.4. బీహార్, ఒరిస్సా :** బీహార్, ఒరిస్సా రాష్ట్రాలు వెనుకబడ్డ రాష్ట్రాలుగా ఉండిపోయినందున అచ్చట పాశ్చాత్య విద్య అభివృద్ధి చెందినందున అక్కడ విప్లవోద్యమం ఎక్కువ ప్రాముఖ్యత వహించలేదు. పైగా 1911 వరకు అవి బెంగాలు రాష్ట్రంలోనే చేరినందున బెంగాలు సమితిలే ఇక్కడ కూడా పనిచేయసాగాయి. అందుకే ఇక్కడ చెప్పుకోతగ్గ సంఘటనలు ఏవీలేవు.

**7.2.5. ఉత్తరప్రదేశ్ :** ఉత్తర ప్రదేశ్ కూడా బీహారు, ఒరిస్సాల వలె ఈ ఉద్యమాలలో ఎక్కువ పాత్ర వహించలేదు. కాని ఈ ప్రాంతానికి చెందిన రాజా మహేంద్ర ప్రతాపుని గురించి మాత్రం తెలుసుకోవాలి. అతడు హాత్రాసుకు చెందిన సంస్థానాధీశుడు. మిగతా సంస్థానాల లాగే దీన్ని కూడా బ్రిటిష్ వారు స్వాధీన పరచుకొన్నారు. 1905 లో ప్రారంభమైన స్వదేశీ నిష్ఠలను ఎంతో దీక్షతో అనుసరించాడు. 1906 లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు సమావేశానికి కూడా హాజరైనాడు. జాతీయ విద్యను, వ్యాప్తి చేయడానికి బృందావనంలో ప్రేమ మహావిద్యాలయాన్ని స్థాపించి సంగ్రామమప్పుడు ప్రతాప్ యూరపుకు వెళ్ళి అక్కడ భారత విప్లవ యుదాలో చేరాడు.

**7.2.6. దక్షిణ భారతదేశం :** దక్షిణ భారతదేశంలో కూడా విప్లవోద్యమం ఛాయలు బాగానే కన్పించాయి. మద్రాసు రాష్ట్రం మొదటి నుంచి మితవాద రాజకీయాలనే సమర్థిస్తూ వచ్చింది. కాని స్వామి వివేకానంద తన అమెరికా పర్యటనను పూర్తి చేసుకొని భారతదేశానికి వచ్చిన తర్వాత మద్రాసు రాష్ట్రంలో కూడా పర్యటించాడు. అక్కడ తన ఉద్రేక పూరితాలైన ఉపన్యాసాలతో ప్రజల మనస్సు మార్చగలిగాడు. ఆయన ఎక్కువగా హరిజనోద్ధరణ, స్త్రీల ఉద్ధరణల గురించి ప్రస్తావించేవారు. ఈ విధంగా వీరిలో విప్లవ బీజాలు నాటాడు. తారకనాథ దాసు అనే గొప్ప విద్యావేత్త సన్యాసాశ్రమం స్వీకరించి తారకనాథ బ్రహ్మచారి అనే పేరు పెట్టుకొని విప్లవ ఉద్యమాన్ని

ప్రచారం చేయడానికి బెంగాలు నుంచి మద్రాసుకు వచ్చాడు. అందుకుగాను మద్రాస్ ప్రాంతంలో ఒక రహస్య సంఘాన్ని స్థాపించాడు. అందులో అనేక సభ్యులు చేరారు. దానిలో ప్రముఖులైన న్యాయవాది చిదంబరం పిళ్లె, నీలకంఠ బ్రహ్మచారి, వి.వి.యస్ అయ్యరు కూడా సభ్యులుగా చేరారు. చిదంబరం పిళ్లె తన న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి స్వదేశీ ఉద్యమాన్ని ప్రచారం చేశాడు. ఇతడు రహస్య సంఘంలో చేరి ఎంతో శ్రద్ధగా పనిచేశాడు. తిరునల్వేలి జిల్లాలో చిదంబరం పిళ్లె బృందం సాయుధ పోరాటాన్ని తలపెట్టింది. అందుకుగాను అతడు 'వివేకవాణి' అనే తమిళ పత్రికను, నీలకంఠ బ్రహ్మచారి 'సూర్యోదయ' అనే ఇంకో పత్రికను, శ్రీనివాస అయ్యంగారు 'ఇండియా' అనే పత్రికను ప్రకటించారు. 'ఇండియా' పత్రికలో రాజద్రోహాన్ని పురిగొల్పే రచనలున్నాయనే నెపంతో శ్రీనివాస అయ్యంగారుకు **5** సంవత్సరాల ద్వీపాంతరం వాస శిక్ష విధించడం జరిగింది. ఆ రోజుల్లో అనేక మంది విప్లవ భావాలు కలవారు ఫ్రెంచి స్థావరమైన పుదుచ్చేరిని తమ స్థావరంగా ఏర్పరచుకున్నారు. వారిలో ముఖ్యుడు సుప్రసిద్ధ తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి. ఆయన గొప్ప సంఘ సంస్కర్త. వర్ణ విభేదాలు ఆయనకు అసలు గిట్టవు.

**1908**లో చిదరంబరం పిళ్లె సుబ్రమణ్యశివం మొదలైనవారు అరెస్టుకాగా తిరునల్వేలిలోను, ట్యూటికోరిన్‌లోను ప్రజలు తిరుగుబాటు చేసి ప్రభుత్వ భవనాలను కూలగొట్టి, ఆస్తి నష్టం కల్గించారు. అప్పుడు జిల్లా జాయింటు మేజిస్ట్రేటు ఆష్ ప్రజలపై కాల్పులు జరుపవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఆ కాల్పుల్లో అనేకమంది మరణించారు. కోర్టు చిదంబరం పిళ్లేకు, సుబ్రమణ్య శివంకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఇంతటితో ఇచ్చట విప్లవ చర్యలు ఆగిపోలేదు. తర్వాత కొంత కాలానికి నీలకంఠ బ్రహ్మచారి, వంబు అయ్యర్ మరికొందరు కలిసి 'భారత మాత సంఘం'అని ఒక కొత్త విప్లవ సంఘాన్ని స్థాపించారు. వారి ఆరాధ్య దేవత కాళి. వారి కార్యక్రమాల్లో ఒకటి బ్రిటిష్ అధికారులను హత్య చేయడం. **1911** జూన్‌లో మేజిస్ట్రేటు - కలెక్టరుగా ఉన్న ఆష్‌ను వంబు అయ్యరు హత్య చేశాడు. తనకు ఎటూ ఉరి శిక్షపడుతుందని అతడు ఆత్మహత్య చేసుకొన్నాడు. తక్కిన వారు ఇటువంటి హత్యలకు పూనుకోవడానికి ముందే ప్రభుత్వం వారందరిపై తిరునల్వేలి కుట్ర కేసును మోపి నీలకంఠ బ్రహ్మచారికి **7** సంవత్సరాల కఠిన శిక్ష, మిగతా వారికి కూడా శిక్ష విధించారు. అంతటితో మద్రాస్ రాష్ట్రంలో విప్లవ ఉద్యమం అంతరించిందని చెప్పాలి. ఎంతో మితవాది అని పేరు పొందిన మద్రాసు కూడా విప్లవ చర్యల్లో పాల్గొనకుండా ఉండలేకపోయింది.

**7.2.7. విదేశాలలో విప్లవ కార్యక్రమాలు** : ఈ కాలంలో అనేక మంది భారతీయులు తమ విప్లవ కార్యక్రమాలను విదేశాలనుంచి సాగించారు. కొన్ని దేశాలు వారి కార్యక్రమాలకు ఆశ్రయం కల్పించాయి. ఇలా విదేశాల నుంచి విప్లవ ఉద్యమాలను తలపెట్టిన వారిలో ముఖ్యులు సిక్కులు. పంజాబ్‌లోని అనేక మంది సిక్కులు డబ్బు సంపాదించి తమ పిల్లలను బర్మా, మలేషియా, సింగపూరు, థాయ్‌లాండ్, కంబోడియా, ఫిలిఫ్ఫైన్స్, చైనా, కెనడా, యునైటెడ్ స్టేట్ ఆఫ్ అమెరికా దేశాలకు పంపి అక్కడ వ్యాపారాలు చేయించారు. మరికొంతమంది ఆఫ్రికాకు కూడా వెళ్లారు. తమదేశంలో సరైన జీవనాధారం లభించకపోవడం వల్ల వారు కార్మికులుగా పనిచేయడానికి అమెరికాకు వెళ్లారు. వారు తెల్లవారైన అమెరికన్ల కంటే తక్కువ వేతనాలకు పనిచేయడమే కాకుండా, వారికన్నా ఎక్కువ కష్టపడడం వల్ల, అక్కడి వారు వీరినే పనుల్లో పెట్టుకోడానికి ఇష్టపడేవారు. దీని వల్ల తెల్లకార్మికులకు ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయి. విదేశాల్లోని సిక్కులు ఎంతో పొదుపుగా జీవించి, భారతదేశంలోని తమ వారికి ధనం కూడా పంపేవారు. ఈ విధంగా వారికి ఆర్థికంగా ఎంతో సుఖం లభించింది. ఇది తెల్ల కార్మికులకు కష్టమన్పించింది. సిక్కులను, ఇతర భారతీయులను చులకన చేయసాగారు. వారిని సూటిపోటీ మాటలతో బాధిస్తూ, వారిని బానిసలనీ స్వేచ్ఛ అంటే ఏమిటో తెలియని వారిని, ఆత్మ గౌరవం లేని వారనీ, పరాయి ప్రభుత్వానికి లోబడ్డ జాతివారని, మానవత్వం లేని వారని, ఇంకా ఇలాంటి ఎన్నో సూటిపోటీ మాటలు చెప్తూ వారిని అవమానించసాగారు. అదేసమయంలో హరిదయాళ్ అమెరికా వెళ్లాడు. అతడు అమెరికాలోని సిక్కుల, ఇతర భారతీయుల పరిస్థితి అర్థం చేసుకొన్నాడు. వారిలో తెల్లవారిపట్ల ఎంత ద్వేషం ఉందో తెలుసుకున్నాడు. ఇలాంటి వారి సహాయం గనుక తనకుంటే భారతదేశంలోని తెల్లవారిని ఎదుర్కొనడం కష్టం కాదని గ్రహించాడు. జాతి విచక్షణ చేయడం చాలా తప్పని అందుకై పోరాటం గావించడంలో తప్పులేదన్నాడు. భారతదేశంలోని తమ ప్రభుత్వానికి తమ పరిస్థితులు తెల్పుతూ, విదేశీ ప్రభుత్వాలు తమను ఎంత బాధపెడుతున్నారో విన్నవించుకోమన్నాడు. కాని ఫలితం శూన్యం. ఆ రోజుల్లో బ్రిటిష్ సైన్యంలో చాలా మంది సిక్కులుండేవారు. మొదటి ప్రపంచ యుద్ధ ప్రారంభంలో **35**వేల మంది సిక్కులు సైన్యంలో చేరగా, ఒక సంవత్సర కాలంలో వారి సంఖ్య **1** లక్షకు దాటింది. యుద్ధ కాలంలో సిక్కులు విదేశాల్లోని అన్ని ప్రాంతాల్లో ఎక్కడికి పంపితే అక్కడ యుద్ధం చేశారు. వారు యుద్ధంలో

చూపిన ప్రతిభ మెచ్చుకోనివారు లేరు. దీన్ని బట్టి మనం గ్రహించాల్సిందేమంటే, విదేశాలకు పంపినా ఎప్పుడో ఒకప్పుడు తమకు విముక్తి కల్గుతుందని భావించి సిక్కులు బ్రిటిష్ వారితో సహకరిస్తూ ఉండేవారు.

**7.2.7.1. హదిదయాల్ - ఘదర్ విప్లవ సంఘం :** బ్రిటిష్ వారు భారతీయులను సరిగ్గా అర్థం చేసుకోలేదు. బ్రిటిష్ వారి కుశత్వం, స్వార్థం నానాటికి పెరుగుతూనే ఉంది. హరిదయాల్ ఈ విషయాన్ని విదేశంలోని భారతీయులకు బోధిస్తూ, దేశ విదేశాల్లో భారతీయుల కష్టాలకు మూలకారణం భారతదేశ దాస్యమేనని, అందుచే వారంతా దాస్యవిమోచనకై పాటుపడాలని అన్నాడు. అతడు 'ఘదర్' అనే విప్లవ సంఘాన్ని అక్కడ స్థాపించాడు. ఘదర్ అంటే తిరుగుబాటు అని అర్థము. భారతదేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడమే దాని లక్ష్యం. అందుకుగాను అతడు 'ఘదర్' అనే పత్రికను కూడా స్థాపించాడు. ఈ పత్రిక ఇంగ్లీషు, ఉర్దూ, హిందుస్తానీ భాషల్లో ప్రకటించడం జరిగింది. ఈ పత్రికలను చదివి ప్రపంచంలో వివిధ దేశాల్లో ఉన్న భారతీయులు ఉత్తేజితులయ్యారని చెప్పడంలో సందేహంలేదు. ఈ ఘదర్ పార్టీ సాయుధ పోరాటాన్ని సమర్థించింది. ఆ పార్టీ కార్యక్రమాలలో ముఖ్యమైనవి :

1. భారతీయ సైనికుల్లో తిరుగుబాటు ధోరణులను బలపరచడం
2. అధికారులను వారికి సహాయ పడే భారతీయులను హత్య చేయడం
3. జైళ్ళల్లో నిర్బందింతులైన వారిని విడుదల చేయడం
4. ప్రభుత్వ ఖజానాలను దోపిడీ చేయడం
5. ఆయుధాగారంపై దాడి చేసి ఆయుధాలను సంపాదించడం
6. బ్రిటీష్ వారికి శత్రువులైన జర్మనీ, జపాన్ మొదలైనవారి సహాయం పొందడం
7. విదేశాల నుంచి ఆయుధాలను స్వీకరించడం
8. బాంబులను తయారుచేయడం
9. రైళ్ళ పట్టాలను తొలగించడం, టెలీగ్రాఫులను తెంచడం
10. విప్లవ కార్యక్రమాలకు యువకులను ప్రోత్సహించడం

ఈ ఘదర్ సంఘంలో ఎంతో మంది పనిచేశారు. వారిలో ముఖ్యులు బాబు తారకనాధ దాసు V.P. పింగళి, ఖోజీభాను, కర్తారు సింగు, పండిత జగత్‌రాం, బాబా జ్వాలా సింగు, భాయి శోభా సింగు, బాబా మారు సింగు మొదలైనవారు. ఈ సంఘం శాఖ కాలిఫోర్నియాలో కూడా ఏర్పాటైంది. 1913 జూన్ నెలలో భారతీయ విప్లవకారుల ప్రతినిధులు అమెరికా, కెనడాల నుంచి వచ్చి కాలిఫోర్నియాలో సమావేశమయ్యారు. ఆ సందర్భంలో 'హిందూస్థాన్ ఘద్దర్' అనే పత్రికను ప్రచురించాలని నిర్ణయిచండం జరిగింది. దానికి సంపాదకుడు హదిదయాళు. ఇతడి ప్రవర్తన బ్రిటిష్ వారి కెంత మాత్రం నచ్చలేదు. అతడిని ఎలాగైనా ఆరెస్టు చేయాలని కుట్ర పన్నారు. ఏదోసాకుతో 1914 మార్చి 25వ తేదీన అతడు అరెస్టు అయినాడు. కాని 1000 డాలర్లు హామీ ఇవ్వగానే విడుదల అయినాడు. కాని తనను ఏదైనా విషయం మీద ఇండియాకు పంపివేస్తారేమోనని భయపడి అతడు స్విట్జర్లాండుకు పారిపోయాడు. అప్పటికే ఆ దేశంలో విప్లవ నాయకులు శ్యామ్‌జీ, కృష్ణవర్మ, వీరేంద్ర చటోపాధ్యాయ తారకనాధదాసు, చంద్ర చక్రవర్తి మొదలైనవారు. విప్లవ కార్యక్రమాలను సాగిస్తూ ఉన్నారు. హరిదయాళ్, కూడా వారితో కలిసి తన కార్యక్రమాన్ని సాధించడానికి నిశ్చయించాడు.

హరిదయాళ్ అమెరికా వదిలి వెళ్ళిన తర్వాత అతని స్థానాన్ని రామచంద్ర భరద్వాజ్ ఆక్రమించాడు. భారతదేశానికి ఆయుధాలు పంపడానికి అతడు అమెరికాలోని జర్మను రాయబారితో సంప్రదించాడు. కొంత కాలం తర్వాత హిరాంబు లాల్ గుప్త, చంద్ర చక్రవర్తి ఈ

బాధ్యత వహించారు. కాని వారి మధ్య సహకారం లేనందున ఘదర్ కార్యక్రమాలు సాఫీగా సాగలేకపోయాయి. ఘదర్ పార్టీ బలహీనం కావడానికి రెండో కారణం ఏమనగా పసిఫిక్ తీరంలోని కొంతమంది బ్రిటిష్ వారు ఘద్దర్ పార్టీ సిక్కులకు లంచాలిచ్చి భారతీయుల్లో చీలికలు కల్పించారు.

**7.2.7.2. కొమగటమరు :** ఈ సందర్భంలో మరొక సంఘటన ఇక్కడ చెప్పాలి. దీనిని కొమగటమరు సంఘటన అని చరిత్రకారులు చెప్పారు. ఏ రాజకీయాలకు సంబంధం లేని కొంత మంది భారతీయులు భుక్తికై కెనడా వెళ్ళాలని తీర్మానించుకొన్నారు. వారిలో హాంకాంగ్‌లో ఉన్న 165 మంది బాబాగురు దత్ సింగు నాయకత్వంలో కొమగట మారు (Komagata Maru) అనే ఒక జపాన్ ఓడలో కెనడాలో నివాంకూవర్ నగరానికి బయలుదేరారు. ఆ ఓడ మజిలీలు చేసుకుంటూ అక్కడక్కడ ప్రమాణీకులను ఎక్కించుకుంటూ మే నెల 23వ తేదీకు వాంకూవర్ రేవు చేరింది. ఈ ఓడలో మొత్తం 376 మంది ప్రయాణీకులు ఉన్నారు. వారిలో 25 మంది తప్ప తక్కిన వారందరూ సిక్కులు. వారికి ఘదర్ పార్టీకి సంబంధం ఉందని ప్రభుత్వం భయపడి వారిని నానా బాధలకు గురి చేసింది. పాపం ఆ ప్రయాణీకులు వెనుకకు మరలిపోవలసి వచ్చింది. వారు కలకత్తాకు చేరారు. భారత ప్రభుత్వం కూడా వారు ఘదర్ పార్టీ వారే అని నమ్మింది. ప్రభుత్వం వారందరిని ఒక రైలు ఎక్కించింది. పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసింది. వారి బాధలు చెప్పతరం కాదు. వారిలో కొంత మంది తిరగబడగా పోలీసులు కాల్పులు చేశారు. ఈ కాల్పుల్లో 16 మంది మరణించారు. 29 మంది తప్పించుకొని పారిపోయారు. మిగతా 60 మంది పంజాబుకు రైల్లో ప్రయాణం చేశారు. వారిని పంజాబుకు చేరిన తర్వాత నిర్బంధించారు. ఈ విధంగా బ్రిటిష్ వారు భారతీయ విప్లవకారులను నానా బాధలు పెట్టారని చెప్పడానికి 'కొమగటమరు' ఒక ఉదాహరణ. 1925 లో పంజాబులో కాంగ్రెస్ సమావేశమైనప్పుడు సమావేశం జరిగిన ప్రాంతానికి కొమగటు అని పేరు పెట్టారు.

**7.2.7.3. ఒబైదుల్లా :** మౌలానా ఒబైదుల్లా తన అధ్యాపకుడైన మహమ్మద్ ఆల్ హసన్ సలహాపై జమియత్ ఉల్ అన్సార్ అనే సంస్థను స్థాపించాడు. బ్రిటిష్ వారిని భారతదేశం నుండి తొలగించటానికి చేసిన ప్రయత్నంలో మహ్మద్ ఆల్‌హసన్ ఒబైదుల్లాను 1915లో కాబూల్‌కు పంపాడు. ఆఫ్ఘనిస్తాన్ అమీర్, హబీబుల్లా ఖాన్ ఈ వ్యూహం పట్ల ఆశక్తిని ప్రకటించి ఒబైదుల్లాను భారత జాతీయ కాంగ్రెస్‌తో సహకరించవలసిందని సలహా ఇచ్చాడు. డాక్టర్ అన్సారీ సిఫార్సుపై కాబూల్‌లో ఒబైదుల్లా అధ్యక్షతన కాంగ్రెస్ కమిటీని స్థాపించాడు. కొంతకాలం తర్వాత ఈ కమిటీ భారత జాతీయ కాంగ్రెస్ అనుబంధ సంస్థగా వ్యవహరించింది. అదే సమయంలో, కాబూల్ వచ్చిన ఇండో - జర్మన్ ప్రతినిధి వర్గాన్ని అమీర్ ఎక్కువగా ప్రోత్సహించలేదు.

బెర్లిన్‌లో ఏర్పాటు చేసిన భారత స్వాతంత్ర కమిటీ కాబూల్‌కు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపింది. ఈ ప్రతినిధి వర్గంలో, రాజామహేంద్ర ప్రతాప్, మౌలానా ఎర్కతుల్లా ప్రధాన మంత్రిగా, ఒబైదుల్లా భారత వ్యవహారాల మంత్రిగా, తాత్కాలిక భారత ప్రభుత్వాన్ని ఆఫ్ఘనిస్థాన్‌లో స్థాపించారు. భారతదేశం నుండి పారిపోయి కాబూల్ చేరిన పంజాబీ యువకులను, విప్లవ సైన్యంలో అధికారులుగా నియమించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో జర్మనీ, టర్కీలు ఓడిపోవటంతో, విప్లవకారుల ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఒబైదుల్లాను ఆఫ్ఘనిస్థాన్ నుండి బహిష్కరించారు. ఆఫ్ఘనిస్థాన్ నుండి మాస్కోకు, అంకారాకు వెళ్ళాడు. రష్యన్ విప్లవం వల్ల వచ్చిన మార్పులను, మాస్కోలో చూశాడు. అటాటర్క్ ముస్తఫా కెమాల్ పాషా నాయకత్వంలో టర్కీలో ప్రజ్వరిల్లిన విప్లవం వల్ల వచ్చిన మార్పులను చూశాడు. 1939 లో భారతదేశానికి తిరిగి వచ్చాడు. 1944 వరకూ తన సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు.

**7.2.7.4. బర్కతుల్లా :** 1895లో ఇంగ్లండ్ వెళ్ళిన మహమ్మద్ బర్కతుల్లా అచటి భారత జాతీయ వాదులలో సన్నిహిత సంబంధాలను పెంపొందించుకున్నాడు. 1909లో జపాన్ వెళ్ళి ఇస్లామ్ ఫ్రెటర్నిటి అను పత్రికను ప్రచురించాడు. అయితే ఈ పత్రికను జపాన్ ప్రభుత్వం నిషేధించింది. ఇతడు బ్రిటిష్ వ్యతిరేక ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగించి టోక్యోలో ప్రముఖ వ్యక్తిగా పేరుపొందాడు. టోక్యోలో ఇతడు ఉర్దూ అధ్యాపకుడుగా పని చేశాడు. ఇతనిని జపాన్ ప్రభుత్వం ఉద్యోగం నుండి తొలగించిన తరువాత 1914లో బెర్లిన్ వెళ్ళి ఇండియన్ నేషనల్ పార్టీలో సభ్యుడయ్యాడు. ఆఫ్ఘనిస్థాన్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వంలో ప్రధానిగా వ్యవహరించాడు. ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం సహకరించనందువల్ల జర్మనీకి వెళ్ళి అచటి విప్లవకారులతో కలసి ఇండియా స్వాతంత్ర కమిటీలో పని చేశాడు. నమా ఇస్లామ్ అనే పత్రికకు సంపాదకుడుగా వ్యవహరించి నిర్వహించాడు. తన రచనల ద్వారా భారతీయ యుద్ధ ఖైదీలలో బ్రిటిష్ వ్యతిరేక భావాలను రగుల్గొల్పాడు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఐరోపా దేశాలలో పర్యటించి భారత స్వాతంత్ర ఉద్యమాన్ని సమర్థిస్తూ ప్రచారం చేశాడు. 1921 లో రష్యా సందర్శించి తిరిగి జర్మనీకి వచ్చాడు. ఇతడు 1928 లో ప్రవాసంలో ఉండగానే మరణించాడు.

**7.2.7.5. మదామ్ కామా :** 1861లో కామా ధనిక పార్శీ కుటుంబంలో జన్మించింది. 1902 వరకు ఈమె లండన్‌లో నివసించింది. దాదాబాయ్ నౌరోజి, శ్యామ్‌జీ, కృష్ణ వర్మలతో పరిచయం వల్ల ఈమెలో రాజకీయ చైతన్యం కలిగింది. ఈమె 1907 లో పారిస్‌లో స్థిరపడింది. ఈమె స్టట్‌గార్ట్‌లో జరిగిన సోషలిస్ట్ కాంగ్రెస్ సమావేశంలో రాణాతో కలిసి పాల్గొన్నది. ఈమె ఈ సమావేశంలో ప్రసంగిస్తూ బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని దోపిడీ చేస్తుందని ఆరోపించింది. భారతదేశంలో క్షామ, ప్లేగు వ్యాప్తి కావటానికి బ్రిటిష్ ప్రభుత్వానిదే భాద్యత అని ఈమె ప్రకటించింది. ఈమె ఫ్రెంచి సోషలిస్ట్ వర్గాలలో పేరు సంపాదించింది. లండన్‌లోని సుప్రసిద్ధ విప్లవకారులతో ఈమె సన్నిహితురాలైంది. పారిస్‌లో హర్‌దయాల్, షక్లాత్ వావాతో మైత్రిని పెంపొందించుకున్నది. ఈమె సాయుధ విప్లవాన్ని సమర్థించి తన భావాలను ప్రచారం చేయటానికి వందేమాతరం అను పత్రికను ప్రారంభించింది. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఫ్రెంచి ప్రభుత్వం కామాను నిర్బందించింది. ఈమె యుద్ధం తరువాత ఫ్రెంచి కమ్యూనిష్టులతో చేతులు కలిపింది. రష్యన్ బోల్షివిక్‌లకు చేరువైంది. పారిస్‌లో 30 సంవత్సరాలు ప్రవాస జీవితం గడిపి 1936లో మరణించింది.

**7.2.7.6. రాజమహేంద్ర ప్రతాప్ :** ప్రతాప్ 1914 లో భారతదేశం నుండి విదేశాలకు వెళ్ళాడు. బెర్లిన్‌లో ఇండియన్ సొసైటీలో చేరాడు. 1915లో టర్కీ - జర్మన్ ప్రతినిధి వర్గంతో ఆఫ్ఘనిస్తాన్‌కు ప్రతాప్ వెళ్లాడు. అచట తాత్కాలిక ప్రభుత్వంలో ప్రధాని అయ్యాడు. తిరిగి ఇతడు యూరప్‌కు వెళ్ళి 1947లో స్వాతంత్రం వచ్చిన తరువాత భారతదేశానికి వచ్చాడు.

**7.2.7.7. వీరేంద్రనాథ్ ఛటోపాధ్యాయ :** సరోజిని నాయుడు సోదరుడైన వీరేంద్రనాధ్ ఉన్నత విద్యను అభ్యసించటానికి ఇంగ్లండ్ వెళ్ళి సావర్కర్‌ను కలిసి విప్లవ కార్యక్రమాలలో పాల్గొన్నాడు. ఇంగ్లండ్‌లో తర్వార్ అనే విప్లవ పత్రికకు చాలా కృషి చేశాడు. పారిస్‌లో కామా వర్గానికి చేరువయ్యాడు. 1914లో బెర్లిన్‌లో స్థాపించబడిన ఇండియా స్వాతంత్ర కమిటీకి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. రష్యన్ విప్లవం ప్రారంభమైన తరువాత స్వీడన్, బెర్లిన్ కమిటీ శాఖను ప్రారంభించటానికి వెళ్ళాడు. స్వీడన్‌లో ప్రముఖ బోల్షివిక్ నాయకులను కలుసుకున్నాడు. మొదటి ప్రపంచ యుద్ధం తరువత సామ్యవాద భావాల పట్ల మొగ్గు చూపాడు.

**7.2.7.8. చంపక్ రామన్ పిళ్ళై :** ఇతడు భారతదేశం నుండి 1908 లో విదేశాలకి వెళ్ళి చివరకు బెర్లిన్‌లో స్థిరపడ్డాడు. ఇతడు జర్మనీ మద్దతుతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అంతమొందించాలని నమ్మాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీలో ఇండియన్ వాలంటీర్ల దళాన్ని స్థాపించాడు. యుద్ధం తరువాత అణగారిన దేశాల లీగ్‌ను స్థాపించాడు. ఈ లీగ్ వలస ప్రాంతాల ప్రజా ప్రతినిధుల సమావేశ వేదిక అయ్యింది.

**7.2.7.9. జతిన్ ముఖర్జీ :** ఇతడు జర్మన్‌ల సహాయంతో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయటానికి ప్రయత్నించాడు. 1915లో బాలాసోర్ వద్ద పోలీసులతో జరిగిన ఘర్షణలో ఇతడు ఆత్మార్పణ చేసుకున్నాడు.

**7.2.7.10. సయాం, చైనా, సింగపూర్ :** 1915లో మరొక సంఘటన జరిగింది. సయాంలోను, చైనాలోను ఉన్న భారతీయులు జర్మనులు సహాయంతో బర్మా చేరారు. అక్కడ నుండి భారతదేశపు ఈశాన్య ప్రాంతాలకు వెళ్ళి, బెంగాలులో యుగంతర్ పార్టీతో కలిసి సాయుధ పోరాటం జరపాలని తలచారు. కాని ప్రభుత్వం వారి ప్రయత్నానికి భంగం కలిగించి, అనేక మంది విప్లవకారులను పట్టుకొని శిక్షించారు. సింగపూరులో ఇలాంటి సంఘటనే జరిగింది. అక్కడ భారత సిపాయి దళం 1915 తిరిగుబాటు చేసి సింగపూరు నగరాన్ని ఏడు దినాలు స్వాధీనం చేసుకొంది. కాని అంతలో బ్రిటిష్ నౌకాదాళం వచ్చి తిరుగుబాటుదార్లను అణచివేసి, వారిని విచారణ చేసి 410 మందికి ఉరి శిక్ష, 125 మందికి కారాగార శిక్ష విధించింది. దీంతో విదేశాల్లోని భారతీయుల విప్లవోద్యమం తాత్కాలికంగా ఆగిపోయింది.

**7.2.7.11. ముగింపు :** విప్లవోద్యమంలో మొదటి అధ్యాయం ముగిసిందని చెప్పాలి. ఈ ఉద్యమంలో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకొన్నారు. జైళ్లలో తోయబడ్డారు. హింసకు ఓర్వలేక ఆత్మహత్యకు పాలుపడ్డవారు కూడా లేకపోలేదు. కొంతమందికి మతి

భ్రమించి పిచ్చివారైపోయారు. కొంతమంది యావజ్జీవ వ్యాధి గ్రస్తులైనారు. ఇలా జరిగిందని వారెవ్వరూ బాధపడలేదు. తమదేశ దాస్య విముక్తి కొరకు ఎటువంటి త్యాగాలైనా చేయడానికి సంతోషం వెలిబుచ్చారు. వీరోత్సాహంతో ఉద్యమాన్ని నడిపారు. ఉద్యమ విజయాన్ని బట్టి గెలుపు ఓటమిని కొలమానం వేయటం సరైంది కాదు. ప్రజల్లోని ధృడనిశ్చయం ఎంత బలమైందోఅదే కొలమానం. అది నూటికి నూరు పాళ్లు కన్పించింది. అనేక మంది విప్లవకారులను ప్రశంసించారు. వారిపై గీతాలు రాశారు. సామాన్య ప్రజలు ఆ పాటలను ఆనందంతోను అంటే అభిమానంతోను పాడేవారు. ఈ ఉద్యమం వల్ల ప్రజలకు ప్రభుత్వం అంటే భయం పోయింది. ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్గింది. అనేక మంది విప్లవోద్యమం ఏదీ సాధించలేదనీ, ఎటువంటి లాభదాయకమైన ఫలితం దానివల్ల కలుగలేదని భావించేవారికి అది తప్పని పై సంఘటనలే చెప్తాయి. హత్యల వల్ల విధ్వంస కార్యక్రమాల వల్ల వెంటనే స్వరాజ్యం లభించదని వారికి తెలుసు. కాని ప్రభుత్వాన్ని బాగా ఇబ్బందులు పెడ్తే ఏనాటికైనా ప్రభుత్వం దేశం విడిచి వెళ్ళదా అని వారి నమ్మకం. 1916 తర్వాత కొంత కాలం విప్లవోద్యమం స్తంభించిపోయింది. గాంధీజీ అసహాయోద్యమాన్ని ప్రారంభించగానే వీరంతా అందులో చేరారు. ఆయన నాయకత్వాన్ని అంగీకరించారు. కాని ఉద్యమాన్ని మధ్యలో ఆపివేయడంతో వారికి ఆశాభంగం కలిగింది. 1923 నుంచి విప్లవ ఉద్యమాన్ని పునఃప్రారంభించారు.

## 7.3 విప్లవోద్యమము - రెండవ ఘట్టము

**7.3.1. హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ :** 1923 నుంచి ప్రారంభమైన విప్లవోద్యమానికి, అంతకు ముందు జరిగిన ఉద్యమానికి కొన్ని భేదాలున్నాయి. ఇంతకు ముందు ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతంలో తమ సంఘాలను ఏర్పర్చుకొని తమ కార్యకలాపాలను జరుపుకొంటూ ఉండేవారు. కాని ఇప్పుడు పంజాబు, బెంగాలు, ఇతర ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాలు చేరి ఒకే సంఘాన్ని ఏర్పాటు చేసుకొని కలిసికట్టుగా ఉద్యమాన్ని నడపాలని తీర్మానించుకొన్నారు. ఈ ఉద్దేశంతో 1928లో ఉత్తర భారతంలో 'హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్' అనేక సంస్థ ఉద్భవించింది. దీనిలో పేరుగాంచిన భగత్‌సింగు, చంద్రశేఖర్ అజాద్, రాజగురు, బటు కేశ్వర దత్తు, సుఖదేవ్, జతీన్ దాసు, అజయిఘోష్ మొదలైన సుప్రసిద్ధ విప్లవకారులు సభ్యులుగా ఉండేవారు. వీరందరూ కార్ల్‌మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని నమ్మినవారు. సాయుధ విప్లవం ద్వారానే దేశ విముక్తి కల్గుతుందని వారి నమ్మకం. మునుపటి వలెనే వారి కార్యక్రమంలో బాంబులను తయారుచేయడం. ప్రజాకంటకులైన ఉద్యోగులను చంపడం, ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టడం సిపాయిలను విద్రోహ చర్యలకు పురికొల్పడం ఉన్నాయి. అప్పుడే ప్రతి దేశభక్తుడు తన ప్రాణానికి తెగిస్తాడనీ, స్వాతంత్ర్య పోరాటంలో దూకుతాడని వారి నమ్మకం. గాంధీజీ సాత్విక విరోధం లాభం లేదని వారి వాదన. వారిలో కొంత మంది బందిపోటు పోరాటం సాగించాలని అన్నారు.

**7.3.2. సచీంద్ర సన్యాల్ :** ఈ విప్లవం ఉద్యమానికి జీవం పోసిన వారిలో మరొక ముఖ్యుడు సచీంద్ర సన్యాల్. అతడు బింది జవాన్ అనే పుస్తకాన్ని రాశాడు. అనేక మంది ఆ పుస్తకాన్ని చదివి అతని భావాల ద్వారా ప్రభావితులై ఈ ఉద్యమంలో పాల్గొనడానికి నిశ్చయించుకొన్నారు. గాంధీజీ తన అసహాయోద్యమాన్ని నిల్పి వేయగానే అతి ఉత్సాహవంతులైన యువకులు నిరుత్సాహ పడకుండా వారందరికీ తన ఉద్యమంలో చోటు చూపించాడు. 1924 లో అతడు రహస్య స్థావరానికి వెళ్ళి పోయి తను ప్రారంభించిన ఉద్యమాన్ని జోగేష్ చంద్ర చటర్జీకి అప్పగించాడు.

**7.3.3. చంద్రశేఖర్ అజాద్ :** చంద్రశేఖర్ అజాద్ 13-14 సంవత్సరాల వయస్సులో ఇంటి నుండి పారిపోయి కాశీ నుండి బొంబాయి వెళ్ళాడు. అక్కడ కూలిపనిచేసి, కష్టపడి పనిచేయటం అంటే ఏమిటో తెలుసుకున్నాడు. కొంత కాలమైన తరువాత కాశీకి వచ్చి సంస్కృతం నేర్చుకోవాలని తలచాడు. కాని అతడు అందులో అంత శ్రద్ధ చూపలేదు. గాంధీజి ఉద్యమంలో చేరి వాలంటీరుగా పనిచేశాడు. అతడిని అధికారులు పట్టుకొని కోర్టులో హాజరుపెడ్తే, న్యాయాధికారి అతనిని నీ తండ్రి పేరేమని అడిగితే "స్వాధీన్" అని ఇల్లెక్కడ అని అంటే "జైలు" అని జవాబిచ్చాడు. ఇది తల తిక్క జావాబుగా తలచి న్యాధికారి అతనికి 15 కొరడా దెబ్బల శిక్ష విధించాడు. జైల్లో అతడు శిక్షను అనుభవించాడు. ఒక్కొక్క దెబ్బ పడినప్పుడు అతడు "మహాత్మా గాంధీకి జై" అనే నినాదాలు చేస్తూ వచ్చాడు. "మర్యాద" అనే వార్తా పత్రికలో అతని ఫోటో, అతడు ప్రదర్శించిన ధైర్యం గురించి ప్రశంస ఎంతో పెద్దదిగా వచ్చింది. అతనిని ఊరేగించి, పెద్ద సభ జరిపి అతనిని "ధైర్యశాలి అజాద్" అని ప్రజలు పొగిడారు. అజాద్ ప్రభుత్వ ఉద్యోగులను తుదముట్టించాలని తీర్మానించుకున్నాడు.

**7.3.4. గోపీనాధ సాహా :** ఆ రోజుల్లో బెంగాల్లో సర్ ఛార్లెస్ టిగార్టు అనే ఇన్‌స్పెక్టరు జనరల్ ఆఫ్ పోలీసు ఉండేవాడు. అతడు విప్లవకారులకు సింహస్వప్నం. అతడిని చంపడానికి అజాద్ గోపీనాధ సాహా అనే యువకుని నియోగించాడు. అతడు తన తుపాకీతో అతడిని కాల్చబోయాడు కాని గురితప్పి అతనికి బదులుగా 'డే' అనే మరొక యూరోపియన్ ఉద్యోగికి తగిలింది. అతడు వెంటనే మరణించాడు. ప్రభుత్వం గోపీనాధ్‌కు మరణ దండన విధించింది. ప్రజలు అతడిని ఎంతగానో ప్రశంసించారు. బెంగాలు రాష్ట్రీయ సమావేశంలో చిత్తరంజన్‌దాసు, గోపీనాధుని వీర్యం ప్రశంసార్హని ప్రతిపాదించాడు. సమావేశమైనవారు ఈ ప్రతిపాదనను ఆమోదించారు. గోపీనాధుని కోర్టులో హాజరు పెట్టినపుడు అతని మాటలు అతని దేశభక్తిని వేనోళ్ల చాటుతుంది. తనతోటి యువక బెంగాలీలంతా అతడు నడిచిన దారిలో నడువమన్నాడు.

**7.3.5. సూర్యసేన్ :** విప్లవ నాయకుల్లో మరొకడు సూర్యసేన్. ఇతడు కూడా హిందూస్థాన్ రిపబ్లికన్ సంఘ సభ్యుడు. గోపీనాధ్‌డేను చంపిన కాలంలోనే ఇతడు చిట్టగాంగ్ రైల్వే స్టేషన్ మీద దాడిచేసి చాలా పెద్ద మొత్తాన్ని దోచుకున్నాడు. 1930 ఏప్రియల్ 30వ తేదీన చిట్టగాంగ్‌లో అనేక చోట్లలో పోలీసు ఠాణాల మీద, ఆయుధాగారాల మీద ఒకేసారి దాడిచేయాలని సూర్యసేన్ సంకల్పించాడు. అతడు అతని సహచరులిద్దరు చిట్టగాంగ్‌లోని ఆయుధాగారంపై దాడిచేసి అక్కడ కావలిదారుల్లో ఇద్దరిని చంపి ఆయుధాలను దోచుకొని, ఆయుధాగారానికి నిప్పంటించారు. టెలిఫోను తీగలను తెంపివేశారు. పోలీసు ఠాణా లోపలకు వెళ్ళి సూర్యసేను, తన అధ్యక్షతలో జాతీయ ప్రభుత్వం నెలకొల్పాను అంటూ ప్రకటించాడు. అప్పుడొక పెద్ద పోలీసు దళం అతనిని అతని అనుచరులను ముట్టడించింది. వారంతా అక్కడనుంచి పారిపోయి జలాలా కొండల్లో తలదాచుకొన్నారు. కాని పోలీసుదళాలు వారిని అక్కడ కూడా వెంటాడాయి. పోలీసు దళాలకు వారికి మధ్య యుద్ధం జరిగింది. మూడు గంటల సేపు జరిగిన యుద్ధంలో సూర్యసేను పక్షంవారు 11 మంది, పోలీసు పక్షంలో 64 మంది మరణించారు. సాయుధులై ప్రభుత్వం మీద తిరుగుబాటు చేయడం సుసాధ్యమని సూర్యసేనుకు అతని అనుచరులకు తోచింది. త్వరలో అనేక మంది విద్యార్థులు,యువకులు ఈ ఉద్యమములో చేరారు. తరచు పోలీసులకు విప్లవకారులకు పోరాటాలు జరుగుతూనే ఉండేవి. ఇరుపక్షాల వారు ప్రాణాలు పోగొట్టుకోవడం జరిగేది. అనేక మంది విప్లవకారులు తప్పించుకొని అజ్ఞాత వాసం చేయసాగారు.

కలకత్తాలోని యుగంతర్ పార్టీ కూడ తన కార్యక్రమాలను దీక్షతో సాగిస్తూనే ఉంది. అందులోని కార్యకర్తలు, సభ్యులు అనేక మంది ప్రభుత్వోద్యోగులను చంపారు. వారిలో ముగ్గురు జిల్లా కలెక్టర్లు, ఒక జిల్లా జడ్జి, పోలీసు ఇన్‌స్పెక్టర్, ఒక పోలీసు సూపరింటెండెంటు కూడా ఉన్నారు. సూర్యసేను అనుచరులు 14 మంది పట్టుపడగా వారికి ద్వీపాంతర వాస శిక్ష విధించడం జరిగింది. 1932లో సూర్యసేను అతని అనుచరులు ఒక పల్లెలో దాక్కొన్ని ఉండగా పోలీసులు వారిని ముట్టడించారు. సూర్యసేను ఇద్దరు అనుచరులు తప్పించుకున్నారు. మిగిలిన 9 మంది పోలీసులకు పట్టుబడ్డారు.

ప్రీతిలత అనే అమ్మాయి కొందరు స్నేహితురాంద్రతో కలసి ఒక యూరోపియన్ క్లబ్బు మీద దాడి చేసి ఒక యూరోపియన్ మహిళను హత్య చేసింది. పోలీసులు వారిపై తుపాకులు పేల్చగా 13 మందికి గాయాలు తగిలాయి. ప్రీతిలత అక్కడికక్కడే విషం మింగి చనిపోయింది. పోలీసులు సూర్య సేనును వెంటాడుతూనే ఉన్నారు. ఒకసారి అతడు పోలీసుల నుంచి తప్పించుకొని ఒక తటాకంలో దాక్కొని ఉన్నప్పుడు గూర్ఖా ఒకడు అతనిని పోలీసులకు పట్టించాడు. విప్లవకారులు గూర్ఖాను చంపివేశారు. సూర్యసేనుకు మరణ శిక్షను విధించారు. అతడి మరణంతో విప్లవోద్యమం పడిపోయిందని చెప్పాలి.

**7.3.6. రామ ప్రసాద్ :** రామ ప్రసాద్ మరి తొమ్మిది మంది నాయకులు షహరన్‌పూరు లక్నో మార్గంలో వెళ్లే రైలులో ఎక్కారు. ఇది 1925లో జరిగింది. ఆ రైలు కాకోరి స్టేషను సమీపించగానే వారు రైలు గొలుసు లాగి, రైలు ఆగిపోగానే గార్డు పెట్టెలో ప్రవేశించి లక్షల సొమ్మును అపహరించారు. అధికారులు ఎలాగో వారి అచూకీ తెలుసుకొని 41 మంది పై కేసు పెట్టి ఒక సంవత్సర కాలం విచారణ జరిపించి, నలుగురికి ఉరి శిక్ష నలుగురికి ద్వీపాంతర వాస శిక్ష, మిగతావారికి సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రజలు ఈ శిక్షలను తగ్గించమని ఆందోళన చేశారు. కాని లాభం లేకపోయింది. ఉరిశిక్ష విధించిన వారిలో రాంప్రసాదు ఒకడు. అతడిని 1920లో ఉరితీశారు. 'బ్రిటిష్ సామ్రాజ్య పతనం నా లక్ష్యం' అంటూ ప్రాణార్పణం చేశాడు.

**7.3.7. అల్లూరి సీతారామరాజు :** దేశాన్ని, విదేశాలనూ కూడా కుదిపివేసిన సంఘటన ఆంధ్రదేశంలో జరిగింది. అదే అల్లూరి సీతారామరాజు తిరుగుబాటు. ఇతడు పశ్చిమ గోదావరి జిల్లాలో మొగ్గలు గ్రామంలో క్షత్రియ కుటుంబంలో **1897** సంవత్సరంలో జన్మించాడు. అతనికి బడికి వెళ్ళి చదువుకోవడం ఇష్టం లేదు. గుర్రపు స్వారీ, ఆయుధాలను ప్రయోగించడం మొదలైన క్షత్రియోచితములైన విద్యలనే నేర్చుకొన్నాడు. అతడు ఎక్కువ కాలం పర్వత ప్రాంతాల్లో నివసించే ప్రజల మధ్య సంచరిస్తూ ఉండేవాడు. వారితో కలసి మెలసి తిరుగుతూ, తాగుడు ఇతర వ్యసనాలను మాన్పించి వారికి ఎన్నో సదుపాయాలను కల్పించాడు. పంచాయితీలను ఏర్పరచి వారి తగాదాలన్నీ అక్కడే పరిష్కరించుకొనేటట్లు చేశాడు. ఆ ప్రాంతాల్లోని ప్రజలు గిరిజనులు. అడవుల్లో పశులు మేపుకోవడం, చెట్టు కొమ్మలు కోసుకోవడం, అడవుల్లో తమకు ఉపయోగపడే వస్తువులను సేకరించడం మొదలైన వారి వృత్తులు. వారు అమాయకులు, సరళ స్వభావులు, సీతారామరాజుకు ఆ ప్రాంతం నందున్న ప్రజలు నచ్చారు. **1920** లో సీతారామరాజు కలకత్తాలో జరిగిన కాంగ్రెసు సమావేశానికి హాజరయ్యాడు. అక్కడ అందరూ స్వరాజ్యం గురించి దాన్ని సాధించడం గురించి మాట్లాడారు. సీతారామరాజుకు కూడా స్వరాజ్యాభిలాష కల్గింది. **1920 - 22** లో జరిగిన అసహాయోద్యమం తగిన మార్గం కాదని అతనికి అన్పించింది. స్వరాజ్యం అహింసా మార్గం ద్వారా సిద్ధించదనీ, రక్తపాతంతో యుద్ధం వల్లనే అది లభిస్తుందని నమ్మాడు. ఆనాటి అనేక మంది విప్లవ నాయకుల వలె అతడు కూడా యుద్ధం అధర్మమార్గం ఏమీ కాదని, హిందూ ధర్మ శాస్త్రాలు, వేదాలు వాటిని సమర్థిస్తున్నాయని, అందువల్ల హింసా మార్గం అవలంభించాలని అతడు తీర్మానించుకొన్నాడు. ఈ మార్గానికి కొండ ప్రాంతాలు బాగా ఉంటాయని, తన ప్రయోగం అక్కడ చేస్తే బాగుంటుందని తలచాడు. అక్కడ వారిని మచ్చిక చేసుకోవడం కష్టం కాదని తెలుసుకొన్నాడు. వారి పరిస్థితులను, సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకొన్నాడు. వారికి, ప్రభుత్వానికి మధ్య సంబంధాలు బాగా లేవని తెలుసుకున్నాడు. అధికారులు లంచగొండులై వారి దగ్గర నుంచి అన్యాయంగా డబ్బు రాబట్ట సాగారు. ప్రభుత్వం నియమించిన గుత్తదారులు, గిరిజనులచే అడ్డచాకిరీ చేయించుకొని వారి కూలీలు ఎగవేయసాగారు. కాని వారి మొరాలకించే వారెవ్వరూ లేరు. అటువంటి పరిస్థితుల్లో అల్లూరి సీతారామరాజు ఆ ప్రాంతంలో తన స్వరాజ్యోద్యమాన్ని నడపడానికి వచ్చాడు. ప్రభుత్వానికి సీతారామరాజు మీద అనుమానం వచ్చింది. ఇంతకు ముందు వలె అధికారులకు గిరిజనులు లొంగడం లేదు. ఇందులో రాజకీయం కూడా ఉందని భావించి అతనిపై నిఘా ఉంచారు. కాని కొంత కాలానికి వారు అనవసరంగా అతనిని అనుమాచించామని తలచి అతనిని వెంటాడడం మానుకొన్నారు. సీతారామరాజు పథకం కూడా అదే. వారికి తనపై అనుమానం లేకుండా ఉండేటట్లు ప్రవర్తించినట్లైతే తర్వాత తన కార్యకలాపాలను ప్రారంభించవచ్చని తలచాడు. ప్రభుత్వానికి తనపై అనుమానం తీరగానే మొట్ట మొదటి మెట్టుగా పోలీసు స్టేషన్లపై దాడిచేసి తుపాకులు మొదలైన ఆయుధాలను దోచుకున్నాడు. మొదటి సారిగా అటువంటి దోపిడీ **1922** ఆగష్టు **22**న జరిగింది. అక్కడ ఉన్న పోలీసు ఠాణాల్లోని పోలీసుల సంఖ్య తక్కువగా ఉన్నందువల్ల పైగా వారు అసమర్థులుగా ఉన్నందున ఒక నెల్లో ఎన్నో స్టేషన్లను దోచుకొని లెక్కలేని ఆయుధాలను సంపాదించుకొన్నాడు. ఈ దోపిడిలో అతని సహచరుడైన వీరయ్యదొర పోలీసుల చేతిలో పడి ఖైదీగా అవగా సీతారామరాజు అతనిని చెరనుంచి తప్పించాడు. అతనికి వీరయ్యదొరతో బాటు మల్లయ్య దొర, గంటం దొర కూడా ఎంతో సహాయ పడ్తూ ఉండేవారు.

పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. ప్రభుత్వం పసిగట్టి సెప్టెంబరు **3** వ తేదీ అతనిని ఎదుర్కొనడానికి ఒక పోలీసు పటాలాన్ని పంపింది. ఆ పటాలానికి సీతారామరాజుకు పోరాటం జరిగింది. అందులో పోలీసులు ఓడిపోయారు. ఈ విజయంతో అతని ప్రతిష్ఠ పెరిగింది. ఈ తర్వాత కొన్ని వారాల వరకు సీతారామరాజు గ్రామాల్లో తిరిగి తన వారికి కావాల్సిన వస్తువవులనంతా సేకరించాడు. ఒక రోజు అతడు కొండమీద కాళికా దేవికి పూజ చేస్తుండగా పోలీసులు అతనిపై పడ్డారు. కాని అతడు ఎంతో నైపుణ్యంతో వారిని ఎదుర్కొని తరిమి వేశాడు. అక్కడి వారంతా అతనిలో దైవ బలం, దివ్య శక్తి ఉందని నమ్మారు. ఇలాగే మరొక రెండు సార్లు విజయవంతంగా అతడు పోలీసులను ఎదుర్కొన్నాడు. ప్రభుత్వం మలబారు నుంచి పోలీసు దళాన్ని పిల్పించింది. సీతారామరాజు ఎంత సాయుధ పోరాటం చేసినా భారతీయులను పోలీసులైనా సరే చంపకూడదని ఒక నియమం పాటించాడు. సీతారామరాజు వద్ద గొప్ప గూఢాచారి బలగం కూడా ఉంది. వారెప్పటికప్పుడు పోలీసు దళాల గురించి, వారి ప్రయత్నాలు, దాడుల గురించి సమాచారాలు అందవేస్తూనే ఉన్నారు. అతడు అనేక చోట్ల దోపిడీలు, దాడులు చేసి కావల్సిన సామాగ్రినంతా చేరుస్తుండేవాడు. ఒకటి, రెండు పర్యాయాలు అతడు పరాజయం పొందాడు ప్రభుత్వం సీతారామరాజును, వీరయ్య, గ్రామ సోదరులను పట్టి ఇచ్చినవారికి ఘనమైన బహుమతి ఇస్తామని ప్రకటన చేసింది. సీతారామరాజు అతని అనుచరులు ప్రభుత్వానికి దొరక్కుండా నెలల తరబడి పర్వత ప్రాంతాల్లో తిరగసాగారు.

ప్రభుత్వం సీతారామరాజును పట్టుకొవడానికి రూథర్‌ఫోర్డు అనే ఒక స్పెషల్ పోలీసు అధికారిని నియమించింది. అతడు ఆనాటి ఐ.పి.యస్. వర్గంలో అతి సమర్ధుడని పేరు పొందాడు. అతడు అధికాంలోకి రాగానే అనుమానం మీద 200 మంది గిరిజనులను ఖైదు చేశాడు. 1924 మే నెల 6వ తేదీ పోలీసులు సీతారామరాజు 50 మంది బలగంతో తిరుగుతూ ఉంటే అతనిపై బడ్డారు. పోలీసులకు రాజుకు జరిగిన పోరాటంలో రాజు పక్షంలో ఇద్దరు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. మే నెల 7వ తేది పోలీసులు సీతారామరాజు ఉనికిని కనుక్కొని అతనిని ముట్టడించారు. అతడు పరిగెత్తిపోతుంటే అతనిని వెంటాడారు. వారిలో ఒకడు అతనిని తుపాకీ గుండుతో పేల్చి చంపాడని ఒక వార్త. కొంతమంది అతడు సీతారామరాజు కాదన్నారు. కాని చాలా మంది అతడు సీతారామరాజేనని చెప్పారు. అతని శవానికి మే 8వ తేదీ దహన సంస్కారం జరిగింది. అతడు అతని అనుచరులు పట్టుపడడంతో ఈ ఉద్యమం ముగిసింది.

ఆ రోజుల్లో సీతారామరాజు చేసిన త్యాగాన్ని, నడిపిన ఉద్యమాన్ని చాలా మంది హర్షించలేదు. దానికి పితూరి అనే పేరు పెట్టారు. ఆంధ్ర పత్రిక అతని విమర్శిస్తూ 'సీతారామరాజు' అనుసరించిన హింసా విధానం అభిమతం కాదు. అది నెగ్గక పోవడమే కాదు. దేశానికి ప్రజలకు ఎంతో హానికరం అని రాసింది. కాంగ్రెసు కూడా అతనిని మెచ్చలేదు. అతడు కొండ ప్రాంతం వారితో కాక, పట్టణాల్లో గ్రామాల్లో ఉద్యమాన్ని లేపి ఉంటే తప్పక అందరి మెప్పులను పొందేవాడు. రెండు మూడేండ్ల తర్వాత యువకులు అతని పరాక్రమ కృత్యాలను ప్రశంసింపనారంభించారు. 1927 లో అతనిని పరమ పావనుడని, జన నాయకుడని కొనియాడారు. 1929 లో అతడి తృతీయ జయంత్యుత్సవం జరిపినపుడు సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ అభినందన సందేశాలు పంపారు. తర్వాత కాలంలో ఆంధ్రదేశం అతనిని మెచ్చుకోవడమే కాకుండా స్వాతంత్ర్యచరిత్రలో అతడికి ప్రముఖ స్థానమిచ్చింది.

**7.3.8. భగత్ సింగ్ :** ఈనాటికి అందరి నోళ్లలో నలుగుతున్న మరొక గొప్ప విప్లవకారుడు భగత్ సింగ్. అతడు లాలాలజపతిరాయి అనుచరుడు. అతడి పిన తండ్రి సర్దార్ అజిత్ సింగు కూడా మొదటి నుంచీ లజపతిరాయితో ఉద్యమంలో పాల్గొన్నాడు. అతని వారసుడే భగత్‌సింగు. అతడు హిందుస్థాన్ రిపబ్లికన్ సంఘంలో సభ్యుడుగా చేరాడు. 1928లో సైమన్ కమిషనును బహిష్కరిస్తూ దేశంలో ఎంతో అలజడి జరిగింది. లాలాలజపతిరాయి ఈ బహిష్కరణోద్యమంలో పాల్గొన్నాడు. అక్టోబరు 30వ తేదీ తెల్లవారేసరికి 'సైమన్ మరలిపో' అనే ఊరేగింపుకు ఆయన నాయకత్వం వహించాడు. ఆ ఊరేగింపు ప్రశాంతంగానే జరిగింది. సైమన్ కమీషన్ కొరకు వారంతా రోడ్డుకు రెండువైపులా నిలబడి ఉన్నారు. ప్రభుత్వం వారు రోడ్డు మీదకు రాకుండా రెండు పక్కలా ముళ్ల తీగెలు వేయించింది. అనవసరంగా ప్రశాంతంగా ఉన్న ప్రజా సమూహం మీద లాఠీ ప్రయోగం జరిగింది. ప్రజలను అదుపులో పెట్టడానికి జాతీయ నాయకులు ప్రయత్నిస్తుంటే పోలీసులు వారిపై కూడా లాఠీ ఛార్జి చేశారు. సీనియర్ పోలీస్ సూపరింటెండెంటు స్కాటు స్వయంగా ఈ పనికి పూనుకొన్నాడు. అతనికి సాండర్సు అనే ఆఫీసరు సహాయం చేశాడు. లజపతిరాయి మీద పడ్డ దెబ్బలు చెప్పనలవి కాదు. ఆయన ఎన్ని దెబ్బలనైనా సహించాడు. కాని ఒక్క అంగుళమైనా వెనుకకు జరుగలేదు. ప్రతీకారం చేయడానికి కూడా ప్రజలకు ఆయన అనుమతి ఇవ్వలేదు. ఆయన అన్ని దెబ్బలు తిన్నా, రక్తం ఓడుతున్నా, ప్రాణాలు విలవిల లాడుతున్నా లెక్కచేయక ఊరేగింపు వెంట వస్తూనే వున్నాడు. తర్వాత ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, 'మీరు కొట్టే ప్రతి లాఠీ దెబ్బ బ్రిటీష్ సామ్రాజ్యపు కంచుగోడలు బీటలు పడే ఫిరంగులవుతాయి. ఒక నాయకునితో ఆగేదికాదు ఈ పోరాటం ఒక్కొక్క రక్తపు బొట్టుకు ఒక్కొక్క వీరుడు పుట్టి మీ కుక్క గొడుగు సింహాసనం అంతుచూడకమానరు'. అని చెప్పాడు. అవి చెప్పడం కాదు. గర్జించాడని అన్నారు. ఆ దెబ్బలకు క్రమేణ ఆయనలో ధార్ఢ్యం తగ్గిపోయింది. ఆయన మరణం బ్రిటిష్‌వారి మరణానికి దారితీసిందన్నారు. ఆయపై లాఠీ చార్జి చేయించిన అధికారిని తుదముట్టించాలని వారు నిశ్చయించారు. ఆ పని చేయడానికి భగత్ సింగు, చంద్రశేఖర ఆజాద్, రాజగురు, జయగోపాలుడు నియమించబడ్డారు. 1928 డిసెంబరు 17వ తేదీన సాయంత్రం అయిదింటికి లజపతిరాయిని కొట్టిన అసిస్టెంటు సూపిరింటెండెంటు సాండర్సు పోలీస్ స్టేషను నుంచి మోటరు సైకిలుపై వస్తుండగా రాజగురు అతనిపై కాల్పులు చేశాడు. ఆ దెబ్బతో సాండర్సు కిందపడ్డాడు. భగత్ సింగు తన ఆటోమేటిక్ ఫిస్టలుతో వెంటనే ధన్ ధన్ మంటూ సాండర్సు మీద గుండ్లనుపేల్చేడు. సాండర్సు చనిపోయాడు. వీరులంతా పారిపోయారు. ఆ మర్నాడు కొంతమంది యువకులు ఎర్రసిరాతో లజపతిరాయిని కొట్టిన దెబ్బలకు సాండర్సును హత్యచేసామంటూ పోస్టర్లు అంటించారు. జవహర్‌లాల్‌నెహ్రూ ఆత్మకథలో భగత్ సింగును పొగుడ్తూ ఇలా రాసారు. "భగత్ సింగు ప్రఖ్యాతికి కారణం ఆయన చేసిన ప్రభుత్వ విద్రోహ చ్యలు మాత్రంకావు. లాలాలజపతిరాయ్ మరణం ద్వారా మన దేశానికంతటికీ జరిగిన అవమానానికి బదులు తీర్చుకొన్నాడు. భగత్ సింగ్ దేశ చరిత్రలో అమరుడు.

సాండర్సు హత్య చేయబడ్డ తర్వాత లాహోర్‌లోని పోలీసువారు ప్రజలపై చాలా కఠిన చర్యలు తీసుకొన్నారు. వీరు పడరాని కష్టాలు పడ్డారు. కొంత మంది ఈ కష్టాలకు ఓర్వలేక ఆత్మహత్య కూడా చేసుకొన్నారు. వారు విప్లవకారులను తిట్టడం మొదలు పెట్టారు. విప్లవ కారులు తాము చేయాల్సింది చేస్తూ దాక్కొంటూ, తప్పించుకొంటూ తిరుగుతూ ఉంటే, ఏమీ సంబంధంలేని ప్రజలు నానా కష్టాలకు గురి అవుతున్నారని వారు విప్లవ వీరులను నిందించారు. భగత్‌సింగుకు వారి మొర వినిపించింది. వారు చెప్పేదాంట్లో కొంచెం సత్యం లేకపోలేదన్నాడు. అందుకే దేశాన్నంతా ఆకర్షించేలాగ ఒక విప్లవ కార్యం చేయాలని తలచాడు. 1929 ఏప్రియలు 3వ తేదీన శాసనసభ సమావేశం కావల్సి ఉంది. ఆ సమావేశంలో రెండు ముఖ్యమైన బిల్లులు ప్రవేశపెట్టాలని తీర్మానమైంది. అందులో ఒకటి కార్మికులకు వర్తించేది. కార్మికులకు సమ్మె చేసే హక్కును తగ్గించడం, రెండోది కమ్యూనిష్టులను అణచి వేయడం.

1929 ఏప్రిల్ 8వ తేదీ ఢిల్లీలో కేంద్ర శాసనసభ సమావేశమైంది. ఆ రోజు భగత్‌సింగు, అతని అనుచరుడు బతకేశ్వర్ దత్ ఈ శాసనసభకు వెళ్లారు. తన ధైర్యాన్ని చాటడానికి అది మంచి అవకాశంగా కనబడింది. ఫ్రాన్స్‌లో వాలియింట్ అనే విప్లవకారుడు ధైర్యంగా ఫ్రాన్సు శాసనసభలో బాంబు విసిరి మరణ దండనకు సిద్ధపడ్డాడు. భగత్‌సింగు కూడా అదే చేయదలచాడు. తాను ప్రాణ త్యాగానికి సిద్దంగా ఉన్నానని ప్రజలకు తెలియచేయడమే అతని ఉద్దేశం కాని ఎవరినీ చంపాలని కాదు. శాసనసభ మధ్య భాగంలో మొదట భగత్ సింగు తర్వాత బత్‌కేశ్వర దత్తు ఒక్కొక్క బాంబు పేల్చారు. వారు వెంటనే అక్కడ నుంచి తప్పించుకోవడానికి అవకాశం ఉంది. కాని వారు అక్కడే నిలబడి విప్లవం శాశ్వతంగా వర్ధిల్లుగాక సామ్రాజ్య తత్వం పతనమైపోవుగాక అని నినాదాలు చేస్తూ హిందుస్తాన్ సోషిలిష్ట్ రిజబ్లికన్ సంఘపు ఎరుపు కరపత్రాలను రెండింటిని విసిరారు. పోలీసులు వారినిద్దరిని పట్టుకొని అరెస్టు చేసి తీసుకుపోయారు. న్యాయస్థానం 1929 మే 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విచారణ జరిపి వారికి ద్వీపాంతర శిక్ష విధించింది. కోర్టులో వారిద్దరూ మాట్లాడుతూ బ్రిటిష్ పరిపాలనను పడగొట్టడం మాత్రమే మా లక్ష్యం కాదు. సామాన్య ప్రజల శ్రేయస్సును వృద్ధి చేయగల వర్గ రహిత సోషలిస్టు సమాజాన్ని స్థాపించడం కూడా మా లక్ష్యం అని పేర్కొన్నారు.

**7.3.9. కమ్యూనిష్టులు :** రష్యాలోని 1917 అక్టోబరు విప్లవం భారత స్వాతంత్ర్యోద్యమం పైన గొప్ప ప్రభావం కల్గించింది. కమ్యూనిష్టుల ఉద్యమం దాని వల్లనే ఆవిర్భవించింది. లెనిన్ వలస రాజ్యాల్లోని ప్రజల బాధలు, వారు జాతీయ విముక్తికై లేవదీసిన ఉద్యమాలను శ్రద్ధతో గమనించాడు. ఆయన రష్యన్ సామ్రాజ్యంలో పరాధీన జాతులుగా ఉన్న ఫినిష్, పోలిష్, ఎస్తోనియా జాతులకు, మధ్య ఆసియా లోని తజిల్, కర్బిజ్, కజాక్ మొదలైన ముస్లిం జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం ఇచ్చాడు. జార్ ప్రభుత్వం ఒకప్పుడు ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ మొదలైన సరిహద్దు దేశాల నుంచి లాక్కొన్న భూభాగాలను వారికి తిరిగి ఇచ్చివేశాడు. ఈ విధానం మన నాయకుల్ని ఎంతో ఆకర్షించింది. లెనిన్ భారత ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎప్పటికైనా భారత జాతీయులు నిద్రమేల్కొని, రష్యన్ కామ్రేడ్లు అడుగుజాడలో పయనించి తీర్తారని చెప్పారు. ఈ మార్పులు, ప్రకటనలు మన జాతీయనాయకుల్ని ఉత్సాహపరిచాయి. అనేక మంది ఘదర్ పార్టీలో సభ్యులుగా ఉండి, రష్యా విప్లవం తర్వాత కమ్యూనిష్టులుగా మారారు. వారిలో ముఖ్యులు రతన్ సింగు, సంతోష్ సింగు, సోహన్ సింగు, దర్శి చెంచయ్య మొదలైన వారు. లెనిన్‌తో సన్నిహిత సంబంధంగల విప్లవకారుడు ఎమ్.ఎన్.రాయ్ డాంగే కూడా గొప్ప కమ్యూనిస్టు. ఆయన 1922 లో సోషలిస్టు అను ఒక పత్రికను నడిపాడు. భారతదేశంలో ఏర్పడిన మొదటి కమ్యూనిస్టు పత్రిక అదే. ఆనాటి నుంచే కమ్యూనిస్టు పార్టీ దేశంలో అంచెలంచెలుగా పైకి రాసాగింది. 1929 ప్రారంభంలో ప్రభుత్వం కమ్యూనిష్టు కార్యకలాపాలను అణిచివేయాలని ప్రయత్నించింది. పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్సును కూడా జారీ చేసింది. ఈ కమ్యూనిష్టుల వల్ల ప్రజలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయని, వారిని అరికట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1929 మార్చిలో 32 మంది నాయకులను అరెస్టు చేసి జైలులో బంధించింది. వారిని బంధించడానికి కారణం ఏమంటే, వారు బ్రిటిష్ చక్రవర్తి అధికారాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు, కాబట్టి I.P.C. 21A సెక్షను కింద ప్రభుత్వంపై కుట్ర పన్నుతున్నారనే కారణం వల్ల వారిని అరెస్టు చేయడమైందని చెప్పారు. వీరిని మీరట్ లో విచారణ చేసినందున దానికి మీరట్ కుట్ర కేసు అని పేరు వచ్చింది. శిక్షను పొందినవారంతా కమ్యూనిష్టులని ప్రభుత్వం పేర్కొంది. కాని అందరూ కమ్యూనిష్టులు కాదు. అనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని కూలదోయడానికి ప్రయత్నించారని భారతదేశంలోని కార్మిక, కర్షక, శ్రామిక ఇతర ప్రజానీకాన్ని ఈ మీరట్ కుట్ర కేసులో ఇరికించాలని అన్ని పార్టీల వారిని ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇంతమందిని ఒక్కసారి జైల్లో వేయడంతో దేశంలో అలజడి బయలుదేరింది.

**7.3.10. లాహోర్ కుట్ర కేసు :** ఇది ఇలా ఉండగా పోలీసులు లాహోర్‌లో డెబ్భై వేల బాంబులు తయారుచేయటానికి కావలసిన ముడి పదార్ధాలను ఒక ఫ్యాక్టరీలో కనుగొన్నారు. అటువంటి ఫ్యాక్టరీయే మరొకటి షహరన్‌పూర్‌లో చూపారు. దానికి సంబంధించిన అనేక మందిని వారు పట్టుకొన్నారు. వారిలో కొందరు తమ సమాజ రహస్య కార్యకలాపాలను గురించి పోలీసులకు చెప్పడమే కాక, పోలీసు అధికారి సాండర్సును చంపింది భగత్ సింగని కూడా బట్టబయలు చేశారు. వారందరి పైన లాహోర్ కుట్ర కేసు బనాయించటం జరిగింది. భగత్ సింగ్, బతకేశ్వరదత్తులను లాహోర్ జైలుకు తీసుకువెళ్ళారు. విచారణ కాలంలో వారు నిరాహార దీక్షను పూనారు. రెండు నెలలు వారంతా ఉపవాసం చేశారు. ప్రభుత్వం రాజీకి వచ్చి వారికి కొన్ని సదుపాయాలు చేసింది. కాని వారిలో జతిన్ దాసు అనువాడు మాత్రం తన దీక్షను మానక 63 రోజులు ఉపవాసం సాగించి మరణించాడు. అతడు కలకత్తా వాసి అందుకని లాహోర్ నుంచి రైలులో శవాన్ని కలకత్తా తీసుకుపోయారు. దారి పొడుగునా, ప్రతి రైల్వే స్టేషనులో వేల కొద్ది ప్రజలు సమావేశమై అతని పార్థివ శరీరానికి శ్రద్ధాంజలి సమర్పించాలి. స్మశానానికి తీసుకువెళ్లేటప్పుడు 6 లక్షల జనం ఊరేగింపులో పాల్గొన్నారు. ఆ రోజులలో స్వాతంత్ర్య యోధులపై ప్రజలకు ఎంత గౌరవం ఉండేదో దీని మూలంగా తెలుస్తుంది.

కోర్టు కేసును విచారించి భగత్ సింగ్‌కు, సుకదేవ్‌కు, రాజ గురుకు, మరణ దండన విధించింది. తివారీకి, విజయ్ సిన్హాకు ద్వీపాంతర శిక్ష విధించింది.

## 7.4. సుభాష్ చంద్ర బోస్

విప్లవోద్యమ చరిత్రలో ఘనత వహించిన మరొక వ్యక్తి సుభాష్ చంద్రబోస్. ఇతడు 1897 జనవరి 23వ తేదీన కటక్‌లో ఉన్నత మధ్య వర్గ కుటుంబంలో జన్మించాడు. తండ్రి జానకీ నాథ బోసు, తల్లి ప్రభావతి. చిన్నప్పటి నుంచే సుభాష్ ప్రజలకు ఉపయోగపడే కార్యకలాపాల్లో నిమగ్నుడై ఉండేవాడు. తన తండ్రితో చర్చించడానికి పుర ప్రముఖులెందరో ఇంటికి వచ్చే వారు. సుభాష్ వారి చర్చలను శ్రద్ధతో వింటూ ఎంతో లోకజ్ఞానం సంపాదించుకొన్నాడు. తల్లి కూడా అతనికి ఎన్నో విషయాలు నేర్పించింది. బోసు 1919లో ప్రథమ శ్రేణిలో మొదటి వాడుగా బి.ఎ. పరీక్ష పాసయ్యాడు. అప్పటికే అతనికి రాజకీయాల్లో మంచి పరిజ్ఞానం కల్గింది. అతడికి భారతదేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొనాలని ఎంతో కుతూహలం ఉండేది. కాని తండ్రికి బోసు ఐ.పి.యస్ పరీక్షకు చదవాలని ఉండేది. తండ్రి మాట తీసివేయలేక అతడు లండను వెళ్లి ఐ.సి.యస్. పరీక్ష ప్యాసై తండ్రి కోరికనైతే తీర్చాడుకాని, అతనికి ప్రభుత్వోద్యోగం చేయడం బొత్తిగా ఇష్టం లేదు. అందుచేత వెంటనే ఐ.పి.యస్. కు రాజీనామా ఇచ్చాడు.

సుభాష్ చంద్రబోస్ రాజకీయ రంగంలో అడుగు పెట్టడానికి ముందే అతనికి నిర్దిష్టమైన రాజకీయ అభిప్రాయాలుండేవి. స్వాతంత్ర్యం పోరాడి సంపాదించుకోవాల్సిందేగాని పరాయి వారు ఇచ్చేది కాదన్న అభిప్రాయం అతనిలో బాగా నాటుకుంది. భారత స్వాతంత్ర్యం కోసం విప్లవం ప్రారంభించడం అవసరమని తలచాడు. కాని రష్యా నుంచి గాని మరే దేశం నుంచి గానీ విప్లవ సిద్ధాంతాలు నేర్చుకోనవసరం లేదని అతని నమ్మకం. సుభాష్‌కు గాంధీజీ సిద్ధాంతం రుచించలేదు.

సుభాష్ చంద్రబోస్ 1921 లో భారత రాజకీయ రంగంలో అడుగుపెట్టాడు. చిత్తరంజన్ దాస్ నిర్మాణ కార్యక్రమం నిర్వహించే భాధ్యత అతనిపై పెట్టాడు. ఆనాడే ప్రారంభమయ్యే జాతీయ కళాశాల ప్రిన్సిపాల్ పదవీ బాధ్యతను అతడు చేపట్టాడు. సుభాష్ ఎంతో సామర్థ్యంతో తన బాధ్యతను నిర్వహించాడు. దాసు అతని పనిని ఎంతగానో మెచ్చుకొని బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ అధ్యక్ష పదవిలో సుభాష్‌ను ప్రతిష్ఠించాడు. జాతీయ సేవా దళం నాయకత్వం బాధ్యత కూడా సుభాష్ భుజాల పైనే పడింది. బోసు తన పదవిని సద్వినియోగం చేసుకొని చాలా మంది స్వతంత్ర్య సమరయోధులను సంసిద్ధం చేశాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారతదేశానికి వచ్చినప్పుడు కాంగ్రెసు ఆదేశాన్ని అనుసరించి అతని రాకకు నల్ల జెండాలతో నిరసన వెల్లడించినప్పుడు చిత్తరంజను దాసు, మోతీలాలు నెహ్రూలతో పాటు సుభాష్ కూడా ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాడు. దాసు స్వరాజ్యపార్టీ రాజకీయ భావాలను ప్రచారం చేయటం కొరకు 'ఫార్వర్డు' అనే దిన పత్రికను నెలకొల్పి బోసును దానికి సంపాదకునిగా చేశాడు. 1924 లో దాసు కలకత్తా పురపాలక సంఘాధ్యక్షుడుగా ఎన్నిక కాగానే బోసును అతడు ప్రధాన కార్యనిర్వహణ అధికారిగా నియమించాడు. ఏ పని చేపట్టినా బోసు ప్రజల ఆదరణ పొందే నేర్పు కలవాడని, ప్రజాబంధు అని పేరు పొందాడు. ప్రభుత్వానికి బోసు ఈ ప్రజాదరణ పొందడం బొత్తిగా ఇష్టం లేదు. ఒక బ్రిటిష్ పత్రిక

సుభాష్ సామర్థ్యాన్ని గుర్తించి, భారతదేశానికి సమర్థుడైన కార్యదర్శి లభించాడని ప్రభుత్వం సమర్థుడైనఅధికారిని కోల్పోయిందని వ్యాఖ్యానించింది. బోసుకు అప్పటికి 27 సంవత్సరాలు కూడా ఉండవు. అంత చిన్న వయస్సులో కలకత్తా కార్పొరేషన్‌లో ప్రధాన కార్యనిర్వహణ అధికారిగా నియమితుడవగానే తనకు నెలకు వచ్చే జీతంలో సగం దాన ధర్మాలకు కేటాయించాడు. ఈయన హయాంలో కార్పోరేషను కొత్తదారి తొక్కింది. కార్పొరేషన్ సిబ్బందికి ఖద్దరు యూనిఫారం ఇచ్చాడు.

సుభాష్‌కు మొదటి నుంచి విప్లవకారులపై అభిమానం ఉండేది. అవి కాంగ్రెసుకుగాని, గాంధీజీకిగాని నచ్చేది కాదు. ఒకసారి యూరోపియన్ అధికారిని గోపీనాథ సాహా అనే విప్లవకారుడు చంపాడు. అతనికి ఉరిశిక్ష కూడా పడింది. అతడు మరణిస్తూ తాను చిందించిన ప్రతి రక్తపు బొట్టు భారతదేశంలో తిరుగుబాటు బీజాలు వేస్తాయి అని చెప్పాడు. సుభాష్ చంద్రబోసు ఆ విప్లవకారుని సాహసోపేతమైన త్యాగంతో కూడిన చర్యల పట్ల గౌరవభావం వ్యక్తం చేస్తూ ప్రశంసించాడు. గాంధీజీకి అది నచ్చలేదు. లాహోరు జైల్లో నిరాహార దీక్ష గావించి అమరుడైన జతిన్ దాసు మృతదేహాన్ని కలకత్తాకి పంపాల్సిందిగా కోరుతూ బోసు జైలు అధికారులకు 600 రూపాయలు పంపాడు. సుభాష్ ఎప్పుడూ విప్లవ కారుల పట్ల సుహృద్భావాన్నే ప్రదర్శిస్తూ వచ్చాడని చెప్పడానికి పై సంఘటనలను పేర్కొనడమైంది. వారిలో చాలా మందితో ఆయనకు వ్యక్తిగతంగా పరిచయం కూడా ఉంది. బోసు ప్రవర్తన ప్రభుత్వానికి ప్రమాదకరమని భావించి ఒక కొత్త నిర్బంధ శాసనం చేసి రెండు నెల్లపాటు సుభాష్‌ను విచారణ లేకుండా జైలులో నిర్బంధించారు. ఐనా సుభాష్ తన బాధ్యతలను విస్మరించలేదు. కార్పొరేషన్ అధికారులు ఫైళ్లతో సహా జైలుకువచ్చి ఆయనను కలుసుకొని వెళ్లేవారు. ప్రభుత్వం అంతటితో ఆగక ఆయన జైలు శిక్షను పొడిగించి బరంపురం, ఆలీపురం, మాండలే జైళ్లకు ఆయనను పంపారు. మండలేలో ఆయన ఆరోగ్యం బాగా దెబ్బతినడం వల్ల ఆయనను రంగూన్ జైలుకు మార్చారు. ప్రభుత్వం అతని పరిస్థితి విషమించిందని భయపడి చికిత్స కోసం స్విట్జర్లాండు పంప నిశ్చయించుకొంది. అప్పటికే ప్రజలు నానా గగ్గోలు చేయసాగారు. ఇక ఆయన ప్రాణానికి ముప్పు వాటిల్లితే పరిస్థితి ప్రమాదకరంగా పరిణమిస్తుందని ప్రభుత్వం భయపడింది. కాని బోసు స్విట్జర్లాండుకు వెళ్ళడానికి ఇష్టపడలేదు. గత్యంతరం లేక ప్రభుత్వం అతడిని 1927లో విడుదల చేసింది. జైలు నుంచి విడుదల కాగానే స్వరాజ్యపార్టీని నడిపే బాధ్యత అతనిపై పడింది. ఇంతలో మదరాసు, కాంగ్రెస్ మహా సభలో కార్యదర్శిగా బోసు ఎన్నికైనాడు. అంతేకాకుండా బోసు యువకులను ప్రోత్సహించదలచాడు. అతడు అఖిల భారత యువజన సంఘ మహాసభకు ఆహ్వాన సంఘాధ్యక్షుడై మితవాద తత్వాన్ని దూయబట్టి, చారిత్రాత్మకమైన ఉపన్యాసం చేసి యువలోకాన్ని ఉత్తేజపరచి 'నేతాజీ' అయినాడు.

1929లో కాంగ్రెసు లాహోరులో సమావేశమైంది. అది సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని అమోదించింది. వేలాది ప్రజలు, ప్రతినిధులు తమ హర్షాన్ని వెలిబుచ్చారు. కొంత మంది అతివాదులు కూడా ఎంతో సంతోషించారు. కాని ఆ లక్ష్య సాధనకు అనుసరించాల్సిన విధానాన్ని కార్యక్రమాన్ని నిర్దేశించక పోవడం వల్ల, సుభాష్ చంద్రబోస్ ఆ తీర్మానానికి ఒక సవరణను ప్రతిపాదించాడు. సంపూర్ణ స్వాతంత్ర్య లక్ష్య సాధనానికి కాంగ్రెస్ పోటీ ప్రభుత్వాన్ని ఏర్పరచాలని, కర్షకులను, కార్మికులను యువజనులను సమీకరించి సంఘటిత పర్చే కార్యక్రమం తప్పక చేపట్టాలని సుభాష్ తన సవరణలో పేర్కొన్నాడు. వారి వారి నిర్దిష్ట సమస్యల ప్రాతిపదికపై రైతులను, కూలీలను, నిమ్న జాతుల వారిని కూడా చేర్చుకోకపోతే శాసనోల్లంఘన ఉద్యమం జయప్రదం కానేరదని వాదించాడు. కాని సుభాష్ ప్రతిపాదించిన సవరణ కాంగ్రెసు మహాసభ తోసివేసింది. సుభాష్‌తో బాటు ఇతర అతివాదులకు కూడా కాంగ్రెస్‌లో చోటు లేకుండా పోయింది. సుభాష్ నిరుత్సాహ పడలేదు. 1930 జనవరి 2వ తేదీన అతడు కాంగ్రెస్ డెమోక్రటిక్ పార్టీని స్థాపించాడు. సుభాష్ కొద్ది రోజులకే అరెస్టు అయినందున కొత్తపార్టీ పటిష్టంగా పని చేయలేకపోయింది.

లాహోరు తీర్మానం ప్రకారం 1930 జనవరి 26వ తేదీన దేశమంతటా స్వాతంత్ర్య దినంగా పరిగణించటం పట్టణాల్లో బహిరంగంగా మహాసభలు జరిగాయి. ఈ సమావేశాల్లో స్వాతంత్ర్య ప్రకటన చదివి విన్పించి ప్రజలు దానికి కట్టుబాటుగా ఉండేటట్లు ప్రమాణం చేయించడం జరిగింది. కాంగ్రెస్‌లో భేదాభిప్రాయం ఉన్నప్పటికీ సుభాష్ అనుచరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కాని సుభాష్ ఈ వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేక పోయాడు. 1929 ఆగస్టులో ఆయనపై ఏదో ఆరోపణ ఉండి ఆయన ఒక సంవత్సర కాలం తిరిగి 1932-33లో అకారణంగా జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. అతని ఆరోగ్యం బాగా చితికి పోయింది. 1933లో అతనికి చికిత్స నిమిత్తం ఐరోపాకు పోవడానికి అనుమతి ఇచ్చారు. అతడు ఆస్ట్రియాలోని వియన్నాకు వెళ్లాడు. అక్కడ యాదృచ్ఛికంగా విఠల్‌బాయి పటేలును

కలుసుకొన్నాడు. హింసా చర్యల మిషతో గాంధీజీవల్ల ఉద్యమాన్ని నడపడానికి కాలేదని బోసు అన్నాడు. అందుకే భారతదేశానికి విప్లవ నాయకత్వం అవసరమని, కాంగ్రెసులోనే ఒక అతివాద పక్షం నెలకొల్పడం ఎంతైనా భావ్యమన్నాడు. బోసుకు ఆరోగ్యం కుదుట పడగానే ఐరోపా అంతా పర్యటించి భారతదేశ స్వాతంత్ర్యాన్ని గురించి గంభీరోపన్యాసాలిచ్చాడు. సుభాష్ ఆ కాలంలోనే భారతదేశ స్వాతంత్ర్య పోరాటం అనే పుస్తకాన్ని రాసి యూరపులో ప్రచురించాడు. దాన్ని భారతదేశ ప్రభుత్వం నిషేధించింది. ఇతని మాటలు విదేశీయులనెంతో ఆకర్షించాయి. అతడు 1936లో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, అతడు బ్రిటిష్ వారి గురించి విదేశాల్లో దుష్ప్రచారం చేశాడని తిరిగి జైల్లో బంధించారు. కాని 1937లో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయని అందరితోబాటు అతడు కూడా విడుదలయ్యాడు.

1938లో హరిపూర్‌లో కాంగ్రెసు సమావేశమైనప్పుడు సుభాష్‌ను దానికి అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. గాంధీజీయే సుభాష్‌ను ఈ పదవికి ఎంపిక చేశాడు. దీనికి కారణం, సుభాష్ గాంధీజీ చెప్పు చేతల్లో ఉంటాడని తలచాడు. కానీ నిజానికి సుభాష్ ఆయన చెప్పు చేతుల్లో ఉండటానికి సిద్ధంగా లేడు. పైకి ఇద్దరి మధ్యా సహృద్ భావ పూరిత సంబంధం ఉన్నట్లు కన్పిస్తున్నా, ఇద్దరి మార్గాలు వేరని సుభాష్‌కు తెలుసు. సుభాష్ ప్రభుత్వం పట్ల కఠినంగా వ్యవహరించాలని, రాజీలేని పోరాటం సాగించాలని ఉంటే రాజీకోసం ఎదురుచూసే గాంధీజీకి అతని అనుచరులకు అది కోపకారణమైంది. అంతేకాకుండా సుభాష్ భారత ప్రణాలికా సంఘాన్ని నియమించి, భారతదేశ పారిశ్రామికీకరణానికి పథకాలు తయారుచేసే ప్రయత్నాలకు పూనుకొన్నారు. ఇది కూడా గాంధీయులకు ఆగ్రహం కలిగించింది. హరిపూర్ కాంగ్రెస్ మహాసభ ముగిసిన తర్వాత బోసు భారతదేశ మంతటా పర్యటించాడు. తన సామ్యవాద సిద్ధాంతాన్ని గురించి ఎక్కువగా ప్రచారం చేసి లక్షలాది యువతరం వారిని ఆకర్షించాడు.

మరుసటి సంవత్సరం కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సుభాష్‌ను ఎంపిక చేయడం లాభం లేదని గాంధీజీ గ్రహించాడు. తన అంచనా తప్పు అయిందని తెలుసుకున్నాడు. ఆజాద్‌ను నిలబడమంటే ఆయన ఇష్టపడలేదు. డాక్టర్ పట్టాభిని నిలబెట్టారు. పోటీ అనగానే సుభాష్ పంతానికి తానూ నిలబడ్డాడు. ఇప్పుడు కాంగ్రెస్ యుద్ధం, హింసా హింసలకు, లేక అతివాద, మితవాదులకు జరుగుతుందని అర్థం చేసుకోవాలి. ఎన్నిక అనుకొన్నట్లుగానే జరిగింది. సుభాష్‌కు 1580 ఓట్లు, పట్టాభికి 1377 ఓట్లు వచ్చాయి. సుభాష్ గెలిచాడు. అంటే అతివాదులకు గెలుపు అన్నమాట. గాంధీజీకి అది అవమానకరమయ్యింది. తాను కాంగ్రెసు నుంచి తప్పుకున్నాడు. తాను లేకుండా కాంగ్రెస్‌ను సుభాష్ ఎలా నడుపుతాడో చూస్తానని సవాలు చేశాడు. పైగా ఈ కొత్త కాంగ్రెస్ అవినీతి మయమైన సంస్థగా మారిందని బోగస్ సభ్యులతో నిండి ఉందని విమర్శించాడు. మితవాదులందరినీ కాంగ్రెస్‌నుంచి బయటకు రావలసిందిగా గాంధీజీ విజ్ఞప్తి చేశాడు. సుభాష్ కాంగ్రెస్‌లో చీలికలు రాకుండా ఉండాలని ఎంతో ప్రయత్నం చేశాడు.

1939 మార్చిలో త్రిపురలో కాంగ్రెస్ సమావేశం కావలసి ఉంది. అదే సమయంలో రాజకోటలో జరిగిన కొన్ని సంఘటనలపై గాంధీజీ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. కొంత వరకు ప్రజల దృష్టిని త్రిపుర కాంగ్రెస్ వైపు నుంచి మరల్చడానికి ఈ సమయంలో ఆయన ఈ చర్యకు పూనుకున్నాడు. అంతే కాకుండా త్రిపుర కాంగ్రెస్‌కు కూడా ఆయన హాజరు కాలేదు.

అనుకున్న ప్రకారం కాంగ్రెస్ త్రిపురలో సమావేశం అయినది. సుభాష్ చంద్రబోసు అనారోగ్యం కారణం వల్ల తన ఉపన్యాసాన్ని చాలా సంక్షిప్తంగా రాసాడు. ఆ ఉపన్యాసం కూడా తాను చదవలేక తన సోదరుడైన శరత్ చంద్ర బోసును చదవమన్నాడు. వారిద్దరూ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. హరిపూర్ కాంగ్రెస్ కాగానే బోసు చలా పేరుసంపాదించాడని తెలుసుకున్నాం. బోసు తన ఉపన్యాసంలో 6 నెలలలో బ్రిటీష్ వారు తమకు స్వతంత్రం ప్రసాదించకపోతే తిరిగి ఉద్యమం ప్రారంభిస్తామని కాంగ్రెస్ చెప్పాలన్నాడు. అప్పుడే రెండో ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. ఇటువంటి సమయంలో ఇటువంటి తీర్మానం చేయడం సబబుగా లేదని మితవాదులు భావించారు. అప్పటికే అనేక మంది గాంధీకి వ్యతిరేకంగా సుభాష్‌కు ఓటు వేసినందుకు తప్పు చేశామని, ఆయనకు బాధ కలిగించామని చింతించసాగారు. అందుకని ఎవ్వరూ ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయనందున వీగిపోయింది. తనకు గాంధీజీపై విశ్వాసం ఈ విధంగా తెలియపరచారు. ఇంకొక తీర్మానం కాంగ్రెస్ సభ్యులు ప్రతిపాదించారు. అది ఏమంటే కాంగ్రెసు కార్యవర్గ సభ్యులను నియమించేటప్పుడు గాంధీజీ ఎవరిని వేసుకోమంటే వారినే వేసుకోవాలన్నారు. ఇన్ని రోజులూ కాంగ్రెస్ అధ్యక్షునికే వారిని నియమించే హక్కు ఉండేది. సుభాష్ గాంధీజీని ఈ విషయంలో సంప్రదించాడు. కానీ గాంధీ ఒప్పుకోలేదు. తనపై విశ్వాసం లేనప్పుడు తాను అధ్యక్షునిగా ఉండటంలో అర్థం లేదని బోసు తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు.

**7.4.1. ఫార్వర్డు బ్లాకు :** బోసు యువతరం వారిని పోగుచేసి కాంగ్రెస్‌లోని ఒక పార్టీని ఏర్పాటు చేసి దానికి 'ఫార్వర్డు బ్లాకు' అని పేరుపెట్టాడు. బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించటం కోసం స్థాపించబడ్డ అతిపెద్ద పార్టీయే ఇది. తాను నిర్మించిన కొత్త పార్టీ లక్ష్యాలను సుభాష్ ఈ విధంగా పేర్కొన్నాడు.

1. కర్షకుల, కార్మికుల, తదితర జనసామాన్య ప్రయోజనాల కోసం ఈ పార్టీ పని చేస్తుంది. వడ్డీ వ్యాపారుల, భూస్వాముల వంటి స్వార్థపరశక్తుల కోసం ఈ పార్టీ ఏమీ చేయదు

2. భారత ప్రజలు రాజకీయంగాను, ఆర్థికంగాను సంపూర్ణ విమోచన పొందటానికి కృషి చేస్తుంది.

3. దేశంలోని పారిశ్రామిక వ్యవసాయక జీవనాన్ని పునర్నిర్మించేందుకు ప్రణాళికా బద్ధమైన కృషిని సాగించాలని పార్టీ నమ్ముతుంది.

4. గ్రామ పంచాయితీల పాలనలో, గ్రామాలు పునాదిగా పరిపాలనా వ్యవస్థ నిర్మాణం జరుపుతుంది.

5. ఆధునిక ప్రపంచంలో ప్రయోగాత్మకంగా అనుసరించి, అమలు జరుగుతున్న విధానాల ప్రాతిపదికపై ఆర్థిక విధానాన్ని, పరపతి విధానాన్ని రూపొందించడం జరుగుతుంది.

6. భూస్వామ్య విధానాన్ని రద్దు చేస్తుంది. భారతదేశమంతటా ఒకే విధమైన విధానాన్ని అమలు జరుపుతుంది.

7. స్వతంత్ర భారతదేశంలో అరాచక పరిస్థితి ఏర్పడకుండా సమైక్యంగా ఉంచడం కోసం సైనిక శిక్షణ కల్గిన పటిష్టమైన పార్టీ నాయకత్వాన ప్రజాస్వామిక ప్రభుత్వం పనిచేయాలి.

8. భారతదేశానికి ఫెడరల్ ప్రభుత్వం ఉండాలన్నది లక్ష్యం. కొన్ని సంవత్సరాల వరకు దీనికి నిరంకుశాధికారం ఉండాలి

9. భారతదేశ స్వాతంత్ర సాధనకోసం దేశంలోని ప్రచారంతోనే సరిపుచ్చుకోదు. విదేశాలలోను ప్రచారం సాగిస్తుంది. ప్రస్తుత అంతర్జాతీయ సంస్థలను అందుకోసం ఉపయోగించుకొంటుంది.

10. దేశంలోని అభ్యుదయ సంస్థలన్నిటితో సంబంధం కల్గించుకొని వాటినన్నిటినీ ఒక కేంద్ర కమిటీ కింద తీసుకురావడానికి కృషి చేస్తుంది.

కాంగ్రెసు బోసును బహిష్కరించింది. ప్రభుత్వం కూడా బోసును తిప్పలు పెడ్తూనే ఉంది. కలకత్తాలో హార్వేలు శిలా విగ్రహాన్ని తొలగించాలని బోసు ప్రజలు ప్రభుత్వం మీద ఒత్తిడి చేశారు. అది ఒక పెద్ద ఉద్యమమైంది. తీవ్రరూపం దాల్చింది. ప్రభుత్వం ఈ సాకుతో బోసును తిరిగి చెరలో వేసింది. జైల్లో ఆమరణ నిరాహార దీక్ష పూనాడు. అతడిని ప్రభుత్వం జైలు నుంచి విడుదల చేసిందే కాని ఇంట్లో నిర్బంధించింది. భారతదేశంలో ఉంటే తనకు మద్దతు బాగా ఉందని, విదేశాల నుంచి ప్రయత్నం చేయాలని తీర్మానించుకొన్నాడు. ఒక తెల్లవారు జామున ఎవరికి తెలియకుండా అతడు ఇంటి నుంచి అంతర్థానమయ్యాడు. ఇంట్లో ఉన్న వాళ్లకు కూడా ఈ విషయం తెలియదు. అతడు ఎలాగో కాబూలు చేరుకున్నాడు. అక్కడ ఉత్తమ చంద్ అనే భారతీయ వర్తకుడు ఉన్నాడు. అతడికి నేతాజీ అంటే చాలా ఇష్టం, పైగా మాతృదేశాభిమాని. ఎలాగో కష్టపడి 'ముజట్టా' అనే పేరుతో నేతాజీ సుభాష్ బోసుకు ఒక పాస్‌పోర్టు సంపాదించి పెట్టాడు. దాంతో సుభాష్ మార్చి 27వ తేదీ జర్మనీలోని బెర్లిన్ నగరాన్ని చేరాడు. సుభాష్‌కి అహింసా మార్గంలో బొత్తిగా నమ్మకం లేదు. హింసతోటే శత్రువులను ప్రతిఘటించడం ఉత్తమ మార్గమని భావించాడు.

జర్మనీలో కూడా సుభాష్‌కు తను తలచినంత సహాయం దొరకలేదు. ఆ రోజుల్లో జర్మనులకు భారతీయుల సమస్య గురించి ఎక్కువ తెలియదు. భారతీయులను బ్రిటీష్ వారు పరిపాలిస్తున్నారు కాబట్టి వారిద్దరు ఒక పక్షం వారని హిట్లరు జమకట్టాడు. బ్రిటిష్

వారు తనకు శత్రువు కాబట్టి భారతీయులు కూడా తనకు శత్రువులే, ఈ దృష్టితతోనే అతడు భారతదేశాన్ని పరిశీలించాడు. ఎంతో నేర్పుతో, ఓపికతో సుభాష్ చంద్రబోసు హిట్లరుకు భారతదేశ పరిస్థితులు చెప్పి అతనికి మూడు సూచనలు చేశాడు.

1. బెర్లిను నుంచి భారత ప్రజలను బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురు తిరగమని ప్రోత్సహిస్తూ రేడియోలో ప్రసంగం చేయడానికి ఒప్పుకోవడం

2. యుద్ధంలో జర్మనుల చేతిలో ఖైదీలుగా పట్టుబడ్డ భారతీయ సైనికులను విడుదల చేసి తాను ఒక సైన్యాన్ని తయారు చేసుకోవడానికి వీలుకలుగచేయడం. ఆ సైన్యంతో భారతదేశపు పొలిమేరలో బ్రిటిష్ వారితో పోరాటం సాగించడం

3. స్వాతంత్ర్య పోరాటంలో జర్మనులు భారతీయులకు సాయం చేయడం

జర్మనులు మొదటి రెండు సూచనలకు అంగీకారం తెలిపారు. కానీ మూడో సూచన ఒప్పుకోలేదు. అయినా కొంత కాలం జర్మనీలో ఉండి, ఖైదీ అయిన భారత సైనికులను జమచేసి, సుమారు 3 వేల మంది భారతీయులతో ఒక సైనిక దళాన్ని తయారుచేశాడు. అప్పుడప్పుడు జర్మను రేడియో నుంచి భారతీయులనుద్దేశించి మాట్లాడేవాడు. కాని ఇవి అంత సంతృప్తికరంగా తోచలేదు. అందుకని జర్మనీ వారి సహాయంతో అతను జపాన్ వెళ్లాడు. జపాన్ అప్పటికే యుద్ధంలో దిగి బర్మా వరకు స్వాధీనం చేసుకొని ఉంది. ఈ యుద్ధంలో 50వేల మందికి పైగా భారతీయులు జపాను వారికి ఖైదీలుగా పట్టుబడ్డారు. ఆ రోజుల్లో రాసబిహారి బోసు కూడా జపానులో ఉన్నాడు. అతను కూడా అంతకు పూర్వం ఎన్నో పర్యాయాలు బోసును జపానుకు రమ్మని ఆహ్వానించాడు. అక్కడ సైన్యాన్ని తయారుచేసి, దాంతో బ్రిటిష్ వారితో యుద్ధం చేయాలని అతని అభిప్రాయం. రాస బిహారి బోసు అప్పటికే ఒక పెద్ద భారత సైన్యం తయారుచేసి దానికి ఆధిపత్యం వహించి ఉన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం పై తిరుగుబాటుకై ఈ సైన్యం ఉపయోగపడ్తుందని జపాను ముఖ్యమంత్రికి తెలియపర్చినందుకు అతను కూడా తన చేతనైన సహాయం చేస్తానన్నాడు.

**7.4.2. భారత జాతీయ దళం :** రాసబిహారి బోసు ఆహ్వానాన్ని అంగీకరించి సుభాష్ బోసు భారత జాతీయ సేనకు సర్వసేనాధిపత్యం వహించడానికి ఒప్పుకొన్నాడు. సుభాష్ సింగపూర్ వెళ్లాడు. అక్కడ 40 వేల మంది భారతీయ సైనికులను సమకూర్చాడు. అది ఎలా జరిగిందంటే 1942 ఫిబ్రవరి 14వ తేదీ బ్రిటిష్ వారు సింగపూర్‌లో జపాను వారికి లొంగిపోయారు. 40వేల మంది భారత సైనికులు, ఆఫీసర్లు రెండు రోజుల తరువాత సింగపూరులోని ఫారర్ పార్కులో వేచి యున్నారు. అందరినీ బ్రిటిష్ వారు జపాను వారికి యుద్ధ ఖైదీలుగా ఇచ్చి వేయడం ఆ సమావేశానికి కారణం. వారిలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన భారతీయ ఆఫీసర్లు ఉన్నారు. వారిలో ముఖ్యులు నిరంజన సింగు గిల్, మోహన్ సింగు, భాన్ స్లే, కియానీ, సైగల్, షానవాజ్, చటర్జీ, ధిటాన్ మొదలైనవారు. సాధారణంగా అంతర్జాతీయ న్యాయం ప్రకారం వారందరినీ గౌరవప్రదంగా చూడమని శత్రువులకు చెప్పాలి. కాని బ్రిటిష్ వారు వారందరిని అక్కడ వదిలి పెట్టి వెళ్లిపోయారు. ఏ బ్రిటిష్ వారి కోసంఎన్నో సంవత్సరాలు అణకువగా పని చేసి వారికి సహాయం చేశారో, ఆ బ్రిటిష్‌వారే, వారి సంగతి కుక్కలుకన్నా హీనమై పోయినట్లు చేసి వెళ్లిపోయారు. ఈ 40వేల మంది కాక ఇంకా ఎన్నో వేల మంది భారతీయ సైనికులు యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకొన్నారు. అంగ వైకల్యం పొందారు. వారిని గూర్చి ప్రభుత్వం తలవను కూడా లేదు. అన్ని రోజులు బ్రిటిష్‌వారి తరపున మాట్లాడుతూ వారి గెలుపు కోసం తహతహలాడుతూ ఉన్న ఈ ఆఫీసర్లు ఈ సంఘటనతో మారి పోయారు. వారు ఏక కంఠంతో బ్రిటిష్ వారిని దుయ్యబట్టసాగారు. వారంతా భారతదేశ విముక్తికై పాటుపడతామని కంకణం కట్టుకొన్నారు. తమ దేశాన్ని కాపడ్డం, తమ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడ్డం, తమ దేశాన్ని ప్రేమించడం కన్నా కావాల్సిందేమని వారు చెప్పనారంభించారు. వారిలోఇంత గొప్ప పరివర్తన రావడానికి కారణం, జాతీయ నాయకులైన సుభాష్ చంద్రబోసు రాస బిహారి బోసు. వారు ఈ భారతీయులనందరినీ, భారత సైన్యంగా, స్వతంత్ర సైన్యంగా తయారు చేయడానికి జపాను ప్రభుత్వం అనుమతి పొందారు. బ్రిటిష్ వారి దగ్గర తర్ఫీదు పొందిన ఈ సైనికులు యుద్ధం చేయడంలో ఎంత నిపుణులో చెప్పనవసరం లేదు. ఈ సైన్యానికి భారత జాతీయ దళం (Indian National / Army - I.N.A.) అని పేరు. సుభాష్ చంద్రబోసు అన్ని ప్రాంతాలు తిరిగి బోలెడు ధనం, వస్తువులు సేకరించాడు. బోసు అడగడమే తరువాయి ధనం రాసులు రాసులుగా వచ్చిపడింది. హాబిబ్ రహామాన్ అనే వర్తకుడు రంగూన్‌లో ఉండేవాడు. అతడు ఒక కోటి విలువగల నగలు, ధనం ఇచ్చి తను పేదరికాన్ని కొనుక్కున్నాడు. అతనికి స్వతంత్ర భారత ప్రభుత్వం 'సేవక్-ఇ-హింద్' అనే బిరుదును ప్రసాదించింది. ఈ బిరుదును పొందిన ప్రథముడు ఇతడు. శ్రీమతి బేతాయి (Mrs. Batai) అనే గుజరాతీ మహిళ తన వద్దనున్న 30 లక్షల ఆస్తిని

ఇచ్చివేసింది. ఇలా దానం చేసిన వారి సంఖ్య ఇచ్చిన మొత్తం లెక్క పెట్ట శక్యం కాదు. ఈ సైన్యానికి అజాద్ హింద్ ఫౌజు అని కూడా పేరు సుభాష్ సైన్యాన్ని పకడ్బందీగా నిర్మించాడు. దానినొక అధునాతనమైన సైనిక దళంగా రూపొందించాడు.

**7.4.3. అజాద్ హిందు ప్రభుత్వం :** సైన్యంతో బాటు తాత్కాలిక స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉందని బోసు తలచాడు. అలాంటి ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే ఇతర ప్రభుత్వాలతో సమాన ప్రతిపత్తితో ఒప్పందాలు చేసుకోవటం సాధ్యం కాదని తలచాడు. ఈ ఉద్దేశాన్ని అమల్లో పెట్టి 1943 అక్టోబరు 21వ తేదీ అజాద్ హిందు ప్రభుత్వం ఏర్పాటు చేసి దానికి అధినేతగా నేతాజీ సుభాష్ బోసు ప్రమాణ స్వీకారం చేశాడు. ముప్పది కోట్ల భారతీయుల స్వాతంత్ర్యం కోసం తన చివరి నెత్తురు బొట్టు వరకూ ధారపోస్తానని అతడు ప్రతిన పూనాడు. ఆ ప్రభుత్వం ఏర్పడ్డ రెండు రోజులకు జపాను అధికార పూర్వకంగా దాన్ని గుర్తించింది. అమెరికా, బ్రిటనులపై యుద్ధం ప్రకటించాలని అజాద్ హిందూ ప్రభుత్వం ఆ రోజే నిర్ణయించింది. అక్టోబరు 24వ తేదీ ఈ నిర్ణయాన్ని భారత స్వాతంత్ర్య సమితి రేడియో కేంద్రం నుంచి బోసు ప్రకటించాడు. కొన్ని వారాల్లోనే జర్మనీ బర్మా, ఫిలిప్పైన్సు, నాన్ కింగు, క్రీషియా, మంచూకో, సయాం దేశాలు తాత్కాలిక స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని అధికార పూర్వకంగా గుర్తించాయి. దీంతో ఈ ప్రభుత్వానికి అంతర్జాతీయ రంగంలో ప్రభుత్వ స్థాయి ఏర్పడింది.

సుభాష్ హిందుస్థానీని రాజభాషగా చేశాడు. త్రివర్ణ కాంగ్రెసు పతకాన్ని దేశీయ పతకం చేశాడు. జపాను వారు తాము ఆక్రమించుకొన్న అండమాను దీవులను బోసుకు అప్పగించారు. బోసు ఏలుబడిలోకి వచ్చిన మొదటి భారత రాష్ట్రమిదే. జపాను వారి సహాయం లేకుండా బోసు తన సైన్యంతో బ్రిటిష్ వారితో పోరాడాలని నిశ్చయించాడు. మొదట్లో జపాను వారికి అతని సైన్యం మీద నమ్మకం లేదు. కాని చివరకు అతని ప్రోద్బలం వల్ల వారు ఒప్పుకొన్నారు. మా దేశంలోని పరాయి ప్రభుత్వాన్ని మేమే పడగొట్టాలి అని బోసు చెప్పాడు. సుభాష్ సేనలు ముందు నడుస్తుంటే, జపాను సేనలు వారిని అనుసరిస్తూ వెనుక వచ్చాయి. భారత సేనలు రెండు ప్రాంతాల్లో బ్రిటీష్ సేనలను ఓడించాయి. అటు తర్వాత భారతదేశంలో అడుగుపెట్టాయి. ఇది భారత సైనికులకెంతో గర్వకారణమైంది. 'మవుడక్' అనే ప్రాంతంలో బ్రిటిష్ వారితో పోరాడి వారిలో అనేకులను చంపారు. బ్రిటిష్ సేనలు తమ ఆయుధాలను అక్కడే విడిచి పారిపోయారు. భారతీయులు ఆ ప్రాంతాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. జపాను వారి సహాయంతో నాగాలాండులో ప్రవేశించి కోహిమాలో జాతీయ పతకాన్ని ఎగురవేశారు. భారతీయ సేనలో ఇంకొక దళం మణిపూరు వెల్లి దాని రాజధానియైన ఇంఫాలను ఆక్రమించుకొంది. ఇంతలో ప్రపంచ యుద్ధ పరిస్థితులు తారుమారయ్యాయి. అమెరికా వారు ఒక్కొక్క ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొని, జపాను వారిని అన్ని ప్రాంతాల నుంచి ఖాళీ చేయించసాగారు. అమెరికా సహాయంతో బ్రిటన్ తిరిగి బర్మాను గెలుచుకొంది. అటు తర్వాత భారత సైన్యాన్ని పట్టుకొంది. భారత సైనికులు ఈసారి బ్రిటిష్ వారికి ఖైదీలయ్యారు. సుభాష్ చంద్రబోసు జపాను వారి సహాయం పొందడానికి ఒక విమానంలో వెళ్తూ అందులో కాలిపోయాడని చెప్తారు. కొంత మంది అతడు తప్పించుకొని పారిపోయాడని, ఇంకా ఎక్కడో బతికే ఉన్నాడని అంటారు. అందులో ఏ మాత్రం నిజం ఉందో తెలియదుకాని బోసు చరిత్ర అంతటితో ముగిసింది. అతను అంతర్థానమవ్వడం మాత్రం తథ్యం

**7.4.4. వైఫల్యం :** భారత జాతీయ సేనకు లభించిన మద్దతు సరైన పక్షం నుంచి లభించకపోవడం వైఫల్యానికి ప్రధాన కారణం. యుద్ధంలో ఓడిపోతున్న జపాన్ పక్షంలో చేరడం, యుద్ధంలో పాల్గొనడం వల్ల సేన దెబ్బతిన్నది. జపాన్ సహాయంతో భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించాలనే అభిప్రాయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించడం. మరో కారణం జాతీయసేన వద్ద తగినన్ని ఆయుధాలు, నిర్వహణకు తగిన నిధులు లేకపోవడం ఇంకోకారణం. జాతీయ సేనకు, జపాన్ సైన్యానికి మధ్య సరైన సమన్వయం లోపించడం మరో కారణం. జాతీయ సైన్యంపై గెలిచిన బ్రిటిష్ సైన్యానికి అమెరికన్ల నుంచి పెద్ద ఎత్తున సహాయం లభించడం కూడా వైఫల్యానికి మరో కారణం.

భారత జాతీయ సేన వైఫల్యం చెందినప్పటికి భారత జాతీయోద్యమ చరిత్రలో దానికి ప్రత్యేక స్థానం ఉందన్న విషయం నిర్వివాదాంశం. ప్రథమంగా భారత జాతీయ సేన భారత స్వాతంత్ర్య సమస్యను అంతర్జాతీయ రాజకీయ రంగం మీదికి తీసుకు వెళ్ళగిలింది. భారత స్వాతంత్ర్యాన్ని జపాన్, జర్మనీ, ఇటలీ మరో ఆరు దేశాలు గుర్తించడం కారణంగా తరువాత వచ్చిన అంతర్జాతీయ వత్తిడిలో బ్రిటిష్ వారు భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వక తప్పలేదు. భారత సైన్యం ప్రదర్శించిన ధైర్య సాహసాలు భారతీయులందరిలో జాతీయతా భావాలను పురికొల్పాయి. భారతదేశాన్ని దాని సైన్యంతోనే లొంగదీసుకోవడం ఇకపై సాధ్యం కాదని బ్రిటిష్ వారు గ్రహించారు.

## 7.5. ముగింపు :

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో విప్లవ ఉద్యమానికి ఒక ప్రముఖ స్థానం ఉంది. ఉగ్రవాదుల చర్యలు విఫలమైనప్పటికీ, వారికున్న నిస్వార్థం, సేవా భావం సామాన్య ప్రజలను పులకింపచేసింది. సామాన్య ప్రజలలో దేశ భక్తి ఎక్కువ కావడానికి వారి త్యాగాలు కారణమయ్యాయి.

## 7.6. నమూనా ప్రశ్నలు

1. వ్యక్తిగత ఉగ్రవాద విజృంభణకు కారణాలు తెలిపి, దాని స్వభావం, పరిణామాన్ని వివరించుము
2. విదేశాలలో విప్లవ కార్యక్రమాలు వివరింపుము
3. సుభాష్ చంద్రబోస్ కార్యకలాపాలను తెలుపుము
4. భారత స్వాతంత్ర్య పోరాటంలో భారత జాతీయ సైన్య (INA) పాత్రను పరిగణించండి.

## 7.7. చదవదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Bipin Chandra | : | Modern India, |
| 2. | R.C. Majumdar | : | (Ed), Three phases of India's Struggle for Freedom |
| 3. | Percival Spear | : | A History of India, Vol. 2 |
| 4. | Sumit Sarkar | : | Modern India, |
| 5. | Tarachand | : | History of Freedom Movement in India. |


డా॥ వి.కె. మోహన్

యూనిట్ - 5

పాఠం - 5.8

# దేశ విభజన - అధికార మార్పిడి

### 5.8.0. లక్ష్యం :

ఆంగ్లేయులు భారతదేశాన్ని వదిలి వెళ్ళాలని నిర్ణయం తీసుకోవడం, కాబినెట్ రాయబార ప్రతిపాదనలు, ముస్లింలీగ్ ప్రత్యక్షచర్య, దేశ విభజన మొదలగు విషయాలను గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

### విషయసూచిక :


5.8.1. పరిచయం

5.8.2. భారత జాతీయ సైనికుల విచారణ

5.8.3. సైన్యంలో తిరుగుబాట్లు

5.8.4. కాబినెట్ రాయబారం

5.8.5. ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్య

5.8.6. అట్లీ ప్రకటన

5.8.7. మౌంట్ బాటెన్ పథకం - దేశ విభజన

5.8.8. భారత స్వాతంత్ర్యం - 1947

5.8.9. నమూనా ప్రశ్నలు

5.8.10. చదువదగిన గ్రంథాలు


### 5.8.1. పరిచయం :

రెండో ప్రపంచ యుద్ధం సమాప్తమయినా భారతదేశంలో మాత్రం స్వాతంత్ర్యసంగ్రామము ముగియలేదు. ఇంగ్లండులో అంతకు పూర్వం అధికారంలో ఉన్న కన్సర్వేటివ్‌లు ఓడిపోయి లేబర్ పార్టీ 1645 లో అధికారంలోకి వచ్చింది. ఈ పార్టీ మొదట్లో భారతదేశానికి సంబంధించి బ్రిటిష్ విధానంలో ప్రధానమైన ఏ మార్పుకు తావీయలేదు. జూలైలో వేవెల్ ప్రభువు ప్రధాని అట్లీ, భారతదేశ భవిష్యత్తును గురించి చర్చించి క్రిప్స్ 1942 లో చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం అమలు పరుస్తుందని ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలను కూడా ప్రకటించారు. ఈ ఎన్నికల ప్రతిపాదన కొత్త ఏమీ కాదు. ఎన్నికలు ఎప్పుడో జరగవలసి ఉన్నాయి. కాని రెండో ప్రపంచయుద్ధానంతర కాలంలో తీవ్రంగా విజృంభించిన వలస విధాన వ్యతిరేక ఆందోళన భారతదేశంలో ఆంగ్లేయుల విధానాలలో మార్పుకు కారణమైంది. యుద్ధ ప్రభావంగా క్షీణిస్తూ వున్న ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆహార కొరత, కార్మిక కర్షక వర్గాల ఒకానొక నూతన ఆందోళనా తరంగాలకు హేతువయ్యాయి. దేశంలో పలు ప్రాంతాలలో సమ్మెలు, హర్తాళ్ళు, దైనందిన సంఘటనలయ్యాయి. పైగా కార్మిక వర్గ పోరాటానికి, విద్యార్థి వర్గ రాజకీయ ప్రదర్శనలకు సమన్వయమేర్పడింది. కార్మిక సంఘాలలోని విభిన్న రాజకీయ వర్గాల మధ్య సహకారం బలపడింది. దేశంలో రైతుల ఆందోళన కూడా తలెత్తింది.

## 5.8.2. భారత జాతీయ సైనికుల విచారణ :

1945 నవంబర్‌లో మొదలైన భారత జాతీయసైన్యాధికారుల విచారణ మరో ప్రజా ఉద్యమం లేవటానికి కారణభూతమైంది. షానవాజ్ కాన్, గురుదయాల్ సింగ్, ధిలాన్, ప్రేమ్ సైగల్ అను అధికారులకు సైనిక న్యాయస్థానం దీర్ఘ కారాగారవాస శిక్షలను విధించింది. కాని ప్రజలు వీరిని వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టిన యోధులుగా భావించారు. దేశ భక్తులైన భారతీయులలో వీరికి విధించిన కారాగార శిక్షలు ఆగ్రహాన్ని కలిగించాయి. మొదట కలకత్తాలో తరువాత ఇతర పట్టణాలలో దీనికి వ్యతిరేకంగా ఎన్నో ఊరేగింపులు, జరిగాయి. ఇవి రాజకీయ సమ్మెలుగా పరిణమించాయి. కార్మికులు, విద్యార్థులు, వర్తకులు వీటిలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సైనిక న్యాయ విచారణ చేసి ప్రభుత్వం భారత జాతీయ సైనికాధికారులను రాజుకు వ్యతిరేకంగా యుద్ధం చేసిన నేరస్తులుగా ప్రకటించినప్పటికీ, ప్రజా ఉద్యమానికి తలవంచి, ప్రభుత్వం వారిని విడుదల చేయ నిశ్చయించింది.

## 5.8.3. సైన్యంలో తిరుగుబాట్లు :

1946 ఫిబ్రవరిలో బొంబాయిలోని భారత నౌకదళంలోని సభ్యులు తిరుగుబాటు చేశారు. వీరు సైన్యంతోను, నౌకాదళంతోను, ఏడు గంటలు హోరా హోరీగా పోరాడారు. భారత జాతీయనాయకుల సలహా మేరకు వారు లొంగిపోయారు. భారతీయ వైమానిక దళంలోకూడా విస్తృతమైన సమ్మెలు జరిగాయి. పోలీసులు, అధికార యంత్రాంగం కూడా జాతీయతా భావం వైపు మొగ్గుచూపిస్తున్న సూచనలు కనిపించాయి. ఈ సంఘటనలన్నింటితో జాతీయోద్యమాన్ని ఎంతో కాలం అణచివేయలేమని బ్రిటిష్ ప్రభుత్వానికి స్పష్టమైపోయింది.

## 5.8.4. కాబినెట్ రాయబారం :

ప్రజల ఆత్మ విశ్వాసం, ప్రభుత్వ వ్యతిరేక భావన, ప్రజా ఉద్యమాల ఫలితంగా బ్రిటిష్ వారు భారతదేశాన్ని విడిచిపెట్టి వెళ్ళ వలసి వచ్చింది. భారతదేశానికి అధికారాన్ని అప్పగించే విషయంలో షరతుల్ని జాతీయ నాయకులతో చర్చిండానికి గాను 1946 మార్చిలో కాబినెట్ రాయబారాన్ని పంపించారు. విభిన్న రాజకీయ పక్షాల నాయకులతో చర్చలు జరిగిన దరిమిలా ప్రత్యేక పాకిస్థాన్ రాజ్యాన్ని కోరిన ముస్లిం నాయకుల కోర్కెను కాబినెట్ రాయబార వర్గం తోసి పుచ్చింది. కాబినెట్ రాయబార వర్గం 1946 మేలో ఈ క్రింది సూచనలు చేసింది. 1) భారత రాజ్యం రాష్ట్రాల, సంస్థానాల సమితిగా వుంటుంది. రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ మాత్రమే కేంద్ర ప్రభుత్వం పరిధిలో వుంటాయి. రాష్ట్రాలు అత్యధిక స్వయం ప్రతిపత్తిని కల్గి వుంటాయి. 2) బ్రిటిష్ ఇండియాలోని రాష్ట్రాలు మూడు విభాగాలుగా కలిసి వుంటాయి. అవి హిందువులు అధికంగా వున్న ప్రాంతం, ముస్లింలు ఎక్కువగా వున్న ప్రాంతం, ముస్లింలు ఎక్కువగా ఉన్న పశ్చిమ ప్రాంతం, ముస్లింలు అధికంగా వున్న అస్సాం, బెంగాల్ ప్రాంతాలు ఈ మూడు విభాగాలలోని రాష్ట్రాలు వాటి సమాన లక్ష్యాల కోసం, పరస్పర అంగీకారంతో కొత్త విభాగాలుగా ఏర్పడే స్వాతంత్ర్యాన్ని కలిగి వుంటాయి. 3) మత సంబంధమైన ప్రధాన సమస్య ఏదైనా శాసనసభలో తలెత్తినపుడు ఒక్కొక్క ప్రధాన మత వర్గంలోని సభ్యుల మెజారిటీ ద్వారానూ, సభలో హాజరై వున్న అందరు సభ్యులలో మెజారిటీ ద్వారాను పరిష్కరించాలి. 4) భారత రాజ్యాంగ రచనకు ఒక రాజ్యాంగ సభను ఏర్పాటు చేయాలి. ప్రతి రాష్ట్రానికి దాని జనాభాను బట్టి కొన్ని స్థానాలుంటాయి. రాష్ట్రానికి వచ్చిన స్థానాలను, రాష్ట్రంలోని విభిన్న మతాల వారికి వారి జనాభాను బట్టి కేటాయించాలి. రాజ్యంగ సభ సభ్యులను రాష్ట్రాల శాసనసభల సభ్యులు ఎన్నుకొంటారు. 5) సాధ్యమైనంత త్వరలో ప్రధాన రాజకీయ పక్షాల సమర్థన వున్న తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్మించాలి.

కాబినెట్ రాయబార వర్గం తయారు చేసిన ప్రణాళిక భారత ఐక్యతను పరిరక్షించేదిగా వున్నా ముస్లిం ఆధిక్యత గల రాష్ట్రాలు ఒక విభాగంగా ఏర్పడే అవకాశాన్ని కల్గించడంలో పాకిస్తాన్ ఏర్పడాలనే కోరికను చాలా వరకు అంగీకరించినట్లే అయింది. ఈ ప్రణాళిక మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ చాలా చర్చించిన మీదట దీర్ఘకాలిక సంబంధమైన భాగాన్ని అంగీకరించి తాత్కాలిక ప్రభుత్వపు ప్రతిపాదనను తిరస్కరించింది. భారత ముస్లింలకు ఏకైక ప్రతినిధి ముస్లిం లీగ్ అన్న వాదనను కాంగ్రెస్ అంగీకరించలేదు. తరువాత తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింల వాటాకు సంబంధించిన స్థానాలకు సభ్యుల నియామకం విషయంలో కాంగ్రెస్ తన హక్కును నిలబెట్టుకొంది. ముస్లిం లీగ్ మొదట ప్రణాళికను అంగీకరించింది. కాని త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం నుండి, రాజ్యాంగ సభ కార్యకలాపాల నుండి

విరమించుకొంది. రాజ్యాంగ సభకు జూన్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 205 స్థానాలు, ముస్లిం లీగ్‌కు 73 స్థానాలు లభించాయి. సభలో ఓటింగ్‌లో ఎప్పుడూ ఓటమి ఎదురవుతుందనే భయమే, కాబినెట్ రాయబార ప్రణాళికను ముస్లింలీగ్ తిరస్కరించడానికి కారణం. ఆ తరువాత వేవెల్ ప్రభువు కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల ముందు మరో కొత్త ప్రతిపాదనను పెట్టాడు. కాంగ్రెస్‌కు 6 స్థానాలు, ముస్లింలీగ్‌కు 5స్థానాలతో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పరచాలని ఈ ప్రతిపాదన. కాంగ్రెస్‌తో సమానంగా స్థానాలు కావాలని కోరుతూ ఈ ప్రతిపాదనను ముస్లింలీగ్ తిరస్కరించింది. కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను అంగీకరించి జవహర్‌లాల్ నెహ్రూ ఉపాధ్యక్షుడుగా తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్మించింది.

## 5.8.5. ముస్లింలీగ్ ప్రత్యక్ష చర్య :

ముస్లింలీగ్ పాకిస్థాన్ ఏర్పాటుకు రాజ్యాంగ విరుద్ధమయిన 'పత్యక్ష చర్య'ను ప్రకటించింది. రాజకీయ ప్రతిష్టంభనకు కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని ముస్లింలీగ్ విమర్శిస్తూ ఆగస్ట్ 16ను 'నిరసన దినము'గా ప్రకటిస్తూ ప్రత్యక్ష పోరాటతీర్మానాన్ని చేసింది. ఈ నిరసన దినం మత హింసాకాండగా పరిణమించింది. హిందూ ముస్లిం ఘర్షణలు కలకత్తాలో ప్రారంభమై అతివేగంగా బెంగాల్, బీహార్, ఉత్తర ప్రదేశ్, బొంబాయిలోని విస్తృత ప్రదేశాలకు వ్యాపించాయి. ఈ సందర్భంగా గాంధీ సంఘర్షణలను తీవ్రంగా ఖండిస్తూ, ఆ ప్రాంతాలను సందర్శించాడు.

కాంగ్రెస్ తాత్కాలిక ప్రభుత్వంలో చేరి కేంద్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకొన్నదని ముస్లింలీగ్ గ్రహించింది. తాను ఏకాకినౌతానని భయపడి, కాంగ్రెస్‌తోను, రాజ ప్రతినిధితోను ముస్లింలీగ్ ఒక ఒప్పందానికి వచ్చింది. కాబినెట్ రాయబార ప్రణాళిక ఎట్లా పని చేస్తుందో పరిశీలించి, తాత్కాలిక ప్రభుత్వంలో చేరుతామని లీగ్ పేర్కొన్నది. అక్టోబర్‌లో లీగ్ ప్రతినిధులు ప్రభుత్వంలో చేరారు. కాని ప్రభుత్వంతో సహకరించడానికి కాక, పోరాడటానికే లీగ్ ప్రభుత్వంలో చేరింది. కేంద్ర ప్రభుత్వ కార్యకలాపాలకు భంగం కల్గించడానికే లీగ్ శాయశక్తులా పని చేసింది. కాబినెట్ రాయబార ప్రణాళికను వ్యాఖ్యానించడంలో కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు రెండూ నిరంతరం కొట్లాడుకోసాగాయి. చివరకు 1946 డిసెంబరులో జరిగిన రాజ్యాంగ సభ తొలి సమావేశంలో పాల్గొనడానికి ముస్లిం లీగ్ నిరాకరించింది. ఇలా కాబినెట్ రాయబార ప్రణాళిక వాస్తవానికి మృత పత్రం అయింది.

ఇదే సమయంలో దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించసాగింది. ప్రజా ఉద్యమాలు పట్టణాలకూ, గ్రామాలకూ విస్తరించడానికి ఇది తోడ్పడింది. 1946లో రెండు వేలకు పైగా సమ్మెలు జరిగాయి. కాన్పూరు, కలకత్తాలలో సమ్మె చేస్తున్న కార్మికుల మీద పోలీసులు కాల్పులు జరిపారు. బెంగాల్, తెలంగాణా, పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలు, మధ్య భారత్‌లలో రైతుల ఆందోళన సాగింది. రైతుల తిరుగుబాట్లు భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగాయి. వీరు భూమి హక్కును, తక్కువ కౌళ్ళను కోరారు. కాశ్మీర్‌లో మహారాజా భూస్వామ్యమునకు వ్యతిరేకంగా షేక్ అబ్దుల్లా నాయకత్వంలో నేషనల్ కాన్ఫరెన్స్ క్విట్ కాశ్మీర్ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ప్రజా ఉద్యమాలతో బాటు మత పరమైన హింసాకాండ కూడా కొనసాగుతూ వచ్చింది.

## 5.8.6. అట్లీ ప్రకటన :

ప్రస్తుత అనిశ్చిత పరిస్థితి ప్రమాదంతో కూడుకున్నదని గుర్తించిన బ్రిటిష్ ప్రధాని అట్లీ అధికార మార్పిడికి తేదీ నిర్ణయించాలని నిశ్చయించుకొన్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం అధికారాన్ని 1948 జూన్‌లోగా భారతదేశానికి అప్పగిస్తుందని అట్లీ 1947 ఫిబ్రవరి 20న ప్రకటించాడు. ఒకటి లేక అంతకంటే ఎక్కువ కేంద్ర ప్రభుత్వాలకు అధికారం అప్పగించడం జరుగుతుందన్నాడు. దేశ విభజన లేక అనేక రాజ్యాల ఏర్పాటు జరుగవచ్చునన్న సూచన ఇందులో స్పష్టంగా వుంది. దేశ విభజనను నిరోధించడానికి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్న కాంగ్రెస్ ఆశలు ఈ కొత్త తేదీ నిర్ణయంతో లుప్తమయిపోయాయి. రాజకీయ పక్షాలు ఏ ఒప్పందానికి రాకపోతే ప్రభుత్వ యంత్రాంగాన్ని విభిన్న రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడం జరుగుతుందనీ ప్రకటింపబడింది. దేశ విభజన కంటే ముక్కచెక్కలై పోవుట ప్రధానమైన ప్రమాదమని కాంగ్రెస్ భావించింది.

అట్లీ ప్రకటనతో ముస్లింలీగ్ పాకిస్థాన్ సంపాదన కోసం పోరాటాన్ని ప్రత్యక్ష చర్యల ద్వారా ఉధృతం చేసింది. ఫలితంగా అతి స్వల్ప కాలంలో ఉత్తర భారతదేశమంతటా మత కల్లోలాలు చెలరేగాయి. మత ఉద్రేకాలు, అనుమానాల వల్ల జరిగిన అనేక విషాద సంఘటనలకు విదేశీ ప్రభుత్వ తోడ్పాటు, ప్రోత్సాహమూ లభించాయి. ఇదంతా పటేల్, నెహ్రూల అభిప్రాయంలో మార్పుకు కారణమైంది. 1947 మార్చిలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం వాస్తవ దృక్పథం పేరిట, పంజాబ్ విభజననూ అంగీకరిస్తూ తీర్మానించింది.

## 5.8.7. మౌంట్ బాటెన్ పథకం - దేశ విభజన :

1947 మార్చిలో వేవెల్ ప్రభువు స్థానంలో మౌంట్ బాటన్ రాజ ప్రతినిధిగా వచ్చాడు. ఇతడు భారతదేశ రాజకీయ, మత పరిస్థితులను పరిశీలించిన తరువాత దేశ విభజన కార్యక్రమాన్ని కొనసాగించాడు. ఎట్టి పరిస్థితులలోను ఒక మతం ఆధిక్యం మరో మతం మీద వుండరాదనీ, బహుళ సంఖ్యాక వర్గాధిక్యం అల్ప సంఖ్యాకుల మీద వుండరాదనీ, దేశ విభజన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తే దాని బాధ్యత పూర్తిగా భారతీయులదేనని బాటెన్ స్పష్టం చేశాడు. ఇతని నిజాయితీని గాంధీ మెచ్చుకొన్నాడు. మౌంట్ బాటెన్ పథకం 1947 జూన్‌లో వచ్చింది. ఇందులోని ప్రతిపాదనలు : 1) బ్రిటిష్ వారు భారత దేశం నుండి 1947 ఆగస్ట్‌లో విరమణ చేస్తారు. భారతదేశంలో తరువాతి ప్రభుత్వాలకు అధికారం అప్పజెప్పటం జరుగుతుంది. భారతదేశాన్ని భారత్, పాకిస్థాన్ అని రెండుగా విభజించడం జరుగుతుంది. 2) బ్రిటిష్ అధికార విరమణలో దేశంలోని రాజ్యాలు భారత్‌లోగాని, పాకిస్థాన్‌లో గాని చేరే స్వేచ్ఛను కలిగి వుంటాయి. వాటి మీద బ్రిటిష్ అధికారం పోతుంది. 3) ప్రజాభిప్రాయాన్ని కనుగొన్న తర్వాత బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల విభజన జరుగుతుంది. ఈ రాష్ట్రాల శాసనసభలు సమావేశమై, సదరు రాష్ట్రాలు ఐక్యంగా వుండాలో, విభజన కావాలో నిర్ణయిస్తాయి. వారు విభజనను నిర్ణయించినట్లయితే, ఒక సరిహద్దు సంఘాన్ని నియమించడం జరుగుతుంది. 4) ఇప్పుడున్న రాజ్యాంగ సభ అట్లాగే కొనసాగి, భారతదేశానికి రాజ్యాంగాన్ని తయారుచేస్తుంది. పాకిస్తాన్‌కు వేరే రాజ్యాంగ సభ వుంటుంది.

కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు రెండూ తమ అసంతృప్తిని వెల్లడించినప్పటికీ, అటువంటి క్లిష్ట సమస్యలలో అంతకంటే మార్గంలేదనీ, అదే అన్నిటికన్నా ఉత్తమమైన ప్రయోగ సాధ్యమైన పరిష్కారమని బాటన్ పథకాన్ని అంగీకరించాయి. కుదించిన పాకిస్తాన్‌తో ముస్లింలీగ్ పూర్తిగా సంతృప్తి చెందకపోయినప్పటికీ పథకాన్ని అంగీకరించింది. గందరగోళ పరిస్థితి, మత విధ్వంసకాండకూ పర్యాయంగా దేశ విభజనే ఏకైక మార్గమన్న అభిప్రాయానికి కాంగ్రెస్ అంతకు ముందే వచ్చింది. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించినా కాంగ్రెస్ కోరికపై గాంధీ అంగీకరించాడు, కాంగ్రెస్ అంగీకరించింది. లీగ్ ప్రభావం అనుమానాస్పదంగా వున్న వాయువ్య సరిహద్దు రాష్ట్రం, అస్సాంలో సిల్‌హాట్ జిల్లాలో జనాభిప్రాయ సేకరణ జరపవలసి వుంది.

## 5.8.8. భారత స్వాతంత్ర్యం - 1947

భారతదేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలు మౌంట్‌బాటెన్ పథకాన్ని అంగీకరించటంతో భారత్, పాకిస్తాన్‌ల ఆస్తులు, రుణాలను నిర్ణయిచడానికి కేంద్రంలోను, రాష్ట్రాలలోను యంత్రాంగాన్ని నియమించారు. సైన్యంలోను, ఇతర ఉద్యోగాలలోను పనిచేసే వారిని, వారి ఇష్టాన్ని అడిగారు. పంజాబ్, బెంగాల్‌లోని ప్రాంతీయ శాసనసభలు విభజనకే నిర్ణయించాయి. ముస్లిం బాహుళ్యమున్న జిల్లాలు పాకిస్తాన్‌లో, ముస్లిమేతరులు అధికంగా వున్న ప్రాంతాలు భారత సమాఖ్యలో చేరాయి. సర్ రాడ్ క్లిఫ్ అధ్యక్షతన సరిహద్దు సంఘం పని ప్రారంభించి 1947 ఆగస్ట్ 15 నాటికి సరిహద్దు రేఖను గీసే పనిని పూర్తి చేసింది. సంస్థానాలలోని ప్రజల ఒత్తిడి, పటేల్ రాజనీతి, బాటెన్ సహకారం కారణంగా 500లకు పైగా సంస్థానాలు భారత సమాఖ్యలో చేరిపోయాయి. హైదరాబాద్, జునాఘడ్, కాశ్మీరు రాజ్యాల విలీనీకరణ మిగిలిపోయింది.

మౌంట్ బాటెన్ పథకాన్ని 1947 జూలైలో భారత స్వాతంత్ర్య చట్టంగా బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదించింది. 1947 ఆగస్ట్ 15న అధికార మార్పిడికి నిర్ణయించింది. దీన్ని అనుసరించి 1947 ఆగస్ట్ 14 అర్ధరాత్రి ఆగస్ట్ 15 ప్రారంభ ఘడియల్లో ఢిల్లీలో రాజ్యాంగ సభ

ప్రత్యేక సమావేశం జరిగింది. ఎర్రకోట మీద భారత జాతీయ పతాకం ఎగిరింది. రాజ్యాంగ సభ శాసనబద్దంగా, బ్రిటిష్ కామన్‌వెల్త్‌లో భాగంగా భారతదేశ స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. భారత డొమినియన్‌కు మౌంట్ బాటన్‌ను కొత్త గవర్నర్ జనరల్‌గా నియమించింది. అనేక తరాల స్వాతంత్ర వీరుల పోరాటం చివరికి ఫలించింది.

జాతీయోద్యమ విజయం భారతదేశ చరిత్రలో స్వతంత్ర అభివృద్ధి అనే నూతన ఉద్యమానికి నాంది పల్కింది. 1947 ఆగస్ట్ 14 రాత్రి రాజ్యాంగ సభ సమావేశంలో ప్రజల అనుభవాలను వ్యక్తం చేస్తూ జవహర్ లాల్ నెహ్రూ చేసిన చారిత్రాత్మక ప్రసంగంలో "అనేక సంవత్సరాల క్రితం విధితో మనం ఒక ఒప్పందానికి వచ్చాం. ఆ ప్రతినను పూర్తిగా కాకపోయినా తగినంతగా నెరవేర్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. ప్రపంచమంతా నిద్రపోయే ఈ అర్థరాత్రి సమయంలో భారతదేశం బ్రతుకునూ, స్వేచ్ఛనూ పొంది మేల్కొంటున్నది. మనం పాత నుండి కొత్తలోకి అడుగుపెట్టేటపుడు, ఒక యుగం అంతమయినపుడు, దీర్ఘ కాలం అణచివేయబడిన ఒక దేశం ఆత్మ తన హక్కును తిరిగి పొందినటువంటి క్షణం, చరిత్రలో అరుదుగా వస్తుంది. ఇటువంటి పవిత్ర క్షణంలో భారత ప్రజల సేవ కోసం అంతకంటే విశాలమయిన మానవతా సంరక్షణ కోసం అంకితం కావడానికి ప్రతిజ్ఞ పూనటం ఉచితంగా ఉంటుంది. దురదృష్టకర కాలం ఇంతటితో అంతమైంది. భారతదేశం తన్ను తాను మళ్ళా కనుక్కుంది. మనం గతంలో అనేక సార్లు తీసుకున్న ప్రతిజ్ఞలు నెరవేర్చుకొనే తీవ్రమయిన ప్రయత్నం ఈనాడు మనం జరుపుకుంటున్న విజయోత్సవం" అని అన్నాడు.

## 5.8.9. నమూనా ప్రశ్నలు :

1. క్యాబినెట్ రాయబారం ప్రతిపాదించినదేమిటి ? దానికి భారత రాజకీయ పార్టీలు ఎట్లు స్పందించాయి.
2. అట్లీ ప్రకటనకు దారి తీసిన సంఘటనలను తెలిపి, దాని ఫలితాలను చర్చింపుము.
3. మౌంట్ బాటెన్ పథకం వివరింపుము

## 5.8.10. చదువదగిన గ్రంథాలు :


1. L.S. Amery : The Transfer of Power in India
2. Bipan Chandra : Modern India
3. Collins and Lapierre : Freedom at Mid night
4. Edwards, Michael, Plassey : The last years of British India
5. R.C. Majumdar : History of Freedom Movement
6. Penderel Moon : Divide and Quite
7. B.N. Pandey (ed.) : The Indian National Movement
8. C.H. Philips (ed.) : Evolution of India and Pakistan
9. Tarachand : History of Freedom Movement in India
10. Sumit Sarkar : Modern India


డా॥ వి.కె. మోహన్

**యూనిట్ - 5**

**పాఠం - 5.9**

# స్వతంత్ర భారతదేశ పరిణామాలు

## 5.9.0. లక్ష్యం :

కాందిశీకుల సమస్య, స్వదేశీ సంస్థానాల విలీనం, నూతన రాజ్యాంగం గురించి వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం

**విషయసూచిక :**


**5.9.1.** పరిచయం

**5.9.2.** కాందిశీకుల సమస్య

**5.9.3.** సంస్థానాల విలీనం - సర్దార్ వల్లభాయ్ పటేల్

**5.9.3.1.** పరిచయం

**5.9.3.2.** పటేల్ కృషి

**5.9.3.3.** హైదరాబాద్

**5.9.3.4.** జునాఘడ్

**5.9.3.5.** కాశ్మీరు

**5.9.3.6.** సమీక్ష

**5.9.4.** భారత రాజ్యాంగము

**5.9.4.1.** ప్రధాన లక్షణాలు

**5.9.4.1.1.** ప్రజాస్వామికం

**5.9.4.1.2.** లిఖిత రాజ్యాంగము

**5.9.4.1.3.** సమాఖ్య రాజ్యము

**5.9.4.1.4.** పార్లమెంటరీ విధానము

**5.9.4.1.5.** ప్రాథమిక హక్కులు

**5.9.4.1.6.** శ్రేయోరాజ్యము

**5.9.4.1.7.** లౌకిక రాజ్యము

**5.9.5.** నమూనా ప్రశ్నలు

**5.9.6.** చదువదగిన గ్రంథాలు

## 5.9.1. పరిచయం :

1947 ఆగస్ట్ 15న భారతీయులు చిరకాలం వాంఛించిన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్న మాటేగాని వారు కోరిన శాంతి, కావలసిన భద్రత వెంటనే సంప్రాప్తించలేదు. స్వతంత్ర భారతదేశము ముఖ్యంగా మూడు క్లిష్ట సమస్యలను వెంటనే ఎదుర్కోవలసి వచ్చింది. అవి : కాందిశీకుల సమస్య, స్వదేశీ సంస్థానాల విలీనం, నూతన రాజ్యాంగం తయారుచేయడం.

## 5.9.2. కాందిశీకుల సమస్య :

పాకిస్థాన్ నుంచి లక్షలాది మహమ్మదీయేతర కాందిశీకులు ఎన్నో వందల సంవత్సరాలుగా అనుభవిస్తూ ఉన్న వారి ఆస్తి పాస్తులను వదులుకొని బికారులుగా భారతదేశానికి తరలి వచ్చారు. వారికి తగిన జీవనోపాధి, నివాస వసతి ఏర్పరచడం భారత ప్రభుత్వానికి ప్రధమ కర్తవ్యమయింది. దీనినే కాందిశీకుల సమస్య అంటారు.

1947 ఆగస్ట్ 15 నాటికి ఇండియా రెండు భాగాలుగా విభక్తమయి భారత్, పాకిస్తాన్ అనే పేర్లతో రెండు స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడినాయి. పాకిస్తాన్‌లో అధిక సంఖ్యాకులు మహమ్మదీయులు. మహమ్మదీయులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడానికే పాకిస్తాన్ ఏర్పాటయింది. అయితే పాకిస్థాన్‌లో అనేక వందల సంవత్సరాలుగా నివాసమేర్పరచుకొన్న మహమ్మదీయేతరుల గతి ఏమి కావలెను. పశ్చిమంలో పంజాబ్ రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విభజించినపుడు తాము అధిక సంఖ్యలో ఉన్న చీనాబ్ నదీ ప్రాంతం వరకు భారతదేశానికి దక్కుతుందని శిక్కులు భావించారు. కాని సరిహద్దు నిర్ణయించడానికి నియమితుడయిన రాడ్ క్లిఫ్ ఆ ప్రాంతాన్ని పాకిస్తాన్ భూభాగానికి చెందుతుందని నిర్ణయించినాడు. అది శిక్కులకు పెద్ద దెబ్బ. తరతరాలుగా పంజాబ్ ప్రాంతంలో శిక్కులు, మహమ్మదీయులు, హిందువులు విడదీయరాని స్నేహంతో మసలుకొంటూ పరస్పర సహకారంతో జీవనం గడిపేవారు. వారిలో జాతి మత భేదాలకు తావులేదు. అటువంటి వారిని విడదీయడం, ముఖ్యంగా తమను ఆ ప్రాంతాల నుంచి తొలగించడం శిక్కులు సహించలేదు. అందుకు భిన్నంగా భారతదేశంలోని అల్ప సంఖ్యాకులైన మహమ్మదీయులకు తగిన రక్షణ కల్పించడం, వారి ఆస్తి క్షేమంగా ఉండటం, పాకిస్తాన్ నుంచి వచ్చిన కాందిశీకులకు నచ్చలేదు. ఇదే పరిస్థితి బెంగాల్‌లోను ఏర్పడింది. మత కలహాలు బయలు దేరినాయి. బెంగాల్‌లో గాంధీ ధైర్యసాహసాలతో సత్యాగ్రహ సాధనతో మత కలహాలను అరికట్టినాడు. తూర్పు పాకిస్థాన్ నుంచి మహమ్మదీయులనేకులు అస్సాంలో ప్రవేశించినారు. ఎట్లాగైనా అస్సాంను పాకిస్తాన్‌లో కలుపుకోవలెనని వారి ఉద్దేశము. చివరకు భారత ప్రభుత్వం తగిన కట్టుదిట్టాలు చేసి ముస్లింలను భారతదేశానికి రానీయలేదు.

స్వతంత్ర భారతదేశం మత కల్లోలాలను అణచివేసి భారతదేశానికి వలస వచ్చిన కాందిశీకుల పునరావాసం కోసం ఎంతో కృషి చేసింది. పాకిస్తాన్ నుంచి కాందిశీకులుగా వచ్చిన ప్రజలకు తగిన జీవనోపాధి కల్పించి, గృహ వసతులను ఏర్పాటు చేశారు. వ్యాపారం చేసుకొనే వారికి పెట్టుబడులతో బాటు ప్రభుత్వోద్యోగాల్లో రిజర్వేషన్ కూడా కల్పించారు. ఒక పశ్చిమ పాకిస్థాన్ నుంచి వచ్చిన కాందిశీకుల సంఖ్య సుమారు 55 లక్షలని అంచనా వేసినారు. పాకిస్తాన్ నుంచి భారతదేశానికి వలస వచ్చిన కాందిశీకులందరికీ భారతదేశంలో పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. స్వతంత్ర భారతదేశ ప్రభుత్వం పరిష్కరించిన తొలి ప్రధాన సమస్య ఇది.

## 5.9.3. సంస్థానాల విలీనం :

**5.9.3.1. పరిచయం :** స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో రెండు రకాల ప్రాంతాలుండేవి. అవి బ్రిటిష్ ఇండియా పాలనలోనివి, స్వదేశీ సంస్థానాధీశుల పాలనలోనివి. స్వదేశీ సంస్థానాలు విదేశీ వ్యవహారాలు, శాంతి భద్రత, రవాణా సౌకర్యాలనే మూడు విషయాలలో పూర్తి స్వాతంత్ర్యంతో తమ ఇష్ట ప్రకారం నడుచుకొనేవి. 1947 భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం సంస్థానాధీశులు తమ ఇష్ట ప్రకారం తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం పొందారు. బ్రిటిష్ వారు ఇండియాను వదలి వెళ్ళే నాటికి ఈ సంస్థానాల సంఖ్య 562. ఈ సంస్థానాలలో కొన్ని చాలా పెద్దవి, మరికొన్ని గ్రామాలంత చిన్నవి. బ్రిటిష్ వారు దేశం నుంచి వెళ్ళిపోగానే ఈ సంస్థానాలు భారతదేశంలో చేరడమా స్వతంత్రంగా ఉండటమా అనే ఆలోచనలోకి వచ్చాయి. కాని త్వరలోనే స్వతంత్రంగా ఉండటం తమకు లాభదాయకం కాదని

అనేక సంస్థానాలు భావించాయి. అందువల్ల భారతదేశంలో చాలా సంస్థానాలు చేరినా హైదరాబాద్, కాశ్మీర్, జునాఘడ్‌లు స్వతంత్రంగా ఉండి పోవలెనని తీర్మానించుకొన్నాము. ఈ విధంగా దేశంలో కొన్ని సంస్థానాలు స్వతంత్రంగా ఉండటం వాటికే కాక భారతదేశానికి కూడా నష్టమే. కాబట్టి వాటిని భారతదేశంలో ఎట్లా కలుపుకోవడమనేది స్వతంత్ర భారతదేశానికి ఒక ప్రధాన సమస్యగా పరిణమించింది.

**5.9.3.2. పటేల్ కృషి :** స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఘనత ఉక్కు మనిషిగా పేరొందిన, స్వతంత్ర భారత దేశపు ఉప ప్రధానిగా హోం శాఖను చేపట్టిన సర్దార్ పటేల్‌కు దక్కింది. భారత స్వాతంత్ర్య చట్టం ప్రకారం భారత సంస్థానాల మీద బ్రిటిష్ సార్వభౌమాధికారం అంతమయింది. దీని వల్ల ఈ సంస్థానాధీశులు స్వతంత్రంగా తమ భవిష్యత్తును నిర్ణయించుకొనే స్వేచ్ఛను పొందారు. వాస్తవానికి భారత్, పాకిస్తాన్‌లో దేనిలోనైనా కలిసిపొమ్మని సలహా పొందారు. చట్టబద్ధంగా భారత ఉపఖండం చిన్న చిన్న రాజ్యాలుగా ముక్కలయ్యే సూత్రం ఈ చట్టంలో వుంది. భారత సంస్థానాధీశులనేకులు బాధ్యత లేనివారు ప్రజల క్షేమాలను గమనించకుండా ప్రవర్తించేవారు. ప్రజలు వారి పరిపాలనలో ఉండడానికంటే స్వతంత్ర భారత ప్రభుత్వంలో చేరిపోయి ప్రజాస్వామ్య ప్రభుత్వ ఫలితాలను అనుభవించవలెనని కోరినారు. కాని స్వదేశీ రాజులకు ప్రజల కోరిక నచ్చలేదు. కొన్ని సంస్థానాలలో అధిపతులు ముస్లింలు, అధిక సంఖ్యాక ప్రజలు మహమ్మదీయేతరులే ఉండేవారు. ఒక వేళ స్వతంత్రంగా ఉండడానికి వీలులేకపోతే ఆ రాజులకు పాకిస్తాన్‌లో కలుపవలెనని ఉద్దేశం ఉండేది. ఉదాహరణకు భోపాల్ నవాబు మహమ్మదీయుడు. కాని ఆ సంస్థానంలోని ప్రజలు చాలా వరకు హిందువులు. పైగా ఆ సంస్థానము భారతదేశ మధ్య భాగంలో ఉన్నది. కాబట్టి ఆ సంస్థానము ఎప్పుడైనా భారతదేశంలో చేరవలసిందే. లేకపోతే భారతదేశ క్షేమానికే భంగం వాటిల్లవచ్చు. ఈ పరిస్థితుల్ని చూసి పటేల్ రంగంలోకి దూకినాడు. భారతీయులు ఎన్నో సంవత్సరాలుగా పోరాడి అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుని స్వాతంత్ర్యం సంపాదించినారు. దానిని కాపాడుకోవడం వారి ధర్మము. అందుకని పటేల్ **1947** జూలై **25**న స్వదేశీ సంస్థానాధీశుల విదేశీ వ్యవహారాలు, దేశ రక్షణ, ప్రయాణ సౌకర్యాలను తమ ఆధీనంలోఉంచుకొన్నా మిగతా విషయాలలో తమకు కావలసిన విధంగా ప్రవర్తించే అధికారమిచ్చారు. ఇప్పుడు కూడా ఈ మూడు విషయాలను భారత ప్రభుత్వానికి అప్పగించి తదితర విషయాలలో పూర్వంవలెనే ప్రవర్తించవచ్చునని అందుచేత వారి పరిస్థితి ఎప్పటి విధంగానే ఉంటుందని, అది స్వదేశీ సంస్థానాలకు లాభకరమని గట్టిగా చెప్పినాడు. దీనికి ఇష్టపడిన వారు తమ ప్రతినిధులను రాజ్యాంగ పరిషత్తుకు కూడా పంపవచ్చునని చెప్పినాడు. పటేల్ చెప్పిన దానిని బాటెన్ కూడా సమర్థించాడు. ఆ సంస్థానాధీశుల సభా కార్యదర్శియైన పాటియాల మహారాజు వంటి మేధావులయిన పరిపాలకులు, తమ సంస్థానాలను భారత సమాఖ్యలో కలుపవలసిన ఆవశ్యకతను గుర్తించారు. తక్కిన చోట్ల అవలంభించిన కాఠిన్యం, పటేల్ రాజనీతిజ్ఞత **500**లకు పైగా సంస్థానాల విలీనీకరణలో విజయవంతమయ్యాయి. సంస్థానాల విలీనీకరణ గురించి వ్రాస్తూ, పెర్సివల్ స్పియర్ ఇలా అన్నాడు. "కొన్ని సార్లు ఇది నిర్దాక్షిణ్యంగా ఉండేది. అయినా ఈ కార్యక్రమమూ దేశ వ్యవహారాల కార్యదర్శి వి.పి.మీనన్ నైపుణ్యం వల్ల అంగీకారయోగ్యమైంది. ఆయన ఇంత నమ్మకంగా సంస్థానాలు పోవడంలోని లాభాలను వివరించారంటే, చివరికి కాశ్మీర్ కాక ఒక్క హైదరాబాద్ మాత్రమే నిజమైన సమస్యగా మిగిలింది. కానీ అన్నిటికంటే ప్రధానమైన కారణం తక్కిన దేశంలో కలవాలన్న ఈ సంస్థానాలలోని ప్రజల కోర్కె.

భారతదేశ స్వాతంత్ర్యానికి ముందే సంస్థానాల వ్యవహారాల కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. దీనికి దేశీయాంగ మంత్రి పటేల్ అధ్యక్షుడు. సంస్థానాధిపతులకు పటేల్‌కు మధ్య జరిగిన అనేక చర్చల అనంతరం సంస్థానాలను భారత సమాఖ్యలో చేర్చుకోవడానికి ఒక ప్రణాళిక సిద్ధమయింది. స్వాతంత్ర్యదినోత్సవం ముందే అనేక మంది సంస్థానాధిపతులు భారత డొమినియన్‌లో చేరుతూ, విలీనీకరణ ఒప్పందం మీద సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం వారి వారి ఎస్టేట్ల మీద, భూముల మీద హక్కు వారికే ఉంటుంది. విలీనీకరణ పత్రం మీద సంతకం చేయకముందు వారు చేసిన ఏ కార్యాల గురించి ప్రశ్నించడానికి వీల్లేదు. వారికి ప్రభుత్వ భరణాలివ్వటం వంటి వాగ్దానాలివ్వబడ్డాయి. కొంతమంది సంస్థానాధిపతులు ఈ పత్రం మీద వెంటనే సంతకం చేయలేదు. 'సమైక్యతకు భంగం కలిగే పక్షంలో భారతదేశం ఉదారంగా ఉండజాలదు' అని పటేల్, మీనన్‌లు స్పష్టం చేశారు. ఈ దృఢ సంకల్పం దేశ సమైక్యత విషయంలోను, హైదరాబాద్, ఒరిస్సా, భోపాల్, ట్రావెన్కూర్, కాశ్మీర్ మొదలైన సంస్థానాలలో రూపుదిద్దుకుంటున్న భూస్వామ్య వ్యతిరేకోద్యమాల పట్ల భారత ప్రభుత్వం అవలంభించిన స్పష్టమైన వైఖరి సంస్థానాధిపతులు విలీనీకరణ పత్రం మీద సంతకం చేయడానికి తొందర పడేటట్లు చేశాయి. ఈ విధంగా **1947 - 1949** మధ్య సుమారు **554** సంస్థానాలు భారతదేశంలో చేరిపోయాయి.

కానీ హైదరాబాద్ సంస్థానాధిపతి నిజాం నవాబు, కాశ్మీర్ సంస్థానాధిపతి, జునాఘడ్ నవాబు ఇండియాలో చేరడానికి అంగీకరించలేదు. వారు తాము స్వతంత్రులుగా ఉంటామని ప్రకటించుకొన్నారు. భారత్ విలీనానికి అంగీకరించని ఈ సంస్థానాలను గురించి తెలుసుకుందాం.

**5.9.3.3. హైదరాబాద్ :** భారతదేశంలో గల సంస్థాలన్నింటిలో పెద్దది హైదరాబాద్. ఆనాటి సంస్థానాధిపతి నైజాం నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్. ఇక్కడి జనాభాలో అధిక సంఖ్యాకులు హిందువులు నిజాం నవాబు తన సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా నిలబెట్టాలని నిర్ణయించుకున్నాడు. కాని ఎంతో నిర్బంధం మీద **1947** నవంబర్ **29**న ఒక్క ఏడాది పాటు భారతదేశంతో సంధికి ఒప్పుకోవడానికి తన అనుమతినిచ్చినాడు. ఈ సంధి ప్రకారం నైజమ్ రాష్ట్రం నుంచి భారత సైన్యమంతా తరలించడం జరిగింది. ఆ సంస్థానాల శాంతి భద్రతలు సైనిక ప్రభుత్యోద్యోగి అయిన కాశిం రజ్వీ చేతిలో పెట్టడమయింది. సామాన్య ప్రజలంతా అతని దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసివచ్చింది. అంతేగాక నైజాం ప్రతినిధి ఒకడు ఢిల్లీలో ఉండేటట్లు, అట్లాగే భారత ప్రతినిధి హైదరాబాద్‌లో ఉండేటట్లు నిశ్చయమయింది. ఎప్పుడైనా ఈ రెండు ప్రభుత్వాల మధ్య తగాదా ఏర్పడినపుడు దానిని మధ్యవర్తుల ద్వారా పరిష్కరించుకోవలెనని ఒప్పుకొన్నారు. ఇన్ని సదుపాయాలు కల్పించినా నైజామ్‌కు సంతృప్తి కలగలేదు. తనకెప్పుడూ పాకిస్తాన్, భారత ముస్లింల సహకారం లభిస్తుందని అతనికి నమ్మకము. ఎందుకైనా మంచిదని జిన్నా తన పట్ల సుముఖంగా ఉంటాడని పాకిస్తాన్‌కు **22** కోట్ల రూపాయలు అప్పు ఇచ్చినాడు. మరో **22** కోట్ల రూపాయాలు సైన్యం మీద, మందుగుండు సామానుల మీద ఖర్చుపెట్టినాడు. అంటే ఏ కోశాన కూడా భారతదేశంతో స్నేహం చేయటమతనికి ఇష్టం లేదని బలం సమకూర్చుకుని భారతదేశంతో యుద్ధమయినా చేసి తన సంస్థానాన్ని కాపాడుకోవడానికి తీర్మానించుకొన్నాడని తెలుస్తుంది. ఇదే అతని ఉద్దేశము. ఈ విధంగా భారతదేశం కడుపులో హైదరాబాద్ భయంకర వ్రణంగా తయారైంది. ఇదే సమయంలో హైదరాబాద్‌లో ప్రజల ఆందోళన పెరగసాగింది. నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా **1946**లో మొదలైన ప్రజల తిరుగుబాట్లు రైతాంగ విప్లవంగా రూపుదిద్దుకొని, తెలంగాణా అంతటా వ్యాపించింది. ఈ విప్లవాన్ని అణచడానికి నిజాం ప్రభుత్వం, ఇతర జమిందారులు, కాశిం రజ్వీ నాయకత్వాన రజాకార్ల ముఠాలను ఏర్పరిచారు. హైదరాబాద్‌లోని ముస్లీమేతర ప్రజానీకంలో రజాకార్లు భీతావహాన్ని సృష్టించారు. తెలంగాణ రైతాంగ విప్లవ ప్రభావం ఇతర ప్రాంతాలకు విస్తరించేటట్లు కనబడింది. ఈ పరిస్థితుల్లో భారత ప్రభుత్వం రైతాంగ విప్లవం ఆంధ్ర ప్రాంతానికి వ్యాపించకుండా ఆపడానికి చివరి తాఖీదు ఇచ్చింది. అనేక ఇతర విషయాలతో బాటు నిజాం వెంటనే రజాకార్ ముటాలను తొలగించాలని కోరింది. నిజాం లక్ష్యపెట్టక పోగా, **1948** సెప్టెంబర్ **13**న భారత సైన్యాలు హైదరాబాద్ సంస్థానంలో అడుగుపెట్టాయి. భారత ప్రభుత్వం దీన్ని యుద్దంగా గాక రాజ్యంలో శాంతిని, శాసనాన్ని పునరుద్ధరించడానికి తీసుకున్న పోలీసు చర్యగా ప్రకటించింది. రాజ్యంలో సామాన్య పరిస్థితిని నెలకొల్పటానికి రజాకార్ ముఠాలను ధ్వంసం చేసి, వామపక్ష సిద్ధాంత ప్రేరేపితమయిన తెలంగాణా రైతాంగ విప్లవానికి వ్యతరేకంగా చర్య తీసుకుంటున్న మేజర్ జనరల్ చౌదరి ఆధ్వర్యంలో సైన్యాన్ని హైదరాబాద్‌లో వుంచింది. భారతసేన ముందు తన సేన ఎంత మాత్రం పనికిరాదని తెలుసుకొని సెప్టెంబరు **17**న నైజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయినాడు. సంస్థానంలోని రజాకర్ల నాయకుడైన రజ్వీని ఖైదీగా పట్టుకొని ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ జరిపి శిక్ష విధించటం జరిగింది.

**5.9.3.4. జునాఘడ్ :** కథియవాడ్ ప్రాంతంలో జునాఘడ్ ఒక చిన్న సంస్థానం. ఇక్కడి జనాభాలో **75%** హిందువులు. పాలకుడు ముస్లిం. ఇతడు విచిత్రమైన స్వభావం కలవాడు. విలాస జీవితానికి అధిక ధనాన్ని వెచ్చించేవాడు. పాకిస్తాన్‌లో జునాఘడ్ చేరుతుందని ఇతడు ప్రకటించాడు. తన రాజ్యంలోని హిందువులను రాజ్యం నుంచి వెళ్లగొట్టడానికి యత్నించాడు. అందువల్ల ప్రజలు తీవ్ర ఆందోళన లేవదీసినారు. సంస్థానంలో అలజడి ప్రారంభమైంది. అందువల్ల పటేల్ జునాఘడ్‌కు సైన్యాన్ని పంపాడు. నవాబు పాకిస్తాన్‌కు పారిపోయాడు. సంస్థానపు దివాన్ పరిపాలన స్వీకరించి, శాంతి భద్రలకు నెలకొల్పమని భారత ప్రభుత్వాన్ని కోరాడు. **1948** ఫిబ్రవరిలో జునాఘడ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో భారతదేశంలో చేరడాన్ని అభిలషించారు. **1949** జనవరిలో జునాఘడ్ భారత్‌లో విలీనమైంది.

**5.9.3.5. కాశ్మీర్ :** మొదట్లో కాశ్మీర్ కూడా హైదరాబాద్ లాగా స్వతంత్రంగా ఉండాలని భావించింది. భారత పాకిస్తాన్ సరిహద్దులో వున్న ఈ రాజ్యం ఎందులోనయినా చేరే అవకాశం ఉంది. ముస్లిం జనాభా ఎక్కువగా వుంది కాబట్టి దీన్ని తనలో కలుపుకోవడానికి

పాకిస్తాన్ సహజంగానే ఆతృత కనబరిచింది. జమ్ము కాశ్మీరు జనాభాలో అత్యధికులు ముస్లింలు. పాలకుడు మహారాజ హరిసింగ్ హిందువు. 1931 లో షేక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్‌ను స్థాపించి కాంగ్రెస్ పార్టీతో స్నేహ సంబంధాలను అభివృద్ధి పరచుకొన్నాడు. మహారాజుకు వ్యతిరేకంగా 'క్విట్ కాశ్మీర్' ఉద్యమాన్ని లేవదీసినపుడు 1946 మేలో షేక్ అబ్దుల్లాను జైల్లో పెట్టారు. అప్పుడు గాంధీ ఆ రాజ్యాన్ని దర్శించి షేక్ అబ్దుల్లాను విడుదల చేయడానికి మహారాజును ఒప్పించాడు. స్వాతంత్ర్యం ముందు, విలీనీకరణ తరువాత అని షేక్ అబ్దుల్లా సెప్టెంబర్‌లో పిలుపిచ్చాడు. తమ భవిష్యత్తు నిర్ణయించుకొనేది ప్రజలు కాని మహారాజు కాదన్నాడు. ఈ మార్గంలో ఏ విధమయిన చర్య ప్రారంభం కాకముందే పాకిస్తాన్‌లోని పఠాన్ ఆదివాసులు జమ్మూ కాశ్మీర్లోనికి చొచ్చుకొని వచ్చారు. పాకిస్తాన్ సైన్యాలు వారిలో చేయి కలిపాయి. మహారాజా ప్రభుత్వ యంత్రాంగం పతనమయింది. ఆయన భారత సైనిక సహాయాన్ని అర్థించాడు. అక్టోబర్ 26న భారత సమాఖ్యలో చేరుతూ సంతకం చేశాడు. భారత సైన్యాలు విమానాలలో దిగి సమయానికి ఆదుకోగలిగాయి. ఈ చర్యను ప్రజాబాహుళ్యం సమర్థన వున్న నేషనల్ కాన్ఫరెన్స్ పక్ష నాయకుడు షేక్ అబ్దుల్లా ఆమోదించాడు. అక్టోబర్ 31న షేక్ అబ్దుల్లా నాయకత్వాన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. భారత సైన్యాల సహాయంతో ఈ ప్రభుత్వం పాకిస్తాన్ సేనల ప్రవేశాన్ని తిరగగొట్టింది. కాని పాక్ సైన్యాలు కొంత భూ భాగాన్ని ఆక్రమించుకుని దానికి 'ఆజాద్ కాశ్మీరు' అని పేరు పెట్టాయి. 1947 డిసెంబరులో జమ్మూ-కాశ్మీర్ తాత్కాలిక ప్రభుత్వం పాకిస్తాన్ దురాక్రమణను ఆపవల్సిందిగా ఐ.రా.స. భద్రతా సమితికి విన్నవించింది. భారత, పాకిస్తాన్ వాదనలను భద్రతా సంఘం ముందు పెట్టడం జరిగింది. కానీ ఒక శాంతియుతమయిన పరిష్కారానికి సంఘం రాలేకపోయింది. ఈ లోపల 1949 జనవరిలో ఐ.రా.స. సంఘం కాల్పుల విరమణకు ఏర్పాటు చేసేటప్పటికి, రెండు దేశాలు ఒక సంవత్సరం పాటు యుద్ధం సాగించాయి. అంతకు ముందు భారత ప్రభుత్వం విలీనీకరణ విషయంపై ప్రజాభిప్రాయసేకరణకు సిద్ధపడింది. ఐ.రా.స. తీర్మానంలోని షరతులను పాటింపక ఆక్రమిత ప్రాంతాలనుండి పాకిస్తాన్ సైన్య విరమణ చేయకపోవడంతో ప్రజాభిప్రాయ సేకరణోద్దేశం వ్యర్థమయింది. జమ్ము-కాశ్మీరుకు రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ సభ 1951 లో జమ్మూ-కాశ్మీరులో సమావేశమయింది. భారతదేశంలో చేరికను రాజ్యాంగ సభ 1954 ఫిబ్రవరిలో ఆమోదించింది. 1956 నవంబర్‌లో రాజ్యంగ సభ జమ్ము-కాశ్మీర్ రాష్ట్రం భారత డొమినియన్‌లో భాగమని శాసనబద్ధం చేసింది. పాకిస్తాన్ సైన్యాలు 1947లో ఆక్రమించుకున్న ఆజాద్ కాశ్మీర్ ప్రాంతం మీద పాకిస్తాన్ తన అధికారాన్ని నిలబెట్టుకుంది. ఈనాటికి కాశ్మీర్ ఇదే పరిస్థితిలో ఉన్నది.

**5.9.3.9. సమీక్ష :** పైన వివరించిన విధంగా సంస్థానాల విలీనీకరణ దృఢ సంకల్పంతో, నిర్దాక్షిణ్య ధోరణిలో జరిగింది. భారత స్వాతంత్ర్యం, అధికార స్థిరీకరణలను గురించిన ఈ చర్యను వి.పి. మీనన్ ఈ విధంగా అన్నాడు "554 సంస్థానాలను భారత రిపబ్లిక్‌లో కలపడం, వాటిలో పరిపాలనా యంత్రాంగాన్ని ప్రజాస్వామ్యీకరించడం, ఇతర రంగాలలో కూడా అటువంటి సమానమైన విజయసాధన వైపు నడిపించాలి. భారతదేశం తొలిసారిగా సరియైన అర్థంలో సమైక్యతను పొందింది. ఒక సంపన్నమైన సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడానికి ఇది పునాది మాత్రమే. అసంఖ్యాకమైన, అనిర్దిష్టమైన ఆశలకు, మనం రూపకల్పన చేయాల్సి వుంటుంది. మిణకు మిణుకు మనే ఉనికిని సాగిస్తున్న లక్షలాది ప్రజల జీవితాలకు అర్థం కల్పించాలి."

సంస్థానాల విలీనీకరణ పూర్తి చేసిన తరువాత పరిపాలనా సౌలభ్యం కోసం పటేల్ ఆయా సంస్థానాలను పునస్సమీకరించాడు. చిన్న చిన్న సంస్థానాలను వాటి సమీపంలోని పెద్ద రాష్ట్రాలతో కలిపాడు. మద్రాస్ పరిసరాలలో ఉన్న చిన్న సంస్థానాలు మద్రాస్ రాష్ట్రంలో విలీనం చేశాడు. ఒరిస్సా ప్రాంతంలోని సంస్థానాలను ఆ రాష్ట్రంలోను, చండీగఢ్ ప్రాంతంలోని సంస్థానాలకు ఆనాటి మధ్య పదగణాల్లో విలీనం చేశాడు. కూచ్ బీహారు సంస్థానం, బెంగాల్, అస్సాం ప్రాంతంలోని సంస్థానాలను అస్సాంలోను కలిపాడు. మరికొన్ని సంస్థానాలను కలిపి యూనియన్‌లుగా ఏర్పాటు చేశారు. దీనివల్ల సౌరాష్ట్ర, రాజస్థాన్, మధ్య భారత్, పాటియాల, తూర్పు పంజాబ్ యూనియన్‌లు ఏర్పడ్డాయి. వీటి పరిపాలకులను రాజప్రముఖులనే వారు సామాన్యంగా సంస్థానాధిపతులనే రాజప్రముఖులుగా నియమించారు. మరికొన్ని సంస్థానాలను వేరు వేరుగా గాని లేదా కొన్ని సంస్థానాలను ఒక యూనిట్‌గా గాని ఏర్పాటు చేసి వాటిని కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష పాలనలో ఉంచారు. వీటి పరిపాలకులను ఛీఫ్ కమీషనర్ హోదాలో నియమించారు. ఈ విధంగా హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, భోపాల్, భలాస్ పూర్, కచ్, మణిపూర్, త్రిపుర ప్రాంతాలను రాష్ట్రాలుగా ఏర్పాటు చేసి, వాటిపై చీఫ్ కమీషనర్లను నియమించారు. మైసూర్, హైదరాబాద్ వంటి సంస్థానాలను ఒకే పరిపాలన విభాగంగా ఏర్పరచి రాజ ప్రముఖుల ఆధ్వర్యంలో ఉంచారు. మొదటి నుంచి ఉన్న బ్రిటిష్ పరిపాలిత

ప్రాంతాలను కొత్తగా చేర్చిన ప్రాంతాలలో కలిపి 'ఎ' రాష్ట్రాలుగా వర్గీకరించారు. హైదరాబాద్, మైసూరు వంటి పెద్ద సంస్థానాలతో ఏర్పడిన రాష్ట్రాలకు 'బి' రాష్ట్రాలుగా, చిన్న ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ప్రాంతాలను 'సి' రాష్ట్రాలుగా ఏర్పాటు చేశారు.

అతిచాకచక్యంతో, ధైర్యంతో, దృఢ సంకల్పంతో దేశ సమైక్యతను సాధించడంలో నాటి ఉపప్రధాని, హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి అమోఘమైంది. ఈ మహత్కార్యం సాధించడంలో పటేల్ పదర్శించిన సామర్థ్యం, దూరదృష్టి, రాజనీతి చిరస్మరణీయమైనవి. చరిత్రలో దేశ సమైక్య సాధకుడిగా ఆయన పేరు చిరకాలం ఉంటుంది. ఆయన సాధించిన ఈ ఘన విజయాన్ని రక్తపాత రహిత విప్లవంగా కొంత మంది కొనియాడారు. ఆయనను 'భారతీయ బిస్మార్క్' అని వ్యవహరించవచ్చు.

## 5.9.4. భారత రాజ్యాంగం

ఒక రాజ్యం తన లక్ష్యాలను ప్రజలకు కల్పించిన హక్కులను, ప్రభుత్వాంగాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖ స్వరూపాలను వాటి మధ్య గల సంబంధాలను తెలిపే పత్రాన్ని రాజ్యాంగమంటారు. 1947 ఆగస్ట్ 15న భారతదేశం స్వరాజ్యం సంపాదించిన వెంటనే నూతన రాజ్యాంగం ఏర్పడలేదు. తాత్కాలికంగా కొద్ది మార్పులతో 1935 రాజ్యాంగ చట్టం ప్రకారం ప్రభుత్వం నడిచేటట్లు ఏర్పాటు చేయడమయింది. ఆ చట్టంలో గవర్నర్ జనరల్‌కు ఇచ్చిన ప్రత్యేక అధికారాలు రద్దయి అతడు నామకః దేశానికి అధికారిగా ఉండేటట్లు నిర్ణయించడమయింది. సమయానుకూలంగా అవసరమైన మార్పులను కూడా అతడు 1935 చట్టంలో చేయడానికి అధికారం పొందినాడు. ఇంతకు పూర్వం అధికారమంతా విదేశీయుల పరమయినందువల్ల రాజ్యాంగాన్ని వారి కనుకూలంగా తయారుచేయడమయింది. కాని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విదేశీ ప్రభుత్వం పోయి స్వదేశీ ప్రభుత్వం వచ్చినందువల్ల ఇటువంటి మార్పులు చేయవలసిన అవసరం వచ్చింది.

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసినాడు. దీనిలో చాలా వరకు కాంగ్రెస్ నిర్వాహక సభ్యులే మంత్రులుగా నియమితులయినారు. వారిలో పటేల్, రాజేంద్ర ప్రసాద్, రాజగోపాలాచారి, మౌలానా అబుల్ కలామ్ అజాద్‌లు ముఖ్యులు. కాంగ్రెస్‌కు చెందని ఇతర సంస్థల వారిని కూడా నెహ్రూ మంత్రి వర్గంలోకి తీసుకొన్నాడు. మౌంట్ బాటెన్ ప్రభువు ఒక ఏడాది పాటు స్వతంత్ర భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. రెండో సంవత్సరం రాజగోపాలాచారి ప్రథమ భారతీయ గవర్నర్ జనరల్‌గా నియమితుడయినాడు. నూతన రాజ్యాంగము అమలులోకి వచ్చే వరకు అతడు ఆ స్థానాన్ని అలంకరించినాడు. రాష్ట్రాలలో కూడా ఆంగ్ల గవర్నర్‌లు రాజీనామా చేయగా వారి స్థానంలో భారతీయులు నియమితులయినారు. వారిలో సరోజినీదేవి, బి.సి.రాయ్, దౌలత్ రామ్‌లు ముఖ్యులు. ఆంగ్లేయులతో బాటు ఆంగ్ల సైన్యం కూడా ఇంగ్లండ్‌కు మళ్ళిపోయింది. 1950 వరకు పైన చెప్పిన విధంగా తాత్కాలిక ప్రభుత్వం పని చేస్తుంది. ఈ మధ్య కాలంలో రాజ్యాంగ పరిషత్తు సమావేశాలు జరిపి రాజ్యాంగాన్ని తయారు చేసింది.

1946 డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగం తయారుచేయడానికి సమావేశమయింది. ఈ పరిషత్తుకు అధ్యక్షుడుగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయినాడు. ఈ పరిషత్తులో మేధావులు,న్యాయ శాస్త్రవేత్తలు, ప్రముఖ రాజకీయ వేత్తలున్నారు. ఈ పరిషత్తు ఆశయాలను, ఉద్దేశాలను జవహర్‌లాల్ నెహ్రూ ఒక తీర్మాన రూపంలో డిసెంబర్ 15న నిర్వచించాడు. వాటిలోని ముఖ్యాంశలు : 1) భారతదేశము సర్వసత్తాక ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా రూపొందేటట్లు రాజ్యాంగం తయారుచేయడం 2) భారత ప్రజలకు నూతన రాజ్యాంగంలో ఆర్థిక, రాజకీయ, న్యాయ సమానత్వాలు, కనీస ప్రాథమిక హక్కులు కల్పించడం 3) వెనుకబడిన వారికి, నిమ్న జాతులకు తగిన రక్షణ ఇవ్వడం 4) దేశము ఒక్కటిగా, ఐకమత్యంతో ఉండేటట్లు చేయడం, ఇతర దేశాలు భూమి, ఆకాశ, సముద్రాలపై భారతదేశం హక్కులను గుర్తించేటట్లు చేయడం 5) భారతదేశము ప్రపంచ శాంతి కోసం పాటుపడటం. ఈ సూత్రాలను ఆధారంగా చేసుకొనే భారత రాజ్యాంగం తయారు చేయవలెనని నెహ్రూ రాజ్యాంగ పరిషత్తుకు నివేదించినాడు.

అనేక ఉప సంఘాల్లో రాజ్యాంగ లక్ష్యాలను క్షుణ్ణంగా చర్చించిన తరువాత ఒక సంఘాన్ని అంబేద్కర్ అధ్యక్షతన నియమించారు. ఈ సంఘం వారు తయారు చేసిన చిత్తుప్రతిని 1948 నవంబర్ 5న రాజ్యాంగ పరిషత్తు క్షుణ్ణంగా చర్చించి, అవసరమైన మార్పులను చేసి 1949 నవంబర్ 26న జరిగిన తుది సమావేశంలో ఆమోదించింది. రాజ్యాంగాన్ని రాజ్యంగ సభ ఆమోదించిన తరువాత డాక్టర్ రాజేంద్ర

ప్రసాద్‌ను భారత రిపబ్లిక్‌కు తొలి అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. 1950 జనవరి 26న నూతన రాజ్యాంగము అమలులోకి రావడంతో భారతదేశం సర్వ స్వతంత్ర ప్రజాస్వామిక రాజ్యంగా అవతరించింది.

భారతదేశము రిపబ్లిక్ విధానాన్ని అనుసరించి సర్వ సత్తాక ప్రజారాజ్యంగా జాతి, మత, కుల, వర్ణ వివక్షత లేక సమాన హక్కులు గల ప్రజలతో కూడిన రాజ్యంగంగా ఏర్పడింది. ఈ నూతన రాజ్యాంగంలోని అంశాలను గమనించినట్లయితే అవి ప్రజల శ్రేయస్సు కోసం ప్రజాభిప్రాయాన్ననుసరించి ప్రజల యోగక్షేమాలు పెంపొందింపజేసే పరిపాలనా విధానాన్ని రూపొందించినట్లు తెలుస్తుంది.

**5.9.4.1. ప్రధాన లక్షణాలు :** భారత రాజ్యాంగంలో కొన్ని ప్రధాన లక్షణాలు ఉన్నాయి. అవి : సర్వస్వామ్యంతో కూడిన ప్రజాస్వామిక రిపబ్లిక్, లిఖిత రాజ్యాంగము, సమాఖ్య రాజ్యాంగం, బాధ్యతాయుత ప్రభుత్వం, శ్రేయోరాజ్యము, లౌకిక రాజ్యాము

**5.9.4.1.1. ప్రజాస్వామికము :** భారత రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యంలో ప్రధాన లక్షణాలు 1) దేశాన్ని పరిపాలించే అధికారులను ప్రజలు ఎన్నుకోవడం 2) ఎన్నుకొన్న ఒక నిర్ణీత కాలానికి పూర్వమే పదవిలో నుంచి తొలగించవలెనన్నా వారి స్థానంలో వేరే వారిని ఎన్నుకోవలెనన్న ప్రజలు బల ప్రయోగం చేయకుండా శాంతియుతంగా ఎన్నికల ద్వారా సాధించడం 3) ప్రజలు వాక్స్వాతంత్ర్యం పొంది అధికారులను, వారి చర్యలను విమర్శించడానికి వీలుపడటం, ఇట్లాగే ఇతర ప్రాధమిక హక్కులను పొంది ఉండటం 4) రాజకీయాలలో ఒకే పార్టీకి కాక అనేక పార్టీలకు స్థానముండటం.

**5.9.4.1.2. లిఖిత రాజ్యాంగము :** భారత రాజ్యాంగమును 395 ప్రకరణాలు, 9 వివరణ పట్టికలతో ఏర్పడిన రాజ్యాంగ చట్టంలో నిర్వచించినారు. అట్లా నిర్వచించిన రాజ్యాంగ ప్రకరణలను ఇష్టం వచ్చినట్లు మార్చడానికి వీలుండదు. సవరణ అవసరమైతే ప్రత్యేక ప్రక్రియను రాజ్యాంగంలోనే పేర్కొన్నారు.

**5.9.4.1.3. సమాఖ్య రాజ్యము :** సమాఖ్య రాజ్యములో ప్రభుత్వ బాధ్యతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభక్తమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి కేటాయించిన విషయాలలో మాత్రం కేంద్రానికి లోబడి మిగతా విషయాలలో స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. సమాఖ్యకు నాలుగు ప్రధాన లక్షణాలుంటాయి. అవి 1) ప్రభుత్వ విధులను పేర్కొని వాటిలో దేశం మొత్తానికి సంబంధించిన విషయాలను కేంద్ర ప్రభుత్వానికి కేటాయించడం, మిగిలిన వాటిని రాష్ట్ర ప్రభుత్వాలకు చెందేటట్లు చేయడం, 2) ఈ వర్గీకరణను మూల శాసనంగా చేయడం, 3) అవసరమయినప్పుడు ఈ వర్గీకరణలో సవరణలు చేయవలసి వస్తే ఉభయ ప్రభుత్వాల అంగీకారంతోటే ఆ సవరణ చేయడం 4) రాజ్యాంగ శాసనంలోని ఏ భాగాన్నైనా ప్రభుత్వం అతిక్రమిస్తే, ఆ ప్రభుత్వాధికారాన్ని పరిమితం చేయడానికి ఉన్నత న్యాయస్థానమొకటి అధికారంలో ఉండటం.

**5.9.4.1.4. పార్లమెంటరీ విధానము :** భారత రాజ్యాంగంలోని ఇంకొక ప్రముఖ లక్షణము బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు. దీని ప్రకారం కార్య వర్గశాఖ తన కర్తవ్యాల విషయాలలో శాసనసభలకు బాధ్యత వహిస్తుంది. ఇది అమెరికాలోని పద్ధతికి భిన్నము.

**5.9.4.1.5. ప్రాథమిక హక్కులు :** ప్రజలకు కొన్ని ప్రాథమిక హక్కులుంటాయి. ప్రభుత్వము ఆ హక్కులకు భంగం వాటిల్లకుండా నడుచుకోవలె. ఈ హక్కులను ఏడు రకాలుగా విభజించవచ్చు. అవి : 1) సమానత్వపు హక్కు 2) పౌర స్వేచ్ఛా హక్కు 3) దోపిడీని నిరోధించే హక్కు 4) మత స్వాతంత్ర్యము 5) సాంస్కృతిక విద్యా విషయక హక్కు 6) ఆస్తి హక్కు 7) హక్కుల పరిరక్షణకు న్యాయస్థానంలకు ఫిర్యాదు చేయు హక్కు.

**5.9.4.1.6. శ్రేయోరాజ్యము :** ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కొన్ని పనులను చేయవలెనని నిర్దేశించింది. వాటిలో ముఖ్యమైనవి 1) పౌరులందరికీ జీవనోపాధి కలిగించడం 2) దేశంలోని భౌతిక సంపదలు, ఉత్పత్తి సాధనాలు, ధన ధాన్యాలు కొందరి వశంలో కేంద్రీకృతం కాకుండా ఉండేట్లు చేయడం 3) సంపదను సమిష్టి సౌభాగ్యానికి వినియోగపడేటట్లు ఆర్థిక వ్యవస్థను రూపొందించడం 4) పురుషులతో

బాటు స్త్రీలకు కష్టానికి తగిన వేతనం లభించేటట్లు చూడటం 5) హరిజనులకు, ఆదివాసులకు, వెనుకబడిన వారికి ప్రత్యేక సదుపాయాలు లభించేటట్లు చేయడం 6) 14 సంవత్సరాల లోపలి వయస్సు వారికి ఉచితంగాను, నిర్బంధంగాను విద్యను నేర్పడం 7) అంతర్జాతీయ రంగంలో శాంతి భద్రతలను ప్రోత్సహించడం.

**5.9.4.1.7. లౌకిక రాజ్యము :** భారత రాజ్యాంగమును లౌకిక రాజ్యంగా ఉద్దేశించినారు. దీనిననుసరించి దేశంలో ప్రభుత్వమతమనేది లేదు. అంతమాత్రం చేత రాజ్యం మతానికి విరోధికాదు. అన్ని మతాలు సమానహోదాలో విలసిల్లడానికి అవకాశమున్నది. అన్నిటికి సమానాదరణ ఉంది.

ఈ విధంగా భారత రాజ్యాంగం అనేక కట్టుదిట్టాలతో ప్రజాక్షేమం కోసం, దేశ సౌభాగ్యం కోసం, ప్రజల చేత, ప్రజల ద్వారా, ప్రజల కొరకు సంక్రమింపజేసిన రాజ్యాంగం అని చెప్పవచ్చు.

## 5.9.5. నమూనా ప్రశ్నలు :

1. స్వదేశీ సంస్థానాల విలీకరణను గురించి వివరింపుము
2. భారత రాజ్యాంగ ప్రధాన లక్షణాలను వివరించండి
3. కాందిశీకుల సమస్య

## 5.9.6. చదువదగిన గ్రంథాలు :


1. V.P. Menon : Transfer of Power in India
2. V.P. Menon : Story of Integration of Indian States
3. R.C. Majumdar, H.C. Raychoudary and K.K. Datta : An Advanced History of India
4. K.M. Panikkar : Survey of Indian History
5. Sumit Sarkar : Modern India
6. Percival Spear : A History of India
7. Tarachand : History of Freedom Movement in India
8. A. Vaidehi : Freedom Movement in India
9. S.C. Raychoudary : History of Modern India
10. Jawaharlal Nehru : The Discovery of India
11. H.M. Dodwell : Cambridge History of India
12. A.B. Keith : Constitutional History of India


**డా॥ వి.కె. మోహన్**